Paraloka Prasthanam (Hereafter Journey -Telugu)

# పరలోక ప్రస్థానం

సంకలనం
అబుల్ ఇర్ఫాన్

ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, సహారా కాంప్లెక్స్,
ఫ్లాట్ నెం.106, పత్తర్‌గట్టి, హైదరాబాద్-2
ఫోన్ : 040-66710795, 91 9441515414

వెల..............................................................రూ. 120/-లు



Name of the Title: Paraloka Prasthanam
Telugu
(Journey of the Hear after life)

Compilation : ABUL IRFAN
Hyderabad-2

Editing & Proof reading: Moulana Abdul Mateen Omri
Hyderabad

All rights reserved with: Islamic Resource Centre

First Edition: Novamber, 2004

Second Edition: September, 2007

Third Edition October, 2011

Copies: 1000

Published by: Islamic Resource Centre
Sahara Complex-106, Pathargatti,
Hyderabad-2, Ph: 9441515414

Type set by: Alifain, I.R.C. Graphics
Sahara Complex-106, Pathargatti,
Hyderabad-2, Ph: 9441515414

Printed at : H.S. Offset Printers
714, Chandni Mahal, Daryaganj
New Delhi-2, Ph: 23244240

Price: Rs. 120/-




====( **See Pages : 106-108** )====

# విషయసూచిక


| నెం. | విషయం | పేజి |
|---|---|---|
| 1. | చచ్చి బతికినవారు | 16 |
| | ✦ పాపాత్ముల పర్యవసానం | 16 |
| | ✦ పుణ్యాత్ముల పర్యవసానం | 18 |
| | ✦ ప్రాచీనకాలం సంఘటనలు | 18 |
| 2. | ఆత్మ అంటే ఏమిటీ? | 19 |
| | ✦ నిద్రావస్థలో ఆత్మ | 20 |
| | ✦ దేహమే జైలు | 20 |
| 3. | అంతరంగం | 21 |
| | ✦ దుష్ట మనస్సు | 22 |
| | ✦ అంతరాత్మ | 22 |
| | ✦ సంతృప్త హృదయం | 23 |
| 4. | మనశ్శాంతి | 23 |
| 5. | వ్యాధి, పరామర్శ | 25 |
| | ✦ పాపపరిహారి | 25 |
| | ✦ గుణపాఠి | 26 |
| | ✦ వ్యాధిగ్రస్త స్థితిలో కర్మలనమోదు | 26 |
| | ✦ పరామర్శకీ ప్రయోజనమే | 27 |
| 6. | మరణం | 28 |
| | ✦ నిద్రావస్థలో ఆత్మసంచారం | 28 |
| | ✦ కలలా కరిగిపోయే ఐహికజీవితం | 29 |
| | ✦ మరణ దూతలు | 30 |
| | ✦ మరణావస్థలో అవిశ్వాసులు | 30 |
| | ✦ మరణానికి ముందే పశ్చాత్తాపం | 31 |
| | ✦ మరణావస్థలో విశ్వాసులు | 32 |
| | ✦ మృత్యు స్మరణ | 32 |
| | ✦ చనిపోయే విశ్వాసికి శుభవార్త | 33 |
| | ✦ మలకుల్‌మౌత్ నిజరూపం | 33 |





| | | |
|---|---|---|
| 7. | మరణం ఎవరికి మంచిది? | 34 |
| | ✦ సమాధి పలుకులు | 34 |
| | ✦ ఆత్మహత్య మహాపాతకం | 35 |
| | ✦ చావంటే భయమెందుకు? | 36 |
| | ✦ బాటసారిలా జీవించాలి | 37 |
| | ✦ చనిపోయేవారికి హితబోధ | 38 |
| | ✦ భూమ్యాకాశాల పరితాపం | 38 |
| 8. | పెడబొబ్బలు నిషిద్ధం | 39 |
| | ✦ సహనం-స్థయిర్యం | 39 |
| | ✦ శవయాత్ర | 41 |
| | ✦ సౌఖ్యం- పొందేవాడు, ఇచ్చేవాడు | 41 |
| | ✦ శవాన్ని గౌరవించాలి | 42 |
| 9. | పిత్రులోకంలో ప్రారంభ స్థితి | 42 |
| | ✦ చేతులు కాలాక ఆకులు... | 42 |
| | ✦ మున్కిర్, నకీర్ (పరీక్షదూతలు) | 43 |
| | ✦ సమాధి పరీక్ష | 44 |
| | ✦ సమాధిలో విశ్వాసి పరిస్థితి | 45 |
| | ✦ సమాధిలో అవిశ్వాసి పరిస్థితి | 47 |
| | ✦ హిందూమత విశ్వాసాలు | 48 |
| 10. | సమాధిలో ఖుర్ఆన్ పాత్ర | 49 |
| 11. | పిత్రులోకంలో పాపపుణ్యాల పర్యవసానం | 50 |
| | ✦ ప్రవేశ పరీక్ష | 49 |
| | ✦ విషసర్పాలు, ఇనుపగదలు | 49 |
| | ✦ సమాధిపై చెట్టురెమ్మలు | 52 |
| | ✦ ముల్క్, సజ్దా సూరాల ప్రతిఘటన | 53 |
| | ✦ నమాజ్, జకాత్, రోజాల ప్రతిఘటన | 53 |
| | ✦ హతసాక్షి (షహీద్) పరిస్థితి | 54 |
| 12. | స్వప్నంలో బర్జఖ్ యాతనలు | 54 |
| 13. | మేరాజ్ సందర్భంలో బర్జఖ్ విశేషాలు | 56 |
| | ✦ నవ్వు, ఏడ్పుల మనిషి | 56 |

✦ విభిన్న పాపాత్ములు 57
14. చరిత్రలో బర్జఖ్ సంఘటనలు 58
✦ వడ్డీ వ్యాపారి పర్యవసానం 58
✦ అక్రమార్జన ఫలితం 59
✦ సమాధి దొంగ 59
✦ హత్య పైకంతో హజ్‌యాత్ర 60
✦ కల్తీ వ్యాపారం 60
✦ ఓ పాపాత్మురాలి పర్యవసానం 61
✦ ఖుర్‌ఆన్ పాఠకుడు 62
✦ అదృశ్యమైన శవం 62
✦ అమరగతుడయిన పల్లెవాసి 62
✦ ఆరుగురు యుద్ధఖైదీలు 63
✦ వెయ్యేండ్లు జీవించిన చక్రవర్తి 63
15. అప్పు తెచ్చే ముప్పు ఇంతింత కాదయా 64
✦ అప్పు అబద్ధానికి ఆప్తబంధువు 64
✦ త్రిశంకుస్వర్గంలో రుణగ్రస్తుడు 65
16. ప్రపంచజీవితం, దాని పరమార్థం 66
✦ అతివాదాలు 66
✦ మానవుని నిజస్థానం 67
17. ప్రపంచం క్షణభంగురం 68
✦ ఇహలోకం విలువ దోమ రెక్కంతే 68
✦ మూడు సెకండ్ల ముచ్చట 69
18. పరీక్షా స్థలం 70
✦ కృతజ్ఞుడే కృతార్థుడు 71
✦ ముగ్గురు వ్యక్తుల పరీక్ష 71
✦ స్వేచ్ఛ అంటే ఇష్టారాజ్యం కాదు 73
19. వినాశం దిశగా విశ్వం 74
✦ స్వార్థపరులకు సత్యం పచ్చి వెలక్కాయే 74
✦ సాధ్యంకాని ఐహిక శిక్షలు 74
✦ పుట్టుట గిట్టుట కొరకే 75





✦ మానవ పుట్టుక 76
✦ ఆదిమానవుడు ఎలా ఉండేవాడు? 76
✦ విషయవాయువులు, విద్వేషాలు 77
20. ప్రళయ సూచనలు 78
✦ కుమార్తెలకు తల్లుల చాకిరి 78
✦ అంతర్యుద్ధాలు 79
✦ అలంకారప్రాయమైన మసీదులు 79
✦ వందేళ్ళకో సంస్కర్త 80
✦ ప్రాపంచిక వ్యామోహం 80
✦ ధనమున్న ధార్మిక పేదలు 81
✦ ధనార్జనే ధ్యేయం 81
✦ దైవధర్మంలో స్థిరంగా ఉండేవారు 81
✦ యూదుల అడుగుజాడల్లో 82
✦ ధనాధ్యికత 82
✦ కాబా విధ్వంసం 82
✦ ఇస్లాం చిక్కిపోతుంది. 83
✦ స్త్రీజనాభా పెరుగుతుంది 83
✦ బంగారుకొండ బయల్పడుతుంది 84
21. మహ్‌ది (అలైహి) 84
✦ ఎడతెరిపిలేని యుద్ధాలు 85
✦ కాన్‌స్టాంటినోపిల్‌పై విజయపతాకం 86
22. ఒంటికన్ను దజ్జాల్ 87
✦ మహిమలతో మారణహోమం 88
✦ వీర విశ్వాసి 89
23. ఈసా (అలైహి) పునరాగమనం 90
24. యాజూజ్, మాజూజ్‌ల దాడులు 91
25. పతనపుటంచుల్లో ప్రపంచం 94
✦ నలభై రోజులదాకా పొగ 94
✦ పడమర నుంచి సూర్యోదయం 94
✦ క్షమాద్వారం మూయబడుతుంది 95

✦ మాట్లాడే జంతువు 96
26. ప్రపంచం అంత్యదశ 97
27. ముంచుకొస్తున్న ప్రళయం 98
✦ శుక్రవారమే గడువు 99
✦ మొదటిసారి శంఖారావం 99
✦ రెండవసారి శంఖారావం 101
28. పునరుత్థానం 102
✦ మూడవసారి శంఖారావం 103
✦ నగ్న శరీరాలతో లేస్తారు 103
✦ నిలువుగుడ్లతో నేరస్థులు 104
✦ మూడు వర్గాలు 105
✦ చెమటలతో ఉక్కిరిబిక్కిరి 106
✦ ప్రళయదినం- సుదీర్ఘకాలం 107
29. అవిశ్వాసుల పశ్చాత్తాపం 107
✦ మాడిన ముఖాలు 107
✦ ప్రతి మనిషికీ పశ్చాత్తాపమే 109
30. దైవ న్యాయస్థానం 109
31. మానవుల విభిన్న పరిస్థితులు 111
✦ యాచకులు 111
✦ ఒక భార్యకు అన్యాయం చేసినవాడు 111
✦ ఖుర్ఆన్ సూక్తులు మరచినవాడు 111
✦ నమాజ్ చేయనివాడు 111
✦ ప్రమాణభంగం చేసినవాడు 112
✦ నాయకులు, పాలకులు 112
✦ జకాత్ చెల్లించనివాడు 112
✦ తీవ్రమైన ఆకలితో ఉండేవాడు 113
✦ రెండునాల్కల ధోరణి 113
✦ కట్టుకలలు చెప్పేవాడు 113
✦ డాబుసరి దుస్తులు 113
✦ భూకబ్జాదారుడు 113





✦ ధర్మజ్ఞానం దాచేవాడు 113
✦ కోపాన్ని దిగమింగేవాడు 113
✦ అమరవీరుడు 114
✦ పరిపూర్ణ జ్యోతి 114
✦ అజాన్ చెప్పేవారు 114
✦ దైవం కోసం ప్రేమించుకునేవారు 114
✦ దైవసింహాసనం నీడన ఉండేవారు 114
✦ జ్యోతిర్మయ కిరీటాలు ధరించేవారు 115
✦ ధర్మ సంపాదనాపరుడు 115
32. న్యాయవిచారణ 115
33. ధర్మకాటా, కర్మలతూకం 118
✦ ఒక దాసుని కర్మల బరువు 119
✦ అన్నిటికంటే బరువువైన కర్మలు 120
✦ సదాచరణతో పాటు దైవానుగ్రహం 121
34. ముస్లిమేతరుల విచారణ 121
✦ బహుదైవారాధకులు 123
✦ ప్రవక్త తండ్రి పర్యవసానం 124
✦ గ్రంథప్రజల పరిస్థితి 124
35. సాధారణ సిఫారసు 125
✦ హజ్రత్ ఆదం (అలై) పొరపాటు 126
✦ హజ్రత్ నూహ్ (అలై) పొరపాటు 126
✦ ఇబ్రాహీం (అలై) పొరపాటు 126
✦ హజ్రత్ మూసా (అలై) పొరపాటు 127
✦ హజ్రత్ ఈసా (అలై) పొరపాటు 127
✦ స్తుతి స్థానం 128
36. కౌసర్ సరోవరం 128
✦ సరోవరం విశిష్ఠతలు 129
✦ ఉజూ ప్రభావం 129
✦ నీటి నుండి నిరోధించబడేవారు 130
37. సాక్ష్యం 130

✦ శరీరావయవాల సాక్ష్యం 131
✦ పుడమి సాక్ష్యం 132
✦ మిథ్యాదైవాల సాక్ష్యం 132
✦ ఈసా ప్రవక్త (అలైహి) సాక్ష్యం 133
✦ ముహమ్మద్ అనుచరుల సాక్ష్యం 133
38. చిత్తశుద్ధిలేని సత్కర్మలు వ్యర్థం 134
✦ మొట్టమొదటి తీర్పు 135
39. ముస్లింల విచారణ 136
✦ విశ్వాసిపై దేవుని విశేషానుగ్రహం 137
✦ నమాజు గురించిన విచారణ 138
✦ అసంఖ్యాకంగా స్వర్గానికి పోయేవారు 138
✦ అన్యాయం చేసినవారి పర్యవసానం 138
✦ అందరికన్నా నిష్ట దరిద్రుడు 139
✦ పేదలు, ధనికులు 139
40. మానవేతరుల విచారణ 140
✦ జిన్నుల (భూతాల) విచారణ 140
✦ పశు పక్షాదుల విచారణ 140
41. కర్మల పర్యవసానం 141
42. అధికులు అధములవుతారు 145
43. ఐహికభాగ్యాలను గురించి విచారణ 146
44. సిఫారసు, పాపపరిహారం 149
45. విశ్వాసులు- సిఫారసు 152
✦ ముస్లింలకు ప్రవక్త (స) సిఫారసు 153
✦ ఒక హెచ్చరిక 154
✦ విశ్వాసులకు విశ్వాసుల సిఫారసు 154
✦ సమరయోధుడి సిఫారసు 154
✦ తల్లిదండ్రుల్ని గురించి చిన్నపిల్లల సిఫారసు 155
✦ హాఫిజ్ ఖుర్ఆన్ సిఫారసు 155
✦ ఖుర్ఆన్, ఉపవాసాల సిఫారసు 155
46. నరకం మీదుగానే స్వర్గానికి దారి 156





✦ జ్యోతి పంపిణీ 157
✦ కారుచీకటిలో కపటవిశ్వాసులు 158
47. దైవజ్యోతి- దివ్యదర్శనం 159
✦ యూదులు, క్రైస్తవుల పరిస్థితి 159
✦ ముస్లింల పరిస్థితి 160
✦ నరకంలో పడిపోయే ముస్లింలు 161
✦ శిక్షకు ముందే గగ్గోలు పెట్టేవారు 163
48. షైతాన్, వాడి అనుచరగణం 164
✦ గర్విష్ఠి నాయకులు, అంధానుచరులు 165
49. మరణానికి మరణం 167
50. నరక కూపం 168
✦ స్వర్గనరకాల వాదనలు 169
✦ నరకం లోతు 169
✦ నరకాగ్ని, కటికచీకటి 169
✦ నరకాగ్ని తీవ్రత 170
✦ నరక శ్వాస 171
✦ నరకాగ్ని సమిధలు 171
✦ నరక ద్వారాలు 172
✦ విభిన్నవర్గాలకు విభిన్న అంతస్తులు 172
✦ రాకాసి మెడ (మాట్లాడే క్రేన్) 172
✦ నరకంలో పాములు, తేళ్ళు 173
✦ నరకపాలకుల సంభాషణ 173
✦ నరకం మాట్లాడుతుంది 173
✦ పాపాత్ముల పశ్చాత్తాపం 174
✦ నరకపాలకుల వివరాలు 174
51. నరక యాతనలు 175
✦ దహన యాతనలు 175
✦ సంకెళ్ళు, గదలు, గుదిబండలు 176
✦ తీవ్రమైన ఆకలిదప్పులు 177
✦ ఆహారపానీయాలు 178

✦ భాగవతంలో నరకశిక్షలు 179
52. నరకవాసుల రూపురేఖలు 179
✦ రక్తకన్నీరు 180
✦ నరకవాసుల శరీరాలు 180
53. నరకశిక్షకు కారణాలు 180
✦ సత్యనిరాకరణ 181
✦ ధనవ్యామోహం, అక్రమాలు 181
✦ నమాజు చేయకపోవడం 182
✦ ధర్మజ్ఞానం దాచడం 182
✦ మద్యం, మత్తుపదార్థాల సేవనం 182
✦ సదాచరణలేని ఉపన్యాసకులు 183
✦ వెండి బంగారు పాత్రల వాడకం 183
✦ చిత్రలేఖనం 183
✦ ఆత్మహత్య 184
✦ అహంకారం 184
✦ పేరుప్రతిష్ఠల కోసం ప్రాకులాట 184
54. 99.9 శాతం నరకానికి పోయేవారే 185
✦ నరకంలో ఎక్కువమంది ధనికులు, స్త్రీలే 186
✦ రెంటికి చెడ్డ రేవడు 187
55. ఆరాఫ్‌వాసులకు అటూ ఇటూ 187
✦ స్వర్గ నరకవాసుల మధ్య సంభాషణ 188
56. స్వర్గ సీమ 189
✦ స్వర్గం విలువ 189
✦ స్వర్గ నిర్మాణం 190
✦ విస్తీర్ణం 190
✦ అంతస్తులు 190
✦ ఆకాశహర్మ్యాలు 191
✦ స్వర్గవాసుల కుటీరాలు 192
✦ స్వర్గ ద్వారాలు 192
✦ వాతావరణం 193





✦ ఆనంద నిలయం 193
57. స్వర్గ ప్రవేశం 194
✦ హృదయ పరిశుద్ధత 194
✦ ప్రతీకారం 195
✦ స్వాగతోత్సవం 195
✦ కృతజ్ఞతలు 196
✦ అందరికన్నా మనమే ఫస్ట్ 196
58. మూడు వర్గాల్లో రెండిటికే స్వర్గం 197
✦ లెఫ్టిస్టులు 197
✦ రైటిస్టులు 198
59. అధమశ్రేణి స్వర్గనివాసి 199
✦ స్వర్గనరకాల తీవ్రతాపరీక్ష 199
✦ ప్రతి పాపానికీ ఒక పుణ్యం 200
✦ స్వర్గానికి సాహసయాత్ర 200
✦ సృష్టికర్త నవ్వు 202
✦ అధమశ్రేణి సామ్రాజ్యం 203
60. స్వర్గవాసుల రూపురేఖలు 203
✦ ఎత్తు (పొడవు) 205
✦ గడ్డం, మీసాలులేని ముఖమే అందం 205
✦ స్వర్గవాసుల ఆరోగ్యం, వయస్సు 205
61. స్వర్గ వనాలు 206
62. ఆహారపదార్థాలు 208
✦ విచిత్రాహారం 208
✦ స్వర్గ ఫలాలు 209
✦ మాంసాహారం 211
✦ స్వర్గంలో సేద్యం 212
63. స్వర్గంలో సెలయేరులు 212
✦ గురుశిష్యుల సంభాషణ 213
✦ పానీయాలు 214
64. అలంకరణలు 214

✦ ఆభరణాలు 214

✦ వస్త్రాలు 215

✦ బాలసేవకులు 215

65. స్వర్గ మహిళలు 217

✦ స్వర్గ పత్నులు 217

✦ స్వర్గకన్యల సౌందర్యం 218

✦ స్వర్గకన్యల ప్రార్థన, పాటలు 219

✦ భూలోకస్త్రీలకు, స్వర్గకన్యలకు తేడా 220

66. బహుభార్యత్వం 220

✦ నేటి నినాదాలు 221

✦ పురుషుని లైంగికశక్తి 221

✦ శిశుజన్మలు ఉండవు 222

67. దైవదర్శనం 222

✦ ద్విగుణీకృత సౌందర్యం 223

✦ సూపర్ మార్కెట్ 224

✦ అన్నిటికంటే పెద్ద భాగ్యం 224

✦ దైవప్రసన్నత 226

68. ఇహలోకంలో దైవదర్శనం సాధ్యమా? 227

69. ఇష్టాగోష్ఠులు 230

✦ స్వర్గవాసుల మాటలు 230

✦ స్వర్గ నరకవాసుల సంభాషణ 231

69. బైబిల్ బోధ 231

70. వేద ఘోష 232

✦ స్వర్గం అంటే 232

✦ స్వర్గ దృశ్యాలు 234

✦ స్వర్గానికి అర్హులు 236

✦ నరకం 237

✦ నరకానికి అర్హులు 239




# ముందు మాట

ప్రపంచంలో ప్రతి మనిషీ తాను చేసే పనులకు ఎవరో ఒకరి ముందు బాధ్యుడవుతాడు. ఎవరి ముందూ బాధ్యుడుకాకుండా ఏమనిషి కూడా తన జీవనరథాన్ని సవ్యంగా, సాఫీగా నడపలేడు. ప్రభుత్వయంత్రాంగంలో ప్రతి ఉద్యోగి తన పైఅధికారికి బాధ్యుడవుతాడు. అందరికంటే పైఅధికారి సంబంధిత మంత్రికి బాధ్యుడవుతాడు. ఆ మంత్రి ముఖ్య మంత్రికి లేక ప్రధానమంత్రికి బాధ్యుడవుతాడు. ఆ మంత్రులు ప్రజలకు బాధ్యులవుతారు. ప్రజలు కూడా తమ సంబంధిత వ్యక్తులకు బాధ్యులవుతారు.

అదేవిధంగా మరణానంతరం పరలోకంలో కూడా మానవుడు తన కర్మలకు దేవుని ముందు బాధ్యుడవుతాడు. పరలోక బాధ్యతాభావంలేని మనిషి ఇహలోక బాధ్యతలు సరిగా నిర్వర్తించలేడు. ముఖ్యంగా అర్థబలం, అధికారబలం కలవాడికి పరలోక బాధ్యతాభావం లేకపోతే తన అర్థాన్ని, అధికారాన్ని దుర్వినియోగపరుస్తూ అన్యాయం, అక్రమాలకు పాల్పడే ప్రమాదం ఉంటుంది. అందుకే మానవుల సృష్టికర్త, యజమాని, ప్రభువు అయిన దేవుడు తనను, సన్మార్గం చూపడానికి వచ్చిన తన ప్రవక్తలను విశ్వసించి మంచి పనులు చేస్తే మరణానంతరం పరలోకం జీవితంలో బహుమానంగా స్వర్గసౌఖ్యాలు ప్రసాదిస్తానని, చెడ్డ పనులు చేస్తే శిక్షగా నరకయాతనలకు గురిచేస్తానని తన అంతిమగ్రంథం ఖుర్‌ఆన్‌లో అనేక చోట్ల పేర్కొన్నాడు.

బాధ్యతను గురించి వివరిస్తూ అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా ప్రవచించారు: “మీలో ప్రతివ్యక్తీ బాధ్యతాయుతుడయిన సంరక్షకుడే. కనుక మీలో ప్రతి వ్యక్తీ అతని సంరక్షణలో ఉండేవారిని గురించి (పరలోక న్యాయస్థానంలో) ప్రశ్నించబడతాడు. పాలకుడు పాలితప్రజల సంరక్షకుడు. అతను తన ప్రజల విషయంలో బాధ్యు డవుతాడు. పురుషుడు తన భార్యాపిల్లలకు సంరక్షకుడు. అతను వారి విషయంలో బాధ్యుడవుతాడు. స్త్రీ తన భర్త ఇంటికి, అతని పిల్లలకు సంరక్షకురాలు. ఆమె వారి విషయంలో బాధ్యురాలవుతుంది”. (బుఖారి)

మనిషిలో ఈ బాధ్యతాభావం కల్గించి అతను స్వచ్ఛమైన దైవభీతి పరాయణుడిగా, నిజమైన జనశ్రేయోభిలాషిగా, నీతిమంతుడిగా, సత్ప్రవర్తనుడిగా తనను తాను తీర్చిదిద్దుకోవడానికి వీలుగా తెలుగు ప్రజల కోసం ఈ పుస్తకాన్ని వెలువరిస్తున్నాం. ఇందులో మరణావస్థ నుండి పరలోకంలోని మానవుని అంతిమ గమ్యమయిన స్వర్గం లేక నరకం వరకు అనేక విషయాలు వీలైనంతవరకు వివరంగా పేర్కొనబడ్డాయి. చివర్లో క్రైస్తవ, హిందూ మతగ్రంథాల నుండి కూడా పరలోకానికి సంబంధించిన కొన్ని విషయాలు పొందుపరిచాము. అందువల్ల ముస్లింలు, ముస్లిమేతరులు అన్న తేడా లేకుండా సత్య పిపాసకుడయిన ప్రతిమనిషీ మొదటిసారిగా తెలుగులో వెలువడిన ఈ పుస్తకాన్ని చదవడానికి ఆసక్తి చూపుతాడని ఆశిస్తున్నాం.

భవదీయుడు

**అబుల్ ఇర్ఫాన్**

*కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం*

# పరలోక ప్రస్థానం

నగరంలో అదొక పెద్ద హాస్పిటల్. డాక్టర్లు, నర్సులు, పేషంటులు, విజిటర్లతో ఎంతో సందడిగాఉంది. కాస్సేపటికి మెయిన్ గేటు దగ్గర ఒక అంబులెన్స్ వచ్చి ఆగింది. తక్షణమే అంబులెన్స్ నుండి ఒక స్త్రీ రోగిని దించి స్రెచర్ మీద పండ బెట్టారు. ఆ వెనువెంటనే వార్డు బాయ్‌లు ఆ స్రెచర్‌ని హడావిడిగా తోసుకుంటూ ఆపరేషన్ థియేటర్ దగ్గరకు తీసికెళ్ళారు. పరిస్థితి గమనించగానే ఇద్దరు డాక్టర్లు వచ్చి స్రెచర్‌ని లోపలికి తీసికెళ్ళారు. వారు స్రెచర్ మీద నుండి పేషంట్‌ని ఎత్తి బెడ్ మీద పడుకోబెట్టారు. మరో నల్గురు డాక్టర్లు, ఇద్దరు నర్సులు కూడా వచ్చారు. బెడ్ మీద పేషంట్ జీవచ్ఛవంలా పడివుంది. చుట్టూ డాక్టర్లు మూగి ఉన్నారు.

ఆపరేషన్ థియేటర్‌లో నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. కత్తులు, కత్తెరలు పనిచేసే శబ్దం మాత్రమే వినవస్తోంది. దాదాపు గంట తరువాత ఆపరేషన్ పూర్తయింది. ఆ తరువాత కాస్సేపటికి పేషంట్‌లో చలనం కలిగింది. మెల్లగా కళ్ళు తెరిచింది.

"ఆపరేషన్ సమయంలో మీ అనుభవం ఏమిటి?" అడిగాడు ఒక డాక్టర్.

"మీరు ఆపరేషన్ చేసిన తీరంతా నేను నా కళ్ళారా చూశాను" చెప్పింది పేషంట్.

"ఎక్కడుండి చూశారు?" అడిగాడు మరో డాక్టర్.

"నేను నా దేహం నుండి బయటికి వచ్చి సీలింగ్ (కప్పు)కు అతుక్కు పోయాను. అక్కడ్నుంచి నేను మీరు చేసిందంతా చూశాను. మీరు ఆపరేషన్ పూర్తి చేయగానే నేను తిరిగి నా శరీరంలోకి వచ్చేశాను" అన్నది పేషంట్.

ఇదొక విచిత్రానుభూతి. చాలా అరుదైన సంఘటన. యూరప్ దేశాల్లో డాక్టర్లు, శాస్త్రవేత్తలు మరణానంతర పరిస్థితి గురించి చేస్తున్న పరిశోధనలలో ఇదొక విశేష పరిశోధన. కాని మతగ్రంథాల్లో తెలిపిన విషయాలు తప్ప ఇతర సాధనాల ద్వారా మరణానంతర జీవితం గురించి ఈనాటికీ మానవునికి తెలియదు.

**సత్యాన్వేషకులకు ఓ సదవకాశం**

ఇస్లాం సృష్టికర్త తన ప్రవక్తల ద్వారా పంపిన సంపూర్ణ సంవిధానం. కాని ఈనాడు ఇస్లాం అనుచరులైన ముస్లింలు దీన్ని పూర్తిగా ఆచరించకపోవడంవల్ల, మరోవైపు జాత్యహంకారులైన మతదురభిమానులు వ్యాపింపజేసిన అపోహల వల్ల సత్యాన్వేషకులకు ఇస్లాంను అర్థంచేసుకోవడం చాలా కష్టమైపోయింది. అనువాదాల భాషాశైలి కూడా ప్రజలకు ఆసక్తి కల్గించలేకపోతోంది. ఇప్పుడు తెలుగువారి కోసం తేటతెలుగులో ఇస్లాం గురించి సరైన సమగ్రసమాచారం అందజేయడానికి "ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్" నడుం కట్టింది. మీ అభిప్రాయాలు ఫోన్ 9441515414 ద్వారా తెలియజేయగలరు.



## చచ్చి బతికినవారు-1

అయితే ఎప్పుడో ఒకప్పుడు చాలాఅరుదుగా జరిగే సంఘటనల ద్వారా మానవుడు మరణించిన తర్వాత అతని ఆత్మ అంతటితో నాశనం కాదని, కొత్తగా మరో ప్రపంచంలో అడుగు పెడతాడని మాత్రం తెలుస్తోంది. ఉదాహరణకు సుమారు అరవై ఏళ్ళ క్రితం జరిగిన ఒక సంఘటన నా స్నేహితుడొకతను ఇలా తెలియజేశాడు:

"హైదరాబాద్‌లో ఒకతను చనిపోయాడు. అందరూ చనిపోయాడనే భావించారు. మృతుని ఇల్లు విషాద నిలయమయి పోయింది. శవానికి స్నానం చేయించి, కఫన్ వస్త్రాలు తొడిగించారు. జనం జనాజా నమాజ్ కూడా చేశారు. ఆ తరువాత శ్మశానానికి తీసికెళ్ళి సమాధి చేయడానికి సిద్ధమయ్యారు. సమాధిలో మన్ను పోయడానికి ముందు అంతిమ దర్శనం కోసం ఒక కట్టు వూడదీసి శవం ముఖం మీది వస్త్రం తొలిగించారు. అందరూ సమాధిలోకి తొంగి చూస్తూ అంతిమ దర్శనం చేసుకోసాగారు.

అంతలో హఠాత్తుగా శవంలో చలనం కలిగింది. ఆ వెనువెంటనే కళ్ళు తెరచి "నేను చనిపోలేదు, బ్రతికేఉన్నాను, బయటికి తీయండి" అంటూ మాట్లాడటం మొదలెట్టాడు. అనుకోని ఈ సంఘటనకు జనం క్షణంపాటు బిత్తరపోయారు. కొందరు భయపడ్డారు కూడా. ఆతర్వాత ఇద్దరు వ్యక్తులు సమాధిలోకి దిగి కట్లు ఊడదీశారు. అప్పుడా మనిషి బ్రతుకుజీవుడా అంటూ నిటారుగా లేచి నిలబడ్డాడు. నిలబడటం ఏమిటి, ఇద్దరు వ్యక్తుల సహాయంతో బయటికి కూడా వచ్చి జనంలో కలసిపోయాడు.

ఈవార్త ఆ పేటలో కార్చిచ్చులా ప్రాకింది. జనం తండోపతండలుగా వచ్చి అతడ్ని వింతగా చూడసాగారు. కొందరు "ఇంతకూ నీవు చనిపోయిన తరువాత నీ పరిస్థితి ఎలా ఉండింది. నీ ఆత్మ ఎక్కడికి పోయింది?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఆ వింత మనిషి "నాఆత్మ శరీరం నుండి బయటికి రాగానే...." అంటూ ఆగిపోయాడు. ఆ తరువాత చెప్పలేక పోయాడు. ఆ విషయాలు వదలి ఇహలోక విషయాలు మాత్రం చక్కగా మాట్లాడాడు. కాని చనిపోయాక తన అనుభవం ఏమిటో చెప్పడానికి ప్రయత్నించగానే అతని నోట మాటే పెగల్లేదు. ఈ విధంగా ఎన్ని రోజులు ప్రయత్నించినా ఆ విషయాలు చెప్పలేక పోయేవాడు.

**పాపాత్ముల పర్యవసానం :** మరణించేవారి పలుకుల్లో బ్రతికున్నవారికి ఎంతైనా గుణపాఠం ఉంటుంది. మా ఊళ్ళో ఒకతను ఉండేవాడు. శుక్రవారం కూడా నమాజుకు వెళ్లేవాడు కాదు. పైగా అతనిలో కొన్ని దుర్వ్యసనాలు కూడా ఉండేవి. అతను చనిపోయే సమయంలో హఠాత్తుగా "అమ్మబాబోయ్! ఎవరో గండ్రగొడ్డళ్ళు తీసుకొస్తున్నారు" అంటూ గావుకేక పెట్టాడు. ఆ గావుకేక విని అతని చుట్టూ కూర్చున్న అతని బంధువులు హడలి పోయారు. ఆ తరువాత కొన్ని సెకండ్లలోనే అతను ఊపిరి విడిచాడు.

పాతికేళ్ళ క్రితం అనంతపూర్‌లో నా స్నేహితుడొకతను ఓ విచిత్ర సంఘటన గురించి తెలియజేశాడు. అతని కథనం ప్రకారం ఒకతను వ్యాపార నిమిత్తం తరచుగా

పట్నం వస్తుండేవాడు. వచ్చిన పని పూర్తయ్యేవరకు రాత్రివేళల్లో ఒక మసీదులో పడుకునేవాడు. యథాప్రకారం ఓసారి పట్నం వచ్చి రాత్రివేళ ఒక మసీదులో ఇషా నమాజు తరువాత పడుకొని నిద్రపోయాడు. ఇషా నమాజు తరువాత జనమంతా వెళ్ళిపోయారు. అయితే మౌజ్జన్ మాత్రం చాలా సేపటిదాకా వెళ్ళలేదు. వ్యాపారి గురక పెట్టి నిద్ర పోతున్నాడు. మౌజ్జన్ మెల్లిగా లేచి ఒక దుప్పటి తీసుకొని అకస్మాత్తుగా ఆ వ్యాపారి ముఖమ్మీద వేశాడు. వెంటనే అతనికి ఊపిరాడకుండా గట్టిగా అదిమిపట్టాడు. వ్యాపారి పెనుగులాడుతూ కాస్సేపటికి చలనరహితంగా ఉండిపోయాడు. అప్పుడు మౌజ్జన్ అతని జేబులోని డబ్బు తీసుకొని మెల్లిగా మసీదు నుంచి జారుకున్నాడు.

మరునాడు తెల్లవారుజామున జనం ఫజర్ నమాజు చేయడానికి వచ్చారు. మౌజ్జన్ కూడా వచ్చాడు. అందరూ నమాజు చేశారు. కాని ఆ వ్యాపారి ఇంకా పడుకునే ఉన్నాడేమిటీ అనుకుంటూ కొందరు వచ్చి అతడ్ని లేపడానికి ప్రయత్నించారు. అప్పుడు తెలిసింది అందరికీ అతను చనిపోయాడని. తృటిలో జనమంతా శవం చుట్టూ మూగారు. "అయ్యో పాపం!" అనుకున్నారు కొందరు. "ఇక చూస్తారెందుకు, వెంటనే కఫన్, దఫన్ ఏర్పాట్లు చేయండి" అన్నారు మరికొందరు.

కాస్సేపటికి శవానికి స్నానం చేయించడానికి సిద్ధమయ్యారు ప్రజలు. దాని కోసం ఇద్దరు మనుషులు శవాన్ని ఎత్తడానికి ప్రయత్నిస్తే అది చాలా బరువుగా ఉన్నట్లు అన్పించింది. ఎదురుగా మౌజ్జన్ నిలబడి తమాషా చూస్తున్నాడు. "మౌజ్జన్‌గారూ! అలా చూస్తారేమిటీ? ఓ చెయ్యి వేయండి" అన్నాడు ఒకతను. మౌజ్జన్ ఇష్టంలేకపోయినా వచ్చి శవం నడుం కింద చెయ్యిపెట్టి ఎత్తాడు. శవం తేలిగ్గా పైకి లేచింది. అలా ముగ్గురూ కలసి శవాన్ని ఓ బల్లమీదకు చేర్చారు. శవానికి స్నానం చేయించడం జరిగింది. తరువాత వస్త్రసంస్కారం కోసం శవాన్ని ఎత్తుకెళ్ళి చాప మీద పండబెట్టాలి. ఆ పని కోసం శవాన్ని ఎత్తడానికి ప్రయత్నిస్తే ఒక్క అంగుళం కూడా పైకి లేవలేదు. దాంతో జనానికి కాస్తంత అనుమానం వచ్చింది.

"మౌజ్జన్‌గారూ! మీ చేతిచలువ తగిలితేనే ఈ శవం పైకి లేస్తుంది, రండి" అన్నాడు ఒకతను. మౌజ్జన్‌గారికి చెయ్యి వెయ్యక తప్పలేదు. మౌజ్జన్ చేయి తగలగానే శవం తేలిగ్గా పైకి లేచింది. అలా శవాన్ని చాప మీదికి తెచ్చి వస్త్రాలు చుట్టబెట్టారు. తర్వాత శవాన్ని ఎత్తి జనాజా (శవపేటిక)లో పెట్టడానికి ప్రయత్నిస్తే అది మళ్ళీ లేవలేదు. వెంటనే మౌజ్జన్‌గారు వచ్చి శవం నడుం కింద చేయిపెట్టారు. అలా ముగ్గురు పట్టి శవాన్ని జనాజాలో పెట్టారు. జనాజా నమాజ్ తర్వాత జనాజాను శ్మశానానికి మోసుకెళ్ళాలి. అప్పుడు కూడా శవం లేవనని మొండికేసింది. అయితే మౌజ్జన్ చేయి తగలగానే జనాజా పైకి లేచింది. ఆవిధంగా జనాజాను శ్మశానానికి చేర్చారు.

సమాధి త్రవ్వకం పూర్తికాగానే ఒకాయన ముందుకొచ్చి "మౌజ్జన్‌గారూ! సమాధి లోకి దిగి శవాన్ని అందుకోండి" అన్నాడు. దాంతో మౌజ్జన్ జావగారిన మొహంతో వచ్చి



సమాధిలోకి దిగాడు. ఇద్దరు మనుషులు శవాన్ని ఎత్తి మౌజ్జన్‌కు, మరొకతనికి అందించారు. వారిద్దరు శవాన్ని సమాధిలో పండబెట్టారు. అంతిమ దర్శనం తరువాత రెండోవ్యక్తి పైకెక్కి వచ్చాడు.

అయితే మౌజ్జన్ సమాధి నుండి బయటికి రావడానికి ప్రయత్నించగానే హఠాత్తుగా అతని కాలిని శవం తన రెండు కాళ్ళతో పెనవేసి గట్టిగా పట్టుకుంది. మౌజ్జన్ ఎంత లాక్కున్నా, గింజుకున్నా లాభం లేకపోయింది. కొందరు ప్రజలు కూడా అతనికి సహక రించడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. దాంతో వారు విధిలేక శవంతో పాటు మౌజ్జన్‌ని అలాగే సమాధిలో ఉంచి మట్టిపోసి పూడ్చేశారు.

**పుణ్యాత్ముల పర్యవసానం :** ఇది ప్రాపంచిక వ్యామోహంలో పూర్తిగా కూరుకు పోయిన పాపాత్ముల పరిస్థితి. పోతే పుణ్యాత్ముల విషయంలో సంభవించిన సంఘటన కూడా ఒకటి వినండి. దాదాపు ఇరవై ఏళ్ళ క్రితంనాటి మాట. జమాఅతె ఇస్లామీ హింద్ (బిహార్‌రాష్ట్ర) నాయకులు అబ్దుల్‌బారీ మంచాన పడ్డారు. బంధువులు ఆయన్ని ఓ ప్రముఖ డాక్టర్ దగ్గరికి తీసికెళ్ళేందుకు సన్నాహాలు ప్రారంభించారు.

అది జుహర్‌వేళ. ఆ సమయంలో అబ్దుల్ బారీ దగ్గర ఆయన అల్లుడు ప్రొఫెసర్ ఫారూఖ్ మాత్రమే ఉన్నారు. ఆయన ఏదో మందిచ్చి అంబులెన్స్ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు. అంతలో అబ్దుల్‌బారీ గారు "అస్సలాము అలైకుం" అని పలికారు. ప్రొఫెసర్ ఫారూఖ్ ఉలిక్కిపడి చుట్టూ కలియజూస్తే, గదిలో వారిద్దరు తప్ప మరెవ్వరూ లేరు. తరువాత వెంటనే అబ్దుల్‌బారీ గారు చిరునవ్వుతో "మీరు వచ్చేశారా? మంచిది" అన్నారు, ముందునుంచే ఎవరి కోసమో ఎదురుచూస్తున్నట్లు. ఆ తరువాత ఆయన ఆత్మ అనంత వాయువుల్లో కలసిపోయింది.

మరణానంతర జీవితం గురించిన ఇలాంటి సంఘటనలు ఈనాడు పాశ్చాత్య దేశాల్లో మాత్రమే మేధావులు నమోదు చేస్తున్నారు. ఈనాటి ముస్లింలు ఈ సంఘటనల పట్ల ఆసక్తి కనబరచక పోవడం విచారకరం. ఇస్లామీయ పరిపాలన సాగిన కాలంలో ముస్లిం మేధావులు, ధర్మవేత్తలు తగిన సాక్ష్యాధారాలతో నమోదు చేస్తుండేవారు. ఇస్లామీయ పరిపాలన అంతమైన తరువాత ఈ పని ఆగిపోయింది. ఆనాడు నమోదైన కొన్ని సంఘటనలు చూడండి:

**ప్రాచీనకాలం సంఘటనలు :** హజ్రత్ ఉమర్ (రజి) పరిపాలనా కాలంలో ఒకతను దేవునికి ఎక్కువగా భయపడుతుండేవాడు. ఒకరోజు రాత్రివేళ అతను ఎంతో భయభక్తులతో ప్రార్థన చేస్తూ "విశ్వప్రభువు ముందు నిలబడి తన కర్మలకు సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుందని భావించి భయభక్తులతో జీవితం గడిపిన ప్రతి వ్యక్తికీ రెండు (స్వర్గ) వనాలు లభిస్తాయి" (ఖుర్‌ఆన్-55:46) అనే సూక్తి మాటిమాటికి పఠించసాగాడు. ఈవిధంగా అమితమైన దైవభీతితో అనేకసార్లు పఠించడంతో అతను స్పృహతప్పి పడిపోయి ప్రాణం కోల్పోయాడు.

ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) ఈ సంగతి తెలియగానే వచ్చి అతని జనాజా నమాజ్ చేయించారు. ప్రజలు అతని శవాన్ని సమాధిలో పెట్టి పూడ్చివేశారు. తరువాత హజ్రత్ ఉమర్ (రజి) ఆ సమాధి పైన ముఖం ఆనిచ్చి పెట్టి పై సూక్తినే పఠించారు. అప్పుడు సమాధి నుండి "ఉమర్! ఈ రెండు వనాలు నాకు లభించాయి" అనే నాదం విన్పించింది. (ఇబ్నె అబిద్దున్యా, బైహఖీ, ఇబ్నె అసాకిర్)

హజ్రత్ ఉస్మాన్ (రజి) పరిపాలనా కాలంలో జరిగిన ఒక సంఘటన ఇలా ఉంది: ఒక రౌతు రాత్రివేళ మక్కా, మదీనాల మధ్య ప్రయాణం చేస్తూ ఒక సమాధి పక్కగా పోతుంటే, అకస్మాత్తుగా ఆ సమాధిలో నుంచి ఒక వ్యక్తి బయటికి వచ్చాడు. అతను ఇనుప సంకెళ్ళతో బంధించబడి అగ్నిజ్వాలల మధ్య మాడిపోతున్నాడు. అతను ఆ బాటసారిని పిలుస్తూ "నా మీద కొంచెం నీళ్ళు కుమ్మరించు" అన్నాడు. అంతలో అదే సమాధి నుంచి మరొకతను బయటికొచ్చి ఎలుగెత్తి పిలుస్తూ "ఓ పుణ్యాత్ముడా! అతని మీద నీళ్ళు పొయ్యకు" అన్నాడు. ఈ అసాధారణ దృశ్యం చూసి రౌతు భయంతో వణికిపోతూ స్పృహతప్పి పడిపోయాడు. మరునాడు తెల్లవారేటప్పటికి అతని తల వెంద్రుకలన్నీ తెల్లబడి పోయాయి. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఈ సంఘటన గురించి విని "ఇక నుంచి ఎవరూ ఒంటరిగా ప్రయాణం చేయకూడదు" అన్నారు.

## ఆత్మ అంటే ఏమిటీ?-2

ఏమైనప్పటికీ ఆత్మకు చావు లేదని స్పష్టంగా తెలుస్తోంది. కాని ఆత్మ అంటే ఏమిటి, ఎలా ఉంటుంది, అది దేహంలోకి ఎలా వస్తుంది, ఎలా బయటికి పోతుంది? అనే ప్రశ్నలకు ఈనాటికీ సరైన సమాధానాలు లభించలేదు. లభించే అవకాశాలులేవు. కారణం ఆత్మను గురించి అర్థం చేసుకోవడం మానవ మేధకు అతీతమైన విషయం.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (సల్లం) వెంట మదీనా పొలాల గుండా నడచి వెళ్తున్నాను. దైవప్రవక్త (సల్లం) ఖర్జూరపు కర్ర పట్టుకొని దాని ఊతంతో నడవసాగారు. మేమలా వెళ్తుంటే దారిలో కొందరు యూదులు తారసపడ్డారు. అప్పుడు వారిలో కొందరు "ఆత్మను గురించి ఆయన్ని అడుగుదాం" అన్నారు. మరికొందరు "వద్దు, మనకు నచ్చని విషయం ఏదైనా ఆయన మనకు విన్పించవచ్చు" అన్నారు. అయితే కొందరు ఆత్మను గురించి అడగవలసిందేనని అన్నారు.

దాని ప్రకారం వారిలో ఒక వక్తి వచ్చి "అబుల్ ఖాసిం! ఆత్మ అంటే ఏమిటసలు?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) తక్షణమే సమాధానం ఇవ్వకుండా క్షణంపాటు మౌనంగా ఉండిపోయారు. దాంతో నేను ఆయనపై దివ్యావిష్కృతి అవతరిస్తోందని భావించి నిలబడ్డాను. దివ్యావిష్కృతి (వహీ) అవతరణ సమయంలో ఆవహించే పరిస్థితి దూరమయిన తరువాత ఆయన ఈసూక్తి పఠించారు: (బుఖారి, ముస్లిం)

"వారు ఆత్మను గురించి ప్రశ్నిస్తున్నారు. 'ఈ ఆత్మ నా ప్రభువు ఆజ్ఞతో వస్తుంది. (దీన్ని మీరు గ్రహించలేరని,) మీకు పరిమిత జ్ఞానం ప్రసాదించబడింద'ని చెప్పు." (17:85)



మానవుడు ఆత్మ గురించి తెలుసుకోవడం, అర్థం చేసుకోవడం సాధ్యం కాదని ఈ సూక్తిని బట్టి తెలుస్తోంది. అయితే మానవుడు తనకున్న పరిమిత జ్ఞానంతో బుద్ధిని ఉపయోగించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే సమస్యకు కొంతవరకైనా పరిష్కారం లభించవచ్చునేమో!

ఉదాహరణకు ఆత్మను మూడు భాగాలుగా విభజించవచ్చు. (1) ప్రాణం, (2) మనసు, (3) వ్యక్తిత్వం. మనకు తెలిసిన భాషలో ఈ మూడింటి కలియకనే ఆత్మ అని చెప్పవచ్చు. ప్రాణం+మనస్సు+వ్యక్తిత్వం=ఆత్మ. శరీరం నుండి ప్రాణం పోగానే మనిషి చనిపోతాడు. ప్రాణంతో పాటు మన మనస్సు, వ్యక్తిత్వాలు కూడా శరీరాన్ని వీడిపోతాయి. అయితే ఈ మూడింటి కలియకే ఆత్మ కాబట్టి ఈ మూడు ఎన్నటికీ విడిపోవు. ఎల్లప్పుడూ కలిసే ఉంటాయి.

**నిద్రావస్థలో ఆత్మ :** ఇబ్నెఉమర్ (రజి) కథనం: హజ్రత్ ఉమర్ (రజి) హజ్రత్ అలి (రజి)తో మాట్లాడుతూ "అబుల్ హసన్! మనిషి కలలు కంటున్నప్పుడు వాటిలో కొన్ని కలలు నిజమవుతాయి; కొన్ని అబద్ధమవుతాయి. వీటిని గురించి మీ అభిప్రాయం ఏమిటీ?" అని అడిగారు. దానికి అలి (రజి) ఇలా సమాధానమిచ్చారు: "దైవప్రవక్త (స) అన్నారు... 'స్త్రీగాని పురుషుడుగాని నిద్రపోతున్నప్పుడు అతని ఆత్మ దైవసింహాసనం వైపు అధిరోహిస్తుంది. ఏఆత్మ దైవసింహాసనం దగ్గరకుపోయి కల (నిద్ర) నుండి మేల్కొంటుందో అది కన్న కల నిజమవుతుంది. దైవసింహాసనం దగ్గరకు పోకుండా మధ్యలోనే మేల్కొంటే ఆ కల అబద్ధమవుతుంది." (తబ్రాని, ముస్తద్రక్, హాకిమ్)

ఇక్రమా ముజాహిద్ (రజి) కథనం: సూర్యుని కిరణాలు భూమిపై వ్యాపిస్తాయి. వాటి వేరులు సూర్యుడితో కలసి ఉంటాయి. అలాగే మనిషి నిద్రపోయినప్పుడు అతని ఆత్మ త్రాడులా పొడుగైపోతుంది. అది తిరిగి కురచయిపోగానే మనిషి మేల్కొంటాడు."

ఒకతను హజ్రత్ ఇక్రమా (రజి) దగ్గరకు వచ్చి "మనిషి కలలో ఎక్కడెక్కడో తిరుగుతూ తనను తాను చూసుకుంటాడు. ఏమిటా పరిస్థితి?" అని అడిగాడు. దానికి ఆయన ఇలా సమాధానమిచ్చారు: "ఇలా తిరిగేది అతని ఆత్మ. ఆత్మ హృదయంతో పెనవేసుకొని ఉంటుంది. దేహంలో ఉండే హృదయం ఎక్కడెక్కడో తిరిగే ఆత్మను వెనక్కి లాగినప్పుడు కల చెదరిపోయి మనిషి మేల్కొంటాడు." (మౌత్కొర్ఘుట్కా)

**దేహమే జైలు:** ప్రముఖ ధర్మవేత్తల అభిప్రాయం ప్రకారం మరణమంటే మనిషి శాశ్వతంగా అంతమైపోవడం కాదు. మరణం వల్ల ఆత్మకు దేహానికి ఉండే సంబంధం మాత్రమే తెగిపోతుంది. హజ్రత్ ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మ) ఇలా చెప్పారు:

"మరణం కారణంగా మీరు నాశనమైపోరు. మరణం ద్వారా మీరు ఒక ఇల్లు వదలి మరో ఇంటికి వెళ్తున్నారు, అంతే." (అబూనయీమ్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "ఈ ప్రపంచం విశ్వాసి పాలిట కారాగారం, కరువు ప్రాంతం. విశ్వాసి

ప్రపంచం నుండి వేరయిపోతున్నప్పుడు అతను కారాగారం నుండి, కరువు ప్రాంతం నుండి విముక్తి పొందుతున్నాడన్నమాట.'' (తబ్రాని ఫిల్ కబీర్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: ఈ ప్రపంచం అవిశ్వాసి పాలిట స్వర్గం, విశ్వాసి పాలిట కారాగారం. విశ్వాసి చనిపోయినప్పుడు, జైలు నుండి విడుదలై స్వేచ్ఛగా తిరిగే ఖైదీలా అవుతాడు. (ఇబ్నె ముబారక్)

మరణం గురించి భగద్గీత ఇలా చెబుతోంది:

''ఎవరైతే ఈ ఆత్మను మరణించేది అని అనుకుంటాడో, మరెవరైతే దీన్ని మరణించింది అని నమ్ముతాడో ఆ ఉభయులకూ ఏమీ తెలియదు.'' (2:19)

''ఓ అర్జునా! ఆత్మలుగల వారంతా పుట్టక మునుపు నిశ్శరీరులు. మరణించిన తరువాత కూడా నిశ్శరీరులుగానే ఉంటారు. కేవలం మధ్యకాలంలోనే శరీరధారులు. ఈ విషయంలో చింతించే విషయం ఏమిటీ?'' (2:28)

మరణించిన తర్వాత కూడా నిశ్శరీరులుగానే ఉంటారనే భగవద్గీతమాట ఖుర్ఆన్ మాటతో పొసగదు. అయితే ఆత్మ శాశ్వతమైనది, శరీరం మరణించినా ఆత్మ మరణించ దనే విషయంలో మాత్రం గీతా, ఖుర్ఆన్‌లు ఏకాభిప్రాయం వ్యక్తపరుస్తున్నాయి.

## అంతరంగం-3

మనస్సును హృదయం, అంతరంగం అని కూడా అంటారు. మానవ అంతరంగం బహు విచిత్రమైంది. అది ఓ పట్టాన మనకు లొంగదు. అనుక్షణం తన పరిధిని దాటిపోవ డానికి పరిపరివిధాల ప్రయత్నిస్తుంది. ఎవరైనా సన్మార్గంలో నడుస్తూ మంచి పనులు చేస్తున్నాడంటే, అతను తన అంతరంగాన్ని దాని సహజపరిధిలో బంధించాడన్న మాట. నిజానికి అంతరంగంపై అదుపు సాధించడం గొప్ప కార్యమే. అంతరంగంపై అదుపు సాధించలేనివాడ్ని మనం సాధారణంగా చపల చిత్తుడు లేక చంచల స్వభావుడని అంటాం. మనిషి ప్రవర్తనరీత్యా ఖుర్ఆన్ ఈ అంతరంగాన్నే మూడు విధాలుగా విభజించింది.

**దుష్ట మనస్సు :** ఖుర్ఆన్ పరిభాషలో మొదటి రకం అంతరంగాన్ని ''నఫ్సుల్ అమ్మారా'' అంటారు. స్వభావంరీత్యా దీన్ని ''దుష్టమనస్సు'' లేక దుష్టబుద్ధి అని చెప్పవచ్చు. కోరలు చాచి బుసలు కొడ్తూ మీదికి వచ్చే భయంకర విషసర్పాన్ని చంపడం కన్నా దుష్ట మనస్సుని చంపడమే గొప్ప కార్యమన్నాడు ఓ కవి. దీన్నిబట్టి ఈ రకమైన అంతరంగం మనిషికి ఎంత ప్రమాదకరమో ఊహించవచ్చు. ఇది మానవుడ్ని రకరకాల చెడుల వైపు ఉసిగొల్పుతుంది. భయాందోళనలు కలిగించి సత్కార్యాల నుండి బయటికి లాగుతుంది. వివిధ భ్రమలు కల్పించి దుష్కార్యాల ఊబిలోకి నెట్టివేస్తుంది. రకరకాల ప్రలోభాలు చూపి, చివరికి మనిషిని నట్టేట ముంచుతుంది. నఫ్సుల్ అమ్మారా (దుష్ట మనస్సు) గురించి ఖుర్ఆన్‌లో ఒకచోట ఇలా ఉంది:



''నేను నా ఆత్మశుద్ధిని గురించి గొప్పలు చెప్పుకోవడంలేదు. నా ప్రభువు కారుణ్య భాగ్యం లభిస్తే తప్ప (దుష్ట)మనస్సు ఎల్లప్పుడూ చెడు వైపుకే పురిగొల్పుతూ ఉంటుంది. నిజంగా నాప్రభువు గొప్పక్షమాశీలి, అమిత దయామయుడు''. (ఖుర్ఆన్-12:53)

**అంతరాత్మ :** రెండవ రకం అంతరంగాన్ని ''నఫ్సుల్లవ్వామా'' అంటారు. ఇది చేసే పనిని బట్టి దీన్ని ''అంతరాత్మ'' అని పేర్కొనవచ్చు. ''అంతరాత్మ ప్రబోధం'' అనే మాట అందరికీ తెలిసిందే. చెడ్డపనులకు పాల్పడినప్పుడల్లా అంతరాత్మ మనల్ని నిందిస్తుంది, నిలదీస్తుంది, ఆక్షేపిస్తుంది, అభ్యంతరం చెబుతుంది. ''ఆ పని చేస్తే నువ్వు నాశనమవుతావు, పట్టుబడిపోతావు'' అని హెచ్చరిస్తుంది.

అంతరాత్మ సజీవంగా ఉంటే మనిషి ఎలాంటి చెడు వైపు ఆకర్షించబడలేడు. ఒకవేళ ఎప్పుడైనా ఆకర్షించబడినా అంతరాత్మ నిలదీస్తూ, నిందిస్తూ అతడ్ని ప్రశాంతంగా ఉండనివ్వదు. ఈవిధంగా అంతరాత్మ మనల్ని చెడ్డ పనుల జోలికి పోనివ్వకుండా అడుగడుగునా అడ్డు తగుల్తుంది. అంతరాత్మ ప్రబోధాన్ని ఆలకించేవారు ఇహలోకం లోనే కాదు, పరలోకంలోనూ విజయ శిఖరాలు అధిరోహించగలుగుతారు.

అంతరాత్మ ప్రబోధాన్ని ఖాతరు చేయకుండా దాన్ని అణచడానికి ప్రయత్నిస్తే మటుకు మనం దారితప్పి చీకటి అగాధాల్లోకి పడిపోయినట్లేనని గ్రహించాలి. ఎల్లప్పుడూ మన శ్రేయస్సు కోరుతూ మనకు రక్షక భటునిగా, బాడీగార్డ్‌గా పనిచేసే ఈ అంతరాత్మ (నఫ్సుల్లవ్వామా)ను అణచివేయడమంటే మన బాడీగార్డ్‌ని మనమే చేజేతులా చంపు కున్నట్లవుతుంది. బాడీగార్డ్ పోయాక మన స్థితి ఏమవుతుందో తెలిసిందే. అడుగడుగునా ప్రమాదాలే ఎదురవుతాయి.

ఈ అంతరాత్మను గురించే దేవుడు ఖుర్ఆన్‌లో ఇలా అంటున్నాడు: ''నేను ప్రళయం సాక్షిగా చెబుతున్నాను. (మీరనుకునేది ఏమాత్రం నిజం) కాదు. నేను తనను తాను నిందించుకునే ఆత్మ (నఫ్సుల్లవ్వామా) సాక్షిగా చెబుతున్నాను..."(75:1-4)

పై సూక్తులలో విశ్వప్రభువు సత్యతిరస్కారుల కుశంకలను ఖండిస్తూ ప్రళయ దినం తప్పక వస్తుందని, ఆరోజు మానవులంతా మళ్ళీ బ్రతికించబడతారని, వారినుంచి కర్మల లెక్క తీసుకోడం జరుగుతుందని ప్రళయదినం మీద, అంతరాత్మ మీద ప్రమాణం చేసి మరీ హెచ్చరిస్తున్నాడు.

అంతరాత్మ గురించి దైవప్రవక్త (స) వ్యాఖ్యానిస్తూ ''ఏ విషయం మీ హృదయంలో ఆక్షేపణ జనింపజేస్తుందో అదే చెడు'' అన్నారు. అంటే మనం చేస్తున్నది తప్పుడు పనని మన అంతరాత్మ ఆక్షేపిస్తుంది. ఈ అనుభూతే మనిషిని చెడులకు దూరంగా ఉంచుతుంది. అంతరాత్మను గురించి ఆయన మరింత వివరంగా ఇలా తెలియజేశారు:

''జాగ్రత్తగా వినండి! మన దేహంలో ఒక మాంసపు ముద్ద ఉంటుంది. అది మంచి స్థితిలో ఉంటే మొత్తం దేహం మంచి స్థితిలో ఉంటుంది. ఒకవేళ అది చెడిపోతే మొత్తం దేహమే చెడి పోతుంది. (అనారోగ్యం పాలవుతుంది). అదే హృదయం.''

హృదయం నైతికంగా, ఆధ్యాత్మికంగా మంచిస్థితిలో ఉన్నప్పుడు నఫ్సుల్లవ్వామా (అంతరాత్మ) అనబడుతుంది. మనిషిని చెడు విషయాలనుంచి నిరోధించే, మంచి విషయాల వైపు ప్రేరేపించే "నఫ్సుల్లవ్వామా" అతని విశ్వాసాలు, ఆచరణలు, నీతినడవడికలపై "సెక్యూరిటీ గార్డ్"గా పని చేస్తుంది. శరీరంలోని ఈ సెక్యూరిటీ గార్డ్ అనారోగ్యం పాలయి బలహీనమయిపోయే కొద్దీ మనిషి "నఫ్సుల్ అమ్మారా" (దుష్టమనస్సు)కు చేరువవుతూ చెడ్డపనులు చేయనారంభిస్తాడు.

**సంతృప్త హృదయం :** దీనికి భిన్నంగా మనిషి నఫ్సుల్లవ్వామా (అంతరాత్మ) ప్రబోధాన్ని విని తదనుగుణంగా నడచుకున్నట్లయితే క్రమేణా అతడు మూడవ రకం అంతరంగమైన "నఫ్సుల్ ముత్మయిన్న" (సంతృప్త హృదయం)కు దగ్గరవుతాడు.

ఈ కోవకు చెందిన అంతరంగం గురించే ఖుర్‌ఆన్‌లో ఇలా ప్రస్తావించబడింది: (సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నుడయిన మనిషిని ఉద్దేశించి)-

"తృప్తిచెందిన మనసా! పద నీ ప్రభువు సన్నిధికి. నీవు ఆయన పట్ల సంతోషించావు, ఆయన నీ పట్ల ప్రసన్నుడయ్యాడు. (ఇక) నా పుణ్యదాసులలో చేరి నా స్వర్గంలో ప్రవేశించు" అని చెప్పడం జరుగుతుంది. (89:27-30)

ప్రఖ్యాత వ్యాఖ్యానసహిత ఖుర్‌ఆన్ అనువాద గ్రంథమైన 'రూహుల్ బయాన్'లో వ్యాఖ్యాన కర్త నఫ్సుల్ ముత్మయిన్న (సంతృప్త హృదయం) గురించి వివరిస్తూ "నఫ్సుల్ ముత్మయిన్న అంటే ఎలాంటి చెడు విషయాలు లేని పరిశుద్ధమైన, అత్యున్నత సుగుణ సంపత్తితో కూడిన జ్యోతిర్మయ హృదయం అన్నమాట" అన్నారు.

## మనశ్శాంతి-4

భౌతికావసరాలు నెరవేరితే చాలు, ఇక ఏసమస్యా ఉండదంటారు పదార్థ పూజారులు (Materialists). ఈ విషయం కొంతవరకు నిజమే కాని, అదే అన్నిటికీ మూల మంత్రం మటుకు కాజాలదు. సకల విధాల భోగభాగ్యాలతో తులతూగుతున్న పాశ్చాత్య దేశాల్లో ఎందరో ప్రజలు మనశ్శాంతి లభించక జీవితంపైనే విరక్తి చెందుతున్నారు. వారిలో అనేకమంది ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారు.

అయితే లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టినా పొందలేని ఈ మనశ్శాంతి దేవుని స్మరణ ద్వారా మాత్రమే ప్రాప్తమవుతుందని ఖుర్‌ఆన్ చెబుతోంది. ఇక్కడ దేవుని స్మరణ అంటే ఓచోట తిష్ఠవేసి కళ్ళు మూసుకొని దైవనామం జపించడం కాదు. మనిషి తనను తాను పూర్తిగా దేవునికి సమర్పించుకొని జీవిత సమస్త రంగాల్లో ఆయన ఆజ్ఞలు, హితవులను మనస్ఫూర్తిగా పాటించాలి. అప్పుడే అతనికి నిజమైన మనశ్శాంతి, హృదయ సంతృప్తి లభిస్తాయి.

1986లో నా స్నేహితుడొకడు సికిందరాబాద్‌లో అస్సిస్టెంట్ స్టేషన్‌మాస్టర్‌గా పని చేస్తుండిన ఒకతడ్ని పిలుచుకొచ్చి నాకు పరిచయం చేశాడు. ఆ వ్యక్తి కథనం



ప్రకారం అతని హృదయంలో ఒక విధమైన అశాంతి తుఫాను రేగింది. దాంతో అతను ఎల్లప్పుడూ చెప్పలేని అశాంతి, అసంతృప్తులతో బాధపడుతుండేవాడు. మనశ్శాంతి కోసం ఇంట్లో పూజలు చేస్తుండేవాడు. అనేక దేవాలయాలను సందర్శించాడు. తిరుపతికి వెళ్ళి వచ్చాడు. తీర్థయాత్రలు జరిపాడు. కాని ఎక్కడికి పోయినా, ఏ దేవుడ్ని మొక్కుకున్నా అతనికి మనశ్శాంతి లభించలేదు.

అతను కొందరు సాధువుల్ని కలుసుకొని వారిచ్చిన సలహాలు కూడా పాటించాడు. అయినా అతని హృదయంలో చెలరేగుతున్న అశాంతి తుఫాను తగ్గలేదు. పైగా అది మరింత ఉధృతం కాసాగింది. అలాంటి పరిస్థితిలో ఓరోజు రాత్రి అతను ఓ విచిత్రమైన కలగన్నాడు. ఆ కలలో అతను రోడ్డున నడిచిపోతుంటే ఓచోట ఒక మసీదు కన్పించింది. అతను యాదృచ్ఛికంగా మసీదులోకి తొంగిచూశాడు. చూస్తే లోపల అనేకమంది నమాజ్‌చేస్తూ కన్పించారు. అప్రయత్నంగా అతను కూడా మసీదులో ప్రవేశించి నమాజ్ చేస్తున్నవారి వరుసలోకి వెళ్ళి నిల్చున్నాడు. తర్వాత కల చెదరిపోయింది.

ఈ కలలోని గూఢార్థం ఏమిటో తెలియక అతను తికమక పడ్డాడు. తోటి హిందూ సోదరుల్ని అడిగాడు. వారందరూ అదేదో పీడకల అని కొట్టిపారేశారు. చివరికి రైల్వేశాఖలోనే పనిచేస్తున్న నా స్నేహితుడ్ని సంప్రదించాడు. ఆ స్నేహితుడు నవముస్లిం. అతను పదేళ్ళ క్రితమే ఇస్లాం స్వీకరించి ఉన్నాడు. ఈ కల సంగతి విన్న తరువాత నా స్నేహితుడు ఓరోజు రాత్రి పదిగంటలకు అతడ్ని నా దగ్గరకు పిలుచుకొచ్చాడు.

మనశ్శాంతి కోసం అలమటిస్తున్న ఆ వ్యక్తి తన గాథంతా చెప్పిన తర్వాత ఇస్లాం గురించి కొన్ని ప్రశ్నలు అడిగాడు. వాటికి నేను వివరంగా సమాధానాలు ఇచ్చాను. ఇస్లాం అంటేనే శాంతి అని చెప్పాను. ఇస్లాంకు సమర్పణ (Submission), లొంగిపోవడం (Surrender) అనే అర్థాలు కూడా ఉన్నాయని; మనిషి దేవునికి, ఆయన ప్రవక్త (సల్లం)కు లొంగిపోయి వారి ఆజ్ఞల్ని శిరసావహిస్తూ తనను తాను పూర్తిగా సత్యానికి సమర్పించు కున్నప్పుడే అతనికి నిజమైన మనశ్శాంతి లభిస్తుందని చెప్పాను. అతను నా సమాధానాలు విని తృప్తిచెందాడు. పైగా ఇస్లాం స్వీకరించడానికి కూడా సంసిద్ధత వ్యక్తపరిచాడు.

అయితే ఓ పదిరోజులు తరువాత నన్ను కలుసుకోవడానికి వచ్చిన నా నవముస్లిం స్నేహితుడ్ని అతని పరిస్థితి ఏమిటని అడిగితే, అతను ఇస్లాం స్వీకరించడానికి సిద్ధంగా లేడని సమాధానం ఇచ్చాడు. నేను ఆశ్చర్యపోతూ ప్రశ్నార్థకంగా చూశాను. ఆ వ్యక్తి ఇస్లాం స్వీకరణ విషయం ప్రస్తావించగానే అతని భార్య, బంధువులు తీవ్రంగా అభ్యంతరం తెలుపుతూ, నువ్వు ఇస్లాం స్వీకరిస్తే కేసు పెట్టి నీ ఉద్యోగాన్ని ఊడగొట్టిస్తామని, ఆస్తిలో చిల్లిగవ్వ కూడా ఇవ్వమని బెదిరించారట. దాంతో అతను ఇస్లాం స్వీకరించే విషయం మానుకున్నాడని నా మిత్రుడు తెలియజేశాడు. అప్పుడు నా మదిలో దైవగ్రంథంలోని ఈ సూక్తులు మెదిలాయి:

"ప్రవక్తా! మేము యావత్ మానవాళికోసం ఈ సత్యపూరిత గ్రంథాన్ని నీపై అవత రింపజేశాం. కనుక ఎవరు సన్మార్గం అవలంబిస్తారో అది వారికే ప్రయోజనకారి ఔతుంది. మరెవరు పెడదారి పట్టిపోతారో దానివల్ల వారే నష్టపోతారు. వారి బాధ్యత నీపై లేదు." (39:41) "సత్యాన్ని తిరస్కరించేవారికి (ఆరోజు) దేవుని దగ్గర వారి సంతానం, సిరిసంప దలు ఏమాత్రం ఉపయోగపడవు. వారు నరకాగ్నికి సమిధలై పోతారు." (ఖుర్ఆన్-3:10)

"సత్యాన్ని విశ్వసించినవారి హృదయాలే దైవస్మరణ వల్ల తృప్తిచెందుతాయి. గుర్తుం చుకోండి, దైవస్మరణ వల్లనే మానవులకు మనశ్శాంతి లభిస్తుంది. సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులయినవారు నిజంగా ఎంతో అదృష్టవంతులు. వారికి (పరలోకంలో) ఎంతో శ్రేష్ఠమైన ప్రతిఫలం లభిస్తుంది." (ఖుర్ఆన్-13:28,29)

## వ్యాధి, పరామర్శ-5

పుట్టిన ప్రతి మానవుడు ఎప్పుడో ఒకప్పుడు గిట్టక తప్పదు. దైవాజ్ఞ కాగానే మరణదూత మనిషి ఆత్మను స్వాధీనం చేసుకుంటాడు. మరణం దాని నిర్ణీత సమయానికి వస్తుంది. నిర్ణీత సమయానికి ముందు ఎన్ని వ్యాధులు వచ్చినా, ఎలాంటి ప్రమాదాలు సంభవించినా మృత్యువు రాదు. వ్యాధులు, వృద్ధాప్యం, ప్రమాదాలు, హత్యలు మృత్యువుకు సాకులు మాత్రమే. అవి మృత్యవుకు కారణభూతాలు కాలేవు. కాకపోతే అవి మృత్యువుకు సూచనలని మాత్రం చెప్పవచ్చు. మనిషి వ్యాధిగ్రస్తుడయి లేదా ప్రమాదానికి గురయి లేదా మరే కారణంతోనైనా తీవ్రంగా గాయపడి మంచాన పడితే అతడ్ని పరామర్శించడం మానవధర్మం.

కష్టాలు, కడగండ్లు వచ్చి పడినపుడు మనిషి ఆందోళన చెందడం సహజం. కష్టాలలో చిక్కుకున్నప్పుడు కొందరు నిరాశా నిస్పృహలకు గురయి ఆచరణ రంగం నుంచే పారిపోవడానికి ప్రయత్నిస్తారు. వ్యాధులు కూడా ఇలాంటివే. వ్యాధి తీవ్రమై నప్పుడు మనిషికి యావత్తు ప్రపంచం అంధకారమైపోతుంది. అసహనంతో అతను అసత్య ప్రేలాపనలకు కూడా పాల్పడే ప్రమాదం ఉంది. కాని దైవాన్ని, మహాప్రవక్త ముహమ్మద్ (స)ను దృఢంగా విశ్వసించిన మనిషి రోగబాధ ఎంత అధికమైనా, చివరికి మరణచిహ్నాలు కన్పించినా అతను దైవాజ్ఞల్ని ఏమాత్రం జవదాటడు. పైగా ఈ ఆపద తన పాలిట దైవకారుణ్యంగా, పాపాల పరిహారానికి కారణభూతంగా పరిణమిస్తుందని భావిస్తాడు. వ్యాధిని గురించి దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు:

**పాపపరిహారి :** "ముస్లింకు ఏ ఆపద వచ్చినా, ఏ కష్టం వచ్చినా, ఏ వ్యాధికి లోనయినా, మరే బాధకు గురయినా, చివరికి అతనికి ఒక ముల్లు గుచ్చుకున్నా సరే, తద్వారా దేవుడు అతని పాపాలను ప్రక్షాళనం చేయకుండా ఉండడు." (ముస్లిం)

"ముస్లింలలో ఎవరికైనా ఏదైనా వ్యాధిగాని, ఆపదగాని వచ్చిపడితే చెట్ల నుండి ఆకులు రాలిపోయినట్లు అతని పాపాలను దేవుడు కడిగివేస్తాడు." (బుఖారి)



ఈ ప్రపంచం కార్యకారణ ప్రపంచం గనక ఇక్కడ అందరిలాగే 'విశ్వాసి' కూడా ఎంత పవిత్రుడయినా, మరెంత నీతిమంతుడయినా సరే జబ్బున పడతాడు. అయితే వ్యాధిగ్రస్తుడైనప్పుడు సహనం వహించి సత్యమార్గంపై స్థిరంగా ఉంటే ఆవ్యాధి అతనికి పరలోక జీవితంలో ప్రయోజనం చేకూర్చుతుంది. వ్యాధిగ్రస్తులైనప్పుడు కొంతమంది అసహనంతో "ఇదెక్కడి మాయదారి రోగం వచ్చిపడిందిరా బాబూ!" అని వ్యాధిని నిందిస్తారు. కాని ముస్లింలు అలా రోగాన్ని నిందించకూడదు. సహనం వహిస్తూ దేవుని కరుణాకటాక్షాలను, ఆయన ప్రసాదించే పుణ్యఫలాన్ని ఆశించాలి.

"దైవప్రవక్త (సల్లం) ముందు (ఓసారి) జ్వరం గురించిన ప్రస్తావన వచ్చింది. (అది విని) ఒకతను జ్వరాన్ని దూషించాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) 'జ్వరాన్ని దూషించకు. అగ్ని లోహంలోని మలినాన్ని శుద్ధి చేసినట్లు ఇది వ్యాధిగ్రస్తుని పాపాలను కడిగివేస్తుంది' అని ఉపదేశించారు. (ఇబ్నెమాజ)

**గుణపాఠి :** వ్యాధి అనేది మనిషికి గుణపాఠం గరిపేందుకు దైవం తరఫున విధించబడే ఒక విధమైన శిక్షలాంటిది కూడా. ఈ శిక్ష ద్వారా ఉత్తముడు, వివేచనా పరుడైనవాడే గుణపాఠం నేర్చుకుంటాడు. బుద్ధిహీనుల దృష్టి మాత్రం వ్యాధికి సంబం ధించిన భౌతిక కారణాలు దాటి కాస్తయినా ముందుకు పోదు.

దైవప్రవక్త (సల్లం) వ్యాధిని గురించి ప్రస్తావిస్తూ ఇలా తెలిపారు: "మనిషి జబ్బు పడినప్పుడు దేవుడు అతనికి స్వస్థత కూడా చేకూర్చుతాడు. అదీగాక ఈ వ్యాధి అతని గత పాపాలకు పరిహారంగాను, భావి జీవితానికి గుణపాఠంగాను అవుతుంది. కాని కపటి విశ్వాసి జబ్బుపడినప్పుడు స్వస్థత చేకూరగానే ఒంటెలా వ్యవహరిస్తాడు. ఒంటెను మనుషులు కట్టివేస్తారు, వదిలివేస్తారు. కాని ఆ ఒంటె తనను మనుషులు ఎందుకు కట్టివేస్తారో, ఎందుకు వదిలివేస్తారో గ్రహించదు. (కపటి విశ్వాసి కూడా అంతే)."

అప్పుడు ఒకతను "దైవప్రవక్తా! అసలు రోగం అంటే ఏమిటీ? దైవసాక్షి! నేను ఎప్పుడూ రోగాన పడలేదు" అన్నాడు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "మా దగ్గర్నుంచి లేచి వెళ్ళిపో. నీవు మాలోని వాడివి కావు" అని చెప్పారు. (అబూదావూద్)

వ్యాధి కూడా విశ్వాసానికి సంబంధించిన ఒక చిహ్నమని, విశ్వాసి వ్యాధిగ్రస్తుడు అవడం అతని మంచికేనని పై హదీసు ద్వారా స్పష్టమవుతోంది. విశ్వాసి అన్న మనిషి జీవితంలో ఒక్కసారి కూడా జబ్బు పడకపోవడమనేది అతడ్ని ముస్లిం సమాజం నుండే బహిష్కరిస్తున్నట్లు దైవప్రవక్త (సల్లం) ప్రవచనం సూచిస్తోంది.

**వ్యాధిగ్రస్థ స్థితిలో కర్మలనమోదు :** ఆయన దేవుని మాటలు ఇలా తెలిపారు:

"నేను నా (విశ్వాసి అయిన) దాసుడ్ని (వ్యాధి రూపంలో) బంధించి పరీక్షించాను. (కనుక దైవదూతలారా!) లోగడ ఆరోగ్య స్థితిలో అతనికి మీరు ఇస్తూ ఉండిన పుణ్య ఫలాన్ని (ఇప్పుడు కూడా) ఇవ్వడం కొనసాగించండి." (అహ్మద్)

సాధారణంగా ప్రజలు జీవితాంతం పరిపూర్ణ ఆరోగ్యంగా ఉండేవాడు ఎంతో అదృష్టవంతుడని అనుకుంటారు. కాని విశ్వాసి (మోమిన్)కి వ్యాధి దైవం తరఫున ఒక వరం అని, వ్యాధి మూలంగా అతని గత పాపాలు క్షమించబడటమే గాక, ఆరోగ్యంగా ఉన్నప్పుడు ఎంత పుణ్యఫలం లభిస్తుండేదో అంత పుణ్యఫలం అనారోగ్య స్థితిలో కూడా అతనికి దక్కుతుందని ఈ హదీసుల ద్వారా తెలుస్తోంది.

విశ్వాసికి (అంటే ముస్లింకు) దేవుడు పుణ్యార్జనా ఒనరులు అడుగడుగునా కల్పించాడు. అతను ఆరోగ్యంగా ఉన్నా, అనారోగ్యం పాలైనా అతని కోసం పుణ్యార్జనా ద్వారాలు ఎన్నో తెరిచి ఉన్నాయి. రోగిని పరామర్శించే విశ్వాసిపై కూడా దేవుని కారుణ్యానుగ్రహాలు కురుస్తాయి.

"అన్నార్తులకు అన్నం పెట్టండి, రోగుల్ని పరామర్శించండి, ఖైదీలకు విముక్తి కలిగించండి" అని దైవప్రవక్త (సల్లం) ముస్లింలకు నొక్కి చెప్పారు. (బుఖారి)

**పరామర్శికీ ప్రయోజనమే :** ఒక ముస్లింపై మరొక ముస్లింకు ఏడు విధాల హక్కులున్నాయి. వాటిలో రోగిని పరామర్శించడం ఒకటి. సమీపంలో ఉన్న రోగిని వీలున్నా పరామర్శించడానికి వెళ్ళకపోతే మరణానంతరం తీర్పుదినాన దేవుని ముందు జవాబిచ్చుకోవలసి వస్తుంది. అలాంటి మనిషితో దేవుడు తీర్పుదినాన ఈ విధంగా అంటాడని దైవప్రవక్త (సల్లం) తెలియజేశారు:

"ఆదం కుమారా (మానవుడా)! నేను జబ్బుపడినప్పుడు నీవు నన్ను పరామర్శించ డానికి రాలేదు' అంటాడు దేవుడు. దానికి దాసుడు 'ప్రభూ! నేను మిమ్మల్ని ఎలా పరామర్శించగలను? మీరు యావత్ లోకాలకే ప్రభువు కదా!' అంటాడు. అప్పుడు విశ్వప్రభువు ఇలా అంటాడు: 'ఫలానా దాసుడు జబ్బుపడ్డాడు. కాని నీవు అతడ్ని పరామర్శించ లేదు. (ఆరోజు) నీవు అతడ్ని పరామర్శించి ఉంటే అతని దగ్గర నన్ను దర్శించి ఉండేవాడివి." (ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) ఎవరినైనా పరామర్శించడానికి వెళ్ళినప్పుడు రోగిని ఊరడిస్తూ, ఆందోళన పడాల్సిన పనిలేదు. దేవుడు తలిస్తే నీ పాపాలు తొలగిపోతాయి. నువ్వు పరిశుద్ధుడవుతావు... అంటూ స్వాంతన పలుకులు పలికేవారు. ఆయన ఈ విషయాన్ని గురించి ముస్లింలకు హితోపదేశం చేస్తూ "మీరు రోగిని చూడటానికి వెళ్తే అతని బాధలో పాలుపంచుకోండి. ఈ విషయం పరిస్థితిని మార్చలేకపోయినా దానివల్ల రోగి మాత్రం సంతోషిస్తాడు" అని చెప్పారు. (అబూదావూద్)

రోగిని పరామర్శించే వ్యక్తిని దేవుడు ఎంతగా అనుగ్రహిస్తాడో దైవప్రవక్త (సల్లం) నోట వెలువడిన ఈ క్రింది ప్రవచనాలు చూడండి:

"ఒక ముస్లిం (తోటి ముస్లిం సోదరుడ్ని) పరామర్శించడానికి వెళ్తే తిరిగి వచ్చేవరకూ అతను స్వర్గ పలహారాలు ఆరగించడంలో నిమగ్నుడైఉంటాడు." (ముస్లిం)



"ఎవరైనా ముస్లిం రోగిని పరామర్శించడానికి వెళ్తున్నప్పుడు ఆకాశం నుండి ఒక ప్రకటనకర్త (దైవదూత) అతడ్ని కేకవేసి 'నీకు స్వాగతం! నీవు (ఇలా నడచిపోవడం శుభప్రదమైనది. నీకు స్వర్గంలో ఉన్నతస్థానం లభిస్తుంది' అంటాడు." (ఇబ్నెమాజ)

"ఉజూ చేసి పూర్ణవిశ్వాసంతో తోటిముస్లిం సోదరుడ్ని పరామర్శించడానికి వెళ్ళే వాడు అరవై ఏళ్ళ దీర్ఘకాలిక నరకశిక్షకు దూరంగా ఉంచబడతాడు." (అబూదావూద్)

"ఏ ముస్లిం ఉదయం తన తోటిముస్లింని పరామర్శించడానికి బయలుదేరుతాడో, అతని పాపమన్నింపు కోసం డెబ్భయివేల మంది దైవదూతలు సాయంత్రం దాకా దైవాన్ని ప్రార్థిస్తుంటారు. అలాగే ఏ ముస్లిం సాయంత్రం తోటిముస్లిం సోదరుడ్ని పరామర్శించడానికి బయలుదేరుతాడో, అతని పాపమన్నింపు కోసం డెబ్భయి వేలమంది దైవదూతలు తెల్లవారేదాకా దైవాన్ని ప్రారిస్థంటారు. (చివరికి) అతను స్వర్గంలో ప్రవేశిస్తాడు." (తిర్మిజ)

## మరణం-6

అశాశ్వతమైన ఈ ప్రపంచంలో సృష్టికర్త పెట్టిన విశ్వాస పరీక్ష ముగిసిన తరువాత మనిషి మరణానికి చేరువవుతాడు. మరణం అంటే ఆత్మ దేహం నుండి విడిపోవడమే. మరణం ఏ క్షణంలోనయినా విజృంభించి మనిషి ప్రాణం తీస్తుంది. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు గమనించండి:

"ప్రతిపాణీ చావును చవిచూడవలసిందే. మేము మిమ్మల్ని మంచీ–చెడు స్థితులు కలిగించి పరీక్షిస్తున్నాం. చివరికి మీరంతా మాదగ్గరికే రావలసి ఉంది." (21:34,35)

"మృత్యు విషయానికొస్తే, అది మీరు ఎక్కడున్నా, ఎట్టి పరిస్థితిలో వున్నా, చివరికి పటిష్ఠమైన భవనాల్లో వున్నాసరే వచ్చితీరుతుంది. దాన్ని ఎవరూ అడ్డుకోలేరు." (4:78)

"మానవుడా! నీవు (జీవిత సత్యం గురించి ఆలోచించకుండా ఐహిక కార్యకలా పాల్లో) ఎంత నిమగ్నుడవైఉన్నా, నీ పయనం మాత్రం నీ ప్రభువు వైపుకే నిరాఘాటంగా సాగిపోతోంది. చివరికి ఆయన సన్నిధికే నీవు చేరుకోవలసి ఉంటుంది." (84:6)

"దేవుని అనుజ్ఞ లేనిదే నిర్ణీత సమయానికి ముందు ఏ ప్రాణికీ చావు రాదు. ప్రతి ప్రాణికీ మరణకాలం వ్రాయబడి ఉంది. కేవలం ప్రాపంచిక ప్రతిఫలాపేక్షతో పనిచేసే వారికి మేము ప్రపంచంలోనే వారి ప్రతిఫలం ఇచ్చివేస్తాము. పరలోక ప్రతిఫలాపేక్షతో పనిచేసేవారికి పరలోకంలో వారికి రావలసిన ప్రతిఫలం అనుగ్రహిస్తాం. కృతజ్ఞులై ఉండే వారికి మేము తప్పకుండా తగిన బహుమానం ప్రసాదిస్తాము." (3:145)

**నిద్రావస్థలో ఆత్మసంచారం :** "రాత్రివేళ మీ ఆత్మలను స్వాధీనం చేసుకునేవాడు, పగటివేళ మీరు చేసే పనులు గమనించేవాడు ఆయనే. మీ నిర్ణీత జీవితకాలం సాగడా నికి మరునాడు మిమ్మల్ని దైనందిన ప్రపంచంలోకి పంపుతున్నవాడు కూడా ఆయనే.

చివరికి ఓరోజు మీరంతా ఆయన సన్నిధికే మరలిపోవలసి ఉంది. అప్పుడాయన మీరు (ఇహలోకంలో ఉండగా) ఏమేమి చేస్తుండేవారో మీకు తెలియజేస్తాడు." (6:60)

"నిద్రావస్థలో కూడా ఆత్మ దేహం నుండి వెలువడి ఎక్కడెక్కడో తిరుగుతుంది. అయితే అప్పుడు ఆత్మకు, దేహానికి మధ్య స్థితిస్థాపక గుణంకల వస్తువేదో ఉంటుంది. ఈవస్తువే ఆ రెండిటిని పూర్తిగా విడిపోనివ్వకుండా పట్టి ఉంచుతుంది. ఆ వస్తువు తెగి పోతే ఆత్మ దేహం నుండి పూర్తిగా వేరయిపోతుంది. అంటే మరణం సంభవిస్తుంది. దేవుడు నిద్రిస్తున్న ఓ మనిషి విషయంలో మృత్యునిర్ణయం తీసుకున్నప్పుడు ఈ స్థితి స్థాపక వస్తువుని త్రెంచి అతని దేహం నుండి ఆత్మను పూర్తిగా స్వాధీనం చేసుకుంటాడు. మృత్యు నిర్ణయం తీసుకోకపోతే ఈ స్థితిస్థాపక వస్తువుని త్రెంచివేయకుండా తాత్కాలి కంగా స్వాధీనం చేసుకున్న అతని ఆత్మను తిరిగి అతని దేహంలోకి వదిలేస్తాడు."

"మరణ సమయంలో (మానవుల) ఆత్మలు స్వాధీనం చేసుకునేవాడు దేవుడే. ఆయన మరణించనివారి ఆత్మలను నిద్రావస్థలో స్వాధీనం చేసుకుంటాడు. ఆ తరువాత ఆయన ఎవరి విషయంలో మృత్యునిర్ణయం తీసుకుంటాడో వారి ఆత్మలను తీసుకొని, మిగిలినవారి ఆత్మల్ని ఒక నిర్ణీతకాలం కోసం వెనక్కి పంపుతాడు. ప్రశాంత హృదయంతో యోచించేవారి కోసం ఇందులో గొప్ప సూచనలున్నాయి." (39:42).

**కలలా కరిగిపోయే ఐహికజీవితం:** ఒక పేదవాడు కలలో అందమైన బంగళాలో ఉన్నట్లు, కారులో షికారు కొడ్తున్నట్లు, స్టార్‌హోటల్లో భోగభాగ్యాలు అనుభవిస్తున్నట్లు చూస్తాడు. ఆ సమయంలో తాను ఓ చిన్న పూరిపాకలో నివసిస్తున్న నిష్టదరిద్రుణ్ణని, పీకలదాకా అప్పుల్లో మునిగివున్న దౌర్భాగ్యుణ్ణని, భార్యాపిల్లల కనీసావసరాలు కూడా తీర్చలేని దురదృష్టవంతుణ్ణని ఏమాత్రం భావించడు. కాని కల కాస్తా చెదరిపోగానే వాస్తవం వికృతనాట్యం చేస్తూ అతని కళ్ళ ముందు కన్పిస్తుంది. అదేవిధంగా ఐహిక జీవితం కూడా అందమైన కలలాంటిదే. అసలుజీవితం మరణానంతరం వచ్చే పరలోక జీవితమే. శాశ్వతమైన ఆ పరలోక జీవితంలో కష్టాలు లేకుండా సుఖాలు మాత్రమే అనుభవించడానికి ఇహలోకంలోనే సత్యధర్మం స్వీకరించి సదాచరణకై నిరంతరం కృషి చేస్తూ ఉండాలని ఈసూక్తి మనకు చెబుతోంది.

ప్రాపంచికవ్యామోహంలో కూరుకుపోయిన పదార్థపూజారులు (Materialists) మనిషి చనిపోయిన తరువాత శాశ్వతంగా మట్టిలో కలసిపోతాడని, కర్మవిచారణ కోసం అతడు మళ్ళీ బ్రతికే ప్రశ్న ఉదయించదని అంటారు. వారు తమ దగ్గర దానికి సంబంధించిన శాస్త్రీయ ప్రమాణం లేకపోయినా వితండవాదం చేస్తారు. దివ్యఖుర్‌ఆన్ వారి వాదనను ఖండిస్తూ ఇలా చెబుతోంది:

"(చనిపోయాక మళ్ళీ బ్రతికించబడటం కల్ల అనే మీ అభిప్రాయం) ఎంతమాత్రం (నిజం) కాదు. మనిషి కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్నప్పుడు "మంత్రించే వారెవరైనా ఉన్నారా?" అంటారు జనం. ఆ మనిషి ఇక తాను ఇహలోకం వీడిపోయే సమయం



ఆసన్నమయిందని అనుకుంటాడు. కష్టాల మీద కష్టాలు వచ్చిపడతాయి. అదే నీ ప్రభువు సన్నిధికి బయలుదేరవలసిన రోజు." (75:26-30)

"మానవుడు తనను ఇట్టే వదలిపెట్టడం జరుగుతుందని భావిస్తున్నాడా? అతను మొదట (స్త్రీగర్భంలో) కార్చబడిన క్షుద్రబిందువుగా లేడా? తరువాత ఒక నెత్తుటిముద్దలా రూపొందాడు. ఆపై దేవుడు అతనికి దేహం నిర్మించి తగిన అవయవాలు పొందికగా అమర్చాడు. తర్వాత అతని నుండి రెండు వేర్వేరుజాతులుగా స్త్రీపురుషుల్ని పుట్టించాడు. ఇదంతా చేసినవాడు చనిపోయినవాడ్ని మళ్ళీ బ్రతికించలేడా?" (75:36-40)

**మరణ దూతలు :** "దేవునికి తన దాసులపై పూర్తి అదుపు, అధికారాలున్నాయి. ఆయన మిమ్మల్ని పర్యవేక్షించేవారిని నియమించి పంపుతున్నాడు. మీలో ఎవరికైనా మరణ సమయం ఆసన్నమైనప్పుడు ఆయన పంపే దూతలే అతని ప్రాణం తీసికెళ్తారు. వారు కర్తవ్య నిర్వహణలో ఎలాంటి లోటు రానివ్వరు. చివరికి అందరూ తమ అసలు యజమాని అయిన దేవుని దగ్గరికే తీసుకురాబడతారు. గుర్తుంచుకోండి, నిర్ణయాధికారాలన్నీ ఆయనకే హస్తగతమయి ఉన్నాయి. (మీ కర్మల) లెక్క తేల్చడానికి ఆయనకు ఎంతో సేపు పట్టదు." (దివ్యఖుర్‌ఆన్-6:61,62)

మరణ సమయంలో మానవుల ఆత్మలు స్వాధీనం చేసుకోవడానికి నియమించ బడిన ప్రధాన దైవదూత పేరు హజ్రత్ ఇజ్రాయీల్ (అలైహి). ఆయన అధీనంలో లక్షలాది మంది మరణదూతలు ఉంటారు. దైవాజ్ఞ కాగానే వారు మనుషుల ప్రాణాలు తీస్తారు. పుణ్యాత్ముల ప్రాణం తీయడానికి వచ్చే మృత్యుదూతలు సాధుస్వభావం కలిగిన ముఖవర్చస్సుతో, కాంతిమంతమైన స్వేతవస్త్రాలు ధరించి వస్తారు. పాపాత్ముల ప్రాణాలు తీయడానికి వచ్చే మృత్యుదూతలు భయంకరమైన వికృత రూపాలతో వస్తారు. పాపాత్ముల ప్రాణాలు తీయడానికి వచ్చే దైవదూతల గురించి ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

**మరణావస్థలో అవిశ్వాసులు :** "ఈ దుర్మార్గులు మరణావస్థలో దుర్భర యాతనతో ఎంత తల్లడిల్లిపోతారో నీవు చూస్తే బాగుండు. అప్పుడు దైవదూతలు చేతులు ముందుకు చాపుతూ ఇలా అంటారు: 'తీయండిక మీ ప్రాణాలు బయటికి. మీరు దేవుని మీద అసత్య విషయాలు మోపి అన్యాయంగా కారుకూతలు కూశారు. తలబిరుసుతనంతో ఆయన సూక్తులపై కువిమర్శలు చేస్తుండేవారు. అందుకు ఈరోజు మీరు అత్యంత అవమానకరమైన యాతన చవిచూడండి." (6:93)

"అసత్య విషయాలు కల్పించి వాటిని దేవునికి ఆపాదించే వాడికంటే, లేదా దేవుని సూక్తులు తిరస్కరించిన వాడికంటే పరమ దుర్మార్గుడు ఎవరుంటారు? అలాంటివారికి వారి విధివ్రాతలో రాయబడినది మాత్రమే (కొన్నాళ్ళపాటు) లభిస్తుంది. చివరికి మా దూతలు వారి ప్రాణాలు తీయడానికి వస్తారు. వారప్పుడు 'ఏరి, దేవుడ్ని వదలి మీరు మొరపెట్టుకున్న మీ మిధ్యాదైవాలు ఇప్పుడెక్కడికి పోయారు?' అని ప్రశ్నిస్తారు. దానికి

వారు 'వారంతా మా నుండి కనుమరుగైపోయారు' అంటారు. 'మేము నిజంగా సత్య తిరస్కారులం' అని వారు తమకుతామే వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతారు." (7:37)

"దైవదూతలు అవిశ్వాసుల ప్రాణాలు తీస్తున్నప్పటి స్థితి నీవు చూస్తే బాగుండు! వారప్పుడు అవిశ్వాసుల ముఖాలపై, పిరుదులపై కొడుతూ 'ఇక దహనయాతన చవి చూడండి. ఇది మీరు చేజేతులా కొని తెచ్చుకున్నదాని పర్యవసానమే. అంతేగాని దేవుడు తన దాసులకు ఎలాంటి అన్యాయం చేసేవాడు కాదు' అనంటారు." (8:50-51)

"వారు దైవదూతలకు పట్టుబడినప్పుడు వెంటనే (తిరస్కారం, తలబిరుసుతనాలు వదలి) పూర్తిగా లొంగిపోతూ 'మేము ఏ పాపం ఎరగం' అంటారు. దానికి దైవదూతలు 'ఎందుకు ఎరగరు, మీచేష్టలన్నీ దేవునికి తెలుసు. మీరిప్పుడు నరకంలోకి పోయిపడండి. అక్కడే మీరిక శాశ్వతంగా ఉంటారు' అని చెబుతారు". (16:28,29)

**మరణానికి ముందే పశ్చాత్తాపం :** మనిషి ఎన్ని పాపాలు చేసినా, ఎంతటి ఘోరమైన పాపాలకు పాల్పడినా మరణానికి ముందే పశ్చాత్తాపం చెంది నడవడికను సరిదిద్దుకుంటే దేవుడు అతడ్ని తప్పకుండా క్షమిస్తాడు. ఇదే విషయాన్ని మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఒక ఉదాహరణ ద్వారా ఈవిధంగా వివరించారు:

"పూర్వం ఇస్రాయీల్ సంతతికి చెందిన ఒక మనిషి తొంభై తొమ్మిది హత్యలు చేశాడు. తరువాత (పశ్చాత్తాపం చెంది దాని నిష్కృతి కోసం) జనాన్ని అడుగుతూ తిరగ సాగాడు. అలా తిరుగుతూ ఒక సాధువు దగ్గరకు వెళ్ళి "నా పాపాలకు నిష్కృతి ఉందా" అని అడిగాడు. దానికి ఆ సాధువు లేదన్నాడు. దాంతో ఆ హంతకుడు (వళ్ళు మండి పోయి) ఆ సాధువుని కూడా హతమార్చాడు.

ఆ తరువాత అతను మళ్ళీ జనాన్ని అడుగుతూ తిరగసాగాడు. అప్పుడు ఒకతను తారసపడి "నీవు ఫలానా ఊరికి వెళ్ళు. అక్కడ కొందరు దైవారాధనలో నిమగ్నులయి ఉన్నారు. వారితో కలసి నీవు కూడా దైవాన్ని ఆరాధించు. దేవుడు నీ పశ్చాత్తాపం స్వీకరిస్తాడు" అని చెప్పాడు. (ఈ మాట విని అతను ఆ ఊరికి బయలుదేరాడు.)

అయితే అతను దారిలోనే మృత్యువాత పడ్డాడు. అతను చనిపోతూ తన రొమ్మును ఆ ఊరున్న దిశకు మరల్చాడు. అతని (ఆత్మను స్వాధీనం చేసుకునే) విషయంలో కారుణ్యదూతలకు, యాతన దూతలకు మధ్య వివాదం వచ్చింది. అప్పుడు దేవుడు ఆ ఊరిని అతనికి దగ్గరగా జరగమని ఆదేశించాడు. అలాగే అతను బయలు దేరిన ఊరిని అతనికి దూరంగా జరగమని ఆదేశించాడు.

ఆ తర్వాత దేవుడు అతని (భౌతికకాయం) నుండి ఆ ఊళ్ళు ఎంతెంత దూరం ఉన్నాయో కొలచి చూడమని దైవదూతల్ని ఆదేశించాడు. కొలవడం పూర్తయ్యాక చూస్తే, ఆ మనిషి (మృతదేహం) అతను నిష్కృతికోసం పోయేఊరికి జానెడు దూరం దగ్గరగా ఉన్నట్లు తేలింది. అంచేత దేవుడు అతని పాపాలు క్షమించాడు. (బుఖారి, ముస్లిం)



**మరణావస్థలో విశ్వాసులు :** దేవుడ్ని విశ్వసించి ఆయన ఆజ్ఞల్ని పూర్తిగా పాటించని ముస్లింలు సైతం పితృలోక (బర్జఖ్) శిక్ష అనుభవించ వలసివస్తుంది. మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) మదీనాను దారుల్‌ఇస్లాంగా ప్రకటించి ముస్లింలంతా మదీనాకు వలసపోవాలని ఆదేశించారు. కాని మక్కాలో కొందరు ముస్లింలు కేవలం ఐహిక కష్టనష్టాలకు భయపడి, అవిశ్వాసుల మధ్య సహజీవనం గడుపుతూ స్వస్థలంలోనే ఉండిపోయారు. అలాంటివారిని ప్రస్తావిస్తూ ఖుర్‌ఆన్ ఇలా పేర్కొన్నది:

"దైవదూతలు తమకుతాము అన్యాయం చేసుకున్నవారి ప్రాణాలుతీస్తూ, మీరిప్పుడు ఏస్థితిలో ఉన్నారని ప్రశ్నిస్తారు. దానికి వారు 'మేము దేశంలో చాలా బలహీనులుగా, పీడితులుగా ఉండేవాళ్ళం' అనంటారు. అప్పుడు దైవదూతలు 'దేవుని భూమి విశాలంగా లేదా, మీరున్నచోటు నుంచి మరోచోటికి వలసపోవడానికి?' అంటారు." (4:97)

పుణ్యాత్ముల ప్రాణాలు తీయడానికి వచ్చే దైవదూతలు గురించి కూడా వినండి:

"దైవభీతిపరుల పవిత్రాత్మలను దైవదూతలు స్వాధీనం చేసుకుంటూ 'మీకు శాంతి కలుగుగాక! మీరు చేసుకున్న (సత్) కర్మలకు ప్రతిఫలంగా స్వర్గంలో ప్రవేశించండి' అంటారు." (దివ్యఖుర్‌ఆన్-16:32)

"మృత్యువుని గుర్తించిన మనిషికి ప్రపంచంలో ఎదురయ్యే ఆపదలన్నీ తేలికయి పోతాయి" అన్నారు హజ్రత్ కాబ్ (రజి).

**మృత్యుస్మరణ:-** ఒకసారి దైవప్రవక్త (సల్లం)తో ఆయన అనుచరుడొకాయన మాట్లాడుతూ "దైవప్రవక్తా! ప్రళయదినాన హతసాక్షుల (షహీద్‌ల)తో పాటు లేపబడే వారు ఎవరైనా ఉంటారా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "ఉంటారు. రోజుకు (రాత్రి, పగలు) కనీసం ఇరవైసార్లు మృత్యువుని తలచుకునేవారు హతసాక్షులతో పాటు లేపబడతారు" అని చెప్పారు. (తబ్రాని)

హజ్రత్ ఇబ్నెసాబిత్ (రజి) కథనం: ఒకసారి దైవప్రవక్త (సల్లం) దగ్గర ఒక వ్యక్తిని పొగడటం జరిగింది. దానిపై దైవప్రవక్త (సల్లం) "మరి మరణాన్ని తలచుకోవడంలో అతని పరిస్థితి ఏమిటీ?" అని అడిగారు. దానికి అనుచరులు సమాధానం ఇవ్వలేక పోయారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "మీరు పొగిడిన మనిషి ఆ పొగడ్తలకు అర్హుడు కాడు" అన్నారు. (అహ్మద్ ఫిజ్జుహద్)

ఒక హదీసులో దైవప్రవక్త (సల్లం) "మీరు సమాధుల్ని సందర్శిస్తూ ఉండండి. సమాధి సందర్శన మృత్యువుని గుర్తుకు తెస్తుంది" అన్నారు. (ముస్లిం)

మరోసారి ఆయన ఇలా ప్రవచించారు: "నేను ఇదివరకు మిమ్మల్ని సమాధుల్ని సందర్శించ వద్దని వారించాను. ఇప్పుడు మీరు సమాధుల్ని దర్శిస్తూ ఉండండి. సమాధి సందర్శన మనసును మెత్తపరుస్తుంది; కంటతడి పెట్టిస్తుంది; పరలోకాన్ని గుర్తుచేస్తుంది." (బుఖారి, ముస్లిం)

**చనిపోయే విశ్వాసికి శుభవార్త :** ఓసారి దైవప్రవక్త (సల్లం) తన అనుచరులకు హితోపదేశం చేస్తూ ఇలా అన్నారు: "మీరు ఎవరినైనా మరణానికి సమీపంలో ఉండటం చూస్తే అతనికి (పరలోక) శుభవార్త విన్పించండి. దానివల్ల అతను (దైవకారుణ్యాన్ని) ఆశిస్తూ దేవుడ్ని కలుసుకునే అవకాశం ఉంటుంది. (అంటే దైవకారుణ్యం పట్ల నిరాశ చెందకుండా దేవుడు తన పాపాలను క్షమిస్తాడన్న ఆశతో తనువు చాలించాలన్నమాట.) అలాగే మీరు ఎవరినైనా భోగభాగ్యాల జీవితం గడుపుతుండగా చూస్తే అతడ్ని (పరలోక శిక్షలను గురించి) భయపెట్టండి. దాని వల్ల అతను (దేవునికి భయపడి) పశ్చాత్తాపం చెంది తన నడవడికను సరిదిద్దుకోవచ్చు." (ఇబ్నె ముబారక్)

ఇబ్నెమస్వూద్, ఇబ్నెఅబ్బాస్ (రజి)ల కథనం: దేవుడు దైవప్రవక్త హ్జత్ ఇబ్రాహీం (అలైహి)ను తన మిత్రుడిగా చేసుకున్నట్లు ప్రకటించాడు. అప్పుడు మరణ దైవదూత మల్కుల్‌మౌత్ దేవునితో "నేను మీ మిత్రుడి దగ్గరకు వెళ్ళి 'దేవుడు మిమ్మల్ని తన మిత్రుడిగా చేసుకున్నాడని శుభవార్త అందజేస్తాను, నాకు అనుమతి ఇవ్వండి" అని విన్నవించుకున్నాడు. దానికి దేవుడు అనుమతి ఇచ్చాడు.

**మలకుల్‌మౌత్ నిజరూపం :** మరణదూత హ్జత్ ఇబ్రాహీం (అలైహి) దగ్గరకు వెళ్ళి ఆయనకు ఈ శుభవార్త అందజేశాడు. అందుకు హ్జత్ ఇబ్రాహీం (అలైహి) దేవుడ్ని స్తుతిస్తూ ఆయనకు కృతజ్ఞతలు సమర్పించుకున్నారు. తరువాత ఆయన మరణదూతతో "మలకుల్‌మౌత్! నీవు ఏరూపంలో అవిశ్వాసుల ఆత్మలను స్వాధీనం చేసుకుంటావో నేను చూడాలనుకుంటున్నాను" అని అన్నారు. దానికి మరణదూత "మీరు నా స్వరూపాన్ని భరించలేరు, మీకా శక్తి లేదు" అన్నాడు. కాని హ్జత్ ఇబ్రాహీం (అలైహి) చూస్తానని పట్టుబట్టారు. "అయితే మీరు కాస్త వెనక్కి తిరిగి ముఖం తిప్పుకోండి" అన్నాడు మరణదూత. హ్జత్ ఇబ్రాహీం (అలైహి) అలాగే వెనక్కి తిరిగి చూశారు.

అలా వెనక్కి తిరిగి చూడగానే ఆయన ముందు అత్యంత భయంకరమైన ఆకారం ప్రత్యక్షమయింది. ఎంతో పొడవైన నల్లటి మనిషి నిల్చున్నాడు. అతని తల నింగిని తాకుతోంది. అతని నోటి నుండి అగ్నిజ్వాలలు వెలువడుతున్నాయి. అతని దేహంపై ఉన్న ప్రతి వెండ్రుక మనిషి ఆకారంలో ఉంది. ఆ మనుషుల నోళ్ళ నుంచి, చెవుల నుంచి కూడా అగ్నిజ్వాలలు వెలువడుతున్నాయి.

హ్జత్ ఇబ్రాహీం (అలైహి) ఎంతో భీతావహాన్ని గొలిపే ఈ అసాధారణ దృశ్యానికి తట్టుకోలేక స్పృహ తప్పారు. కాస్సేపటికి స్పృహ వచ్చి చూస్తే ఆయన ఎదురుగా మరణదూత తన పూర్వరూపంలో కన్పించాడు. "మలకుల్‌మౌత్! అవిశ్వాసికి నీ ఈవికృత రూపమే కాకుండా మరేదైనా ఆపద, బాధ లేకపోయినా కేవలం నీ భయంకరాకారమే అతనికి కఠిన యాతన అవుతుంది" అన్నారు హ్జత్ ఇబ్రాహీం (అలైహి). ఆ తరువాత ఆయన "సరే, ఇప్పుడు నీవు విశ్వాసి ప్రాణం తీసేటప్పుడు ఏ రూపంలో తీస్తావో



చూపించు" అని అడిగారు. "అయితే మీరు కాస్త వెనక్కి తిరగండి" అన్నాడు మరణ దైవదూత మలకుల్‌మౌత్. హ్జత్ ఇబ్రాహీం (అలైహి) వెనక్కి తిరిగారు.

అలా ఆయన వెనక్కి తిరిగి చూడగానే ఆయన ముందు జ్యోతిర్మయ ముఖ వర్చస్సుతో, శ్వేత వస్త్రధారణలో ఒక అందమైన యువకుడు ప్రత్యక్షమయి ఉన్నాడు. హ్జత్ ఇబ్రాహీం (అలైహి) ఆ దృశ్యం చూసి "మలకుల్‌మౌత్! విశ్వాసి నీ ఈ ముఖము, శరీరాకృతులే కాకుండా మరే సుందర దృశ్యం చూడకపోయినా కేవలం అందమైన నీ మోము చూస్తేనే అతనికి కడుపు నిండిపోతుంది" అని అన్నారు. (మౌత్కారుఖుట్కా)

## మరణం ఎవరికి మంచిది?-7

మరణం అంటే సహజంగా ఎవరికైనా భయమే. కాని దేవునిపై, ఆయన ప్రవక్తపై (సల్లం) దృఢమైన విశ్వాసం కలిగివుండి, వారి ఆజ్ఞలను పూర్తిగా పాటించే విశ్వాసి మృత్యువుకు భయపడడు. పైగా అతను సంతోషంగా మృత్యువును స్వాగతిస్తాడు. మహాప్రవక్త (సల్లం) ప్రవచించిన కొన్ని హదీసులు చూడండి:

"మానవుడు (ఇహలోక) జీవితాన్ని ప్రేమిస్తాడు. కాని (సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నుడయి ఉంటే) అతనికి మృత్యువు ఎంతో శ్రేష్ఠమైనది." (బైహఖి)

**'మరణం విశ్వాసి పాలిట కానుక.'** (మిష్కాత్)

"మనిషి మరణాన్ని అసహ్యించుకుంటాడు. కాని (ఇహలోక) పరీక్షలు, ఉపద్రవాల కంటే మరణం ఎంతో మంచిది. ఎందుకంటే మరణం ఎంత తొందరగా వస్తే అంత తొందరగా అతను ఈ పరీక్షలు, ఉపద్రవాల నుండి బయటపడతాడు." (అహ్మద్)

ఓసారి హ్జత్ అబూహురైరా (రజి) ఒకతడ్ని "ఎక్కడికి పోతున్నావు?" అనడిగారు. దానికా వ్యక్తి "బజారుకు వెళ్తున్నాను" అని చెప్పాడు. అప్పుడు హ్జత్ అబూహురైరా (రజి) "వీలైతే నా కోసం మరణం కొని తీసుకురా" అన్నారు. (షరుస్సుదూర్)

అంటే "నాకీ లోకంలో అట్టే ఎంతో కాలం ఉండటం ఇష్టంలేదు; డబ్బుతో మరణం దొరికితే కొని తీసుకురా" అని అర్థం.

**సమాధి పలుకులు :** ఒకసారి దైవప్రవక్త (సల్లం) ఇంట్లో నుంచి బయటికొచ్చి చూస్తే అక్కడ కొందరు విరగబడి నవ్వుతూ ఉండటం కన్పించింది. దైవప్రవక్త (సల్లం) వారితో ఇలా అన్నారు: "జాగ్రత్త! మీరు గనక రుచులను కోసివేసే దాన్ని, అంటే మృత్యువుని ఎక్కువగా గుర్తుకు తెచ్చుకుంటుంటే నేను మిమ్మల్ని ఈ పరిస్థితిలో చూసేవాణ్ణి కాను. కనుక మీరు రుచులు కోసివేసేదాన్ని (మృత్యువుని) ఎక్కువగా జ్ఞాపకం చేసుకుంటూ ఉండండి. సమాధి ప్రతిరోజూ 'నేను అపరిచితమైన గృహాన్ని, నేను ఒంటరితనంగల గృహాన్ని, నేను మట్టిల్లుని, నేను పురుగులుండే గృహాన్ని' అని అంటుంది."

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా తెలియజేశారు: విశ్వసించిన దాసుడ్ని సమాధిలో పూడ్చిన తరువాత అతనితో సమాధి ఇలా అంటుంది: "సుస్వాగతం! నీవు నీ ఇంటికే వచ్చేశావు. నా (భూమి) మీద నడిచేవారందరిలో నీవే నాకెక్కువ ప్రియమైన వాడవు. ఈరోజు నీవు నాకప్పగించబడి నా దగ్గరకు వచ్చావు. ఇక నీ పట్ల నేను ఎంత బాగా ప్రవర్తిస్తానో చూడు." ఆ తరువాత సమాధి కనుచూపు మేర వరకు విస్తరిస్తుంది. ఆ విశ్వాసి కోసం (దైవదూతలు) సమాధిలో స్వర్గం వైపుండే కిటికీ తెరచి పెడ్తారు.

అవిశ్వాసి లేక పాపిని సమాధిలో పూడ్చిపెట్టిన తర్వాత సమాధి ఇలా అంటుంది: "నీరాక చెడ్డరాక. నువ్వు చెడ్డచోటికి వచ్చావు. నా (భూమి) మీద నడిచే వారందరిలో నీవే నాకెక్కువ అసహ్యకరమైనవాడివి. ఈరోజు నిన్ను నాకప్పగించడం జరిగింది. నువ్వు నా అధీనంలోకి వచ్చావు. ఇక చూడు, నీపట్ల నా ప్రవర్తన ఎలా ఉంటుందో."

ఇలా అన్న తర్వాత సమాధి అతడ్ని గట్టిగా అదిమేస్తుంది. దాంతో అతని పక్కటెముకలు విరిగి కుడివైపు ఎముకలు ఎడమవైపు ఎముకలలోకి చొచ్చుకు వస్తాయి. దైవప్రవక్త (సల్లం) ఈ మాట చెబుతూ తన ఎడమచేతి వ్రేళ్ళను కుడిచేతి వ్రేళ్ళలోకి జొప్పించి చూపుతారు. (మిష్కాత్)

**ఆత్మహత్య మహాపాతకం :** కొందరు ఇహలోక కష్టాలు భరించలేక చచ్చిపోతే బాగుంటుందని భావిస్తారు. మరికొందరు ఈ పాడుబతుకు బతకడం కంటే తొందరగా చచ్చిపోవడమే మేలనుకుంటారు. కాని కష్టాలు వచ్చిపడినప్పుడు కంగారుపడి చావును కోరుకోకూడదు. దైవప్రవక్త (స) చావును కోరుకోవడాన్ని వారిస్తూ ఇలా ప్రవచించారు:

"మీలో ఎవరూ ఆపదలకు భయపడి చావును కోరుకోకండి. గత్యంతరం లేని పరిస్థితిలో 'దేవా! నా కోసం జీవితం ప్రయోజనకరంగా ఉన్నంతవరకు నన్ను జీవించి ఉండేలా చెయ్యి. నా కోసం మరణమే ప్రయోజనకరమైన విషయమయితే నాకు మరణం కలిగించు' అని వేడుకోవాలి" (బుఖారి, ముస్లిం)

"మీలో ఎవరూ మరణాన్ని కోరుకోకూడదు. ఒకవేళ అతను సజ్జనుడయితే మరిన్ని సత్కార్యాలు చేయవచ్చు. దుర్జనుడయితే అతను (పాపాలు మానేసి) దైవప్రసన్నతను కోరుకునే అవకాశం ఉంటుంది." (మిష్కాత్)

ఆపదలకు తట్టుకోలేక కొందరు ఆత్మహత్య చేసుకుంటారు. కాని ఆత్మహత్య మహాపాతకం. ఆత్మహత్య వల్ల కష్టాలు తీరకపోగా, అసలైన కష్టాలపర్వం అక్కడ్నుంచే ప్రారంభమవుతుంది. ఆత్మ దేవుడు తన ఆత్మసంపద నుండి మానవునికి ప్రసాదించిన అమానత్. దాన్ని దుర్వినియోగం చేసే అధికారం మానవునికి లేదు.

ఒక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: "కొండ మీద నుంచి పడి ఆత్మహత్య చేసుకున్నవాడు నరకానికి పోయి, మాటిమాటికి కొండ మీద నుంచి త్రోయబడే ఘోరమైన శిక్షను శాశ్వతంగా చవిచూస్తూ ఉంటాడు. విషం తిని ఆత్మహత్య



చేసుకున్నవాడు నరకంలో విషం చేతిలో పట్టుకొని తింటూ ఎల్లప్పుడూ తనను తాను హతమార్చుకుంటూ ఉంటాడు. ఏదైనా ఆయుధంతో ఆత్మహత్య చేసుకున్నవాడు నరకంలో కూడా అలాంటి ఆయుధమే తీసుకొని కడుపులో పొడుచుకుంటూ ఎల్లప్పుడూ తీవ్ర యాతనలు అనుభవిస్తూ ఉంటాడు." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ అబూ ఉమామా కథనం: మేము దైవప్రవక్త (సల్లం) దగ్గర కూర్చున్నాం. దైవప్రవక్త (సల్లం) మాకు హితోపదేశం చేసి మా హృదయాలను మృదువు చేశారు. సాద్ బిన్ అబీవఖ్ఖాస్ (రజి) అయితే (ప్రవక్త హితవులు విని) ఎంతగానో దుఃఖించారు. అలా దుఃఖిస్తూ "అయ్యో! నేను చనిపోతే ఎంత బాగుండు!!" అన్నారు.

దైవప్రవక్త (స) ఈమాట విని "సాద్! ఏమిటీ! నీవు నాముందే కూర్చొని చావును కోరుకుంటున్నావా?" అన్నారు. ఈమాట ఆయన మూడుసార్లు అన్నారు. తరువాత "సాద్! నీవు స్వర్గంకోసం పుట్టించబడిఉంటే, నీ ఆయుష్షువు ఎంతదీర్ఘంగా ఉంటుందో, నీకర్మలు ఎంత బాగుంటాయో అవి నీకెంతో మంచి విషయాలు" అన్నారు. (అహ్మద్)

**చావంటే భయమెందుకు :** హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ (రజి) ఉల్లేఖనంలో దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "ఎవరు (మరణం ద్వారా) దేవుడ్ని కలుసుకోవడానికి ఇష్టపడతాడో దేవుడు కూడా అతడ్ని కలుసుకోవడానికి ఇష్టపడతాడు. మరెవరు దేవుడ్ని కలుసుకోవడానికి ఇష్టపడడో దేవుడు కూడా అతడ్ని కలుసుకోవడానికి ఇష్టపడడు."

ప్రవక్త శ్రీమతి ఒకరు "దైవప్రవక్తా! మా అందరికీ మరణమంటే ఇష్టం లేదు" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు:

"అలాకాదు, విశ్వాసికి మరణం సమీపించినప్పుడు (మరణదూతలు) అతనికి దైవప్రసన్నత, గౌరవోన్నతల్ని గురించిన శుభవార్త అందజేస్తారు. అతనికి తన ముందున్న ఈ విషయాలకంటే మరేమీ ప్రియమైనవి కాలేవు. అతనికి దేవుడ్ని కలుసుకోవడమంటే ఎంతో ఇష్టం. దేవుడు కూడా అతడ్ని కలుసుకోవడానికి ఇష్టపడతాడు. అవిశ్వాసికి మరణం సమీపించినప్పుడు అతనికి దేవుని యాతనలను గురించిన దుర్వార్త అందజేయబడుతుంది. అతనికి తన ముందున్న ఈ విషయం కంటే మరేదీ అప్రియమైనది కాజాలదు. అంచేత అవిశ్వాసి దేవుడ్ని కలుసుకోవడానికి ఏమాత్రం ఇష్టపడడు. దేవుడు కూడా అతడ్ని కలుసుకోవడానికి ఇష్టపడడు. (బుఖారి, ముస్లిం, మిష్కాత్)

దైవపవక్త (సల్లం) తుదిఘడియలు లెక్క పెట్టుకుంటున్న ఒక యువకుని దగ్గరకు వెళ్ళి "ఇప్పుడు నీ పరిస్థితి ఏమిటీ?" అని అడిగారు. దానికా యువకుడు "దైవప్రవక్తా! నేను దేవుని కారుణ్యం ఆశిస్తున్నాను. నా పాపాల పట్ల భయపడుతున్నాను" అని చెప్పాడు. దానిపై దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఇప్పుడున్నట్లు ఈ రెండు విషయాలు ఏ దాసుని హృదయంలో కూడా కలసి ఉండవు. అయితే మరణావస్థలో ఉన్న విశ్వాసికి దేవుడు అతను ఆశించినదాన్ని ప్రసాదిస్తాడు; అలాగే అతను భయపడుతున్న దాన్ని దూరంచేసి శాంతియుతంగా ఉంచుతాడు." (తిర్మిజి, ఇబ్నెమాజ, మిష్కాత్)

అబూదావూద్‌లోని ఒక ఉల్లేఖనం ప్రకారం "అకస్మిక మరణం దైవాగ్రహానికి సూచన" అన్నారు దైవప్రవక్త (సల్లం). బైహఖీలోని ఉల్లేఖనం ప్రకారం "హఠాన్మరణం అవిశ్వాసి పాలిట మాత్రమే దైవాగ్రహానికి సూచన; విశ్వాసి పాలిట దైవకారుణ్యానికి సూచన అవుతుంది." (మిష్కాత్)

**బాటసారిలా జీవించాలి :** హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఈవిధంగా ఉల్లేఖిస్తున్నారు: దైవప్రవక్త (సల్లం) నా భుజం మీద చెయ్యివేసి ఇలా అన్నారు: "నువ్వీ లోకంలో ఒక ప్రయాణీకుడిలా, బాటసారిలా జీవితం గడుపు. నువ్వు సాయంత్రం గడిపిన తరువాత ఉదయం కోసం ఎదురుచూడకు. ఉదయం గడిపిన తరువాత సాయంత్రం కోసం ఎదురుచూడకు. వ్యాధికి పూర్వం ఆరోగ్యాన్ని, మరణానికి పూర్వం జీవితాన్ని మహాభాగ్యాలుగా భావించు." (బుఖారి)

వహీబ్ బిన్ విర్ద్ (రహ్మలై) ఉల్లేఖించిన ఒక ఖుదిసీ హదీసు ప్రకారం దేవుడు ఈవిధంగా చెబుతున్నాడు: "నేను ఏ దాసుణ్ణయితే ప్రపంచం నుండి లేపి కరుణించ దలచుకుంటానో ఆ దాసునికి అతను చేసిన పాపాలకు ఫలితంగా ప్రపంచంలో వ్యాధులు, భార్యాపిల్లల గురించిన ఆపదలు, ఆర్థిక బాధలు కలిగిస్తాను. అప్పటికీ మరికొన్ని పాపాలు మిగిలివుంటే నేనతనికి మృత్యుకాఠిన్యం కలిగిస్తాను. (అంటే కఠినంగా ప్రాణం తీస్తాను.) దాంతో ఆ దాసుడు పుట్టినప్పుడు పాపరహితుడయి ఉన్నట్లు పరమ పావనుడయి నా దగ్గరకు వస్తాడు.

నా గౌరవప్రపత్తుల సాక్షి! నేను ఏ దాసుణ్ణయితే ప్రపంచం నుండి లేపి శిక్షించ దలచుకుంటానో ఆ దాసుడు చేసిన ప్రతి పుణ్యకార్యానికి ప్రతిఫలం నేను ప్రపంచం లోనే అతనికి ఆరోగ్యం, ఉపాధి సమృద్ధి, భోగభాగ్యాల రూపంలో ఇస్తాను. అప్పటికీ మరికొన్ని పుణ్యకార్యాలు మిగిలివుంటే నేనతనికి మృత్యుసౌలభ్యం కలిగిస్తాను. (అంటే తేలికంగా ప్రాణం తీస్తాను.) దాంతో అతను నరకం నుండి కాపాడుకోవడానికి ఎలాంటి పుణ్యంలేనివాడయి పరమపాపిష్ఠిగా నాదగ్గరకు వస్తాడు." (మౌత్కారుఖుట్కా)

మరణదూత విశ్వాసి ప్రాణం తీసేటప్పుడు చాలా మృదువుగా వ్యవహరిస్తాడని కూడా దైవప్రవక్త (సల్లం) తెలియజేశారు. ఆయన ఇలా తెలిపారు: "తల్లి తన బిడ్డ పట్ల ఎంత వాత్సల్యం కనబరుస్తుందో అంతకంటే ఎక్కువ వాత్సల్యం మరణదూత విశ్వాసి పట్ల కనబరుస్తాడు. ఆ శుభాత్మ దేవునికి ఎంతో ప్రియమైనదని, దేవుని దగ్గర దానికి ఎంతగానో గౌరవాదరణలు ఉన్నాయని మరణదూతకు తెలుసు.

అందువల్ల అతను విశ్వాసి పట్ల మృదువుగా ప్రవర్తించి దైవప్రసన్నత పొంద గోరుతాడు. ఆ పుణ్యదాసుని ప్రాణాన్ని పిండి నుండి వెంట్రుకను తీసినట్లు చాలా తేలికగా తీస్తాడు. ఆ దాసుని ఆత్మ దేహం నుండి వెడలగానే ఇతర మరణదూతలు దాన్ని ఆశీర్వదిస్తూ "నీపై శాంతీ శ్రేయాలు వర్షించుగాక! నీవు చేసుకున్న సత్కర్మలకు ప్రతిఫలంగా ఇప్పుడు స్వర్గంలో ప్రవేశించు" అంటారు. (కష్ఫురహ్మాన్)



సత్యం కోసం పోరాడి చంపబడిన విశ్వాసిని "షహీద్" అంటారు. అంటే హతసాక్షి లేక అమరగతుడు అని అర్థం. హతసాక్షి విషయమై దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: "మీకు చీమ కుట్టినప్పుడు ఎంత బాధ కలుగుతుందో హతసాక్షి హతమార్చబడినప్పుడు కూడా అతనికి అంతే బాధ కలుగుతుంది." (మిష్కాత్)

**చనిపోయేవారికి హితబోధ :** మరణావస్థలో ఉండేవారి ముందు కూర్చుని మంచి విషయాలే మాట్లాడాలి. ముఖ్యంగా కలిమాయె తయ్యిబా, యాసీన్ సూరాలు పఠించాలి. ఇక్కడ దైవప్రవక్త (సల్లం) బోధించిన కొన్ని హితోక్తులు వినండి:

"మీరు ఎవరైనా రోగి దగ్గరికిగాని, శవం దగ్గరకుగాని వెళ్తే అక్కడ మంచి మాటలే పలకాలి. ఆ సమయంలో మీరు పలికే పలుకుల పట్ల దైవదూతలు ఆమీన్ (తథాస్తు) అంటారు" (ముస్లిం)

"మీలో మరణావస్థలో ఉన్నవారి చేత లాఇలాహ ఇల్లల్లాహ్ సద్వచనం పఠింప జేయండి" (ముస్లిం)

"ఎవరి నోట (మరణ సమయంలో) తుది పలుకులుగా లాఇలాహ ఇల్లల్లాహ్ సద్వచనం వెలువడుతుందో అతను స్వర్గంలో ప్రవేశిస్తాడు." (అబూదావూద్)

"మీ మృతుల దగ్గర యాసీన్ సూరా చదవండి" (అహ్మద్, అబూదావూద్)

అబూమూసా అష్అరీ (రజి) కథనం: నేను దైవప్రవక్త (స)ను "వ్యాధిగ్రస్తుడికి తన (బంధుమిత్రులు) అందరూ ఎప్పుడు అపరిచితులై పోతారని అడిగాను.

దానికి ఆయన సమాధానమిస్తూ "అతను ఎప్పుడయితే మరణదూతను చూస్తాడో అప్పుడే అందరి నుండి అతని దృష్టి మరలిపోతుంది. ఇక అతను ఎవరినీ గుర్తించలేడు" అని చెప్పారు. (ఇబ్నెమాజ)

మనిషి చనిపోయినప్పుడు ప్రజలు "ఈ మనిషి తన వెనుక (వారసుల కోసం ఏం వదలిపెట్టి పోతున్నాడు?" అని అడుగుతారు. కాని దైవదూతలు "ఈ మనిషి తన కోసం ఇక్కడ్నుంచి పరలోకానికి ఏం తీసికెళ్తున్నాడు?" అని ప్రశ్నిస్తారు. (బైహఖి, మౌత్కారుఖుట్కా)

**భూమ్యాకాశాల పరితాపం :** మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా తెలియ జేశారు: "ప్రతి మానవుని కోసం ఆకాశంలో రెండు ద్వారాలు ఉంటాయి. ఒక ద్వారం గుండా అతని ఆహారం క్రిందికి దిగుతుంది. రెండవ ద్వారం గుండా అతని కర్మలు పైకెక్కి పోతాయి. సత్యాన్ని విశ్వసించిన దాసుడు చనిపోయినప్పుడు అతని మృతిపట్ల ఈ రెండు ద్వారాలు ఏడుస్తాయి". (తిర్మిజి)

"హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం ప్రకారం, విశ్వాసి మృతి పట్ల భూమి నలభై రోజుల దాకా దుఃఖిస్తుంది". (హాకిమ్)

"విశ్వాసి అయిన దైవదాసుడు (నమాజు సందర్భంలో) ఏ భూభాగంపై సాష్టాంగ ప్రణామం చేస్తాడో ఆ భూభాగం ప్రళయదినాన అతనికి అనుకూలంగా సాక్ష్యం చెబుతుంది; అతని మృతి పట్ల రోదిస్తుంది." (మిష్కాత్)

హజ్రత్ ఉమర్(రజి) కథనం ప్రకారం విశ్వాసి చనిపోయినప్పుడు శ్మశానం తనను తాను అలంకరించుకుంటుంది. ఆ శ్మశానానికి చెందిన ప్రతి భూభాగం చనిపోయిన ఆ విశ్వాసిని తనలో ఖననం చేస్తే బాగుండు! అని కోరుకుంటుంది. (ఇబ్నెఅసాకిర్)

## పెడబొబ్బలు నిషిద్ధం-8

మనిషి చనిపోయినప్పుడు అతని బంధుమిత్రులు సహనం వహించాలిగాని, ఏడ్పులు పెడబొబ్బలు పెట్టడం, బట్టలు చించుకోవడం చేయకూడదు.

ఓరోజు ఒక స్త్రీ సమాధి మీద కూర్చొని తన కొడుకు మృతి పట్ల ఏడుస్తుంటే దైవప్రవక్త (సల్లం) అటుగా వచ్చారు. అప్పుడాయన ఆమెను చూసి "దేవునికి భయపడి కాస్త సహనం వహించు" అన్నారు. దానికా స్త్రీ (ముఖం చిట్లించుకుంటూ) "మీ దారి మీరు వెళ్ళండి. నన్ను నా మానాన వదిలెయ్యండి. నా మీద వచ్చిపడిన ఆపద మీ మీద రాలేదు. అందుకని మీరు నా బాధను అర్థం చేసుకోలేరు" అని అన్నది.

**సహనం-స్థయిర్యం :** తరువాత (కొందరు) ఆ స్త్రీకి 'ఆయనగారు దైవప్రవక్త (సల్లం)' అని తెలియజేశారు. ఈ మాట విని ఆమె (పరుగుపరుగున) దైవప్రవక్త (సల్లం) ఇంటికి వెళ్ళింది. చూస్తే ఆయన ఇంటి ముందు ఒక ద్వారపాలకుడు కూడా లేడు. సరే, (ఆ స్త్రీ దైవప్రవక్తను కలుసుకొని) "నేను మిమ్మల్ని గుర్తుపట్టలేకపోయాను. (నన్ను క్షమించండి)" అన్నది. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "ఆపద ప్రారంభంలో పాటించే సహనమే (అసలు) సహనం" అన్నారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) ఇలా అన్నారు: "....దైవసాక్షి! విశ్వాసిని అతని కుటుంబ సభ్యులు ఏడ్వడం వల్ల దేవుడు శిక్షిస్తాడని దైవప్రవక్త (సల్లం) ఎన్నడూ చెప్పలేదు. అవిశ్వాసికి అతని కుటుంబసభ్యులు ఏడ్వడం వల్ల మరింత యాతనకు గురిచేస్తాడని మాత్రమే ఆయన తెలిపారు." ఆ తర్వాత ఆమె "కావాలంటే 'బరువు మోసేవాడెవడూ ఇతరుల బరువు మోయడు' అన్న ఖుర్ఆన్ సూక్తి చూడు" అని చెప్పారు. (బుఖారి)

మరో సందర్భంలో హజ్రత్ ఆయిషా (రజి) ఇలా తెలిపారు: "ఇది అబ్దుల్లా బిన్ ఉమర్ భ్రమ మాత్రమే. ఎలాంటి భ్రమంటే, బదర్ (మైదానం)లోని పాడుబడ్డ గుంటలో హతులు వేయబడిన తరువాత దైవప్రవక్త (సల్లం) దాని ఒడ్డు మీద నిలబడి చెప్పవలసిన విషయాలు చెప్పిన తరువాత, 'వీరు నా మాటలు వింటున్నారని అన్నారని ఆయన అన్నారు. నిజానికి దైవప్రవక్త (అలా అనలేదు.) 'వీరిప్పుడు లోగడ నేను చెబుతూ వచ్చిన విషయాలు నిజమని తప్పకుండా తెలుసుకున్నార'ని మాత్రమే అన్నారు. ఆ తరువాత ఆయన 'నీవు మృతులకు (ఏ విషయమూ) విన్పించలేవు; నీవు సమాధుల్లో



పూడ్చబడిన వారికి ఏదీ విన్పించలేవు' అన్న ఖుర్ఆన్ సూక్తులు (27:80, 35:22) విన్పించారు." (బుఖారి, ముస్లిం)

విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఆయిషా (రజి) కథనం: (యుద్ధంలో) జైద్ బిన్ హారిస్ (రజి), జాఫర్ బిన్ అబూతాలిబ్ (రజి), అబ్దుల్లా బిన్ రవాహా(రజి)లు అమరగతులయ్యారని విన్న తరువాత దైవప్రవక్త (సల్లం) మసీదుకు వెళ్ళారు. ఆయన ముఖారవిందంపై విషాదఛాయలు స్పష్టంగా కన్పించసాగాయి. నేనా సమయంలో తలుపు సందు నుంచి చూస్తుంటే ఒకతను వచ్చి "జాఫర్ కుటుంబ స్త్రీలు ఆయన మృతి పట్ల శోకతాపాలు తీస్తున్నార'ని తెలియజేశాడు.

దైవప్రవక్త (సల్లం) ఈమాట విని "వెళ్ళి వాళ్ళను (ఏడ్పులు,పెడబొబ్బలు) మానెయ్యమని చెప్పు" అని ఆదేశించారు. అతను వెళ్ళివచ్చి ఆ స్త్రీలు తన మాట వినడం లేదని చెప్పాడు. దైవప్రవక్త (సల్లం) తిరిగి "వెళ్ళి వారిని వారించు" అని చెప్పారు. ఆ వ్యక్తి మూడో సారి వెళ్ళొచ్చి "దైవప్రవక్తా! దైవసాక్షి!! ఆ స్త్రీలు ఎంత చెప్పినా వినే స్థితిలో లేరు" అని అన్నాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "వారి నోట మన్ను కొట్టు" అని అన్నారనుకుంటా. నేనా పరిస్థితి చూసి ఆ వ్యక్తితో "దేవుడు నీ ముక్కుకు మట్టి తగిలించ! నువ్వటు దైవప్రవక్త (సల్లం) ఆజ్ఞాపించిన పనీ చేయవు; అటు ఆయన్ని ఊపిరి సలుపుకోనియ్యవు" అని అన్నాను. (బుఖారి)

ఒకసారి హజ్రత్ సాద్ బిన్ ఉబాదా (రజి) వ్యాధిగ్రస్తులయితే దైవప్రవక్త (సల్లం) ఆయన్ని పరామర్శించడానికి వెళ్ళారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) వెంట హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి), సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి), అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి)లు కూడా ఉన్నారు. దైవప్రవక్త (సల్లం) అక్కడకు చేరుకోగానే ఆ ఇంటివాళ్ళు ఆయన చుట్టూ మూగారు. అది చూసి దైవప్రవక్త-సల్లం (సందేహిస్తూ) "ఏమిటీ ఈయన చనిపోయాడా?" అనడిగారు. దానికి వారు చనిపోలేదు దైవప్రవక్తా!" అన్నారు.

ఆతర్వాత దైవప్రవక్త-స (రోగి పరిస్థితి చూసి) కంట తడిపెట్టారు. ఆయన్ని చూసి అందరూ దుఃఖించడం మొదలెట్టారు. తరువాత దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "వినండి, హృదయావేదన కన్నీళ్ళ వల్లగాని లేదా నోట దయార్ద్ర పలుకులు వెలువడటం వల్లగాని దేవుడు మనిషిని శిక్షించడు. అయితే (దైవప్రవక్త తన నోటి వైపు చూపిస్తూ) దీని విషయంలో మాత్రం (పెడబొబ్బలు పెడ్తూ ఏడిస్తే) దేవుడు తప్పకుండా శిక్షిస్తాడు. కుటుంబసభ్యులు ఏడ్చినా సరే మృతునికి శిక్ష ఉంటుంది." (బుఖారి)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) హజ్రత్ అబూసల్మా (రజి) చనిపోయినప్పుడు ఆయన్ని చూడటానికి వచ్చారు. అప్పుడు అబూసల్మా (రజి)కు నిలువుగుడ్లు పడి ఉన్నాయి. దైవప్రవక్త (సల్లం) ఆయన కళ్ళు మూసేశారు. తరువాత ఇలా అన్నారు:

"ప్రాణం తీయబడగానే మృతుని చూపులు మరలిపోతాయి. అతని గృహస్థులు ఏడ్పులు, పెడబొబ్బలు పెడ్తారు. మీరు మంచి విషయం గురించి తప్ప మరే విషయం

గురించి దైవాన్ని వేడుకోకండి. మీరు పలికే పలుకులకు దైవదూతలు తథాస్తు అంటారు.” ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రార్థించారు: “దేవా! అబూసల్మాను క్షమించు. ఇతని హోదాలను జనంలో ఉన్నతం చెయ్యి. జీవించి ఉన్నవారిలో ఇతనికి వారసుడ్ని చెయ్యి. సకలలోకాల ప్రభువా! ఇతడ్ని, మమ్మల్ని మన్నించు. ఇతని సమాధిని విశాలం చెయ్యి. ఇతని కోసం దాన్ని కాంతిమంతం చెయ్యి.” (ముస్లిం)

**శవయాత్ర :** మనిషి చనిపోయిన తరువాత అతని భౌతికకాయాన్ని కర్పూరం, రేగాకులు కలిపిన నీటితో స్నానం చేయించాలి. తరువాత దాన్ని మూడు తెల్ల వస్త్రాలలో చుట్టాలి. ఆ తరువాత జనాజా నమాజ్ చేసి శవాన్ని శ్మశానికి తీసికెళ్ళాలి.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: “మృతదేహాన్ని (శ్మశానికి) తీసికెళ్ళడంలో తొందరచేయండి. ఎందుకంటే మృతుడు పుణ్యాత్ముడయిఉంటే అతడ్ని మీరు సత్పర్యవసానం వైపుకు తీసికెళ్తున్నారన్నమాట. ఒకవేళ అతను పాపాత్ముడైఉంటే అతనొక చెడుమయం. దాన్ని మీరు మీ భుజాల నుండి దించివేయడానికి తీసికెళ్తున్నారన్నమాట. (అందువల్ల మృతదేహాన్ని ఎంత త్వరగా శ్మశానికి చేర్చితే అంత మంచిది.) (బుఖారి)

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: “ప్రజలు మృతుడి భౌతికకాయం ఎత్తుకొని (శ్మశానికి) తీసికెళ్తున్నప్పుడు, అతను పుణ్యాత్ముడయివుంటే 'నన్ను తొందరగా తీసికెళ్ళండి' అంటాడు. ఒకవేళ అతను పాపాత్ముడయివుంటే 'అయ్యయ్యో, నాపాడు గాను! మీరు నన్ను ఎక్కడికి తీసికెళ్తున్నారు' అనంటాడు. అతని పలుకులు మానవులు, జిన్నులు తప్ప యావత్తు సృష్టిరాసులు వింటాయి. మానవులు, జిన్నులు గనక అతని కంఠస్వరం వింటే స్పృహతప్పిపోతారు.” (బుఖారి, ముస్లిం)

**సౌఖ్యం పొందేవాడు, సౌఖ్యం ఇచ్చేవాడు :** ఓ సారి దైవప్రవక్త (స) తన ముందు నుంచి ఒక శవం పోతుంటే చూసి “సౌఖ్యాన్ని పొందేవాడు లేదా సౌఖ్యాన్ని ఇచ్చేవాడు” అన్నారు. అనుచరులు విషయం అర్థంగాక “సౌఖ్యాన్ని పొందేవాడు లేదా సౌఖ్యాన్నిచ్చేవాడు అంటే ఏమిటి దైవప్రవక్తా?” అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ “విశ్వాసి (చనిపోయాక) ఇహలోక కష్టాల నుండి విముక్తిపొంది దేవుని కారుణ్యాఛాయ (స్వర్గం)లో సౌఖ్యం పొందుతాడు. పాపాత్ముడు చనిపోతే ప్రజలు, పట్నం, దేశం, చెట్లు, చతుష్పాదాలు, సర్వానికి అతని కీడు నుండి విముక్తి కలుగు తుంది” అన్నారు. (బుఖారి)

పుణ్యాత్ముడు చనిపోయినప్పుడు అతనికి ఇహలోక ఆపదల నుండి శాశ్వతంగా విముక్తి లభిస్తుంది. పాపాత్ముడు చనిపోయినప్పుడు ప్రజలకు అతని కీడు నుండి శాశ్వతంగా విముక్తి కలుగుతుంది. ఓ కవి ఇలా అన్నాడు:

“నువ్వు చనిపోయిన తరువాత మోక్షం పొందగలిగేలా ఇహలోకంలో జీవితం గడుపు. అంతేగాని, నువ్వు చనిపోయిన తరువాత ప్రజలకు నీ దౌర్జన్యాల నుండి



విముక్తి లభించేలా మాత్రం జీవితం గడపకు. నీకు తెలుసా? నువ్వు పుట్టినప్పుడు అందరూ నవ్వుతుండేవారు. నువ్వేమో ఏడుస్తుండే వాడివి. నువ్వు చనిపోయినప్పుడు అందరూ ఏడుస్తుంటే నువ్వు నవ్వుతూ ఉండేలా ఇక్కడ జీవితం గడుపు.”

**శవాన్ని గౌరవించాలి :** శవం ఏ మతస్థునిదయినా సరే మన సమీపం నుంచి పోతుంటే దానికి గౌరవ సూచకంగా నిలబడిపోవాలి. “మీరు శవం వస్తుండగా చూస్తే నిలబడండి. అది ముందుకు సాగిపోయే వరకు లేదా నేల మీద దించబడే వరకు అలాగే నిలబడండి” అన్నారు దైవప్రవక్త (సల్లం) ఓసారి. (ముస్లిం)

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) ఇల్లా ఉల్లేఖిస్తున్నారు:: మా ముందు నుంచి ఒక శవం వెళ్తుంటే దైవప్రవక్త (సల్లం) దానికి గౌరవసూచకంగా నిలబడి పోయారు. ఆయనతో పాటు మేమూ నిలబడిపోయాం. తర్వాత మేము “దైవప్రవక్తా! ఇది యూదుని శవం కదా?” అన్నాం. దానికి ఆయన “శవం (ఎవరిదైనా) వస్తుండగా చూస్తే నిలబడి పోవాలి” అన్నారు. వేరొక ఉల్లేఖనంలో “ఇది యూదుని శవం కదా అనంటే, యూదుని లో ఉండేది ఆత్మ కాదా? అని ఆయన ఎదురు ప్రశ్న వేశారు” అని ఉంది. (బుఖారి)

## పితృలోకంలో ప్రారంభ స్థితి-9

మనిషి చనిపోయిన దగ్గర్నుంచి పునరుత్థాన దినం వరకు ఆత్మలు ఉండే విచిత్ర పరిస్థితి కలిగిన తాత్కాలిక లోకాన్ని పితృలోకం (ఆలమెబర్జఖ్) అంటారు.

పరలోక శిక్ష అంటే ప్రళయం రావాలి, తుదిదినం తీర్పు జరగాలి, ఆ తరువాత కదా ఈ శిక్షా అనుకుంటారు కొందరు. కాని పాపాత్ముడు నరకశిక్ష చవిచూడటానికి ముందు యమకింకరులతో నడ్డి విరగ్గొట్టించుకొని తీర్పుదినం వరకు సమాధిలో దుర్భర జీవితం గడపవలసి ఉంటుంది. ఇలాంటి పరిస్థితినే దైవతిరస్కారులు మరణావస్థలో కూడా ఎదుర్కొంటారు.

ఇహలోకంలో హత్యా, దోపిళ్ళు చేసిన నేరస్థుడు పోలీసులకు పట్టుబడాగానే “బాబోయ్! నన్ను వదలండి, నేనిక ముందు ఏ నేరం చేయకుండా సాధారణ పౌర జీవితం గడుపుతా”నంటే పోలీసులు దయదలచి అతడ్ని వదలిపెడతారా? ఎన్నటికీ వదలి పెట్టరు. పరలోక విషయం కూడా అలాంటిదే.

**చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే :** “చివరికి వారిలో ఎవరికైనా చావు మూడినప్పుడు అతను (పశ్చాత్తాపంతో) 'ప్రభూ! నేను వదలివచ్చిన ప్రపంచంలోకి నన్ను మరోసారి పంపించు. నేనిప్పుడు (నా ప్రవర్తన మార్చుకొని) సత్కార్యాలు చేస్తాను' అంటాడు. అలా ఎన్నటికీ జరగదు. అతను పనికిమాలిన మాటలు వదరుతున్నాడు. (చనిపోయిన) వారందరి వెనుక ఇప్పుడొక అడ్డుతెర(బర్జఖ్) ఏర్పడింది. పునరుత్థాన దినం వరకు వారా స్థితిలోనే ఉంటారు”. (ఖుర్ఆన్– 23:99,100)

హిందువులలో చాలామంది పునర్జన్మ సిద్ధాంతాన్ని నమ్ముతారు. కాని కాని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ తన "ఇండియన్ ఫిలాసఫీ" గ్రంథం ఒకటవ సంపుటం, 113-116 పేజీలలో "వేదాల్లో పునర్జన్మ సిద్ధాంతం లభించదు" అని రాశారు.

సత్యార్థ విద్యాలంకార్ కూడా తన పునర్జన్మ గ్రంథం 104వ పేజీలో "వేదాల్లో పునర్జన్మ సిద్ధాంతం లేదు. ఈ విషయం గురించి నేను జూదం కూడా ఆడగలను" అని రాశారు. ఇలాగే అనేకమంది ఇతర హిందూపండితులు కూడా పునర్జన్మ ఉందనే వాదనను ఖండించారు.

ప్రాచ్యమతాల అధ్యయనకర్త 'మాక్స్‌ముల్లర్' వేదాలను అధ్యయనం చేసిన తర్వాత "వేదాల్లో పునర్జన్మ సిద్ధాంతం లేదు. అందులో పరలోకవాదమే ఉంది" అని రాశారు.

దైవప్రవక్త (స) పిత్రులోకంలో సంభవించే పరిణామాల్ని గురించి ఇలా తెలిపారు:

"మనిషి శవాన్ని సమాధిలో పూడ్చిపెట్టిన తరువాత అతని (శవాన్ని మోసుకొచ్చిన) సహచరులు తిరిగి వెళ్ళిపోతారు. వారలా వెళ్తుంటే ఆ మనిషి వారి చెప్పుల సవ్వడి వింటాడు. అదే సమయంలో ఇద్దరు దైవదూతలు అతని దగ్గరికి వస్తారు. అతడ్ని లేపి కూర్చోబెట్టి కొన్ని ప్రశ్నలు అడుగుతారు....." (బుఖారి, ముస్లిం)

**మున్కిర్, నకీర్ (పరీక్షదూతలు) :** మహాప్రవక్త (సల్లం) తన ప్రియసహచరుడు హజ్రత్ ఉమర్ (రజి)తో మాట్లాడుతూ "ఉమర్! ప్రజలు నిన్ను సమాధిలో పూడ్చిపెట్టి వెళ్ళిపోయాక నీదగ్గరకు పరీక్ష దూతలు వచ్చినప్పుడు నీ పరిస్థితి ఎలా ఉంటుందో!! (మున్కిర్, నకీర్ అనే) ఆ దూతల కంఠస్వరం గుండెలను అదరగొట్టే (మేఘ)గర్జనలా ఉంటుంది. వారి కళ్ళు మన చూపులను పోగొట్టే మేఘమెరుపుల్లా ఉంటాయి. వారు నిన్ను ఊపేస్తారు, అదరగొడ్తారు. (బెదరగొడ్తూ) అధికార స్థాయిలో మాట్లాడుతారు. అప్పుడు నీ పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించు" అని అన్నారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఈ మాట విని "దైవప్రవక్తా! ఆ సమయంలో మా బుద్ధీ, వివేచనలు సరిగ్గా ఉంటాయా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "ఉంటాయి. ఇప్పుడున్నట్లే అప్పుడు కూడా బుద్ధీవివేచనలు సరిగ్గానే ఉంటాయి" అన్నారు. "అయితే నేను వారి సంగతి చూసుకుంటాను" అన్నారు హజ్రత్ ఉమర్ (రజి). (తబ్రాని)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (స) సమాధి విశేషాలను గురించి ప్రస్తావిస్తూ "ఉమర్! జనం నిన్ను మూడు బారలు, ఒక మూరెడు గుంట తవ్వి అందులో నిన్ను పూడ్చే సమయం కోసం సిద్ధంగా ఉండు. అప్పుడు నీ దగ్గరికి (పరీక్ష దూతలు) మున్కిర్, నకీర్‌లు వస్తారు. వారు నల్లగా (భయంకరంగా) ఉంటారు. తమ పొడవైన శిరోజాలను నేల మీద ఈడుస్తూ వస్తారు. వారి కంఠస్వరం మేఘగర్జనలా ఉంటుంది. వారి నీలిరంగు కళ్ళు ధగధగ మెరుస్తుంటాయి. వారు తమ పొడవైన దంతాలతో నేలను తవ్వుతూ నీ దగ్గరకు వస్తారు. వారు నిన్ను లేపి కూర్చో బెడ్తారు.



నీవు భయభ్రాంతుడవుతావు. వారు నిన్ను ఊపేస్తారు. భయపెడ్తారు. చికాకు పరుస్తారు. (అప్పుడు నీ పరిస్థితి ఎలా ఉంటుందో!)" అని అన్నారు.

ఉమర్ (రజి) ఈ భయానక మాటలు విని "దైవప్రవక్తా! ఆరోజు నా పరిస్థితి ఈరోజు ఉన్నట్లే ఉంటుందా? (అప్పుడు నాకు పూర్తి స్పృహ, వివేచనలుంటాయా?)" అని అడిగారు. దైవప్రవక్త (స) ఉంటాయన్నారు. "అయితే నాకు దేవుడే చాలు. ఆ భయానక క్షణం నుండి నన్ను దేవుడే కాపాడుతాడు" అన్నారు ఉమర్. (బైహఖి)

హజ్రత్ ఆయిషా(రజి) దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! మీరు పరీక్ష దూతలు) మున్కిర్, నకీర్‌ల భయంకరమైన గర్జనలు, సమాధి (మృతుడ్ని) అదిమే యడం గురించి ప్రస్తావించారు. అప్పట్నుంచి నాకు ఏవిషయం వల్ల కూడా మనశ్శాంతి లేకుండాపోయింది" అన్నారు. దైవప్రవక్త (స) ఈమాట విని ఇలా అన్నారు:

"ఆయిషా! కళ్ళకు సుర్మా పెట్టుకుంటే ఎంతచల్లగా ఉంటుందో మున్కిర్, నకీర్‌ల కంఠస్వరం కూడా విశ్వాసి చెవులకు అంత హాయిగా ఉంటుంది. అలాగే ఎవరికైనా తలనొప్పి వస్తే అతని తల్లి ప్రేమతో అతని తల వత్తినప్పుడు అతనికి ఎంత హాయిగా ఉంటుందో విశ్వాసిని సమాధి అదిమినప్పుడు కూడా అంతే హాయిగా ఉంటుంది. ఆయిషా! దేవుని విషయంలో అనుమానించేవారికి నాశనం తప్పదు. కోడిగుడ్డు మీద రాయిపెట్టి అదిమినట్లు అలాంటివారిని సమాధి అదిమేస్తుంది." (తిర్మజి)

**సమాధి పరీక్ష :** "మీరు సమాధులలో పరీక్షించబడతారు. విశ్వాసిని సమాధిలో ఉంచినప్పుడు అతని కర్మలు (భౌతికరూపంలో) అతని చుట్టూ చేరుతాయి. పరీక్ష (నరక)దూతలు ఎటునుండి రావడానికి ప్రయత్నించినా ఆ కర్మలు వారిని నిరోధిస్తాయి.

తరువాత ఒక దైవదూత వచ్చి, 'ఆ వ్యక్తి గురించి నీ అభిప్రాయం ఏమిటి?' అని అడుగుతాడు. విశ్వాసి 'ఎవర్ని గురించి?' అని అడుగుతాడు. 'ముహమ్మద్ (సల్లం)ని గురించి' అనంటాడు దైవదూత. అప్పుడు విశ్వాసి 'ఈయన నిస్సందేహంగా దేవుని ప్రవక్తని నేను సాక్ష్యమిస్తున్నాను' అంటాడు. 'అయితే ఈయన దేవుని ప్రవక్తని నీకెలా తెలుసు?' అని దైవదూత మళ్ళీ ప్రశ్నిస్తాడు. విశ్వాసి 'ఈయన దైవప్రవక్తని నేను సాక్ష్య మిస్తున్నాను' అనంటాడు. అప్పుడతనికి స్వర్గశుభవార్త విన్పించడం జరుగుతుంది.

కాని సత్యతిరస్కారిని సమాధిలో ఉంచినప్పుడు అతడ్ని పరీక్ష దూతల నుండి కాపాడే ఏసత్కర్మా అతని దగ్గర ఉండదు. దైవదూత అడిగిన ప్రశ్నలకు అతను సరైన సమాధానాలు ఇవ్వలేడు. అప్పుడు తలపై అగ్నికణముండే ఒక చతుష్పాదం ప్రత్యక్షమై, అతడ్ని కొరడాతో కొట్టడం ప్రారంభిస్తుంది. అతను ఎంత అరిచి గీ పెట్టినా దానిపై ఎలాంటి ప్రభావం ఉండదు." (అహ్మద్)

ఇది ఉదాహరణకు పేర్కొనబడిన శిక్ష మాత్రమే. ఇదేకాకుండా ఇంకా అనేకరకాల శిక్షలు సమాధిలో దుర్జనులు అనుభవిస్తారు. పరలోక ప్రయాణంలోని ఈతొలి మజిలీ

శిక్ష నుండి తప్పించుకున్నవాడే నిజానికి కృతార్థుడు. దానికోసం సన్నాహాలు చేసుకో వాల్సిన చోటు ఇహలోకమే.

బరా బిన్ ఆజిబ్ (రజి) కథనం: మేము దైవప్రవక్త (సల్లం) వెంట ఒక అన్సారీ ముస్లిం జనాజాలో పాల్గొనడానికి బయలుదేరి శ్మశానికి చేరుకున్నాము. శవాన్ని ఇంకా సమాధిలో పూడ్చి పెట్టలేదు. దైవప్రవక్త (సల్లం) శ్మశానంలో ఓచోట కూర్చున్నారు. మేము కూడా ఆయన చుట్టూ కూర్చున్నాము. మా తలలపై పక్షులు కూర్చున్నాయా అన్నంత సావధానంగా, నిశ్శబ్దంగా మేము కూర్చున్నాము. దైవప్రవక్త (సల్లం) చేతిలో ఒక కర్ర ఉంది. ఆయన ఆ కర్రతో నేల మీద గీస్తూ కాస్సేపటికి తల పైకెత్తి "మీరు సమాధి శిక్ష నుండి దేవుడ్ని శరణు వేడుకోండి" అన్నారు. ఈమాట ఆయన రెండు మూడు సార్లు అన్నారు. తరువాత ఇలా చెప్పారు:

**సమాధిలో విశ్వాసి పరిస్థితి :** "సత్యాన్ని విశ్వసించిన దాసుడు ప్రాపంచిక భవబంధాలు తెంచుకొని పరలోకం వైపు దృష్టిసారిస్తాడు. ఆకాశం నుండి కాంతిమంతమైన ముఖవర్చస్సు కలిగిన అనేకమంది దైవదూతలు అతని దగ్గరకు వస్తారు. వారి ముఖాలు సూర్యునిలా దేదీప్యమానంగా వెలిగిపోతుంటాయి. వారా విశ్వాసి కోసం స్వర్గవస్త్రాలు, స్వర్గ సువాసనలు తీసుకొచ్చి అతని కనుచూపు మేర వరకు కూర్చుంటారు. తరువాత ప్రధాన మరణదూత (హజ్రత్ ఇజ్రాయీల్) అలైహిస్సలాం వచ్చి అతని తలవైపు కూర్చొని "పవిత్రాత్మా! నీ ప్రభువు మన్నింపు, ప్రసన్నతా భాగ్యాల వైపుకు బయలుదేరు" అంటారు. అప్పుడు విశ్వాసి ఆత్మ పరమ సంతోషంతో మరుక్షణమే దేహం నుండి అత్యంత సులభంగా వెలువడుతుంది. దాన్ని ఆయన చేతిలో పట్టుకుంటారు.

అంతలో ఇతర దైవదూతలు రెప్పపాటులో ఆ ఆత్మను ఆయన దగ్గర్నుంచి తీసుకుంటారు. వారు దాన్ని ప్రపంచంలోని అత్యంత సువాసన కస్తూరితో కూడిన వస్త్రంలో చుట్టుకొని తీసికెళ్తారు. దారిలో అనేకమంది దైవదూతలు తారసపడతారు. వారంతా "ఈ పవిత్రాత్మ ఎవరిది?" అని అడుగుతారు. దానికి వారు "ఇది ఫలానా వ్యక్తి కుమారుడు ఫలానా మనిషి ఆత్మ" అని ఇహలోకంలో పిలవబడే అతి శ్రేష్ఠమైన పేరును ప్రస్తావిస్తూ చెబుతారు.

ఈవిధంగా ఆ దైవదూతలు ఇహలోకం సమీపంలోని ఆకాశానికి చేరుకుంటారు. వారు ఆకాశ ద్వారాలు తెరవమంటారు. ద్వారపాలకులు ఆకాశద్వారాలు తెరుస్తారు. విశ్వాసి ఆత్మను పట్టుకున్న దైవదూతలు లోపలికి ప్రవేశిస్తారు. వారిని మొదటి ఆకాశం లోని దైవదూతలు అనుసరిస్తూ ఆ విశ్వాసిఆత్మ వెంట రెండవఆకాశానికి చేరుకుంటారు. ఇలా ప్రతి ఆకాశంలోని దైవదూతలు ద్వారాలు తెరచి ఆ శుభాత్మను ఘనంగా స్వాగతించి ఆశీర్వదిస్తూ దాని వెంట ఏడవ ఆకాశానికి చేరుకుంటారు.

ఏడవ ఆకాశంలోకి వెళ్ళి ఆ ఆత్మను సృష్టికర్త సన్నిధిలో ప్రవేశపెడతారు. (అక్కడ ఆ ఆత్మ సృష్టికర్తకు సాష్టాంగప్రణామం చేస్తుంది.) సృష్టికర్త "నాఈ దాసుని పేరు



ఇల్లీన్ (సత్కర్మల చిట్టా)లో రాసి అతడ్ని తిరిగి భూలోకానికి తీసికెళ్ళండి. నేనితడ్ని (భూలోకపు) మట్టితో సృష్టించాను. అందులోకే ఇతడ్ని పంపిపెడ్తాను. అందులో నుంచే ఇతడ్ని తిరిగి బ్రతికించి లేపుతాను" అని ఆజ్ఞాపిస్తాడు. అప్పుడు దైవదూతలు ఆ ఆత్మను సమాధిలోని ఆ విశ్వాసి దేహంలో తిరిగి ప్రవేశపెడతారు.

సమాధిలో నల్లని శరీరంతో, నీలి కళ్ళతో ఉండే (మున్కిర్, నకీర్ అనే) ఇద్దరు దైవదూతలు వచ్చి అతడ్ని లేపి కూర్చో బెడ్తారు. అతని సమాధి అతని కనుచూపు మేరకు విశాలం చేయబడుతుంది. ఆ సమయంలో అతనికి సూర్యుడు అస్తమిస్తున్నట్లు గోచరిస్తుంది. అప్పుడతను కళ్ళు నులుపుకుంటూ లేచి కూర్చుంటాడు. దైవదూతలను చూడగానే (తనను వారు ప్రశ్నించడానికి వచ్చారని భావించి) "ముందు నన్ను (అసర్) నమాజ్ చేయనివ్వండి" అంటాడు.

(అతని నమాజ్ ముగిసిన) తరువాత దైవదూతలు "నీ ప్రభువు ఎవరు?" అని అడుగుతారు. దానికా వ్యక్తి "నా ప్రభువు అల్లాహ్" అని సమాధానమిస్తాడు. తిరిగి దైవదూతలు "నీ ధర్మం ఏమిటీ?" అని అడుగుతారు. "నా ధర్మం ఇస్లాం" అంటాడతను. "సరే, (రుజుమార్గం చూపడానికి) మీలో ప్రభవించిన మనిషి గురించి నీ అభిప్రాయం ఏమిటీ?" అంటూ దైవదూతలు మళ్ళీ ప్రశ్నిస్తారు. దానికి ఆ పుణ్యాత్ముడు "ఆయన దేవుని ప్రవక్త" అని చెబుతాడు. "ఆయన దైవప్రవక్తని నీకెలా తెలిసింది?" అని అడుగు తారు దైవదూతలు. "నేను దైవగ్రంథం (ఖుర్ఆన్) చదివాను, దాన్ని నమ్మి అది దైవగ్రంథమేనని ధృవపరిచాను" అంటాడా విశ్వాసి.

అప్పుడు ఆకాశం నుండి "నా దాసుడు నిజం చెప్పాడు. అతనికి స్వర్గవస్త్రాలు ధరింపజేసి, స్వర్గపరుపు పరచండి; స్వర్గం వైపుండే కిటికీని తెరచిపెట్టండి" అని అశరీర వాణి విన్పిస్తుంది. అయితే దైవదూతలు మొదట సమాధిలో నరకం వైపుండే కిటికీ తెరుస్తారు. అటువైపు నరకంలోని అగ్నిజ్వాలలు ఒకదాన్నొకటి మింగేస్తూ ఎంతో భయం కరంగా కన్పిస్తాయి. (విశ్వాసి అదిచూసి లోలోన భయపడతాడు.) అంతలోనే దైవదూతలు అతనితో "దేవుడు నిన్ను ఎలాంటి ఆపద నుండి రక్షించాడో చూడు" అంటారు.

ఆ తరువాత సమాధిలో నరకం వైపుండే కిటికీ మూసేసి, స్వర్గం వైపుండే కిటికీ తెరుస్తారు. దాంతో ఆ విశ్వాసి సమాధిలోకి స్వర్గ వాయువు, సువాసనలు వస్తాయి. అప్పుడు దైవదూతలు అతనితో "ఇదే నీ (శాశ్వత)నివాసం. నీవు (ప్రపంచంలో ఇస్లాం పట్ల) విశ్వాస స్థితిలో జీవించావు. విశ్వాస స్థితిలోనే నీకు మృత్యువు వచ్చింది. దైవచిత్త మయితే విశ్వాసస్థితిలోనే నీవు ప్రళయదినాన (సమాధి) నుండి లేస్తావు" అనంటారు.

ఆ తర్వాత ఘాటైన సుగంధ పరిమళంతో ఖరీదైన దుస్తులు ధరించిన సౌందర్య వంతుడైన ఒకతను ప్రత్యక్షమయి "నీకు పరమానందం కల్గించే శుభవార్త విను" అంటాడు. విశ్వాసి అతడ్ని చూసి "ఎవరు నీవు, నీ ముఖంలో మంచితనం చిహ్నాలు కన్పిస్తున్నాయి?" అని ప్రశ్నిస్తాడు. దానికా మనిషి "నేను నీ సత్కర్మల రాసిని" అంటాడు.

విశ్వాసి (ఈమాట వినగానే సంతోషంతో పొంగిపోతూ) "అయితే ప్రభూ! (ఇప్పుడే) ప్రళయం తీసుకురా, నేను (స్వర్గంలోని) నా వాళ్ళు (సుందరాంగులు), భోగభాగ్యాల దగ్గరికి వెళ్తాను" అంటాడు.

**సమాధిలో అవిశ్వాసి పరిస్థితి :** ఇక అవిశ్వాసి విషయానికి వస్తే అతను కూడా ప్రాపంచిక భవబంధాలు తెంచుకొని పరలోకం వైపు దృష్టి సారిస్తాడు. అయితే అతని ప్రాణం తీయడానికి (భయంకరులైన) నల్లని దైవదూతలు ఓ గోనెపట్టా తీసుకొని వస్తారు. వారతని ముందు కనుచూపు మేరదాకా (అత్యధిక సంఖ్యలో కూర్చుంటారు. తర్వాత ప్రధాన మరణదూత మలకుల్‌మౌత్ వచ్చి అతని తల వైపు కూర్చొని "దురాత్మా! దైవాగ్రహం వైపుకు బయలుదేరు" అంటాడు.

కాని ఆ దురాత్మ తీవ్రమైన భయంతో శరీరం నుండి బయటికి రాకుండా లోపలే అటుఇటూ తిరుగుతుంది. అప్పుడు మలకుల్‌మౌత్ ముళ్ళ కంపపై నుంచి తడిసిన గుడ్డ లాగినట్లు అతని దేహం నుంచి ఆత్మను బలవంతంగా లాగి తీస్తాడు. ఆ తరువాత ఇతర దైవదూతలు రెప్పపాటులో అతని చేతి నుండి దాన్ని తీసుకొని గోనెపట్టాలో చుట్టి మొదటి ఆకాశం వైపు తీసికెళ్తారు.

ఆ దురాత్మ నుంచి కుళ్ళిపోయిన శవం నుంచి వెలువడేటటువంటి తీవ్రమైన దుర్గంధం వెలువడుతుంది. దారిలో తారసపడే ఇతర దైవదూతలంతా "ఈ దురాత్మ ఎవరిద"ని అడుగుతారు. దురాత్మను పట్టుకున్న దైవదూతలు "ఇది ఫలానా వ్యక్తి కుమారుడు ఫలానా మనిషి ఆత్మ" అని ఇహలోకంలో పిలువబడే అతి నికృష్టమైన పేరును ప్రస్తావిస్తూ చెబుతారు. ఈ విధంగా వారు ఇహలోక సమీపంలోని ఆకాశానికి చేరుకొని దాని ద్వారం తెరిపించడానికి ప్రయత్నిస్తారు. కాని అక్కడి ద్వారపాలకులు (దురాత్మను అసహ్యించుకుంటూ) ద్వారం తెరవరు.

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచిస్తూ ఇక్కడ "మా సూక్తులు తిరస్కరించి వాటి పట్ల తలబిరుసుతో వ్యవహరించినవారి కోసం ఆకాశ ద్వారాలు ఎన్నటికీ తెరవబడవు. సూది బెజ్జం గుండా ఒంటె దూరడం ఎంత అసాధ్యమో వారు స్వర్గంలో ప్రవేశించడం కూడా అంతే అసాధ్యం" (7:40) అనే ఖుర్ఆన్ సూక్తి పఠించారు.

ఆ తర్వాత సృష్టికర్త "ఈ దాసుని పేరు యావత్తు భూలోకాల కంటే అథఃపాతాళంలో ఉండే 'సిజ్జీన్' (దుష్కర్మల చిట్టా)లో రాసి, అతని ఆత్మను భూలోకం వైపు తీసికెళ్ళండి" అని ఆజ్ఞాపిస్తాడు. మరణదూతలు ఆ దురాత్మను సమాధిలో పూడ్చబడిన దాని దేహంలోకి విసిరిపడ వేస్తారు.

దైవప్రవక్త (సల్లం) ఈ సంగతి చెబుతూ "దేవునికి సాటి కల్పించినవాడు ఆకాశం నుండి అమాంతం అథఃపాతాళంలోకి పడిపోయినట్లే. ఇక అతడ్ని పక్షులైనా పొడుచుకు తింటాయి, లేదా గాలి అయినా ఎత్తి దూరంగా విసిరి పడవేస్తుంది" (22:31) అనే ఖుర్ఆన్ సూక్తి పఠించారు.



ఆ తరువాత ఆ అవిశ్వాసి దగ్గరకు ఇద్దరు దైవదూతలు వచ్చి విశ్వాసిని అడిగినట్లే కొన్ని ప్రశ్నలు అడుగుతారు. దానికతను సమాధానం చెప్పలేక "అయ్యయ్యో, నాకేమీ తెలియదే!" అంటాడు. అప్పుడు ఆకాశం నుండి "అతను అబద్ధమాడాడు. అతనికి అగ్ని వస్త్రాలు కట్టబెట్టి, అగ్నిపడక మీద పండబెట్టండి. అతని కోసం సమాధిలో నరకం వైపుండే కిటికీ తెరచి పెట్టండి" అని అశరీరవాణి విన్పిస్తుంది. దాని ప్రకారం ఆ సత్య తిరస్కారికి ప్రళయందాకా దుర్భరబాధలు కలిగేలా ఏర్పాటవుతుంది.

అయితే దైవదూతలు మొదట అతని సమాధిలో స్వర్గం వైపుండే కిటికీ తెరుస్తారు. అటువైపు స్వర్గంలోని సౌందర్యం, భోగభాగ్యాల దృశ్యం అతనికి కనులపండుగగా కన్పిస్తుంది. అప్పుడు దైవదూతలు అతనితో "(సత్యాన్ని తిరస్కరించడం వల్ల) దేవుడు నిన్ను ఎలాంటి మహాభాగ్యానికి దూరం చేశాడో చూడు" అనంటారు. ఆ తర్వాత వారు ఆ కిటికీని మూసేసి నరకం వైపుండే కిటికీ తెరచిపెడతారు. అటువైపు నరకంలోని అగ్నిజ్వాలలు ఒకదాన్నొకటి మింగేస్తూ భయంకరంగా కనిపిస్తాయి.

అప్పుడు దైవదూతలు "ఇక నీ (శాశ్వత)నివాసం ఇదే. నువ్వు (ప్రపంచంలో జీవితాంతం ఇస్లాం పట్ల) అపనమ్మకంతో జీవించావు. అపనమ్మకంలో ఉన్న స్థితిలోనే నీకు మృత్యువు కాటేసింది. దైవచిత్తమైతే నువ్వు అపనమ్మకంతోనే (ప్రళయదినాన) సమాధి నుండి లేస్తావు" అనంటారు. తర్వాత అతని పక్కటెముకలు విరిగి ఒక వైపు నుంచి మరొక వైపుకు పొడుచుకు వచ్చేటంతగా సమాధి కుంచించుకుపోతుంది.

ఆ తరువాత అత్యంత దుర్వాసనతో కూడిన మురికి బట్టలు ధరించిన ఓ కురూపి అతని దగ్గరకు వస్తాడు. అవిశ్వాసి అతడ్ని చూసి "ఎవరు నీవు, నీ ముఖంలో కీడు చిహ్నాలు కన్పిస్తున్నాయి" అంటాడు. దానికి కురూపి "నేను నీ దుష్కర్మల రాసిని" అని చెబుతాడు. దాంతో అతను (తీవ్రంగా భయపడ్తూ) "అయితే ప్రభూ! ప్రళయం తీసుకురాకు" అంటాడు. (అహ్మద్, అబూదావూద్, మిష్కాత్ హదీసుల ఆధారంగా)

సమాధిలో దాసుడ్ని పరీక్షదూతలు ప్రశ్నించడం అయిన తరువాత అతని ఆత్మను అతని దేహం నుండి వేరే చోటికి తరలిస్తారు. సజ్జనుల ఆత్మలను సప్తమాకాశంలోని "ఇల్లీన్" అనే చోటికి, దుర్జనుల ఆత్మలను ఏడవ పాతాళలోకంలోని "సిజ్జీన్" అనే చోటికి తరలిస్తారు. (షరెసున్న)

**హిందూమత విశ్వాసాలు :** మరణానికి, అంతిమదినానికి మధ్య ఉండే స్థితిని హిందూమత శాస్త్రాలు "పితృలోకం" అంటున్నాయి. పితృలోకం ప్రస్తావనలు వేదాల్లోనూ ఉన్నాయి, పురాణాల్లోనూ ఉన్నాయి.

"ఎవరైతే అగ్నిలో కాల్చబడ్డారో, ఎవరైతే కాల్చబడలేదో వారు మధ్య ఆకాశంలో, తమ మొక్కుబడులు చెల్లించడం ద్వారా సుఖాలను పొందుతున్నారు." (యజుర్వేదం. అధ్యాయం-19, మంత్రం-60)

"యమదూత ఎంతో విజ్ఞుడు. ఆయన చనిపోయిన మనిషి ఆత్మను పితృలోకానికి 'పితృ'గా మారేందుకు పంపిస్తాడు." (అధర్వణవేదం. కాండం18, సూక్తం2, మంత్రం27)

"యముడ్ని దర్శించుకో. పెద్దల ఆత్మలతో కలుపు. స్వాతంత్ర్యం మరియు పుణ్య కార్యాల ప్రతిఫలాన్ని ఉన్నతమైన స్వర్గంలో పొందు. పాపాలను, దౌష్ట్యాలను పారద్రోలి దేదీప్యమానమైన శరీరాన్ని సంపాదించు." (ఋగ్వేదం)

"షడంధ్రాల (దేహం) నుండి బయటపడి ఆత్మ తన రంగు, ఆకారం ప్రకారం అదృశ్యమైన శరీరంలోనికి ప్రవేశిస్తుంది. ఎవరూ ఆ ఆత్మను చూడలేరు. అష్టావయవాలు కనబడని ఆ ఆత్మ ఎల్లప్పుడూ చలనం కలిగే ఉంటుంది. అది ఎలాంటి మార్పు వల్ల గాని, వినాశం వల్లగాని అంతం కాదు.... దుష్టులు రోదిస్తూ, హాహాకారాలు చేస్తూ భీతిల్లుతూ, భయంతో కంపిస్తూ తమ శరీరంపై దెబ్బలు పడుతుండగా యమరాజు గృహానికి వెళ్తారు." (మహాభారతం- పేజీ.370)

## సమాధిలో ఖుర్‌ఆన్ పాత్ర-10

దివ్యఖుర్‌ఆన్ కేవలం పారాయణం చేయడానికి మాత్రమే అవతరించలేదు. ఖుర్‌ఆన్‌ని దైవప్రోక్త గ్రంథమని విశ్వసించిన ప్రతిముస్లిం దాన్ని ఎల్లప్పుడూ అర్థం చేసుకుంటూ చదువుతూ, దాని ప్రకారం ఆచరిస్తుండాలి. అప్పుడే అది మనకు ఇహ లోకంలోనూ, పరలోకంలోనూ ప్రయోజనకారి అవుతుంది. సమాధిలో కూడా అది మనకు ప్రయోజనం చేరూర్చుతుంది.

హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా తెలియజేశారు: రాత్రివేళ మీరు నమాజ్ చేయడానికి నిలబడినప్పుడు ఖుర్‌ఆన్ (బిగ్గరగా పఠించండి. ఆ శబ్దం విని షైతానులు, దుర్మార్గపు భూతాలు పారిపోతాయి. గాలిలో (తేలియాడుతూ) వచ్చేపోయే దైవదూతలు కూడా ఆ శబ్దం వింటారు. ఇంట్లో ఉన్నవారు కూడా విని మీతోపాటు నమాజ్ చేస్తారు. ఈరాత్రి వచ్చేరాత్రికి హితోపదేశం చేస్తూ "ఇతని చివరిరాత్రీ! నీవితనికి సౌలభ్యం కలిగించు" అంటుంది.

విశ్వాసి చనిపోయినప్పుడు ఖుర్‌ఆన్ వచ్చి అతని తలవైపు నిలబడి (శవ) స్నానాన్ని పర్యవేక్షిస్తుంది. అతనికి వస్త్రసంస్కారం జరిగిన తరువాత అతని వస్త్రాలకు, వక్షస్థలానికి మధ్య దూరుతుంది. ఆ దాసుడ్ని ఖననం చేసిన తరువాత సమాధిలో పరీక్ష దైవదూతలు (మున్కిర్, నకీర్) వచ్చినప్పుడు ఖుర్‌ఆన్ మృతుడికి, పరీక్ష దూతలకు మధ్య వచ్చి అడ్డుగా నిలబడుతుంది. అప్పుడు పరీక్ష దైవదూతలు ఖుర్‌ఆన్‌తో "నీవు మా మధ్య నుండి తొలుగు. మేము ఇతడ్ని ప్రశ్నించాలి" అని అంటారు. దానికి ఖుర్‌ఆన్ "దైవసాక్షి! నేనితడ్ని స్వర్గంలో ప్రవేశింపజేయించే వరకూ వదలిపెట్టి పోలేను. మీరితని పట్ల ఏదైనా వ్యవహారం జరపాలని మీకు దైవాజ్ఞ లభిస్తే మీ పని మీరు చేసుకోండి" అని అంటుంది.



ఆ తరువాత పరీక్షదూతలు ఆ దాసునికి కొన్ని ప్రశ్నలు అడుగుతారు. ఖుర్‌ఆన్ అతని వైపు చూస్తూ "నేనెవరో నీకు తెలుసా?" అని అడుగుతుంది. దానికతను తెలియదు అంటాడు. అప్పుడు ఖుర్‌ఆన్ తనను తాను పరిచయం చేసుకుంటూ "నేను ప్రపంచంలో నిన్ను రాత్రివేళల్లో మేల్కొని ఉండేలా, పగటి వేళల్లో ఆకలి దప్పులతో ఉండేలా చేసిన ఖుర్‌ఆన్‌ని. కళ్ళు, చెవులకు సంబంధించిన చెడులకు నిన్ను దూరంగా ఉంచిన ఖురాన్‌ని. ఇప్పుడు నేను నీ శ్రేయస్సు కోరే స్నేహితుడ్ని, ఉత్తమ సోదరుడ్ని. కనుక సంతోషించు. పరీక్షదూతల విచారణ తరువాత ఇక నీకెలాంటి దుఃఖం ఉండదు" అని చెబుతుంది. పరీక్షదూతలు విచారణ తరువాత వెళ్ళిపోతారు.

అప్పుడు ఖుర్‌ఆన్ కూడా తన ప్రభువు దగ్గరకు వెళ్ళిపోతుంది. వెళ్ళి సమాధిలోని ఆ దాసుని కోసం పడక ఇప్పించమని అభ్యర్థిస్తుంది. దానికి పడక, జ్యోతిర్మయ దీపం ఇవ్వమని దేవుడు ఆజ్ఞాపిస్తాడు. వాటిని డెబ్బయివేల మంది దైవసన్నిహిత దూతలు తీసుకొనివెళ్తారు. ఖుర్‌ఆన్ వారికి ముందుగానే ఆ దాసుని దగ్గరకు చేరుకొని "దైవ దాసుడా! నేను వెళ్ళిపోయాక నీకేమీ భయాందోళనలు కలగలేదుకదా? నేను నీకోసం పడక ఏర్పాటు చేయించడానికి దేవుని దగ్గరకు వెళ్ళాను. అందుకే కాస్సేపు నీ నుండి వేరుకావాల్సి వచ్చింది. ఇప్పుడు నేనా వస్తువులు తీసుకొచ్చాను" అని అంటుంది.

అంతలో దైవదూతలు ఆ వస్తువులు తీసుకొచ్చి అతనికి పడక ఏర్పాటుచేస్తారు. తరువాత వారతడ్ని కుడి పక్కకు తిప్పి పడుకోబెట్టి ఆకాశంలోకి అధిరోహించడం ప్రారంభిస్తారు. దాసుడు వారిని చూస్తుంటాడు. ఖుర్‌ఆన్ ఖిబ్లా వైపున్న నేల మీద ఓ దెబ్బ వేస్తుంది. దాంతో సమాధి కనుచూపు మేరకు విశాలమవుతుంది. (ఇబ్నె అబిద్దున్యా)

## పితృలోకంలో పాపపుణ్యాల పర్యవసానం-11

ఒకసారి హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరికి ఒక యూదస్త్రీ వచ్చి సమాధిశిక్ష గురించి ప్రస్తావిస్తూ "దేవుడు నిన్ను సమాధిశిక్షకు దూరంగా ఉంచుగాక!" అన్నది. ఆ తరువాత హజ్రత్ ఆయిషా(రజి) దైవప్రవక్త (స) ముందు ఆ విషయం ప్రస్తావించి, ఇది నిజమేనా? అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "నిజమే. సమాధిశిక్ష యదార్థం" అన్నారు. ఆనాటి నుంచి దైవప్రవక్త (స) నమాజు చేసినప్పుడల్లా సమాధిశిక్ష నుండి దేవుడ్ని శరణు వేడుకునేవారని ఆమె అన్నారు. (బుఖారి, ముస్లిం)

సమాధిలో తేలికపాటి శిక్షలు, బహుమానాలు కూడా ఉంటాయి. అంటే తేలికపాటి బాధలు, తేలికపాటి సుఖాలు ఉంటాయన్న మాట. ఇవి మనిషికి ప్రళయదినం దాకా కొనసాగుతాయి. ఈ శిక్ష, బహుమానాల కోసం తప్పనిసరిగా సమాధే ఉండనవసరం లేదు. మనిషి భౌతికకాయాన్ని కాల్చివేసినా, సముద్రంలో విసిరేసినా, కాకులకు గద్దలకు వదిలేసినా, శవబూడిదను గాలిలోకి విసిరేసినా, ఏవిధంగా ఖననం చేసినా సరే శిక్ష, బహుమానాలు తప్పకుండా ఉంటాయి. సమాధి అనేది శిక్ష, బహుమానాలు అనుభ వించడానికి ఉన్న ఒక గుర్తు (Symbol) మాత్రమే.

హ్రజత్ హుజైఫా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: ఒక వ్యక్తికి మరణ సమయం ఆసన్నమయింది. అతనికి ఇక జీవించే ఆశ కన్పించలేదు. అప్పుడతను తన కుటుంబసభ్యులను పిలిచి ఇలా చెప్పాడు: "నేను చనిపోయిన తరువాత కట్టెలు పేర్చి దానికి నిప్పుపెట్టండి. ఆ నిప్పులో నా శవాన్ని వేసి కాల్చి వేయండి. నిప్పులో నా శరీరం, మాంసం, ఎముకలు బాగా కాలిపోయి బూడిదగా మారిపోయిన తరువాత ఆ బూడిదను తుఫాను వచ్చేరోజు గాలిలో ఎగర వేయండి." ఇలా చెప్పి అతను చనిపోయాడు.

అప్పుడతని కుటుంబసభ్యులు అతను చెప్పినట్లే చేశారు. అయితే దేవుడు ఆ వ్యక్తికి చెందిన అణువణువును కలిపేసి (ప్రాణం పోసి) "దాసుడా! నువ్విలా ఎందుకు చేశావు?" అని అడిగాడు. దానికి ఆ మనిషి "ప్రభూ! నీకు భయపడి ఇలా చేశాను" అన్నాడు. దేవుడు ఈ సమాధానం విని అతడ్ని క్షమించాడు. (బుఖారి)

**ప్రవేశ పరీక్ష :** హ్రజత్ ఉస్మాన్ (రజి) ఏదైనా సమాధిదగ్గర నిలబడినప్పుడు గడ్డం తడిసిపోయేటంత విపరీతంగా దుఃఖించేవారు. ఒకతను ఈపరిస్థితి చూసి "మీరు స్వర్గనరకాల ప్రస్తావన వచ్చినప్పుడు దుఃఖించరు. కాని సమాధిని చూడగానే (ఎంతో బాధపడుతూ) దుఃఖిస్తారేమిటీ?" అని ప్రశ్నించాడు. దానికి హ్రజత్ ఉస్మాన్ (రజి) ఇలా జవాబిచ్చారు:

"దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా తెలిపారు: 'పరలోక గమ్యాలలో సమాధి మొదటి గమ్యం. ఈ గమ్యాన్ని గనక విజయవంతంగా దాటగలిగితే, ఆ తరువాతి గమ్యాలు అంతకంటే సులభంగా ఉంటాయి. ఒకవేళ ఈ గమ్యంలో విజయవంతం కాలేకపోతే ఆ తరువాతి గమ్యాలు అంతకంటే కఠినంగా ఉంటాయి." (తిర్మజి)

హ్రజత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "మీలో ఎవరైనా చనిపోయినప్పుడు (సమాధిలో) అతనికి ఉదయం, సాయంత్రం అతని నివాసస్థలం స్వర్గం లేక నరకం చూపబడుతుంది. చనిపోయినవాడు స్వర్గనివాసి అయివుంటే అతనికి ఉదయం, సాయంత్రం స్వర్గం చూపబడుతుంది. ఒకవేళ అతను నరకనివాసి అయివుంటే అతనికి ఉదయం, సాయంత్రం నరకం చూపబడుతుంది. మృతునికి అతని నివాసస్థలం చూపుతూ 'ఇదే నీ(శాశ్వత) నివాస స్థలం' అని చెప్పబడుతుంది. ప్రళయదినాన దేవుడు అతడ్ని (సమాధి నుండి) లేపే వరకు ఉదయం, సాయంత్రం ఇలాగే జరుగుతుంది." (బుఖారి, ముస్లిం)

**విషసర్పాలు, ఇనుపగదలు :** దైవప్రవక్త (సల్లం) చెప్పిన ఒక హదీసు ప్రకారం సమాధిలో అవిశ్వాసిని శిక్షించడానికి తొంభైతొమ్మిది (99) సర్పాలు ఉంటాయి. ఆ పాములు అతడ్ని ప్రళయదినం దాకా కాటేస్తూ ఉంటాయి. వాటిలో ఒక్కటి కూడా మన భూమండలం వైపు బుసకొడ్తే భూమి మీద (సమస్తం కాలిపోయి ఇక ప్రళయందాకా) ఒక్క మొక్క కూడా మొలవదు. (దార్మి)



దీన్నిబట్టి ఆ సర్పం విషప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి పట్టణాలపై అమెరికా వేసిన అప్పటి చిన్న అణుబాంబు ఎంత ఘోరకలి సృష్టించిందో చాలామందికి తెలుసు. ఈ దుర్ఘటన జరిగి అరవై ఏళ్ళు గడచినా ఆ బాంబు వదలిన దుష్ప్రభావం నుంచి జపానీయులు ఇప్పటికీ బయటపడలేక పోయారు. ఇక సమాధిలోని సర్పం వేసే కాటు ఎంత బాధాకరంగా ఉంటుందో...... ఊహిస్తేనే గుండె ఝల్లుమంటుంది.

అవిశ్వాసి సమాధిలోకి నరకాగ్ని నుండి వెలువడే తీవ్రమైన వడగాల్పులు రావడంతోపాటు, అతడ్ని శిక్షించడానికి భయంకరమైన దైవదూత నియమించబడతాడు. ఆ దైవదూత అంధుడు, చెవిటివాడయి ఉంటాడు. అతని దగ్గర ఒక ఇనుప గద ఉంటుంది. ఆ గదతో అవిశ్వాసిని కొట్టినప్పుడు ఆ దెబ్బ ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందంటే, దాంతో ఏదయినా పర్వతం మీద ఓ దెబ్బ వేస్తే ఆ దెబ్బకు పర్వతం తుత్తునియలయి పోతుంది. (అవిశ్వాసి ఆ గదదెబ్బకు ఒకే ఒక గావుకేక పెట్టి ఊపిరి విడుస్తాడు.) తరువాత ఆ అవిశ్వాసికి మళ్ళీ ప్రాణం పోయడం జరుగుతుంది. (అహ్మద్, అబూదావూద్)

బుఖారి, ముస్లిం గ్రంథాలలోని ఒక ఉల్లేఖనం ప్రకారం గదతో కొట్టినప్పుడు ఆ సత్యతిరస్కారి పెట్టే గావుకేకను మానవులు, జిన్నులు (భూతాలు) తప్ప సమీపంలోని యావత్తు జీవరాసులు వింటాయి. ఒకవేళ మానవులు, జిన్నులు గనక సమాధి శిక్షను కళ్ళారా చూస్తే లేదా ఆ గావుకేకను వింటే వారు గుండెలు పగిలి చనిపోవచ్చు. అందుకే సమాధిశిక్షను దేవుడు రహస్యంగా ఉంచాడు. అదీగాక మనిషి అగోచరాలు, అతీంద్రియాలను విశ్వసించాలని దేవుడు విశ్వాశపరీక్షలో ఒక షరతుగా పెట్టాడు.

"తమ ప్రభువును ప్రత్యక్షంగా చూడకుండానే ఆయనకు భయపడేవారికి పాప మన్నింపు, గొప్ప ప్రతిఫలం లభిస్తాయి."; "మా శిక్ష చూసిన తరువాత వారి విశ్వాసం వారికి ఏమాత్రం ఉపయోగపడలేదు." (దివ్యఖుర్ఆన్-40:85)

**సమాధిపై చెట్టురెమ్మలు :** హ్రజత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: ఒకసారి దైవప్రవక్త (సల్లం) రెండు సమాధుల పక్కగా పోవడం జరిగింది. అప్పుడాయన ఇలా అన్నారు: "ఈ సమాధుల్లోని మృతులు యాతనలు అనుభవిస్తున్నారు. ఈ యాతనలు ఏ పెద్ద విషయాలను గురించి అనుభవించడం లేదు. వారిలో ఒకడు మూత్రశుద్ధితో ఉండేవాడు కాదు. రెండోవాడు చాడీలు చెబుతుండేవాడు. కేవలం ఈ (చిన్న) కారణాల వల్లనే వారు సమాధియాతనలు అనుభవిస్తున్నారు."

ఇలా తెలిపిన తరువాత ఆయన ఓ పచ్చటి రెమ్మ తీసుకొని దాన్ని రెండుగా చీల్చి ఆ రెండు సమాధుల మీద పాతారు. అనుచరులు అలా ఎందుకు పాతారని అడిగారు. దానికి ఆయన "ఈ రెమ్మలు పచ్చగా ఉన్నంత వరకు మృతులకు యాతనలు తగ్గి ఉంటాయని ఆశిస్తున్నాను" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

హజ్రత్ జైద్ బిన్ సాబిత్ (రజి) కథనం: ఓసారి దైవప్రవక్త (సల్లం) తన కంచర గాడిద ఎక్కి బనూనజ్జార్ తెగకు చెందిన ఒక తోటలోకి వెళ్ళారు. మేము కూడా ఆయన వెంటఉన్నాం. అంతలో హఠాత్తుగా కంచరగాడిద బెదిరి పడబోయింది. ఇంకాస్తయితే దైవప్రవక్త (స) క్రింద పడిపోయేవారు. ఆ తోటలో అయిదారు సమాధులు ఉన్నాయి. వాటిని గురించి దైవప్రవక్త (స)"ఇవి ఎవరి సమాధులో మీలో ఎవరికైనా తెలుసా?" అని అడిగారు. దానికి ఒకతను "నాకు తెలుసు" అన్నాడు. దైవప్రవక్త (స) అతడ్ని "వీరు ఎప్పుడు చనిపోయారు?" అని ప్రశ్నించారు. "బహుదైవారాధన ప్రబలివున్న రోజుల్లో చనిపోయారు" అని చెప్పాడా వ్యక్తి. అప్పుడు దైవప్రవక్త (స) విషయం వివరిస్తూ "మనిషి సమాధిలో శిక్షించబడతాడు. నేనీ సమాధిలోని యాతన శబ్దాన్ని వింటున్నాను. మీరు పరస్పరం (మృతదేహాలను) ఖననం చేయడం వదిలేస్తారన్న భయం లేకపోతే ఇప్పుడీ సమాధిలో (మనిషి అనుభవిస్తున్న) యాతనకు సంబంధించిన హృదయవిదారక రోదను నేను మీకు విన్పించేవాడ్ని" అని చెప్పారు. (ముస్లిం)

**ముల్క్, సజ్దా సూరాల ప్రతిఘటన :** ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) అనుచరుడొకాయన ఓసమాధి దగ్గర గుడారం వేసుకొని కూర్చున్నారు. ఆయనకు అక్కడ సమాధి ఉన్న సంగతి తెలియదు. కాస్సేపటికి హఠాత్తుగా ఆ సమాధిలో ఒక మనిషి ఖుర్‌ఆన్‌లోని ముల్క్ సూరా పఠించడం ప్రారంభించాడు. అలా అతను సూరా మొత్తం పఠించాడు. ఆతర్వాత ఆ అనుచరుడు ఈ సంఘటన గురించి దైవప్రవక్త (స) ముందు ప్రస్తావించారు. దైవప్రవక్త (స) ఈమాట విని "ఇది (సమాధి) యాతనను నిరోధించే సూరా. అతడ్ని ఆ యాతన నుండి కాపాడుతోంది" అని చెప్పారు. (మిష్కాత్)

హజ్రత్ ఖాలిద్ బిన్ మాదాన్ (తాబయి-రహ్మాలై) కథనం: తబారకల్లజి బియదిహిల్ ముల్క్ (67వ అధ్యాయం), అలిఫ్ లామ్ మీమ్ సజ్దా (32వ అధ్యాయం)- ఈ రెండు సూరాలు తమను పఠించినవారి కోసం సమాధిలో దేవునితో వాదిస్తాయి. వాటిలో ప్రతి సూరా "నేను నీ (ఖుర్‌ఆన్) గ్రంథంలో ఉంటే నీవితనికి అనుకూలంగా నా సిఫారసును ఆమోదించు. ఒకవేళ నేను నీ గ్రంథంలో లేకపోతే అందులో నుంచి నన్ను తుడిచెయ్యి" అని అంటుంది. ఈ రెండు సూరాలు పక్షులు మాదిరిగా తమను పఠించేవానిపై రెక్కలు జాపి, అతడ్ని సమాధి యాతన నుండి కాపాడుతాయి. (మిష్కాత్)

**నమాజ్, జకాత్, రోజాల ప్రతిఘటన :** సమాధిలో విశ్వాసి పరిస్థితి గురించి దైవప్రవక్త ఇలా తెలియజేశారు: "నాప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! సమాధిలో శవాన్ని పూడ్చిపెట్టి జనం వెళ్ళిపోతున్నప్పుడు ఆ శవం తాలూకు మనిషి వారి చెప్పుల శబ్దాన్ని వింటాడు. అతను గనక విశ్వాసి అయివుంటే అతని నమాజు అతని తల వైపుకు వచ్చిచేరుతుంది. అతని ఉపవాసాలు అతని కుడి వైపుకు వచ్చి చేరుతాయి. అతని జకాత్ (పేదల ఆర్థిక హక్కు) ఎడమ వైపుకు వచ్చి చేరుతుంది. అతని ఐచ్ఛిక నమాజులు, ఐచ్ఛిక దానధర్మాలు, అతను ప్రజలకు చేసిన మేళ్ళకు సంబంధించిన పుణ్యకార్యాలు అతని కాళ్ళ దగ్గరకు వచ్చి చేరుతాయి.



అతని తలాపుకు ఏదైనా యాతన (అజాబ్) వస్తే అతని నమాజ్ 'నా వైపుకు రావడానికి నీకెలాంటి చోటులేదు' అంటుంది. దాంతో యాతన అతని కుడి వైపుకు వస్తుంది. అప్పుడు అతని ఉపవాసాలు 'మా వైపున నీకెలాంటి చోటులేదు' అంటాయి. యాతన మళ్ళీ అతని ఎడమవైపుకు వస్తుంది. అప్పుడతని జకాత్ 'నా వైపున నీకెలాంటి చోటులేదు' అంటుంది. యాతన తిరిగి అతని కాళ్ళ వైపుకు వస్తుంది. అప్పుడు అతని ఐచ్ఛిక నమాజులు, దానధర్మాలు, ఇతర పుణ్యకార్యాలు యాతనకు అడ్డుతగులుతూ 'మా వైపున కూడా నీకెలాంటి చోటు లేదు' అంటాయి." (అత్తర్గీబ్)

**హతసాక్షి (షహీద్) పరిస్థితి :** హజ్రత్ మిఖ్దామ్ బిన్ మాద్ (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "హతసాక్షి (షహీద్) కోసం దేవుని దగ్గర ఆరు బహుమానాలు ఉన్నాయి.

(1) మొదటి రక్తబిందువు క్రిందపడగానే అతను మన్నించబడతాడు. స్వర్గంలో అతని నివాసం అతనికి చూపబడుతుంది. (2) సమాధి యాతన నుండి రక్షణ లభిస్తుంది. (3) (ప్రళయదినాన శంఖారావం గావించినప్పుడు కలిగే) మహా భయాందోళనల నుండి అతను సురక్షితంగా ఉంటాడు. (4) అతని తల మీద గౌరవప్రదమైన కిరీటం పెట్టబడుతుంది. ఆ కిరీటంలోని ఒక రత్నం ప్రపంచం, ప్రపంచంలోని యావత్తు వస్తువుల కంటే ఎంతో శ్రేష్ఠమైనదయి ఉంటుంది. (5) అతనికి సౌఖ్యం కోసం డెబ్భయి రెండు మంది సుందరాంగుల్ని ఇవ్వడం జరుగుతుంది. (6) డెబ్భయి మంది బంధువులకు అనుకూలంగా సిఫారసుచేసే అధికారం కూడా అతనికి ఇవ్వబడుతుంది." (తిర్మజి, ఇబ్నెమాజ)

## స్వప్నంలో బర్జఖ్ యాతనలు-12

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు దేవుడు ఓసారి కలలో పిత్రులోకంలో పాపులు అనుభవించే యాతనలను చూపించాడు. దీన్ని గురించి బుఖారీ గ్రంథంలో ఓ సుదీర్ఘమైన హదీసు ఉంది. దైవప్రవక్తలకు కలలద్వారా చేసే సూచనలు కూడా దివ్యావిష్కృతి (వహీ) స్థాయికి సమానంగా ఉంటాయి. అంచేత దైవప్రవక్త (స)కు ఈ కలలో చూపిన "పిత్రులోక విశేషాలు" వాస్తవంగా సంభవిస్తున్నాయని ముస్లింల విశ్వాసం. ఆయన తన కలలో చూసిన విశేషాలు వివరిస్తూ ఈవిధంగా తెలియజేశారు:

నేను రాత్రి ఓ కల గన్నాను. ఆ కలలో ఇద్దరు వ్యక్తులు నా దగ్గరకు వచ్చారు. వారు నా చేయి పట్టుకొని ఒక పవిత్ర స్థలానికి తీసికెళ్ళారు. అక్కడ ఒక వ్యక్తి కూర్చొని ఉన్నాడు. మరొకతను అతని దగ్గర నిలబడ్డాడు. అతని చేతిలో కొడవలి లాంటి ఒక ఇనుప ఆయుధం ఉంది. అతనా ఆయుధంతో కూర్చున్న వ్యక్తి చెంపను చీల్చుతున్నాడు. ఆవిధంగా అతని ముచ్చలిగుంట దాకా చీల్చివేశాడు. తరువాత రెండవ చెంపను కూడా ఇలాగే చీల్చివేశాడు. నేను "ఏమిటీ వ్యవహారం?" అని అడిగాను దానికి వారిద్దరు "ముందుగు నడవండి" అన్నారు.

మేము ముగ్గురం అక్కడ్నుంచి ముందుకు సాగాము. అలా వెళ్తుంటే మరో దృశ్యం కన్పించింది. ఒక మనిషి పడుకొని ఉన్నాడు. అతని తల వైపున ఒక వ్యక్తి ఓ పెద్ద బండరాయి తీసుకొని నిల్చున్నాడు. అతనా రాయి ఎత్తి పడుకున్న మనిషి తల మీద బలంగా విసిరికొట్టాడు. దాంతో అతని తల పగిలిపోయి రాయి దూరంగా పడిపోయింది. ఆ వ్యక్తి దూరంగా పడిపోయిన రాతిని తీసుకోవడానికి వెళ్ళాడు. అతనా రాయి తీసుకొని తిరిగొచ్చాడో లేదో ఆ మనిషి తల కలిసిపోయి యధాతథంగా మారిపోయింది. ఆ వ్యక్తి మళ్ళీ అదేవిధంగా అతని తల పగలగొట్టసాగాడు. నేను "ఏమిటీ పరిస్థితి?" అని అడిగాను. వారిద్దరు "ముందుకు పదండి." అన్నారు.

మేము ముందుకు నడిచాము. అలా మేము ఒక బిలం దగ్గరకు చేరుకున్నాము. ఆ బిలం నేలలో పాతబడిన మట్టి పొయ్యిలా ఉంది. దాని పైభాగం సన్నగా, క్రింది భాగం వెడల్పుగా ఉంది. అందులో అగ్ని మండుతోంది. ఆ అగ్ని జ్వాలలో దిశమొల లతో ఉన్న కొందరు స్త్రీలు, పురుషులు కాలిపోతున్నారు. ఆ అగ్నిజ్వాలలు పెకి ఎగిసి నప్పుడల్లా వాటితో పాటు ఆ స్త్రీలు, పురుషులు కూడా పైకి లేస్తున్నారు. మరికాస్తయితే వారు ఆ పొయ్యి నుండి బయట పడిపోయేవారు. కాని అంతలోనే అగ్ని జ్వాలలు క్రిందికి పోవడం, వాటితోపాటు వారు కూడా పొయ్యిలో క్రిందికి జారిపోవడం జరుగు తోంది. నేను "ఏమిటీ వ్యవహారం?" అనడిగాను. దానికి వారు "ముందుకు నడవండి (తరువాత చెబుతాం)" అన్నారు.

మేము ముగ్గురం ముందుకు నడిచాము. అలా నడిచి ఒక రక్తపుటేరు దగ్గరకు చేరుకున్నాము. ఆ ఏరు మధ్య ఒక మనిషి నిల్చున్నాడు. ఏటి ఒడ్డు మీద మరొకతను నిలబడ్డాడు. అతని ముందు ఓ రాళ్ళగుట్ట ఉంది. ఏటి మధ్య నిల్చున్న మనిషి ఏటి నుంచి బయటపడేందుకు ఒడ్డు వైపుకు రావడానికి ప్రయత్నిస్తుంటే ఒడ్డుమీద నిల్చున్న వ్యక్తి ఓ రాయి తీసుకొని బలంగా అతని ముఖం మీదికి విసరికొట్టాడు. దాంతో ఆ మనిషి ఏటి మధ్యకు పోయిపడ్డాడు. మళ్ళీ అతను లేచి ఏటి ఒడ్డు వైపుకు రావడానికి ప్రయత్నించడం, ఒడ్డు మీద నిలబడ్డ వ్యక్తి రాయి తీసుకొని అతని ముఖం మీద విసిరి కొట్టడం జరిగింది. ఇలా మాటిమాటికి జరుగుతోంది. నేను "విషయం ఏమిట"ని అడిగా. దానికి నన్ను పిలుచుకొచ్చిన వారు "ముందుకు పదండి" అన్నారు.

మేము ముందుకు సాగాము. కాస్సేపటికి ఒక పచ్చటి తోటలోకి ప్రవేశించాము. అక్కడ ఓ పెద్ద చెట్టుంది. దాని క్రింద ఒక వృద్ధుడు, కొందరు పిల్లలు కూర్చున్నారు. ఆ చెట్టు సమీపంలో మరొక వ్యక్తి కూర్చున్నాడు. అతని ముందు అగ్ని మండుతోంది. దాన్ని అతను మండిస్తున్నాడు. వారిద్దరు నన్ను ఆ చెట్టు ఎక్కించి పైకి తీసికెళ్ళారు. అక్కడ చెట్టు మధ్య ఓ అందమైన ఇల్లుంది. అంతటి అందమైన ఇల్లు నేను ఇదివరకు ఎప్పుడూ చూడలేదు. ఆ ఇంట్లో వృద్ధులు, యువకులు, స్త్రీలు, పిల్లలు ఉన్నారు. వారిద్దరు నన్ను అక్కడ్నుంచి మరికాస్త పైకి తీసికెళ్ళారు. అక్కడ అంతకంటే అందమైన ఇల్లుంది. లోపలికెళ్ళి చూస్తే అందులో వృద్ధులు, యువకులు ఉన్నారు.



నేనిక (ఉండబట్టలేక) "మీరు నన్ను ఈరోజు రాత్రంతా బాగా తిప్పారు. ఇప్పుడైనా చెప్పండి ఈ వ్యవహారాలేమిటో" అని అడిగాను. అప్పుడు వారిలా చెప్పారు:

"మీరు మొదట చెంపలు చీల్చబడుతున్న మనిషిని చూశారు. ఆ మనిషి పరమ అబద్ధీకుడు. అతను అబద్ధాలు చెబుతూ లోకంలో వాటిని ప్రచారం చేసేవాడు. ఆ అబద్ధాలు ఖ్యాతిచెందుతాయి. అందువల్ల అతనికీ శిక్ష పడింది. ఈ శిక్ష ఇలా ప్రళయం దాకా సాగుతుంది. మీరు ఒక మనిషి తల పగల గొడ్తుండటం చూశారు. ఆ మనిషికి దేవుడు ఖుర్‌ఆన్ జ్ఞానం ప్రసాదించాడు. కాని అతను దాన్ని రాత్రి పఠించేవాడు కాదు. పగలు అందులోని విషయాలను ఆచరించే వాడు కాదు. అంచేత అతనికీ శిక్ష పడింది. ఈశిక్ష ప్రళయందాకా సాగుతుంది. మీరు అగ్నిబిలంలో కాలిపోతున్నవారిని చూశారు కదా, వారు వ్యభిచారులు. మీరు రక్తపుటేరులో చూసినవారు వడ్డీ తినేవారు.

మీరు చెట్టు క్రింద చూసిన వృద్ధుడు హజ్రత్ ఇబ్రాహీం (అలైహి). ఆయన చుట్టూ కూర్చున్న పిల్లలు ప్రజల పిల్లలు. ఆ చెట్టు సమీపంలో అగ్ని మండిస్తున్న వ్యక్తి నరక పాలకుడు 'మాలిక్'. మీరు మొదట ప్రవేశించిన ఇల్లు సామాన్య ముస్లింలకు చెందినది. రెండవ ఇల్లు హతసాక్షుల (షహీదుల)కు చెందినది. పోతే నేను జిబ్రీల్ (దైవదూత)ను. ఇతను మికాయీల్ (దైవదూత). సరే, కాస్త తల పైకెత్తి చూడండి."

నేను తల పైకెత్తి చూశాను. పైన ఒక తెల్ల మబ్బుతునక కన్పించింది. వారు నాతో "ఇది నీ ఇల్లు" అన్నారు. "అయితే నన్ను వదలిపెట్టండి. నేను నా ఇంట్లోకి వెళ్ళిపోతాను" అన్నాను నేను. దానికి వారు "మీ ఆయుష్షు ఇంకా తీరలేదు. తీరివుంటే మీరు ఇప్పుడే ఆ ఇంట్లోకి ప్రవేశిస్తారు" అని చెప్పారు. (మిష్కాత్)

## మేరాజ్ సందర్భంలో బర్జఖ్ విశేషాలు-13

దైవప్రవక్త (సల్లం) దైవదూతతో కలసి గగన పర్యటన (మేరాజ్) జరిపినప్పుడు కూడా పితృలోకానికి సంబంధించిన కొన్ని విశేషాలు చూశారు. అవి ఇలా ఉన్నాయి:

**నవ్వు, ఏడ్పుల మనిషి :** హజ్రత్ జిబ్రీల్ (అలైహి) దైవప్రవక్త (సల్లం)ను తీసుకొని అక్కడ్నుంచి ముందుకుసాగారు. కొంత దూరం పోయాక ఓ విచిత్ర దృశ్యం కన్పించింది. ఒక మనిషి కూర్చొని తన కుడివైపు చూసుకొని సంతోషంతో పొంగిపోతూ గలగల నవ్వుతున్నాడు. అంతలోనే ఎడమ వైపు చూసుకొని అమిత దుఃఖంతో రోదిస్తున్నాడు. అతడ్ని చూసి దైవప్రవక్త (సల్లం) ఆశ్చర్యపోయారు.

"ఎవరీ వ్యక్తీ? ఈ విచిత్ర పరిస్థితికి కారణం ఏమిటీ?" అడిగారు ఆయన.

"ఈయన మీ పితామహుడు. ఆదం (అలైహి). తన సంతానమైన మానవులకు ఎదురయ్యే అసాధారణ పరిణామాల గురించిన తలంపే ఈయనగారి ఈ పరిస్థితికి కారణం. కుడి వైపున పుణ్యాత్ముల సత్కర్మలు ఉండటంచేత ఈయన సంతోషిస్తున్నారు. ఎడమ వైపున పాపాత్ముల దుష్కర్మలు చూసి దుఃఖిస్తున్నారు" చెప్పారు జిబ్రీల్ (అలై).

హజ్రత్ ఆదం (అలైహి) అంతిమ దైవప్రవక్త (సల్లం)ను చూసి "ప్రియకుమారా! స్వాగతం! సుస్వాగతం!!" అన్నారు అమిత వాత్సల్యంతో కౌగలించుకుంటూ.

**విభిన్న పాపాత్ములు :** హజ్రత్ జిబ్రీల్ (అలైహి) దైవప్రవక్త (సల్లం)ను తీసుకొని ముందుకు సాగారు. ఒకచోట కొందరు పొలంలో పైరు కోస్తున్నారు. అయితే కోసిన వెంటనే పైరు మళ్లీ మొలుస్తోంది. దైవప్రవక్త (స) అది చూసి "ఎవరీ మనుషులు?"అని అడిగారు. దానికి జిబ్రీల్ (అలైహి) "వీరు దైవమార్గంలో పోరాడేవారు" అని చెప్పారు.

మరోచోట దైవదూతలు కొందరి తలలు పగలగొడ్తున్నారు. జిబ్రీల్ (అలైహి) వాళ్ళను గురించి తెలుపుతూ "వీరు నమాజు చేయడానికి బద్ధకించేవారు" అన్నారు.

మరోచోట కొందరు అతుకుల బట్టలు తొడుక్కొని పశువుల్లా గడ్డి మేస్తున్నారు. వారు జకాత్, ఇతర దానధర్మాలు చేయనివారని చెప్పారు హజ్రత్ జిబ్రీల్ (అలైహి).

వేరొకచోట ఒకతను కట్టెలు పోగుచేసి ఎత్తుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. కాని పైకెత్తుకోలేక పోతాడు. అప్పుడతను మోపులో కట్టెలు తగ్గించడానికి బదులు, మరికొన్ని కట్టెలు చేర్చి ఎత్తుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. హజ్రత్ జిబ్రీల్ (అలైహి) ఆ మనిషిని గురించి తెలుపుతూ "ఇతను మోయలేనన్ని బరువుబాధ్యతలు ఉన్నా వాటిని తగ్గించు కోవడానికి బదులు మరిన్ని బాధ్యతలు మీదేసుకుంటాడు" అని చెప్పారు.

ఇంకోచోట దైవదూతలు కొందరు మనుషుల నాలుకలు, పెదవులను కత్తెరలతో కత్తిరిస్తున్నారు. జిబ్రీల్(అలైహి) విషయం చెబుతూ "వీళ్ళు విశృంఖలంగా ప్రసంగిస్తూ అల్లర్లు, అలజడులు సృష్టించే బాధ్యతారహితులైన ఉపన్యాసకులు" అన్నారు.

ఒకచోట ఒక చట్టుబండలో కాస్త పగులు ఏర్పడి, అందులో నుంచి బాగాబలిసిన ఓ ఆంబోతుఎద్దు బయటికి వచ్చింది. తరువాత ఆ ఎద్దు మళ్ళీ ఆ నెర్రలోకి పోవడానికి ప్రయత్నించింది. కాని ఆ చిన్నరంధ్రంలో దూరలేకపోయింది. హజ్రత్ జిబ్రీల్ ఆ ఎద్దు గురించి చెబుతూ "ఒకతను బాధ్యతారహితంగా సమస్యలు, సంక్షోభాలకు కారణమయ్యే ఓమాట చెప్పి, తరువాత పశ్చాత్తాపంతో దాన్ని దూరం చేయడానికి ప్రయత్నిస్తాడు. కాని అతని ప్రయత్నాలేవీ ఫలించవు. ఈఎద్దు అలాంటి బాపతుకు చెందినదే" అన్నారు.

వేరొకచోట కొందరు తమకు కావాల్సిన మాంసాన్ని తమ దేహాల నుండే కోసుకొని తింటున్నారు. వారు ఇతరుల్ని ఎగతాళి, ఎకసక్కెం చేసేవారని జిబ్రీల్ (అలై) తెలిపారు.

వారికి కొంచెం దూరంలో మరికొందరున్నారు. వారు తమ వాడిఅయిన రాగి గోళ్ళతో తమ ముఖాలను, రొమ్ములను రక్కుకుంటున్నారు. దైవప్రవక్త (సల్లం) వీరెవరని అడిగారు. వీరు ప్రజలను పరోక్షంగా నిందిస్తూ, వాళ్ళలో చెడుల్ని తీసి చూపిస్తూ వారి గౌరవప్రతిష్ఠలను దిగజార్చేవారని తెలిపారు హజ్రత్ జిబ్రీల్ (అలైహి).

మరొకచోట బానకడుపులు కలిగినవారు కొందరున్నారు. వారి పొట్టలు పాములతో నిండిపోయి ఉన్నాయి. వారు వడ్డీ తినేవాళ్ళని చెప్పారు హజ్రత్ జిబ్రీల్ (అలైహి).



వేరొకచోట కొందరు స్త్రీపురుషులు ఉన్నారు. వారికి ఒక వైపు రుచికరమైన ఘుమ ఘుమలాడే మంచి మాంసం ఉంది. మరోవైపు కుళ్ళి కంపుకొడ్తున్న మాంసం ఉంది. అయితే ఆ మనుషులు మంచి మాంసం వదిలేసి కంపుకొడ్తున్న మాంసం తింటున్నారు. వీళ్ళెవరని అడిగితే, "వీళ్ళు ధర్మసమ్మతమైన భార్యలను, భర్తలను వదలి నిషేధితాలతో తమ కోరికలు తీర్చుకునే స్త్రీ పురుషులు" అని చెప్పారు జిబ్రీల్ (అలైహి).

(ఈ విశేషాలు 'మహనీయ ముహమ్మద్[స] ఆదర్శజీవితం' నుండి గ్రహించబడ్డాయి.)

మృతులకు ప్రయోజనంచేకూర్చే విషయాలు:- హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా తెలియజేశారు: "మనిషి చనిపోగానే అతని కర్మలు అంతమైపోతాయి. కాని మూడు విధాల కర్మలు మిగిలి ఉంటాయి. వాటిలో (1) సదఖా-ఎ-జారియా (నిరంతర దానం), (2) ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విద్యాజ్ఞానాలు, (3) చనిపోయిన తండ్రి కోసం ప్రార్థన(దుఆ) చేసే మంచి సంతానం." (బుఖారి, ముస్లిం, అబూదావూద్, తిర్మిజి, ఇబ్నెమాజ)

## చరిత్రలో బర్జఖ్ సంఘటనలు-14

**అబూజహల్ పర్యవసానం :** అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: నేనొక రోజు బదర్‌ప్రాంతం గుండా వెళ్తుంటే హఠాత్తుగా ఒకతను ఓ గుంటలో నుంచి బయటికి రావడం కన్పించింది. అతని మెడలో ఒక ఇనుపగొలుసు ఉంది. అతను నన్ను కేకవేసి పిలుస్తూ "అబ్దుల్లా! నాక్కొంచెం తాగడానికి నీళ్ళివ్వు" అన్నాడు. అతను నన్ను గుర్తుపట్టి నా పేరుపెట్టి పిలిచాడో, లేక అరబ్బులు ప్రతి అపరిచిత వ్యక్తిని పిలిచినట్లు అబ్దుల్లా (దైవదాసుడా) అని పిలిచాడో నాకర్థం కాలేదు. అంతలో ఆగుంటలో నుంచే మరొకతను ప్రత్యక్షమయి వచ్చాడు. అతని చేతిలో ఓ కొరడా ఉంది. అతను నన్ను పిలుస్తూ "అబ్దుల్లా! ఇతను సత్యతిరస్కారి. ఇతనికి నీళ్ళివ్వకు" అన్నాడు. ఆ తర్వాత అతను మొదటి వ్యక్తిని కొరడాతో కొడుతూ తిరిగి ఆ గుంటలోకి తీసికెళ్ళాడు.

ఈ భయానకదృశ్యం చూసిన తర్వాత నేను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి విషయం తెలియజేశాను. దైవప్రవక్త (స) ఈమాట విని "నీవు నిజంగా అలా చూశావా?" అని అడిగారు. నేను నిజంగానే చూశానని చెప్పాను. "అయితే నీవు ఆ గుంటలో నుంచి బయటికి వస్తుండగా చూసిన మొదటివ్యక్తి దైవవిరోధి అబూజహల్. అతనికి అదేవిధంగా ప్రళయదినం దాకా యాతన జరుగుతుంది" అన్నారు దైవప్రవక్త (స). (తబ్రాని)

**వడ్డీవ్యాపారి పర్యవసానం :** ఇబ్నెహజర్ మక్కి కథనం: నేనింకా లేత వయస్సులో ఉన్నాను. అప్పుడు నేను కీర్తి శేషులైన మా తండ్రిగారి సమాధిని దర్శించ డానికి, ఆయన ఆత్మశాంతికోసం ఖుర్‌ఆన్ పఠించి దుఆ(ప్రార్థన) చేయడానికి తరచుగా వెళ్తుండేవాడ్ని. ఒక రోజు రమజాన్ నెల చివరి దశకంలో ఫజ్ర్ నమాజ్ (ప్రభాత సమయం ప్రార్థన) ముగించుకొని శ్మశానానికి వెళ్ళాను. నేను సమాధి మీద కూర్చొని ఖుర్‌ఆన్ పఠిస్తున్నాను. ఆ సమయంలో అక్కడ నేను తప్ప మరెవరూ లేరు. కాస్సేపటికి హఠాత్తుగా

"ఆహ్...ఆహ్..." అనే బాధాకరమైన మూల్గుడు విన్పించసాగింది. తీవ్రమైన ఈ మూల్గుడు శబ్దం విని నా గుండె అదిరిపోయింది. ఈ శబ్దం బహుశా పక్కనున్న సమాధి నుండి వస్తోందని భావించాను. ఆ సమాధి గచ్చుతో పటిష్ఠంగా నిర్మించబడి ఉంది. నేనా సమాధి దగ్గరికెళ్ళి చెవులు రిక్కించి వింటే సమాధిలోని శవం నుండే హృదయ విదారకమైన ఈ శబ్దం వస్తోందని గ్రహించాను.

సూర్యుడు ఉదయించే వేళయింది. భయంకరమైన ఆ మూల్గుడు క్రమంగా తగ్గిపోయింది. కాస్సేపటికి అటుగా ఒక వ్యక్తి వచ్చాడు. నేనతని దగ్గరకు పోయి ఈ సమాధి ఎవరిదని అడిగాను. "ఇదొక వ్యాపారస్థుడి సమాధి. నేనతడ్ని చూశాను. చాలా మంచివాడు. అయిదు పూటల నమాజు క్రమం తప్పకుండా ఆచరిస్తాడు. ఎంతో మౌనంగా ఉంటాడు" అంటూ వివరించాడు ఆ వ్యక్తి. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇంత మంచి మనిషి సమాధిలో ఇలా బాధాకరంగా మూల్గడం ఏమిటో నాకు అర్థం కాలేదు. మొత్తానికి ఏదో బలమైన కారణం ఉండాలి అనుకున్నాను. తరువాత నేను ఆ మనిషి గురించి మరిన్ని వివరాలు కోసం ఆరా తీశాను. అప్పుడు నాకు అతను గొప్ప భక్తుడయినప్పటికీ వడ్డీ తినేవాడని తెలిసింది. వడ్డీ తీసుకుంటే నీ పెట్టుబడి పెరుగుతుందని షైతాన్ భ్రమలు కల్పించి అతడ్ని మోసం చేశాడు. దాంతో ఆ భక్తుడు వ్యాపారి కూడా అయినందున వడ్డీ తీసుకోవడం ప్రారంభించాడు. చివరికి ఇలా సమాధి యాతనలు అనుభవిస్తున్నాడు. (జవాజిర్-మౌత్కారుఘుట్కా)

**అక్రమార్జన ఫలితం :** హజ్రత్ అబూఅబ్దుల్లా ముహమ్మద్ బిన్ వజీర్ (రహ్మలై) తన అనుభవాన్ని ఇలా తెలియజేశారు: "నేనొక రోజు అసర్ నమాజు తరువాత మా ఇంటికి కొంచెం దూరంలో ఉన్న ఒక తోటకు బయలుదేరాను. అటూ ఇటూ తిరుగుతూ సూర్యాస్తమయానికి కొంచెం ముందు ఒక శ్మశానానికి చేరుకున్నాను. కాస్సేపటికి హఠాత్తుగా ఒక సమాధి అగ్నిగుండంలా కాలుతూ కన్పించింది. ఆ సమాధిలోని నిప్పు కణాల మధ్య ఒక వ్యక్తి కూర్చొని హాహాకారాలు చేస్తున్నాడు. నేను ఇది కలో, వాస్తవమో అర్థంకాక కాస్సేపు అయోమయంగా చూసి తర్వాత వాస్తవమేనని నిర్ధారించుకున్నాను. దాంతో నేను భయపడిపోయి ఇంటికొచ్చి వాలాను. నా భార్య అన్నం తెచ్చిపెట్టింది. కాని నాకు తినబుద్ధి కాలేదు. నేను లేచి బయటికెళ్ళాను. కొందరిని కలుసుకొని, జరిగిన సంఘటన వివరించి ఆ సమాధిలో పూడ్చబడిన మనిషి ఎవరని అడిగాను. దానికి వారు, అతను వర్తకబిడారాల నుంచి అక్రమంగా సుంకం వసూలు చేసేవాడని, ఈరోజే చనిపోయాడని తెలిపారు. (మౌత్కారుఘుట్కా)

**సమాధి దొంగ :** ముహమ్మద్ బిన్ హబాన్ సలాలి (రహ్మలై) కథనం: ఒకతను బజారుకు వెళ్ళి ఒక కమ్మరికి చిన్నసైజు మేకులు అమ్మాడు. ఆ మేకులకు రెండేసి తలలు ఉన్నాయి. ఆ మేకులు కొన్న కమ్మరి వాటిని కాల్చి ఏదో చేయాలనుకున్నాడు. కాని ఎంత కాల్చినా అవి మెత్తబడలేదు. సుత్తితో కొట్టినా లాభం లేకపోయింది. దాంతో ఆ కమ్మరి విసిగిపోయి వాటిని అమ్మిన వ్యక్తిని వెతకడానికి బయలుదేరాడు. చివరికి



అతడ్ని కలుసుకొని "ఈ మేకులు నీవు ఎక్కడ్నుంచి తెచ్చావు?" అని అడిగాడు. దానికా వ్యక్తి అవి తనకు దొరికాయని చెప్పాడు. కమ్మరి ఆ మాటలు నమ్మలేదు. అవి కొలిమిలో కాలని సంగతి తెలియజేసి "నిజంగా వాటిని నీవు ఎక్కడ్నుంచి తెచ్చావో చెప్పు" అన్నాడు. అప్పుడతను అసలు విషయాన్ని ఇలా తెలియజేశాడు:

"నేను శ్మశానానికి వెళ్తే అక్కడ ఓ సమాధి తెరచిఉండటం కన్పించింది. అందులో ఉన్న శవం మేకులు కొట్టి బంధించబడి ఉంది. ఆ మేకులు దాని ఎముకలలో దిగబడి ఉన్నాయి. నేను శవం ఎముకలు విరిగిపోకుండా మేకులు ఊడబెరకడానికి ఎంతో ప్రయత్నించాను. కాని ఎంత ప్రయత్నించినా అవి ఊడిరాలేదు. చివరికి నేను రాయితో ఎముకలు విరగ్గొట్టి మేకులు తీసుకున్నాను." (మౌత్కారుఘుట్కా)

**హత్యా పైకంతో హజ్‌యాత్ర :** హజ్రత్ సదఖా బిన్ ఖాలిద్ (రహ్మలై) ఉల్లేఖనం ప్రకారం కొందరు మషాయెఖ్‌ల కథనం: మేము హజ్‌యాత్ర జరపడానికి వెళ్ళాము. తిరిగొచ్చేటప్పుడు మా బృందంలో ఒకతను దారిలో చనిపోయాడు. మేము అక్కడి గ్రామంలో ఒకతని దగ్గర గడ్డపార అడిగి తీసుకొని సమాధి తవ్వాము. ఆ సమాధిలో మా సహచరుడి శవాన్ని పూడ్చిపెట్టాము. పూడ్చిన తరువాత గడ్డపార సమాధిలోనే వదిలేశామే అన్న సంగతి గుర్తొచ్చింది. అంచేత మేము సమాధిని మళ్ళీ తవ్వవలసి వచ్చింది. కాని కాస్తంత తవ్వగానే సమాధిలో ఓ భయంకర దృశ్యం కన్పించింది. ఆ గడ్డపార శవం మెడకు, చేతులకు మధ్య ఉంచి కట్టివేయబడి ఉంది. మేమీ దృశ్యం చూసి వెంటనే సమాధిని మట్టితో పూడ్చేశాము. సమాధిలో నుంచి గడ్డపారను తీయలేక పోయాము. గడ్డపార యజమానికి దాని ధర ఇచ్చి వచ్చాము.

మేము స్వస్థలం చేరుకోగానే మృతుని భార్య దగ్గరకు వెళ్ళాము. ఆమెకు జరిగిన సంఘటన వివరించి పరిస్థితి ఏమిటని అడిగాం. దానికి ఆమె "మా ఆయన ఒకతనితో కలసి ఎక్కడికో వెళ్ళాడు. ఆ మనిషి దగ్గర డబ్బుంది. మా ఆయన దారిలో అతడ్ని హత్య చేసి అతని దగ్గర్నుంచి ఆ డబ్బు తీసుకున్నాడు. ఆ డబ్బుతోనే ఆయన ఈ హజ్‌యాత్ర చేయడానికి వెళ్ళాడు" అని చెప్పింది. (మౌత్కారుఘుట్కా)

**కల్తీ వ్యాపారం :** హజ్రత్ అబ్దుల్ హమీద్ బిన్ మహ్మూద్ మగ్రిబి కథనం: నేను ఓసారి అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) దగ్గరకు వెళ్ళినప్పుడు అక్కడికి కొందరు మనుషులు వచ్చి ఓ సంఘటన గురించి ఇలా తెలిపారు: "మేము హజ్‌యాత్రకు బయలుదేరి జుల్‌సఫా ప్రాంతానికి చేరుకునేటప్పటికి మా సహచరుడొకతను చనిపోయాడు. మేము స్నానం, వస్త్రసంస్కారం చేయించి సమాధి తవ్వడం ప్రారంభించాం. త్రవ్వకం పూర్తయిన తరువాత శవాన్ని సమాధిలో దించుదామని అనుకుంటుండగానే అకస్మాత్తుగా సమాధిలో ఓ పెద్ద నల్లత్రాచు ప్రత్యక్షమయింది. ఆ పాము ఎంత పెద్దదంటే అది మొత్తం సమాధిని ఆక్రమించుకుంది. మేము ఆ సమాధిని వదిలేసి వేరే చోట మరో సమాధి తవ్వాము. కాని అక్కడ కూడా సమాధి

త్రవ్వకం పూర్తికాగానే ఎక్కడ్నుంచో ఇలాంటి పామే వచ్చి చుట్టచుట్టుకొని పడుకున్నది. మేమా సమాధిని వదిలేసి మీ దగ్గరకు వచ్చాం (ఈ విచిత్ర సంఘటనకు కారణం ఏమిటో చెబుతారని)."

హ్రజత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఈ సంగతి విని "అది మృతుడి ఆచరణ, నల్లత్రాచు రూపంలో వచ్చింది. మీరు యావత్తు భూమండలంలో ఎక్కడ సమాధి తవ్వినా అక్కడికి ఈ పాము వస్తుంది. అంచేత మీరు ఏదో ఒక సమాధిలో వేసి పూడ్చిపెట్టండి" అని చెప్పారు. మేము అలాగే ఒక సమాధిలో పూడ్చివేశాం. తరువాత మేము హజ్‌యాత్ర జరిపి వచ్చాము. రాగానే మృతుని ఇంటికి వెళ్ళి అతని భార్యకు విషయం వివరించి అతని ఆచరణ గురించి అడిగాము. దానికామె ఇలా చెప్పింది:

"మా ఆయనగారు ధాన్యపు వ్యాపారం చేస్తుండేవారు. వ్యాపార సరుకు నుంచి ఇంటిఖర్చుల కోసం ఎంత ధాన్యం తీస్తారో అంతే పొట్టు, పుల్లలు, గడ్డిపరకలు వ్యాపార ధాన్యంలో కలిపి అమ్మేవారు. ఈ దుష్కార్యమే ఆయనకు సమాధిలో యాతనకు కారణమయింది." (బైహఖి, ఇబ్నె అబిద్దున్యా)

**ఓ పాపాత్మురాలి పర్యవసానం :** హిజ్రీశకం 697లో జరిగిన విచిత్ర సంఘటనలలో ఓ సంఘటన ఇలాఉంది: తీరప్రాంతంలో నివసించే ఒకతని భార్య చనిపోయింది. అతనామె భౌతికకాయాన్ని ఖననం చేసి ఇంటికి తిరిగొచ్చాడు. అయితే సమాధిలో అతని తువాలు పడిపోయిన సంగతి గుర్తుకొచ్చింది. ఆ తువాలులో కొంత డబ్బుంది. అంచేత అతను తన ఊళ్ళో ఉన్న ఒక ఫిఖాపండితుడ్ని పిలుచుకొని శ్మశానికి వెళ్ళాడు. వెళ్ళి సమాధితవ్వడం ప్రారంభించాడు. ఫిఖాపండితుడు సమాధి ఒడ్డుమీద కూర్చున్నాడు. ఆ వ్యక్తి సమాధిలో శవం మీది మట్టి తొలగించి చూసి అదిరిపడ్డాడు.

ఆ స్త్రీ శవం కూర్చొనిఉంది. ఆమె శిరోజాలతో ఆమె రెండుచేతులు వెనక్కి విరిచి కట్టివేయబడి ఉన్నాయి. ఆమె కాళ్ళు కూడా బిగించి కట్టివేయబడి ఉన్నాయి. ఆమె భర్త ఆమె చేతుల్ని శిరోజాల నుండి విడదీయడానికి ప్రయత్నించాడు. కాని విడదీయలేక పోయాడు. చివరికి అతను తన శక్తినంతా కూడదీసుకొని ఆమె వెంట్రుకలను గట్టిగా లాగి విడదీయడానికి ప్రయత్నించాడు. అప్పుడతను ఆ స్త్రీ శవంతో సహా ఒక్కసారిగా లోపలికి అంతూపంతూ లేకుండా పోయాడు. సమాధి ఒడ్డు మీద కూర్చొని ఈ దృశ్యం చూస్తున్న ఫిఖాపండితుడు తీవ్రమైన భయంతో స్పృహతప్పి పడిపోయాడు. దాదాపు ఇరవై నాలుగు గంటల తరువాత స్పృహలోకి రాగానే ఇంటికి పరుగుతీశాడు.

ఆ తరువాత ఈ సంఘటన గురించి అప్పటి చక్రవర్తికి తెలియజేశాడు. చక్రవర్తి ఆనాటి ప్రఖ్యాత ధర్మవేత్త ఇబ్నె దఖీఖుల్‌ఐద్ (రహ్మాలై)ని పిలిపించి ఆయనకీ సంగతి చెప్పారు. దానిపై ఆయన వ్యాఖ్యానిస్తూ పాపాత్ములు అనుభవించే సమాధి యాతనల్ని గురించి వివరంగా తెలియజేశారు. (తారిఖ్ మక్రేజి- మౌత్కార్ఝుట్కా)



**ఖుర్‌ఆన్ పాఠకుడు :** ఇబ్నెమిందా కథనం ప్రకారం అబున్నసర్ నీషాపూరి అనే ఓ ఉత్తముడైన కాటికాపరి తన అనుభవంలోని ఒక సంఘటన ఇలా తెలియజేశాడు: నేనొక సమాధి తవ్వితే ఆ సమాధిలో మరొక సమాధి బయటపడింది. అందులో సువాసన గుబాళిస్తూ మంచిబట్టలు ధరించి ఉన్న ఓ అందమైన యువకుడు కూర్చొనిఉన్నాడు. అతని ఒడిలో ఆకుపచ్చ అక్షరాలు రాయబడి ఉన్న ఒక గ్రంథం ఉంది. దాన్ని అతను చదువుతూ, నన్ను చూసి "ప్రళయం వచ్చేసిందా?" అని అడిగాడు. నేను రాలేదన్నాను. "అయితే సమాధి మూసెయ్యి" అన్నాడతను. నేను ఎప్పటిలాగే సమాధి మూసేశాను. (తారీఖ్ బగ్దాద్)

**అదృశ్యమయిన శవం :** హ్రజత్ అనస్ (రజి) కథనం: ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ఒక సైనికదళం తయారుచేసి దానికి ఇలావుల్ హ్రజమీ (రజి)ని సేనాపతిగా నియమించారు. నేను కూడా ఆ సైన్యంలో చేరి యుద్ధం చేశాను. మేమా యుద్ధం నుండి తిరిగొస్తుంటే దారిలో మా సేనాపతి (రజి) చనిపోయారు. అప్పుడు మేమా ప్రాంతంలోనే ఒక చోట సమాధి తవ్వి ఆయన భౌతిక కాయాన్ని పూడ్చిపెట్టాము.

అంతలో ఒకతను వచ్చి "ఇది ఎవరి సమాధి?" అని అడిగాడు. "ఇది ఇలావుల్ హ్రజమీ అనే ఓ సత్పురుషుడి సమాధి" అని చెప్పాం. ఆవ్యక్తి మామాటలు విని "ఇది వరదలొచ్చే నేల. వరద వచ్చినప్పుడు నేలలోని వస్తువులు బయటికి వస్తాయి. శవం బయటికి వచ్చేస్తుంది. అందుకని ఈ సత్పురుషుని భౌతికకాయం ఇక్కడ్నుంచి వేరేచోటికి తరలించి పూడ్చిపెట్టండి" అని చెప్పాడు.

మేము అతని సలహా పాటిస్తూ సమాధి తవ్వాము. చాలా లోతుగా తవ్వి చూశాం. కాని మా సేనాపతి శవం కన్పించలేదు. దానికి బదులు ఎంతో విశాలమైన సొరంగం కన్పించింది. అందులో ఒక జ్యోతి దేదీప్యమానంగా వెలిగిపోతోంది. ఈ దృశ్యం చూసి మేము వెంటనే సమాధిని యథాప్రకారం మూసేశాము. (బైహఖీ)

**అమరగతుడైన పల్లెవాసి :** హ్రజత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) కథనం: ఒక పల్లెవాసి దైవప్రవక్త (సల్లం)తో పాటు ఒక యుద్ధంలో పాల్గొన్నాడు. అతనా యుద్ధంలో అమరగతి పొందాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) అతని భౌతికకాయం దగ్గర తలవైపు కూర్చొని సంతోషంతో చిరునవ్వు నవ్వసాగారు. అయితే కాస్సేపటికి అకస్మాత్తుగా అతని వైపు నుండి వేరే వైపుకు తిరిగి ముఖం చాటుచేసుకున్నారు. అనుచరులు ఆశ్చర్యపోతూ విషయం ఏమిటని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) ఇలా సమాధానమిచ్చారు:

"దేవుని దగ్గర అతనికి లభించిన గౌరవౌన్నత్యాలు చూసినేను సంతోషంతో చిరునవ్వు నవ్వాను. కాని ఆ తర్వాత స్వర్గంలోని సుందరాంగుల్లో నుంచి అతనిభార్య వచ్చి అతని తలాపున కూర్చున్నది. అంచేత నేను (పరదా నియమాన్ని దృష్టిలో పెట్టుకొని) వెంటనే ముఖం తిప్పుకున్నాను." (బైహఖి)

**ఆర్గురు యుద్ధఖైదీలు :** హజ్రత్ ఖాసిం బిన్ ఉస్మాన్ (రజి) కథనం: నేను ఓ సారి కాబా ప్రదక్షిణ చేస్తుంటే అక్కడ ఓ చిత్రమైన మనిషిని చూశాను. అతను "దేవా! నీవు నిరాధారుల అవసరాలను నెరవేర్చావు. కాని నా అవసరం ఇంకా నెరవేరలేదు" అని ప్రార్థిస్తున్నాడు. నేను ఆశ్చర్యపోతూ "ఏమిటీ! నీ దగ్గర ఈ విషయం తప్ప మరొకటి లేదా అర్థించడానికి?" అని అడిగాను. అప్పుడతను "నేనీ విషయంలో ఒక సంఘటన గురించి చెబుతా వినండి" అంటూ ఇలా చెప్పడం మొదలెట్టాడు:

మేము విభిన్న పట్టణాలకు చెందిన ఏడుగురు మిత్రులం. మేము ఏడుగురం దైవమార్గంలో శత్రువులతో యుద్ధంచేసి యుద్ధఖైదీలుగా పట్టుబడ్డాము. శత్రువులు మమ్మల్ని విడివిడిగా బంధించి పెట్టారు. తరువాత మమ్మల్నందరినీ హతమార్చాలని నిర్ణయించారు. శత్రువులు మమ్మల్ని వధ్యస్థలానికి తీసికెళ్ళారు. అప్పుడు నేను తల పైకెత్తి ఆకాశం వైపు చూశాను. అక్కడ ఏడు ద్వారాలు తెరచుకున్నాయి. ప్రతి ద్వారం దగ్గర ఒక్కో స్వర్గకన్య నిలబడి ఉంది. ఇటు ఏడుగురు ఖైదీలలో ఒకతడ్ని బయటికి తీసి హతమార్చారు. నేను ఆకాశం వైపు చూస్తే ఒక ద్వారం దగ్గరున్న ఒక స్వర్గకన్య చేతిలో తువాలు తీసుకొని కిందికి దిగింది. అలాగే రెండవ స్వర్గకన్య కూడా. ఇలా ఆర్గురు ఖైదీలు హతమార్చబడినప్పుడు ఆర్గురు స్వర్గకన్యలు కిందికి దిగారు.

ఇక ఒక ద్వారం దగ్గర ఒకే స్వర్గకన్య మిగిలి ఉంది. శత్రువులు నన్ను చంపడానికి సిద్ధమయినప్పుడు కొందరు వచ్చి వారి నుండి నన్ను ఖైదీగా అడిగి తీసుకున్నారు. ఈ విధంగా నా ప్రాణం దక్కింది. కాని అమరగతి (షహాదత్) భాగ్యానికి మాత్రం నేను నోచు కోలేక పోయాను.

సరిగ్గా అదే సమయంలో ఆకాశ ద్వారం దగ్గర నిల్చున్న స్వర్గకన్య నోట "దౌర్భాగ్యుడా! నీలో ఏం లోపం ఉంది, నీవు స్వర్గ భాగ్యానికి దూరమయ్యావు?" అనే మాటలు వెలువడ్డాయి. నేనీ మాటలు నా చెవులారా విన్నాను. ఆ తర్వాత ఆ ఆకాశద్వారం మూసుకుపోయింది.

సోదరా! ఇదీ నా పరిస్థితి. నా దురదృష్టాన్ని తలచుకొని దుఃఖిస్తున్నాను. నా మిత్రులు ఆర్గురు తమ ఆశయాలు సాధించుకున్నారు. నేనొక్కణ్ణే అపజయం పాలయి ఈ భూమండలంపై మిగిలిపోయాను. అందుకే కాబాగృహం దగ్గర కూడా నా నోట మీరిప్పుడు విన్న ఈ ప్రార్థనా పలుకులే వెలువడుతున్నాయి. (బైహఖీ)

**వెయ్యేండ్లు జీవించిన చక్రవర్తి :** ఇబ్నె జౌజీ (రహ్మ) ఇలా ఉల్లేఖిస్తున్నారు: హజ్రత్ ఈసా అలైహిస్సలాం తమ అనుచరులతో కలసి ఎక్కడికో వెళ్తున్నారు. దారిలో ఓచోట ఒక మానవకపాలం కన్పించింది. ఆయన అనుచరులు దాన్ని చూసి "రూహుల్లా (దైవాత్మా)! ఈ కపాలానికి ప్రాణం పోసి మాట్లాడే శక్తి నిచ్చి, ఇది పూర్వం సంభవించిన వింతసంఘటనలు మాకు తెలియజేసేలా చేయమని దేవుడ్ని ప్రార్థించండి. దాని వల్ల మేము గుణపాఠం నేర్చుకుంటాం" అని అన్నారు తమ ప్రవక్తతో.



అప్పుడు ఈసా ప్రవక్త (అలై) రెండురకాతులు నమాజు చేసి దేవుడ్ని ప్రార్థించారు. దేవుడు ఆయన వేడుకోలు స్వీకరించాడు. వెంటనే ఆ కపాలం మాట్లాడసాగింది:

"రూహుల్లా! అడగండి ఏం అడగదలచుకున్నారో. మీకు సమాధానం ఇవ్వమని దేవుడు నన్ను ఆదేశించాడు" అన్నది కపాలం. "ఈ ప్రపంచంలో జీవించి ఉన్నప్పుడు నీవు ఎవరివి? నీ గురించిన విశేషాలు ఏమిటీ?" అని అడిగారు హజ్రత్ ఈసా (అలైహి). అప్పుడు కపాలం ఇలా అన్నది:

"నేనీ ప్రాంతానికి చక్రవర్తిని. వెయ్యేండ్లు జీవించాను. వేయిమంది సంతానం కన్నాను. వేయి పట్టణాలు జయించాను. వేయి సైన్యాలను ఓడించాను. వేయిమంది రాజులను హతమార్చాను. చివరికి ఈ చక్రవర్తిని మృత్యువు కబళించింది. నేను జీవిత సత్యాన్ని తెలుసుకున్నాను. దైవభీతి, భక్తిపరాయణతలకు మించిన మహాభాగ్యం మరొకటి లేదని; అత్యాశ, మితిమీరిన కోర్కెల వల్ల వినాశం తప్ప మరేమీ లభించదని నాకిప్పుడు అర్థమైపోయింది. మన అదృష్టంలో దేవుడు రాసిన రాత పట్ల తృప్తి చెందడం లోనే ఎక్కువ గౌరవముంది." (మౌత్కారుఖుట్కా)

## అప్పు తెచ్చే ముప్పు -15

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: విశ్వాసి (మోమిన్) చనిపోయిన తరువాత అతని ఆత్మ కేవలం అప్పు కారణంగా (ఆకాశానికి ఎక్కలేక) ఒక చోట ఆగిపోతుంది. అప్పు తీర్చనిదే అతని ఆత్మ స్వర్గానికి చేరుకోలేదు. (తిర్మజి, ఇబ్నెమాజ, బైహఖీ)

ఎంతో అవసరమయితే తప్ప అప్పు చేయడాన్ని దైవప్రవక్త (సల్లం) ఇష్టపడేవారు కాదు. ఒక వ్యక్తి ధర్మసంస్థాపనా మార్గంలో అమరగతి (షహాదత్) పొందినప్పటికీ చేసిన అప్పు తీర్చకపోతే మాత్రం దేవుడు అతడ్ని క్షమించడని తెలుస్తోంది.

"దైవమార్గంలో ప్రాణాలర్పించిన వ్యక్తి పాపాలన్నీ క్షమించబడతాయి, ఒక్క అప్పు తప్ప" అని దైవప్రవక్త (సల్లం) తెలిపారు. (ముస్లిం)

**అప్పు అబద్ధానికి ఆప్తబంధువు :** ఆయన ఒకసారి "దేవా! నేను పాపం నుండి, రుణ(భారం) నుండి నీ శరణు కోరుతున్నా"నని అన్నారు. అప్పుడు ఒక అనుచరుడు "దైవప్రవక్తా! మీరు తరచుగా రుణం నుండి శరణు కోరుతున్నారేమిటీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "మనిషి అప్పుల పాలైనప్పుడు మాట్లాడితే అబద్ధమాడుతాడు; వాగ్దానం చేస్తే దాన్ని నిలబెట్టుకోలేడు" అన్నారు. (బుఖారి)

హజ్రత్ అనస్ (రజి) కథనం: మేము ఓరోజు దైవప్రవక్త (సల్లం) దగ్గర కూర్చొని ఉంటే కొందరు ఒక జనాజా (శవం) తెచ్చి జనాజానమాజ్ (శవప్రార్థన) చేయమన్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) వారిని "ఈ మృతుని మీద రుణభారం ఏదైనా ఉందా?" అని అడిగారు. వారు ఉంది అన్నారు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని ఇలా అన్నారు:

"ఇలాంటి మనిషి కోసం జనాజానమాజ్ చేయడం వల్ల లాభం ఏమిటీ? ఇతని ఆత్మ సమాధిలో ఆగిపోయింది. ఆకాశం వైపు అధిరోహించలేదు. మీలో ఎవరైనా ఇతని అప్పు తీరుస్తామని హామీఇస్తే నేనితని జనాజానమాజ్ చేస్తాను. లేకపోతే చేయలేను. ఎవరైనా ఇతని అప్పు తీర్చడంగాని, లేదా తీరుస్తామని హామీనివ్వడంగాని జరిగినప్పుడే నేను చేసే జనాజానమాజు వల్ల ఇతనికి ప్రయోజనం చేకూరుతుంది." (తబ్రాని)

**త్రిశంకు స్వర్గంలో రుణగ్రస్తుడు :** హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) ఒకరోజు ప్రభాతవేళ ప్రార్థన (ఫజర్ నమాజ్) చేసిన తర్వాత "ఇక్కడ హుజైల్ తెగ మనిషి ఎవరైనా ఉన్నాడా? మీ సోదరుడు స్వర్గద్వారం దగ్గర నిరోధించబడ్డాడు, అతను చేసిపోయిన అప్పు కారణంగా" అని అన్నారు. (తబ్రాని)

హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఎవరైనా అప్పు చేసి దాన్ని తీర్చకుండా చనిపోతే, కేవలం ఆ అప్పు కారణంగా అతను నిర్బంధానికి గురవుతాడు. తన అసహాయత, ఒంటరితనాలను గురించి దేవునికి మొర పెట్టుకుంటాడు. అప్పు తీరగానే అతని ఆత్మ గమ్యానికి చేరుకుంటుంది." (తబ్రాని)

షైబాన్ బిన్ జుబైర్ (రజి) కథనం: మా నాన్న అబ్దుల్‌వాహిద్ బిన్‌జైద్ గారు ఒక యుద్ధంలో పాల్గొనడానికి వెళ్తుంటే దారిలో ఒక చోట ఓ పెద్ద లోతైన బావి కన్పించింది. ఆ బావిలో నుంచి బాధతో మూల్గుతున్న ఓ మనిషి కంఠస్వరం విన్పిస్తుంటే, అదేమిటో చూడటానికి ఒకతను అందులోకి దిగాడు. దిగిచూస్తే ఒక మనిషి ఆసనంపై కూర్చొని ఉన్నాడు. ఆసనం కింద నీళ్ళున్నాయి. బావిలో దిగి చూస్తున్న వ్యక్తి అతనితో "నీవు మనిషివా లేక భూతానివా? మనిషివైతే నీ వాస్తవ పరిస్థితి ఏమిటో చెప్పు" అన్నాడు.

అప్పుడు బావిలో ఆసనం మీద కూర్చున్న మనిషి తన గోడు చెబుతూ "నేను మనిషినే. అంతాకియా నివాసిని. నేను చనిపోయిన తరువాత ఇక్కడ బంధించబడ్డాను. నామీద కొంత రుణభారం ఉండిపోయింది. నా కొడుకు అంతాకియాలో ఉన్నాడు. కాని వాడు నన్ను జ్ఞాపకం చేయడంలేదు. నేను చేసిన అప్పు కూడా తీర్చడంలేదు. అప్పు తీర్చితే నేనీ దుర్గతి నుండి బయటపడతాను" అని అన్నాడు.

ఈమాట విన్న తర్వాత బావిలో దిగిన వ్యక్తి బయటికి వచ్చాడు. బయటికి వచ్చి విషయం తన సహచరునికి వివరించాడు. ఇద్దరు ఒక నిర్ణయం తీసుకుంటూ తాము యుద్ధంలో పాల్గొని తమకు లభించే సమరసొత్తులో నుంచి కొంత సొమ్ము తీసి అతని అప్పు తీర్చుదాం అని చెప్పుకున్నారు. ఆ విధంగా వారిద్దరు అతని అప్పు తీర్చారు.

తరువాత వారు మరోసారి అటుగా ప్రయాణం చేస్తూ ఆ బావి దగ్గరకు పోయి లోపలికి తొంగిచూశారు. బావిలో ఆ మనిషి కన్పించలేదు. ఆరోజు రాత్రి వారిద్దరు మిత్రులు అక్కడే పడుకున్నారు. ఆరాత్రి వారి కలలో ఆ మనిషి కన్పించి "దైవం మీకు పుణ్యఫలం ప్రసాదించుగాక! మీరు నాఅప్పు తీర్చారు. దాంతో నేనిప్పుడు స్వర్గానికి చేరుకున్నాను" అని చెప్పాడు. (ఇబ్నె అబిద్దున్యా)



# ప్రపంచ జీవితం-దాని పరమార్థం-16

విశ్వవ్యవస్థ-మానవసృష్టి అనే విషయం మీద అనాది నుంచే వాదోపవాదాలు జరుగుతున్నాయి. మతపండితులు, మత ప్రమేయంలేని తత్వవేత్తలు ఈ విషయంపై సుదీర్ఘ పరిశోధనలు జరిపి తమతమ అభిప్రాయాలు వెలిబుచ్చారు. మానవునిగా మనుగడ సాగించదలచిన ప్రతి మనిషికీ ఇది ఎంతో ముఖ్యమైన విషయం.

ఏమిటీ ఈ జీవితం? మానవుడు ఎందుకు సృజించబడ్డాడు? అతని పుట్టుక ఆంతర్యం ఏమిటి? అసలు మానవుడు తనంతటతానే ఉనికిలోకి వచ్చాడా లేక అతని ఉనికి వెనుక మరేదైనా అదృశ్య శక్తి ఉన్నదా? ఉంటే మానవుడ్ని సృష్టించడంలో ఆ అదృశ్యశక్తి ఉద్దేశ్యం ఏమిటి? ప్రపంచ జీవితంలో మానవుని నిజస్థానం ఏమిటి? అతడు ప్రపంచంలో చేసిన కర్మలకు బాధ్యుడు కాడా? ప్రపంచ జీవితమే అసలు జీవితమా? లేక ఈ జీవితం తరువాత మరో జీవితం కూడా ఏదైనా ఉందా?

ఈ ప్రశ్నలు బుద్ధీ, వివేచనలున్న ప్రతి మానవమేధను సహజంగా తొలచివేస్తాయి. వీటికి సరైన సమాధానాలు అన్వేషించి తద్వారా ఈ సువిశాల విశ్వవ్యవస్థలో తన అసలు స్థానం ఏమిటో తెలుసుకోవాలని భావిస్తాడు. వివిధమతాలు, విభిన్న సిద్ధాంతాలు తమకు తోచిన రీతిలో ఈ ప్రశ్నలను పరిష్కరించడానికి ప్రయత్నించాయి.

**అతివాదాలు :** ఈ విశ్వం, మానవుడు అంతా యాదృచ్ఛికంగా, క్రమవికాసంతో ఉనికిలోకి వచ్చాయని గతంలో కొన్ని సిద్ధాంతాలు నిరూపించడానికి ప్రయత్నించాయి. వీటి దృక్పథం ప్రకారం- "విశ్వం కోటానుకోట్ల సంవత్సరాలుగా పరిణామం చెందుతూ ప్రస్తుత రూపానికి చేరుకుంది. మానవుడు కూడా ఎన్నో పరిణామ దశలు దాటుకుంటూ ఇప్పటి ఆకృతిని సంతరించుకున్నాడు. ఇదంతా కేవలం వస్తువుల చర్య-ప్రతిచర్యల కారణంగా సంభవించింది. అంతేగాని ఈ విశ్వంఉనికి వెనుక మరే లక్ష్యం లేదు."

ఈ సిద్ధాంతం ఒకప్పుడు ప్రపంచ మేధావివర్గంలో ఒక వెలుగు వెలిగింది. అభ్యుదయ భావాలకు ప్రతీకగా చెలామణి అయ్యింది. కాని కాల్పనికసిద్ధాంతాలు కలకాలం మనలేవు కదా! అనతి కాలంలోనే ఈ సిద్ధాంతం అశాస్త్రీయమైనదిగా పరిగణించబడి అవసానదశకు చేరుకుంది. అయితే చరిత్ర పుటల్లో సురక్షితంగా ఉండిపోయింది. ఈ తాత్వికఆలోచనా ప్రాతిపదికలపై ఉనికిలోకి వచ్చిన సిద్ధాంతాల లక్ష్యం ఒక్కటే- ప్రపంచ వ్యామోహం, భౌతికారాధన! ఈ సిద్ధాంతకర్తలు, వారి అనుయాయులు లోకానికి నేర్పిన పాఠం ఒక్కటే- ప్రపంచ సుఖాలను వీలైనంత ఎక్కువగా జుర్రుకోండి!

ఇక స్వయంకృత వేదాంత ప్రాతిపదికలపై ఏర్పడిన మతసిద్ధాంతాలు పైదృక్పథానికి పూర్తి భిన్నంగా మనిషిని ఐహిక సుఖాల నుండి అమాంతం తీసేసి ఏకాంత కుహరాల్లోకి నెట్టివేశాయి. మనిషి జన్మతః పాపాత్ముడని, అందువల్ల ఈ పాపపంకిలం నుండి పరిశుద్ధం కావడానికి, జీవితాన్ని సార్థకం చేసుకోవడానికి అతను ప్రపంచ భోగభాగ్యాలను త్యజించాలని, అడవుల్లోకో కొండల్లోకో వెళ్ళి దైవధ్యానంలో లీనమై

జీవితం గడపాలని ఈ సిద్ధాంత కర్తలు చెబుతారు. అలాంటి కఠోర తపోనిష్ఠలోనే దైవదర్శనం, దైవప్రసన్నతలు ప్రాప్తమవుతాయని, ఆత్మవికాసం కోసం మనోవాంఛల్ని అంతమొందించి శరీరాన్ని శుష్కింపజేయాలని వీరు ఉపదేశిస్తారు.

ఈ తాత్వికచింతన బహుదైవారాధనా మతంలో ఉద్భవించింది. ఆ తర్వాత క్రైస్తవ మతంలో చోటుచేసుకుంది. ఈ రెండిటి ప్రభావంతో సూఫీతత్వం పేరిట కొందరు ముస్లింలలో కూడా ఈ వైరాగ్యభావన చొచ్చుకొచ్చింది. దాంతో బహుదైవారాధకుల్లో, క్రైస్తవుల్లో, సన్యాసులు, సర్వసంగ పరిత్యాగులు; ఇటు ముస్లింలలో కూడా హద్దులు మీరిన సూఫీలు కొందరు ధ్యానమఠాల్లో, ఏకాంతమందిరాల్లో తిష్ఠవేసి తమ శరీర హక్కుల్ని, ఆత్మ హక్కుల్ని కాలరాసి ఆత్మవికాస సాధనలో నిమగ్నులయ్యారు.

ఈ రెండు దృక్పథాలు అతివాదాలకు అద్దం పడ్తున్నాయి. ఇస్లాం వీటిని ఖండిస్తూ ఒక మధ్యేమార్గాన్ని సూచిస్తోంది. మనిషి ప్రపంచసౌఖ్యాల మధ్య జీవిస్తూనే ప్రాపంచిక వ్యామోహానికి హృదయంలో చోటివ్వకూడదన్నది ఇస్లాం దృక్పథంలోని మూలసూత్రం.

నౌక సాగర జలాలలోనే నడుస్తుంది. దాని ప్రయాణీకులకు కూడా తాగడానికి, ఇతరత్రా అవసరాలకు నీరు కావాల్సిందే. వారు తమ అవసరాల మేరకే సాగరం నుంచి నీరు తీసుకోవాలి. అంతేగాని అవసరాలకు మించి నీరు తోడుకొని నౌకలో పోసుకుంటే ఏమవుతుంది? బరువు ఎక్కువయి నౌక మునిగిపోతుంది. అలాగే సాగరం అనే ఈ ప్రపంచం నుండి జీవితనౌక సాగడానికి కావలసిన మేరకే సంపద అనే నీటిని సమకూర్చుకోవాలి. అవసరానికి మించిన సంపదను సమకూర్చుకుంటే మన జీవితనౌక ప్రాపంచిక వ్యామోహ సాగరంలో మునిగిపోయి, పరలోక నరకయాతనల్లో తేలుతుంది. అందుకే ప్రపంచ జీవితం విషయంలో ఇస్లాం మనకు కొన్ని మౌలిక వాస్తవాలను (జీవిత సత్యాలను) తెలియజేస్తుంది.

**మానవుని నిజస్థానం :** మానవుడు జన్మతః పాపాత్ముడిగా పుట్టలేదు. అతని పుట్టుక వెనుక ఒక మహోన్నత లక్ష్యం ఉంది. సృష్టికర్త అతనికి ప్రపంచ ప్రాతినిధ్య బాధ్యతనిచ్చి పంపాడని ఇస్లాం చెబుతోంది. అతను ప్రపంచంలో ఖలీఫా (దైవ ప్రతినిధి)గా సృష్టికర్త ఆజ్ఞలకు బద్ధుడయి జీవితం గడపవలసి ఉంటుంది.

"నీ ప్రభువు దైవదూతలతో 'భూలోకంలో నేనొక ఖలీఫా (ప్రతినిధి)ని నియమించ బోతున్నా'నని అన్నప్పుడు దైవదూతలు ఏమన్నారో తెలుసా? 'ఏమిటీ...! మీరు ప్రపంచ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసి, రక్తపాతానికి వడిగట్టే వాడ్ని భూలోకంలో నియమించ బోతున్నారా? మేము మిమ్మల్ని అనుక్షణం స్తుతిస్తూ, మీ పవిత్రతను కొనియాడుతూనే వున్నాం కదా?' అని అన్నారు. దానికి దేవుడు 'మీకు తెలియని విషయాలెన్నో నాకు తెలుసు' అన్నాడు." (ఖుర్ఆన్-2:30)

"ప్రపంచంలో ఉన్న సమస్తాన్నీ ఆయన మీ ప్రయోజనం కోసమే అదుపులో ఉంచాడు." (ఖుర్ఆన్-22:65)



మానవుడు ఇహలోకంలో తన ఇష్టమొచ్చినట్లు జీవించడానికి దైవం అతనికి విశృంఖల స్వేచ్ఛ ఇవ్వలేదని, అతను జీవిత సకలరంగాల్లోనూ దైవాజ్ఞలకు బద్ధుడయి జీవితం గడపవలసి ఉందని "ఖలీఫా" అనే పదాన్నే బట్టే స్పష్టమవుతోంది. ప్రపంచంలో ఎవరైనా రాజప్రతినిధికి తన ఇష్టమొచ్చినట్లు వ్యవహరించకుండా ఏవిధంగా రాజాజ్ఞలను మాత్రమే అమలు పరుస్తాడో, అదేవిధంగా దేవుని ప్రతినిధిగా మానవుడు కూడా దేవుని ఆజ్ఞలను మాత్రమే శిరసావహిస్తూ ఆయన అభీష్టాన్ని నెరవేర్చవలసి ఉంటుంది.

మన దేశాన్ని ఆంగ్లేయులు పరిపాలించిన విషయాన్ని గుర్తుకు తెచ్చుకుంటే ఈ విషయం మరింత స్పష్టంగా బోధపడుతుంది. ఇక్కడ పాలనచేసే ఆంగ్లేయ ప్రతినిధిని "వైస్రాయ్" అనేవారు. అతను స్వయంగా ఎలాంటి చట్టాలు చేయకుండా బ్రిటిష్ రాజు నిర్మించిన చట్టాలు మాత్రమే ఇక్కడ అమలుపరిచేవాడు. అతను రాజాజ్ఞలకు వ్యతిరేకం గా ప్రవర్తించాడంటే ప్రాతినిధ్య అధికారాలను దుర్వినియోగం చేసినట్లే లెక్క.

అదేవిధంగా ప్రపంచంలో మానవుడు కూడా దైవశాసనాలను త్రోసిరాజని విశృంఖల జీవితం గడిపితే, లేదా తనలాంటి మానవులు నిర్మించిన కాల్పనిక చట్టాలు, సిద్ధాంతాలను అనుసరిస్తే దైవం ప్రసాదించిన ఖిలాఫత్ అధికారాలను దుర్వినియోగ పరచిన వాడవుతాడు.

## ప్రపంచం క్షణభంగురం-17

ఇస్లాం తెలియజేస్తున్న రెండవ మౌలిక వాస్తవం ఏమిటంటే- ఈ ప్రపంచం పూర్తిగా తాత్కాలికమయినది. ఇది మానవుడు శాశ్వతంగా ఉండే చోటు కాదు. అతని అసలు జీవితం మరణానంతరమే ప్రారంభమవుతుంది. అదే పరలోక జీవితం, అసలు జీవితం, శాశ్వత జీవితం. ఆ పరలోక జీవితం సాఫల్య, వైఫల్యాలు ఇహలోక జీవితంలో అతను ఆచరించే కర్మలను బట్టే ఉంటాయి. శాశ్వతమైన అసలు జీవితంలో సాఫల్యం పొందడానికి ఈ ప్రపంచంలోనే పాటుపడటం బుద్ధిమంతుని లక్షణం. అశాశ్వతమైన ఇహలోక జీవితంలో భోగభాగ్యాలు అనుభవించడానికి శాశ్వతమైన పరలోక జీవితాన్ని మూర్ఖుడు మాత్రమే నాశనం చేసుకుంటాడు.

**ఇహలోకం విలువ దోమ రెక్కంతే :** పరలోక జీవితం ముందు ఇహలోక జీవితానికి అణుమాత్రం విలువ కూడా లేదని ఇస్లాం మనకు స్పష్టంగా తెలియజేస్తోంది. ఒక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఈ ప్రపంచానికి దోమ రెక్కంత కూడా విలువలేదని అన్నారు. (బుఖారి)

ఇహలోకాన్ని పరలోకంతో పోల్చితే ఇహలోకం సముద్రంలోని ఒక నీటిబొట్టంత కూడా ఉండదు. (మిష్కాత్ షరీఫ్- 4927/2 చూడండి.)

"ఈ ప్రాపంచిక జీవితం మూన్నాళ్ళ ముచ్చట మాత్రమే. (మానవుల) శాశ్వత నివాసం పరలోకంలో ఉంది." (దివ్యఖుర్ఆన్-40:39)

"ఈ ప్రాపంచిక జీవితం ఒక ఆట, వినోదం తప్ప మరేమీ కాదు. అసలు జీవితం పరలోక గృహ(జీవిత)మే. ఈ యదార్థం వారు అర్థం చేసుకుంటే ఎంత బాగుండు!" (దివ్యఖుర్‌ఆన్-29:64)

పరలోకజీవితం ముందు ప్రపంచజీవితం ఎంత స్వల్పమైనదో మనిషి ఊహకే అందదు. పరలోక విషయాలు మానవ మేధస్సుకు అతీతమైనవి. అయితే పరలోక విషయాల్ని గురించి మనిషి ఓ మొద్దు అంచనా వేసుకొని, వాటి తీవ్రతను కొంతయినా అర్థం చేసుకోడానికి వీలుగా ఖుర్‌ఆన్, హదీసుల్లో కొన్ని అంకెలున్నాయి. వీటి ఆధారంగా మన ఈ ప్రాపంచికజీవితం ఎంత అశాశ్వతమైనదో అంచనా వేసుకొని కాస్త ఆలోచిద్దాం.

ప్రళయదినాన దేవుడు పాపాత్ములను ఒక చోట సమీకరిస్తాడు. వారి కళ్ళు నీలి రంగుతో అసహ్యంగా ఉంటాయి. వారు పరస్పరం ఇలా మెల్లిగా మాట్లాడుకుంటారు:

"ప్రపంచంలో మనం ఎంత కాలం ఉన్నామని ఒకడంటే, ప్రపంచంలో మనం పదిరోజులు ఉండి ఉంటామని వేరొకడు అంటాడు. కాని వారిలో కాస్త తెలివైనవాడు, మీరు ప్రపంచంలో ఒక్క రోజుకన్నా ఎక్కువ ఉండలేదు" అంటాడు. (దివ్య ఖుర్‌ఆన్-20:103-105 సూక్తులు చూడండి.)

"ఆ తర్వాత దేవుడు వారిని ప్రపంచంలో మీరు ఎంతకాలం ఉన్నారో చెప్పండని అడుగుతాడు. దానికి వారు ఒక రోజో లేక రోజులో కొంతభాగమో మేము అక్కడ ఉండి ఉంటాం. లెక్కించేవారిని అడగండి" అంటారు. (ఖుర్‌ఆన్-23:112)

"ఇంతకూ ఆ (ప్రళయ) ఘడియ ఎప్పుడొస్తుంది?" అని అడుగుతున్నారు వారు. దాని సమయం తెలియజేయడానికి నీకేం పని? ఆ విషయం దేవునికి మాత్రమే తెలుసు. నీవు దాన్ని గురించి భయపడేవారిని హెచ్చరించేవాడివి మాత్రమే. వారు దాన్ని (ప్రత్యక్షంగా) చూసినప్పుడు (తాము ప్రపంచంలో) ఉదయమో, సాయంత్రమో ఒక్క పూట మాత్రమే ఉండి ఉంటాం" అని అనుకుంటారు. (ఖుర్‌ఆన్- 79:42-46)

ప్రళయంనాటి భయానక స్థితి చూసిన తర్వాత మానవునికి ఈ ప్రపంచ జీవితం వాస్తవికత ఏమిటో తెలుస్తుంది. అతని వందేళ్ళ ప్రాపంచిక జీవితం పది రోజుల కంటే తక్కువ ఉన్నట్లు అన్పిస్తుంది. నిజానికి ప్రాపంచిక జీవితం సరిగ్గా ఒక్కరోజు కూడా లేదని ఆ పరిస్థితి చూసిన పాపాత్ములకు సహజంగానే అన్పిస్తుంది..

**మూడు సెకండ్ల ముచ్చట :** మానవులంతా పునర్జీవింపబడినప్పటి నుంచి కర్మవిచారణ జరిగి, ప్రతిఫలంగా వారు స్వర్గం లేక నరకంలో ప్రవేశించే వరకు సంభవించే ప్రళయదినం 50,000 సంవత్సరాలకు సమానమయిన దినమని హదీసుల్లో ఉంది. దీన్నే తీర్పుదినమని, పునరుత్థాన దినమని అంటారు.

దినాన్ని గంటలుగా, నిమిషాలుగా తీసుకుంటే, మానవుడు ప్రపంచంలో వందేళ్ళ పాటు జీవించాడని అనుకుంటే, 50,000 ఏండ్ల సుదీర్ఘ తీర్పుదినం ముందు మానవుని



ఈ వందేళ్ళ ఐహిక జీవితం 2.88 నిమిషాలు మాత్రమే అవుతుంది! అంటే మనం ప్రపంచం అశాశ్వతమైనదనడానికి చెప్పుకునే మూన్నాళ్ళ ముచ్చటంత కూడా ఇది లేదన్నమాట!! అసలు మూన్నాళ్ళ పరిమితే ఎంతో పెద్ద కాలం. ఇక్కడ మూడు నిమిషాల ముచ్చట కూడా లేదు!!!

ఈ మూడు నిమిషాల ముచ్చటయినా ఒక్క తీర్పుదినం కాలపరిమితితో పోల్చుకున్నప్పుడే. ఇక కోటానుకోట్ల సంవత్సరాలు గడపవలసిన స్వర్గనరకాల జీవితం సమక్షంలో నయితే ఈ ప్రాపంచిక జీవితం మూడు సెకండ్ల ముచ్చటగా కూడా ఉండదు.

ఒకపూట నమాజు విలువ 2 కోట్ల 88 లక్షల సంవత్సరాల పరలోక అనుభవమన్న భావం స్ఫురింపజేసే హదీసు ఉంది. ఈ లెక్కన ఒకరోజు నమాజుల విలువ 14 కోట్ల, 40 లక్షల సంవత్సరాలు అవుతుంది. దీన్నిబట్టి 100 ఏండ్ల ప్రపంచజీవితం ఎంతో గొప్ప జీవితం అనుకుంటే, అది పరలోకంలో 5 లక్షల 25 వేల 6 వందల కోట్ల సంవత్సరాలకు సమానమవుతుంది! ఇదే విధమైన మరోలెక్క ప్రకారం ఆలోచిస్తే 14 కోట్ల 40 లక్షల ఏండ్లకు సమానమయ్యే ఒక్క పరలోకదినం ముందు మానవుని వందేళ్ళ ఐహిక జీవితం 0.06 సెకండ్లు మాత్రమే అవుతుంది!! అందుకే ప్రపంచం క్షణభంగురం అన్నారు పెద్దలు.

## పరీక్షా స్థలం-18

ప్రపంచంలో మానవునికి ప్రసాదించబడిన ఈ తాత్కాలిక జీవితం కేవలం పరీక్ష కోసమే ఇవ్వబడింది. మానవుడు ఇక్కడ దేవుని ఆదేశాలను శిరసావహిస్తూ దైవప్రవక్తల బోధనల ప్రకారం పవిత్రజీవితం గడుపుతాడా లేక అతనికివ్వబడిన స్వేచ్ఛను, సమయాన్ని దుర్వినియోగం చేస్తూ మార్గభ్రష్టుడయిపోతాడా అన్నదే ఈ పరీక్ష.

పరీక్షహాల్లో విజ్ఞతా వివేచనలు గల విద్యార్థి సమయాన్ని ఏమాత్రం వృధా చేయకుండా ప్రశ్నపత్రం పైనే తన దృష్టినంతటినీ కేంద్రీకరించి వాటికి సమాధానాలు రాయడంలో లీనమయిపోతాడు. అలాగే ఈ ప్రపంచాన్ని పరీక్షా స్థలంగా భావించి అనుక్షణం దైవాజ్ఞలకు అనుగుణమైన జీవితం గడపాలని ఇస్లాం చెబుతోంది. ఇలా దైవాజ్ఞలకు అనుగుణమైన జీవితం గడపడం వల్ల పరలోకంలో స్వర్గంరూపేణ మహోన్నత సాఫల్యం లభించడమేగాక, ప్రపంచంలోనూ మనిషి శాంతిసుఖాలతో సంతృప్తికరమైన జీవితం గడపగలడని ఇస్లాం మనకు హామీ ఇస్తోంది.

ఒకవేళ ఎవరైనా దైవధర్మాన్ని త్రోసిపుచ్చి ప్రపంచంలోనే వీలైనన్ని సుఖాలు అనుభవించాలన్న ఉద్దేశ్యంతో పాటుపడితే దేవుడు అతని కోరికను ప్రపంచంలోనే నెరవేరుస్తాడు. అంతేగాని అతడ్ని వెంటనే శిక్షించడు. ప్రపంచం పరీక్షా స్థలం కదా మరి! అసలు ప్రతిఫలం పరలోకంలోనే లభిస్తుంది. ఖుర్‌ఆన్‌లోని ఈసూక్తులు చూడండి:

"ప్రతి ప్రాణికీ మరణకాలం వ్రాయబడి ఉంది. కేవలం ప్రాపంచిక ప్రతిఫలాపేక్షతో పనిచేసేవారికి మేము ప్రపంచంలోనే వారి ప్రతిఫలం ఇచ్చివేస్తాము. పరలోక ప్రతిఫలా

పేక్షతో పనిచేసేవారికి పరలోకంలో వారికి రావలసిన ప్రతిఫలం అనుగ్రహిస్తాం. కృతజ్ఞులై ఉండేవారికి మేము తప్పకుండా తగిన బహుమానం ప్రసాదిస్తాం." (3:145)

**కృతజ్ఞుడే కృతార్థుడు :** "మీ కర్మలకు ప్రళయదినాన పూర్తి ప్రతిఫలం లభిస్తుంది. నరకానికి దూరంగా స్వర్గానికి పంపబడేవాడే నిజమైన కృతార్థుడు. ఐహిక జీవితం, (దాని సౌఖ్యాలు) వట్టి మోసపూరితమైన పైపై మెరుగులు మాత్రమే." (3:185)

"ప్రజల్లో ఎవరు సత్కార్యాలు చేస్తూ సదాచార సంపన్నులవుతారో పరీక్షించడానికే, మేము సకల వస్తుసామగ్రితో భూమిని శోభాయమానంగా తీర్చిదిద్దాము. చివరికి మేము దాన్నంతటినీ (తుడిచిపెట్టి) బంజరుభూమిగా మార్చివేస్తాము." (18:7)

"ఆయనే మిమ్మల్ని ధరణిపై దైవప్రతినిధిగా నియమించాడు. మీకు ప్రసాదించిన దాని విషయమై మిమ్మల్ని పరీక్షించడానికి ఆయన మీలో కొందరికి కొందరికన్నా ఎక్కువ హోదా, అంతస్తులు ప్రసాదించాడు." (6:165)

"మేము మిమ్మల్ని మంచీ-చెడు స్థితులు కలిగించి పరీక్షిస్తున్నాము. చివరికి మీరంతా మా దగ్గరికే తిరిగి రావలసి ఉంది." (21:35)

"ఆయనే భూమ్యాకాశాల్ని ఆరు రోజుల్లో సృష్టించినవాడు. దీనికి పూర్వం ఆయన (అధికార) సింహాసనం నీటి మీద ఉండేది. మీలో ఎవరు నీతిగా నడుచుకుంటారో పరీక్షించడానికే ఆయన ఇదంతా సృష్టించాడు." (11:7)

మానవులకు జరిగే పరీక్ష గురించి బుఖారీ గ్రంథంలో ఒక మంచి ఉదాహరణ ఉంది. ఆ హదీసులో మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈవిధంగా తెలియజేశారు:

**ముగ్గురు వ్యక్తుల పరీక్ష :** (పూర్వం) ఇస్రాయీల్ సంతతి ప్రజలలో ముగ్గురు వ్యక్తులు ఉండేవారు. వారిలో ఒకడు కుష్ఠురోగి, మరొకడు అంధుడు, వేరొకడు బట్టతలవాడు. దేవుడు ఆ ముగ్గుర్నీ పరీక్షించదలచి ఒక దైవదూతను (మానవాకారంలో) వారి దగ్గరకు పంపించాడు.

దైవదూత వచ్చి మొదట కుష్ఠురోగితో "నీకు ఏ రంగంటే ఇష్టం?" అని అడిగాడు. దానికతను "అందమైన రంగు, మంచి దేహం అంటే ఇష్టం. నా ఈ పరిస్థితి కారణంగా జనం నన్ను అసహ్యించుకుంటున్నారు" అని అన్నాడు. దైవదూత ఈ మాట విని అతని శరీరాన్ని స్పృశించాడు. అప్పుడు దేవుడు ఆ వ్యక్తికి ఆరోగ్యం చేకూర్చి అందమైన రంగు ప్రసాదించాడు. తరువాత దైవదూత "సంపదలలో నీకు ఏ సంపదంటే ఇష్టం?" అని అడిగాడు. "నాకు ఒంటెలంటే ఇష్టం" అన్నాడతను. దైవదూత అతనికి ఒక సూడి ఒంటెను ఇచ్చి "ఇందులో నీకు చాలా శుభం కలుగుతుంది" అన్నాడు.

తరువాత దైవదూత అంధుడి దగ్గరకు పోయి "నీకు ఏ విషయం అంటే ఇష్టం?" అని అడిగాడు. దానికా అంధుడు "దేవుడు నాకు నా చూపును తిరిగి ఇచ్చివేస్తే చాలు" అన్నాడు. దైవదూత చేత్తో అతని కళ్ళను స్పృశించాడు. అప్పుడు దేవుడు ఆ



అంధుడికి చూపు ప్రసాదించాడు. తర్వాత దైవదూత అతడ్ని "సంపదలలో నీకు ఏ సంపదంటే ఇష్టం?" అనడిగాడు. "మేకలంటే ఇష్టం" అన్నాడతను. దైవదూత అతనికి ఒక సూడి మేకను ఇచ్చి "దేవుడు నీకు ఇందులో శుభం చేకూర్చుతాడు" అన్నాడు.

దైవదూత అక్కడ్నుంచి బట్టతలవాడి దగ్గరకెళ్లి "నీకు ఏ విషయం ఇష్టం?" అని అడిగాడు. దానికా వ్యక్తి "నా బట్టతల చూసి జనం నన్ను ఈసడించుకుంటున్నారు. నాతల మీద వెంట్రుకలు వచ్చేలా చేస్తే చాలు" అన్నాడు. దైవదూత అతని తలమీద చేత్తో తిప్పాడు. దాంతో అతని బట్టతలపై వెంట్రుకలు వచ్చేశాయి. తరువాత దైవదూత అతడ్ని "నీకు ఏ సంపదంటే ఇష్టం?" అని అడిగాడు. "ఆవులంటే ఇష్టం" అన్నాడతను. దైవదూత అతనికి ఒక సూడి ఆవునిచ్చి "ఇందులో నీకు శుభం కల్గుతుంది" అన్నాడు.

దైవదూత ఈమాట చెప్పి వెళ్ళిపోయాడు. కొంతకాలానికి ఆ ముగ్గురికిచ్చిన పశువులు పిల్లలు పెట్టడం మొదలెట్టాయి. ఒంటె తీసుకున్నవాడికి పెద్ద ఒంటెలమంద, ఆవు తీసుకున్న వాడికి పెద్ద ఆవులమంద, మేక తీసుకున్నవాడికి పెద్ద మేకలమంద తయారయ్యాయి. కొంత కాలానికి దైవదూత గతరూపంలోనే బాటసారిగా ఆ ముగ్గురి దగ్గరకు బయలుదేరాడు.

దైవదూత మొదట కుష్ఠురోగి దగ్గరకు పోయి "అయ్యా! నేనొక బాటసారిని. నా ప్రయాణ ఒనరులన్నీ పోయాయి. నా స్వస్థలానికి చేరుకోవడానికి నాకిక దేవుడే దిక్కు. దేవుడు మీకు మంచి వర్ణం, పశుసంపద ప్రసాదించాడు. నేను మిమ్మల్ని ఆ దేవుని (ప్రసన్నత) కోసం నాకొక ఒంటెను దానం చేయమని అర్థిస్తున్నాను. మీరు ఒంటెను ఇస్తే నేను నా స్వస్థలానికి నిశ్చింతగా చేరుకుంటాను" అని అన్నాడు. దానికా వ్యక్తి "ఇలా వేల మంది ఉన్నారు. నేనెంత మందికని ఇవ్వను?" అన్నాడు. దైవదూత ఈమాట విని "నేను మిమ్మల్ని బహుశా గుర్తు పట్టాననుకుంటా. మీరు ఒకప్పుడు కుష్ఠురోగిగా ఉండేవారు. తర్వాత దేవుడు మీకు మంచి వర్ణం, పెద్ద ఎత్తున ఈ పశుసంపద ప్రసాదించాడు, ఔను కదూ?" అని అడిగాడు. ఆ వ్యక్తి దైవదూత మాటలను ఖండిస్తూ "ఈ పశుసంపద మాకు తరతరాల నుంచి వస్తున్న సంపద" అన్నాడు. అప్పుడు దైవదూత "నువ్వు గనక అబద్ధమాడుతున్నట్లయితే దేవుడు నిన్ను గతంలో నీవు ఎలా ఉండేవాడివో అలా చేయుగాక!" అని శపించాడు.

ఆ తర్వాత దైవదూత బట్టతలవాడి దగ్గరకు పోయి, అతనితో కూడా ఇలాగే మాట్లాడి ఒక ఆవు దానం చేయమని అడిగాడు. అతను కూడా కుష్ఠురోగిలాగే సమాధాన మిచ్చాడు. అంచేత దైవదూత అతడ్ని కూడా శపిస్తూ "నువ్వు గనక అబద్ధమాడుతున్నట్ల యితే దేవుడు నిన్ను గతంలో నీవు ఎలా ఉండేవాడివో అలా చేయుగాక!" అని అన్నాడు.

దైవదూత అక్కడ్నుంచి అంధుడి దగ్గరకు పోయి "అయ్యా! నేనొక పేద బాటసారిని. నా ప్రయాణ ఒనరులన్నీ పోయాయి. నాకిక దేవుడే దిక్కు. ఆ దేవుడు మీకు చూపు తిరిగిచ్చి ఈ పశుసంపద ప్రసాదించాడు. ఆ దేవుని (ప్రసన్నత) కోసం

నాకొక మేకను దానం చేయమని మిమ్మల్ని అర్థిస్తున్నాను. మేకను ఇస్తే నేను నా స్వస్థలానికి నిశ్చింతగా చేరుకుంటాను" అని అన్నాడు. దానికి అంధుడు సమాధానమిస్తూ "నేను నిస్సందేహంగా పూర్వం అంధుడ్నే. దేవుడు నాకు దృష్టి ప్రసాదించాడు. నేను గతంలో చాలా పేదవాడ్నే. దేవుడు నాకు ఈ పశుసంపద ప్రసాదించాడు. అంతా ఆయన దయే. నీవు కోరుకున్నన్ని మేకలను తీసుకో. నాకెలాంటి అభ్యంతరం లేదు" అని అన్నాడు. దైవదూత ఈ మాటలు విని "నీ మేకలు నాకవసరం లేదు. దేవుడు నన్ను మీ ముగ్గుర్ని పరీక్షించడానికి పంపాడు. దేవుడు ఇప్పుడు నీ పట్ల ప్రసన్ను డయ్యాడు. నీ మిత్రులిద్దరి పట్ల అప్రసన్నుడయ్యాడు" అని చెప్పాడు.

**స్వేచ్ఛ అంటే ఇష్టారాజ్యం కాదు :** "నిరాఘాటంగా సాగుతున్న కాలవాహినిలో మానవునికి తానొక గడ్డిపోచ విలువ కూడా లేనివాడిగా ఉండిన సమయం ఎప్పుడైనా ఎదురైందా? మేము మానవుడ్ని పరీక్షించడానికి ఒక మిశ్రమబిందువు ద్వారా పుట్టించాము. దానికోసం మేమతడ్ని వినేవాడిగా, చూసేవాడిగా చేశాం. అతనికి మేము సన్మార్గంకూడా చూపించాం. అతను సన్మార్గం అవలంబించి (మాపట్ల) కృతజ్ఞుడైఉన్నా లేక (అవిశ్వాస వైఖరి అవలంబించి) కృతఘ్నుడైపోయినా (అంతా అతని ఇష్టాయిష్టా లపై వదిలేశాము)." (ఖుర్ఆన్-76:1-3)

"ఈ ప్రపంచం విశ్వాసి పాలిట జైలు; అవిశ్వాసి పాలిట స్వర్గం." (మిష్కాత్)

అయితే దేవుడు మానవుడ్ని పరీక్షించడంలో అతని శక్తికి మించిన భారం వేయడు. ఎవరికి ఏ మేరకు శక్తి స్తోమతలు ఉంటాయో ఆ మేరకే అతడ్ని పరీక్షిస్తాడు.

"మేము ఏ మనిషి పైనా అతని శక్తికి మించిన భారం వేయము. మా దగ్గర ఒక గ్రంథం ఉంది. అందులో (ప్రతి ఒక్కరి స్థితిగతుల్ని గురించి) వాస్తవిక విషయాలన్నీ ఉన్నాయి. కనుక ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు." (ఖుర్ఆన్-23:62)

మానవుడు ఈ ప్రపంచంలో అడుగడుగునా పరీక్షించబడుతున్నాడు. అతని జీవితంలోని ప్రతి రంగంలోనూ పరీక్షే. జీవితాంతం ప్రతి క్షణం, ప్రతి చోటా పరీక్ష దశలను దాటుకుంటూ పయనించవలసిందే. విశ్వప్రభువు ఇక్కడ మనకు ప్రశ్నలే గాకుండా వాటి సమాధానాలు కూడా (ఖుర్ఆన్, హదీసుల రూపంలో) ఇచ్చాడు. కనుక వాటిని మన క్రియాజీవితంలో ఎత్తి రాసుకోవడమే మన పని.

ఈ ప్రపంచంలో ఎవరైనా వందేళ్ళు జీవిస్తాడనుకుంటే, దాన్ని నందనవనంగా తీర్చి సుఖంగా జీవించదలచిన మనిషి ఆ వందేళ్ళలో దాదాపు పాతికేళ్ళు విద్యార్జన కోసమే శ్రమపడతాడు. అంటే అతను తన మొత్తం జీవితకాలంలో 25 శాతం కాలం శ్రమిస్తాడన్న మాట. కాని పరలోకంలోని ఒక రోజుకు సమానమైన 14 కోట్ల, 40 లక్షల సంవత్సరాల కాలంతో పోల్చుకుంటే ఈ వందేళ్ళ ప్రపంచ జీవితంలోని మన శ్రమంతా అందులో సమయశాతం 0.0000007 మాత్రమే! అంటే ప్రపంచమనే ఈ పరీక్షాస్థలంలో మన ప్రశ్నలకు-జవాబులు ఎత్తి రాసుకోవడానికి పడే శ్రమ బహు స్వల్పం అన్న మాట.



## వినాశం దిశగా విశ్వం-19

ఈ ప్రపంచం మానవులకు ఒక పరీక్షావేదిక కనుక పరీక్షా కాలం ముగిసిపోగానే పరీక్షా ఫలితాలు అనుభవించే అసలు జీవితం ప్రారంభమవుతుంది. మానవుడు చేసే ఘోరమైన పాపాలకు, లేక అత్యున్నతమైన పుణ్యకార్యాలకు తగిన ఫలం అనుభవించ డానికి ఈ ప్రపంచం సరైన వేదిక కాజాలదు. దాని కోసం పరలోకమే తగిన వేదిక. అదే ప్రళయం సంభవించిన తరువాత ఏర్పడే నూతన ప్రపంచం.

అయితే పదార్థపూజారులు, ప్రాపంచిక వ్యామోహపరులు తమ స్వార్థపరత్వాన్ని వదలుకోలేక ప్రళయాన్ని, పరలోక జీవితాన్ని ఎల్లప్పుడూ తిరస్కరిస్తూనే వచ్చారు.

**స్వార్థపరులకు సత్యం పచ్చి వెలక్కాయే :** "ఇతను (దైవప్రవక్త) మీలాంటి మానవుడే తప్ప మరేమీ కాదు. మీరు తినేదీ, త్రాగేదే ఇతనూ తింటున్నాడు, త్రాగుతున్నాడు. అలాంటి ఒక మానవమాత్రుడికి విధేయులయిపోతే మీరు చాలా నష్టపోతారు. మనం చనిపోయి, మట్టిలో కలసి ఎముకలగూడుగా మారాక మళ్ళీ బ్రతికించి లేపబడతామట! అసంభవం. మనకు చేస్తున్న ఈ వాగ్దానం నెరవేరేది కాదు. జీవితం అంటే మరేమీకాదు. ఈ ప్రపంచ జీవితమే. ఇక్కడే మనం బ్రతకాలి. ఇక్కడే చావాలి. మనం (మళ్ళీ బ్రతికించి) లేపబడే ప్రసక్తే లేదు." (ఖుర్ఆన్=23:33-38)

"కాని ఈ విషయం గురించి వారు ఏమరుపాటులో పడిపోయారు. అందువల్ల వారి ఆచరణ కూడా దీనికి భిన్నంగా ఉంది. మేము వారిలో భోగభాగ్యాల్లో మునిగి తేలుతున్నవారిని పట్టుకునేదాకా వారు (దారికి రాకుండా) ఆ పనులే చేస్తూ ఉంటారు. చివరికి మాకు పట్టుబడగానే వారు ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టడం మొదలెడ్తారు. 'ఇక మీ ఏడ్పులు, పెడబొబ్బలు ఆపేయండి. మీరు ఎంత ఏడ్చి మొత్తుకున్నా మా నుండి మీకు ఎలాంటి సహాయం లభించదు. నా సూక్తులు విన్పిస్తుంటే మీరు ముఖం తిప్పుకొని వెళ్ళిపోయేవారు. అహంకారంతో వాటిని ఖాతరు చేసేవారుకాదు. కట్టుకథలతో, వ్యర్థ ప్రలాపాలతో కాలం వెళ్ళబుచ్చేవారు." (ఖుర్ఆన్=23:63-67)

**సాధ్యంకాని ఐహిక శిక్షలు :** ఒక సజ్జనుడు చేసిన అనేక సత్కార్యాలకు తగిన పారితోషికం లభించడం ఇహలోకంలో సాధ్యంకాదు. అలాగే ఒక దుర్మార్గుడు చేసిన అనేక నేరాలకు తగిన శిక్ష విధించిన తరువాత దాన్ని అమలుపరచడం కూడా ఇహలోకంలో సాధ్యంకాదు. అది పరలోకంలోనే సాధ్యమవుతుంది.

"దక్షిణాఫ్రికాకు చెందిన మౌజెస్ సిట్‌హోల్ అనే నేరగాడు 38 హత్యలు, 40 మానభంగాలు, 6 దోపిడీలు చేశాడు. 1997లో న్యాయస్థానం అతనికి 2,410 సంవత్స రాల కఠిన కారాగార శిక్ష విధించింది". (ఈనాడు దినపత్రిక: 17-10-1999). ఇంతటి సుదీర్ఘకాల శిక్షను అమలుపరచడం ఇహలోకంలో అసంభవమని తెలుస్తూనే ఉంది. అది పరలోకంలోనే సాధ్యమవుతుంది. దీన్నిబట్టి మానవుని జీవితం మరణంతో పూర్తిగా సమాప్తం కాదని, అతని కర్మలకు తగిన శిక్ష లేక ప్రతిఫలం అనుభవించడానికి మరణా

నంతరం శాశ్వతంగా ఉండే మరోజీవితం ఉంటుందని, ఉండాలని మానవ అంత రంగం సహజంగానే ఘోషిస్తుంది.

"మేము విధేయులైనవారిని, అపరాధులను ఒకే దృష్టితో ఎందుకు చూస్తాము?" (దివ్యఖుర్ఆన్-68:35)

"దుష్కార్యాలకు పాల్పడుతున్నవారు తమను, సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేస్తున్నవారిని మేము ఒకే గాటన కట్టివేస్తామని భావిస్తున్నారా? వారుభయుల చావు బ్రతుకులు (వాటి పర్యవసానాలు) ఒకటే అవుతాయనుకుంటున్నారా? చాలా తప్పుడు ఆలోచన వారిది. ఎలాంటి అన్యాయం జరగకుండా ప్రతి మనిషికి అతని సంపాదనకు తగిన ప్రతిఫలం ఇవ్వడానికి దేవుడు భూమ్యాకాశాల్ని సత్యం ప్రాతిపదికపై సృష్టించాడు." (దివ్యఖుర్ఆన్-45:21,22).

**పుట్టుట గిట్టుట కొరకే :-** ఈ ప్రపంచంలోని ఏ వస్తువూ, ఏ ప్రాణీ శాశ్వతమైనది కాదు. ఇక్కడి ప్రతి వస్తువుకూ, ప్రతి ప్రాణికీ ఒక జీవితకాలమంటూ ఉంది. ఆ జీవిత కాలం ముగిసిపోగానే ఆ వస్తువు లేక ప్రాణి నశించిపోతుంది. కాకపోతే కొన్ని సృష్టిరాసులు వేల సంవత్సరాలు, మరికొన్ని సృష్టిరాసులు వందల సంవత్సరాలు, ఇంకొన్ని సృష్టిరాసులు పదుల సంవత్సరాలు జీవిస్తాయి. అలాగే కొన్ని రోజులు, కొన్ని గంటలు మాత్రమే జీవించి ఉండే సృష్టిరాసులు కూడా ఈ ప్రపంచంలో ఉన్నాయి. మొత్తానికి ఇక్కడున్న ప్రతీదీ నశించిపోయేదే. చివరికి ఈ ప్రపంచానికి కూడా ఒక జీవితకాలం ఉంది. ఆ జీవితకాలం ముగిసిపోగానే ఈ ప్రపంచం కూడా నశించిపోతుంది.

విశ్వవినాశం గురించి విజ్ఞాన శాస్త్రవేత్తలు కూడా తమ పరిశోధనలు వెల్లడించారు. వారి అభిప్రాయం ప్రకారం ఈ విశ్వం మొదట ఏవిధంగా ఉనికిలోకి వచ్చిందో అదే విధంగా నాశనం కూడా అవుతుంది. ''పుట్టుట గిట్టుట కొరకే''- ''పెరుగుట విరుగుట కొరకే'' అనే సామెతలు అందరికీ తెలిసినవే. పదార్థరూపంలో ఉన్న ఈవిశ్వం ఒక పెద్ద ప్రేలుడు (బిగ్‌బ్యాంగ్) సంభవించడం ద్వారా క్రమంగా ఉనికిలోకి వచ్చిందని, తిరిగి అలాంటి ప్రేలుడుతోనే ఈ విశ్వం నాశనమవుతుందని సైన్సు చెబుతోంది.

ఈ విశ్వం, అందులోని సృష్టిరాసులు ఉనికిలోకి వచ్చిన ప్రారంభ దశను గురించి సైన్సు ఇప్పటికీ కచ్చితమైన నిర్ణయానికి రాలేకపోయింది. బిగ్‌బ్యాంగ్ ప్రేలుడుతో విశ్వం ఉనికిలోకి వచ్చినప్పుడు అది తీవ్రమైన ఉష్ణోగ్రతతో ఉండేదని, తర్వాత అది క్రమంగా చల్లారేకొద్దీ అందులో జీవరాసుల పుట్టుక ఏకకణ జీవులతో ప్రారంభమైందని, ఇలా అవి పరిణామం చెందుతూ ప్రస్తుత దశకు చేరుకున్నాయని డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం చెబుతోంది. ఆ సిద్ధాంతం ప్రకారమే మానవుడు కోతిదశ నుండి క్రమంగా పరిణామం చెందుతూ ఇప్పటి రూపానికి మారాడని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

కాని దివ్యఖుర్ఆన్ ఈ పరిణామ ప్రక్రియకు పూర్తి భిన్నంగా ప్రస్తుత మానవుడు సృష్టి ప్రారంభంలో కూడా ఇలాగే ఉండేవాడని చెబుతోంది. ప్రపంచంలో మానవ



జాతే లేనప్పుడు సృష్టికర్త ఆది మానవుడయిన హజ్రత్ ఆదం (అలైహి)ను, ఆయన భార్య హజ్రత్ హవ్వా (అలైహి)ను దివి నుండి ఏకంగా భువి పైకి పంపాడు. వారిద్దరి నుండే మొత్తం మానవసంతతి ఉద్భవించింది; ప్రళయం దాకా ఉద్భవిస్తుంది.

**మానవ పుట్టుక :** దివ్య ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు గమనించండి:

"మేము మానవుడ్ని కుళ్ళిఎండిపోయిన మట్టితో సృజించాము." (15:26)

"ఆయన ఆదంకు సమస్త వస్తువుల పేర్లు తెలియజేశాడు." (2:31)

"మానవులారా! మీ ప్రభువుకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి ద్వారా సృష్టించాడు. అదే ప్రాణి నుండి దాని జతను కూడా సృష్టించాడు. తిరిగి వారిరువురి నుండి కోటానుకోట్ల మంది స్త్రీ పురుషులను ప్రపంచంలో విస్తరింపజేశాడు. (4:1)

"ఆ తర్వాత మేము ఆదంకు ఇలా చెప్పాము: "నీవు, నీ భార్య స్వర్గంలో నివ సించండి. ఇక్కడ మీరు కోరినదల్లా తింటూ హాయిగా ఉండండి. అయితే..... మీరంతా ఇక్కడ్నుంచి దిగిపోండి. మీరు ఒకరికొకరు శత్రువులు. ఒక నిర్ణీతకాలం వరకు మీరు భూలోకంలో జీవితం గడపవలసి ఉంది" అని అన్నాము. (2:35,36)

**ఆదిమానవుడు ఎలా ఉండేవాడు :** ఆదిమానవుడు ప్రస్తుత మానవరూపంలో ఉన్నా ప్రారంభంలో చాలా పొడగరి అని ఒక హదీసు ద్వారా తెలుస్తోంది. హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: "(ఆది మానవుడు) ఆదం (అలై)ను సృష్టించినప్పుడు ఆయన అరవై బారలు (180 అడుగులు) ఎత్తుండేవాడు. తరువాత క్రమంగా తగ్గిపోతూ ఇప్పటి (రెండుబారల- ఆరడుగల) ఎత్తుకు వచ్చాడు." (సహీబుఖారి)

ప్రారంభంలో మానవుని వయస్సు కూడా వేల సంవత్సరాలలో ఉండేదని కొన్ని ఆధారాల ద్వారా తెలుస్తోంది. నూహ్ ప్రవక్త (అలైహి) గురించి "అతను వారి మధ్య యాభై తక్కువ వేయి సంవత్సరాలు గడిపాడు" అని ఖుర్ఆన్ (29:14)లో ఉంది. నూహ్ (అలైహి) దైవప్రవక్త అయిన నాటినుండి తుఫాన్ సంఘటన సంభవించే వరకు తన జాతిప్రజల మధ్య 950 ఏండ్లు గడిపారని ధర్మవేత్తలు వ్యాఖ్యానించారు. దీన్నిబట్టి నూహ్ (అలైహి) వయస్సు వేయి సంవత్సరాలకు పైనే ఉండవచ్చని తెలుస్తోంది.

ఇబ్నె జౌజీ (రహ్మలై) ఉల్లేఖనం ప్రకారం ఈసాప్రవక్త (అలైహి) తన అనుచరుల కోరికపై దైవాన్ని ప్రార్థించగా ఒక కపాలం ఇలా అంటుంది: "ఒకప్పుడు నేనీ ప్రాంతం చక్రవర్తిని. వెయ్యేండ్లు జీవించాను; వేయిమంది సంతానం కన్నాను; వేయి పట్టణాలు జయించాను; వేయి సైన్యాలను ఓడించాను; వేయిమంది రాజుల్ని చంపాను. చివరికి ఈ విజేత మృత్యు కుహరంలోకి వెళ్ళాడు...."

వహబ్ బిన్ మునబ్బా (రహ్మలై) ఉల్లేఖనం ప్రకారం ఈసాప్రవక్త (అలైహి) తన అనుచరుల కోరికపై నూహ్‌ప్రవక్త (అలైహి) కుమారుడు సామ్ సమాధి దగ్గర నిలబడి

"దేవుని ఆజ్ఞతో సజీవి అయి, లే" అన్నారు. సామ్ లేచి ఈసా (అలైహి) ప్రశ్నకు సమాధానమిస్తూ "నేను నాలుగు వేల సంవత్సరాలు జీవించాను...." అన్నాడు.

ఇలా అతిప్రాచీన యుగంలో మానవులు వేల సంవత్సరాలు జీవించినట్లు పై రెండు ఉల్లేఖనాలు కూడా ధృవపరుస్తున్నాయి. (మౌలానా అహ్మద్ సయీద్ గారి "మౌత్‌కా ఝట్కా" అనే గ్రంథంలో 320, 321 పేజీలు చూడండి.)

వీటినన్నిటిని బట్టి సృష్టి ప్రారంభంలో ఉండిన మానవులు అత్యంత దీర్ఘాయుష్కులని, దీర్ఘకాయులని స్పష్టమవుతోంది. అదే విధంగా ఇతర జీవరాసులు, వృక్ష జాతి వగైరా కూడా ఉండవచ్చునేమో! వాస్తవం దేవునికే తెలియాలి. ఆనాటి నుంచి మానవుని ఎత్తు, వయస్సు క్రమంగా తగ్గిపోతూ నేడు సగటున అరడుగులకు, ఎనభై సంవత్సరాలకు దిగిపోయాయి.

**విషవాయువులు, విద్వేషాలు :** సైన్సు, సాంకేతిక విజ్ఞానాలు అతివేగంగా పెరుగుతున్న నేటికాలంలో అంతేవేగంతో ప్రపంచ పరిస్థితులు కూడా మారుతున్నాయి. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం వల్ల మానవుడు అధికోత్పత్తిని సాధించగల్గుతున్నాడుగాని, వాటిద్వారా పరోక్షంగా వస్తున్న దుష్ఫలితాల నుండి బయట పడలేకపోతున్నాడు. అలాగే వ్యాధుల చికిత్స కోసం వాడే ఆధునిక మందులు కూడా మనిషికి ఎన్నో సైడ్‌ఎఫెక్ట్స్ తెచ్చిపెట్టి మరిన్ని రోగాలు రావడానికి కారణభూతమవుతున్నాయి. భూమికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్‌పొరకు రిఫ్రిజేటర్లు తదితర వస్తువులు ఎంతో హాని కలగజేస్తున్నాయని శాస్త్రవేత్తలు ఆందోళన వెలిబుచ్చుతున్నారు. మరోవైపు ఫ్యాక్టరీలు, మోటారువాహనాలు, రసాయనిక ఆయుధాల నుండి వెలువడుతున్న రకరకాల విషవాయువులు పర్యావరణ పరిస్థితులను అతివేగంగా మార్చివేస్తున్నాయి. ఇవన్నీ మానవుని ఆయుష్షు తగ్గిపోవడానికి కారణమవుతున్నాయని చెప్పవచ్చు.

వేరొకవైపు మనుషుల్లోని స్వార్థం, అవినీతి, బాధ్యతారాహిత్యాలు కూడా ఎన్నో కష్టనష్టాలు తెచ్చిపెడ్తున్నాయి. మానవుడు నైతికంగా నానాటికి దిగజారిపోతున్నాడు. మానవత్వం అడుగంటి పోతోంది. దేవుడు, మతాల పేరిట కూడా మానవుల మధ్య ద్వేషం, దురభిమానాలు అధికమవుతున్నాయి. భౌగోళిక స్థితిగతులు మారిపోతున్నాయి. విశ్వాంతరాళంలో కూడా వేగంగా మార్పులు సంభవిస్తున్నాయి.

ఇవన్నీ విశ్వవినాశాన్ని సూచిస్తున్నట్లు గోచరిస్తున్నాయి. విశ్వవినాశం గురించి 1400 సంవత్సరాల క్రితం అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) చెప్పిన ఈ భవిష్యత్ వాణి కూడా గమనార్హమైనది: "ఈ ప్రపంచం అంతిమ దశకు చేరుకొని క్రింద పడి పోనున్న వస్త్రంలా ఒక్క పోగు మీద వ్రేలాడుతోంది." (మిష్కాత్)

పైనుంచి జారిపోయి ఒకే ఒకే నూలుపోగు మీద వ్రేలాడుతున్న వస్త్రం ఏ క్షణాన్నయినా క్రింద పడిపోవచ్చు. అలాగే ఈవిశ్వం పతనపుటంచులకు చేరుకొని సర్వనాశనం కావడానికి సిద్ధంగా ఉంది. ఈ వినాశాన్నే ఇస్లాం ప్రళయం (ఖియామత్) అంటోంది.



## ప్రళయ సూచనలు-20

అయితే ప్రళయానికి ముందు ప్రళయ సూచనలుగా కొన్ని సంఘటనలు జరుగుతాయి. అవి సంభవించనంతవరకు ప్రళయం రాదని తెలుస్తోంది. చెడుల్ని అరికట్టడం, మంచిని పెంచడం, సంఘసంస్కరణ కార్యక్రమాలు చేపట్టడం ముస్లింల విధి. ముస్లింలు గనక ఈపనులు చేయకుండా పాపకార్యాల్లో కూరుకుపోతే వారు కూడా ప్రపంచంలో దైవశిక్ష చవిచూడవలసి వస్తుంది. దీన్ని గురించి దైవప్రవక్త(సల్లం) ఇలా ప్రవచించారు :

పదిహేను దుర్లక్షణాలు:- "నా అనుచర సమాజంలో ఎప్పుడైతే పదిహేను (దుర్) లక్షణాలు చోటుచేసుకుంటాయో అప్పుడు దానిపై ఆపదలు రావడం మొదలవుతాయి. (కొందరు ఈ మాట విని) 'అయితే దైవప్రవక్తా! ఆ లక్షణాలు ఏమిటీ?' అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా సెలవిచ్చారు:

(1) ప్రభుత్వ ఆస్తులను సొంత ఆస్తులుగా పరిగణించడం. (2) అమానత్ (భద్ర పరచడానికి అప్పగించబడిన సొత్తు)ను సమరసొత్తు (మాలెగనీమత్)గా తలచడం. (3) (పేదల ఆర్థిక హక్కయిన) జకాత్ ధనాన్ని జరిమానాగా భావించడం. (4) భర్త తన భార్యకు విధేయుడైపోవడం. (5) కొడుకు తన తల్లి పట్ల అవిధేయుడయి ప్రవర్తించడం. (6) మనిషి తన స్నేహితులకు మాత్రమే మేలుచేసి, (7) తన తండ్రిపై దౌర్జన్యం చేయడం. (8) మసీదులో అల్లరి చేయడం. (9) ఒక జాతిలోని అత్యంత నీచుడు ఆజాతికి నాయకుడై పోవడం. (10) వ్యక్తిలోని చెడుకు భయపడి జనం అతడ్ని గౌరవించడం. (11) మత్తు పదార్థాలను బహిరంగంగా వినియోగించడం. (12) పురుషులు పట్టువస్త్రాలు ధరించడం. (13) సంగీత వాయిద్యాలను అవలంబించడం. (14) గాయకురాళ్ళను సమావేశ పరచడం. (15) అప్పటి ప్రజలు తమ పూర్వీకులను నిందించడం, దూషించడం.

ఈ లక్షణాలు చోటుచేసుకోవడం ప్రారంభించగానే ప్రజలు ఇక ఎల్లవేళలా దైవశిక్ష కోసం ఎదురుచూడాల్సి వస్తుంది. ఈశిక్ష ఎర్రటి గాలిదుమారం రూపంలోనైనా రావచ్చు, లేదా భూకంపం రూపంలోనైనా రావచ్చు, లేదా సబ్బత్ (శనివారం) వాళ్ళకు వచ్చినట్లు ముఖాలు వికృతంగా మార్చివేసే శిక్షయినా రావచ్చు." (తిర్మిజి)

**కుమార్తెలకు తల్లుల చాకిరి :** దైవదూత జిబ్రీల్ (అలైహి) ప్రళయ సూచనలను గురించి అడిగిన ప్రశ్నకు దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ ఇలా చెప్పారు: "ఆ సూచనల్లో ఒకటి, బానిసమహిళ తన యజమానురాలిని కంటుంది. (అంటే కుమార్తెలు తమతల్లుల మీద పెత్తనం చెలాయిస్తూ వారిచేత చాకిరి చేయించుకుంటారు.) రెండవ సూచన, కాళ్ళకు చెప్పులు, ఒంటికి సరిపడ దుస్తులు లేకుండా మేకలుకాసేవారు (కూడా) పెద్దపెద్ద భవంతులు కట్టడం మొదలెడతారు. ఆ విషయంలో వారు ఒకర్నొకరు మించిపోవడానికి ప్రయత్నిస్తారు." (బుఖారి, ముస్లిం)

"నా అనుచర సముదాయంలో 'ఖడ్గం' పెట్టబడినప్పుడు (అంటే అంతఃకలహాలు మొదలైతే) ఇక ప్రళయంవరకూ ఆ ఖడ్గం నడుస్తూనే ఉంటుంది. నా అనుచర సముదాయంలోని అనేకతెగలు బహుదైవారాధకులుగా మారనంతవరకు, అనేకతెగలు విగ్రహారాధన చేయనంతవరకు ప్రళయం రాదు.... నా అనుచర సముదాయంలో 30 మంది పరమ అబద్ధీకులు పుడ్తారు. వారిలో ప్రతిఒక్కడూ తాను దైవప్రవక్తనని చెప్పుకుంటాడు. నిజానికి నేను అంతిమదైవప్రవక్తను. నా తర్వాత మరే దైవప్రవక్తా ఉండడు." (మిష్కాత్)

**అంతర్యుద్ధాలు :** బుఖారి గ్రంథంలోని హదీసుల ప్రకారం ముస్లింలలో సంభవించే అంతఃకలహాలను గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు:

"(ముస్లింలకు చెందిన) రెండు పెద్ద వర్గాలు పరస్పరం పోట్లాడుకొని వారి మధ్య తీవ్రంగా యుద్ధం జరగనంతవరకు ప్రళయం రాదు. ఆ రెండు వర్గాల వాదన ఒక్కటే."

"సమీప కాలంలో మీ మధ్య కల్లోలాలు చెలరేగుతాయి. అప్పుడు నిలబడినవాని కంటే కూర్చున్నవాడు, నడుస్తున్న వానికంటే నిలబడి ఉన్నవాడు, పరుగెత్తుతున్న వాని కంటే నడుస్తున్నవాడు క్షేమంగా ఉంటారు. ఆ కల్లోలాల వైపు ఎవరైనా తొంగిచూసినా సరే అవి అతడ్ని తమ వైపుకు లాక్కుంటాయి. అలాంటి పరిస్థితిలో ఎవరికి ఏ ఆశ్రయం దొరికితే అతనా ఆశ్రయానికి వెళ్ళి దాక్కోవాలి."

ఈ అంతఃకలహాలు మూడవ ఖలీఫా హజ్రత్ ఉస్మాన్ (రజి) పాలనాకాలం నుంచి ప్రారంభమయి ఇమామ్ హుసైన్ (రజి) అమరగతితో తగ్గుముఖం పట్టాయి.

**అలంకారప్రాయమైన మసీదులు :** అంతిమ దైవప్రవక్త (సల్లం) చెప్పిన మరికొన్ని భవిష్యత్ ప్రకటనలు చూడండి:

"అతి త్వరలో ఓ కాలం రానున్నది. ఆ కాలంలో ఇస్లాం నామమాత్రంగా ఉండిపోతుంది. ఖుర్ఆన్ (పఠనం) ఒక ఆచారంగా మిగిలిపోతుంది. వారి మసీదులు బాగానే (రకరకాల అలంకరణలతో) కళకళ లాడుతుంటాయి. కాని సన్మార్గం, హితబోధల రీత్యా నిర్మానుష్యంగా ఉంటాయి. వారి ధర్మవేత్తలు ఆకాశం క్రింద (లోకంలో) ఉండే వారందరిలో పరమ చెడ్డవాళ్ళు అవుతారు. వారివల్ల ఉపద్రవాలు (సంక్షోభం, సమస్యలు) చెలరేగుతాయి. తరువాత వారందులోకి తిరిగి వస్తారు." (బైహఖి)

"ప్రళయ సూచనల్లో ఒకటి, ప్రజలు మసీదులు నిర్మించి వాటి పట్ల గర్విస్తారు."; "మీరు తప్పకుండా యూదులు, క్రైస్తవుల్లా మసీదుల్ని అలంకరిస్తారు." (అబూదావూద్)

"మీరు మసీదుల్ని అలంకరించడం, ఖుర్ఆన్ గ్రంథాలను అందంగా తీర్చిదిద్దడం ప్రారంభించగానే మీ వినాశకాలం సమీపించిందని గ్రహించండి." (కన్జుల్ఆమాల్)

"ఒక కాలం రానున్నది. ఆ కాలంలో ప్రజలు తమ ప్రాపంచిక విషయాలను మసీదులలో మాట్లాడుకుంటారు. మీరు వారి దగ్గర కూర్చోకండి. దేవునికి వారి అవసరం ఎంత మాత్రం లేదు." (బైహఖి)



**వందేళ్ళకో సంస్కర్త :** "దేవుడు ఈ (ముస్లిం)సముదాయం కోసం ప్రతి వందేళ్ళ తర్వాత ఈ ధర్మానికి కొత్తదనం చేకూర్చే మనిషిని పంపిస్తుంటాడు." (అబూదావూద్)

"జాగ్రత్తగా వినండి! నాకు నిస్సందేహంగా ఖుర్ఆన్ ఇవ్వబడింది. అలాగే ఖుర్ఆన్ ఆజ్ఞల్లాంటి ఇతర ఆజ్ఞలు (హదీసులు) కూడా ఇవ్వబడ్డాయి.... జాగ్రత్త! ఒక కాలం రానున్నది. ఆ కాలంలో కడుపునిండిన వాడొకడు హాయిగా కూర్చొని 'మీకు ఖుర్ఆన్ ఒక్కటే చాలు. అందులో ధర్మసమ్మతమైనవని తెలిపిన వాటిని ధర్మసమ్మతమైనవిగా, నిషిద్ధమైనవని తెలిపిన వాటిని నిషిద్ధమైనవిగా భావించండి. (హదీసులు మనకు అవసరం లేదు.)' అని అంటాడు." (మిష్కాత్)

**ప్రాపంచిక వ్యామోహం :-** "పఠించండి (ఖుర్ఆన్). మీరంతా సరిగానే పఠిస్తున్నారు. అయితే (నా తదనంతరం) త్వరలో ఖుర్ఆన్‌ని బాణం మాదిరిగా సరిచేసేవారు ఉద్భవిస్తారు. (అంటే పఠనంలో అక్షరాల పట్ల, ఉచ్చారణ పట్ల ఎంతో శ్రద్ధవహిస్తారు. కాని) ఖుర్ఆన్ పఠనం ద్వారా ప్రాపంచిక ప్రయోజనాలు సాధించడమే వారి లక్ష్యం అవుతుంది. దాని ద్వారా తమ పరలోక జీవితాన్ని సరిదిద్దుకోవాడం వారి లక్ష్యం కాదు." (మిష్కాత్)

ఖుర్ఆన్ పఠనం గురించే దైవప్రవక్త (స) వేరొక హదీసులో ప్రస్తావిస్తూ, వారు ఖుర్ఆన్ బాగానే పఠిస్తారు కాని, అది వారి కంఠం నుంచి క్రిందికి దిగదన్నారు.

హజ్రత్ సౌబాన్ (రజి) కథనం ప్రకారం ఒకసారి దైవప్రవక్త (స) హితబోధ చేస్తూ ఇలా ప్రవచించారు: "మిమ్మల్ని అంతమొందించడానికి త్వరలోనే (సత్యవ్యతిరేక) జాతులన్నీ ఏకమయ్యే కాలం రానున్నది. భోజనం చేసేవారు ఒకర్నొకరు పిలుచుకుంటూ కంచాల మీద ఎగబడినట్లు వారు మీమీద విరుచుకుపడతారు." ఒకతను ఈమాట విని "ఆ కాలంలో మా జనాభా తక్కువగా ఉంటుందా?" అని ప్రశ్నించాడు.

దానికి దైవప్రవక్త (స) "తక్కువగా ఉండదు. ఆ కాలంలో మీ జనాభా అత్యధికంగా ఉంటుంది. అయితే (వరదనీటి నురుగులా లేక) వరదనీటిలో కొట్టుకు పోయే గడ్డి పోచల్లా ఉంటారు మీరు. దేవుడు మీ శత్రువుల హృదయాల నుండి మీపట్ల ఉన్న భయాన్ని తీసివేస్తాడు. మీ హృదయాల్లో పిరికితనం చోటు చేసుకుంటుంది" అని చెప్పారు. అప్పుడు ఒకతను "ఈ పిరికితనం ఎందువల్ల వస్తుందీ?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "మీరు ప్రాపంచిక వ్యామోహానికి గురవుతారు; మృత్యువుని అసహ్యించుకుంటారు" అని జవాబిచ్చారు. (అబూదావూద్)

హజ్రత్ అలి (రజి) కథనం: మేము దైవప్రవక్త (స)తో కలసి మసీదులో కూర్చొని ఉన్నప్పుడు హఠాత్తుగా ముస్అబ్ బిన్ ఉమైర్ (రజి) లోపలికి వచ్చారు. అప్పుడాయన వంటి మీద తోలు మాసికలున్న ఒక దుప్పటి మాత్రమే ఉంది. దైవప్రవక్త (స) ఆయన పరిస్థితి చూసి, ఆయన ఇస్లాం స్వీకరణకు పూర్వపురోజులు గుర్తుచేసుకొని కంటతడి పెట్టారు. (ఇస్లాం స్వీకరించక పూర్వం ఉమైర్ ఎంతో ఖరీదైన దుస్తులు ధరించేవారు.)

**ధనమున్న ధార్మిక పేదలు :** తర్వాత ఆయన ఇలా అన్నారు: "(ముస్లింలారా!) ఉదయం ఒక జతబట్టలు, సాయంత్రం ఒకజత బట్టలు ధరించి ఇళ్ళ నుండి బయలు దేరే కాలం వచ్చినప్పుడు మీ పరిస్థితి ఎలా ఉంటుంది? ఆ కాలంలో మీ ముందు ఒక గిన్నె ఉంచబడుతుంది, మరోగిన్నె మీముందు నుంచి తీసేయబడుతుంది. కాబాకు వేలాడదీసినట్లు ఆ కాలంలో మీరు మీ ఇండ్లకు ఖరీదైన పరదాలు వేలాడదీస్తారు."

ప్రవక్త అనుచరులు (రజి) ఈ మాటలు విని "అయితే దైవప్రవక్తా! ఈనాటి కన్నా రాబోయే కాలంలో మా పరిస్థితి చాలా మెరుగ్గా ఉంటుందన్నమాట. సంపాదన కోసం ఎక్కువగా కష్టపడవలసిన అవసరముండదు. ఆరాధన కోసం మాకు కావలసినంత సమయం దొరుకుతుంది కదా!" అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) వారి మాటలను ఖండిస్తూ "కాదు. మీరు రాబోయే ఆ రోజులకంటే ఈనాడే మంచివాళ్ళు. (ఈనాడు మీరు సిరిసంపదల రీత్యా పేదలయిన్నప్పటికీ విశ్వాసం రీత్యా ఎంతో భాగ్యవంతులు. ఆ కాలంలో మీరు సిరిసంపదల రీత్యా భాగ్యవంతులయినప్పటికీ విశ్వాసం రీత్యా చాలా పేదవాళ్ళుగా ఉంటారు)" అని చెప్పారు. (తిర్మిజి)

ఒకసారి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "నా సహాబీలను (అనుచరులను) గౌరవించండి. (నా అనుచర సముదాయంలో) వీరే అందరికంటే మంచివాళ్ళు. ఆ తరువాత వీరి తదనంతరం వచ్చేవారు (తాబయీన్) మంచివాళ్ళు. ఆ తరువాత అబద్ధం వ్యాపిస్తుంది. (అబద్ధం బాగా వ్యాపిస్తూ) చివరికి మనిషి అడగకుండానే ప్రమాణం చేస్తాడు. అలాగే సాక్ష్యం గురించి అడగకపోయినా సాక్ష్యం చెబుతాడు." (నిసాయి)

**ధనార్జనే ధ్యేయం :** ముస్లిం గ్రంథంలోని ఒక ఉల్లేఖనంలో "ఆ తర్వాత వచ్చేవారు (పూర్తిగా ప్రాపంచిక వ్యామోహంలో పడిపోయి అక్రమ సంపాదనలతో విలువైన ఆహారం తింటూ) బలిసిపోవడానికి ఇష్టపడతారు" అని ఉంది.

కొన్ని హదీసులలో "మనిషి అక్రమ సంపాదన-సక్రమ సంపాదన అనే విషయాన్ని పట్టించుకోకుండా ఎలాగైనా సంపాదించడమే ధ్యేయంగా పెట్టుకునే రోజులు వస్తాయి" అని; మరికొన్ని హదీసులలో "వడ్డీ తిననివారంటూ ఉండని రోజులు వస్తాయి. ఒకవేళ ఎవరైనా వడ్డీ తినకపోయినా వారిపై వడ్డీ ధూళి మాత్రం వచ్చి పడుతుంద"ని ఉంది.

హజ్రత్ ఉమర్ (రజి) ప్రకారం దైవప్రవక్త(స) హితోక్తి: "ప్రళయ సూచనల్లో కొన్ని-స్త్రీలు తమపై పెత్తనం చెలాయించే బాలికలను కంటారు. కాళ్ళకు చెప్పుల్లేని, శరీరాలకు తగిన బట్టలులేని పేదలు, మేకలకాపరులు ఎత్తయిన భవనాల పట్ల గర్విస్తారు.

**దృఢవిశ్వాసులు :** "మేము సృష్టించినవారిలో ఒక వర్గం (సదా) సత్యం వైపుకే దారి చూపుతుంది; సత్యానికి అనుగుణంగానే నిర్ణయాలు చేస్తుంది." (ఖుర్ఆన్-7:181)

"నా అనుచర సముదాయంలో ఒక సమూహం దైవాజ్ఞలు పాటించడంలో ఎల్లప్పుడూ స్థిరంగా ఉంటుంది. జీవితాంతం అదేవిధంగా ఉంటుంది. వ్యతిరేకత,



సహాయనిరాకరణలు దానికి ఏమాత్రం నష్టం కలిగించలేవు." (మిష్కాత్)

"రానున్న ఒక కాలంలో (దైవాజ్ఞలను పూర్తిగా పాటిస్తూ) ధర్మంలో స్థిరంగాఉండే వారి పరిస్థితి చేతిలో అగ్నికణం పట్టుకున్నవాడిలా ఉంటుంది." (మిష్కాత్)

"నా సముదాయానికి చెందిన అంత్యకాలంలో ఉండేవారికివారికి పూర్వం ఉండిన వారికి లభించిన పుణ్యఫలమే లభిస్తుంది. వారు సత్కార్యాలను గురించి ఆదేశిస్తారు; చెడులనుండి వారిస్తారు; అల్లర్లు, అలజడులు రేకెత్తించేవారితో పోరాడుతారు." (బైహఖి)

**యూదుల అడుగుజాడల్లో :** "గతంలో ఇస్రాయీల్ సంతతి ప్రజలకు వచ్చినటువంటి కాలం నా అనుచర సముదాయానికి తప్పకుండా వస్తుంది, ఒక పాదరక్ష మరొక పాదరక్షను పోలినట్లు. ఇస్రాయీల్ సంతతిలో ఎవరైనా తన తల్లితో వ్యభిచరించి ఉంటే, నా అనుచర సముదాయంలో కూడా అలాంటివారు ఉంటారు. ఇస్రాయీల్ సంతతిలో 72 మతవర్గాలు ఏర్పాడ్డాయి. అలాగే నా అనుచర సముదాయంలో కూడా 72 మతవర్గాలు ఏర్పడుతాయి. వాటిలో ఒక్క వర్గం తప్ప మిగిలిన వర్గాలన్నీ నరకానికి పోతాయి" అన్నారు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం).

అప్పుడు కొందరు అనుచరులు "స్వర్గానికి పోయేవారు ఎవరూ?" అని అడిగారు. దానికి ఆయన "నేను, నా అనుచరులు నడిచిన బాటలో నడిచేవారు" అన్నారు.

**ధనాధిక్యత :** "మీలో సిరిసంపదలు ఎక్కువై ధనికుడు తన దానాన్ని ఎవరు స్వీకరిస్తారా అని చూస్తూ విచారంగా ఉండనంతవరకు ప్రళయం రాదు" (ముస్లిం)

"మీకొక కాలం రానున్నది. ఆ కాలంలో మనిషి దానం(డబ్బు) తీసుకొని బయలు దేరుతాడు. కాని దానం స్వీకరించేవారు ఎవరూ దొరకరు. ఎవరికైనా ఇద్దామని వెళ్తే ఆ వ్యక్తి 'నీవు నిన్న వచ్చివుంటే నేనీ దానం స్వీకరించేవాడ్ని. ఈరోజు నాకు దాని అవసరం లేదు' అని అంటాడు." (మిష్కాత్)

"(యమన్‌లో నివశించే) ఖహ్తాన్ తెగకు చెందిన మహాబలాఢ్యుడు ఒకడు తన క్రరతో (అధికార బలంతో) ప్రజలపై (తన ఇష్టమొచ్చిన విధంగా) పెత్తనం చెలాయించనంతవరకూ ప్రళయం సంభవించదు." (బుఖారి, ముస్లిం)

"వెండ్రుకలతో తయారైన పాదరక్షలు ధరించే జాతితో మీరు యుద్ధం చేయనంత వరకూ ప్రళయం రాదు. అలాగే సొట్టబోయిన డాలువంటి ముఖాలుగల జాతితో కూడా మీరు యుద్ధం చేయనంతవరకూ ప్రళయం రాదు." (బుఖారి, ముస్లిం)

**కాబా విధ్వంసం:** హజ్రత్ ఆయిషా (రజి) కథనం: దైవప్రవక్త (స) ఒక భవిష్యత్ ప్రకటన చేస్తూ "ఒక సైన్యం కాబాలయంపై దాడిచేసే ఉద్దేశ్యంతో వస్తుంది. అయితే ఆ సైన్యం 'బైదా' ప్రాంతంలో ఉండగానే అది మొదలు నుంచి చివరిదాకా భూమిలోకి కూరుకుపోతుంది" అని చెప్పారు. నేనీ మాట విని "దైవప్రవక్తా! ఆ సైన్యం మొదలు

నుంచి చివరిదాకా ఎలా కూరుకుపోతుంది? వారిలో బజారున పోయేవారు, వారిలో చేరనివారు కూడా ఉంటారుకదా!" అన్నాను. దానికి దైవప్రవక్త (స) "మొదటి నుంచి చివరిదాకా అందరూ కూరుకుపోతారు. అయితే ఆ తర్వాత (ప్రళయదినాన) బ్రతికించి లేపబడేటప్పుడు వారివారి సంకల్పాలను బట్టి లేపబడతారు. (అంటే అమాయకుల్ని వదలి పాపాత్ముల్ని మాత్రమే శిక్షించడం జరుగుతుంది)" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)

"అబిసీనియాకు చెందిన చిన్న పాదాలు (పిక్కలు) గల ఒకతను కాబా గృహాన్ని ధ్వంసం చేస్తాడు." (బుఖారి, ముస్లిం)

"కాలం (త్వరత్వరగా గడచిపోతూ) దగ్గరవుతుంది. సంవత్సరాలు (వేగంగా ముగిసి పోతూ) తగ్గిపోతాయి. ఫలోత్పత్తి తగ్గిపోతుంది." (తబ్రాని)

**ఇస్లాం చిక్కిపోతుంది :** "పాము కన్నంలో దూరి చుట్ట చుట్టుకున్నట్లు ఇస్లాం కూడా కురచవుతూ హిజాజ్ (సౌదీఅరేబియా)కు పరిమితమయి పోతుంది. అడవిమేక కొండకోనలో ఉండిపోయినట్లు ఇస్లాం హిజాజ్‌లోనే ఉండిపోతుంది."

"ప్రారంభ కాలంలో ఇస్లాం ధర్మం ఒక వింతగా, అపరిచిత విషయంగా ఉండేది. ఒకరిద్దరు తప్ప ఎవరూ ఇస్లాం స్వీకరించేవారు కాదు. త్వరలోనే ఇస్లాం ప్రారంభంలో ఉన్నట్లు తిరిగి (ప్రజలకు) అపరిచితమై పోతుంది. దాన్ని ఆచరించేవారు కొందరు మాత్రమే ఉంటారు. నా తదనంతరం విచ్ఛిన్నం చేయబడిన నా సంప్రదాయాలను పునరుజ్జీవింపజేసే అపరిచితులకు శుభవార్త లభించుగాక!" (తిర్మిజి, ఇబ్నెమాజ)

**స్త్రీజనాభా పెరుగుతుంది :** "ప్రళయకాల చిహ్నాలలో ఇవి కూడా ఉన్నాయి: విద్యాజ్ఞానాలు అంతరించి పోతాయి. అజ్ఞానం పెరిగిపోతుంది. వ్యభిచారం ఎక్కువయి పోతుంది. మద్యపానం సర్వసామాన్యమయి పోతుంది. పురుషజనాభా తగ్గిపోయి స్త్రీ జనాభా పెరుగుతుంది. చివరికి యాభైమంది స్త్రీలను కనిపెట్టుకొని ఉండేందుకు ఒకే ఒక పురుషుడు ఉంటాడు." (బుఖారి, ముస్లిం)

"దేవుడు విద్యాజ్ఞానాలను తన దాసుల నుండి అకస్మాత్తుగా తీసేసుకోడు. ధర్మ వేత్తలకు మృత్యువు కలిగించి విద్యాజ్ఞానాలను క్రమేణా అంతమొందిస్తాడు. ఏ ఒక్క ధర్మవేత్తను కూడా విడిచిపెట్టడు. అప్పుడు ప్రజలు అజ్ఞానులను తమ నాయకులుగా చేసుకుంటారు. ఆ నాయకులు సరైన జ్ఞానం లేకుండానే ధార్మిక తీర్పులు (ఫత్వాలు) జారీచేస్తారు. ఈ విధంగా వారూ భ్రష్టులయి ప్రజలను కూడా భ్రష్టు పట్టిస్తారు."

"విద్యాజ్ఞానాలు అంతరించిపోనంతవరకు, ఒకదాని తర్వాత ఒకటి అనేక భూకంపాలు రానంతవరకు ప్రళయం రాదు." (బుఖారి, ముస్లిం)

"మనిషి ఏదైనా సమాధి సమీపంగా పోవడం జరిగినప్పుడు అతను 'ఈ సమాధిలో ఈ శవానికి బదులు నేనుంటే ఎంత బాగుండు' అని అనేటంతటి (కల్లోల) పరిస్థితి దాపురించనంతవరకూ ప్రళయం రాదు." (బుఖారి, ముస్లిం)



**బంగారుకొండ బయల్పడుతుంది :** "ప్రళయం రావడానికి ముందు ఫురాత్ నది నుండి ఒక బంగారుకొండ బయల్పడుతుంది. దాన్ని స్వాధీనం చేసుకోవడానికి జనం యుద్ధం చేస్తారు. ఆ యుద్ధంలో 99 శాతం మంది చనిపోతారు. వారిలో ప్రతి ఒక్కడూ తాను బహూశా బ్రతికి బయటపడగలనని భావిస్తాడు." (ముస్లిం)

"దైవసాక్షి! మనిషితో జంతువులు మాట్లాడనంతవరకు; కొరడా ముందు భాగం, చెప్పువారు 'నీవు వెళ్ళిపోయిన తరువాత నీ ఇంటివాళ్ళు ఈ పని చేశారు' అని మనిషికి చెబుతూ మాట్లాడనంతవరకూ ప్రళయం సంభవించదు." (తిర్మిజి)

"మీరు ముందుగా కొన్ని సూచనలు చూడనంతవరకు ప్రళయం సంభవించదు. అవి- పొగ, దజ్జాల్, (విశేష)భూచరం, పడమర నుంచి సూర్యోదయం, మర్యం కుమారుడు ఈసా (అలైహి) అవతరణ, యాజూజ్-మాజూజ్‌ల దండయాత్రలు, నేల క్రుంగిపోయే మూడు పెద్ద సంఘటనలు- ఒకటి తూర్పున, రెండు పడమరన, మూడు అరేబియా ద్వీపంలో. ఆ తరువాత చివర్లో యమన్ నుండి భయంకరమైన అగ్ని(మంట) బయలుదేరి ప్రజలను హష్ర్ మైదానికి తోలుకెళ్ళుంది." (ముస్లిం)

## మహ్దీ (అలైహి)-21

ప్రళయానికి అతి సమీపంలో సంభవించే విశేషాలను గురించి మౌలానా అష్రఫ్ అలి థానవి (రహ్మలై) అనేక హదీసులను లోతుగా అధ్యయనం చేసి, విశ్లేషించి వాటిని "ఖియామత్ నామా" అనే పుస్తకంలో వివరంగా పేర్కొన్నారు. దాన్ని నేనిక్కడ యధాతథంగా అనువదించి పాఠకుల ముందు పెడ్తున్నాను.

అబూదావూద్ ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "మీరు క్రైస్తవులతో శాంతిఒప్పందం చేసుకుంటారు. తర్వాత వారు, మీరు కలసి మరో క్రైస్తవ వర్గంతో యుద్ధం చేసి విజయం సాధిస్తారు. అందులో లభించిన సమరసొత్తు తీసుకొని పెద్దపెద్ద గుట్టలుండే ఒక మైదానంలోకి వచ్చి విడిదిచేస్తారు. అక్కడ అనేక చెట్లు కూడా ఉంటాయి. అప్పుడు ఒక క్రైస్తవ సైనికాధికారి చేతిలో శిలువ తీసుకొని "ఈ శిలువ శుభంతో మనకు విజయం లభించింది" అంటాడు. ఈ మాటకు కోపంతో ఒక ముస్లిం అతని దగ్గర్నుండి సిలువ లాక్కొని దాన్ని విరగ్గొడ్తాడు. దాంతో క్రైస్తవులు ఒప్పందం తెంచివేసి ముస్లింలకు వ్యతిరేకంగా యుద్ధసన్నాహాలు మొదలుపెడతారు...."

మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం వారు ఇంతకు ముందు ముస్లింలతో కలసి యుద్ధం చేసిన క్రైస్తవవర్గాన్ని ఒప్పందంతో తమలో కలుపుకుంటారు. తర్వాత వారు మీపై యుద్ధానికి దిగుతారు. వారిదగ్గర 80 యుద్ధపతాకాలు ఉంటాయి. ప్రతి యుద్ధపతాకం క్రింద 12,000 మంది సైనికులు ఉంటారు. (ఈవిధంగా మొత్తం 9,60,000 మంది సైనికులతో ముస్లింలపై విరుచుకుపడతారు..... ముస్లింలు కూడా ఆయుధాలు తీసుకొని రంగంలోకి దిగుతారు. ఈ యుద్ధంలో పోరాడే ముస్లింలకు దేవుడు అమరగతి భాగ్యం ప్రసాదిస్తాడు. వారి రాజు కూడా వీరమరణం పొందుతాడు.

మిగిలిన ముస్లింలు మదీనా వెళ్ళి తలదాచు కుంటారు. క్రైస్తవులకు సిరియా హస్తగత మవుతుంది. వారి రాజ్యం ఖైబర్ దాకా విస్తరిస్తుంది.

ముస్లింలు తమరాజు యుద్ధంలో చనిపోయాక ఆయన స్థానంలో ఎవరిని ఖలీఫా గా చేయాలా అని పరస్పరం సంప్రదించుకుంటారు. అప్పుడు వారి దృష్టి మదీనాలోనే నివసిస్తున్న ఒక పుణ్యపరుషుని మీదికి పోతుంది. ఆ పుణ్యపరుషుడే "మహ్‌ది (అలైహి)." అయితే రాజు వారసుడి ఎన్నిక గురించి జరుగుతున్న ప్రయత్నాల సంగతి విని మహ్‌ది (అలై) తనను ఎక్కడ ఖలీఫాగా చేస్తారోనని భయపడి మదీనా నుండి మక్కా వెళ్ళి పోతారు. కాని మక్కా ప్రజలు ఆయన్ని గుర్తుపట్టి ఇంట్లో నుంచి బయటికి రప్పించి, ఆయనచేత బలవంతంగా ఖలీఫా పదవి గురించి ప్రమాణం (బయత్) చేయిస్తారు.

కొన్ని ఉల్లేఖనాల ప్రకారం మహ్‌ది (అలై:హి) అసలు పేరు ముహమ్మద్. ఆయన తండ్రి పేరు అబ్దుల్లా. ఆయన గుణగణాలు ఇమాం హసన్ (రజి) గుణగణాలను పోలి ఉంటాయి. ఆయన ముక్కు కోటేరులా ఉంటుంది. ముఖం కాంతిమంతంగా ఉంటుంది. (అబూదావూద్, మిష్కాత్)

**ఎడతెరిపిలేని యుద్ధాలు :** మహ్‌ది (అలైహి) ఖలీఫా అయిన వార్త దేశంలో నలుమూలలా వ్యాపించి సిరియా ప్రజలకు కూడా తెలిసిపోతుంది. అప్పుడు సిరియా నుంచి ఒక సైనికదళం ముస్లింలపై యుద్ధం చేయడానికి మదీనా దిశగా ప్రయాణ మవుతుంది. అయితే ఆ సైనికదళం ముస్లిం సైన్యాల దగ్గరికి చేరుకోకముందే దారిలో మక్కా, మదీనాల మధ్య ఉన్న బైదా అనే చోట భూమిలో దిగబడి అంతమయిపోతుంది. ఈ సంగతి విన్న సిరియా దైవప్రియులు, ఇరాఖ్ పుణ్యాత్ములు మహ్‌ది (అలైహి)ను కలుసుకోవడానికి వస్తారు. తరువాత ఖురైష్ సంతతికి చెందిన బనీకిలాబ్ తెగ నుండి ఒక సైనికదళం మహ్‌ది (అలైహి)పై యుద్ధం చేయడానికి వస్తుంది. ఇరుపక్షాల మధ్య యుద్ధం జరుగుతుంది. ఈ యుద్ధంలో ముస్లింలకు విజయం లభిస్తుంది.

మహ్‌ది (అలై)కు అవిశ్వాసులతో అనేకయుద్ధాలు చేయవలసివస్తుంది. ముఖ్యంగా క్రైస్తవులతో అనేకయుద్ధాలు చేస్తారు. ఆయన మక్కా నుండి మదీనా చేరుకొని అక్కడ అంతిమ దైవప్రవక్త (స) సమాధిని దర్శించుకుంటారు. తరువాత సిరియా వైపు బయలు దేరుతారు. సిరియాలోని డెమాస్కస్‌కు చేరుకునేటప్పటికి అక్కడ క్రైస్తవ సైన్యాలతో తలపడవలసి వస్తుంది. ముస్లిం గ్రంథంలో దీన్ని గురించి ఇలా ఉంది:

"సిరియా ముస్లింలను అణచడానికి బ్రహ్మాండమైన శత్రుసైన్యం వస్తుంది. అదే సమయంలో మహ్‌ది (అలైహి) నాయకత్వాన మదీనా నుంచి వచ్చే ముస్లింసైన్యంతో సిరియా ముస్లింసైన్యం చేతులు కలుపుతుంది. ముస్లింలు శత్రువుని ఎదుర్కోవడానికి విజయమో వీరమరణమో తేల్చుకోవాలని చెప్పి ఓ ప్రత్యేక సైనికదళాన్ని పంపుతారు. ఈదళం పగలల్లా పోరాడినా శత్రువులను ఓడించలేరు. చీకటి పడగానే రెండుసైన్యాలు యుద్ధం విరమించి తమతమ స్థావరాలకు వెళ్ళిపోతాయి. మరునాడు ముస్లింలు



విజయమో వీరమరణమో తేల్చుకోవాలని చెప్పి మరో ప్రత్యేక సైనికదళాన్ని పంపుతారు. ఆ దళం కూడా పగలంతా పోరాడుతుంది కాని, శత్రువుని ఓడించలేకపోతుంది. ఆరోజు కూడా చీకటి పడగానే ఉభయపక్షాలు తమతమ స్థావరాలకు వెళ్ళిపోతాయి. మూడవ రోజు కూడా ముస్లింలు విజయమో వీరమరణమే తేల్చుకోవడానికి వేరొక ప్రత్యేకదళం పంపిస్తారు. కాని ఆరోజు కూడా ముస్లింలు శత్రువులను ఓడించలేరు. చీకటి పడగానే అందరూ తమతమ స్థావరాలకు వెళ్ళిపోతారు.

"ఈ మూడు రోజుల యుద్ధంలో ఉభయపక్షాలకు చెందిన సైనికులు అత్యధిక సంఖ్యలో చనిపోతారు. నాల్గవ రోజు మిగిలిన ముస్లింలు యుద్ధానికి సమాయత్తమవు తారు. ఆ రోజు యుద్ధం హోరాహోరిగా జరుగుతుంది. ఇదివరకెన్నడూ జరగనంత భయంకరంగా జరుగుతుంది. ఈ యద్ధంలో చివరికి దేవుడు అవిశ్వాసులకు మట్టి కరిపించి విశ్వాసులకు విజయం చేకూరుస్తాడు. యుద్ధమైదానంలో అనేక మైళ్ళ దూరం దాకా శవాలు గుట్టలు గుట్టలుగా పడివుంటాయి. శవాలను పీక్కుతినే దూడబోతులు ఎగురుతూ వచ్చి ఆ శవాల సమీపం నుంచి పోవడానికి ప్రయత్నిస్తాయి. కాని (ఆ శవాల నుంచి వెలువడే దుర్వాసనను భరించలేకనో, లేక శవాలు పడివున్న సుదీర్ఘ దూరాన్ని దాటలేకనో) అవి చచ్చి క్రిందపడి పోతాయి. ఈ యద్ధంలో పాల్గొని బ్రతికి బయటపడిన తమవారు ఎంతమంది ఉంటారో ఇరుపక్షాలు అంచనా వేస్తే 1% మాత్రమేనని తెలు స్తుంది. (అంటే 99% ఈ సమరాగ్నికి సమిధలవుతారన్న మాట!)"

"యుద్ధం ముగిసిన తరువాత ముస్లింలు బ్రతికి బయటపడినవారు ఎంతమందో లెక్కపెడ్తుంటే, అంతేకంటే ఘోరమైన మరో యుద్ధప్రమాదం గురించిన వార్త వస్తుంది. ముస్లింలు ఈ రెండోయుద్ధం గురించి తగిన వ్యూహరచన చేయకముందే వేరొక దుర్వార్త వస్తుంది. "మన భార్యాపిల్లలను సంక్షోభంలో పడవేయడానికి దజ్జాల్ బయల్పడ్డాడు" అనేదే ఆ వార్త. ఈ దుర్వార్త వినగానే ముస్లింలు తమకు చేజిక్కిన సమరసొత్తును అక్కడే విసిరేసి తమ ఇండ్లకు బయలుదేరుతారు. వారు దజ్జాల్‌ని గురించి నిజానిజాలు తెలుసుకోవడానికి తమలోని పదిమంది రౌతులను పంపిస్తారు..." (ముస్లిం)

ఈ యుద్ధంలో శత్రుసైనికులైన క్రైస్తవులు పెద్దఎత్తున చనిపోతారు. మిగిలినవారు రాజ్యాధికారం గురించి ఆలోచనను సైతం మనసులో నుంచి తీసివేసి బ్రతుకుజీవుడా అంటూ పారిపోతారు. చెట్టుకొకరు గుట్టకొకరయి పడుతూలేస్తూ పలాయనం చిత్తగిస్తారు. అయితే ముస్లింలు వారిని వెంటాడి వేల సంఖ్యలో హతమారుస్తారు.

**కాన్‌స్టాంటినోపిల్‌పై విజయపతాకం :** ఆ తరువాత హజ్రత్ ఇమామ్ మహ్‌ది (అలైహి) తన రాజ్యంలోని పట్టణాల బాగోగులను గురించి శ్రద్ధ తీసుకుంటారు. సరిహద్దుల రక్షణ కోసం అనేక సైనికదళాలను తయారుచేసి పంపుతారు. ఈ పనులన్నీ ముగిశాక ఆయన స్వయంగా ఓ పెద్ద సైనికవాహినిని తీసుకొని కాన్‌స్టాంటినోపిల్‌పై దాడిచేయడానికి బయలుదేరుతారు. ఆవిధంగా ఆయన బయలుదేరి రోమ్ సముద్ర తీరానికి చేరుకొని విడిదిచేస్తారు.

అటు రోమ్ క్రైస్తవులు ఆమాఖ్ లేక దాబఖ్ అనే చోట గుమిగూడి యుద్ధ సన్నాహాలలో నిమగ్నులయి ఉంటారు. వారిని ఎదుర్కోవడానికి మహ్‌దీ (అలైహి) పెద్ద ఎత్తున సైన్యాలను పంపుతారు. వారు క్రైస్తవులతో భయంకరంగా పోరాడుతారు. కాని సైన్యంలో మూడోవంతు సైనికులు వీరమరణం పొందుతారు. దాంతో మరో మూడో వంతు సైనికులు భయపడి పారిపోతారు. దేవుడు వారిని ఎన్నటికీ క్షమించడు. మిగిలిన మూడోవంతు సైనికులు అంటే, బనూఇస్‌హాఖ్ తెగకు చెందిన డెబ్భయివేల మంది యోధులు శత్రువులతో వీరోచితంగా పోరాడి విజయం సాధిస్తారు.

ఆ తరువాత మహ్‌దీ (అలైహి) బనూఇస్‌హాఖ్ తెగకు చెందిన ఆ డెబ్భయి వేల మంది యోధులను నౌకలలో ఎక్కించి కాన్‌స్టాంటినోపిల్ పట్టణంపై దాడిచేయడానికి పంపిస్తారు. వారు కాన్‌స్టాంటినోపిల్ సమీపానికి చేరుకొని విడిది చేస్తారు.

అయితే వారు యుద్ధం చేయడానికి ఎలాంటి ఆయుధాలు చేపట్టరు. లాఇలాహ ఇల్లల్లాహు అల్లాహు అక్బర్ ( అల్లా తప్ప వేరే ఆరాధ్యుడు లేడు. అల్లా అందరి కంటే గొప్పవాడు) అంటూ బిగ్గరగా నినదిస్తారు. ఈ నినాదంతో నగర రక్షణకు కట్టిన ఒక గోడ విరిగి పడిపోతుంది. ముస్లిం యోధులు మరొకసారి అదేవిధంగా నినదిస్తారు. ఆ నినాదానికి రెండో వైపుండే గోడ విరిగి పడిపోతుంది. ముస్లింలు మూడోసారి లాఇలాహ ఇల్లల్లాహు అల్లాహు అక్బర్ అని నినదించగానే పట్టణంలోకి ప్రవేశించడానికి దారి సుగమం అవుతుంది. అప్పుడు ముస్లింలు పట్టణంలోకి ప్రవేశించి దాన్ని సునాయాసంగా స్వాధీనం చేసుకుంటారు. అక్కడ పెద్ద ఎత్తున సమరసొత్తు లభిస్తుంది.

అయితే దాన్ని యోధులకు పంచుతుండగానే దజ్జాల్ బయల్పడ్డాడన్న దుర్వార్త విన్పిస్తుంది. ఆ వార్త వినగానే ముస్లింలు సమరసొత్తును అక్కడే పడవేసి వెళ్ళిపోతారు. తర్వాత ఈవార్త నిజంకాదని తెలుస్తుంది. ముస్లింసైన్యాలు ఈసారి సిరియా వైపుకు బయలుదేరుతాయి. సిరియా చేరుకోగానే దజ్జాల్ నిజంగానే బయల్పడ్డాడని తెలుస్తుంది.

## ఒంటికన్ను దజ్జాల్-22

జెరూసలేం (బైతుల్‌మఖ్దిస్)లోని అఖ్సా మసీదు నిర్మాత సులైమాన్ ప్రవక్త (అలైహి) మరణించిన తరువాత యూదుల వైభవం క్రమేణా పతనమవుతూ చివరికి బాబిల్, అసీరియా రాజుల చేతుల్లో ఘోర పరాజయం పాలయి చెట్టుకొకరు పుట్టకొకరు అయి పోతారు. అప్పుడు ఆ జాతిలో ప్రభవించిన దైవప్రవక్తలు వారిని ఓదార్చుతూ "ఈ అవమానం నుంచి మిమ్మల్ని కాపాడటానికి దేవుని తరపున ఒక మసీహ్ రానున్నాడ"ని శుభవార్త విన్పిస్తుండేవారు. ఆయనే దేవుడు వాగ్దానం చేసిన మసీహ్, మసీహ్ మౌవూద్.

ఈ భవిష్యత్ ప్రకటనల ఆధారంగా యూదులు "ఆయన చక్రవర్తి అయిఉంటా డని, యుద్ధంచేసి తమ కోసం ప్రత్యేకరాజ్యం సాధిస్తాడని, దేశదేశాల నుంచి ఇస్రాయీ లీలందర్నీ తెచ్చి పాలస్తీనాలో పునరావాసం కల్పిస్తాడని, ఆవిధంగా తమ కోసం ఓ



గొప్ప సామ్రాజ్యాన్ని స్థాపిస్తాడని గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఆ ఆశలతోనే వారు మసీహ్ మౌవూద్ కోసం ఎదురుచూస్తున్నారు.

అయితే వారి ఆశలకు భిన్నంగా హజ్రత్ ఈసా (అలైహి) దేవుని తరపున మసీహ్‌గా ఎలాంటి మందీమార్బలం, రాచరికపు అట్టహాసాలు, సైనిక బలగాలు లేకుండా అతి నిరాడంబరంగా వచ్చేటప్పటికి వారు ఆయన్ని మసీహ్‌గా గుర్తించడానికి నిరాకరించారు. పైగా ఆయన్ని హతమార్చడానికి పాల్పడ్డారు. అప్పుడు దేవుడు వారి కుట్రల నుంచి కాపాడి ఈసా మసీహ్ (అలైహి)ని సశరీరంగా పైకెత్తుకున్నాడు. వాస్తవం గ్రహించని యూదులు ఈసా (అలైహి)ని తాము శిలువపై ఎక్కించి చంపామని భావించి, తాము కలలుగంటున్న "మసీహ్ మౌవూద్" కోసం ఇప్పటికీ ఎదురుచూస్తున్నారు. ఆ విధంగా వారు ఎదురుచూస్తున్న మసీహ్ మౌవూదే మసీహ్ దజ్జాల్. అతనే ఒంటికన్ను దజ్జాల్.

దజ్జాల్ ఒంటికన్ను యువకుడయి ఉంటాడు. దృష్టిలోపించిన అతని కుడికన్ను ద్రాక్షపండులా ఉబికొచ్చి తెల్లగా వికృతంగా ఉంటుంది. అతని శిరోజాలు రాగి రంగుతో ఉంగరాలు తిరిగుంటాయి. పైగా అతను భారీకాయంతో ఎర్రగా, పొట్టిగా, దొడ్డికాళ్ళతో ఉంటాడు. అతని రెండుకళ్ళ మధ్య నుదుటిపై "కాఫిర్" (అవిశ్వాసి) అనే పదాలు ఉంటాయి. అక్షరాస్యులు, నిరక్షరాస్యులైన ముస్లింలందరూ దాన్ని చదవగల్గుతారు.

**మహిమలతో మారణహోమం :** అయితే దజ్జాల్ అసాధారణ శక్తిసామర్థ్యాలు కలవాడైఉంటాడు. అతను తనను విశ్వసించే, విశ్వసించనివారి కోసం స్వర్గనరకాలు తయారుచేస్తాడు. అతని దగ్గర నీరు, అగ్ని కూడా ఉంటాయి. నీరని భావించేది నిజంగా నీరు కాదు, అది అగ్ని. అలాగే అగ్ని అని భావించేది అగ్ని కాదు, అది నీరు. అతని దగ్గర మాంసం, రొట్టెల కొండలు, మంచినీటి సెలయేరులు కూడా ఉంటాయి. యూదులు అతని శక్తిసామర్థ్యాలు చూసి అతడ్ని నాయకుడిగా చేసుకుంటారు.

దజ్జాల్ ఒక పెద్ద సైన్యంతో సిరియా, ఇరాఖ్‌ల మధ్య ఉండే ఒక మార్గం గుండా దండయాత్రల కోసం బయలుదేరుతాడు. సర్వత్రా అల్లకల్లోలం సృష్టిస్తాడు. అనేక జాతులు అతనికి లొంగిపోయి విధేయత ప్రకటిస్తాయి. అస్ఫహాన్‌కు చెందిన డెబ్భయి వేలమంది యూదులు అతడ్ని విశ్వసించి అనుచరులైపోతారు. అతను ఊళ్ళకు ఊళ్ళను సర్వనాశనం చేస్తూ అప్రతిహతంగా ముందుకు సాగుతాడు.

ఈ విధంగా దజ్జాల్ దండయాత్ర చేస్తూ ఒక జాతి దగ్గరకు చేరుతాడు. ఆ జాతి ప్రజలతో తానే దేవుణ్ణని చెప్పి తనను విశ్వసించమని అంటాడు. వారు వెంటనే అతడ్ని విశ్వసిస్తారు. దజ్జాల్ తన దైవత్వాన్ని నిరూపించుకోవడానికి ఆకాశాన్ని వర్షం కురిపించ మని ఆదేశిస్తాడు. తక్షణమే ఆకాశం నుండి కుంభవృష్టి మొదలవుతుంది. అతను పచ్చిక బీళ్ళు, పంటపొలాలను ఉత్పత్తి చేయమని భూమిని కూడా ఆదేశిస్తాడు. వర్షంతో తడిసిన నేల నుండి చూస్తుండగానే చెట్లు మొలకెత్తి ఎదిగిపోతాయి. పశువులు కూడా పచ్చిక మేసి బాగా బలిసిపోతాయి.

దజ్జాల్ అక్కడ్నుంచి మరో జాతి దగ్గరకు పోయి తనను విశ్వసించమని చెబుతాడు. ఆ జాతిప్రజలు అతడ్ని విశ్వసించడానికి నిరాకరిస్తారు. అయితే దజ్జాల్ వారిని వారి మానాన వదిలేసి వెళ్ళిపోతాడు. అతను వెళ్ళిపోగానే ఆ జాతిప్రజలపై కష్టాలు వచ్చిపడతాయి. వారు తీవ్రమైన కరువుకాటకాలకు గురవుతారు. వర్షాలు ఆగిపోతాయి. వారి ధనంలో చిల్లిగవ్వ కూడా మిగలదు. దారిద్ర్యం తాండవిస్తుంది.

దజ్జాల్ ముందుకు సాగుతాడు. ఒక పాడుబడ్డ ప్రదేశం మీదుగా ప్రయాణం చేస్తూ ఆ ప్రదేశాన్ని ఉద్దేశించి "నీలోని నిక్షేపాలన్నిటినీ బయటికి తియ్యి" అంటాడు. అప్పుడు నేల క్రింద ఉన్న నిక్షేపాలన్నీ బయల్పడి తేనెటీగలు తమ నాయకుని వెనకాల నడిచినట్లు దజ్జాల్ వెనకాల నడవడం ప్రారంభిస్తాయి. ఆతర్వాత దజ్జాల్ ఒక యువకుడ్ని పిలుస్తాడు. ఆ యువకుడు దగ్గరకు రాగానే అతడ్ని ఖడ్గంతో రెండు ఖండాలుగా నరికి వాటిని దూరంగా విసిరి పడవేస్తాడు. తరువాత అతడ్ని పేరుపెట్టి పిలుస్తాడు. వెంటనే ఆ రెండు ఖండాలు కలిసిపోయి ఆ యువకుడు నవ్వుతూ అతని దగ్గరకు వస్తాడు.

దజ్జాల్ తన దండయాత్రను కొనసాగిస్తూ మదీనా సమీపానికి చేరుకుంటాడు. అ కాలంలో మదీనా నగరానికి ఏడు ద్వారాలు ఉంటాయి. ప్రతి ద్వారం దగ్గర ఇద్దరు దైవదూతలు చొప్పున మొత్తం పధ్నాలుగు మంది దైవదూతలు కాపలా కాస్తుంటారు. అందువల్ల దజ్జాల్ నగరంలోకి ప్రవేశించలేడు. అక్కడ్నుంచి ఉహద్ కొండ దగ్గరకు పోయి దాని వెనుక వైపున విడిది చేస్తాడు. సరిగ్గా అదే సమయంలో మదీనాలో మూడు భూప్రకంపనాలు వస్తాయి. దాంతో నగరంలోని దుర్జనులందరూ భయాందోళనలతో బయటికి పరుగెత్తి దజ్జాల్ దగ్గరికి చేరుకుంటారు.

**వీర విశ్వాసి :-** దజ్జాల్ ఉహద్ కొండ దగ్గర విడిది చేసే రోజుల్లోనే ఒక ముస్లిం దజ్జాల్ దగ్గరికి పోవడానికి ప్రయత్నిస్తాడు. కాని దజ్జాల్ సైనికులు అతడ్ని అడ్డగిస్తూ "ఎక్కడికి పోవాలనుకుంటున్నావు?" అని అడుగుతారు. దానికా విశ్వాసి "ఇటీవల బయ లెడిన (అసత్యవాది) మనిషిని కలుసుకోవడానికి వెళ్తున్నాను" అంటాడు. దజ్జాల్ సైనికులు "ఏమిటి నీవు మాప్రభువుని దేవునిగా విశ్వసించడంలేదా?"అని అడుగుతారు. దానికా విశ్వాసి "మాకు మా ప్రభువుని గుర్తించడంలో సందేహమే లేదు. (అలాంటప్పుడు మేము మీ అసత్యప్రభువుని ఎందుకు నమ్ముతాం?) అనంటాడు. ఈమాట విని వారు మండిపడ్తూ ఆ విశ్వాసిని చంపడానికి సిద్ధపడతారు. అయితే వారిలో ఒకడు చంపడానికి సిద్ధపడిన వారిని వారిస్తూ "మన ప్రభువు తన అనుమతి లేకుండా ఎవరినీ వధించకూడదని ఆదేశించ లేదా?" అనంటాడు. అప్పుడు వారు ఆ విశ్వాసిని దజ్జాల్ దగ్గరికి తీసికెళ్తారు.

దజ్జాల్‌ని చూడగానే ఆ విశ్వాసి ఎలుగెత్తి "ప్రజలారా! (అంతిమ) దైవప్రవక్త (సల్లం) తెలిపిన దజ్జాల్ ఇతనే" అంటాడు. దజ్జాల్ ఈమాట వినగానే కస్సుమంటూ "ఇతడ్ని బోర్లా పడవేయండి" అని తన మనుషులను ఆజ్ఞాపిస్తాడు. వారు వెంటనే ఆ



విశ్వాసిని పట్టుకొని బోర్లా పడవేస్తారు. తర్వాత దజ్జాల్ "ఇతడ్ని చితగ్గొట్టి గాయపర్చండి" అని ఆదేశిస్తాడు. వారతడ్ని బాగా కొట్టి అతని నడుము విరగ్గొడతారు. అప్పుడు దజ్జాల్ "ఇప్పటికైనా నన్ను విశ్వసిస్తావా?" అని అడుగుతాడు. దానికి విశ్వాసి "నువ్వు అసత్య మసీహ్‌వి" అంటాడు. దజ్జాల్ తన మనుషుల్ని మళ్ళీ ఆదేశిస్తూ "రంపంతో ఇతని తల నుంచి కాళ్ళ సందుదాకా కోసి రెండు ముక్కలు చేసేయండి" అంటాడు. వారు అలాగే చేస్తారు. అప్పుడు దజ్జాల్ ఆ రెండుఖండాల మధ్యకు వచ్చి "లే. లేచి నిలబడు" అంటాడు. దాంతో ఆ రెండుఖండాలు కలసిపోయి విశ్వాసి లేచి నిలబడతాడు.

దజ్జాల్ మళ్ళీ విశ్వాసిని ఉద్దేశించి "ఇప్పుడు కూడా నన్ను విశ్వసించవా?" అని అంటాడు. దానికి విశ్వాసి "నువ్వు అసత్య దజ్జాల్ కావడంలో నాకిప్పుడు ఏమాత్రం సందేహం లేదు. ప్రజలారా! వినండి, నా తరువాత ఇతను మరెవరినీ వేధించలేడు" అని అంటాడు. దజ్జాల్ ఈమాట విని విశ్వాసిని చంపడానికి ప్రయత్నిస్తాడు. కాని చంప లేడు. చివరికి అతను విశ్వాసి కాళ్ళుచేతులు పట్టుకొని తన నరకంలో పడవేసి అగ్నిలో పడిపోయాడనుకుంటాడు. నిజానికి ఆ విశ్వాసి స్వర్గంలో ప్రవేశించాడు.

ఆ రోజుల్లోనే మరొకముస్లిం మదీనా నుండి బయలుదేరి దజ్జాల్ దగ్గరకు వస్తాడు. అతనా కాలంలోని భూవాసులందరిలో ఎంతో శ్రేష్ఠుడై ఉంటాడు. అతను దజ్జాల్ ముందు నిలబడి "మాకు దైవప్రవక్త (స) తెలిపిన దజ్జాల్ నువ్వేనని నేను సాక్ష్యమిస్తున్నాను" అంటాడు. దజ్జాల్ ఈమాట విని ఇతరుల్ని ఉద్దేశించి "నేనితడ్ని చంపి మళ్ళీ బ్రతికిస్తే కూడా మీరు నాగురించి అనుమానిస్తారా?" అని అడుగుతాడు. దానికి వారు లేదంటారు. అప్పుడు దజ్జాల్ ఆ ముస్లింని హతమారుస్తాడు. తరువాత మళ్ళీ బ్రతికిస్తాడు. ఆ ముస్లిం తిరిగిబ్రతికిన తర్వాత "దైవసాక్షి! నీవు ముమ్మాటికీ అసత్యవాదివని నాకిప్పుడు ఇంతకు ముందుకంటే ఎక్కువ నమ్మకం కలిగింది" అంటాడు. దజ్జాల్ ఆ విశ్వాసిని మళ్ళీ చంపడానికి ప్రయత్నిస్తాడు. కాని చంపలేడు. (బుఖారి, ముస్లిం)

## ఈసా (అలైహి) పునరాగమనం-23

దజ్జాల్ తన సైన్యాలతో ఉహద్ కొండ ప్రాంతం నుండి బయలుదేరి సిరియా చేరుకుంటాడు. దజ్జాల్ రాక సంగతి తెలుసుకున్న ముస్లింలు అతడ్ని ఎదుర్కోవడానికి డెమాస్కస్‌లో సమాయత్తమవుతారు. సైనిక పునర్వ్యవస్థీకరణ జరుగుతుంది. అది ఫజర్ నమాజువేళ. అందరూ మసీదులో బారులుతీరి నమాజు కోసం నిలబడతారు. అంతలో ఆకాశంలో ఒక వింత కన్పిస్తుంది. కనీవినీ ఎరగని వింత అది.

ఆకాశంనుంచి ఈసా ఇబ్నెమర్యం (అలై) దిగుతారు. రెండు పచ్చవస్త్రాలు ధరించి, ఇద్దరు దైవదూతల రెక్కల మీద చేతులుంచి మసీదులోని తెల్ల మీనారు వద్ద దిగుతారు. ఆయన తలక్రిందికి వాల్చినప్పుడు తలనుంచి నీటిచుక్కలు రాలుతున్నట్లు, తల పైకెత్తినప్పుడు ముత్యాల్లా (జల)బిందువులు జాలువారుతున్నట్లు కన్పిస్తుంది. (ముస్లిం)

మసీదులో ఇమాంగారు అనుచరులకు నాయకత్వం వహించి నమాజు చేయించ డానికి సిద్ధమవుతారు. ఇఖామత్ చెప్పడం కూడా అయిపోతుంది. అంతలో హజ్రత్ ఈసా (అలైహి) క్రిందికి దిగుతారు. ఇమామ్ ఆయన్ని చూడగానే కాస్త వెనక్కి తగ్గి "రండి నమాజు చేయించండి" అంటారు. దానికి హజ్రత్ ఈసా (అలైహి) "ఈ (ముహమ్మద్) అనుచరసముదాయం ప్రజలే ఒకరిపై ఒకరు ఇమాములు (నాయకులు). (కనుక మీరే నమాజు చేయించండి.)" అని అంటారు. అప్పుడు ఆ ఇమామ్ గారు ముందుకు వచ్చి నమాజ్ చేయిస్తారు. (ముస్లిం)

నమాజు ముగిశాక హజ్రత్ ఈసా (అలైహి) ఆయుధాలు తీసుకొని దజ్జాల్‌ని చంపడానికి బయలుదేరుతారు. ఆయన (నగర ప్రధాన) ద్వారం తెరవమని ఆదేశిస్తారు. ద్వారం తెరవబడుతుంది. బయట దజ్జాల్ డెబ్బయివేల మంది సాయుధులయిన యూదులతో విడిదిచేసి ఉంటాడు. వాడు హజ్రత్ ఈసా (అలైహి)ను చూడగానే నీళ్ళలో వేసిన ఉప్పుగల్లులా కరిగిపోతూ భీతావహుడయి పలాయనం చిత్తగిస్తాడు.

హజ్రత్ ఈసా (అలై) అతడ్ని వెంబడిస్తారు. చివరికి ఆయన (ప్రస్తుత ఇస్రాయీల్ రాజధాని టెల్అవివ్‌కు కొన్ని మైళ్ళ దూరంలో ఉండే) 'లుద్దా'లో తూర్పు ముఖద్వారం దగ్గర ఆ దుర్మార్గుడ్ని హతమారుస్తారు. దాంతో దజ్జాల్ అనుచరులు చెల్లాచెదరైపోయి దాక్కోవడానికి ప్రయత్నిస్తారు. కాని వారికి ఎక్కడా చోటుదొరకదు. ప్రతి రాయి, చెట్టు, గుట్ట సైతం ముస్లిం యోధులను కేకవేసి పిలుస్తూ "ఓ ముస్లిం! ఇటు వచ్చెయ్యి. ఇక్కడ నా వెనుక ఒక యూదుడు దాక్కున్నాడు, ఇతడ్ని చంపెయ్యి" అని అంటాయి. ఈవిధంగా దేవుడు వారిని నాశనం చేస్తాడు. (అహ్మద్, ఇబ్నెమాజ, ముస్లిం)

ఆ తరువాత హజ్రత్ ఈసా ఇబ్నె మర్యం (అలైహి) అక్కడ్నుంచి (డెమాస్కస్‌కు) తిరిగొచ్చి ప్రజలను కలుసుకుంటారు. వారి యోగక్షేమాలు విచారిస్తారు. దజ్జాల్ అరచకాల నుండి క్షేమంగా బయటపడినవారి తలలు నిమురుతారు. వారికి లభించే స్వర్గ మహాభాగ్యాలను గురించి వారికి తెలియజేస్తారు.

ఈవిధంగా హజ్రత్ ఈసా (అలైహి) ప్రజల యోగక్షేమాలు విచారిస్తుండగానే విశ్వప్రభువు నుండి ఆయనకు మరో ఉపద్రవం గురించి దివ్యావిష్కృతి వస్తుంది. "నా ఈ దాసులలో వారితో పోరాడే అంతటి శక్తి లేదు. కనుక నేను వీరిని ఇక్కడ్నుంచి తీసేయదలచుకున్నాను. కనుక నీవు నాఈ దాసులను తీసుకొని తూర్ పర్వతం పైకెళ్ళి రక్షణ కల్పించు." ఈ దైవాజ్ఞ వెలువడగానే హజ్రత్ ఈసా (అలైహి) ముస్లింలందర్నీ వెంట బెట్టుకొని తూర్ పర్వతానికి చేరుకుంటారు.

## యాజూజ్-మాజూజ్‌ల దాడులు-24

ఆ రెండవ ఉపద్రవమే యాజూజ్, మాజూజ్‌ల ఉపద్రవం. (రష్యా, ఉత్తర చైనా ప్రాంతాల నుంచి) యాజూజ్, మాజూజ్ అనే కొన్ని ఆటవిక జాతులు కూడా బయలు దేరి ప్రపంచంలో పెద్ద ఎత్తున అల్లకల్లోలం సృష్టిస్తాయి. అవి ఎల్లడెల్లడలా వినాశం,



విధ్వంసాలు సృష్టిస్తూ స్వైరవిహారం చేస్తాయి. వాటిని ఎవరూ అడ్డుకోలేరు.

"ఆ రోజు మేము జనాన్ని (స్వేచ్ఛగా) వదలిపెడ్తాము. వారు (సముద్ర కెరటాల్లా) ఒకరిమీద ఒకరు పడిపోతారు." (ఖుర్ఆన్-18:99)

"మేము ఏఊరిని నాశనంచేసినా ఆ ఊరిప్రజలు తిరిగి కోలుకోవడం అనేదే జరగదు. చివరికి యాజూజ్, మాజూజ్ (జాతు)లను వదిలేయడం జరుగుతుంది. వారు ప్రతి గుట్టా, మిట్టా నుండి వెలువడి (ఇతరజాతులపై) విరుచుకుపడతారు." (21:95,96)

పూర్వం యాజూజ్ (తాతారీ), మాజూజ్ (మంగోలీ) జాతుల్ని నిరోధించడానికి జుల్ఖర్నైన్ కట్టించిన గోడ నల్లసముద్రానికి, కాస్పియన్ సముద్రానికి మధ్యఉన్న రష్యా భూభాగంలో ఉందని తెలుస్తోంది. ప్రళయానికి సమీపకాలంలో హజ్రత్ ఈసా(అలైహి) పునరాగమనం తరువాత ఈ ఆటవిక జాతులు దాన్ని ఛేదించి ప్రపంచంలో వినాశం, విధ్వంసాలు సృష్టిస్తాయి. వాటిని నిలువరించడం ఎవరితరమూ కాదు.

వారు లక్షలసంఖ్యలో ఉంటారు. వారిలో ఒక సైనికపటాలం ముందుకు సాగుతూ తబ్రియా అనే ఒక చెరువు దగ్గర ఆగి అందులోని నీరంతా తాగేస్తుంది. దాని వెనుక వచ్చే మరొక పటాలం సైనికులు నీరులేని ఆ చెరువును చూసి "ఇందులో లోగడ తప్పకుండా నీరు ఉండివుంటుంది" అని చెప్పుకుంటారు.

ఆ తరువాత యాజూజ్, మాజూజ్ సైనికులు బైతుల్ మఖ్దిస్‌లోని ఖమర్ అనే కొండ దగ్గరకు చేరుకుంటారు. అక్కడ విడిది చేసి "మనం భూవాసులను చంపేశాం. ఇప్పుడిక ఆకాశవాసులను చంపేద్దాం" అని చెప్పుకుంటారు. ఈ నిర్ణయం తీసుకోగానే అందరూ ధనస్సులు ఎక్కుపెట్టి ఆకాశం వైపుకు బాణాలు వదులుతారు. అప్పుడు దేవుడు వారి బాణాలను రక్తంలో ముంచి వెనక్కి పంపుతాడు. రక్తసిక్తమయి తిరిగొచ్చిన తమ బాణాలు చూసి వారు మురిసిపోతూ, తాము భూమిపైనే గాకుండా ఆకాశంలో కూడా విజయం సాధించగలిగామని భావిస్తారు.

ఈవిధంగా వారు గుట్టలు, మిట్టలు దాటుతూ ఉరుకులు, పరుగులు పెడ్తూ, సర్వత్రా విధ్వంసం సృష్టిస్తూ ముందుకు సాగుతారు. ముస్లింలు వారి దౌర్జన్య ధాటికి నిలువలేక గగ్గోలు పెడతారు. హజ్రత్ ఈసా (అలైహి) సైతం వారి ముందు నిలువలేక ముస్లింలను వెంట బెట్టుకొని ఇంతకు ముందే తూర్‌పర్వతం ఎక్కి రక్షణ పొందుతారు. అయితే వారిలా తూర్‌కొండ మీద ఎన్నాళ్ళు ఉండవలసి వస్తుందో కాని, తీవ్రమైన ఆకలి, ఆందోళనలతో సతమతమవుతుంటారు. అప్పుడు హజ్రత్ ఈసా (అలైహి) యాజూజ్, మాజూజ్‌ల వినాశం కోసం దైవాన్ని ప్రార్థిస్తారు. దాంతో ఆ ఆటవిక జాతులు దైవాగ్రహానికి గురయి, దేహాలలో పురుగులు పడి గుట్టలు గుట్టలుగా పడిచస్తారు.

వారి పీడా విరగడైపోయిన తరువాత హజ్రత్ ఈసా (అలైహి), ఆయన అనుచరులు కొండ దిగి క్రిందికి వస్తారు. అయితే నేల మీద యాజూజ్, మాజూజ్‌ల శవాలు కుళ్ళి

పోయి దుర్వాసన నలుదిక్కులా వ్యాపిస్తుంది. అంచేత హజ్రత్ ఈసా (అలైహి), ఆయన అనుచరులు దైవాన్ని ప్రార్థిస్తూ "దేవా! ఈ శవాల కొవ్వు, దుర్వాసనల నుండి మమ్మల్ని కాపాడు" అని మొరపెట్టుకుంటారు. దేవుడు వారి మొరాలకించి వాటి నిర్మూలనకోసం రాకాసిపక్షుల్ని పంపుతాడు. ఆ పక్షులు ఈ శవాలను తమ పంజాలతో పట్టుకెళ్ళి దేవుడు ఆదేశించిన చోట పారవేస్తాయి. ఆ తరువాత దేవుడు భారీవర్షం కురిపిస్తాడు. దాంతో భూమి పరిశుభ్రమై పోతుంది. (సంక్షిప్తం- బుఖారి, ముస్లిం.)

యాజూజ్, మాజూజ్‌ల పీడా కూడా విరగడైపోయిన తరువాత ప్రపంచమంతటా శాంతియుత వాతావరణం నెలకొంటుంది. హజ్రత్ ఈసా(అలైహి), ఆయన అనుచరులు (ముస్లింలు) సుఖసంతోషాలతో జీవితం గడుపుతారు. దేవుడు వారిని ఎంతగానో కరుణిస్తాడు. ఆయన అనుగ్రహంతో భూమి సస్యశ్యామలమవుతుంది. ప్రతి చోటా విపరీతమైన పండ్లచెట్లు పుట్టుకొస్తాయి. ఆ పండ్లు కూడా పరిమాణంలో ఎంతో పెద్దగా ఉంటాయి. ఒక్క దానిమ్మ కాయనే అనేకమంది తింటారు. దాని తొక్కను పెద్ద గొడుగులా చేస్తారు. దేవుడు పాలలో కూడా ఎంతో శుభం కలిగిస్తాడు. ఒక ఒంటె నుండి తీసే పాలను అనేక మంది కడుపునిండా తాగుతారు. ఒక ఆవు నుండి పితికే పాలను ఓ పెద్ద తెగ తాగుతుంది. ఒక మేక నుండి తీసే పాలను ఒక చిన్న తెగ తాగుతుంది. ఈవిధంగా దేవుడు ఆహార పదార్థాలన్నిటిలోనూ శుభం కలిగిస్తాడు.

హజ్రత్ ఈసా (అలైహి) కాలంలో సర్వత్రా శాంతీ శుభాలు వెల్లివిరుస్తాయి. అందరూ సుఖసంతోషాలతో మనుగడ సాగిస్తారు. హజ్రత్ ఈసా (అలైహి) పునరాగమనం, ఆయన కార్యకలాపాలు చూసి ప్రపంచంలోని క్రైస్తవులందరూ ఆయన్ని విశ్వసిస్తారు. ఆయన శిలువను విరగ్గొట్టి వారి తప్పుడు విశ్వాసాలకు శాశ్వతంగా తెర దించివేస్తారు. ఆయన సూకరసంహారం కూడా చేస్తారు. దాని ద్వారా ఆయన పంది మాంసం నిషిద్ధం అని ప్రకటిస్తారు. ఈవిధంగా క్రైస్తవులంతా ఇస్లాం స్వీకరించి ముస్లింలయిపోతారు. ఇతర మతస్థులు కూడా ఏదో విధంగా ఇస్లాం స్వీకరించి ముస్లింలయిపోతారు. ప్రపంచమంతటా ఒక్క ఇస్లాం మాత్రమే రాజ్యమేలుతుంది.

ఈ విషయాలను గురించి అంతిమ దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "హజ్రత్ ఈసా (అలైహి) పునరాగమనంతో క్రైస్తవుల అపోహలన్నీ దూరమయి పోతాయి. వారికి వాస్తవం తెలిసిపోతుంది. హజ్రత్ ఈసా (అలైహి) శిలువను విరగ్గొడతారు. పందిని చంపుతారు. (అంటే ఈసా శిలువపై చనిపోయారన్న వారి అంధవిశ్వాసాన్ని, త్రిత్వాన్ని అంతమొందించి ఇతర అనేక మూఢనమ్మకాలు, దురాచారాలతో పాటు, తమంతట తాము ధర్మసమ్మతం చేసుకున్న పందిమాంసాన్ని సైతం నిషేధిస్తారు.) దుర్జనులు నాశనమయిపోగా మిగిలిపోయే ముస్లింలతో భూమి నిండిపోతుంది. ప్రపంచంలోని ప్రజలందరి ధర్మం ఒకటే అవుతుంది. మానవులు అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఆరాధించడం జరగదు." (ముస్నద్ అహ్మద్, ఇబ్నెమాజ)



హజ్రత్ ఈసా (అలైహి) కాలంలో ప్రపంచమంతటా శాంతి, సౌభ్రాతృత్వం, నీతి, న్యాయాలు నెలకొంటాయి. ఏ ఇద్దరు వ్యక్తుల మధ్య కూడా శత్రుభావం ఉండదు. ధనసంపత్తి విపరీతంగా పెరిగిపోతుంది. చివరికి దానం స్వీకరించే ఒక్క మనిషీ కన్పించడు. శిస్తులు, పన్నులు రద్దయిపోతాయి. ఈవిధంగా హజ్రత్ ఈసా (అలైహి) ప్రపంచంలో ఏడేళ్ళు (ఒక ఉల్లేఖనం ప్రకారం నలభై ఏళ్ళు) జీవించి, ఆ తరువాత (సహజ మరణం ద్వారా) తన ప్రభువు సన్నిధికి చేరుకుంటారు. మరికొన్ని ఉల్లేఖనాల ప్రకారం ఆయన వివాహం చేసుకొని సంతానం కూడా కంటారు. ఆయన భౌతిక కాయాన్ని మహాప్రవక్త (సల్లం) సమాధి సమీపంలో ఖననం చేయడం జరుగుతుంది. (ముస్లిం, మిష్కాత్)

## పతనపుటంచుల్లో ప్రపంచం-25

హజ్రత్ ఈసా (అలైహి) తదనంతరం ప్రపంచ పరిస్థితులు అతివేగంగా మారి పోవడం ప్రారంభిస్తాయి. నీతి, న్యాయం, నిజాయితీలకు కాలం చెల్లుతుంది. పాపాలు ఎక్కువయి పోతాయి. దైవధర్మం క్రమంగా క్షీణించి పోతుంది. అప్పటి ముస్లింలు అనబడేవారికి నమాజ్, రోజా, హజ్ అంటే ఏమిటో కూడా తెలియదు. కాకపోతే ఆనాటి వృద్ధులు గతాన్ని గుర్తుచేసుకుంటూ "మా తాతముత్తాతలు 'లా ఇలాహ ఇల్లల్లాహ్' (అల్లాహ్ తప్ప మరే దేవుడు లేడు) అనే మంత్రం పఠిస్తుంటే విన్నాం. దాన్నే మేము పఠిస్తున్నాం. అంతకుమించి మరేమీ తెలియదు మాకు" అని అంటారు.

దైవప్రవక్త (స) తెలిపిన ప్రళయ సూచనల్లో 'పొగ' గురించిన విషయం కూడా ఉంది. దాన్ని గురించి ఖుర్‌ఆన్‌లో "సరే, ఆకాశం నిండా పొగ కమ్ముకునే రోజు కోసం ఎదురుచూడండి. అది ప్రజల మీద ఆవరించే దుర్భరయాతన" అని ఉంది. (44:11)

**నలభై రోజులదాకా పొగ :** హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి) ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడిన పొగ గురించి మాట్లాడుతూ "ఇది ప్రళయసూచనగా చెప్పిన పొగ కాదని, మక్కాలో కరువు వచ్చినప్పుడు ప్రజలు ఆకాశం వైపు చూస్తే ఆకలి తీవ్రత వల్ల వారికి పొగ కన్పించేదని అభిప్రాయపడ్డారు. కాని హజ్రత్ హుజైఫా (రజి) ఈ అభిప్రాయం తో ఏకీభవించలేదు. అది ప్రళయసూచనగా బహిర్గతమయ్యే పొగే అని చెబుతూ ఆయన దైవప్రవక్త (స) నోట విన్న ఈ ప్రవచనం పేర్కొన్నారు:

"అది తూర్పు నుండి పడమర వరకు వ్యాపించే సువిశాలమైన పొగ. ఆ పొగ నలభై రోజుల దాకా ఉంటుంది. దాని వల్ల విశ్వాసులకు జలుబు చేసిన బాధ మాత్రమే కలుగుతుంది. అవిశ్వాసులు ఆ పొగ ప్రభావంతో స్పృహ తప్పుతారు." (మర్ఫూబ్)

**పడమర నుంచి సూర్యోదయం :** ప్రళయసూచనల్లో 'సూర్యుడు పడమర దిక్కు నుండి ఉదయించడం' గురించి, 'భూమినుండి బయల్పడే ఒక విచిత్రజంతువు' గురించి కూడా ప్రస్తావించారు దైవప్రవక్త (స). ఖుర్‌ఆన్‌లో ఈవిధంగా ఉంది:

"ఇక వారు దేనికోసం ఎదురు చూస్తున్నారు? వారి ముందు దైవదూత ప్రత్యక్షం కావాలని చూస్తున్నారా? లేక నీ ప్రభువు సూచనలు కొన్ని బహిర్గతమయ్యే సమయం కోసం నిరీక్షిస్తున్నారా? నీ ప్రభువు సూచనలు కొన్ని బహిర్గతమయ్యే రోజు, అసలు సత్యాన్నే విశ్వసించనివాడు దాన్ని విశ్వసించినా ఆ విశ్వాసం వల్ల అతనికి ఎలాంటి ప్రయోజనం ఉండదు. అలాగే సత్యాన్ని విశ్వసించి ఎలాంటి సత్కార్యం చేయనివాడికి సైతం అతని విశ్వాసం ఆరోజు ఎలాంటి ప్రయోజనం చేకూర్చదు." (6:158)

షాహ్ అబ్దుల్‌ఖాదర్ ముహద్దిస్ (రహ్మలై) వ్యాఖ్యానం ప్రకారం ఇక్కడ సూచనలంటే ప్రళయ సూచనలని అర్థం. ఆ సూచనల్లో ఒకటి- ఓరోజు ఉన్నట్లుండి సుదీర్ఘ (కాళ)రాత్రి గడచిన తరువాత సూర్యుడు పడమటిదిక్కు నుంచి ఉదయిస్తాడు. అప్పుడు అవిశ్వాసులు సత్యాన్ని విశ్వసించినా ప్రయోజనం ఉండదు. అదే విధంగా సత్యాన్ని విశ్వసించి, తదనుగుణంగా సత్కర్మలు ఆచరించనివారు ఆరోజు ఎన్ని సత్కార్యాలు చేసినా లాభంలేదు. సమయం మించి పోయింది. క్షమాద్వారం మూయబడింది. పాపుల పశ్చాత్తాపం స్వీకరించబడదు.

మౌలానా అష్రఫ్ అలి థానవి (రహ్మలై)గారి 'ఖియామత్ నామా' పుస్తకం ప్రకారం ఆ రాత్రి ఎంతో సుదీర్ఘంగా ఉంటుంది. బాటసారులు ఎంత నడిచినా సూర్యోదయం కాకపోవడంతో ఆందోళన చెందుతారు. పడుకున్న పిల్లలు సుదీర్ఘ రాత్రితో విసిగిపోతారు. పశువులు మేత కోసం అడవులకు పోవడానికి అరుస్తాయి. అయినా సూర్యుడు ఉదయించడు. ప్రజలు కంగారుపడుతూ లేచి సుదీర్ఘ ప్రార్థనలు చేస్తూ తమ పాపాలను క్షమించమని దైవాన్ని మొరపెట్టుకుంటారు. ఆ కాళరాత్రి మూడు నాలుగు రాత్రులంతా సుదీర్ఘంగా ఉంటుంది. చివరికి సూర్యుడు బలహీన కాంతితో మినుకు మినుకుమంటూ పడమర నుంచి ఉదయిస్తాడు. అప్పుడు సూర్యుని కాంతి గ్రహణం పట్టిన చంద్రుని కాంతిలా మసక మసకగా ఉంటుంది. (ముస్లిం)

**క్షమాద్వారం మూయబడుతుంది :** ఒక హదీసులో హజ్రత్ సఫ్వాన్ బిన్ ఉసాల్ (రజి) చెప్పిన ప్రవక్తప్రవచనం ప్రకారం దేవుడు పశ్చిమదిక్కున తౌబా (పశ్చాత్తాపం)కు సంబంధించిన ఒక తలుపు నిర్మించాడు. అది డెబ్భయి ఏళ్ళు ప్రయాణం చేస్తే ఎంత దూరం అవుతుందో అంత విశాలంగా (పొడవుగా, వెడల్పుగా) ఉంటుంది. ఆ తలుపు సూర్యుడు పడమర నుంచి ఉదయించనంత వరకు మూసి వేయబడదు. (పడమర నుంచి ఉదయించగానే అది మూయబడుతుంది. అంటే ఆ తలుపు మూయబడగానే ఇక ఎవరి క్షమాపణ కూడా స్వీకరించడం జరగదన్నమాట.)

పైన పేర్కొన్న ఖుర్ఆన్ సూక్తిలో సూచనలంటే ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, వ్యాధులు, యుద్ధాలు వంటి శిక్షలద్వారా మనిషి మృత్యువాత పడటం కూడా కావచ్చు. మృత్యుదూత ముంగిట వాలినప్పుడు అవిశ్వాసి భయపడిపోయి "ఇప్పుడు నేను దేవుణ్ణి, ఆయన ప్రవక్త (సల్లం)ను విశ్వసిస్తున్నాన"ని ఎన్నిసార్లు పలికినా, సత్కర్మలు ఆచరించకుండా ప్రాపంచిక వ్యామోహంలో పడిన నామమాత్రపు ముస్లిం, ఇప్పటినుంచి నేను తప్పకుండా నమాజ్, రోజాలు పాటిస్తాను, దైవమార్గంలో నా సర్వస్వం ధారపోస్తాను" అని ఎంత మొత్తుకున్నా లాభం లేదు. పరీక్షా సమయం గడిచిపోయింది. ఆన్సర్ షీటు చేజారిపోయింది. ఇక రిజల్ట్స్ కోసమే ఎదురుచూడవలసి ఉంటుంది.



**మాట్లాడే జంతువు :** "(ప్రళయం గురించి) మావాగ్దానం నెరవేరే సమయం ఆసన్నమైనప్పుడు మేము వారి కోసం భూమి నుండి ఒక (వింత) జంతువుని బయటికి తీస్తాము. అది (దేవుని ప్రతినిధిగా) వారితో మాట్లాడుతూ "ప్రజలు మా సూక్తులు విశ్వసించేవారు కాదు" అంటుంది." (ఖుర్ఆన్-27:82)

ప్రపంచంలో పాపాలు మితిమీరి పోతాయి. పుణ్యాత్ములు దాదాపు అంతరించి పోతారు. ప్రజల్లో మంచీ చెడుల విచక్షణాజ్ఞానం నశిస్తుంది. అప్పుడు దేవుడు ఈ వింత జంతువుని పంపిస్తాడు. అది ప్రజలతో మాట్లాడుతూ "ప్రళయదినం (పరలోకం) గురించిన దేవుని సూక్తులు మీరు నమ్మేవారు కాదుగా! ఇప్పుడు చూడండి, అది అతి వేగంగా ముంచుకొస్తోంది" అని అంటుంది.

షాహ్ అబ్దుల్ ఖాదర్ (రహ్మలై) గారి వ్యాఖ్యానం ప్రకారం ప్రళయానికి ముందు మక్కాలోని సఫాకొండ పగిలి అందులో నుంచి ఒక వింతజంతువు వెలువడుతుంది. అది ప్రజలతో మాట్లాడుతూ, ప్రళయం దగ్గరకు వచ్చిందని చెబుతుంది. అది ప్రజలలో నిజమైన విశ్వాసులెవరో, అవిశ్వాసాన్ని దాచిన పగటి వేషధారులెవరో సూచిస్తుంది.

మౌలానా అష్రఫ్ అలి థానవి (రహ్మలై)గారి 'ఖియామత్ నామా' పుస్తకంలో కూడా దీని ప్రస్తావన ఉంది. ఆ పుస్తకం ప్రకారం సూర్యుడు పశ్చిమ దిక్కున ఉదయించి, ఓ సుదీర్ఘ రాత్రి గడచిపోయి తిరిగి సూర్యుడు వెనక్కి వెళ్ళి అస్తమించి, యథాప్రకారం మళ్ళీ తూర్పు నుంచే ఉదయించడం ప్రారంభిస్తాడు.

ఆ తర్వాత మక్కాలోని సఫా కొండ భూకంపం వచ్చి పగిలిపోతుంది. వెంటనే అందులో నుంచి ఓ విచిత్రజంతువు బయల్పడుతుంది. దాని ముఖం మనిషి ముఖంలాగానే ఉంటుంది. అయితే కాళ్ళు ఒంటెకాళ్ళులా, మెడ గుర్రపుమెడలా, తోక ఆవుతోకలా, గిట్టెలు జింకగిట్టెల్లా, కొమ్ములు పశువుకొమ్ముల్లా, చేతులు కోతిచేతుల్లా ఉంటాయి.

ఆ జంతువు ప్రజలతో బాగా మాట్లాడుతుంది. దాని చేతిలో మూసా ప్రవక్త (అలైహి) కర్ర ఉంటుంది. రెండవ చేతిలో సులైమాన్ ప్రవక్త (అలై) ఉంగరం ఉంటుంది. అది మెరుపు వేగంతో యావత్తు దేశాలు పర్యటిస్తుంది. వెతికేవారెవరూ దాన్ని వెతకలేరు; పారిపోయే వారెవరూ దాన్నుండి పారిపోలేరు.

ఆ వింతజంతువు మానవులందరి శరీరాలపై ఒక గుర్తు పెడ్తుంది. అది విశ్వాసుల నుదుళ్ళపై మూసా ప్రవక్త (అలైహి) కర్రతో ఓ గీత గీస్తుంది. ఆ గీత వల్ల వారి ముఖాలు తేజస్సుతో వెలిగిపోతూ హుందాతనాలు ఉట్టిపడతాయి. అలాగే ఆజంతువు

అవిశ్వాసుల ముక్కులు లేదా మెడల మీద సులైమాన్ ప్రవక్త (అలైహి) ఉంగరంతో ముద్రలు వేస్తుంది. ఆ ముద్రల వల్ల వారి ముఖాలు నల్లబడి పోతాయి. (ఈవిధంగా ఆ జంతువు విశ్వాసులను, అవిశ్వాసులను స్పష్టంగా వేరుచేస్తుంది.)

ఈ పనులన్నీ ముగిసిన తరువాత ఆ వింత జంతువు మాయమవుతుంది.

ఫత్‌హుల్‌బారీలో ఉల్లేఖించబడిన ఒక హదీసు ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: "సూర్యుడు పశ్చిమ దిక్కున ఉదయించిన తరువాత మానవులు ప్రపంచంలో మరో 120 సంవత్సరాలు జీవిస్తారు. ఆ తరువాత ప్రళయం వస్తుంది."

## ప్రపంచం అంత్యదశ-26

ప్రపంచం అంత్యదశకు చేరుకుంటుంది. పాపాలు మరిన్ని ఎక్కువయి పోతాయి. నీతినియమాలు పూర్తిగా అడుగంటి పోతాయి. ధర్మం మంటకలసి పోతుంది. అనేక భూకంపాలు వస్తాయి. ఆకాశం నుండి రాళ్ళవర్షం కురుస్తుంది. పూసలదండ తెగి పూసలు నిరంతరాయంగా క్రింద పడిపోయినట్లు ప్రకృతి వైపరీత్యాల రూపంలో అనేక విపత్తులు ఒకదాని తరువాత ఒకటి వరుసగా వచ్చిపడతాయి.

"మేము ప్రళయదినానికి పూర్వం ప్రతి పట్టణాన్ని, ప్రతి జనపదాన్ని సర్వనాశనం చేయడమో లేక కఠినంగా శిక్షించడమో చేస్తాము. ఇది విధివ్రాతలో రాయబడిఉంది." (ఖుర్‌ఆన్-17:58)

ఒక హదీసులో మూడు ప్రాంతాలలో ప్రజలు భూమిలోకి దిగబడిపోతారని ఉంది. ఒకటి- తూర్పు ప్రాంతంలో, రెండు- పశ్చిమ ప్రాంతంలో, మూడు- అరేబియా ద్వీపంలో. వేరొక హదీసులో ముఖాలను వికృతపరచే ప్రమాదం కూడా వస్తుందని ఉంది.

ముస్లిం ప్రకారం ప్రళయం పరమదుర్మార్గుల మీద వచ్చి పడుతుంది. మరొక ఉల్లేఖనంలో ప్రపంచంలో దేవుని పేరు స్మరించబడుతున్నంత కాలం ప్రళయం రాదని ఉంది. చివరికి దేవుని పేరు స్మరించబడని దుర్దినాలు కూడా దాపురిస్తాయి.

మౌలానా అష్రఫ్ అలి థానవీ (రహ్మాలై) గారి ఖియామత్ నామా పుస్తకం ప్రకారం దేవుని పేరు స్మరించబడని రోజుల్లోనే సిరియా దేశంలో శాంతియుత వాతావరణం ఉంటుంది. ఆ దేశంలో ధాన్యం చాలా చౌకగా ఉంటుంది. అంచేత వర్తకులు, ఇతర వృత్తులవారు, పెట్టుబడిదారులు- ఇలా అందరూ తమ ఇండ్లలోని వస్తువులన్నిటినీ తీసుకొని సిరియాకు వెళ్ళిపోతారు. ఇతర దేశాలకు పోయివున్నవారు కూడా సిరియా వెళ్ళి స్థిరపడిపోతారు. ఆ తరువాత కొన్నాళ్ళకే ఓ పెద్ద అగ్నిమంట బయల్పడి ఇతర ప్రాంతాలలోని ప్రజలను తోలుతూ వారిని సిరియా చేర్చుతుంది. ఈ పని ముగిసిన తరువాత అది అంతర్ధానమవుతుంది.

ముస్లిం గ్రంథంలోని ఒక ఉల్లేఖనం ప్రకారం ఒక భయంకరమైన సుడిగాలి వచ్చి ప్రజలను ఎత్తి సముద్రంలో విసిరేస్తుంది.



హాఫిజ్ ఇబ్నెహజర్ 'ఫత్‌హుల్‌బారీ'లో పేర్కొన్న ఒక ఉల్లేఖనం ప్రకారం "ఒక స్త్రీ ఓ పురుషసమూహం దగ్గర్నుంచి పోతుంది. అప్పుడా గుంపులో నుంచి ఒకడు ఆ స్త్రీ దగ్గరికి వస్తాడు. వచ్చి పశువుతోక పైకెత్తి నట్లు అతనామె అంగవస్త్రం పైకెత్తి (అందరూ చూస్తుండగానే) వ్యభిచరిస్తాడు. ఆ గుంపులోనే మరొకతను (ఈ అశ్లీల చేష్ట చూడలేక) 'నువ్వీ పని ఆగోడ వెనక్కి వెళ్ళి చేస్తే బాగుండేది' అంటాడు. అతనా గుంపులో మీలో అబూబకర్, ఉమర్ (రజి)లు ఎలాంటివారో అలాంటి (పుణ్యాత్ముడైన) మనిషి."

హజ్రత్ ఆయిషా (రజి) ఉల్లేఖించిన ఒక హదీసులో "లాత్, ఉజ్జా (విగ్రహా)ల పూజ జరగనంతవరకు రేయింబవళ్ళు అంతం కావు" అన్నారు దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా అరేబియాలో కూడా విగ్రహారాధన ప్రబలిపోతుంది.

మిష్కాత్ గ్రంథంలో హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం సిరియాలో ఒక విధమైన చల్లటి గాలి వీస్తుంది. దాంతో విశ్వాసులందరూ చనిపోతారు. పుడమిపై హృదయంలో ఇస్లాం పట్ల అణుమాత్రం విశ్వాసం ఉన్న మనిషి కూడా ఆ చల్లటి గాలికి చనిపోకుండా ఉండలేడు. చివరికి మీలో ఎవరైనా కొండగుహలో దూరి కూర్చున్నా సరే, అ గాలి అక్కడికి కూడా చేరి అతని ప్రాణం తీసేస్తుంది.

ఆ తరువాత పరమ దుర్మార్గులు మాత్రమే ప్రపంచంలో మిగిలిపోతారు. వారు తేలికపాటి పక్షులు ఎగిరినట్లు వేగంగా చెడుల మీదికి ఎగిరిపడతారు. వారు రక్తపాతం జరపడంలో, ప్రాణాలు తీయడంలో క్రూరజంతువుల్లాంటి గుణం కలవారై ఉంటారు. వారు మంచిని మంచిగా, చెడును చెడుగా భావించరు. షైతాన్ వారి పరిస్థితి చూసి మానవరూపంలో వారి దగ్గరకొచ్చి "మీకు సిగ్గులేదా (మీ తాతముత్తాతల మతం వదిలేశారు)?" అనంటాడు. దానికి వారు "ఇప్పుడు మేము ఏం చేయాలో నువ్వే చెప్పు" అంటారు. అప్పుడు షైతాన్ వారికి విగ్రహపూజ గురించి నూరిపోస్తాడు. దాంతో వారు అదే పరిస్థితిలో ఉండిపోతారు. (అంటే విగ్రహాలను పూజిస్తూ, హింసాదౌర్జన్యాలు జరుపుతూ, అశ్లీలచేష్టల్లో మునిగితేలుతూ పశువుల్లా ఉంటారన్న మాట.) వారికి ఉపాధి మాత్రం పుష్కలంగా లభిస్తుంది; సుఖవంతమైన జీవితం గడుపుతారు. ఆ తరువాత కొన్నాళ్ళకు హఠాత్తుగా ప్రళయం విరుచుకు పడుతుంది.

## ముంచుకొస్తున్న ప్రళయం-27

"వారు నిన్ను ప్రళయం ఎప్పుడు సంభవిస్తుందని అడుగుతున్నారు. వారికిలా చెప్పు: "దాని సంగతి నా ప్రభువుకు మాత్రమే తెలుసు. దాన్ని దాని నిర్ణీత సమయానికి ఆయనే బహిర్గతం చేస్తాడు. అది యావత్తు భూమ్యాకాశాల్లో (గుండెలను అదరగొట్టే) భయంకర దినం. అది మీపై హఠాత్తుగా విరుచుకుపడుతుంది". (ఖుర్‌ఆన్-7:187)

"ఆ (ప్రళయ) ఘడియ ఎప్పుడు సంభవిస్తుందో దేవునికి మాత్రమే తెలుసు. మాతృగర్భంలో ఏం పెరుగుతున్నదో కూడా ఆయనకే తెలుసు. రేపు తాను ఏం చేయ

నున్నాడో ఏమనిషికీ తెలియదు. అలాగే తనకు ఏ భూభాగంలో మృత్యువు కాటు వేస్తుందో కూడా ఎవరికీ తెలియదు. సమస్త విషయాలు దేవునికి మాత్రమే తెలుసు. ఆయన సర్వజ్ఞాని, సమస్తం ఎరిగినవాడు." (ఖుర్‌ఆన్-31:34)

"ఇది పూర్వం వచ్చిన హెచ్చరికల్లోని ఒక హెచ్చరిక. రానున్న (ప్రమాద) ఘడియ అతి సమీపంలోనే ఉంది. దేవుడు తప్ప మరెవరూ దాన్ని ఆపలేరు. వీటిని గురించేనా మీరు ఆశ్చర్యపోతున్నారు! (పైగా)మీరు నవ్వుతున్నారా! (సత్యతిరస్కారంవల్ల సంభవించే దుష్పరిణామాలు తలచుకొని) మీరు ఏడ్వడంలేదే!! అదీగాక అల్లరిచేసి వీటిని దాటవేయజూస్తున్నారా? (ఇప్పటికైనా) దేవుని ముందు సాష్టాంగపడండి; ఆయన్నే ఆరాధించండి." (ఖుర్‌ఆన్=53:56-62)

**శుక్రవారమే గడువు :** మొత్తంమీద ప్రళయం శుక్రవారం వస్తుందని తెలుస్తోంది. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "అన్ని రోజుల కంటే శుక్రవారం ఎంతో శ్రేష్ఠమైన రోజు. శుక్రవారంరోజు హజ్రత్ ఆదం (అలైహి) సృజించబడ్డారు. శుక్రవారంరోజే ఆయన్ని స్వర్గంలో ప్రవేశింపజేయడం జరిగింది. శుక్రవారంరోజే ఆయన స్వర్గం నుండి తీసివేయ బడ్డారు. శుక్రవారంనాడే ప్రళయం వస్తుంది.'' (ముస్లిం)

అందువలనే దైవదూతలు, భూమ్యాకాశాలు, సముద్రాలు, పర్వతాలు సమస్తం శుక్రవారం వచ్చిందంటే చాలు, ప్రళయం ఎక్కడ వచ్చిపడుతుందోనన్న ఆలోచనతో వణికిపోతాయి. (మిష్కాత్)

కొన్ని హదీసుల్ని బట్టి, దైవదూత ఇస్రాఫీల్ (అలైహి) శంఖం నోటి దగ్గర పెట్టుకొని, ఒక చేతిని చెవిమీద ఉంచి, కొంచెం ముందుకు వంగి, దైవసింహాసనం వైపు చూస్తూ శంఖం పూరించడానికి ఎప్పుడాజ్ఞవుతుందా అని తీవ్రంగా నిరీక్షిస్తున్నారని తెలుస్తోంది. దైవాజ్ఞ కాగానే ఆయన శంఖం పూరిస్తారు.

ప్రజలు పూర్తిగా ప్రాపంచిక వ్యామోహంలో మునిగిపోయి వివిధ చెడ్డ పనులలో కూరుకుపోయి ఉన్నపుడు హఠాత్తుగా ప్రళయం విరుచుకు పడుతుంది. ముస్లిం గ్రంథం లోని ఒక హదీసు ప్రకారం ఇద్దరి మధ్య వ్యాపార వ్యవహారం జరుగుతుంటుంది. వ్యాపారి బట్ట తీసి కొనుగోలుదారునికి చూపిస్తుంటాడు. బేరం కుదిరి బట్ట మడతపెట్టక ముందే ప్రళయం వచ్చిపడుతుంది. ఒకతను ఒంటె నుండి పాలుపితికి తీసికెళ్తుంటాడు. ఆ పాలను ఇంకా తాగక ముందే ప్రళయం వస్తుంది. మరొకతను నీళ్ళతొట్టిని అలుకుతుంటాడు. అతను తన పశువులకు నీళ్ళు తాగించను కూడా లేడు, ప్రళయం వస్తుంది. వేరొకతను భోజనం చేయడానికి కూర్చుని అన్నంముద్ద నోటి దగ్గరికి తీసి కెళ్తాడు. కాని నోట్లో పెట్టుకోక ముందే ప్రళయం వచ్చి పడుతుంది.

**మొదటిసారి శంఖారావం** విన్పించగానే జనం తీవ్రమైన భయాందోళనలతో మెడలు ఒక వైపుకు వంచి కళ్ళు తేలేసి చూస్తారు. కఠోరమైన ఆ శబ్దానికి చెవులు



చిల్లులు పడతాయి. గుండెలు దడదడలాడతాయి. ప్రతి మనిషీ భీతావహంతో తన ఆప్తుల్ని, రక్త సంబంధీకుల్ని సైతం వారి మానాన వదిలేసి పరుగు లంకించుకుంటాడు. ఏ ఒక్కడికీ తనను గురించి తప్ప ఇతరులను గురించిన కాస్తయినా ఆలోచన రాదు. చివరికి తల్లి తన వడిలో పెట్టుకొని పాలిస్తున్న పసిబిడ్డను కూడా వదలి పరుగెత్తుతుంది. గర్భిణీ స్త్రీలకు గర్భస్రావం అవుతుంది. ప్రజలు మైకంలో లేకపోయినా మైకంలో ఉన్నట్లు కన్పిస్తారు. పశువులు కూడా భయభీతులతో అటూ ఇటూ పరుగెత్తుతాయి. అయితే క్రూరజంతువులు మాత్రం తీవ్రమయిన భయాందోళనలతో ఒక చోట గుమి గూడుతాయి.

"నీవు సత్యవంతుడవైతే ప్రళయం గురించిన (నీ) బెదిరింపు ఎప్పుడు నెరవేరు తుందో చెప్పని అడుగుతున్నారు. వారు దేనికోసం ఎదురుచూస్తున్నారో అదొక విస్ఫోటం మాత్రమే. వారు (ప్రాపంచిక వ్యవహారాల్లో మునిగి) జగడమాడుకుంటున్న స్థితిలో అది హఠాత్తుగా వారిని చుట్టుముడ్తుంది. అప్పుడు వారు వీలునామా సైతం వ్రాయలేరు. అంతేకాదు, వారు తమ ఇండ్లకు కూడా చేరుకోలేరు." (ఖుర్‌ఆన్-36:48-50)

"ఆరోజు (ప్రళయ బీభత్సంతో) ప్రజలు కళ్ళు తేలేసి, తల పైకెత్తి పరుగిడు తుంటారు. పై చూపులు పైనే ఉండిపోతాయి. గుండెలు దడదడలాడి పోతుంటాయి." (ఖుర్‌ఆన్-14:43)

"ఆరోజు పరిస్థితి చూడు... పాలుపట్టే ప్రతి స్త్రీ తన చంటిబిడ్డను సైతం మరచి పోతుంది. అలాగే ప్రతి గర్భిణికీ గర్భస్రావం అవుతుంది. ప్రజలు మైకంలో లేకపోయినా మైకంలో ఉన్నట్లు కనపడతారు. నిస్సందేహంగా దైవశిక్ష చాలా కఠినంగా ఉంటుంది." (ఖుర్‌ఆన్-22:2)

"చివరికి గూబలు పగలుగొట్టే (ప్రళయ శంఖా)రావం ఉధృతమయినప్పుడు.... ఆరోజు మానవుడు (అదిరిపోయి) తన సోదరులు, తల్లిదండ్రులు, భార్యాపిల్లలను వదలి పరుగు లంకించుకుంటాడు. ప్రతి ఒక్కడిపై భయంకరమైన ఆపద వచ్చి పడుతుంది. అందువల్ల అప్పుడు ఏ ఒక్కడికీ తన గురించి తప్ప ఇతరుల గురించిన ఆలోచనేరాదు." (ఖుర్‌ఆన్=80:33-38)

"ప్రళయం ఎప్పుడొస్తుంది? అసలింతకూ అది వస్తుందా లేదా?" అనంటాడు మానవుడు. ఆరోజు మానవులు కళ్ళు తేలవేస్తారు. చంద్రుడు కాంతివిహీనుడై పోతాడు. సూర్యచంద్రుల్ని కలిపివేయడం జరుగుతుంది. అప్పుడు ఈ మానవుడే "నేనెక్కడికి పారి పోవాలి?" అనంటాడు. ఎక్కడికీ పారిపోలేవు. ఎక్కడా నీకు రక్షణ లేదు. ఆరోజు నీవు నీ ప్రభువు సన్నిధికే వెళ్ళి నిలబడవలసి ఉంటుంది." (ఖుర్‌ఆన్=75:6-11)

మొదటి శంఖారావానికి రెండవ శంఖారావానికి మధ్య ఎంతకాలం గడుస్తుందో హదీసుల్లో స్పష్టంగా చెప్పబడలేదు. నలభై అని మాత్రమే ఉంది. నలభై అంటే నలభై రోజులన్నా కావచ్చు లేదా నలభై యేండ్లన్నా కావచ్చు. వాస్తవం దేవునికే తెలుసు.

**రెండవసారి శంఖారావం** జరిగినప్పుడు దాని భీకరధ్వనికి మానవులతో పాటు యావత్తు జీవరాసులన్నీ చచ్చి పడిపోతాయి. భూమి తీవ్రమైన ప్రకంపనాలతో ఎక్కడి కక్కడ నెర్రెలు విచ్చుకుంటుంది. ఎంతో పటిష్ఠంగా నిర్మించిన పెద్ద పెద్ద కట్టడాలు, ఆకాశ హర్మ్యాలు సయితం పేకమేడల్లా కుప్పకూలిపోతాయి. భూమండలం యావత్తు జీవరాసుల్ని తీవ్రంగా కుదిపేస్తుంది. ప్రచండవేగంతో గాలులు వీస్తాయి. సముద్రాలు ఉవ్వెత్తున ఎగిసిపడతాయి. లక్షలాది ఎకరాల నేల జలమయమవుతుంది. సముద్రంలో తీవ్రమైన వత్తిడితో భయంకరమైన అగ్ని మంటలు లేస్తాయి. బ్రహ్మాండమైన ప్రభంజనం వల్లనో, గురుత్వాకర్షణ శక్తి తగ్గిపోవడం వల్లనో భూమి మీదుండే ప్రతి వస్తువూ గాలిలో తేలియాడుతుంది. పర్వతాలు మొదట్లో నేల నుండి పెకిలి దూదిపింజల మాదిరిగా తేలుతాయి. తరువాత అవి తునాతునకలై ఇసుక రేణువులుగా మారి ఎగురుతాయి. యావత్తు భూగోళం అతలాకుతల మవుతుంది.

అలాగే ఆకాశంలో కూడా అనూహ్యమైన మార్పులు జరుగుతాయి. మొదట నక్షత్రాలు కాంతి కోల్పోతాయి. సూర్యచంద్రులు కూడా నిస్తేజమై పోతాయి. చంద్రుడు గురుత్వాకర్షణ కోల్పోయి సూర్యునికి అతుక్కుపోతాడు. గ్రహాలు, నక్షత్రాలు తమ తమ నిర్ణీత కక్ష్యలు వదలి ఉదజని బంతులు మాదిరిగా అటూఇటూ తిరుగుతూ చివరికి అణుబాంబుల్లా పేలిపోతాయి. విశ్వమంతా అస్తవ్యస్థం అవుతుంది.

“జరగవలసిన సంఘటన జరిగినప్పుడు ఇక దాన్ని ఏ ఒక్కరూ నిరాకరించలేరు. అది (విశ్వవ్యవస్థను) అస్తవ్యస్థం చేసే మహోపద్రవం! అప్పుడు యావత్తు భూమండలం ఒక్కసారిగా కుదిపి వేయబడుతుంది. పర్వతాలు సైతం తునాతునకలయి ఆకాశంలో ధూళిరేణువుల్లా ఎగురుతాయి.” (ఖుర్ఆన్=56:1–6)

“ఆరోజు నక్షత్రాలు నిస్తేజమైపోతాయి. ఆకాశం చీలిపోతుంది. పర్వతాలు దూది పింజల్లా గాలిలో ఎగురుతాయి. ప్రవక్తలను ప్రవేశపెట్టే సమయం ఆసన్నమవుతుంది. ఏరోజు కోసం ఈపనులు ఆపిఉంచబడ్డాయి? విచారణరోజు కోసం. విచారణ రోజంటే ఏమిటో నీకు తెలుసా? ధిక్కారులకు ఆరోజు వినాశం తప్పదు.” (ఖుర్ఆన్=77:8–15)

“ఆకాశం దద్దరిల్లి బీటలువారినప్పుడు, తారలు చెదరి కాంతికోల్పోయినప్పుడు, సముద్రాలు పొంగి పొరలినప్పుడు, సమాధులు పూర్తిగా తెరవబడినప్పుడు– ఆ...అప్పుడు ప్రతి మనిషికీ తాను ముందు పంపుకున్నది, వెనుక వదలిపెట్టినది అంతా తెలిసిపోతుంది.” (ఖుర్ఆన్=82:1–5)

“సూర్యుడు నిస్తేజమై చుట్టివేయబడినప్పుడు, నక్షత్రాలు చెదరి కాంతి కోల్పోయి నప్పుడు, పర్వతాలు కదలి నడచినప్పుడు, పదినెలల సూడిఒంటెలు వాటిమానాన వదలి వేయబడినప్పుడు, క్రూరమృగాలు (భీతావహంతో) ఓచోట గుమిగూడినప్పుడు, సముద్రం (ఉప్పొంగి) ప్రజ్వరిల్లినప్పుడు, ఆత్మలు (దేహాలతో) అనుసంధానం చేయబడినప్పుడు, సజీవసమాధి చేయబడిన పసిబాలికను నీవు ఏ తప్పు వల్ల చంపబడ్డావని అడిగినప్పుడు,



(మానవుల) కర్మలచిట్టా తెరవబడినప్పుడు, ఆకాశానికున్న తెర తొలగించ బడినప్పుడు, నరకం దహించబడినప్పుడు, స్వర్గం దగ్గరకు తేబడినప్పుడు– ఆ.... అప్పుడు ప్రతి మనిషికీ తానేమి వెంట తెచ్చుకున్నాడో తెలుస్తుంది.” (ఖుర్ఆన్=81:1–14)

## పునరుత్థానం-28

ప్రళయ బీభత్సంతో విశ్వవ్యవస్థ మారిపోయినప్పుడు మానవులతో పాటు యావత్తు జీవరాసులు తమ ఉనికిని కోల్పోతాయి. అప్పుడు సృష్టికర్త, సర్వేశ్వరుడయిన ఒక్క దేవుడు తప్ప మరెవరూ ఉండరు.

శ్రీమద్ భాగవతం (4:14-18)లో “ఈ ధరిత్రిగాని, ఈ ఆకాశంగాని మిగిలి ఉండవు. మిగిలి ఉండేది కేవలం బ్రహ్మ ఒక్కడే. ఆ తరువాత పరలోక ఘట్టం ప్రారంభం అవు తుంది” అని స్పష్టంగా చెప్పబడింది.

“వారు దేవునికి విలువ ఇవ్వవలసిన విధంగా విలువ ఇవ్వనే లేదు. పునరుత్థాన దినాన యావత్తు భూమండలం ఆయన పిడికిలిలో ఉంటుంది. యావత్తు నభో మండలం ఆయన కుడిచేతిలో (చాపలా) చుట్టబడి ఉంటుంది. వీరు చేస్తున్న బహుదైవారాధనకు ఆయన ఎంతో అతీతుడు, పరమ పవిత్రుడు.” (ఖుర్ఆన్–39:67)

ఒకసారి దైవప్రవక్త (సల్లం) మసీదులో వేదికపై నిలబడి ఈ సూక్తి పఠించిన తరువాత ఇలా తెలియజేశారు: “దేవుడు (ప్రళయదినాన) భూమ్యాకాశాలను (యావత్తు గ్రహాలను) తన చేతిలోకి తీసుకొని పిల్లవాడు బంతిని తిప్పినట్లు తిప్పుతూ ‘నేను ఏకైక దేవుడ్ని, నేను (విశ్వ) చక్రవర్తిని. నేను సర్వ శక్తిమంతుడ్ని. నేను సమస్త వైభవాలుగల మహోన్నతుడ్ని. ఇక ప్రపంచవాసులైన ఆ చక్రవర్తులు ఎక్కడ ఉన్నారు? ఏరా నియంతలు? ఏమయ్యారు ఆ అహంకారులు?” అని అంటాడు.

దైవప్రవక్త (సల్లం) ఇలా చెబుతూ ఆపాదమస్తకం ఊగిపోసాగారు. ఆ దృశ్యం చూస్తున్న ప్రవక్త అనుచరులు (రజి) ఆయన ప్రసంగవేదికపై నుండి పడిపోతారేమో నని భయపడిపోయారు. (బుఖారి, ముస్లిం)

అలాంటి దేవునికి ఇతరుల్ని సాటి కల్పించడం, వారు కూడా తమ మొరలు ఆలకించి కోర్కెలు తీర్చుతారని నమ్మడం; తదనుగుణంగా ప్రవర్తించడం; ఆయనకు మానవ బలహీనతలు ఆపాదించడం; సృషికర్త, యజమాని, ప్రభువయిన దేవుని పట్ల స్పష్టమైన విశ్వాసఘాతుక చర్య అవుతుంది. ఘోరమైన పాపంగా పరిగణించబడుతుంది. ఈ ఘోరపాపానికి మనిషి బ్రతికుండగా క్షమాపణకోరుకొని సన్మార్గం అవలంబించకపోతే, మరణానంతర జీవితంలో ఎంత పశ్చాత్తాపం చెందినా ప్రయోజనం ఉండదు.

ఈ ప్రళయ మహోపద్రవం తరువాత విశ్వం రూపురేఖలు పూర్తిగా మారిపోతాయి. నూతనవిశ్వం ఏర్పడుతుంది. ఈమార్పు జరగడానికి ఎన్నివేల సంవత్సరాలు గడుస్తాయో తెలియదు. భూమి రూపురేఖలు కూడా మారిపోతాయి. నేలంతా సాగదీయబడి ఎలాంటి

మిట్టపల్లాలులేని చదునైన మైదానంగా మారుతుంది. ఆ తర్వాత దేవుడు మంచు లాంటి వర్షం కురిపిస్తాడు. దాంతో మృతమానవులు మొక్కలమాదిరిగా మొలకెత్తుతారు. అంటే వారు తిరిగి దేహాలతో రూపొందుతారు.

దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: "..... రెండవసారి శంఖారావం గావించ బడిన తరువాత దేవుడు వర్షం కురిపిస్తాడు. దానివల్ల మానవులు (నేల నుండి మొక్కల మాదిరిగా) మొలకెత్తుతారు." మరొక సందర్భంలో ఆయన ఇలా అన్నారు: "మానవ దేహానికి సంబంధించిన ప్రతీదీ చీకిపోతుంది (మట్టిగా మారుతుంది), ఒక్క ఎముక తప్ప. అదిమాత్రమే మిగిలి ఉంటుంది. ప్రళయదినాన ఆ ఎముకతోనే మొత్తం శరీరం సృజించబడుతుంది. అదే వెన్నెముక." (బుఖారి, ముస్లిం) వేరొక హదీసులో "ఆ వెన్నెముక ఆవగింజంత చిన్నదయి మిగిలి ఉంటుంద"ని ఉంది. (తర్గీబ్)

ఆ తరువాత మూడవసారి శంఖం ఊదబడుతుంది.

**మూడవసారి శంఖారావం**తో ఆది నుండి ప్రళయందాకా పుట్టిన మానవులంతా పునర్జీవులయి లేస్తారు. మృతదేహాలను సమాధిచేసినా, సముద్రంలో పారేసినా, అగ్నిలో కాల్చి బూడిదను నదులలో కలిపేసినా, క్రూరమృగాలు చీల్చిచెండాడినా సరే అందరినీ దేవుడు బ్రతికిస్తాడు. వారి శరీరచిహ్నాలు ఎక్కడుంటే అక్కడ్నుంచి వారు పునర్జీవులై లేస్తారు. ఒకేఒక గర్జనతో ఒక్కొక్క సమాధి నుండి వేలాదిమంది మానవులు లేచి ఒకరి కొకరు పోటీపడి పరుగెత్తినట్లు ఒక దిశగా పరుగెత్తుతారు. అయితే వారంతా స్త్రీలైనా, పురుషులైనా పూర్తి నగ్నంగా ఉంటారు. తీవ్రమైన భయాందోళనల కారణంగా వారు ఒకరివైపు ఒకరు చూసుకునే పరిస్థితిలో ఉండరు. పురుషులు వడుగులు చేయబడని వారయి ఉంటారు. అందరూ కంగారు పడుతూ పరుగెత్తుతారు.

**నగ్నశరీరాలతో లేస్తారు :** హజ్రత్ ఆయిషా (రజి) కథనం: దైవప్రవక్త (స) మాట్లాడుతూ "ప్రళయదినాన మానవులు నగ్నపాదాలతో, నగ్నశరీరాలతో, ఖత్నా (వడుగు) చేయబడనివారిగా లేపబడతారు" అని తెలిపారు. నేనీ మాట విని "దైవప్రవక్తా! (ఆ స్థితిలో) స్త్రీలు, పరుషులు ఒకర్నొకరు చూసుకుంటారా?" అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) "ఆ సమయంలో వారంతా తీవ్రమైన ఆందోళనకు లోనయిఉంటారు. ఒకరివైపు మరొకరు చూసుకునే ఆలోచనే తట్టదు వారికి" అని చెప్పారు. (బుఖారి)

హజ్రత్ ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: దైవప్రవక్త (స) మా ముందు ప్రసంగిస్తూ "మీరు ప్రళయదినాన లేపబడినప్పుడు నగ్నపాదాలతో, నగ్నశరీరాలతో, వడుగు చేయ బడనివారై ఉంటారు. ఖుర్ఆన్‌లో 'మేము మానవుడ్ని మొదట్లో ఏవిధంగా పుట్టించామో తిరిగి అదేవిధంగా చేస్తాము' అని ఉంది. ప్రళయదినాన అందరికంటే ముందు హజ్రత్ ఇబ్రాహీం (అలైహి)కు బట్టలు ధరింపజేస్తారు" అని అన్నారు. (బుఖారి)

"భూమి తీవ్ర ప్రకంపనలతో కుదిపి వేయబడుతుంది. అది తనలోని భారమంతా తీసి బయట పడవేస్తుంది. అప్పుడు మానవుడు (బిత్తరపోయి చూస్తూ) "ఏమయింది దీనికి (ఇలా చేస్తోంది)?"అంటాడు. ఆరోజు భూమి (తనమీద జరిగిన) పరిస్థితులు వివరిస్తుంది." (ఖుర్ఆన్-99:1-4)



"ఆకాశం తన ప్రభువాజ్ఞ శిరసావహించి బ్రద్దలవుతుంది. ఇది దాని విధ్యుక్తధర్మం. భూమి సాగదీసి చదునైన మైదానంగా చేయబడుతుంది. అది కూడా తన ప్రభువాజ్ఞ పాటించి తనలో ఉన్నదంతా బయటికి విసిరి ఖాళీ అవుతుంది. ఇది దాని విధ్యుక్తధర్మం." (ఖుర్ఆన్-84:1-5)

పునరుత్థాన (హషర్) దినాన యావత్తు భూమండలం నలువైపులా సాగి చదునైన మైదానంగా మారిపోతుంది. కొండలు, గుట్టలు, చెట్లు, అడవులు, నదులు, సముద్రాలు ఏవీ ఉండవు. ఆది నుండి అంతం వరకు పుట్టిన కోటానుకోట్ల మానవులందరూ ఆరోజు ఈ మైదానంలో సమావేశమవుతారు. వారికక్కడ పాదాలు మోపడానికి మాత్రమే చోటు ఉంటుంది. భూమి తనలో ఉన్నదంతా బయటికి విసరేయడమంటే, తనలో ఇముడ్చుకున్న మృతమానవుల్ని, వారికి సంబంధించిన సాక్ష్యాధారాలను బయటికి త్రోసివేస్తుందన్న మాట. ఈ క్రింది ఖుర్ఆన్ సూక్తులు చూడండి:

"ఆ తర్వాత శంఖం ఊదబడుతుంది. దాంతో వారు తమప్రభువు ముందు హాజరు కావడానికి ఒక్కసారిగా సమాధుల నుంచి లేచి బిలబిలా బయటికి వస్తారు. (పరిస్థితి అర్థంగాక) కంగారుపడుతూ "అరె! ఎవరు మనల్ని మన పడకల నుండి లేపారు?" అనంటారు. (అప్పుడు) "కరుణామయుడైన దేవుడు వాగ్దానం చేసిన విషయం ఇదే. (ఆనాడు) దైవప్రవక్తలు నిజమే చెప్పారు" (అని సమాధానం వస్తుంది). అది దిక్కులు పిక్కటిల్లే ఒకేఒక భీకర గర్జన!! దాంతో యావన్మందీ మాముందు ప్రవేశపెట్టబడతారు." (36:51-53)

"ఏ రోజు వారిని పిలిచేవాడు అనూహ్యమైన ఓ జుగుప్సాకర విషయం వైపునకు పిలుస్తాడో, ఆరోజు మానవులంతా బిత్తరచూపులు చూస్తూ, చెల్లాచెదరైన మిడతల దండులా తమ తమ సమాధుల నుండి బిలబిల బయటికి వస్తారు. అలా బయటికొచ్చి పిలిచేవాడి వైపు పరుగెత్తుతారు. (ఈరోజు ఈ సత్యాన్ని నిరాకరిస్తున్న) తిరస్కారులు (యదార్థం తెలుసుకొని) 'ఇది చాలా కఠినమైన రోజ'ంటారు." (54:4-8)

"కాబట్టి వారిని ఆటపాటల్లో, పనికిమాలిన మాటల్లోనే పడి ఉండనివ్వు. అదేస్థితిలో చివరికి వారు తమకు వాగ్దానం చేయబడుతున్న రోజుకు చేరుకుంటారు. అప్పుడు వారు తమ విగ్రహాల వైపు దౌడుతీస్తున్నట్లు, సమాధుల నుంచి లేచి ఒకరి కొకరు పోటీ పడుతూ పరుగెత్తుతారు. (అయితే తీరా చేరవలసిన చోటికి చేరినపుడు) వారి చూపులు (పశ్చాత్తాపంతో) క్రిందికి వాలిపోతాయి. అవమానం, అప్రతిష్ఠలు వారిని ఆవరిస్తాయి. అదే వీరికి వాగ్దానం చేయబడుతున్న (ప్రళయ)దినం." (70:42-4)

**నిలువుగుడ్డలతో నేరస్థులు :** "(ఖుర్ఆన్‌ని) విశ్వసించకుండా ముఖం తిప్పుకునే వాడు ప్రళయదినాన దారుణమైన పాపభారం మోయవలసి వస్తుంది. ఆ పాపభారాన్ని

అతడు ఎల్లకాలం మోస్తూఉంటాడు. ప్రళయదినాన (ఈ పాపపుకొండ) అతనికి అత్యంత బాధాకరమైన భారంగా పరిణమిస్తుంది. శంఖం పూరించబడే రోజు మేము నేరస్థుల్ని చుట్టుముట్టి (ఒకచోట) చేర్చుతాము. అప్పుడు వారు (భీతావహంతో) నిలువుగుడ్లు వేసి చూస్తారు. తరువాత వారు పరస్పరం మెల్లిగా మాట్లాడుకుంటూ "మీరు ప్రపంచంలో మహా అయితే పదిరోజులు గడిపారేమో" అంటారు. వారు మాట్లాడుకుంటున్నదేమిటో మాకు బాగా తెలుసు. వారిలో కాస్త తెలివైనవాడు "కాదు, మీరసలు ప్రపంచంలో ఒక్క రోజు మాత్రమే గడిపారు" అనంటాడు. (20:100-104)

"దేవుడు వారందర్నీ సవవేశపరచే రోజు (భూలోకంలో) తాము కొన్ని క్షణాలకంటే ఎక్కువ కాలం గడపలేదని వారు భావిస్తారు. ఒకర్నొకరు గుర్తుపట్టడం జరుగుతుంది. అయితే దేవుడ్ని కలుసుకునే విషయాన్ని నిరాకరించినవారు (ఆరోజు) ఘోరంగా నష్టపోతారు. వారసలు ఏమాత్రం సన్మార్గంలో నడవలేదు." (10:45)

**మూడు వర్గాలు :** మానవులు సమాధుల నుంచి లేచిన తరువాత వారివారి కర్మలను బట్టి మూడు వర్గాలుగా మారి హషర్ మైదానం వైపు వెళ్తారు. ఒకటి, కాలినడకన వెళ్ళే వర్గం. రెండు, వాహనాలపై వెళ్ళే వర్గం. మూడు, తలకిందులయి ముఖంతో నడిచే వర్గం. వీరు సత్య తిరస్కారులు. వీరు ప్రపంచంలో ఉండగా సత్యం కానలేని అంధులుగా, సత్యం వినలేని బధిరులుగా ప్రవర్తించి నందుకు దేవుడు వీరిని ప్రళయ దినాన అంధులుగా, బధిరులుగా చేసి లేపుతాడు.

"వారిని మేము ప్రళయదినాన బోర్లాపడేసి ఈడ్చుకొస్తాము. వారు అంధులు, బధిరులు, మూగలు. నరకమే వారి నివాసమవుతుంది." (ఖుర్ఆన్-17:97)

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "పునరుత్థాన దినాన మానవులు మూడు వర్గాలుగా చీలిపోతారు. ఒక వర్గంలో భయం, ఆశ కలిగినవారు ఉంటారు. (రెండవ వర్గంలో) ఒక ఒంటె మీద ఇద్దరు, మరొక ఒంటె మీద ముగ్గురు, వేరొక ఒంటె మీద నలుగురు చొప్పున ఉంటారు. మిగిలిన (మూడో వర్గం) వారిని అగ్ని ఒక చోటుకు చేర్చుతుంది. వారు మధ్యాహ్నం వేళ ఎక్కడయినా కాస్త నడుం వాల్చితే ఈ అగ్ని కూడా వారితో పాటే ఉంటుంది. రాత్రివేళ ఎక్కడైనా గడిపితే అప్పుడు కూడా ఈ అగ్ని వారిని వెన్నంటే ఉంటుంది." (బుఖారి, ముస్లిం)

"ప్రళయదినాన (మానవులు) విభిన్న వర్గాలుగా విడిపోతారు. సత్యాన్ని విశ్వసించి సత్కర్మలు చేసినవారు స్వర్గంలో సుఖసంతోషాలతో ఉంటారు. మా సూక్తుల్ని, పరలోక సంభవాన్ని తిరస్కరించిన అవిశ్వాసులు (నరక)యాతనల్లో మగ్గుతారు." (30:14-16)

"అప్పుడు మీరు మూడు వర్గాలుగా చీలిపోతారు: కుడి పక్షంవారు, ఆహా కుడిపక్షం వారి (అదృష్టం) గురించి ఏమని వర్ణించాలి! ఎడమ పక్షంవారు, ఎడమ పక్షంవారి (దౌర్భాగ్యం) గురించి ఇక చెప్పేదేముంది! ముందుండేవారు, (ప్రతి సత్కార్యంలో) వారు ముందుండేవారే! వారే (దైవ)సన్నిహితులు. వారు అపార సౌఖ్యాలతో కూడిన స్వర్గవనాలలో



ఉంటారు. ముందుతరాల వారిలో (దైవసన్నిహితులు) అత్యధికంగా ఉంటారు. తర్వాతి తరాలవారిలో తక్కువమంది ఉంటారు." (ఖుర్ఆన్-56:7-14)

దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "ప్రళయదినాన నా అనుచర సముదాయానికి చెందిన కొందరిని తీసుకొచ్చి ఎడమపక్షం వారిలో చేర్చడం జరుగుతుంది. నేనప్పుడు 'ప్రభూ! వీరు నా అనుచరులు కదా!' అంటాను. దానికి దేవుడు 'నీ తదనంతరం వీరు (ధర్మంలోలేని) ఎన్ని కొత్తకొత్త విషయాలు సృష్టించారో నీకు తెలియదు' అనంటాడు. నేనీ మాట విని దేవుని పుణ్యదాసుడు (హజ్రత్ ఈసా) పలికిన పలుకులే పలుకుతాను. ఆయన పలుకులు ఇలా ఉన్నాయి- '(ప్రభూ!) నేను వారి మధ్య జీవించి ఉన్నంతవరకే నేను వారిని కనిపెట్టుకొని ఉన్నాను. మీరు నన్ను పైకెత్తుకున్న తరువాత వారిని మీరే కనిపెట్టుకొని ఉన్నారు. మీరు అందర్నీ, అన్ని విషయాల్ని (అన్ని వేళలా) కనిపెడ్తూ ఉంటారు. ఇప్పుడు మీరు వారిని శిక్షిస్తే వారు మీ దాసులే. ఒకవేళ క్షమిస్తే మీరు ఎంతో శక్తిమంతులు, మహా వివేకవంతులు.' (ఖుర్ఆన్-5:118). ఆ తరువాత నాతో "(నీవు ప్రపంచం నుండి వెళ్ళిపోయాక) వీరు మతభ్రష్టులయి జీవితాంతం అదే స్థితిలో ఉండిపోయారు" అని అంటాడు." (బుఖారి, ముస్లిం)

**చెమటలతో ఉక్కిరిబిక్కిరి :** మానవులు సమాధుల నుండి లేచిన తరువాత హషర్ మైదానంలో గుమికూడుతారు. అప్పుడు పరిస్థితి చాలా దుర్భరంగా ఉంటుంది. బుఖారి గ్రంథంలోని ఒక హదీసు ప్రకారం సూర్యుడు మానవులకు చాలా దగ్గరగా వస్తాడు. వాతావరణం చాలా వేడిగా ఉంటుంది. గాలి స్తంభిస్తుంది. విపరీతమైన ఉక్క పోస్తుంది. మానవులు చెమటలో తడిసిపోతారు. అయితే ఈ చెమట మానవుల కర్మలను బట్టి ఉంటుంది. కొందరు చీలమండలదాకా చెమటలో ఉంటారు. కొందరు మోకాళ్ళదాకా చెమటలో ఉంటారు. మరికొందరు నడుందాకా చెమటలో ఉంటారు. ఇంకొందరు నోటిదాకా చెమటలో మునిగి ఉంటారు. ఆ చెమట వారి నోళ్ళ దాకా వచ్చి కళ్ళెంలా నోళ్ళలోకి పోతుంటుంది.

హజ్రత్ మిఖ్దాద్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "ప్రళయదినాన సూర్యుడు మానవులకు ఎంతో దగ్గరగా వస్తాడు. చేసుకున్న దుష్కర్మల్ని బట్టి కొందరికి తక్కువగా, మరికొందరికి ఎక్కువగా చెమట కారుతుంది. కొందరు చీలమండల దాకా చెమటలో తడిసిఉంటారు. మరికొందరు మోకాళ్ళదాకా చెమటలో తడిసిఉంటారు. ఇంకొందరు నడుందాకా చెమటలో ఉంటారు. కొందరయితే పాదాల నుంచి నోటి దాకా చెమటలో మునిగి ఉంటారు. ఆ చెమట కళ్ళెంలా వారి నోళ్ళలోకి దూరి ఉంటుంది." (ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "ప్రళయదినాన మానవుల శరీరాల నుండి చెమట విపరీతంగా కారుతుంటుంది. ఆ చెమట నేల మీద డెబ్బయి గజాల దాకా పారుతుంటుంది. వారు తమ నోళ్ళు, చెవుల దాకా చెమటలోనే మునిగి ఉంటారు." (బుఖారి)

మరొక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా ప్రవచించారు:

"హషర్ మైదానంలో మానవుని శరీరం నుండి విపరీతంగా చెమట కారుతుంది, నిరంతరాయంగా కారుతుంది. దాంతో అతను బెంబేలెత్తిపోయి 'ప్రభూ! నాకీ చెమట యాతన కంటే మీరు నన్ను నరకానికి పంపివేయడమే మంచిది' అంటాడు. హషర్ యాతన కాఠిన్యతను చూసి మనిషి ఇలా అంటాడు. కాని నరకయాతన ఇంతకంటే కఠినంగా, ఘోరంగా ఉంటుందన్న సంగతి అతనికింకా తెలియదు." (తర్గీబ్)

**ప్రళయదినం సుదీర్ఘకాలం :** ప్రళయదినం చాలా సుదీర్ఘకాలం ఉంటుంది. మిష్కాత్ గ్రంథంలోని ఒక హదీసు ప్రకారం అది యాభైవేల సంవత్సరాలంత సుదీర్ఘంగా ఉంటుంది. అంటే మొదటిసారి శంఖారావం అయిన దగ్గర్నుంచి తీర్పు ముగిసి స్వర్గ వాసులు స్వర్గానికి, నరకవాసులు నరకానికి వెళ్ళిపోయేవరకు ప్రళయదినం ఉంటుంది. అంతటి సుదీర్ఘదినం సత్యతిరస్కారులకు, కపటవిశ్వాసులకు ఎంతో కఠినంగా, బాధా కరంగా ఉంటుంది. విశ్వాసులకు మాత్రం తేలికగా ఉంటుంది.

ప్రవక్త అనుచరులు ప్రళయదినం గురించి "అంతటి సుదీర్ఘకాలంలో మానవుల పరిస్థితి ఏమిట"ని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్ష్యం! ఆ దినం విశ్వాసికి ప్రపంచంలో ఫర్జ్ నమాజ్ చేసేటంత సమయం కంటే కూడా తేలికగా ఉంటుంది." (అంటే పది పదిహేను నిమిషాలకంటే ఎక్కువసేపు ఉండదన్న మాట.) (మిష్కాత్)

## అవిశ్వాసుల పశ్చాత్తాపం-29

దేవుడు మానవుల్ని పునర్జీవింపజేసిన తరువాత ఆకాశం చీలిపోతుంది. అందులో అనేక ద్వారాలు ఏర్పడుతాయి. దైవదూతలు దివి నుండి భువికి దిగివస్తారు. వారిలో ఎనిమిది మంది దైవదూతలు దైవసింహాసనం ఎత్తుకొని ఉంటారు.

"ఆరోజు జరగవలసిన సంఘటన జరుగుతుంది. అప్పుడు ఆకాశం బ్రద్దలై, అస్త వ్యస్తమై పోతుంది. (సరికొత్త విశ్వం ఆవిర్భవిస్తుంది.) నలుదిశలా దైవదూతలు ప్రత్యక్ష మయి ఉంటారు. ఆరోజు ఎనిమిది మంది దైవదూతలు నీ ప్రభువు సింహాసనం ఎత్తి పట్టుకొని ఉంటారు. ఆరోజు మిమ్మల్ని (దైవ న్యాయస్థానంలో) ప్రవేశపెట్టడం జరుగు తుంది. (అక్కడ) మీరు ఏ రహస్యాన్నీ దాచలేరు." (ఖుర్ఆన్-69:14-18)

**మాడిన ముఖాలు:** "ఆరోజు కొందరి ముఖాలు దేదీప్యమానంగా వెలిగి పోతుం టాయి. ఆ ముఖాలలో చిరునవ్వులు, ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తాయి. (వీరు సత్యాన్ని విశ్వసించిన సజ్జనులైఉంటారు.) మరికొందరి ముఖాలు మట్టికొట్టుకొని, నల్లగా మాడిపోయి ఉంటాయి. వీరు సత్యాన్ని నిరాకరించిన దురాత్ములై ఉంటారు." (ఖురాన్-80:39-42)

సత్యం దగ్గరికి వచ్చినా దాన్ని విశ్వసించడానికి నిరాకరించినవారు ప్రళయ దినాన తీవ్రంగా పశ్చాత్తాపపడతారు. మనిషి ఏవిధంగా శరీరపోషణకు ఏది మంచి పదార్థమో



పరికించి స్వీకరిస్తాడో, అదేవిధంగా ఆత్మవికాసం కోసం కూడా ఏది సత్యమో ఏది నిజధర్మమో పరిశీలించి స్వీకరించవలసి ఉంటుంది. మంచి ఏదో చెడు ఏదో, సత్య మేదో అసత్యమేదో మనిషికి అతని అంతరాత్మే చెబుతుంది. అతను తన అంతరాత్మ ప్రబోధన వినకుండా దాన్ని నొక్కిపట్టి అపమార్గంలోనే పడివుంటే, మరణానంతరం పరలోకంలో కుమిలికుమిలి ఏడ్వవలసివస్తుంది. ఈ సూక్తులు చూడండి:

"అసలు వాగ్దానం నెరవేరే సమయం త్వరలోనే ఆసన్నమవుతుంది. అప్పుడు హఠాత్తుగా సత్యతిరస్కారులకు నిలువుగుడ్లు పడతాయి. వారు (తమను తాము నిందించుకుంటూ) 'అయ్యయ్యో! మా పాడుగాను, మేమెంత ఏమరుపాటులో పడి ఉన్నాం!! (కాదు) మేమసలు పాపాత్ములం' అనంటారు." (ఖుర్ఆన్-21:97)

"ప్రతి మనిషీ తాను చేసుకున్న పాపపుణ్యాల (ఫలితాల)ను ప్రత్యక్షంగా తన ముందు చూసుకునేరోజు "తనకూ,ఈ పాపానికీ మధ్య ఆమడ దూరముంటే బాగుండ"ని భావిస్తాడు. దేవుడు తనను గురించి మిమ్మల్ని భయపెడ్తున్నాడు. ఆయన తన దాసుల విషయంలో అమిత దయామయుడు." (ఖుర్ఆన్-3:30)

"(ముహమ్మద్!) మేము ప్రతి సమాజం నుండి ఒక సాక్షిని తెచ్చి, ఆ సాక్షులపై నిన్ను సాక్షిగా నిలబెట్టే (ప్రళయ) దినాన వీరి పరిస్థితి ఏమవుతుంది? అప్పుడు దైవప్రవక్త ను నిరాకరించి, అతనికి అవిధేయులయిపోయిన అవిశ్వాసులు (పశ్చాత్తాపంతో కుమిలి పోతూ) "అయ్యయ్యో! భూమి బ్రద్దలయి తామందులో కూరుకుపోతే ఎంత బాగుండు!!" అని వాపోతారు. కాని వారు దేవుని దగ్గర ఏ విషయాన్నీ దాచలేరు." (4:41-42)

"ప్రవక్తా! ఆ దినం గురించి జనాన్ని భయపెట్టు. అప్పుడు దుర్మార్గులు (ప్రాపంచిక మత్తు వదలిపోయి) 'ప్రభూ! మాకు మరో అవకాశం ఇవ్వు. మేము నీ పిలుపునకు (వెంటనే) స్పందించి, నీ ప్రవక్తల అడుగుజాడల్లో నడుస్తాం' అని మొరపెట్టుకుంటారు.

(దానికీ సమాధానం వస్తుంది:) "దీనికి పూర్వం మీరు ప్రమాణాలు చేసిమరీ మీకసలు వినాశకాలమే రాదని చెబుతుండేవారు కదూ? నిజానికి మీరు (ఆనాడు) ఆత్మవినాశానికి పాల్పడినవారి నివాసప్రాంతాల్లోనే జీవితం గడిపారు. మేము వారిపట్ల ఎలా ప్రవర్తించామో చూశారు. వారిగాథలు ఉదాహరిస్తూ మీకు హితోపదేశం కూడా చేశాం. (అయినా మీకు బుద్ధి రాలేదు.) ఇప్పుడు సమయం మించిపోయింది". (దివ్య ఖుర్ఆన్-14:44,45)

"దేవుడ్ని కలుసుకోవల్సి ఉంటుందన్న వార్తను అసత్యవిషయంగా భావించినవారు ఘోరంగా నష్టపోతారు. వారా ఘడియ అకస్మాత్తుగా వచ్చినప్పుడు 'అయ్యయ్యో! ఈ విషయంలో మేమెంత పొరబడ్డాం!!' అని వాపోతారు. అప్పుడు వారు తమ పాపభారం వీపులపై మోసుకొస్తారు. చూడు, ఎంత నీచమైన భారమో అది!" (6:31)

"ఈ పాపాత్ములు తమ ప్రభువు ముందు తలలొంచి నిలబడినప్పుడు నీవు వారి పరిస్థితి చూడగలిగితే బాగుండు. అప్పుడు వారు (పశ్చాత్తాపంతో) 'ప్రభూ! మేము అంతా

చూసుకున్నాం, విన్నాం. మమ్మల్ని వెనక్కి పంపించు. మేము పుణ్యకార్యాలు చేస్తాం. ఇప్పుడు మాకు (బుద్ధొచ్చింది.) పూర్తి నమ్మకం కలిగింది' అనంటారు. (32:12)

"ఆ రోజు నిజమైన సామ్రాజ్యాధికారం కరుణామయునిదే అవుతుంది. అది సత్య తిరస్కారులకు అతి కఠినమైన దుర్దినంగా దాపురిస్తుంది. ప్రతి దుర్మార్గుడు (ఆరోజు పశ్చాత్తాపంతో) చేతిని కొరుక్కుంటూ ఇలా అంటాడు: 'అయ్యో! నేను దైవప్రవక్తతో సహకరించి సన్మార్గగామి అయివుంటే ఎంత బాగుండేది!! అయ్యయ్యో! నేను ఫలానావాడ్ని స్నేహితుడిగా చేసుకోకుండాఉంటే బాగుండేది!! వాడి మాయదారిమాటలు విని నాదగ్గర కొచ్చిన హితోపదేశం దూరం చేసుకున్నానే! నేనెంత దౌర్భాగ్యుడ్ని!!". (25:28)

**ప్రతి మనిషికీ పశ్చాత్తాపమే :** హజ్రత్ అబూహురైరా (రజి) కథనం: దైవప్రవక్త (సల్లం) తన అనుచరులకు హితోపదేశం చేస్తూ "మరణించిన ప్రతి మనిషీ పశ్చాత్తాప పడతాడు" అని చెప్పారు. ఈమాట విని ఆయన అనుచరులు "పశ్చాత్తాపపడటం అంటే ఏమిటి దైవప్రవక్తా?" అని అడిగారు. దానికి ఆయన "చనిపోయిన మనిషి సజ్జనుడయి వుంటే, తాను మరిన్ని సత్కార్యాలు ఎందుకు చేసుకోలేకపోయానని పశ్చాత్తాపపడతాడు. ఒకవేళ అతను చెడ్డ వాడయివుంటే, తాను చెడ్డపనులు ఎందుకు మానుకోలేకపోయానని పశ్చాత్తాపపడతాడు" అని సమాధానమిచ్చారు. (తిర్మిజి)

## దైవ న్యాయస్థానం-30

మనిషి ఏ మంచి పనైనా చేస్తే తగిన ప్రతిఫలం లభిస్తుందన్న ఆశ, చేయకపోతే శిక్ష అనుభవించవలసి వస్తుందన్న భయం ఉన్నప్పుడే ఆ పని చేస్తాడు. అలాగే ఏ చెడ్డ పనైనా చేస్తే శిక్ష అనుభవించవలసి వస్తుందన్న భయం, చేయకపోతే ప్రతిఫలం లభిస్తుం దన్న ఆశ ఉన్నప్పుడే ఆ పని చేస్తాడు. మంచీ, చెడులకు సంబంధించిన ఈ ఆశా, భయాలు ప్రాపంచికవిషయంలో కంటే పరలోక విషయంలో ఎక్కువగా ఉన్నప్పుడే మనిషి ఈ విధంగా స్పందించ గలుగుతాడు.

ఈ కారణంగానే మానవుల్ని సృష్టించి, వారి నైజం ఎరిగిన దేవుడు ఖుర్ఆన్‌లో మాటిమాటికి పరలోకంలో జరిగే పరిణామాల్ని తెలియజేస్తున్నాడు. చేసిన కర్మలకు పరలోకంలో సత్ఫలం లేక దుష్ఫలం అనుభవించవలసి వస్తుందని వారిలో జవాబుదారీ భావన కలిగిస్తున్నాడు. మానవుల కర్మల్ని ఎప్పటికప్పుడు నమోదుచేసిన దైవదూతలు ప్రళయదినాన వాటిని దైవన్యాయస్థానంలో ప్రవేశపెడ్తారు. అక్కడ కర్మవిచారణ తర్వాత అందరికీ న్యాయంగా తీర్పు జరుగుతుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు.

"(మానవుడు గౌరవ ప్రతిష్ఠలకు సిరిసంపదలే కొలమానం అనుకుంటున్నాడు). ఎంత మాత్రం కాదు. మీరసలు అనాథను ఆదరించరు; పేదవాడికి పట్టెడన్నం పెట్టే విషయంలో ఒకర్నొకరు ప్రోత్సహించుకోరు. (బంధువుల బలహీనలతను ఆసరాగా చేసుకొని, వారికి దక్కవలసిన) వారసత్వపు ఆస్తినంతటినీ కాజేస్తున్నారు. మీరసలు ధనవ్యామోహం ఊబిలో పూర్తిగా కూరుకుపోయారు." (ఖుర్ఆన్-89:17-20)



"(ఇన్ని అక్రమాలకు పాల్పడుతూ కూడా దేవునికి భయపడకుండా తీర్పుదినం ఏదీ లేదని వాదిస్తున్నారు.) ఏమాత్రం కాదు. యావత్తుభూమి దంచి, పిండిపిండి చేయబడి నప్పుడు నీ ప్రభువు పంక్తులుతీరిన దైవదూతలతో అవతరిస్తాడు. ఆరోజు నరకం దగ్గరకు తీసుకురాబడుతుంది. ఆరోజు మానవుడికి అసలు సంగతి అర్థమవుతుంది. కాని అప్పుడు అర్థంచేసుకోవడం వల్ల ప్రయోజనం ఏమిటీ?" (దివ్య ఖుర్ఆన్- 89:21-23)

"ఆరోజు ఆకాశాన్ని చీల్చుకుంటూ ఒక మేఘం ప్రత్యక్షమవుతుంది. దాంతో పాటు (ఆకాశం నుండి) పెద్ద ఎత్తున దైవదూతలు దిగి వస్తారు." (ఖుర్ఆన్-25:25)

"ఆరోజు ఎనిమిది మంది దైవదూతలు నీ ప్రభువు సింహాసనం ఎత్తి పట్టుకొని ఉంటారు. ఆరోజు మిమ్మల్ని (దైవ న్యాయస్థానంలో) ప్రవేశపెట్టడం జరుగుతుంది. (అక్కడ) మీరు ఏ రహస్యాన్నీ దాచలేరు." (ఖుర్ఆన్-69:16-18)

"మేము యావత్తు మానవుల్ని చుట్టుముట్టి (ఓచోట) సమీకరిస్తాం. ఒక్కడ్ని కూడా వదలిపెట్టం. అందర్నీ వరుసలుతీర్చి నీ ప్రభువు సమక్షంలో ప్రవేశపెట్టడం జరుగుతుంది. ఇక చూడండి, వచ్చేశారుగా మా వద్దకు మీరు! మేము మిమ్మల్ని మొదటిసారి ఎలా పుట్టించామో అలాగే మీరు మా దగ్గరకు వచ్చారు. మేము మీ (కర్మవిచారణ)కు ఎలాంటి సమయం నిర్ణయించలేదని మీరు భావిస్తుండేవారు." (ఖుర్ఆన్-18:47,48)

"మానవుడు తన ప్రభువు పట్ల చాలా కృతఘ్నుడయి పోయాడు. దానికి స్వయంగా అతనే సాక్ష్యం. (అంటే అతని చేష్టలే సాక్ష్యం.) అతను ధనవ్యామోహంలో పూర్తిగా కూరుకుపోయాడు. సమాధుల్లో వున్నవాటిని తీసి బ్రతికించి, అంతరంగాల్లో (దాగి) వున్న వాటిని రట్టుచేయడం జరుగుతుందని అతనికి తెలియదా? ఆరోజు అతడ్ని గురించి అతని ప్రభువుకే బాగా తెలుసు." (ఖుర్ఆన్-100:6-11)

"ఆరోజు ఈ సౌఖ్యాలు, సిరిసంపదలను గురించి మిమ్మల్ని తప్పకుండా నిలదీయడం జరుగుతుంది." (102:8) "మీరంతా చివరికి దేవుని సన్నిధికి చేరుకోవలసిన దినం గురించి భయపడండి. (ఆరోజు) ప్రతి మనిషికీ అతను చేసుకున్న కర్మలకు పూర్తి ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు." (ఖుర్ఆన్-2:281)

"ఆరోజు నక్షత్రాలు నిస్తేజమైపోతాయి. ఆకాశం (ఎక్కడికక్కడ) చీలిపోతుంది. పర్వతాలు దూది పింజల్లా ఎగురుతాయి. దైవప్రవక్తలను ప్రవేశపెట్టే సమయం ఆసన్న మవుతుంది. ఏరోజు కోసం ఈ పనులు ఆపి ఉంచబడ్డాయి? విచారణరోజు కోసం. విచారణ రోజంటే ఏమిటో నీకు తెలుసా? (పరలోక) ధిక్కారులకు ఆరోజు వినాశం తప్పదు." (ఖుర్ఆన్-77:8-15)

"(కనుక మానవుడు అజ్ఞానిగా ప్రవర్తిస్తూ అపమార్గం పట్టడానికి) ఏమాత్రం వీల్లేదు. మానవుడు తనను తాను గొప్పవాణ్ణని, నిరపేక్షాపరుణ్ణని భావించి విర్రవీగుతున్నాడు. (కాని) అతను చివరికి నీప్రభువు సన్నిధికే పోవలసి ఉంది." (ఖుర్ఆన్-96:6-8)

"(ఆరోజు) మానవులు సజీవుడు, శాశ్వితుడైన దేవుని ముందు తలలు వంచి నిల బడతారు. దుర్మార్గం, దౌర్జన్యాల పాపం మోసుకొచ్చినవాడు ఆరోజు సర్వనాశనమైనట్లే. సత్కార్యాలు చేసివుండటంతో పాటు విశ్వాసి కూడా అయివుండినవాడికి ఎలాంటి నష్టం గాని, అన్యాయంగాని జరుగుతుందన్న భయమే ఉండదు." (ఖుర్ఆన్-20:111,112)

"ఆరోజు ఏ ఒక్కరికీ నోరు మెదిపే ధైర్యం కూడా ఉండదు, దేవుని అనుమతితో ఏదైనా కొంచెం మనవి చేసుకోవడం తప్ప. ఆరోజు కొందరు దౌర్భాగ్యులు ఉంటారు. మరికొందరు సౌభాగ్యవంతులు ఉంటారు." (ఖుర్ఆన్-11:105)

"ఆయన మహోన్నతమైన హోదా, అంతస్తులు కలవాడు, (సర్వాధికార) సింహాసనానికి అధిపతి. ఆయన తన దాసులలో తాను తలచుకున్న వారిపై తన ఆదేశంతో దివ్యావిష్కృతి అవతరింపజేస్తున్నాడు. వారు పరలోకసమావేశం రోజు గురించి హెచ్చరించాలన్నదే దీని ఉద్దేశ్యం. ఆరోజు మానవులంతా నిరాటంకంగా ముందుకొస్తారు. దేవుని దగ్గర వారు ఏ విషయాన్నీ దాచలేరు. (అప్పుడు వారిని ఎలుగెత్తి పిలిచి) "ఈరోజు సార్వభౌమత్వం ఎవరిద"ని అడుగుతారు. (దానికి యావత్తుసృష్టి) "చండశాసనుడయిన ఏకేశ్వరునిదే" (అంటుంది)." (ఖుర్ఆన్-40:15,16)

## మానవుల విభిన్న పరిస్థితులు-31

హషర్ మైదానంలో మానవులు విభిన్న పరిస్థితులకు లోనయి ఉంటారు. మానవుల కర్మలను బట్టి ఈ పరిస్థితులు రకరకాలుగా ఉంటాయి.

**యాచకులు** : మనిషి కష్టపడి సంపాదించే శక్తి ఉన్నప్పటికీ జీవితాంతం భిక్షాటన చేసి పొట్టబోసుకోవడాన్ని ఇస్లాం ఎంతమాత్రం హర్షించదు. పైగా అలాంటి మనిషి పరలోక శిక్షకు గురికావలసి వస్తుందని హెచ్చరిస్తోంది. "మనిషి (ఏమాత్రం ఆత్మగౌరవం లేకుండా) బిచ్చం అడుక్కుంటూ చివరికి ప్రళయ దినాన తన ముఖంపై ఎలాంటి మాంసం లేనివాడుగా లేచివస్తాడు" అన్నారు దైవప్రవక్త (సల్లం). (బుఖారి)

**ఒక భార్యకు అన్యాయం చేసినవాడు :** ఇద్దరు ముగ్గురు భార్యలు ఉన్నప్పుడు భర్త ఆ ముగ్గురినీ సమానదృష్టితో చూడాలి. దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "ఇద్దరు భార్యలున్న పురుషుడు ఆఇద్దర్నీ సమానదృష్టితో చూడకుండా వారిలో ఒకరికి అన్యాయం చేస్తే అలాంటి మనిషి ప్రళయదినాన సగం దేహంతో లేచివస్తాడు." (మిష్కాత్)

**ఖుర్ఆన్ సూక్తులు మరచినవాడు :** "ఖుర్ఆన్ పఠించిన తరువాత (బద్ధకం, ఏమరుపాటుల వల్ల) దాన్ని మరచిపోయినవాడు కుష్టువ్యాధిగ్రస్తుడై దేవుడ్ని కలుసు కుంటాడు" అన్నారు దైవప్రవక్త (స). (మిష్కాత్)

**నమాజ్ చేయనివాడు** : నమాజ్ చేయనివాడికి నమాజ్ (ప్రళయదినాన) వెలుగు నివ్వడంగాని, ప్రమాణంగా నిలవడంగాని, మోక్షప్రదాయని కావడంగాని జరగదు" అన్నారు దైవప్రవక్త (సల్లం). (అహ్మద్, దార్మి)



**ప్రమాణభంగం చేసినవాడు :** "ప్రమాణభంగం చేసినవాడికి ప్రళయదిన శిక్షగా అతని గుదంలో ఒక జెండా పెట్టబడుతుంది" అన్నారు దైవప్రవక్త (స). (ముస్లిం) మరో ఉల్లేఖనం ప్రకారం "ఆ ప్రమాణం ఎంత పెద్దదయి ఉంటుందో అతని గుదంలో అంతే పెద్ద జెండా పెట్టబడుతుంది" అని చెప్పారు ఆయన. (మిష్కాత్)

**నాయకులు, పాలకులు :** న్యాయం చేయని నాయకులు, పాలకులను గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "పది మందికి నాయకుడైనవాడు ప్రళయదినాన చేతులు కట్టివేయబడినవాడయి వస్తాడు. (అనుచరుల పట్ల న్యాయంగా ప్రవర్తించి ఉంటే) అతడ్ని న్యాయం బంధవిముక్తుణ్ణి చేస్తుంది. లేదా (అన్యాయం చేసిఉంటే) అన్యాయం అతడ్ని అంతమొందిస్తుంది." (దార్మి)

"ప్రజలపై పెత్తనం చెలాయించిన పాలకుడు ప్రళయదినాన లేచినప్పుడు ఒక దైవదూత అతడ్ని మెడపట్టి తీసుకొస్తాడు. ఆ విధంగా తెచ్చి (దైవాజ్ఞ కోసం) తలపెకెత్తి ఆకాశం వైపు చూస్తాడు. అప్పుడు దేవుడు 'అతడ్ని పడదోయి' అని ఆజ్ఞాపిస్తే, దైవదూత వెంటనే అతడ్ని ఎంతో లోతయిన ఓ పెద్ద గుంటలోకి పడదోస్తాడు. దాంతో ఆ పాలకుడు లోతయిన ఆ గుంటలో పడిపోతూ నలభై యేళ్ళకు దాని అడుగుకు చేరుకుంటాడు." (మిష్కాత్)

**జకాత్ చెల్లించనివాడు** : దైవప్రవక్త (స) ఇలా సెలవిచ్చారు: "ఎవరికైతే దేవుడు ఐశ్వర్యం ప్రసాదించాడో అతను జకాత్ చెల్లించకపోతే ప్రళయదినాన ఆ ధనం ఓపెద్ద కొండచిలువగా మారుతుంది. దాని నెత్తి మీద రెండు చుక్కలుంటాయి. ఆ పామును కంఠపాశంగా చేసి అతని మెడలో వేయడం జరుగుతుంది. అప్పుడా పాము నోటితో అతని దౌడలు పట్టుకొని 'నేను నీ ధనాన్ని, నీ నిధిని' అంటుంది." ఆ తరువాత దైవప్రవక్త (స) ఖుర్ఆన్‌లోని ఈసూక్తి పఠించారు:

"దేవుడు తన అనుగ్రహంతో ప్రసాదించిన సంపద విషయంలో పిసినారితనం వహించేవారు ఆ పిసినారితనం తమకు మేలు చేకూరుస్తుందని భావించకూడదు. అది వారికి హాని కలిగిస్తుంది. వారు ఏ ధనం విషయంలో పిసినారితనం వహిస్తున్నారో అది రేపు ప్రళయదినాన వారి మెడకు గుదిబండగా మారుతుంది." (ఖుర్ఆన్-3:180)

వెండి బంగారాలను కూడబెట్టే పిసినారులను గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "వెండి బంగారాలు కలిగి వున్నవాడు వాటి హక్కు (జకాత్) నెరవేర్చకపోతే ప్రళయదినాన ఆ వెండిబంగారాలను అగ్నిలో కాల్చి పలకలుగా చేసి మండుతున్న ఆ పలకలతో అతని వీపుపై, పక్కలపై, నుదుటిపై వాతలు పెట్టడం జరుగుతుంది. పలకలలు చల్లారినప్పుడల్లా వాటిని మళ్ళీ కాల్చి అతని శరీరం మీద వాతలు పెడ్తారు. ఈ విధంగా యాభైవేల సంవత్సరాల సుదీర్ఘదినాన యావత్తు మానవాళి తీర్పు ముగిసేదాకా మాటిమాటికి వాతలు పెట్టడం జరుగుతుంది. చివరికి అతను (తన విశ్వాసం, కర్మలను బట్టి) స్వర్గానికి లేక నరకానికి పంపబడతాడు..... (ముస్లిం)

ఈ హదీసులోనే పశుసంపదపై జకాత్ చెల్లించని వాడ్ని గురించి కూడా తెలియజేశారు దైవప్రవక్త (సల్లం). ప్రళయదినాన అతని పశువులు బాగా బలిసిపోయి అతడ్ని కొమ్ములతో కుమ్ముతూ, కాలిగిట్టలతో నలిపేస్తాయి. ఇలా ప్రళయదినం నాటి సుదీర్ఘమైన తీర్పు ముగిసే వరకూ అతడ్ని అతని పశువులు మాటిమాటికి కొమ్ములతో కుమ్ముతూ, గిట్టలతో తొక్కుతుంటాయి. తరువాత తీర్పు ప్రకారం స్వర్గానికో లేక నరకానికో పంపడం జరుగుతుంది.

**తీవ్రమైన ఆకలితో ఉండేవాడు :** దైవప్రవక్త (సల్లం) ముందు ఒకతను తేన్చాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "నీ తేన్పును కాస్త తగ్గించుకో. ప్రపంచంలో అందరికంటే చాలా సేపటిదాకా (గొంతువరకు) తింటుండేవాడు ప్రళయదినాన అందరి కంటే చాలా సేపటిదాకా ఆకలితో ఉంటాడు" అని చెప్పారు. (మిష్కాత్)

**రెండు నాల్కల ధోరణి :** "ప్రపంచంలో రెండుముఖాల (రెండు నాల్కల) వాడు ప్రళయదినాన అగ్ని నాలుకతో ఉంటాడు" అన్నారు దైవప్రవక్త (సల్లం). (అంటే అతను కొందరి ముందు వారిని పొగుడుతూ, ఇతరుల్ని తెగుడుతాడు. తరువాత ఇతరుల ముందు వారిని పొగుడుతూ మొదట పొగిడినవారిని తెగుడుతాడన్న మాట.) (అయిజా)

**కట్టు కలలు చెప్పేవాడు :** అబద్ధపు కలలు కల్పించుకొని వాటిని ఇతరుల ముందు చెప్పేవాడు, ఇతరుల రహస్యసంభాషణలు దొంగచాటుగా వినేవాడు కూడా ప్రళయదిన శిక్షలు అనుభవిస్తాడు. ఇతరుల రహస్య సంభాషణలు దొంగచాటుగా విన్న వాడి చెవులలో సీసం కరిగించి పోయడం జరుగుతుందని దైవప్రవక్త (సల్లం) తెలియజేశారు. అలాగే జీవుల చిత్రాలు, బొమ్మలు తయారుచేసేవాడిపై వాటికి ప్రాణం పోయమని వత్తిడిచేయడం జరుగుతుందని అన్నారాయన. (మిష్కాత్)

**డాబుసరి దుస్తులు :** "ప్రపంచంలో పేరుప్రతిష్ఠల కాంక్షతో (ప్రత్యేక)దుస్తులు ధరించినవాడికి ప్రళయదినాన దేవుడు అవమానకరమైన దుస్తులు ధరింపజేస్తాడ"ని దైవప్రవక్త (సల్లం) ప్రవచించారు. (అహ్మద్, అబూదావూద్)

**భూకబ్జా దారుడు :** "ఇతరుల భూమిని ఏ కొంచెమైనా సరే అన్యాయంగా ఆక్రమించుకున్నవాడ్ని పాతాళలోకంలోకి దిగబడే వరకు భూమిలోకి అణచివేయడం జరుగుతుంది" అన్నారు దైవప్రవక్త (సల్లం). వేరొక ఉల్లేఖనంలో "ఎవరైనా అన్యాయంగా జానెడు భూమిని ఆక్రమించుకున్నా ప్రళయదినాన అతని మెడలో ఏడు భూముల కంఠపాశాన్ని వేయడం జరుగుతుంద"ని అన్నారు ఆయన. (బుఖారి, ముస్లిం)

**ధర్మజ్ఞానం దాచేవాడు :** "ధర్మజ్ఞానం ఉన్నవాడ్ని ఎవరైనా ఏదయినా ధర్మానికి సంబంధించిన విషయం అడిగినప్పుడు దాన్నతను చెప్పకుండా దాచేస్తే, ప్రళయదినాన అతని నోటికి నిప్పుకళ్ళెం వేయబడుతుంది" అన్నారు దైవప్రవక్త (సల్లం). (తిర్మిజి)



**కోపాన్ని దిగమింగేవాడు :** "కోపం వచ్చినప్పుడు ప్రతీకారం చేసే శక్తి ఉన్నప్పటికీ ఆ కోపాన్ని దిగమింగేవాడ్ని దేవుడు ప్రళయదినాన పిలిచి 'నీవు కోరుకున్న స్వర్గకన్యను తీసుకోవచ్చ'ని చెబుతాడు" అన్నారు దైవప్రవక్త (సల్లం) (అబూదావూద్)

కాబాయాత్ర సందర్భంగా చనిపోయినవాడు:- "దైవప్రవక్త (సల్లం) హజ్‌యాత్రకు వచ్చి అర్ఫాత్‌లో బసచేసినప్పుడు ఒక యాత్రికుడు హఠాత్తుగా ఒంటె మీద నుంచి జారిపడి చనిపోయాడు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) అనుచరులతో 'రేగాకులు వేసి వేడినీళ్ళతో ఇతనికి స్నానం చేయించండి. అతనిప్పుడు ధరించి ఉన్న దీక్షాదుస్తులలోనే ఇతనికి వస్త్రసంస్కారం చేయండి. ముఖాన్ని కప్పకుండా వదిలేయండి. ప్రళయదినాన ఇతను తల్బియా (హజ్ నినాదం) పఠిస్తూ లేస్తాడు' అన్నారు. (బుఖారి)

**అమరవీరుడు :** బుఖారీలోని ఒక హదీసు ప్రకారం దైవమార్గంలో పోరాడుతూ గాయపడిన యోధుడు ప్రళయదినాన ఆ గాయం నుండి రక్తం కారుతున్న పరిస్థితిలో లేచివస్తాడు. అతని రక్తం నుండి కస్తూరి వాసన వస్తుంది.

**పరిపూర్ణ జ్యోతి:** "నమాజుకై చీకటిలో మసీదుకు వెళ్ళేవారికి శుభవార్త చెప్పండి. ప్రళయదినాన వారికి పరిపూర్ణ జ్యోతి ఇవ్వబడుతుంది" అన్నారు దైవప్రవక్త (స) (తిర్మిజి)

**అజాన్ చెప్పేవారు :** "ఎవరు అజాన్ చెబుతుంటారో ప్రళయదినాన వారి మెడలు అందరి మెడలకన్నా పొడుగ్గా ఉంటాయి" అన్నారు దైవప్రవక్త (స) (ముస్లిం)

**దైవప్రసన్నత కోసం ప్రేమించుకునేవారు :** దేవుని వాక్కును దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "నా ప్రాభవం, ఔన్నత్యాల కారణంగా పరస్పరం ప్రేమించుకునే వారి కోసం జ్యోతిర్మయ ఆసనాలు ఉంటాయి. ప్రవక్తలు, అమరగతులు వారిని చూసి అసూయపడతారు." (మిష్కాత్)

**దైవసింహాసనం నీడన ఉండేవారు :** దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ప్రళయదినాన దేవుడు తన నీడ తప్ప ఎవరి నీడా ఉండని పరిస్థితిలో ఏడు విధాల వ్యక్తులకు తన సింహాసనం నీడ ప్రసాదిస్తాడు. ఆ ఏడుగురు-

(1) న్యాయశీలి అయిన ముస్లిం రాజు.

(2) యౌవనకాలమంతా దైవారాధనలో గడిపిన యువకుడు.

(3) మసీదు నుండి వెళ్ళిపోయినా తిరిగి మసీదుకు వచ్చేవరకు మసీదులోనే మనసు ఉంచే భక్తుడు.

(4) కేవలం దైవప్రసన్నత కోసం పరస్పరం ప్రేమించుకునే ఇద్దరు వ్యక్తులు. ప్రేమాభిమానాల వల్లనే వారిద్దరు కలుసుకుంటారు. మనసులో ప్రేమాభిమానాలు ఉంచుకునే వారు విడిపోతారు.

(5) ఏకాంతంలో దైవాన్ని జ్ఞాపకం చేసుకొని కంట తడిపెట్టినవాడు.

(6) హోదాఅంతస్తులు గల సౌందర్యవతి అశ్లీల చేష్ట కోసం పిలిచినప్పుడు 'నేను దేవునికి భయపడుతున్నాన'ని చెప్పి వెళ్ళిపోయే పురుషుడు.

(7) కుడిచేయి చేసిన సహాయం ఎడమ చేయికి సైతం తెలియనంత రహస్యంగా దానం చేసినవాడు. (బుఖారి, ముస్లిం)

**జ్యోతిర్మయ కిరీటాలు ధరించేవారు :** దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: "ఖుర్‌ఆన్ పఠించి దానిప్రకారం ఆచరించినవాని తల్లిదండ్రులకు ప్రళయదినాన జ్యోతిర్మయ కిరీటాలు ధరింపజేయడం జరుగుతుంది. ఆ కిరీటం తేజస్సు ముందు ఇహలోకంలోని మీ ఇండ్లలో కన్పించే సూర్యతేజస్సు కూడా వెలవెలపోతుంది. తల్లిదండ్రుల పరిస్థితే ఇలాఉంటే ఇక ఖుర్‌ఆన్ పఠించి ఆచరించిన మనిషికి ఎంతటి గౌరవాదరణలు లభిస్తాయో మీరే ఊహించండి." (అహ్మద్, అబూదావూద్)

**ధర్మ సంపాదనాపరుడు :** "ఇతరుల ముందు చేయిజాపకుండా ఉండే, భార్యా పిల్లల్ని పోషించే, పొరుగువారిని కనికరించే ఉద్దేశ్యంతో ధర్మసమ్మతంగా ధనార్జన చేసిన వ్యక్తి ప్రళయదినాన దేవుణ్ణి కలుసుకోవడానికి వెళ్ళేటప్పుడు అతని ముఖం పున్నమిచంద్రునిలా వెలిగిపోతుంటుంది. దీనికి భిన్నంగా ధర్మసమ్మతంగా ధనార్జన చేసినప్పటికీ ఇతరులకంటే ఎక్కువ కూడబెట్టే, ఇతరులకంటే తాను ధనికుడ్ననిపించుకునే,తనకంటే తక్కువ స్థితిపరుల్ని చూసి మిడిసిపడే ఉద్దేశ్యం కలవాడైతే ప్రళయదినాన అలాంటి వ్యక్తిని దేవుడు ఆగ్రహిస్తాడు" అన్నారు దైవప్రవక్త (సల్లం) (మిష్కాత్)

హిందూమత గ్రంథం మనులో ఇలా ఉంది:

"పాపాత్ములు తాము చేస్తున్న పాపాల్ని ఎవరూ చూడటం లేదని అనుకుంటారు. కాని ఆ పాపాల్ని దేవతలు చూస్తున్నారు. అదీగాక ఆ పాపాలు వారి అంతరాత్మలకు కూడ తెలిసి ఉంటాయి." (మను:అధ్యాయం-8, శ్లోకం-84)

## న్యాయ విచారణ-32

యావత్తు సృష్టిరాసుల్లో మహోత్కృష్ట జీవులుగా సృజించబడిన మానవులు పెద్దవారైన తర్వాత రెండు వర్గాలుగా విడిపోతున్నారు. ఒక వర్గం సత్యాన్ని నిరాకరించి, నీతిరాహిత్యమనే చీకటికూపంలో పడిపోతుంది. మరోవర్గం సత్యాన్ని స్వీకరించి తదనుగుణంగా సాత్వికజీవితం గడుపుతూ పుట్టుకతో వచ్చిన ఉత్కృష్టతను సార్థకం చేస్తోంది.

మొదటి వర్గానికి చెందిన వ్యక్తి వందలాది మంది అమాయకుల్ని హతమార్చి, వేలాది ఇండ్లను దోచుకున్న పరమ దుర్మార్గుడయి ఉంటాడు. రెండో వర్గానికి చెందిన వ్యక్తి వందలాదిమంది జీవితాలను బాగుపరచి వేలాదికుటుంబాల కష్టాలను కడతేర్చిన సజ్జనుడయి ఉంటాడు. వీరిద్దరినీ దేవుడు ఒకే దృష్టితో చూస్తాడా? ఆ దుర్మార్గుడికి అతని దుష్కార్యాలకు తగిన శిక్ష, ఆ సజ్జనుడికి అతని సత్కార్యాలకు తగిన ప్రతిఫలం లభించాలని; క్షుణ్ణంగా విచారణ జరిపించి పూర్తి న్యాయం చేకూర్చాలని మానవ అంతరంగం కోరదా? ఈ యదార్థం అంగీకరించిన మానవుడు పరలోకంలో కర్మలవిచారణ జరుగుతుందన్న దైవవచనాన్ని ఎలా నిరాకరించగలడు అని ఖుర్‌ఆన్ ప్రశ్నిస్తోంది.



"కనుక (మానవుడా!) నీవు పరలోక విచారణ గురించిన సత్యాన్ని ఎలా నిరాకరిస్తావు? దేవుడు అందరికంటే గొప్ప (న్యాయా)అధికారి కాదా?" (95:7,8)

ఒక సజ్జనుడు చేసిన అనేక సత్కార్యాలకు తగిన పారితోషికం లభించడం ఇహలోకంలో సాధ్యంకాదు. అలాగే ఒక దుర్మార్గుడు చేసిన అనేక నేరాలకు తగినశిక్ష విధించిన తరువాత దాన్ని అమలుపరచడం కూడా ఇహలోకంలో సాధ్యంకాదు. "దక్షిణాఫ్రికాకు చెందిన మౌజెస్ సిట్‌హోల్ అనే నేరగాడు 38 హత్యలు, 40 మానభంగాలు, 6 దోపిడీలు చేశాడు. 1997లో న్యాయస్థానం అతనికి 2,410 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది". (ఈనాడు దినపత్రిక: 17-10-1999).

ఇంతటి సుదీర్ఘకాలిక శిక్షను అమలుపరచడం ఇహలోకంలో అసంభవమని తెలుస్తూనే ఉంది. అది పరలోకంలోనే సాధ్యమవుతుంది. దీన్నిబట్టి మానవుని జీవితం మరణంతో పూర్తిగా సమాప్తం కాదని, అతని కర్మలకు తగిన శిక్ష లేక ప్రతిఫలం అనుభవించడానికి మరణానంతరం శాశ్వతమైన మరోజీవితం ఉంటుందని, ఉండాలని మానవ అంతరంగం సహజంగానే ఘోషిస్తుంది.

"మానవులంతా తమను తాము కాపాడుకునే ప్రయత్నంలో మునిగివుండే దినాన ప్రతి మనిషికీ అతను చేసుకున్న కర్మలకు పూర్తి ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు." (ఖుర్‌ఆన్-18:111)

"ఆరోజు ప్రతి మనిషికీ అతను చేసుకున్న కర్మలకు ప్రతిఫలం లభిస్తుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు. లెక్క చూడటానికి దేవునికి ఎంతోసేపు పట్టదు."

"ప్రవక్తా! అతి సమీపానికి వచ్చివున్న (ప్రళయ)దినం గురించి ప్రజల్ని భయపెట్టు. ఆరోజు గుండెలు గొంతులలోకి వస్తాయి. ప్రజలు పుట్టెడు దుఃఖాన్ని బలవంతంగా దిగమింగుతూ నోరుమూసుకొని నిల్చుంటారు. దుర్మార్గులకు ఏ ఆప్త మిత్రుడూ లభించడు. వారికనుకూలంగా సిఫారసు చేసేవారు కూడా ఎవరూ ఉండరు. వారి సిఫారసు అంగీకరించబడదు. దేవునికి (మానవుల)దొంగచూపులు, (వారి)హృదయాల్లో దాగిన రహస్యాలు సైతం తెలుసు. దేవుడు పూర్తి న్యాయంగా, నిష్పక్షపాతంగా తీర్పుచేస్తాడు. వారు దేవుణ్ణి వదలి ప్రార్థిస్తున్న మిథ్యాదైవాలు ఏ విషయంలోనూ తీర్పు చేయలేవు. నిస్సందేహంగా దేవుడు (సర్వం) వినేవాడు, చూసేవాడు." (ఖుర్‌ఆన్-40:17-20)

"మేము ప్రతి మానవుడి జాతకాన్ని అతని మెడలోనే వ్రేలాడదీశాం. ప్రళయదినాన ఒక చిట్టా తీసి అతని ముందు పెడ్తాము. అతను దాన్ని తెరచిన పుస్తకంలా చూస్తాడు- 'ఇదిగో చదువుకో నీకర్మల చిట్టా. ఈరోజు నీ కర్మలలెక్క చూడటానికి నీవే చాలు.' ఏ మనిషి సన్మార్గం అవలంబిస్తాడో ఆ సన్మార్గం అతనికే లాభదాయకమవుతుంది. అలాగే

ఎవడు మార్గభ్రష్టుడైపోతాడో ఆ మార్గభ్రష్టత్వం అతనికే చేటు తెచ్చిపెడ్తుంది. (పాప)భారం మోసేవాడెవడూ ఇతరుల (పాప)భారం మోయలేడు." (ఖుర్ఆన్-17:13-15)

"కర్మపత్రాలు తీసి ముందుంచబడతాయి. అప్పుడు నీవు పాపాత్ముల పరిస్థితి ఎలా ఉంటుందో చూస్తావు. వారా పత్రాల్లోని కర్మలు చూసుకొని భయపడుతుంటారు. (చేసిన అకృత్యాలకు ఎంతో బాధపడిపోతూ) 'అయ్యయ్యో, ఎంతటి దౌర్భాగ్యం దాపురించింది! ఈ కర్మలచిట్టా ఏమిటోగాని, మేము చేసిన చిన్నాపెద్దా కర్మల్లో ఒక్కటి కూడా ఇందులో రాయకుండా వదలిపెట్టలేదే!!' అనంటారు. వారు తమ కర్మలన్నిటినీ కళ్ళారా చూసుకుంటారు. నీప్రభువు ఎవరికీ ఎలాంటి అన్యాయం చేయడు." (ఖుర్ఆన్-18:49)

"ఆ తర్వాత కుడిచేతికి కర్మపత్రం ఇవ్వబడిన వ్యక్తి నుండి తేలికగా లేక్క తీసుకోబడుతుంది. అతను సంతోషంతో పొంగిపోతూ తనవారి దగ్గరకు వెళ్తాడు." (84:7-9)

"అప్పుడు కుడిచేతికి కర్మల పత్రం ఇవ్వబడిన మనిషి (ఎంతో సంబరపడుతూ తన బంధుమిత్రుల్ని కలుసుకొని) 'ఇదిగో నా కర్మపత్రం, చదవండి కాస్త. నాలెక్క నాకు తప్పకుండా లభిస్తుందని భావిస్తుండేవాణ్ణి' అనంటాడు." (ఖుర్ఆన్-69:19,20)

"ఇక ఎడమచేతికి కర్మపత్రం ఇవ్వబడినవాడు (తీవ్రంగా పశ్చాత్తాపపడుతూ) ఇలా అంటాడు: 'అయ్యయ్యో! నా కర్మపత్రం నాకసలు లభించకుండా, నా లెక్కేమిటో నాకు తెలియకుండావుంటే ఎంత బాగుండేది! నాకొచ్చిన (తొలి) చావే నన్ను పూర్తిగా తుద ముట్టించివుంటే బాగుండేది!!" (ఖుర్ఆన్-69:25-27)

"వీపువెనుక నుంచి (ఎడమచేతికి) కర్మపత్రం ఇవ్వబడినవాడు... అతను చావును పిలుస్తాడు. చివరికి భగభగమండే (నరకా)అగ్నిలోకి పోయిపడతాడు. అతను (ప్రపంచంలో ఉన్నప్పుడు) తన భార్యాపిల్లల దగ్గర హాయిగా, మస్తుగా ఉండేవాడు. అతను (తన ప్రభువు సన్నిధికి) తిరిగి రావడం జరగదని భావించాడు." (ఖుర్ఆన్-84:10-13)

"మేము ప్రతి మానవవర్గాన్ని దాని నాయకుడితో పాటు పిలిచే రోజొకటి వస్తుంది. ఆరోజు కుడిచేతికి కర్మలపత్రం ఇవ్వబడినవారు అందులో తాము చేసిన ఘనకార్యాలేమిటో చూసుకుంటారు. వారికక్కడ అణుమాత్రం కూడా అన్యాయం జరగదు. ఇక ఇహలోకంలో అంధుడయి జీవితం గడిపినవాడు పరలోకంలో కూడా అంధుడుగానే ఉంటాడు. సన్మార్గం పొందడంలో అతను అంధుడికన్నా ఘోరంగా విఫలమయ్యాడు." (ఖుర్ఆన్-17:71,72)

"సత్యాన్ని విశ్వసించినవారు, యూదులైనవారు, సాబియీలు (బాప్టిస్టులు), క్రైస్తవులు, అగ్నిపూజారులు, బహుదైవారాధకులు- వీరందరి గురించి దేవుడు ప్రళయదినాన తీర్పు చేస్తాడు. ప్రతి వస్తువూ, ప్రతి విషయమూ దేవుని దృష్టి పథంలో ఉంది." (ఖుర్ఆన్-22:17)

"దేవుడు వారిని పిలిచి "మేము పంపిన ప్రవక్తలకు మీరేం సమాధానమిచ్చారు?" అని అడుగుతాడు. అప్పుడు వారికి ఏం సమాధానమివ్వాలో తోచదు. వారు ఒకర్నొకరు



సంప్రదించుకోలేరు కూడా. అయితే చేసిన తప్పులకు ఈరోజు పశ్చాత్తాపం చెందుతూ, సత్యాన్ని విశ్వసించి (జీవితాంతం) సత్కార్యాలు ఆచరించేవారు మాత్రం రేపక్కడ మోక్షం పొందేవారిలో ఉంటారు." (దివ్య ఖుర్ఆన్-28:65-67)

"దేవుడు ప్రవక్తలందరినీ సమావేశపరిచే రోజు గురించి ఆలోచించు. అప్పుడు దేవుడు (ప్రజలు) మీకు ఏం సమాధానమిచ్చారని అడుగుతాడు. దానికి వారు 'మాకేమీ తెలియదు. అగోచర విషయాలన్నీ మీకే తెలుసు' అంటారు." (ఖుర్ఆన్-5:109)

"(పాప)భారం మోసేవాడెవడూ ఇతరుల (పాప)భారం మోయలేడు. మానవుడు దేని కోసం కృషిచేస్తాడో అదే అతనికి లభిస్తుంది. ఆ కృషికి త్వరలోనే గుర్తింపు లభిస్తుంది. అతనికి దాని ప్రతిఫలం పూర్తిగా ప్రసాదించబడుతుంది." (ఖుర్ఆన్-53:38-41)

## ధర్మకాటా, కర్మల తూకం-33

సృష్టికర్తకు తన దాసుల కర్మల్ని గురించి పూర్తిగా తెలుసు. ఆయన తలచుకుంటే ఆ పరిజ్ఞానం ప్రకారం ఎలాంటి విచారణ చేయకుండానే దాసులకు ప్రతిఫలం ఇవ్వడం లేక శిక్ష విధించడం చేయగలడు. ఆయనకా అధికారం ఉంది. కాని ఆయన అలా చేయకుండా దాసుల కర్మలను, వారి వాదనలను, సాక్ష్యాలను వారి ముందుకు తీసుకొచ్చి విచారణ జరుపుతాడు. కర్మల తూకం కూడా జరుగుతుంది.

"ప్రళయదినాన మేము కచ్చితంగా తూచే త్రాసు ఏర్పాటుచేస్తాం. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు. ఎవరైనా సరే, ఆవగింజంత కూడా ఏదైనా చేసివుంటే, దాన్ని మేము ముందుకు తెస్తాం. లెక్క చూడటానికి మేమే చాలు. (ఖుర్ఆన్-21:47)

"ఆరోజు (కర్మల త్రాసులో) బరువయినదే సత్యమవుతుంది. ఎవరి త్రాసుపళ్ళెం బరువుగా ఉంటుందో వారికే మోక్షం లభిస్తుంది. మరెవరి త్రాసుపళ్ళెం తేలికగా ఉంటుందో వారు ఘోరంగా నష్టపోతారు." (ఖుర్ఆన్-7:8,9)

కర్మలత్రాసు గురించి శతపథ బ్రాహ్మణంలో ఇలా ఉంది:

"భవిష్యత్ లోకం'లో వారు అతని సత్కర్మల్ని, దుష్కర్మల్ని త్రాసులో ఉంచుతారు. ఈ రెంటిలో ఏవి బరువుగా ఉంటాయో మనిషి వాటి వెంట వెళ్తాడు, ఆ కర్మలు మంచివైనా చెడ్డవైనా. ఎవరైనా ఈ విషయాన్ని ఈ లోకంలో తనను తాను త్రాసులో పెట్టదలిచాడో అతడు భవిష్యత్ లోకంలో లెఖ్కా పత్రం లేకుండా తప్పించుకుంటాడు." (కాండం-11, ప్రపాఠకం-2, బ్రాహ్మణం-7, ఖండిక-33)

మహాప్రవక్త (స) ఇలా చెప్పారు: "ప్రళయదినాన (కర్మల) త్రాసు పెట్టబడుతుంది. ఆ త్రాసులో యావత్తు భూమ్యాకాశాలు పెట్టి తూచినా అవన్నీ అందులో ఇమిడి పోతాయి. దైవదూతలు దాన్నిచూసి 'ఈ త్రాసు ఎవరి కోసం వాడబడుతుంద'ని దేవుణ్ణి అడుగుతారు. దానికి దేవుడు 'నేను నా సృష్టితాలలో ఎవరి (కర్మలతూకం) కోసం ఈ త్రాసు ఏర్పాటుచేస్తానో వారి కోసం ఇది వాడబడుతుంది' అని చెబుతాడు. దైవదూతలు

ఈమాట విని 'దేవా! మీరు పరమపవిత్రులు. మేము మిమ్మల్ని ఏవిధంగా ఆరాధించాలో ఆవిధంగా ఆరాధించలేకపోయాము' అని అంటారు." (తర్గీబ్ వ తర్హీబ్)

మహాప్రవక్త (స) కర్మలతూకం గురించి ఇలా తెలిపారు: "(కర్మలతూకం కోసం) త్రాసు దగ్గర ఒక దైవదూత నియమించబడతాడు. మానవులు ఆ త్రాసు దగ్గరకు తీసుకురాబడుతారు. అలా వచ్చిన ప్రతి మనిషిని దైవదూత త్రాసుపళ్ళాల మధ్య నిలబెడ్తాడు. అతని కర్మలు (మోక్షార్హత పొందేటంత) బరువుగా ఉంటే ఆ దైవదూత సృష్టి రాసులంతా వినేలా బిగ్గరగా ఒక ప్రకటన చేస్తూ 'ఫలానా మానవుడు శాశ్వతంగా సౌభాగ్యుడయ్యాడు. ఇక ఎన్నటికీ అతను దౌర్భాగ్యుడు కాలేడు' అంటాడు. ఒకవేళ అతని కర్మలు (మోక్షార్హత పొందలేనంత) తేలికగా ఉంటే ఆ దైవదూత సృష్టిరాసులంతా వినేలా బిగ్గరగా ప్రకటనచేస్తూ 'ఫలానా మానవుడు శాశ్వతంగా దౌర్భాగ్యుడయ్యాడు. ఇకఎన్నటికీ అతను సౌభాగ్యుడు కాలేడు' అంటాడు." (తర్గీబ్ వ తర్హీబ్)

**ఒక దాసుని కర్మల బరువు :** అంతిమ దైవప్రవక్త (సల్లం) అనేక పాపాలు చేసిన ఒక దాసుని కర్మల తూకం గురించి ఈవిధంగా ప్రవచించారు:

"ప్రళయదినాన దేవుడు నా అనుచర సముదాయం నుంచి ఒక వ్యక్తిని వేరుచేసి యావత్తు సృష్టిరాసుల ఎదుటకు తెస్తాడు. తరువాత అతని ముందు తొంభై తొమ్మిది రిజిష్టర్‌లు తెరచి పెట్టబడతాయి. వాటిలో ప్రతి రిజిష్టర్ కనుచూపు మేరంత పెద్దగా ఉంటుంది. (అందులో పాపాలు మాత్రమే ఉంటాయి.)

అప్పుడు దేవుడు అతడ్ని 'ఈ కర్మలలో దేన్నయినా నీవు నిరాకరిస్తావా? కర్మలు నమోదుచేసేవారు నీకేమయినా అన్యాయం చేశారా?' అని అడుగుతాడు. దానికి దాసుడు లేదని అంటాడు. ఆ తర్వాత దేవుడు 'ఈ దుష్కర్మలకు నీ దగ్గర సమంజసమైన కారణం ఏదైనా ఉందా?' అని మళ్ళీ అడుగుతాడు. దానికి దాసుడు 'ప్రభూ! నా దగ్గర ఎలాంటి కారణం లేదు' అంటాడు.

ఆ తరువాత సృష్టికర్త మాట్లాడుతూ 'మా దగ్గర నీవు చేసుకున్న ఒక సత్కర్మ భద్రంగా ఉంది' అని చెబుతాడు. తరువాత ఒక పత్రం తీసి ముందుంచబడుతుంది. అందులో 'అష్హదు అన్‌ల్లాయిలాహ ఇల్లల్లాహు వఅన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహూ' (అల్లా తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆయన దాసుడు, సందేశహరుడని నేను సాక్ష్యమిస్తున్నాను.) అని ఉంటుంది. దేవుడు అతనితో 'వెళ్ళు, నీయీ కర్మ ఎంత బరువుంటుందో చూసుకో' అంటాడు.

దాసుడు ఈమాట విని '(ఈ కర్మను తూచినా తూయకపోయినా ఒకటే. నాకు వినాశం తప్పదు.) ఇన్ని (పాపాల) రిజిష్టర్ల ముందు దీనికి ఏం విలువ ఉంటుంది?' అని అంటాడు. అయితే సృష్టికర్త (అతనికి ధైర్యం చెబుతూ) 'మామాట నమ్ము. ఈరోజు నీకు ఎలాంటి అన్యాయం జరగదు' అంటాడు. ఆ తరువాత పాపాల రిజిష్టర్లన్నీ త్రాసుకున్న ఒక పళ్ళెంలో, సత్కర్మపత్రం మరొక పళ్ళెంలో పెట్టి తూకం వేయబడతాయి.



ఆ తూకంలో పాపాల రిజిష్టర్లు ఉన్న పళ్ళెం తేలికయి పైకి లేస్తుంది. సత్కర్మపత్రం ఉన్న పళ్ళెం బరువయి క్రిందికి వంగుతుంది."

మహాప్రవక్త (స) ఇక్కడదాకా చెప్పిన తరువాత "(అసలు) విషయం ఏమిటంటే దేవుని పేరు సమక్షంలో మరే వస్తువుకూ ఎలాంటి బరువు(విలువ) ఉండదు" అన్నారు. (తిర్మిజి, ఇబ్నెమాజ)

ఈ హదీసు విని 'నేను ఎన్ని పాపాలు చేసినా ఈ ఒక్క సద్వచనం (కలిమాయె షహాదత్) పఠిస్తే చాలు, గట్టెక్కి పోతాను' అని ఎవరైనా భావిస్తే పప్పులో కాలేసినట్లే. ఆ సద్వచనం దేవునికి, దాసునికి మధ్య ఒప్పందం లాంటిది. ఆ ఒప్పందం స్వీకరించిన తరువాత దాసుడు దానికి జీవితాంతం ఎంతవరకు కట్టుబడి ఉన్నాడు? అతని మానసిక పరిస్థితి ఏమిటీ? ఆలోచనాసరళి ఎలా ఉండింది? అతను ఎలాంటి పరిస్థితుల్లో పాపాలు చేశాడు? వాటి వెనుక బలమైన కారణాలు, ఇతర ప్రేరకాలు ఏమైనా ఉన్నాయా? ఉంటే వాటిని నిరోధించగల శక్తి అతనికి ఏమేరకు ఉండింది? మొదలైన విషయాలు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.

దాసుల మానసిక శక్తి, హృదయ పరిస్థితి పూర్తిగా సృష్టికర్తకు మాత్రమే తెలుసు. దాసుని హృదయం లక్ష ఎకరాల వైశాల్యం కలిగి ఉందనుకుంటే అందులోని ప్రతి అంగుళాన్నీ తరచిచూసే శక్తి, విశ్లేషించి వాస్తవం కనుగొనే సామర్థ్యం సృష్టికర్తకు మాత్రమే ఉంటుంది. అదీగాక హదీసు చివర్లో దైవప్రవక్త (సల్లం) చెప్పిన విషయం కూడా ఎంతో గమనార్హమైనది. సద్వచనానికున్న అసామాన్య విలువను ఎత్తి చూపడమే ఈ హదీసు అంతరార్థంగా గోచరిస్తోంది. అంచేత పనికిమాలిన ఆలోచనలకు పోకుండా ఖుర్‌ఆన్, హదీసుల ఆజ్ఞల ప్రకారం ఆచరించడమే బుద్ధిమంతుల లక్షణం.

**అన్నిటికంటే బరువైన కర్మలు :** ఇక్కడ మరో విషయం కూడా ఎంతో గమనార్హమయినది. మనం పై హదీసులో అన్నిటికంటే దైవనామం ఎంతో బరువైనదని తెలుసుకున్నాం. అయితే అన్నిటికంటే బరువయినది సద్గుణసంపత్తి అని దైవప్రవక్త (సల్లం) మరో హదీసులో తెలియజేశారు:

"ప్రళయదినాన విశ్వాసి త్రాసులో ఉంచబడే కర్మలలో అన్నటికన్నా అతని సద్గుణ సంపత్తే ఎక్కువ బరువుగా ఉంటుంది. దేవుడు అశ్లీల చేష్టలకు పాల్పడేవాళ్ళను అసహ్యించుకుంటాడు." (మిష్కాత్ షరీఫ్)

ఈ హదీసు దీనికి ముందు చెప్పిన హదీసుకు ఏమాత్రం వ్యతిరేకం కాదు. పైగా ఈ రెండిటి మధ్య అవినాభావ సంబంధం ఉందని కూడా చెప్పవచ్చు. నీతిమంతుని హృదయంలోనే దైవనామం శుభ్రంగా, సురక్షితంగా ఉంటుంది. దుర్గుణుడు, దుష్టస్వభావి అయిన మనిషి "అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యదైవం లేడని, ముహమ్మద్ ఆయన ప్రవక్తని నేను సాక్ష్యమిస్తున్నాన"ని ఎన్నిసార్లు పలికినా ప్రయోజనం లేదు. దానికి అతను కట్టుబడి ఉండలేడు. ఈ సద్వచనాన్ని సద్గుణుడు, సాధుస్వభావి

చిత్తశుద్ధితో ఒకసారి పలికితే చాలు, ఇక ఎల్లప్పుడూ దానికి కట్టుబడిఉంటూ సాత్విక జీవితం గడుపుతాడు.

ఇహలోకంలో చేసే ఏ సత్కార్యమైనా సృష్టికర్తను, ఆయన అంతిమప్రవక్త ముహమ్మద్ (స)ను మనస్ఫూర్తిగా నమ్మిన విశ్వాసికే పరలోకంలో ప్రయోజనం చేకూర్చు తుంది. సృష్టికర్తను, ఆయన అంతిమప్రవక్త (స)ను నమ్మని అవిశ్వాసి ఎన్ని సత్కార్యాలు చేసినా అవి పరలోకంలో అతనికి ఏమాత్రం ఉపయోగపడవు. అతని సత్కర్మలన్నీ బూడిదలో పోసిన పన్నీరులా వ్యర్థమవుతాయి. దీన్నే ఖుర్ఆన్ ఇలా పేర్కొన్నది:

"దేవుని పట్ల తిరస్కారవైఖరి అవలంబించినవారి ఆచరణ, పెనుతుఫానుకు త్రుటిలో ఎగిరిపోయే బూడిదకుప్ప లాంటిది. వారు తమ కర్మలకు ఎలాంటి ప్రతిఫలం పొందలేరు. అదే అన్నిటికంటే ఘోరమైన వైఫల్యం." (14:18)

**సదాచరణతో పాటు దైవానుగ్రహం ఉండాలి :** ఒక విశ్వాసి జీవితాంతం ఎన్ని సత్కర్మలు ఆచరించినా, దైవప్రసన్నత కోసం ఎన్ని త్యాగాలు చేసినా దైవానుగ్రహం లేనిదే అతనికి మోక్షం సిద్ధించదు. మనం చేసిన సత్కార్యాలలో ఏమేరకు చిత్తశుద్ధి ఉందో, వాటిలో ఏఏ లోపాలు ఉన్నాయో మనకు తెలియదు. మన సత్కర్మలు నూరుశాతం నిష్కళంకమైనవని భ్రమలో పడివుంటే, రేపు ప్రళయదినాన అవి చెల్లని నాణాలుగా మారవచ్చు; స్వీకారయోగ్యమైనవి కాకపోవచ్చు. అందువల్ల విశ్వాసి ఎల్లప్పుడూ దుష్కార్యాల విషయంలో దైవాగ్రహానికి భయపడుతూ, సత్కార్యాల విషయంలో దైవానుగ్రహాన్ని ఆశిస్తూ జీవితం గడపాలి.

దైవప్రవక్త (సల్లం) ఒకసారి అనుచరులతో ముచ్చటిస్తూ "దేవుని అనుగ్రహం లేనిదే ఏ ఒక్కడూ స్వర్గానికి పోలేడు" అన్నారు. అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! మీరు కూడా దేవుని అనుగ్రహం లేకుండా స్వర్గానికి పోలేరా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ "దేవుడు నన్ను తన అనుగ్రహఛాయలో చోటిస్తే తప్ప నేను కూడా స్వర్గానికి పోలేను" అన్నారు. (బుఖారి, ముస్లిం)

## ముస్లిమేతరుల విచారణ-34

ప్రళయదినాన కర్మవిచారణ సందర్భంగా దైవప్రవక్తల ద్వారా హితబోధ అందజేయ బడిన మానవులను దేవుడు తప్పకుండా నిలదీస్తాడు. మానవులకు హితబోధ చేసే బాధ్యత గురించి దేవుడు తన ప్రవక్తలను కూడా ప్రశ్నిస్తాడు.

"ఏమైనప్పటికీ, మేము ఎవరి దగ్గరకు దైవప్రవక్తల్ని పంపామో వారిని తప్పకుండా (వారి కర్మల్ని గురించి) ప్రశ్నిస్తాం. (మా సందేశం అందజేసే బాధ్యతను మీరు ఏ మేరకు నెరవేర్చారు, దానికి ప్రజల నుండి ఎలాంటి ప్రతిస్పందన వచ్చింది? అని) మేము ప్రవక్తల్ని కూడా అడుగుతాం. ఆతర్వాత మేము జరిగినదంతా మా జ్ఞానంతో వారి ముందు పెడ్తాము. (వారి స్థితిగతులు తెలియకపోవడానికి) మేము అదృశ్యమై ఎక్కడికీ పోలేదు." (ఖుర్ఆన్-7:6,7)



"దేవుడు ప్రవక్తలందర్నీ సమావేశపరచే దినం గురించి ఆలోచించు. అప్పుడు దేవుడు '(ప్రజలు) మీకు ఏం సమాధానమిచ్చారు?' అని అడుగుతాడు. దానికి వారు 'మాకేమీ తెలియదు. అగోచర విషయాలన్నీ మీకే తెలుసు' అంటారు."(ఖుర్ఆన్-5:109)

"దేవుడు వారిని పిలిచి "మేము పంపిన ప్రవక్తలకు మీరేం సమాధానమిచ్చారు?" అని అడుగుతాడు. అప్పుడు వారికి ఏం సమాధానమివ్వాలో ఏమీ తోచదు. వారు ఒకర్నొకరు సంప్రదించుకోలేరు కూడా." (ఖుర్ఆన్-28:65,66)

**బహుదైవారాధకులు :** వీరిలో అనేకమంది దైవదూతలను కూడా దేవుళ్ళుగా, దేవతలుగా భావించి ఆరాధిస్తారు. పూర్వం అరేబియాలో బహుదైవారాధకులు దైవదూతలను దేవుని కుమార్తెలుగా భావించి ఆరాధించేవారు. అందువల్ల ప్రళయదినాన సృష్టికర్త దైవదూతల్ని కూడా ఈ ఆరాధన విషయమయి ప్రశ్నిస్తాడు.

"ఆయన మానవులందర్నీ సమావేశపరచిన తర్వాత 'వీరు మిమ్మల్ని ఆరాధిస్తుండే వారా?' అని దైవదూతలను ప్రశ్నిస్తాడు. దానికి వారు "మీరు పరమ పవిత్రులు. మాకు మీతోనే సంబంధం ఉంది. వారితో మాకెలాంటి సంబంధం లేదు. వీరసలు మమ్మల్ని కాదు, భూతపిశాచాల్ని పూజిస్తుండేవారు. వారిలో చాలామంది భూతాలనే నమ్మేవారు' అని అంటారు. అప్పుడు మేము 'ఈరోజు మీలో ఏఒక్కడూ ఎవరికీ ఎలాంటి లాభం గాని, నష్టంగాని కలిగించలేడు' అంటాం. మరోవైపు దుర్మార్గులతో 'ఇక మీరు తిరస్కరించిన ఈ నరకశిక్షను చవిచూడండి' అని అంటాం." (ఖుర్ఆన్-34:40-42)

"దేవుడు వారిని పిలిచి మీ ఊహాజనితాలైన నా భాగస్వాములు ఏమయ్యారు?' అని అడిగే రోజు (గురించి గుర్తుంచుకోవాలి). మేము ప్రతి అనుచరసముదాయం నుండి ఒక సాక్షిని తీసి 'మీ (మిధ్యాదైవారాధనకు) ప్రమాణాలేమిటో తీసుకురండి' అని వారిని నిలదీస్తాము. అప్పుడు వారికి తెలిసొస్తుంది సత్యం దేవుని వైపున్నదని. వారి అసత్యాలు, అభూతకల్పనలన్నీ కనుమరుగైపోతాయి." (ఖుర్ఆన్-28:74,75)

"వారందర్నీ మేము ఒకేసారి సమావేశపరచినప్పుడు, దేవునికి సాటికల్పించినవారితో 'ఆగండి మీరూ, దేవునికి మీరు సాటికల్పించిన మీ మిథ్యాదైవాలు' అంటూ వారిని మేము నిలదీస్తాం. తర్వాత వారుభయుల మధ్య ఉన్న అపరిచిత తెరని తొలగిస్తాము. అప్పుడు వారు కల్పించుకున్న మిథ్యాదైవాలు వారితో 'మీరు మమ్మల్ని ఎన్నడూ ఆరాధించలేదు. ఈ విషయంలో మనకు దేవుడే సాక్షి. (ఒకవేళ మీరు మమ్మల్ని ఎప్పుడైనా ఆరాధించివుంటే) మీ ఆరాధన గురించి మాకసలు తెలియనే తెలియదు' అనంటాయి." (ఖుర్ఆన్-10:28-29)

"అప్పుడు ప్రతివాడూ చేజేతులా చేసుకున్న కర్మల పర్యవసానం చవిచూస్తాడు. వారందరినీ వారి అసలు యజమాని దగ్గరికి తీసుకుపోవడం జరుగుతుంది. అక్కడ వారి అబద్ధాలు, అభూతకల్పనలన్నీ పటాపంచలైపోతాయి." (ఖుర్ఆన్-10:30)

"మేము మానవులందర్నీ సమావేశపరచినప్పుడు బహుదైవారాధకులతో 'మీరు స్వయంగా కల్పించుకొని దేవుళ్ళుగా నమ్ముకున్నవారంతా ఇప్పుడు ఎటుపోయార'ని

అడుగుతాం. అప్పుడు వారు తమను రక్షించుకోవడానికి 'దైవసాక్షి! మేము ఎన్నడూ బహుదైవారాధకులుగా ఉండలేదు' అంటారు (పచ్చి అబద్ధమాడుతూ). అంతకుమించి వారికి మరోసాకు దొరకదు. చూడు, వారు తమపై ఎలాంటి అబద్ధం కల్పించుకుంటారో! అక్కడ వారి కల్పితదైవాలంతా మటుమాయమైపోతాయి." (ఖుర్ఆన్-6:22-24)

"నాదైవత్వంలో భాగస్థులని మీరు భావించిన మిథ్యాదైవాల్ని మొరపెట్టుకోండి' అని వారి ప్రభువు అంటాడు. అప్పుడు వారి పరిస్థితి ఎలా ఉంటుంది? వారా మిథ్యాదైవాల్ని మొరపెట్టుకుంటారు. కాని అవి వారికి సహాయంచేయడానికి రావు." (ఖుర్ఆన్-18:52)

"ఆరోజు దేవుడు బహుదైవారాధకులను, నిజదేవుడ్ని వదలి వారు పూజించిన మిథ్యాదైవాలను ఒక చోట చేర్చుతాడు. అప్పుడాయన మిథ్యాదైవాలను ఉద్దేశించి "నా యీ దాసులను మీరు అపమార్గం పట్టించారా లేక వారంతటవారే దారితప్పారా?" అని అడుగుతాడు. 'దానికి వారిలా అంటారు: '(దేవదేవ! ఎంతమాట!!) మీరు ఎంతో పరిశుద్ధులు. మిమ్మల్ని గాకుండా మరొకర్ని రక్షకుడిగా, పోషకుడిగా చేసుకోమని చెప్పేంతటి వాళ్ళమా మేము? అసలు మీరే వారికి, వారి తాతముత్తాతలకు పుష్కలంగా జీవనసామగ్రి ప్రసాదించారు. చివరికి వారు (మేలుచేసిన) మిమ్మల్నే మరచి సర్వ నాశనమయ్యారు". (ఖుర్ఆన్-25:17,18)

"(కనుక అవిశ్వాసులారా!) ఈవిధంగా (మీ దైవాలు) నేడు మీరంటున్న మాటల్ని (ప్రళయ దినాన) తిరస్కరిస్తారు. ఆ తర్వాత మీకు విధించబడే శిక్షనుండి మీరు ఏమాత్రం తప్పించుకోలేరు. ఎలాంటి సహాయం లభించదు. మీలో దౌర్జన్యానికి (సత్యతిరస్కారానికి) పాల్పడిన ప్రతివాడికీ మేము కఠినాతికఠిన యాతన చవిచూపిస్తాం." (ఖుర్ఆన్-25:19)

"ఆరోజు దేవుడు వారిని పిలిచి "మీ ఊహాజనితాలైన నా భాగస్వాములు ఇప్పుడు ఎటుపోయారు?"అని ప్రశ్నిస్తాడు. (నరకశిక్షకు సంబంధించిన) మాట ఎవరికి వర్తిస్తుందో వారిలా అంటారు: "ప్రభూ! మేము మార్గభ్రష్టులుగా చేసిన వారు వీరే. మేము (మా మనోవాంఛలకు బానిసలై) ఎలా మార్గభ్రష్టులైపోయామో అలాగే వీరిని కూడా మార్గ భ్రష్టులుగా చేశాము. నిజానికి వీరు మమ్మల్ని ఆరాధించలేదు. (వీరు స్వయంగా తమ మనోవాంఛలకు బానిసలయిపోయారు.) కనుక వారి మార్గభ్రష్టతకు మేము బాధ్యులం కామని విన్నవించుకుంటున్నాం." (ఖుర్ఆన్-28:62-63)

"అప్పుడు మేము 'ఇక మీరు కల్పించుకున్న సహవర్తులను (మిథ్యాదైవాలను) పిలుచుకోండి' అంటాము. వారు (తమతమ ఇష్టదేవతలను) పిలుచుకుంటారు. కాని వారికి అవి ఎలాంటి సమాధానం ఇవ్వవు. చివరికి వారు (నరక)యాతనలు చూసు కుంటారు. వారు సన్మార్గం అవలంబించిఉంటే ఎంత బాగుండేది! దేవుడు వారిని పిలిచి 'మేము పంపిన ప్రవక్తలకు మీరేం సమాధానమిచ్చారు?' అని అడుగుతాడు. అప్పుడు వారికి ఏం సమాధానమివ్వాలో ఏమీ తోచదు. వారు ఒకర్నొకరు సంప్రదించుకోలేరు కూడా." (ఖుర్ఆన్-28:64-66)



"బహుదైవారాధకులు (తాము కల్పించుకున్న) మిథ్యాదైవాల్ని చూసినప్పుడు "ప్రభూ! నిన్ను వదలి మేము ప్రార్థించిన మా భాగస్వాములు (మిథ్యాదైవాలు) వీరే" అనంటారు. కాని ఆ మిథ్యాదైవాలు వారి మాటలు ఖండిస్తూ "మీరు అసత్యవాదుల"ని స్పష్టంగా చెప్పేస్తాయి. అప్పుడు వారు దేవుని ముందు పూర్తిగా లొంగిపోతారు. వారి అభూతకల్పన లన్నీ వారి నుండి కనుమరుగైపోతాయి." (ఖుర్ఆన్-16:86,87)

"(ఆరోజు) దారితప్పినవారి ముందు నరకం ఉంచబడుతుంది. అప్పుడా మార్గ భ్రష్టుల్ని (దైవదూతలు) ఇలా అడుగుతారు: 'మీరు నిజదేవుడ్ని వదలి ఆరాధించిన ఆ మిథ్యాదైవాలు ఇప్పుడు ఏమైపోయాయి? అవి మీకేమైనా సహాయం చేస్తున్నాయా? పోని, తమనుతామైనా కాపాడుకో గలుగుతున్నాయా?' ఆ తరువాత (దైవదూతలు) ఆ మిథ్యాదైవాలను, ఈ భ్రష్టుల్ని, షైతాన్ అనుచరమూకను అందర్నీ ఒకరిమీద ఒకర్ని పడవేసి నరకంలోకి త్రోసివేస్తారు." (ఖుర్ఆన్-26:92-95)

**ప్రవక్త తండ్రి పర్యవసానం :** దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) తండ్రి ఆజర్ దైవధర్మాన్ని నిరాకరించి అవిశ్వాసి అయిపోయాడు. పరోకంలో హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) హషర్ మైదానంలో ఆజర్‌ని కలుసుకుంటారు. అప్పుడు ఆజర్ తీవ్రంగా పశ్చాత్తాపం చెందుతూ ఆందోళన పడుతుంటాడు. అతని ముఖం దుమ్ము కొట్టుకొని నల్లగా ఉంటుంది. హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) అతనితో "నాకు అవిధేయత చూపవద్దని నేను ముందే చెప్పలేదూ?" అని అంటారు. దానికి ఆజర్ "ఇప్పుడు నేను మీకు అవిధేయత చూపను" అంటాడు.

అప్పుడు హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) విశ్వప్రభుని ప్రార్థిస్తూ "ప్రభూ! ప్రళయదినాన నన్ను అవమానానికి గురిచేయరని మీరు నాకు వాగ్దానం చేసివున్నారు. నా తండ్రి హతమయిపోతున్నాడు. ఇంతకంటే అవమానం నాకింకేముంది?" అని అంటారు. దానికి విశ్వప్రభువు సమాధానమిస్తూ "నేను అవిశ్వాసులకు స్వర్గం నిషేధించాను. (ఇక నీ తండ్రి నరక శిక్ష నుండి తప్పించుకో లేడు" అని చెబుతాడు. ఆ తరువాత ఆయన "నీ కాళ్ళ మధ్య ఏముందో కాస్త చూడు" అంటాడు. హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) తన కాళ్ళ వైపు చూస్తారు. కాళ్ళ మధ్య ఆయనకు ఓ పెద్ద తేలు కన్పిస్తుంది. తరువాత దాన్ని ఎత్తి నరకంలో పడవేయడం జరుగుతుంది. (బుఖారి)

**గ్రంథప్రజల పరిస్థితి :** క్రైస్తవులు, యూదుల్ని గురించి కూడా తీర్పు జరుగుతుంది. క్రైస్తవుల స్వయంకల్పిత విశ్వాసాల విషయంలో దేవుడు హజ్రత్ ఈసా (అలైహి)ను కూడా ప్రశ్నిస్తాడు. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

"ఆ తరువాత దేవుడు (ప్రళయ దినాన) ఈసాను నిలబెట్టి 'మర్యం కుమారుడ వయిన ఈసా! నన్ను కాదని నిన్ను, నీ తల్లిని దేవుళ్ళుగా చేసుకొని ఆరాధించాలని నీవు ప్రజలకు బోధించావా?' అని అడుగుతాడు. దానికి ఈసా ఇలా అంటాడు: 'మీరెంతో పవిత్రులు, పరిశుద్ధులు. నాకు అధికారంలేని విషయం గురించి నేనెలా అనగలను?

నేనలాంటి మాటేదైనా అని ఉంటే అది తప్పకుండా మీ దృష్టికి వచ్చేది. నా అంతరంగంలో ఏముందో మీకు బాగా తెలుసు. కాని మీ అంతరంగంలో ఏముందో నాకే మాత్రం తెలియదు. మీరు సమస్త అగోచర విషయాలు ఎరిగినవారు." (ఖుర్ఆన్-5:116-117)

"మీరు ఆదేశించిన విషయాలే నేను వారికి బోధించాను. నా ప్రభువు, మీ ప్రభువు కూడా అయిన దేవుడ్ని మాత్రమే ఆరాధించండని నేను వారికి చెప్పాను. వారి మధ్య జీవించి ఉన్నంతవరకే నేను వారిని కనిపెట్టుకొని ఉన్నాను. మీరు నన్ను పైకెత్తుకున్న తరువాత వారిని మీరే కనిపెట్టుకొని ఉన్నారు. మీరు అందర్నీ, అన్ని విషయాల్ని (అన్ని వేళలా) కనిపెడ్తూ ఉంటారు. ఇప్పుడు మీరు వారిని శిక్షిస్తే వారు మీ దాసులే. ఒకవేళ క్షమిస్తే మీరు ఎంతో శక్తిమంతులు, మహా వివేకవంతులు." (ఖుర్ఆన్-5:118)

## సాధారణ సిఫారసు-35

హజ్రత్ అబూసయీద్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "ప్రళయదినాన నేను యావత్తు ఆదంసంతానానికి నాయకుడ్ని అవుతాను. దీన్ని గురించి నేను గర్వంగా చెప్పడం లేదు. (వాస్తవం చెబుతున్నాను.) నా చేతిలో స్తుతిపతాకం ఉంటుంది. నేను గర్వంగా చెప్పడం లేదు. (వాస్తవం చెబుతున్నాను.) ఆరోజు మానవులే కాకుండా యావన్మంది దైవప్రవక్తలు నా పతాకం క్రింద ఉంటారు. నేల(సమాధి) నుండి నేను అందరికంటే ముందు బయల్పడతాను." (తిర్మిజి)

ప్రళయదినాన పరిస్థితి చాలా దుర్భరంగా ఉంటుంది. సూర్యుడు వారికి చాలా దగ్గరగా తీసుకురాబడతాడు. దాంతో ఒకవైపు తీక్షణమైన ఎండ, ఉక్కపోతలు, మరోవైపు ఇసుకపోస్తే రాలనంత అత్యధిక జనసంఖ్యాతో సముద్రకెరటాల్లా పరస్పరం కలసిపోతూ మానవులు తీవ్రంగా ఆందోళన చెందుతుంటారు.

మానవులు ఈ పరిస్థితి భరించలేక ఈ ఆపద నుండి విముక్తి కోసం సిఫారసు చేయించుకోవడానికి వివిధ దైవప్రవక్తల దగ్గరకు వెళ్తారు. కాని ఎవరూ దేవుని దగ్గర సిఫారసు చేయడానికి సాహసించలేరు. చివరికి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) దగ్గరకు వెళ్తే ఆయన సిఫారసు చేయడానికి అంగీకరిస్తారు. ఈ విషయాన్ని స్వయంగా మహాప్రవక్త ముహమ్మద్ (స) ఇలా తెలియజేశారు:

"ప్రళయదినాన నేను మానవులందరికీ నాయకత్వం వహిస్తాను. ఆరోజు పరిస్థితి ఎలా ఉంటుందో తెలుసా? ఆరోజు దేవుడు ఆది నుండి అంతం వరకుండిన మానవులనందర్నీ ఒక మైదానంలో సమీకరిస్తాడు. చూసేవాడు అందర్నీ చూస్తాడు. పిలిచేవాడు అందరికీ తన పిలుపు విన్పిస్తాడు. సూర్యుడు మానవులకు చాలా దగ్గరగా వస్తాడు. దానివల్ల మానవులు ఎంతో ఆందోళన పడుతుంటారు. వారి పరిస్థితి చాలా దుర్భరంగా ఉంటుంది.

మానవులు ఈ విపత్కర పరిస్థితి భరించలేక పరస్పరం మాట్లాడుకుంటూ "మనం ఈ ఆపద నుండి బయటపడాలంటే మన ప్రభువు సన్నిధిలో సిఫారసు చేసే వ్యక్తిని



వెతకాలి" అంటారు. వారిలో కొందరు "ఈ పనికి మన పితామహుడు హజ్రత్ ఆదం (అలైహి) తగిన వ్యక్తి. ఆయన దగ్గరికెళ్ళి మనవి చేద్దాం" అంటారు.

**హజ్రత్ ఆదం (అలైహి) పొరపాటు :** ఆతర్వాత మానవులు హజ్రత్ ఆదం (అలైహి) దగ్గరకు వెళ్ళి "ఆదం మహాశయా! మీరు మానవుల పితామహులు. దేవుడు మిమ్మల్ని తన స్వహస్తాలతో సృజించాడు. మీ దేహంలోకి తన ఆత్మను ఊదాడు. దైవదూతల్ని ఆదేశించగానే వారంతా మీకు సాష్టాంగప్రణామం చేశారు. దేవుడు మిమ్మల్ని స్వర్గంలో వసింపజేశాడు. మరి మీరు మీ ప్రభువు దగ్గర మాకోసం సిఫారసు చేయరూ? మేమెలాంటి ఆపదలో పడిఉన్నామో చూస్తున్నారు కదా!" అని అభ్యర్థిస్తారు.

హజ్రత్ ఆదం (అలై) ఈమాట విని ఇలా చెబుతారు: "ఈరోజు నా ప్రభువు ఇంతకు పూర్వం ఎన్నడూ లేనంత ఆగ్రహోదగ్రుడైఉన్నాడు. ఇకముందు కూడా ఇంత రౌద్రంగా ఉండడు. (నావల్ల ఒక పొరపాటు జరిగింది. షైతాన్ నన్ను మభ్యపెట్టాడు.) నాప్రభువు నన్ను ఒకచెట్టు దగ్గరకు పోవద్దని వారిస్తే నేను ఆయన ఆజ్ఞను పాటించలేక పోయాను. (దాన్ని గురించే నేను చాలా విచారిస్తున్నాను.) ఇప్పుడు ప్రతి మనిషీ తనను గురించి తప్ప ఇతరుల్ని గురించి ఆలోచించే పరిస్థితిలో లేడు. మీరు మరొకరి దగ్గరకు వెళ్ళండి. నూహ్ (అలై) దగ్గరకు వెళ్ళండి. ఆయన మీ కోసం సిఫారసు చేయవచ్చు."

**హజ్రత్ నూహ్ (అలైహి) పొరపాటు :** మానవులు అక్కడ్నుంచి కదలి హజ్రత్ నూహ్ (అలైహి) దగ్గరకెళ్ళి ఇలా మనివి చేసుకుంటారు: "(నూహ్ మహాశయా!) మీరు (అవిశ్వాసులకు దైవసందేశం అందజేయడానికి) భూవాసుల దగ్గరకు పంపబడిన మొట్టమొదటి దైవప్రవక్త. దేవుడు మిమ్మల్ని కృతజ్ఞుడైన దాసుడిగా అభివర్ణించాడు. మేమిక్కడ ఎలాంటి ఆపదలో చిక్కుకున్నామో మీరు చూస్తూనే ఉన్నారు. మా పరిస్థితి చాలా దుర్భరంగా ఉంది. మీరు మా కోసం మీ ప్రభువు సన్నిధిలో సిఫారసు చేయరూ?"

హజ్రత్ నూహ్ (అలైహి) వారి సంగతి విని ఇలా అంటారు: "ఈరోజు నా ప్రభువు ఇంతకు పూర్వం ఎన్నడూ లేనంత ఆగ్రహోదగ్రుడయి ఉన్నాడు. ఇకముందు కూడా ఇంత రౌద్రంగా ఉండడు. (నా వల్ల ఒక పొరపాటు జరిగిపోయింది.) నేను నా జాతి ప్రజలను శపించాను. (దాన్ని గురించి దేవుడు నన్ను నిలదీస్తాడేమోనని భయపడుతున్నాను.) ఇప్పుడు ప్రతి మనిషీ తనను గురించి తప్ప ఇతరుల్ని గురించి ఆలోచించే పరిస్థితిలో లేడు. మీరు మరొకరి దగ్గరకు వెళ్ళండి. ఇబ్రాహీం (అలైహి) దగ్గరకు వెళ్ళండి. (ఆయన మీ కోసం సిఫారసు చేయవచ్చు."

**హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) పొరపాటు :** మానవులు అక్కడ్నుంచి కదలి హజ్రత్ ఇబ్రాహీం (అలైహి) దగ్గరకెళ్ళి ఇలా మనివి చేసుకుంటారు: "(మహాశయా!) మీరు దేవుని సందేశహరులు. భూవాసులందరిలో కెల్లా మీరు దేవునికి ప్రియమైనవారు, దేవుని మిత్రులు. అంచేత మీరు మాకోసం మీప్రభువు సన్నిధిలో సిఫారసు చేయండి. మేమిక్కడ ఎలాంటి ఆపదలో చిక్కుబడి ఉన్నామో మీరు చూస్తూనే ఉన్నారు."

హ్రజత్ ఇబ్రాహీం (అలైహి) వారి మాటలు విని ఇలా అంటారు: "ఈరోజు నా ప్రభువు ఇంతకు పూర్వం ఎన్నడూ లేనంత ఆగ్రహోదగ్రుడయి ఉన్నాడు. ఇకముందు కూడా ఇంత రౌద్రంగా ఉండడు. (నా వల్ల ఒక పొరపాటు జరిగిపోయింది.) నేను మూడుసార్లు నిజం చెప్పలేకపోయాను. (దాన్ని గురించి దేవుడు నన్ను నిలదీస్తాడేమోనని భయపడుతున్నాను.) ఇప్పుడు ప్రతి మనిషీ తనను గురించి తప్ప ఇతరుల్ని గురించి ఆలోచించే పరిస్థితిలో లేడు. మీరు మరొకరి దగ్గరకు వెళ్ళండి. మూసా (అలైహి) దగ్గరకు వెళ్ళండి. (ఆయన మీ కోసం సిఫారసు చేయవచ్చు."

**హ్రజత్ మూసా (అలైహి) పొరపాటు :** మానవులు అక్కడ్నుంచి కదలి హ్రజత్ మూసా (అలైహి) దగ్గరకు వెళ్ళి ఇలా మనవి చేసుకుంటారు: "(మహాశయా!) మీరు దేవుని సందేశహరులు. దేవుడు మీకు తన సందేశాల్ని పంపాడు. ఆయన మీతో ముఖాముఖి సంభాషించాడు. ఈ విధంగా దేవుడు మీకు మానవులందరి కన్నా ఎక్కువ ఔన్నత్యం ప్రసాదించాడు. మీరు మాకోసం మీ ప్రభువు సన్నిధిలో సిఫారసు చేయండి. మేమిక్కడ ఎలాంటి ఆపదలో పడి ఉన్నామో మీరు చూస్తున్నారు కదా!"

హ్రజత్ మూసా (అలైహి) వారి మాటలు విని ఇలా అంటారు: "ఈరోజు నా ప్రభువు ఇంతకు పూర్వం ఎన్నడూ లేనంత ఆగ్రహోదగ్రుడయి ఉన్నాడు. ఇకముందు కూడా ఇంత రౌద్రంగా ఉండడు. (నా వల్ల ఒక పొరపాటు జరిగిపోయింది.) నాకు ఎలాంటి ఆజ్ఞ లభించకపోయినా నేనొక వ్యక్తిని హతమార్చాను. (దాన్ని గురించి దేవుడు నన్ను నిలదీస్తాడేమోనని భయపడుతున్నాను.) ఇప్పుడు ప్రతి మనిషీ తనను గురించి తప్ప ఇతరుల్ని గురించి ఆలోచించే పరిస్థితిలో లేడు. మీరు మరొకరి దగ్గరకు వెళ్ళండి. ఈసా (అలైహి) దగ్గరకు వెళ్ళండి. (ఆయన మీ కోసం సిఫారసు చేయవచ్చు."

**హ్రజత్ ఈసా (అలైహి) పొరపాటు :** మానవులు అక్కడ్నుంచి కదలి హ్రజత్ ఈసా (అలైహి) దగ్గరకెళ్ళి ఇలా మనవి చేసుకుంటారు: "ఈసా మహాశయా! మీరు దేవుని సందేశహరులు. ఆయన దివ్యవచనం. ఆయన దాన్ని మర్యం (అలైహి) దగ్గరకు పంపాడు. మీరు దేవుడు పంపిన విశిష్ఠ ఆత్మ. అదీగాక మీరు ఊయలలో ఉన్నప్పుడే ప్రజలతో మాట్లాడారు. మరి మీరు మాకోసం మీప్రభువు సన్నిధిలో సిఫారసు చేయరూ? మేమిక్కడ ఎలాంటి దుస్థితిలో చిక్కుకున్నామో మీరు చూస్తున్నారు కదా!

"హ్రజత్ ఈసా (అలైహి) వారి మాటలు విని ఇలా అంటారు: "ఈరోజు నా ప్రభువు ఇంతకు పూర్వం ఎన్నడూ లేనంత ఆగ్రహోదగ్రుడయి ఉన్నాడు. ఇకముందు కూడా ఇంత రౌద్రంగా ఉండడు. ఇప్పుడు ప్రతి మనిషీ తనను గురించి తప్ప ఇతరుల్ని గురించి ఆలోచించే పరిస్థితిలో లేడు. మీరు మరొకరి దగ్గరకు వెళ్ళండి. ముహమ్మద్ (సల్లం) దగ్గరకు వెళ్ళండి. (ఆయన మీ కోసం సిఫారసు చేయవచ్చు."

అప్పుడు మానవులంతా నా దగ్గరకు వచ్చి ఇలా అంటారు: "ముహమ్మద్ మహనీయా (సల్లం)! మీరు అంతిమ దైవసందేశహరులు. దేవుడు మీ పొరపాట్లన్నీ



మన్నించాడు. కనుక మీరు మాకోసం మీ ప్రభువు సన్నిధిలో సిఫారసు చేయండి. మేమిక్కడ ఎలాంటి ఆపదలో పడి కొట్టుమిట్టాడుతున్నామో మీరు చూస్తూనే ఉన్నారు."

**స్తుతి స్థానం :** అప్పుడు నేను దేవుని సన్నిధికి వెళ్తాను. ఆయన సింహాసనం క్రిందికి చేరుకొని సాష్టాంగపడతాను. (మరొక ఉల్లేఖనంలో "నీప్రభువు నిన్ను స్తుతిస్థానం (మఖామె మహ్మూద్)లో నిలబెడ్తాడు" అనే ఖుర్ఆన్ సూక్తి పఠించి, దేవుడు నాకు వాగ్దానం చేసిన స్తుతిస్థానం ఇదే అంటారు.) ఆ సమయంలో దేవుడు నా హృదయంలో తనను ప్రశంసించేందుకు ఓ ప్రత్యేక స్తోత్రం ఆవిష్కరిస్తాడు. అంతటి శ్రేష్ఠమైన స్తోత్రం ఇంతకు పూర్వం ఎవరి హృదయంలోనూ ఆవిష్కరించలేదు. (నేను సాష్టాంగప్రణామం స్థితిలో ఉండి ఈ స్తోత్రగానం చేస్తాను.)

ఆ తరువాత సృష్టికర్త "ముహమ్మద్! తల పైకెత్తు. నీకేం కావాలో కోరుకో, నీ కోరిక తీరుస్తాను. ఏదైనా సిఫారసు చేయదలచుకుంటే సిఫారసు చెయ్యి. నీ సిఫారసు ఆమోదిస్తా" అనంటాడు. అప్పుడు నేను తలపైకెత్తి "ప్రభూ! నా అనుచర సముదాయం, ప్రభూ! నా అనుచర సముదాయంపై దయజూపు. ప్రభూ! నా అనుచర సముదాయాన్ని కనికరించు" అని ప్రాధేయపడ్తాను.

దానికి విశ్వప్రభువు ఇలా అంటాడు: "సరే, నీ అనుచర సముదాయంలో కర్మ విచారణ లేనివారిని స్వర్గద్వారాలలోని కుడివైపు ద్వారాల గుండా లోపలికి ప్రవేశింపజేయి. ఆ ద్వారాల గుండానే కాకుండా వేరే ద్వారాల గుండా కూడా స్వర్గంలో ప్రవేశింప జేయవచ్చు."

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ విషయం చెబుతూ "నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! ఆ స్వర్గద్వారాలు మక్కా, హజర్‌ల మధ్య ఎంత దూరం ఉందో అంత వెడల్పుగా ఉంటాయి." (బుఖారి, ముస్లిం)

## కౌసర్ సరోవరం-36

హష్ర్ మైదానంలో అనేక సరోవరాలు ఉంటాయి. ఒక్కొక్క సరోవరం ఒక్కొక్క దైవప్రవక్తకు కేటాయించబడుతుంది. ఆయా దైవప్రవక్తలు తమతమ అనుచర సముదాయం ప్రజలకు వాటి నీటిని తాగిస్తారు. అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు కౌసర్ అనే ఓ ప్రత్యేక సరోవరం కేటాయించబడుతుంది. దాన్ని గురించి ఖుర్ఆన్‌లో దేవుడు ఈవిధంగా ప్రస్తావించాడు:

"(ముహమ్మద్!) మేము నీకు కౌసర్ (సరోవరం) ప్రసాదించాము. కనుక నీవు నీ ప్రభువు (ప్రసన్నత) కోసమే ప్రార్థన చెయ్యి; ఆయన కోసమే త్యాగం చెయ్యి. నీ శత్రువే భవిష్యత్తులేని దౌర్భాగ్యుడు." (107:1-3)

దైవప్రవక్త ముహమ్మద్ (స) ఈ సరోవరాలను గురించి ప్రస్తావిస్తూ "ప్రతి దైవ ప్రవక్తకూ ఒక సరోవరం ఉంటుంది. ఎవరి సరోవరం దగ్గరికి తాగేవాళ్ళు ఎక్కువ

మంది వస్తారోనని దైవప్రవక్తలందరూ అనుకుంటారు. అందరి సరోవరాల కన్నా నా సరోవరం దగ్గరికి అత్యధికమంది జనం వస్తారని నేను ఆశిస్తున్నాను" అని అన్నారు.

(దానిక్కారణం ఇతర దైవప్రవక్తల అనుచరులకంటే అంతిమ దైవప్రవక్త (సల్లం) అనుచరులే అత్యధిక సంఖ్యలో ఉంటారు.) (తిర్మిజి)

హ్రజత్ అనస్ (రజి) దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ "మీరు ప్రళయదినాన నా కోసం సిఫారసు చేయండి" అన్నారు. దానికి దైవప్రవక్త (సల్లం) "ఆ... నేను నీకోసం సిఫారసు చేస్తాను" అని చెప్పారు. అప్పుడు హ్రజత్ అనస్ (రజి) "అయితే నేనారోజు మిమ్మల్ని ఎక్కడ వెతకనూ?" అని అడిగారు. "నీవు నన్ను పుల్‌సిరాత్ (వంతెనమార్గం) దగ్గర వెతుకు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

"ఒకవేళ అక్కడ మీరు కన్పించకపోతే?" అని మళ్ళీ ప్రశ్నించారు హ్రజత్ అనస్ (రజి). "కర్మలత్రాసు దగ్గర వెతుకు" అన్నారు దైవప్రవక్త (సల్లం). "అక్కడా కన్పించకపోతే మరెక్కడ వెతకను మిమ్మల్ని?" అని అడిగారు హ్రజత్ అనస్ (రజి). "అక్కడ కన్పించకపోతే (కౌసర్) సరోవరం దగ్గర వెతుకు. ఈ మూడిటిలో ఏదో ఒక చోట నేను నీకు తప్పకుండా కన్పిస్తాను" అని చెప్పారు దైవప్రవక్త (సల్లం) (అయిజా)

**సరోవరం విశిష్టతలు :** మహాప్రవక్త ముహమ్మద్(స) కౌసర్ సరోవరాన్ని గురించి ఇలా తెలియజేశారు: "నా సరోవరం ఎంతో పొడవుగా, వెడల్పుగా ఉంటుంది. ఒక చివరి నుంచి రెండవ చివరికి పోవాలంటే ఒక నెల పడ్తుంది. పొడువు, వెడల్పు సమానంగా ఉంటాయి. అందులోని నీరు పాల కన్నా తెల్లగా ఉంటుంది. దాని పరిమళం కస్తూరీ కన్నా బాగుంటుంది. అక్కడి చెంబులు ఆకాశంలోని నక్షత్రాల్లా అసంఖ్యాకంగా ఉంటాయి. ఎవరైనా అందులోని నీరు ఒకసారి తాగితే ఇక అతనికి దప్పికే ఉండదు." (బుఖారి)

వేరొక హదీసులో దైవప్రవక్త (స) కౌసర్ సరోవరాన్ని గురించి ఈవిధంగా వర్ణించారు: "నా సరోవరం ఎంతో విశాలంగా ఉంటుంది. దాని రెండు చివరల మధ్య దూరం అయిలా, అదన్‌ల మధ్య ఉన్న దూరంకంటే ఎక్కువగా ఉంటుంది. దాని నీరు మంచుకన్నా తెల్లగా, పాలలో కలిపిన తేనెకంటే తియ్యగా ఉంటుంది. అక్కడుండే చెంబులు నక్షత్రాలకన్నా ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. అవి వెండి, బంగారు చెంబులు. ఒంటెల యజమాని తన నీటి తొట్టి దగ్గరకు ఇతరుల ఒంటెలు రాకుండా అడ్డుకునేలా నేను నా సరోవరం దగ్గరకు ఇతరులు రాకుండా అడ్డుకుంటాను."

**ఉజూ ప్రభావం :** ప్రవక్త అనుచరులు ఈ మాట విని "దైవప్రవక్తా! ఆరోజు మీరు మమ్మల్ని గుర్తుపడ్తారా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "తప్పకుండా గుర్తుపడ్తాను. ఎవరికీ లేనటువంటి ఒక గుర్తు మీకుంటుంది. మీరు ఆరోజు నా సరోవరం దగ్గరకు వచ్చినప్పుడు ఉజూ ప్రభావంతో మీ ముఖాలు తేజోవంతంగా, మీ కాళ్ళుచేతులు తెల్లగా ఉంటాయి" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)



మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) కౌసర్ సరోవరంలో నీరు తాగడానికి వచ్చేవారిని గురించి చెబుతూ "నా సరోవరం దగ్గరకు నీళ్ళు తాగడానికి అందరికన్నా ముందు ముహాజిర్ నిరుపేదలు (దైవధర్మం పరిరక్షణ కోసం వలసపోయిన పేదవాళ్ళు) వస్తారు" అన్నారు. ప్రవక్త అనుచరులు ఈమాట విని "వారి పరిస్థితి ఏమిటో కాస్త వివరించండి" అన్నారు. దానికి ఆయన ఇలా వివరించారు:

"వారి శిరోజాలు చెదరిపోయి ఉంటాయి. ముఖాలు వాడిపోయి ఉంటాయి. (ధనికుల) ఇండ్లద్వారాలు వారికోసం తెరవబడవు. మంచి (గోత్రం, అంద చందాలుండే) స్త్రీలు వారి వివాహబంధంలో ఇవ్వబడరు. వారు ఎవరి హక్కయినా నెరవేర్చవలసివుంటే దాన్ని పూర్తిగా నెరవేరుస్తారు. ఎవరి మీదైనా తమ హక్కుంటే దాన్ని పూర్తిగా తీసుకోరు. తమకు రావలసిన హక్కులో కొంత వదలుకుంటారు." (తర్గీబ్ వ తర్హీబ్)

**నీటి నుండి నిరోధించబడేవారు :** మహాప్రవక్త (సల్లం) కౌసర్ సరోవరం దగ్గరకు రాకుండా నిరోధించబడేవారిని గురించి తెలియజేస్తూ ఇలా చెప్పారు:

"ప్రళయదినాన కౌసర్ సరస్సు దగ్గర మీరు నన్ను కలుసుకుంటారు. నా దగ్గరకు వచ్చి (ఈ సరస్సు నీరు) తాగి వెళ్ళే ప్రతి మనిషీ ఇక ఎన్నటికీ దప్పిక గొనడు. అయితే ఆరోజు కొందరు నీరు తాగడానికి నా దగ్గరకు రావడానికి ప్రయత్నిస్తారు. నేను వాళ్ళను గుర్తిస్తాను, వారు నన్ను గుర్తుపడ్తారు. కాని (వాళ్ళను నా దగ్గరకు రాకుండా నిరోధించడం జరుగుతుంది.) వారికి, నాకు మధ్య ఒక అడ్డు ఏర్పడుతుంది.

(మరో ఉల్లేఖనంలో దైవదూతలు వారిని గెంటివేస్తారని ఉంది.) దాంతో వారు ఈ నీరు తాగడానికి నోచుకోలేరు. నేను "వీళ్ళు నావాళ్ళు కదా (ఎందుకు వీళ్ళను నిరోధిస్తున్నారు)?" అని అడుగుతాను. దానికి (దైవదూతల నుండి) "మీ తదనంతరం వీళ్ళు (ధర్మంలో) ఎలాంటి కొత్త కొత్త విషయాలు తీశారో మీకు తెలియదు" అని సమాధానం వస్తుంది. నేనీ మాట విని "దూరంగా ఉండండి. నా తదనంతరం ధర్మం రూపురేఖల్ని మార్చినవారు దూరంగా ఉండండి" అనంటాను. (బుఖారి, ముస్లిం)

## సాక్ష్యం-37

ప్రళయదినాన కర్మవిచారణకై సాక్షులు, ఇతర ఆధారాలన్నీ ముందుకు తీసుకు రాబడతాయి. అక్కడ అబద్ధాలు, అసత్యసాక్ష్యాలకు ఎలాంటి ఆస్కారం ఉండదు. నేరస్థులు ఏవిధంగానూ తప్పించుకోలేరు. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి.

"ఆరోజు మానవునికి అతను ముందుకు పంపుకున్నవీ, వెనుక వదలి వచ్చినవీ అన్నీ తెలియజేయబడతాయి. అతను ఎన్ని సాకులు చూపినా, తనను గురించి స్వయంగా తానే బాగా ఎరగ్గలడు." (75:13-15)

"మేము ఎవరి దగ్గరకు దైవప్రవక్తలను పంపామో వారిని తప్పకుండా (వారి కర్మల్ని గురించి) ప్రశ్నిస్తాము. (మా సందేశం అందజేసే బాధ్యతను మీరు ఏమేరకు నెరవేర్చారు,

దానికి ప్రజల నుండి ఎలాంటి ప్రతిస్పందన వచ్చింది? అని) మేము ప్రవక్తలను కూడా అడుగుతాం. ఆ తర్వాత మేము జరిగినదంతా మా జ్ఞానంతో వారి ముందు పెడ్తాము. (వారి స్థితిగతులు తెలియకపోవడానికి) మేము అదృశ్యమై ఎక్కడికీ పోలేదు." (7:6,7)

"మేము (తీర్పుదినాన) ప్రతి అనుచర సముదాయం నుండి ఒక సాక్షి (ప్రవక్త)ని తెచ్చి నిలబెట్టినప్పుడు అవిశ్వాసులకు (తమ గోడు వెళ్ళబోసుకోవడానికి) ఏమాత్రం అనుమతి లభించదు. క్షమాపణ వేడుకోండని కూడా చెప్పడం జరగదు." (16:84)

"(ప్రవక్తా!) మేము ప్రతి అనుచర సముదాయంలో ఆ సముదాయానికే చెందిన ఒక సాక్షి (ప్రవక్త)ని తెచ్చి నిలబెడ్తాము. అతనా సముదాయానికి ప్రతికూలంగా సాక్ష్య మిస్తాడు. అప్పుడు వీరికి ప్రతికూలంగా సాక్ష్యమివ్వడానికి మేము నిన్ను తీసుకొచ్చి నిల బెడ్తాము. (ఈసాక్ష్యం కోసమే) మేము ప్రతి విషయాన్నీ స్పష్టంగా విశదీకరించే గ్రంథాన్ని నీపై అవతరింపజేశాం. ఈ గ్రంథం (మాకు) విధేయులైన వారికోసం చక్కటి మార్గదర్శినిగా, కారుణ్య ప్రదాయినిగా, శుభవార్త ప్రకటనగా అవతరించింది." (16:89)

"(ముహమ్మద్!) మేము (పరలోకంలో) ప్రతి సమాజం నుండి ఒక సాక్షిని తెచ్చి, ఆ సాక్షులపై నిన్ను సాక్షిగా నిలబెట్టే రోజున వీరి పరిస్థితి ఏమవుతుంది? అప్పుడు దైవ ప్రవక్తను నిరాకరించి, అతనికి అవిధేయులయిన అవిశ్వాసులు (పశ్చాత్తాపంతో కుమిలి పోతూ) "అయ్యయ్యో! భూమి బ్రద్దలయి తామందులో కూరుకుపోతే బాగుండ"ని వాపోతారు. కాని వారు దేవుని దగ్గర ఏ విషయాన్నీ దాచలేరు." (4:41-42)

**శరీరావయవాల సాక్ష్యం:** "దైవవిరోధుల్ని నరకానికి తీసికెళ్లేందుకు వారిని చుట్టు ముట్టి తీసుకొచ్చే రోజు గురించి ఊహించు. అప్పుడు ముందొచ్చినవారిని వెనుక వచ్చిన వారు దగ్గరికొచ్చేదాకా ఆపివేయడం జరుగుతుంది. అలా అందరూ అక్కడికి చేరుకున్న తరువాత వారి కళ్ళు, చెవులు, చర్మాలు వారు ప్రపంచంలో ఉన్నప్పుడు ఏమేమి చేసేవారో సాక్ష్యమిస్తాయి. అప్పుడు వారు తమ చర్మాలను ఉద్దేశించి "మీరు మాకు వ్యతిరేకంగా ఎందుకు సాక్ష్యమిస్తున్నారు?" అని అడుగుతారు. దానికవి ఇలా సమాధానమిస్తాయి:

"ప్రతి వస్తువుకు మాట్లాడే శక్తినిచ్చిన దేవుడే మాకూ మాట్లాడే శక్తినిచ్చాడు. ఆయనే మిమ్మల్ని మొదటిసారి పుట్టించాడు. ఇప్పుడు ఆయన దగ్గరికే మీరు తీసుకురాబడ్డారు. మీరు రహస్యంగా నేరాలు చేస్తున్నప్పుడు, ఎప్పుడో ఓసారి మీ కళ్ళు, చెవులు, చర్మాలు కూడా మీకు వ్యతిరేకంగా సాక్ష్యమిస్తాయన్న ఆలోచనే మీకు కలగలేదు. పైపెచ్చు మీరు చేసే దుష్కార్యాలు అనేకం దేవునికి కూడా తెలియదని మీరు భావిస్తుండేవారు. దేవుడ్ని గురించి మీలో ఏర్పడిన ఈ దుష్టభావనే మిమ్మల్ని (నట్టేట) ముంచింది. ఈ కారణంగానే మీరిప్పుడు నష్టపోయారు". (41:19-23)

"ఈరోజు మేము వీరి నోళ్ళను కట్టివేస్తున్నాం. వీరు ప్రపంచంలో ఏమేమి చేస్తుండే వారో వీరి చేతులు మాకు చెబుతాయి, వీరి కాళ్ళు సాక్ష్యమిస్తాయి". (36:65)



హజ్రత్ అనస్ (రజి) ఉల్లేఖనం: ఒకసారి మేము దైవప్రవక్త (సల్లం) దగ్గర కూర్చొని ఉన్నప్పుడు దైవప్రవక్త (సల్లం) హఠాత్తుగా నవ్వారు. తరువాత "నేనెందుకు నవ్వానో మీకు తెలుసా?" అని ప్రశ్నించారు ఆయన. దానికి మేము "దేవునికి, ఆయన ప్రవక్తకు మాత్రమే తెలుసు" అన్నాం. అప్పుడాయన ఇలా చెప్పారు:

"దేవునికి దాసునికి మధ్య జరిగే ప్రశ్నోత్తరాల విషయం గుర్తుకొచ్చి నేను నవ్వాను. దాసుడు దేవునితో 'మీరు నన్ను అన్యాయం నుండి (కాపాడుతామని వాగ్దానం చేసి) నన్ను తృప్తిపరచలేదా?' అంటాడు. దానికి దేవుడు 'నేనిలా వాగ్దానం చేశాను' అంటాడు. దాసుడు 'నేను నా వ్యవహారంలో ఎవరి సాక్ష్యాన్నీ ఒప్పుకోను. నాలోనే ఏదైనా సాక్ష్యమిస్తే నమ్ముతాను' అనంటాడు. దానికి దేవుడు 'ఈరోజు నీ వ్యవహారంలో నీలోని సాక్ష్యమే చాలు. కర్మలు నమోదు చేసేవారి సాక్ష్యం కూడా సరిపోతుంది' అంటాడు.

ఆ తర్వాత ఆ దాసుని నోటికి సీలు వేయబడుతుంది. అతని శరీరావయవాలకు మాట్లాడమని ఆజ్ఞ అవుతుంది. దాంతో అతని అవయవాలు అతను చేసిన కర్మలను బయటపెడ్తాయి. ఇది చూసిన ఆ దాసుడు 'పొండి నా దగ్గర్నుంచి. నేను మిమ్మల్ని నరకయాతనల నుంచి కాపాడటానికి వాదిస్తుంటే (మీరు నాకే వ్యతిరేకంగా సాక్ష్య మిస్తున్నారా?)' అని అంటాడు." (ముస్లిం)

**పుడమి సాక్ష్యం :** మానవులు ఇహలోకంలో ఉన్నప్పుడు భూమండలంపై వారు ఎక్కడెక్కడ తిరిగారో, ఏమేమి కర్మలు ఆచరించారో ఆ విషయాలన్నీ భూమి ప్రళయ దినాన దేవుని న్యాయస్థానంలో బట్టబయలు చేస్తుంది. ఈ విషయాన్ని గురించి హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ఇలా ఉంది:

దైవప్రవక్త (స) ముందుగా ఈ సూక్తి పఠించారు: "ఆరోజు భూమి తన (మీద జరిగిన) పరిస్థితులు వివరిస్తుంది." (ఖుర్ఆన్-99:4) ఈ సూక్తి పఠించిన తరువాత "భూమి తన పరిస్థితులు వివరించడం అంటే ఏమిటో మీకు తెలుసా?" అని అడిగారు ఆయన తన అనుచరుల్ని. దానికి వారు దేవునికి, ఆయన ప్రవక్త (స)కు మాత్రమే బాగా తెలుసు" అన్నారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఆ విషయం చెబుతూ "భూమి తన పరిస్థితులు వివరించడం అంటే, భూమి తన ఉపరితలంపై స్త్రీలు, పురుషులు చేసిన కర్మలకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇస్తుందన్న మాట. 'నా మీద ఇతను ఫలానా రోజు ఫలానా పని చేశాడ'ని చెబుతుంది" అని తెలియజేశారు." (అహ్మద్, తిర్మిజి)

**మిథ్యాదైవాల సాక్ష్యం :** "దేవుడు వారిని పిలిచి మీ ఊహాజనితాలైన నా భాగ స్వాములు ఏమయ్యారని అడిగే రోజు మేము ప్రతి అనుచర సముదాయం నుండి ఒక సాక్షిని తీసి 'మీ (మిథ్యాదైవారాధనకు) ప్రమాణాలేమిటో తీసుకురండి' అని వారిని నిలదీస్తాము. అప్పుడు వారికి తెలిసొస్తుంది సత్యం దేవుని వైపున్నదని. వారి అసత్యాలు, అభూతకల్పనలన్నీ కనుమరుగైపోతాయి." (ఖుర్ఆన్-28:74,75)

“వారందర్నీ మేము ఒకేసారి సమావేశపరచినప్పుడు, దేవునికి సాటికల్పించినవారితో ‘ఆగండి మీరూ, దేవునికి మీరు సాటికల్పించిన మీ మిథ్యాదైవాలు’ అంటూ వారిని మేము నిలదీస్తాం. తర్వాత వారుభయుల మధ్య ఉన్న అపరిచిత తెరని తొలగిస్తాము. అప్పుడు వారు కల్పించుకున్న మిథ్యాదైవాలు వారితో ‘మీరు మమ్మల్ని ఎన్నడూ ఆరాధించలేదు. ఈ విషయంలో మనకు దేవుడే సాక్షి. (ఒకవేళ మీరు మమ్మల్ని ఎప్పుడైనా ఆరాధించి ఉంటే) మీ ఆరాధనను గురించి మాకసలు తెలియనే తెలియదు’ అని అంటాయి.” (ఖుర్ఆన్-10:28-29)

“ఆరోజు దేవుడు వారిని, నిజదేవుడ్ని వదలి వారు పూజించిన మిథ్యాదైవాలను ఒక చోట చేర్చుతాడు. అప్పుడాయన మిథ్యాదైవాలను ఉద్దేశించి “నా యీ దాసులను మీరు అపమార్గం పట్టించారా లేక వారంతటవారే దారితప్పారా?” అని అడుగుతాడు.

వారిలా అంటారు: ‘(దేవదేవ! ఎంతమాట!!) మీరు ఎంతో పరిశుద్ధులు. మిమ్మల్ని గాకుండా మరొకర్ని రక్షకుడిగా, పోషకుడిగా చేసుకోమని చెప్పేంతటి వాళ్ళమా మేము? అసలు మీరే వారికి, వారి తాతముత్తాతలకు పుష్కలంగా జీవనసామగ్రి ప్రసాదించారు. చివరికి వారు (మేలుచేసిన) మిమ్మల్నే మరచి నాశనమయ్యారు”. (ఖురాన్-25:17,18)

**ఈసాప్రవక్త (అలైహి) సాక్ష్యం :** “ఆ తర్వాత దేవుడు ఈసాను నిలబెట్టి ‘మర్యం కుమారుడవయిన ఈసా! నన్ను కాదని నిన్ను, నీతల్లిని దేవుళ్ళుగా చేసుకొని ఆరాధించాలని నీవు ప్రజలకు బోధించావా?’ అని అడుగుతాడు. దానికి ఈసా ఇలా అంటాడు: ‘మీరెంతో పవిత్రులు, పరిశుద్ధులు. నాకు అధికారంలేని విషయం గురించి నేనెలా అనగలను? నేనలాంటి మాటేదైనా అని వుంటే అది తప్పకుండా మీదృష్టికి వచ్చేది. నా అంతరంగంలో ఏముందో మీకు బాగా తెలుసు. కాని మీ అంతరంగంలో ఏముందో నాకేమాత్రం తెలియదు. మీరు సమస్త అగోచరవిషయాలు ఎరిగినవారు.” (ఖుర్ఆన్- 5:116-117)

“ఆరోజు ప్రతివర్గం (నీల్గుడంతా పోయి నేలచూపులు చూస్తూ) మోకాళ్ళ మీద చతికిలబడి ఉండటం నీకు కన్పిస్తుంది. అప్పుడు ప్రతివర్గాన్నీ తన కర్మలచిట్టా వైపు రమ్మని పిలవడం జరుగుతుంది. తరువాత (దేవుడు) ఇలా అంటాడు: “ఈరోజు మీకు మీరు చేసుకున్న కర్మలకు ప్రతిఫలం లభిస్తుంది. ఇది మేము తయారు చేయించిన కర్మపత్రాలు. మీ గురించి ఇవి ఉన్నవి ఉన్నట్లు సాక్ష్యమిస్తాయి. (ప్రపంచంలో) మీరు చేస్తున్నదంతా మేము (ఎప్పటికప్పుడు) వ్రాయిస్తూ ఉండేవాళ్ళం.” (45:28,29)

**ముహమ్మద్ అనుచరుల సాక్ష్యం :** హజ్రత్ అబూసయీద్ (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా తెలియజేశారు:

“ప్రళయ దినాన నూహ్ ప్రవక్త (అలైహి)ను ప్రవేశపెట్టడం జరుగుతుంది. దేవుడు ఆయన్ని ‘నీవు ధర్మప్రచారం చేశావా?’ అని అడుగుతాడు. దానికి ఆయన ‘ప్రభూ! నేను ధర్మప్రచారం చేశాను’ అని చెబుతారు. ఆ తరువాత దేవుడు ఆయన అనుచర సముదాయాన్ని సంబోధిస్తూ ‘ఈయన మీ దగ్గరకు (నా) ఆజ్ఞలు చేరవేశాడా?’ అని



ప్రశ్నిస్తాడు. దానికి వారు ‘మా దగ్గరకు హెచ్చరించేవాడు (దైవప్రవక్త) ఎవరూ రాలేదు’ అని అంటారు (అబద్ధమాడుతూ).

ఆ తరువాత దేవుడు నూహ్‌ప్రవక్త (అలైహి)ను సంబోధిస్తూ ‘నీ వాదనను సమర్థిస్తూ సాక్ష్యం చెప్పేవారు ఎవరైనా ఉన్నారా?’ అని అడుగుతాడు. దానికి నూహ్ ప్రవక్త (అలైహి) ‘ముహమ్మద్ ప్రవక్త (సల్లం), ఆయన అనుచర సముదాయం ఉన్నారు’ అని సమాధానం ఇస్తారు.

అప్పుడు మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) తన అనుచర సముదాయాన్ని సంబోధిస్తూ ‘ఆ తరువాత మిమ్మల్ని ప్రవేశపెట్టడం జరుగుతుంది. మీరు నూహ్ ప్రవక్తను సమర్థిస్తూ, నూహ్ (అలైహి) తన జాతి ప్రజలకు ధర్మబోధ చేశారని సాక్ష్యం చెబుతారు’ అని అన్నారు. ఆ తర్వాత ఆయన ఖుర్ఆన్‌లోని ఈ సూక్తి పఠించారు:

“మీరు ప్రపంచ ప్రజలకు సాక్షులుగా ఉండాలని, ప్రవక్త మీకు సాక్షిగా ఉండాలని మేము మిమ్మల్ని మధ్యస్థ సమాజంగా చేశాము.” (2:143)

ఇది బుఖారీ షరీఫ్‌లోని ఉల్లేఖనం. ముస్నద్ అహ్మద్‌లోని ఒక ఉల్లేఖనం ప్రకారం “నూహ్ ప్రవక్త (అలైహి) అనుచర సముదాయమే కాకుండా ఇతర ప్రవక్తల అనుచర సముదాయాలు కూడా తమకు ధర్మబోధ చేయడానికి ఎవరూ రాలేదని అబద్ధమాడుతారు. ‘మీరు మీ జాతి ప్రజలకు ధర్మబోధ చేశారా?’ అని ఆ ప్రవక్తలను ప్రశ్నిస్తే వారు చేశామని చెబుతారు. ‘మరి మీ వాదనకు సాక్ష్యం ఉంటే తీసుకురండి’ అని అడిగినప్పుడు అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) అనుచర సముదాయాన్ని ప్రవేశపెట్టడం జరుగుతుంది.

‘ఈ విషయంలో మీరేం అంటార’ని అడిగితే, ‘మేమీ ప్రవక్తల వాదనను సమర్థిస్తున్నాము’ అంటారు వారు. ‘మీకీ సంగతి ఎలా తెలుసని మళ్ళీ అడిగినప్పుడు, ‘మా దగ్గరికి మా ప్రవక్త (సల్లం) వచ్చి దైవప్రవక్తలందరూ తమతమ అనుచర సముదాయాలకు ధర్మబోధ చేశారని తెలియజేశార’ని ముహమ్మద్ (సల్లం) అనుచర సముదాయం చెబుతుంది.”

ముహమ్మద్ (సల్లం) అనుచర సముదాయం ఇచ్చిన ఈ సాక్ష్యంతో ఇతర దైవ ప్రవక్తల అనుచర సముదాయాలలో సత్యాన్ని తిరస్కరించి ప్రజలు నేరస్థులని తేలిపోతుంది. అప్పుడు వారికి నరకశిక్ష విధించబడుతుంది.

## చిత్తశుద్ధిలేని సత్కర్మలు వ్యర్థం-38

దేవుడ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించినవారు ప్రతి పనీ కేవలం దేవుని ప్రసన్నత కోసమే చేయాలి. ఇతరుల మెప్పు పొందడానికి, ప్రజల పొగడ్తలు ఆశించడానికి, కీర్తి ప్రతిష్ఠల కోసం ప్రదర్శనా బుద్ధితో చేసే సత్కర్మలు ప్రళయదినాన వ్యర్థమవుతాయి. అలాంటివారు నరకశిక్షలు అనుభవించవలసి వస్తుంది.

దైవప్రవక్త (స) స్పష్టంగా ఇలా తెలియజేశారు: "తప్పకుండా వచ్చితీరే ప్రళయదినాన దేవుడు మానవులందర్నీ (హషర్ మైదానంలో) సమీకరించిన తరువాత పిలిచేవాడు (దైవదూత) మానవులందర్నీ బిగ్గరగా సంబోధిస్తూ ఇలా అంటాడు- 'ఎవరైనా ఏదైనా పని దేవునికోసం చేస్తూ ఆ పనిలో ప్రదర్శనబుద్ధితో మరొకరిని చేర్చితే అలాంటి మనిషి తన కర్మఫలాన్ని దేవుని నుండి గాక ఇతరుల నుండే పొందాలి." (మిష్కాత్)

మరొక హదీసులో ఆయనిలా అన్నారు: "దేవుడు తన దాసులకు కర్మఫలాలిచ్చే రోజు లోకులమెప్పు కోసం కర్మలు ఆచరించినవారిని ఉద్దేశించి 'ప్రపంచానికి వెళ్ళండి. మీరు ఎవరి మెప్పుకోసం కర్మలు ఆచరించారో వారి దగ్గరికే వెళ్ళండి. వెళ్ళి వారిదగ్గర మీ కర్మలకు ప్రతిఫలం లభిస్తుందో లేదో చూసుకోండి' అనంటాడు." (మిష్కాత్)

**మొట్టమొదటి తీర్పు :** ప్రళయదినాన దైవన్యాయస్థానంలో మొట్టమొదట ప్రదర్శనాబుద్ధితో కర్మలు ఆచరించిన ముగ్గురు ముస్లింలను గురించి తీర్పు జరుగుతుంది. వారు (1) అమరగతుడు (షహీద్), (2) పండితుడు, (3) ధనికుడు. ముస్లిం షరీఫ్‌లో హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించిన ఒక హదీసు ప్రకారం ఈ ముగ్గురి గురించి దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా చెప్పారు:

'ప్రళయదినాన మొట్టమొదట విచారణ కోసం ప్రవేశపెట్టబడేవారిలో ఒకతను అమరగతుడని చెప్పబడేవాడు ఉంటాడు. ఆరోజు దేవుడు అతనికి తాను చేసిన మేళ్ళను గుర్తుచేస్తాడు. ప్రపంచంలో దేవుడు తనకు చేసిన ఆ భాగ్యాలను అతను జ్ఞాపకం చేసుకొని ఒప్పుకుంటాడు. తరువాత దేవుడు అతడ్ని 'నువ్వీ భాగ్యాలను ఏ విధంగా వినియోగించావు?' అని ప్రశ్నిస్తాడు. దానికా వ్యక్తి 'నేను మీ ప్రసన్నత కోసం యుద్ధం చేశాను. చివరికి ఆ మార్గంలో అమరగతుణ్ణయ్యాను' అంటాడు.

దేవుడు ఈ మాట విని 'నువ్వు అబద్ధమాడుతున్నావు. నువ్వు (నా ప్రసన్నత కోసం కాదు.) లోకుల మెప్పు కోసం పోరాడావు. జనం నిన్ను వీరుడు ధీరుడని చెప్పుకుంటారని యుద్ధం చేశావు. నీకా పేరుప్రతిష్ఠలు ప్రపంచంలో లభించాయి' అని అంటాడు. తరువాత 'ఇతడ్ని బోర్లా పడేసి ఈడ్చుకెళ్ళి నరకంలో పడేయండి' అని ఆజ్ఞాపిస్తాడు. అలాగే జరుగుతుంది.

మొట్టమొదట విచారణ కోసం ప్రవేశపెట్టబడేవారిలో మరొకతను పండితుడనబడేవాడు ఉంటాడు. అతను ధర్మజ్ఞానం స్వయంగా నేర్చుకోవడమే గాకుండా ఇతరులకు కూడా నేర్పాడు. ఖుర్ఆన్ కూడా అధ్యయనం చేశాడు. అతడ్ని దైవన్యాయస్థానంలో ప్రవేశపెడ్తారు. దేవుడు అతనికి తాను చేసిన మేళ్ళను గుర్తుచేస్తాడు. ప్రపంచంలో దేవుడు తనకు చేసిన ఆ భాగ్యాలను అతను జ్ఞాపకం చేసుకొని ఒప్పుకుంటాడు.

తరువాత దేవుడు అతడ్ని 'నువ్వీ భాగ్యాలు ఏవిధంగా వినియోగించావు?' అని ప్రశ్నిస్తాడు. దానికతను 'నేను మీప్రసన్నత కోసం ధర్మజ్ఞానం ఆర్జించాను. దాన్ని ఇతరుల క్కూడా నేర్పాను. మీ ప్రసన్నత కోసం ఖుర్ఆన్ చదివాను' అని సమాధానమిస్తాడు.



విశ్వప్రభువు ఈమాట విని 'నువ్వు అబద్ధమాడుతున్నావు. నువ్వు (నా ప్రసన్నత కోసం కాదు,) లోకులమెప్పు కోసం ధర్మజ్ఞానం ఆర్జించావు. జనం నిన్ను గొప్ప పండితుడని పొగడాలని విద్య నేర్చుకున్నావు. నువ్వు కోరుకున్న ఆ కీర్తి ప్రపంచంలో నీకు లభించింది. (ఇక ఇక్కడేమీ లేదు నీకు.)' అని అంటాడు. తర్వాత 'వీడ్ని బోర్లా పడేసి ఈడ్చుకెళ్ళి నరకంలో పడేయండి' అని ఆజ్ఞాపిస్తాడు. అలాగే జరుగుతుంది.

మొట్టమొదట విచారణ కోసం ప్రవేశపెట్టబడేవారిలో వేరొకడు ధనికుడు. దేవుడు అతనికి అపార సిరిసంపదలు ప్రసాదించాడు. అనేకవిధాల సంపదలు అనుగ్రహించాడు. ప్రళయదినాన అతడ్ని ప్రవేశపెట్టడం జరుగుతుంది. దేవుడు అతనికి తాను చేసిన మేళ్ళను గుర్తుచేస్తాడు. ప్రపంచంలో దేవుడు తనకు చేసిన ఆ భాగ్యాలను అతను జ్ఞాపకం చేసుకొని ఒప్పుకుంటాడు.

తరువాత దేవుడు అతడ్ని 'నువ్వీ భాగ్యాలను ఏ విధంగా వినియోగించావ'ని ప్రశ్నిస్తాడు. దానికా ధనికుడు 'నేను మీప్రసన్నత కోసం ప్రతి సత్కార్యంలోనూ నా ధనం వెచ్చించాను. మీకిష్టమైన ఏసత్కార్యాన్నీ డబ్బు ఖర్చుపెట్టకుండా వదల్లేదు.

విశ్వప్రభువు ఈమాట విని 'నువ్వు అబద్ధమాడుతున్నావు. నువ్వు (నా ప్రసన్నత కోసం కాదు,) లోకుల మెప్పు కోసం డబ్బు ఖర్చుపెట్టావు. జనం నిన్ను గొప్ప దానశీలుడని పొగడాలని ఖర్చుపెట్టావు. నువ్వు కోరుకున్న ఆ పేరు ప్రపంచంలో నీకు లభించింది. (ఇక ఇక్కడేమీ లేదు నీకు.)' అని అంటాడు. ఆ తరువాత 'వీడ్ని బోర్లా పడేసి ఈడ్చుకెళ్ళి నరకంలో పడేయండి' అని ఆజ్ఞాపిస్తాడు. అలాగే జరుగుతుంది.

తిర్మిజి గ్రంథంలో కూడా ఈ హదీసు ఉంది. అందులో హజ్రత్ అబూహురైరా (రజి) ఈ హదీసు చెప్పడానికి ప్రయత్నించినప్పుడు ఆయన (పరలోక పరిణామాలను తలచుకొని వణికిపోతూ) స్పృహ తప్పారు. స్పృహ వచ్చిన తరువాత మళ్ళీ ఈ హదీసు చెప్పడానికి ప్రయత్నిస్తే మళ్ళీ స్పృహ తప్పారు. స్పృహ వచ్చిన తరువాత తిరిగి ఈ హదీసు చెప్పడానికి ప్రయత్నిస్తే మూడవసారి కూడా స్పృహ తప్పారు.

ఆ తర్వాత స్పృహ వచ్చాక ఈ హదీసు చెప్పారు. ఈ హదీసు విన్నవారిలో హజ్రత్ ముఆవియా (రజి) కూడా ఉన్నారు. ఆయన ఈ హదీసు విని "ఈ ముగ్గురి సంగతే ఇలా ఉంటే ఇక చిత్తశుద్ధిలేని ఇతరులకు మంచి జరుగుతుందని ఎలా ఆశించగలం!" అని అన్నారు. ఆ తరువాత ఆయన అప్రయత్నంగా రోదించడం మొదలెట్టారు. ఆయన ఏడ్పు చూసేవారు ఇక ఈయన ప్రాణం పోతుందేమోనని భావించారు.

## ముస్లింల విచారణ-39

ప్రళయదినాన ప్రతి మనిషీ తన కర్మలకు తానే బాధ్యుడవుతాడు. ఒకరి కర్మలకు మరొకరు బాధ్యులు కాలేరు. అలాగే మనిషి దేవుడ్ని, ఆయన అంతిమ ప్రవక్త (సల్లం)ను విశ్వసించిన తరువాత అంతిమ దైవవాణి దివ్యఖుర్ఆన్, ప్రవక్త (సల్లం) సంప్రదాయాల (హదీసుల) ప్రకారం పూర్తిగా జీవితాంతం నడచుకున్నవారే మోక్షానికి అర్హులవుతారు.

ఖుర్‌ఆన్, హదీసులకు వ్యతిరేకంగా ఏ ధర్మవేత్త, మతగురువు చెప్పినా వారి మాటలు వినకూడదు. సత్కర్మలు ఆచరించడానికి బద్ధకించేవారు మాత్రమే ఇలాంటి దగ్గరి (short cut) దారులు వెతుక్కుంటారు. కాని వీరు "ఫలానా గురువుగారు చెబితే ఇలా చేశాను; ఫలానాధర్మవేత్త చెబితే చేశాను" అని చెప్పడంవల్ల దేవుని పట్టు నుండి తప్పించుకోలేరు. అక్కడ ఏ మతగురువూ, ధర్మవేత్తా వీరికి సహాయపడలేరు.

మహాప్రవక్త (స) ఇలా తెలిపారు: "మీలో ఎవరూ (కర్మవిచారణ విషయమయి) దేవునితో ప్రత్యక్షంగా మాట్లాడని వారుండరు. దాసునికి, అతని ప్రభువుకు మధ్య ఎలాంటి మాధ్యమంగాని, తెరగాని ఉండదు. అప్పుడు దాసుడు తన కుడివైపు చూస్తాడు. అక్కడ అతనికి తన కర్మలు తప్ప మరేమీ కన్పించదు. అతను తన ఎడమ వైపు చూస్తాడు. అక్కడ ఇంతకు ముందు చేసుకొని పంపుకున్న కర్మలు కన్పిస్తాయి. దాసుడు తన ముందు చూసుకుంటాడు. ఎదురుగా నరకం కన్పిస్తుంది. కనుక మీ దగ్గర ఒక ఖర్జూరపు ముక్క ఉన్నా సరే, దాన్ని (దైవప్రసన్నత కోసం) దానం చేసి నరకం నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి." (బుఖారి, ముస్లిం)

హజ్రత్ ఆయిషా (రజి) కథనం: "ఒక నమాజులో దైవప్రవక్త (స) 'దేవా! నానుండి తేలికగా లెక్క తీసుకో' అని ప్రార్థిస్తుంటే విన్నాను. తరువాత నేను 'దైవప్రవక్తా! తేలికగా లెక్కతీసుకోవడమంటే ఏమిటి?' అని అడిగాను. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ 'తేలికగా లెక్కతీసుకోవడం అంటే, కర్మపత్రాన్ని (క్షుణ్ణంగా పరిశీలించకుండా) చూసీ చూడనట్లు వదిలేయడం అన్నమాట. ఆయిషా! ఎవరి కర్మపత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి లెక్క తీసుకోవబడుతుందో అతనిక సర్వనాశనమైనట్లేనని తెలుసుకో."

కుడిచేతికి కర్మపత్రం ఇవ్వబడిన వ్యక్తి నుండి తేలికగా లెక్క తీసుకోబడుతుందని ఖుర్‌ఆన్‌లో కూడా ఉంది. (84:7-9) వీరు సచ్ఛీలురయిన ముస్లింలు. వీరి కర్మపత్రాన్ని నామమాత్రంగా చూసి వదిలేయడం జరుగుతుంది.

**విశ్వాసిపై దేవుని విశేషానుగ్రహం :** దైవప్రవక్త (స) హితోక్తి: "ప్రళయదినాన దేవుడు విశ్వాసిని తన దగ్గరకు పిలిపించుకొని 'నీవు చేసిన ఫలానాపాపం నీకు గుర్తుందా? ఫలానాపాపం గుర్తుందా?' అని అడుగుతాడు. దానికా విశ్వాసి 'గుర్తుంది ప్రభూ!' అంటాడు. అలా దేవుడు ఆ విశ్వాసి చేసిన పాపాలను అతని చేత ఒప్పిస్తాడు. అప్పుడా విశ్వాసి తానిక సర్వనాశనమైనట్లు భావిస్తాడు. చివరికి దేవుడు అతనితో 'నేను ప్రపంచంలో నీ పాపాలు బహిర్గతంకాకుండా దాచాను. ఇప్పుడు నేను వాటిని క్షమిస్తున్నాను' అని అంటాడు. ఆ తరువాత అతని సత్కర్మల పత్రం అతనికి ప్రసాదిస్తాడు.

అయితే అవిశ్వాసుల, కపటవిశ్వాసుల పాపాలను మాత్రం యావత్తు సృష్టిరాసుల ముందు బహిర్గతం చేస్తూ 'వీరే తమ ప్రభువు విషయంలో అసత్యాలు కల్పించినవారు. తస్మాత్ జాగ్రత్త! దుర్మార్గులపై దేవుని అభిశాపం విరుచుకుపడుతుంది' అని ఎలుగెత్తి చెప్పబడుతుంది." (బుఖారి, ముస్లిం)



**నమాజు గురించిన విచారణ :** దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ప్రళయ దినాన దాసుని కర్మలలో మొట్టమొదట అతని నమాజు గురించి లెక్క జరుగుతుంది. నమాజు గురించిన లెక్క సరిగా ఉందని తేలితే అతను సాఫల్యం చెందుతాడు. నమాజు సరిగా లేదని తేలితే అతను నష్టపోతాడు. అతని ఫరజ్ (విధిగా చేయవలసిన) నమాజులలో ఏదైనా వెలితి ఉంటే 'నాయీ దాసుని చిట్టాలో నఫిల్ (ఐచ్ఛిక) నమాజులు కూడా ఉన్నాయేమో చూడండి' అంటాడు దేవుడు. ఉంటే ఫరజ్‌నమాజుల్లోని వెలితిని ఈ నఫిల్ నమాజులు భర్తీచేస్తాయి. నమాజ్ విషయం తరువాత ఇతర కర్మల విషయంలో కూడా ఇదేవిధంగా లెక్క తీసుకోవడం జరుగుతుంది." (బైహఖీ)

**అసంఖ్యాకంగా స్వర్గానికి పోయేవారు :** దైవప్రవక్త (స) ప్రవచనం: "ప్రళయ దినాన మానవులందరూ ఒకే మైదానంలో సమీకరించబడతారు. అప్పుడు పిలిచేవాడు బిగ్గరగా కేకవేస్తూ 'రాత్రివేళల్లో (నమాజులు చేస్తూ) మేల్కొని ఉండేవారు ఎక్కడున్నారు?' అని అంటాడు. ఈమాట విని వారందరిలో కొంతమంది ముందుకు వస్తారు. వారు ఎలాంటి కర్మవిచారణకు గురికాకుండా స్వర్గంలో ప్రవేశిస్తారు. ఆ తరువాత మిగిలినవారి విషయంలో కర్మవిచారణ ప్రారంభించాలని ఆజ్ఞ అవుతుంది." (మిష్కాత్)

దైవప్రవక్త (సల్లం) మరో సందర్భంలో ఇలా ప్రవచించారు: "నా అనుచర సముదాయంలో డెబ్భయివేల మంది కర్మవిచారణకు గురికాకుండా స్వర్గంలో ప్రవేశిస్తారని నా ప్రభువు నాకు వాగ్దానం చేశాడు. వారిలో ప్రతి వేయిమందితో పాటు మరో డెబ్భయి వేలమంది ఉంటారు. అంతేకాదు, నా ప్రభువు దోసిలితో మూడుదోసిళ్ళ మంది జనం కూడా స్వర్గంలో ప్రవేశిస్తారు." (మిష్కాత్)

**అన్యాయం చేసినవారి పర్యవసానం :** ఏ ముస్లిం అయినా తోటి మానవులపై దౌర్జన్యంచేస్తే, వారికి అన్యాయం తలపెడ్తే, వారి హక్కులు కాజేస్తే అలాంటి ముస్లింకు శిక్షగా అతని పుణ్యాలను పీడితులకు ఇప్పించడం జరుగుతుంది.

"హజ్రత్ అబ్దుల్లా బిన్ అనీస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా తెలియజేశారు: "ప్రళయదినాన దేవుడు తన దాసులను (హషర్ మైదానంలో) సమీకరిస్తాడు. వారప్పుడు నగ్నంగా, వడుగు చేయబడనివారయి, ఉత్త చేతులతో ఉంటారు. ఆ తరువాత సమీపంలో ఉండేవారు ఎలా స్పష్టంగా వింటారో దూరంలో ఉండేవారు కూడా అలాగే స్పష్టంగా వినేలా ఈవిధంగా ఒక వాణి విన్పిస్తుంది-

'నేను విశ్వసార్వభౌముడ్ని. నేను బదులు ఇచ్చేవాడ్ని. ఈరోజు నరకవాసికి చెందిన హక్కు ఏదైనా స్వర్గవాసిపై ఉంటే, స్వర్గవాసి నుండి నరకవాసికి రావలసిన హక్కు ఇప్పించనంత వరకు నరకవాసిని నరకంలో పడవేయడం జరగరదు. అలాగే స్వర్గవాసికి చెందిన హక్కేదైనా నరకవాసిపై ఉంటే, నరకవాసి నుండి స్వర్గవాసికి రావలసిన హక్కు ఇప్పించనంత వరకు స్వర్గవాసిని స్వర్గానికి పంపడం జరగదు. చివరికి ఎవరికైనా రవ్వంత అన్యాయం జరిగినా సరే, నేనతనికి కూడా బదులిప్పిస్తాను.'

ప్రవక్త అనుచరులు ఈమాట విని 'దైవప్రవక్తా! మేమూ రోజు నగ్నంగా, వడుగు చేయబడనివారిగా, ఉత్తచేతులతో ఉంటాం కదా! (బదులివ్వడానికి మా దగ్గర ఏముంటుంది?)' అని అన్నారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ 'పాపపుణ్యాల మార్పిడి ద్వారా బదులు ఇప్పించడం జరుగుతుంది' అని చెప్పారు.'' (అహ్మద్)

దైవప్రవక్త (స) ఒక సారి ఇలా చెప్పారు: "ఎవరైనా తన సోదరుడెవరిపై నయినా దౌర్జన్యం చేస్తే, అతడ్ని అవమానం పాలుజేస్తే, అతని హక్కేమైనా కొల్లగొడితే అలాంటి మనిషి ఎలాంటి సిరిసంపదలు పనికిరాని (ప్రళయం) రోజు రాక ముందే బాధితునికి క్షమాపణ చెప్పుకొని, అతని హక్కేమైనా ఉంటే దాన్ని తిరిగిచ్చివేయాలి. (అలా చేయకపోతే తీర్పురోజున నష్టపోతాడు.) అతను ఏవయినా సత్కర్మలు చేసిఉంటే, వాటిలో నుంచి అతని దౌర్జన్యానికి సమానమైన సత్కర్మలు తీసి బాధితునికి ఇప్పించడం జరుగుతుంది. ఒకవేళ ఆ దౌర్జన్యానికి సరిపడ సత్కర్మలు లేకపోతే బాధితుడు చేసిన దుష్కర్మలు దౌర్జన్యపరుడి ఖాతాలో వేయబడతాయి.'' (బుఖారి)

"ఎవరైనా తన బానిసను అన్యాయంగా ఒక కొరడా దెబ్బ కొట్టినా సరే, అతని నుండి బదులు తీర్చుకోవడం జరుగుతుంది'' అన్నారు దైవప్రవక్త (సల్లం) (తర్గీబ్)

**అందరికన్నా నిష్ట దరిద్రుడు :** ఒకసారి దైవప్రవక్త (సల్లం) తన అనుచరులతో మాట్లాడుతూ "దరిద్రుడంటే ఎవరో మీకు తెలుసా?'' అని అడిగారు. దానికి అనుచరులు "డబ్బు, ఇతర సంపదలు లేనివాడ్ని మేము దరిద్రుడని భావిస్తున్నాం'' అని అన్నారు. ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు:

"నా అనుచర సముదాయంలో ప్రళయదినాన ఒకడు నమాజ్, జకాత్, రోజాలు వగైరా సత్కార్యాలు తీసుకొని వస్తాడు. అయితే అతను ఎవరినైనా దూషించి ఉంటాడు. ఎవరిపైనయినా అపవాదు లేపి ఉంటాడు. ఎవరి ధనాన్నయినా అన్యాయంగా కాజేసి ఉంటాడు. ఎవరినైనా హత్యచేసి ఉంటాడు. ఎవరినైనా అన్యాయంగా కొట్టి ఉంటాడు.

అంచేత అతను ఎవరెవరిని వేధించాడో, ఎవరెవరి హక్కులు కొల్లగొట్టాడో వారందరికీ అతని పుణ్యకర్మలు పంచిస్తారు. అప్పటికీ వారందరి హక్కులు పూర్తిగా నెరవేరక ముందే అతని పుణ్యకర్మలు అంతమయిపోతే, ఆ హక్కుదారులు చేసిన పాపాలు అతని ఖాతాలో వేసి అతడ్ని నరకంలో పడవేయడం జరుగుతుంది.'' (ముస్లిం)

**పేదలు, ధనికులు :** ప్రళయదినాన దేవుడు మానవులందర్నీ సమావేశపరచిన తరువాత "ఈ అనుచర సముదాయానికి చెందిన పేదవాళ్ళు ఎక్కడున్నారు?'' అని అడుగుతాడు. ఆ తరువాత "మీరు ఏం చేశారు?'' అని అడుగుతాడు వారిని. దానికి వారు ఇలా అంటారు: "మీరు అధికారం, సిరిసంపదలు మాకు కాకుండా వేరేవాళ్ళకు ఇచ్చారు. మమ్మల్ని పేదవాళ్ళుగా చేసి పరీక్షించారు. మేము (మీ ప్రసన్నతా భాగ్యం ఆశిస్తూ) సహనం వహించాము.''



దైవప్రవక్త (సల్లం) పైన పేర్కొన్న మాటలు చెప్పి "ఆతర్వాత ఆ పేదలు స్వర్గానికి పంపబడతారు. ధనికుల్ని, అధికారుల్ని మాత్రమే నిలదీసి కఠినంగా లెక్క తీసుకోవడం జరుగుతుంది'' అని అన్నారు. (తర్గీబ్, తబ్రానీ)

## మానవేతరుల విచారణ-40

ప్రళయదినాన మానవుల్ని గురించే గాకుండా యావత్తు జీవరాసుల్ని గురించి తీర్పు జరుగుతుంది. అందరికీ న్యాయం జరుగుతుంది. ప్రపంచంలో జరిగిన దౌర్జన్యాలకు అక్కడ బదులు ఇప్పించడం జరుగుతుంది. ఎవరికీ ఎలాంటి అన్యాయం జరగదు. పశుపక్షాదులకు కూడా న్యాయం జరుగుతుంది.

**జిన్నుల విచారణ :** ఈప్రపంచంలో మానవులకు మాదిరిగానే బుద్ధికౌశల్యం, విజ్ఞతావివేచనలు కల మానవేతర బుద్ధిజీవులు కూడా ఉన్నారు. వారినే మనం జిన్నులు (భూతాలు) అనంటాము. అగ్నితో సృజించబడిన ఈ జిన్నులు మానవులకు కన్పించని ఒక విధమైన అగోచరజీవులు. అయితే వీరిలో కూడా సజ్జనులు-దుర్జనులు, విశ్వాసులు-అవిశ్వాసులు ఉంటారు. వీరు కూడా పరలోక న్యాయస్థానంలో తమ కర్మలకు లెక్క చెప్పుకోవలసి ఉంటుంది. కర్మవిచారణ తరువాత వీరికీ స్వర్గనరకాలు ఉంటాయి.

"దేవుడు వారందరినీ చుట్టుముట్టి సమీకరించే రోజు జిన్నులను ఉద్దేశించి "జిన్నులారా! మీరు మానవజాతి నుండి ఎన్నోలాభాలు పొందారు(కదూ?)" అని అడుగుతాడు. దానికి వారి మానవమిత్రులు "ప్రభూ! మాలో ప్రతిఒక్కడూ ఇతరుల్ని బాగా వాడుకున్నాడు. చివరికి మేము మాకోసం నీవు నిర్ణయించిన సమయానికి చేరుకున్నాం" అని అంటారు. "అప్పుడు దేవుడు "అయితే మీ నివాసం ఇక నరకమే. అందులోనే మీరు శాశ్వతంగా పడిఉంటారు." అని అంటాడు. అయితే దేవుడు కాపాడ దలచినవారు మాత్రం దాన్నుండి తప్పించుకుంటారు. నిస్సందేహంగా నీప్రభువు ఎంతో వివేకవంతుడు, సర్వజ్ఞాని. దుర్మార్గులు (ప్రపంచంలో ఉండగా పరస్పరం కలసి) చేసిన దుష్కర్మల ఫలితంగా ఇలా మేము వారిని (నరకంలో) ఒకరికొకరు స్నేహితులుగా చేస్తాము." (ఖుర్ఆన్-6:128-129)

క్షణభంగురమైన ప్రాపంచిక ప్రయోజనాలను ఆశిస్తూ భూతపిశాచాలను పూజించే వారు రేపు ప్రళయదినాన తీవ్రంగా పశ్చాత్తాప పడతారు. ఆరాధనకు అర్హుడయిన అసలైన దైవం అల్లాహ్ మాత్రమేనని తెలుసుకొని కుమిలి కుమిలి దుఃఖిస్తారు.

**పశుపక్షాదుల విచారణ :** ప్రళయదినాన పశువులు, పక్షులను గురించి కూడా విచారణ జరుగుతుంది. వాటిపై ఏదైనా దౌర్జన్యం జరిగివుంటే దేవుడు వాటికి ప్రతీకారం తీర్చుకునే అధికారం ఇస్తాడు. ఆ తర్వాత వాటి ఉనికిని శాశ్వతంగా అంతమొందిస్తాడు. మానవుల్లా అవి బుద్ధిజీవులు కావు. అంచేత వాటికి కర్మవిచారణ ఉండదు.

మహాప్రవక్త ముహమ్మద్ (స) జంతువులపై జంతువులు చేసే దౌర్జన్యం గురించి ఇలా తెలియజేశారు: "మీరు ప్రళయదినాన హక్కుదారులకు వారి హక్కులు తప్పకుండా

నెరవేరుస్తారు. చివరికి కొమ్ములు లేని మేకకు (కొమ్ములున్న మేక ఏదైనా అన్యాయం చేసివుంటే) కొమ్ములున్న మేక నుండి బదులిప్పించడం జరుగుతుంది. (ముస్లిం)

దుర్రెమన్సూర్‌లో హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖించిన ఒక హదీసులో ఈ విధంగా ఉంది: "ప్రళయం రోజు యావత్తు జీవరాసులను సమీకరించడం జరుగుతుంది. వాటిలో చతుష్పాదాలు, భూచరాలు, పక్షులు కూడా ఉంటాయి. అవేకాకుండా ఇంకా అనేక రకాల జీవరాసులు ఉంటాయి. వాటన్నిటిని గురించి దైవన్యాయస్థానంలో తీర్పులు జరుగుతాయి. ఆ తీర్పుల్లో కొమ్ములున్న జంతువు నుండి కొమ్ముల్లేని జంతువుకు బదులిప్పించే తీర్పు కూడా ఉంటుంది.

పశుపక్షాదులకు సంబంధించిన తీర్పులు ముగిసిన తరువాత 'మీరంతా మట్టయి పొండి' అని ఆజ్ఞ అవుతుంది. దాంతో అవన్నీ మట్టయి పోతాయి. (అంటే వాటి ఉనికే అంతమైపోతుంది.) అప్పుడు అవిశ్వాసి నోట 'అయ్యో! నేను కూడా మట్టయిపోతే బాగుండు!!' అనే మాట (అప్రయత్నంగా) వెలువడుతుంది.

పై ఉల్లేఖనం దుర్రెమన్సూర్‌లో ఈక్రింది సూక్తికి వ్యాఖ్యానంగా పేర్కొనబడింది:

"మేము అతి సమీపంలోనే ఉన్న శిక్ష గురించి మిమ్మల్ని హెచ్చరించాం. మానవుడు తన చేజేతులా చేసుకొని ముందుగా పంపుకున్నదంతా ఆరోజు ప్రత్యక్షంగా చూసుకుంటాడు. అప్పుడు సత్యతిరస్కారి (పశ్చాత్తాపంతో) "అయ్యో! నేను మట్టిలో మట్టయి పోయివుంటే ఎంత బాగుండేది!!" అని వాపోతాడు." (ఖుర్ఆన్-78:40)

దుర్రెమన్సూర్‌లోనే హజ్రత్ ముజాహిద్ (రజి) ఉల్లేఖించిన ఒక హదీసు ఈవిధంగా ఉంది: "కొమ్ములచే పొడవబడిన జంతువుకు కొమ్ములతో పొడిచిన జంతువు నుండి, కాళ్ళతో తన్నబడిన జంతువుకు కాళ్ళతో తన్నిన జంతువు నుండి బదులు ఇప్పించడం జరుగుతుంది. ఇదంతా మానవుల కళ్ళ ముందు జరుగుతుంది. ఆ తరువాత జంతువులతో 'మీరంతా మట్టయి పొండి. మీకు స్వర్గనరకాలు లేవు' అని చెబుతారు.

అప్పుడు అవిశ్వాసి 'అయ్యయ్యో! నేను (కూడా) మట్టయి పోయివుంటే ఎంత బాగుండు!!' అని వాపోతాడు."

జంతువులు, పక్షులు బుద్ధిలేని మూగజీవాలైనందున ప్రళయదినాన వాటి అస్తిత్వం శాశ్వతంగా అంతమయిపోతుంది. కనుక వాటికి స్వర్గనరకాలు ఉండవు. కాని సత్యతిరస్కారులు, కపటవిశ్వాసులు శాశ్వతంగా నరకశిక్షలు అనుభవించవలసి వస్తుంది. దీన్నిబట్టి సత్యాన్ని తిరస్కరించిన మానవులు ప్రళయదినాన జంతువులకన్నా అధోగతి పాలవుతారని తెలుస్తోంది.

## కర్మల పర్యవసానం-41

"ఆ తర్వాత సత్యాన్ని విశ్వసించి సాత్విక జీవితం గడిపినవారిని వారి ప్రభువు తన కారుణ్యఛాయలోకి తీసుకుంటాడు. ఇదే అసలు విజయం (పరమమోక్షం)" (45:30)



"సత్యవ్రతులకు వారి సత్యసంధత ప్రయోజనం చేకూర్చే దినం వస్తుంది. అలాంటి వారికి (ఆరోజు) సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలు లభిస్తాయి. అక్కడ వారు కలకాలం (సుఖంగా) ఉంటారు. దేవుడు వారి పట్ల ప్రసన్నుడవుతాడు, వారు దేవుని పట్ల సంతోషిస్తారు. ఇదే ఘనవిజయం." (ఖుర్ఆన్-5:119)

"సత్కార్యాలు చేసి ఉండటంతోపాటు విశ్వాసికూడా అయిఉండినవాడికి (ఆరోజు) ఎలాంటి నష్టంగాని, అన్యాయంగాని జరుగుతుందన్న భయముండదు." (20:112)

"అప్పుడు కుడిచేతికి కర్మల పత్రం ఇవ్వబడిన మనిషి (ఎంతో సంబరపడుతూ తన బంధుమిత్రుల్ని కలుసుకొని) 'ఇదిగో నా కర్మల పత్రం, చదవండి కాస్త. నేను నా (కర్మఫలం) లెక్క నాకు తప్పకుండా లభిస్తుందని భావిస్తుండేవాణ్ణి' అని అంటాడు. అతనిక కోరిన సుఖసంతోషాలు అనుభవిస్తాడు. మహా అద్భుతమైన స్వర్గవనంలో ఉంటాడు. దాని పండ్లగుత్తులు బరువుతో క్రిందికి వంగిఉంటాయి. 'హాయిగా తినండి, త్రాగండి మీరు గతజీవితంలో చేసుకున్న (సత్కర్మల) సుకృతఫలం అనుభవించండి' (అంటారు దైవదూతలు). (ఖుర్ఆన్-69:19-24)

"ఆరోజు కొందరి ముఖాలు దేదీప్యమానంగా వెలిగిపోతుంటాయి. ఆ ముఖాలలో చిరునవ్వులు, ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తుంటాయి. (వీరు సత్యాన్ని విశ్వసించిన సజ్జనులు.)" (ఖుర్ఆన్-80:39,40)

"ఆరోజు విశ్వాసులు అవిశ్వాసుల్ని చూసి నవ్వుతూ ఉంటారు. ఉన్నతాసనాలపై (హుందాగా) కూర్చొని వారి దుస్థితిని చూస్తుంటారు." (ఖుర్ఆన్-83:34,35)

"ఎవరు తమ ప్రభువు దేవుడేనని పలికి, ఆమాట మీదనే స్థిరంగా ఉంటారో వారి (సహాయం) కోసం దైవదూతలు తప్పకుండా అవతరిస్తారు. అప్పుడు వారికి ఇలా ధైర్యం చెబుతారు: 'భయపడకండి. విచారపడకండి. స్వర్గప్రవేశం గురించి మీకు చేసిన వాగ్దానం గుర్తుచేసుకొని ఆనందించండి. మేము ఇహలోకంలోనూ మీకు తోడుగా ఉన్నాము, ఇప్పుడు పరలోకంలోనూ మీకు తోడుగా ఉంటాము. ఇక్కడ మీరు కోరుకున్న వస్తువు లభిస్తుంది. మీరుకోరిందల్లా మీదే అవుతుంది. గొప్పక్షమాశీలి, అమిత దయామయుడైన దేవుని వైపున లభించనున్న ఆతిథ్యం ఇది." (ఖుర్ఆన్-41:30-32)

"సత్యాన్ని విశ్వసించి విధేయులైపోయిన వారికి ఆరోజు ధైర్యం కలిగిస్తూ దేవుడు ఇలా అంటాడు: 'నా దాసులారా! ఈరోజు మీకెలాంటి భయం లేదు, దుఃఖం కూడా ఉండదు. ఇక మీరు, మీ భార్యాపిల్లలు (తదితర బంధుమిత్రులు) స్వర్గంలో ప్రవేశించండి, మిమ్మల్ని ఆనందింపజేయడం జరుగుతుంది". (ఖుర్ఆన్-43:66-70)

"ప్రతి మనిషీ తాను చేసుకున్న పాపపుణ్యాల (ఫలితాల)ను ప్రత్యక్షంగా తన ముందు చూసుకునే రోజు 'తనకూ, ఈ పాపానికీ మధ్య ఆమడ దూరం ఉంటే బాగుండు!' నని భావిస్తాడు. దేవుడు తనను గురించి మిమ్మల్ని భయపెడ్తున్నాడు. ఆయన తన దాసుల విషయంలో అమిత దయామయుడు." (ఖుర్ఆన్-3:30)

“దేవుడు ఎవరికి సద్బుద్ధి ప్రసాదిస్తాడో అతనే సన్మార్గం పొందగలడు. దేవుడు దారి తప్పించినవారిని దేవుడు తప్ప మరెవరూ ఆదుకోలేరు. అలాంటివారిని మేము ప్రళయదినాన బోర్లాపడేసి ఈడ్చుకొస్తాం. వారు అంధులు, బధిరులు, మూగలు. నరకమే వారి నివాసమవుతుంది. దాని అగ్నిజ్వాలలు మందగించినప్పుడల్లా మేము మళ్ళీ ప్రజ్వరిల్ల జేస్తాం.” (ఖుర్‌ఆన్–17:97)

“(అప్పుడు) దేవుడు ఇలా అంటాడు: ‘వీరు మా సూక్తులు తిరస్కరిస్తూ ఈ దినాన్ని గురించి పట్టించుకోకుండా ఎలా వదిలేశారో మేము కూడా ఈరోజు వీరిని పట్టించుకోకుండా వదిలేస్తున్నాం”. (ఖుర్‌ఆన్–7:51)

“దేవుడ్ని కలుసుకోవలసి ఉంటుందన్న వార్తను అసత్య విషయంగా భావించిన వారు ఘోరంగా నష్టపోతారు. వారా ఘడియ అకస్మాత్తుగా వచ్చినప్పుడు ‘అయ్యయ్యో! ఈ విషయంలో మేమెంత పొరబడ్డాం!!’ అని వాపోతారు. అప్పుడు వారు తమ పాప భారం వీపులపై మోసుకొస్తారు. చూడు, ఎంత నీచమైన భారమో అది!” (6:31)

“వారు చేజేతులా నష్టం కొనితెచ్చుకున్నారు. వారి అభూతకల్పనలన్నీ వారి నుండి కనుమరుగైపోతాయి. (వారు కట్టుకున్న పేకమేడలు కుప్పకూలిపోతాయి).” (7:53)

“అయితే నా హితబోధను పెడచెవినపెట్టి ముఖం తిప్పుకునేవాడు ప్రపంచంలో (మనశ్శాంతికి దూరమై) దుర్భర జీవితం గడుపుతాడు. ప్రళయదినాన మేమతడ్ని అంధుడిగా చేసి లేపుతాము.’ అప్పుడతను ‘ప్రభూ! ప్రపంచంలో నేను కళ్ళున్నవాడినే, ఇక్కడ నన్ను ఎందుకు అంధుడిగా చేసి లేపావు?’ అని అడుగుతాడు. దానికి దేవుడు “నీదగ్గరకి మా సూక్తులు వచ్చినప్పుడు నీవు ఇలాగే (అంధుడై) వాటిని విస్మరించావు. అంచేత ఈరోజు మేము నిన్ను (అంధుడిగా చేసి) విస్మరిస్తున్నాం’ అని సమాధానమిస్తాడు.” (20:124–126)

“ఇక ఎడమచేతికి కర్మల పత్రం ఇవ్వబడినవాడు (తీవ్రంగా పశ్చాత్తాపపడుతూ) ఇలా అంటాడు: ‘అయ్యయ్యో! నా కర్మపత్రం నాకసలు లభించకుండా, నా లెక్కేమిటో నాకు తెలియకుండా ఉంటే ఎంత బాగుండేది! నాకొచ్చిన (తొలి)చావే నన్ను పూర్తిగా తుదముట్టించిఉంటే బాగుండేది!! ఈరోజు నా సిరిసంపదలు నాకేమాత్రం పనికిరాలేదు. నా అధికారం, ఆధిపత్యాలన్నీ మట్టిలో కలిసిపోయాయే!” (ఖుర్‌ఆన్–69:25–29)

“(అప్పుడిలా ఆజ్ఞవుతుంది:) ‘పట్టుకోండి వాడ్ని. వాడి మెడకు గుదిబండ కట్టి నరకంలోకి త్రోసేయండి. ఆ తరువాత డెబ్భయిమూరల గొలుసుతో వాడ్ని బిగించి కట్టండి. మహోన్నతుడయిన దేవుడ్ని వీడసలు నమ్మేవాడు కాదు. అదీగాక పేదవాడికి పట్టెడన్నం కూడా పెట్టేవాడు కాదు. అలాంటి సహాయకార్యాల కోసం ఇతరుల్ని ప్రోత్సహించేవాడు కాదు. అందువల్ల ఈ రోజిక్కడ వీడ్ని పట్టించుకునేవాడే లేడు. చీము, నెత్తురు తప్ప వాడికి తినడానికి మరేమీ లభించదు. పాపాత్ములు మాత్రమే ఇలాంటి (జుగుప్సాకరమైన) తిండి తింటారు.” (ఖుర్‌ఆన్–69:25–38)



“(ప్రాపంచిక మైకపు) తెరలు తొలగి యదార్థం ముందుకువచ్చే రోజు (దేవునికి) సాష్టాంగప్రణామం చేయడానికి మానవులు పిలువబడతారు. అప్పుడు వీరు సాష్టాంగపడ లేరు. వారి చూపులు (సిగ్గుతో) క్రిందికి వాలిపోతాయి. నైచ్యం, అవమానం వారిని చుట్టుముడ్తాయి. (ఇహలోకంలో) నిక్షేపంగా ఉన్నప్పుడు వీరు సాష్టాంగప్రణామం కోసం పిలవబడుతుండేవారు. (కాని అప్పుడు వీరు తిరస్కరిస్తుండేవారు.)” (68:42,43)

“ఒకవేళ దుర్మార్గుల దగ్గర లోకంలోని యావత్తు సిరిసంపదలకు రెట్టింపు సిరి సంపదలుంటే, ప్రళయదినాన పడే పరమనీచమైన ఘోరశిక్ష నుండి బయట పడేందుకు ఆ సంపదనంతటినీ పరిహారం క్రింద ఇవ్వడానికి సిద్ధపడతారు. (అయినా వారా శిక్షనుండి తప్పించుకోలేరు.) అక్కడ దేవుని వైపు నుండి వారి పైకి వారెన్నడూ ఊహించని దారుణం వచ్చి పడుతుంది. వారి కర్మల దుష్ఫలితాలన్నీ వారి ముందు ప్రత్యక్షమౌతాయి. (ఈరోజు) వారు అపహాస్యం చేస్తున్నదే (రేపు) వారిమీద విరుచుకు పడుతుంది.” (ఖురాన్–39:47,48)

“(ఆరోజు) మరికొందరి ముఖాలు మట్టి కొట్టుకొని, నల్లగా మాడిపోయి ఉంటాయి. వీరు సత్యాన్ని నిరాకరించిన దురాత్ములయి ఉంటారు.” (ఖుర్‌ఆన్–80:40–42)

“ఆరోజు నేరస్థుల పరిస్థితి ఎలా ఉంటుందో నీవు చూస్తావు. వారి కాళ్ళు, చేతులు సంకెళ్ళతో బిగించి కట్టివేయబడి ఉంటాయి. గంధకపు వస్త్రాలు ధరించి ఉంటారు. వారి ముఖాలపై అగ్నిజ్వాలలు ఆవరిస్తుంటాయి. ప్రతి మనిషికీ అతను చేసిన కర్మలకు ప్రతిఫలం ఇవ్వడానికే ఇలా సంభవిస్తుంది. కర్మవిచారణ జరపడానికి దేవునికి ఎంతోసేపు పట్టదు.” (ఖుర్‌ఆన్–14:49–51)

“ఇప్పుడిక నడవండి మీరు ధిక్కరిస్తున్న దాని వైపు. మూడు తెరలుగా మారే నీడ వైపు నడవండి. ఆ నీడలో ఎలాంటి చల్లదనం ఉండదు. అగ్నిజ్వాలల నుండి కాపాడదు. అది మేడలవంటి పెద్దపెద్ద నిప్పురవ్వలు వెదజల్లుతుంది, బంగరువన్నె ఒంటెలు ఎగురుతున్నట్లు (అన్పిస్తుంది). ధిక్కారులకు ఆరోజు వినాశం తప్పదు.” (ఖురాన్. 77:29–34)

“ఆరోజు ఏ మానవుడ్నీ, ఏ జిన్‌నీ అతని పాపం గురించి అడగవలసిన అవసరమే ఉండదు. మరి మీ ప్రభువులోని ఏ శక్తియుక్తుల్ని కాదనగలరు? పాపాత్ముల్ని వారి (పాపిష్టి) ముఖాలను బట్టే గుర్తించవచ్చు. వారి ముంగురుల్ని, వారి కాళ్ళను పట్టి బరబర ఈడ్చుకుపోవడం జరుగుతుంది. అప్పుడు మీ ప్రభువుకున్న ఏ శక్తిసామర్థ్యాలు మీరు నిరాకరించగలరు?” (ఖుర్‌ఆన్–55:39–42)

“సత్యాన్ని నిరాకరించినవారు దైవమార్గం నుండి (ప్రజలను) నిరోధించే కార్య కలాపాల కోసం తమ ధనాన్ని వెచ్చిస్తున్నారు. ఇకముందు కూడా మరింత వెచ్చిస్తారు. అయితే చివరికి ఈ (పైశాచిక) కార్యకలాపాలే వారి పశ్చాత్తాపానికి కారణమవుతాయి. ఆ తరువాత వారు (మాకు) లొంగిపోతారు. ఆపై ఈ తిరస్కారులు నరకం వైపు తోల బడతారు. పరిశుభ్రత నుండి మాలిన్యాన్ని వేరుచేసి, ఆ మాలిన్యాలన్నిటిని ఒకదానిపై

ఒకటి కుప్పగా పోసి, ఆ కుప్పను నరకంలో పడవేయడానికే దేవుడు ఇలా చేస్తున్నాడు. ఇలాంటివారే నష్టపోయేవారు." (ఖుర్‌ఆన్‌-8:36-37)

ఆరోజు పరిస్థితి చాలా ఘోరంగా ఉంటుంది. సూర్యుడు చాలా దగ్గరగా వచ్చి తన వాడికిరణాలు ప్రసరింపజేస్తాడు. గాలి స్తంభించిపోతుంది. దాంతో మానవులు చెమటలు కక్కుతూ ఎంతో ఆందోళన చెందుతారు. దైవప్రవక్త (స) ఇలా తెలిపారు:

"హషర్ మైదానంలో మానవుని శరీరం నుండి విపరీతంగా చెమట కారుతుంది, నిరంతరాయంగా కారుతుంది. దాంతో అతను బెంబేలెత్తిపోయి 'ప్రభూ! నాకీ చెమట యాతన కంటే మీరు నన్ను నరకానికి పంపివేయడమే మంచిది' అంటాడు. హషర్ యాతన కాఠిన్యతను చూసి మనిషి ఇలా అంటాడు. కాని నరకయాతన ఇంతకంటే కఠినంగా, ఘోరంగా ఉంటుందన్న సంగతి అతనికింకా తెలియదు." (తర్గీబ్)

## అధికులు అధములవుతారు-42

ఇహలోకంలో సాధారణంగా ధనికులు, పాలకులు, అధికారులు, బలవంతులు, నాయకులు, ప్రాపంచిక విద్యాకళలలో నిష్ణాతులు, హోదాఅంతస్తులు కలవారు, అసామాన్య శక్తిసామర్థ్యాలు కలవారికి మాత్రమే గౌరవాదరణలు లభిస్తాయి. నీతి, దైవభీతిపరాయణత లేకపోయినా అలాంటివారినే లోకం గౌరవిస్తుంది. సిరిసంపదలు, హోదాఅంతస్తులు లేని ధర్మపరాయణులకు ఈ లోకం ఎలాంటి విలువ ఇవ్వదు.

కాని ప్రళయదినాన పరిస్థితి దీనికి పూర్తి భిన్నంగా ఉంటుంది. ఆరోజు ధర్మపరాయణతకే విలువ ఉంటుంది. దైవభీతిపరులకే ఆదరణ లభిస్తుంది.

ఆరోజు కర్మలను బట్టి మానవుల హోదాఅంతస్తులలో తేడాలు ఉంటాయి. అంటే మానవుల విలువ వారి పాపపుణ్యాల ఆధారంగా నిర్ణయించబడుతుంది. ప్రపంచంలో ఎంతో గొప్పవాళ్ళుగా భావించబడినవారు, అహంకారులు ప్రళయదినాన అందరికంటే అధములుగా, నీచులుగా మారి నరకకూపంలో విసిరేయబడతారు. వారి పెద్దరికం, హోదాఅంతస్తులు మట్టిలో కలసిపోతాయి.

"నా సిరిసంపదలు నాకేమాత్రం పనిరాకుండా పోయాయే! నా అధికారం మట్టి కొట్టుకొని పోయిందే!!' అంటూ వాపోతాడు అవిశ్వాసి. (ఖుర్‌ఆన్‌-69:29)

సత్యధర్మాన్ని పూర్తిగా ఆచరిస్తూ నీతిగా జీవించిన దైవభీతిపరాయణులు లోకుల గౌరవాదరణలు నోచుకోలేకపోయినా, పైపెచ్చు నీచం నిరాదరణలకు గురైపోయినా ప్రళయదినాన మాత్రం దేవుడు వారిని ఎంతో ఆదరిస్తాడు. చేసుకున్న కర్మలను బట్టి ఆరోజు వారిలో కొందరు కస్తూరి గుట్టల మీద కూర్చుంటారు. మరికొందరు జ్యోతిర్మయ ఆసనాలపై కూర్చుంటారు. ఇంకొందరు దైవసింహాసనం క్రింద సుఖసంతోషాలతో ఉంటారు. అలాగే వారిలో కొందరు కర్మవిచారణకు గురికాకుండానే స్వర్గంలో ప్రవేశిస్తారు. మరికొందరు కర్మవిచారణ తరువాత స్వర్గప్రవేశం చేస్తారు.



మహాప్రవక్త (సల్లం) ఆరోజు మానవుల పరిస్థితిని గురించి ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: "బాగా వినండి! ఇహలోకంలో మస్తుగా తింటూ, త్రాగుతూ, భోగభాగ్యాలు అనుభవించినవారు పరలోకంలో ఆకలితో నకనక లాడుతుంటారు. నగ్నంగా ఉంటారు. వినండి. ఇహలోకంలో తమను ఎంతో గౌరవనీయులుగా చేసుకుంటున్నవారు నిజానికి తమను తాము అవమానపరచుకుంటున్నారు. (ఈ యదార్థం పరలోకంలో తెలుస్తుంది.)

అలాగే ఇహలోకంలో (వినయం, అణుకువ, ధర్మపరాయణతల కారణంగా) తమను అవమానపరచుకుంటున్నవారు నిజానికి తమనుతాము గౌరవనీయులుగా చేసుకుంటున్నారు. (దేవుని పట్ల ఈ వినయవిధేయతలే వారిని స్వర్గానికి చేర్చుతాయి.)" (తర్గీబ్ వ తర్హీబ్)

బుఖారీ హదీసులో మహాప్రవక్త (స) ఇలా అన్నారు: "ప్రళయం రోజు బాగా బలిసిన ఓ లావుపాటి పెద్దమనిషిని తీసుకురావడం జరుగుతుంది. కాని దేవుని వద్ద అతనికి దోమరెక్కంత విలువ కూడా ఉండదు. కావాలనుకుంటే మీరీ సూక్తి చదువు కోండి...'ప్రళయదినాన మేము వారికి ఎలాంటి బరువు(విలువ) ఇవ్వము' (18:105)

## ఐహిక భాగ్యాలను గురించి విచారణ-43

మన సృష్టికర్త మనకు ప్రపంచంలో ఎన్నో భాగ్యాలు ప్రసాదించాడు. మనం అడగకుండానే మన అవసరాలను తీర్చుతున్నాడు. కాని మనం ఆయనకు కృతజ్ఞులయి ఉండటానికి బదులు కృతఘ్నులయి పోతున్నాము. సృష్టికర్త ఆజ్ఞలను శిరసావహించడానికి బదులు సృష్టితాలయిన మనలాంటి తోటి మానవమాత్రుల ఆజ్ఞలను కళ్ళు మూసుకొని పాటిస్తున్నాం. ఆయన ప్రవక్తలు బోధించిన హితోక్తుల్ని త్రోసిపుచ్చి మనం మనో వాంఛలకు బానిసలయి పోతున్నాము.

"మానవులారా! మిమ్మల్ని, మీ పూర్వీకుల్ని సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. అప్పుడే మీరు రక్షించబడతారని ఆశించగలరు. ఆయనే మీ కోసం నేలను పాన్పుగా, నింగిని కప్పుగా చేశాడు. పైనుండి వర్షాన్ని కురిపించేవాడు కూడా ఆయనే. ఆ వర్షం ద్వారా ఆయన రకరకాల పండ్లూ, పంటలు పండించి మీకు ఆహారం సమకూర్చి పెడ్తున్నాడు. కనుక ఈ యదార్థాలు తెలిసిన తర్వాత మీరు ఇతర శక్తులను దేవునికి సాటి కల్పించకండి." (ఖుర్‌ఆన్‌-2:21,22)

"దేవుడు మీకోసం భూమ్యాకాశాల్లోని సమస్త వస్తువుల్ని అదుపులో ఉంచిన సంగతి మీరు గమనించలేదా? అదీగాక ఆయన తన గోచర, అగోచర మహాభాగ్యాలు (ఎన్నో) మీ కోసం సమకూర్చాడు." (ఖుర్‌ఆన్‌-31:20)

"దేవుడే భూమ్యాకాశాలను సృష్టించాడు. ఆయనే ఆకాశం నుండి వర్షం కురిపించి తద్వారా మీ ఉపాధి కోసం వివిధ రకాల పండ్లు (పంటలు) పండిస్తున్నాడు. ఆయనే సముద్ర యానం కోసం మీకు ఓడలు అధీనం చేసినవాడు. ఆయన ఆదేశంతోనే అవి సముద్రంలో ఎలాంటి వడిదుడుకులు లేకుండా సవ్యంగా సాగిపోతున్నాయి. నదుల్ని

కూడా ఆయనే మీ కోసం అదుపులో ఉంచాడు. ఆయనే సూర్యచంద్రుల్ని మీ కోసం ఒక నియమావళికి కట్టుబడి నిరంతరాయంగా సాగిపోయేలా చేశాడు. మీకోసం రాత్రిని, పగటిని సృష్టించినవాడు కూడా ఆయనే.

"ఇలా మీరు కోరినదంతా ఆయన మీకు ప్రసాదించాడు. అనంతమయిన దైవానుగ్రహాలను మీరు లెక్కించాలనుకున్నా లెక్కించలేరు. అయితే (ఇన్ని అనుగ్రహాలు పొందినప్పటికీ) మానవుడు చాల కృతఘ్నుడుగా, అన్యాయపరుడుగా తయారయ్యాడు." (ఖుర్ఆన్-14:32-34)

"మానవులారా! మీకు దేవుడు చేసిన మహోపకారాలు జ్ఞాపకం చేసుకోండి. దేవుడు తప్ప మీకు భూమ్యాకాశాల నుండి ఉపాధినిచ్చే మరో సృష్టికర్త ఎవరైనా ఉన్నాడా? (లేడు) ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. అలాంటప్పుడు మీరు ఎలా మోస పోతున్నారు?" (ఖుర్ఆన్-35:3)

"భూమిని నివాసయోగ్యంగా చేసిందెవరు? అందులో నదుల్ని పారజేసి, (కొండల) మేకుల్ని పాతిందెవరు? రెండు జలనిధుల మధ్య అడ్డంకిని పెట్టిందెవరు? అల్లాహ్‌తో పాటు మరోదైవం ఉన్నాడా? లేడు. అసలు వారిలో చాలామంది అజ్ఞానులే ఉన్నారు.

"కష్టాలలో ఉన్నవాడు మొరపెట్టుకుంటున్నప్పుడు అతని మొర ఆలకించేదెవరు? చివరికి అతని కష్టాలు కడతేర్చుతుందెవరు? భూలోకంలో మిమ్మల్ని ప్రతినిధిగా చేసిందెవరు? అల్లాహ్‌తోపాటు మరో దైవం కూడా ఉన్నాడా (ఈ పనులు చేయడానికి)? మీరసలు (ఈ విషయాల్ని గురించి) చాలా తక్కువగా యోచిస్తారు.

"నేలమీద, సముద్రం మీద కటిక చీకటిలో (సైతం) మీకు దారి చూపిస్తున్న దెవరు? ఎవరు తన కారుణ్యానికి (వర్షానికి) ముందుగా శుభవార్త తెచ్చే (చల్లటి) గాలులను పంపిస్తున్నది? అల్లాహ్‌తో పాటు మరోదైవం కూడా ఉన్నాడా (ఈ పనులు చేయడానికి)? వీరు చేస్తున్న సృష్టిపూజకు అల్లాహ్ ఎంతో అతీతుడు, మహోన్నతుడు.

"ప్రాణుల్ని తొలిసారిగా సృజిస్తున్నది, తర్వాత వాటిని పునరుత్పత్తి చేస్తున్నదెవరు? భూమ్యాకాశాల నుండి మీకు ఉపాధి ప్రసాదిస్తున్నదెవరు? అల్లాహ్‌తో పాటు మరో దైవం కూడా ఉన్నాడా (ఈ పనులు చేయగలిగేవాడు)? వారిని అడుగు 'మీ అభిప్రాయం నిజమైతే వీటికి (తగిన) ఆధారాలేమిటో చూపండి' అని." (ఖుర్ఆన్-27:61-64)

సృష్టికర్త మనకు ప్రసాదించి మహాభాగ్యాలలో ఆరోగ్యం ఎంతో విలువైనది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. కేన్సర్‌కు ఈనాటికీ సరైన మందు లేదు. అంతెందుకు రెటినా డ్యామేజ్ అయితే దానికీ చికిత్స లేదు. ఇలా ఎన్నయినా చెప్పవచ్చు. పుట్టుగుడ్డి అయిన కోటీశ్వరుడి దగ్గరికెళ్ళి 'నీకు దృష్టి వచ్చేటట్లు చేస్తే ఎంత డబ్బిస్తావ'ని అడగండి. కోటి రూపాయలు ఇవ్వడానికైనా వెనుకంజ వేయడు. దీన్ని బట్టి సృష్టికర్త ప్రసాదించిన ఈ కళ్ళు ఎంత విలువయినవో ఊహించండి.



"ఆయన మీకు చెవులిచ్చాడు, కళ్ళిచ్చాడు, హృదయాన్నిచ్చాడు. కాని మీరు మాత్రం (ఆయనకు) చాలా తక్కువగా కృతజ్ఞత చూపుతున్నారు." (ఖుర్ఆన్-32:9)

"ముహమ్మద్ (సల్లం)! వారిని ఈ విషయం అడుగు: 'మీకు భూమ్యాకాశాల నుండి ఉపాధి నిస్తున్నదెవరు? మీరు వినే, చూసే శక్తిసామర్థ్యాలు మీకసలు ఎవరు ప్రసాదించారు? నిర్జీవ పదార్థం నుండి జీవిని, జీవి నుండి నిర్జీవ పదార్థాన్ని వెలికి తీస్తున్నదెవరు? బ్రహ్మాండమైన ఈ విశ్వవ్యవస్థను (నియమబద్ధంగా) నిర్వహిస్తున్న శక్తిస్వరూపుడు ఎవరు?' వారు తప్పకుండా దేవుడే అంటారు. అడుగు: 'మరి ఆ దేవుడే మీ నిజప్రభువు అయినప్పుడు మీరు (వాస్తవికతకు విరుద్ధంగా నడవడాన్ని) ఎందుకు మానుకోరు?" (ఖుర్ఆన్-10:31)

"మీరు పొలాల్లో నాటే విత్తనాలను గురించి ఆలోచించారా? ఆ విత్తనాల ద్వారా పంటలు మీరు పండిస్తున్నారా లేక మేమా? మేము తలచుకుంటే ఆ పంటపొలాల్ని నుగ్గు నుగ్గు చేసేయగలం. అప్పుడు మీరు విచారపడుతూ "అయ్యయ్యో! మా శ్రమ, పెట్టుబడి అంతా వృధా అయ్యిందే! అసలు మా నొసటే దౌర్భాగ్యం రాసి ఉంది" అని రకరకాలుగా చెప్పుకుంటారు. సరే మీరు త్రాగే ఈనీటిని కళ్ళుతెరచి చూశారా? దాన్ని మేఘాల నుండి మీరు కురిపిస్తున్నారా లేక మేమా? మేము తలచుకుంటే దాన్ని తీవ్రమైన ఉప్పునీటిగా మార్చేయగలం. మరి మీరు ఎందుకు కృతజ్ఞులై ఉండరు?" (ఖుర్ఆన్:56:63-70)

మనకెవరైనా ఓ యాభై రూపాయల విలువగల సహాయం చేస్తే మనం అతనికి ఎంతో కృతజ్ఞత చూపుతాం. మరికాస్త ఎక్కువ సహాయం చేస్తే 'నేను మీకెంతో రుణపడి ఉన్నాను, మీ మేలు ఎన్నటికీ మరచిపోలేను' అంటాము. తోటి మానవులు చేసే ఈ చిరుసహాయం సృష్టికర్త చేసిన, చేస్తున్న సహాయంలో 0.00000001 శాతం కూడా ఉండదు. అయినా ఈ మానవుడు సృష్టికర్తను వదలి సృష్టితాల వెంటపడ్డాడు!

అయితే దేవుడు తాను ప్రసాదించిన మహాభాగ్యాలను గురించి మానవుల నుండి పరలోకంలో లెక్క తీసుకుంటాడు; ఈ మహాభాగ్యాలను నా ఆదేశాల ప్రకారం మీరు ఏ మేరకు సద్వినియోగం చేశారు? అని తప్పకుండా నిలదీస్తాడు. అప్పుడు దైవాజ్ఞలను విస్మరించి వాటిని దుర్వినియోగం చేసినవారి గతి ఏమవుతుంది?

ఇది తీవ్రంగా ఆలోచించాల్సిన విషయం. ఈ మహాభాగ్యాలు ప్రసాదించిన సృష్టికర్తకు కృతజ్ఞులయి ఆయన ఆదేశాల ప్రకారం, ఆయన ప్రవక్తల హితవుల ప్రకారం జీవితాంతం సత్కర్మలు ఆచరించినవారే నరకయాతనల నుండి తప్పించుకుంటారు. అలాంటివారే స్వర్గప్రవేశానికి, దైవదర్శనభాగ్యానికి నోచుకుంటారు.

దైవప్రసాదిత భాగ్యాల విచారణ గురించి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా ప్రవచించారు: "ప్రళయదినాన అయిదు విషయాలను గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వనంతవరకు మానవుడు నిల్చున్న చోటు నుంచి ఒక్క అంగుళం కూడా కదలలేడు. ఆ అయిదు విషయాలివి: (1) నీ వయస్సును ఏ కార్యకాలాపాలలో అంతమొందించావు? (2) నీ యౌవనాన్ని ఎక్కడ వ్యర్థపరిచావు? (3) నీవు ధనాన్ని

ఎలా సంపాదించావు? (4) దాన్ని ఏవిధంగా ఖర్చుపెట్టావు? (5) నీకు ప్రసాదించిన (ధర్మ) జ్ఞానాన్ని ఏమేరకు ఆచరించావు?'' (తిర్మిజి)

"ప్రళయదినాన మానవుడు ఎలాంటి విలువ, బలం లేని మేకపిల్లలా తీసుకురాబడతాడు. తరువాత దేవుని ముందు ప్రవేశపెట్టబడతాడు. దేవుడు అతడ్ని 'నేను నీకు ఎన్నో మహాభాగ్యాలు ప్రసాదించాను. వాటిని ఏం చేశావు?' అని అడుగుతాడు.

దానికి మానవుడు 'ప్రభూ! నేను ధనాన్ని కూడబెట్టాను. ఎన్నో లాభాలతో దాన్ని అభివృద్ధి పరిచాను. ప్రారంభంలో ఉన్న ఆస్తికి ఎన్నో రెట్లు పెంచి వదిలేసి వచ్చాను. మీరు అనుమతిస్తే నేనా సంపదంతా తీసుకొచ్చి మీ ముందు పెడ్తాను' అని అంటాడు.

'నీవు ముందుగా ఇక్కడకు పంపుకున్న దేమిటో చూపించు' అంటాడు దేవుడు. మానవుడు మళ్ళీ అదే సమాధానమిస్తాడు. తనను వెనక్కి తిప్పిపంపితే ఆ సంపదంతా తెచ్చి మీ ముందు పెడ్తానంటాడు. కాని ఆ మానవుడు ముందుగా ఎలాంటి సత్కర్మలు పంపుకోలేనందున అతడ్ని నరకానికి పంపడం జరుగుతుంది.'' (తిర్మిజి)

హజ్రత్ అనస్ (రజి) ప్రకారం దైవప్రవక్త (స) హితోక్తి: "ప్రళయదినాన మానవునికి చెందిన మూడు రిజిష్టర్లుంటాయి. ఒక రిజిష్టర్‌లో అతని సత్కర్మలు నమోదై ఉంటాయి. రెండవ రిజిష్టర్‌లో అతని దుష్కర్మలు నమోదై ఉంటాయి. మూడవ రిజిష్టర్‌లో దేవుడు ప్రపంచంలో అతనికి ప్రసాదించిన భాగ్యాలన్నీ నమోదై ఉంటాయి.

దేవుడు ఆ భాగ్యాలలో అన్నిటికంటే చిన్నభాగ్యంతో 'నీవు నీ మూల్యాన్ని ఇతని సత్కర్మల నుండి తీసేసుకో' అంటాడు. అప్పుడా చిరుభాగ్యం తన విలువను లెక్కగట్టి ఆ మనిషి సత్కర్మలన్నిటినీ స్వాధీనం చేసుకుంటుంది. తర్వాత దేవునితో 'ప్రభూ! నీ గౌరవప్రతిష్ఠల సాక్ష్యం! నేను నా మూల్యమంతటినీ వసూలుచేయలేదు' అంటుంది.

ఒక్క చిరుభాగ్యానికి చెల్లించిన మూల్యానికే అతని సత్కర్మలచిట్టా ఖాళీ అయిపోయింది. దుష్కర్మలచిట్టా పాపాలతో నిండి అలాగే ఉండిపోయింది. వాటి మూల్యం చెల్లించడానికి దైవప్రసాదిత భాగ్యాలు ఇంకా చాలా ఉన్నాయి. దేవుడు ఏ దాసుణ్ణయినా కరుణించదలచుకుంటే (అతడ్ని క్షమించి స్వర్గానికి పంపదలచుకుంటే) 'నా దాసుడా! నేను నీ పాపాలు క్షమించాను. నీ సత్కర్మలు అధికం చేశాను' అనంటాడు.'' (తర్గీబ్)

## సిఫారసు, పాపపరిహారం-44

సృష్టికర్తను, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం)ను తిరస్కరించిన అవిశ్వాసులకు పరలోకంలో ఎలాంటి సిఫారసు వర్తించదు. అసలక్కడ వారికి ఎవరూ సిఫారసు చేయలేరు. అవిశ్వాసులు నరకం నుండి తప్పించుకోవడానికి పాపపరిహారం ఇవ్వదలచుకున్నా దేవుడు దాన్ని స్వీకరించడు. అసలు వారి దగ్గర పాపపరిహారంగా ఇవ్వడానికి ఏదీ ఉండదు. ఇహలోకంలో అవిశ్వాసులు చేసిన సత్కర్మలు ఏవైనా ఉంటే అవి పరలోకంలో వారికి ఏమాత్రం పనికిరావు.



ఏ సత్కార్యమయినా దేవుడ్ని, ఆయన అంతిమప్రవక్త (సల్లం)ను విశ్వసించి, జీవితాంతం ఆ విశ్వాసంలోనే స్థిరంగా ఉన్నప్పుడే ఆ సత్కార్యం పరలోకంలో పనికి వస్తుంది. అలాగే ఏ విషయంలోనైనా, ఎవరు సిఫారసు చేసినా అది దేవుడ్ని, ఆయన అంతిమప్రవక్త (సల్లం)ను విశ్వసించినవారికే వర్తిస్తుంది. సత్యతిరస్కారుల విషయంలో సిఫారసు, పాపపరిహారం గురించి ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

"మానవులారా! మీ ప్రభువు ఆగ్రహం నుండి తప్పించుకోండి. తండ్రి తన కొడుకుకు, కొడుకు తన తండ్రికి ఎలాంటి సహాయం చేయలేని (ప్రళయ) దినం గురించి భయపడండి. దేవుని వాగ్దానం తప్పక నెరవేరుతుంది. కనుక ప్రాపంచిక జీవితం మిమ్మల్ని మోసగించకూడదు. మోసగాడు కూడా మిమ్మల్ని దేవుని విషయంలో మోసగించకూడదు." (31:33)

"ప్రవక్తా! అతి సమీపానికి వచ్చివున్న (ప్రళయ)దినం గురించి ప్రజల్ని భయపెట్టు. ఆరోజు గుండెలు (గుభేలుమంటూ) గొంతులలోకి వస్తాయి. ప్రజలు పుట్టెడు దుఃఖాన్ని బలవంతంగా దిగమింగుతూ నోరుమూసుకొని నిల్చుంటారు. దుర్మార్గులకు ఏ ఆప్త మిత్రుడూ లభించడు. వారికనుకూలంగా సిఫారసు చేసేవారు కూడా ఎవరూ ఉండరు. వారి సిఫారసు అంగీకరించడం జరగదు." (40:18)

"ఒకరికొకరు ఏవిధంగానూ తోడ్పడలేని (ప్రళయ) దినం గురించి భయపడండి. ఆరోజు ఎవరి సిఫారసు చెల్లదు. ఏఒక్కర్నీ పాపపరిహారం తీసుకొని వదలిపెట్టడం కూడా జరగదు. అసలా రోజు పాపాత్ములకు ఎలాంటి సహాయమూ లభించదు." (2:48)

"ఆరోజు సంతానం-సిరిసంపదలు ఏమాత్రం ఉపయోగపడవు. నిష్కల్మషమైన హృదయంతో దేవుని సన్నిధికి వచ్చినవారికే ఆరోజు ప్రయోజనముంటుంది". (26:89)

"ఆరోజు దుర్మార్గులు చెప్పే సాకులవల్ల ఎలాంటి లాభం ఉండదు. దేవుడ్ని క్షమాపణ కోరుకోవడానిక్కూడా వారికి అనుమతి లభించదు." (30:57)

"(పాప)భారం మోసేవారెవరూ ఇతరుల (పాప)భారం మోయలేరు. (పాప)భారం క్రింద అణగిపోయినవాడు తన భారాన్ని తొలగించుకోవడానికి ఎవరినైనా పిలిస్తే, అతని భారంలోని అణుమాత్రం బరువు కూడా మోయడానికి ఎవరూ ముందుకు రారు. చివరికి అతి సన్నిహితులయిన అతని బంధువులు సైతం ముందుకు రారు." (35:18)

"ఒకవేళ దుర్మార్గుల దగ్గర లోకంలోని యావత్తు సిరిసంపదలకు రెట్టింపు సిరిసంపదలుంటే, ప్రళయదినాన కలిగే పరమనీచమైన ఘోరశిక్ష నుండి బయటపడేందుకు ఆ సంపదనంతటినీ (పాప)పరిహారం క్రింద ఇవ్వడానికి సిద్ధపడతారు. (అయినా వారా శిక్ష నుండి తప్పించుకోలేరు.) అక్కడ దేవుని వైపు నుండి వారిపైకి వారు ఎన్నడూ ఊహించని దారుణం వచ్చిపడుతుంది. వారి కర్మల దుష్ఫలితాలన్నీ వారిముందు ప్రత్యక్షమవుతాయి. (ఈరోజు) వారు అపహాస్యం చేస్తున్నదే (రేపు) వారి మీద విరుచుకు పడుతుంది." (ఖుర్‌ఆన్-39:47,48)

"ఆయన్ను వదలి వీరు ప్రార్థిస్తున్న దైవేతరులకు ఎలాంటి సిఫారసుచేసే అధికారం లేదు. కాకపోతే వీరేదయినా విషయపరిజ్ఞానం ఆధారంగా సత్యానుగుణమైన సాక్ష్యమిస్తే అందుకు అనుమతి లభిస్తుంది." (43:86)

"సత్యాన్ని తిరస్కరించినవారు తమ దగ్గర భూమండలమంత సిరిసంపదలుండి, ఇంకా అంతకు రెట్టింపు సంపదలు ఉండి, ప్రళయదినం శిక్ష నుండి తప్పించుకోవడానికి దాన్నంతా పాపపరిహారంగా ఇచ్చివేయ దలచుకున్నా సరే, దాన్ని స్వీకరించడం జరగదు. వారికి వ్యధాభరితమయిన శిక్ష పడితీరుతుంది. వారు నరకాగ్ని నుండి బయటపడాలని ఎంత గింజుకున్నా దాన్నుండి బయటపడలేరు. వారా నరక యాతలోనే మగ్గుతూ శాశ్వతంగా పడి వుండవలసి ఉంటుంది." (5:36-37)

"ఆరోజు పాపాత్ములు (నరక) శిక్ష నుండి తప్పించుకోవడానికి తమ భార్యాపిల్లల్ని, అన్నదమ్ముల్ని, (ప్రపంచంలో) తమకు ఆశ్రయం ఇవ్వగలిగిన అతి సన్నిహిత బంధు వర్గాన్ని, చివరికి ప్రపంచంలోని వారందర్నీ పరిహారంగా ఇవ్వదలచుకుంటారు. (అయినా శిక్ష నుండి బయటపడటం) ఏమాత్రం జరగదు. అది తీవ్రంగా ప్రజ్వరిల్లే నరకాగ్ని జ్వాల. అది చర్మాన్ని వలిచి మాడ్చివేస్తుంది." (70:10-16)

"దేవుని సన్నిధిలో ఆయన అనుమతించినవారి సిఫారసు తప్ప ఎవరి సిఫారసూ ఎవరి విషయంలోనూ ప్రయోజనం చేకూర్చదు. అంతేకాదు, ప్రజల హృదయాల్లోని ఆందోళన, అస్థిమితాలు దూరమైన తరువాత వారు (సిఫారసు చేసేవారిని) 'మీ ప్రభువు ఏం సమాధానమిచ్చాడ'ని అడుగుతారు. దానికి వారు "సరైన సమాధానమే లభించింది. ఆయన మహనీయుడు, మహోన్నతుడు' అంటారు." (34:23)

"ఆరోజు ప్రజలు ఎలాంటి సిఫారసు చేయలేరు. ఏదైనా చేస్తే కరుణామయుడి నుండి అనుమతి పొందినవారు మాత్రమే సిఫారసు చేయగలరు." (19:87)

ఇక దేవుడ్ని, ఆయన అంతిమప్రవక్త (స)ను విశ్వసించినవారి (ముస్లింల) విషయానికొస్తే అలాంటివారు సత్యాన్ని విశ్వసించడంతో పాటు జీవితాంతం దానికను గుణంగా సత్కార్యాలు కూడా చేస్తుండాలి. అప్పుడే వారు నరకశిక్షకు గురికాకుండా నేరుగా స్వర్గానికి పోయే అవకాశం ఉంటుంది. ఒకవేళ కేవలం సత్యాన్ని విశ్వసించి, సత్కార్యాలు చేయకపోతే అలాంటి విశ్వాసులు కొంతకాలం పాటు నరకంలో శిక్షలు అనుభవించవలసి వస్తుంది. అందుకే ఖుర్ఆన్ మాటిమాటికి సత్కర్మలు ఆచరించమని విశ్వాసులకు నొక్కి చెబుతోంది.

"విశ్వాసులారా! ఎలాంటి క్రయవిక్రయాలు జరగని, స్నేహసహకారాలు ఉపయోగ పడని, ఎవరి సిఫారసు కూడా చెల్లని (పరలోక తీర్పు) దినం రాకముందే మేము మీకు ప్రసాదించిన సంపద నుండి (దైవమార్గంలో కూడా) ఖర్చుపెట్టండి. (మా మాటలు నమ్మని) సత్యతిరస్కారులే పరమదుర్మార్గులు." (ఖుర్ఆన్-2:254)



"మీ సంతానం, బంధుత్వాలు ప్రళయ దినాన ఏమాత్రం పనికిరావు. ఆరోజు దేవుడు మీమధ్య (ఈనాడున్న) సంబంధ బాంధవ్యాలన్నీ త్రెంచివేస్తాడు. ఆయన మీరు చేస్తున్న పనులన్నీ గమనిస్తూనే ఉన్నాడు." (ఖుర్ఆన్-60:3)

"ఆరోజు కరుణామయుడు ఎవరికైనా అనుమతినిచ్చి, అతని మాటలు వినడానికి ఇష్టపడితే తప్ప ఏ ఒక్కరి సిఫారసూ చెల్లదు. ప్రజల ముందున్నదేమిటో, వారి వెనుకున్న దేమిటో అంతా దేవునికి తెలుసు. ఇతరులకు దాన్ని గురించి పూర్తిగా తెలియదు. మానవులు సజీవుడు, శాశ్వితుడైన దేవుని ముందు తలలువంచి నిలబడతారు. దుర్మార్గం, దౌర్జన్యాల పాపభారం మోసుకొచ్చినవాడు ఆరోజు సర్వనాశనమైనట్లే. సత్కార్యాలు చేసి వుండటంతో పాటు (దేవుడ్ని, ఆయన ప్రవక్తలను నమ్మిన) విశ్వాసి కూడా అయివుండిన వాడికి ఎలాంటి నష్టంగాని, అన్యాయంగాని జరుగుతుందన్న భయమే ఉండదు." (దివ్య ఖుర్ఆన్-20:109-112)

"దేవుడు ఎవరి విషయంలో సిఫారసు వినడానికి ఇష్టపడతాడో అలాంటి వ్యక్తుల్ని గురించి తప్ప మరెవరి విషయంలోనూ వారు సిఫారసు చేయరు. వారసలు దేవుడంటే ఎంతో భయపడతారు." (ఖుర్ఆన్-21:28)

"అలాంటి దేవుడ్ని వదలి వీరు ఇతరుల్ని సిఫారసు కర్తలుగా చేసుకున్నారా! వారిని అడుగు: 'ఎలాంటి అధికారం లేకపోయినా వారు సిఫారసు చేయగలరా?' చెప్పు: 'సమస్త వ్యవహారాల్లో సిఫారసుచేసే అధికారం ఒక్క దేవునికి మాత్రమే ఉంది. భూమ్యాకాశాల రాజ్యాధికారం ఆయన చేతిలోనే ఉంది. ఆయన దగ్గరికే మీరు తిరిగి పోవలసిఉంది". (ఖుర్ఆన్-39:43,44)

## విశ్వాసులు, సిఫారసు-45

దేవుడ్ని, ఆయన ప్రవక్తలను విశ్వసించినవారి ముక్తి కోసం దైవప్రవక్తలుగాని దైవదూతలుగాని, లేదా దేవుని అనుమతి లభించిన మరెవరైనా సిఫారసు చేస్తే దాన్ని దేవుడు ఆమోదించే అవకాశం ఉంది. ప్రళయదినాన మూడు విధాల వ్యక్తులు సిఫారసు చేస్తారని దైవప్రవక్త (సల్లం) తెలియజేశారు: (1) దైవప్రవక్తలు, (2) ధర్మవేత్తలు, (3) అమరగతులు. (ఇబ్నెమాజ)

అలాగే ఈ సిఫారసు అయిదు విధాలుగా ఉంటుందని మరొక ఉల్లేఖనం ద్వారా తెలుస్తోంది. అవి ఈ విధంగా ఉంటాయి:

(1) మొదటి సిఫారసు సాధారణ సిఫారసు. మానవులంతా హషర్ మైదానంలో గుమిగూడిన తరువాత కర్మవిచారణ ప్రారంభించడానికి చేసే సిఫారసు. హజ్రత్ ఆదం (అలైహి) నుండి హజ్రత్ ఈసా (అలైహి) వరకు అనేక మంది దైవప్రవక్తలు తాము ఏదో ఒక పొరపాటు చేసినందువల్ల దేవుని దగ్గర సిఫారసు చేయలేమని చెబుతారు. చివరికి అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) సిఫారసు చేయడానికి అంగీకరిస్తారు. ఈ సిఫారసు గురించి వెనుకటి పేజీలలో పేర్కొన్నాం.

(2) రెండో సిఫారసు అనేకమంది విశ్వాసుల్ని కర్మవిచారణ లేకుండానే స్వర్గానికి పంపే విషయంలో ఉంటుంది. ఈ సిఫారసు కూడా అంతిమదైవప్రవక్తే (సల్లం) చేస్తారు.

(3) మూడో సిఫారసు కొన్ని పాపాల కారణంగా నరక శిక్షకు అర్హులయిన విశ్వాసుల్ని నరకశిక్ష నుండి తప్పించే విషయంలో ఉంటుంది. ఈ సిఫారసు కూడా అంతిమ దైవప్రవక్తే (సల్లం) చేస్తారు.

(4) నాల్గవ సిఫారసు నరకానికి పంపబడిన పాపులను నరకం నుండి తీయించి స్వర్గానికి పంపించే విషయంలో ఉంటుంది. ఈ సిఫారసు వివిధ దైవప్రవక్తలు, దైవ దూతలు చేస్తారు.

(5) అయిదో సిఫారసు స్వర్గంలో ప్రవేశించిన విశ్వాసుల హోదా అంతస్తుల్ని పెంచే విషయంలో ఉంటుంది.

హజ్రత్ ఔఫ్ బిన్ మాలిక్ (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా తెలియజేశారు: "నా ప్రభువు దగ్గర్నుండి ఒకదూత వచ్చి, నేను నాఅనుచర సముదాయంలో సగంమందిని (కర్మవిచారణ లేకుండానే) స్వర్గప్రవేశం చేయించ వచ్చని, లేదా (నా అనుచర సముదాయంలో నేను తలచిన మనిషి కోసం) సిఫారసు చేయవచ్చని నాకు అధికారం ఇచ్చినట్లు తెలియజేశాడు. అప్పుడు నేను సిఫారసు చేసే అధికారం అడిగి తీసుకున్నాను. అయితే అల్లాహ్ దైవత్వంలో ఆయనకు మరెవర్నీ సాటికల్పించనివారి కోసం మాత్రమే నా సిఫారసు వర్తిస్తుంది." (మిష్కాత్)

**ముస్లింలకు దైవప్రవక్త (స) సిఫారసు :** హజ్రత్ అబ్దుల్లా బిన్అబ్బాస్ (రజి) ప్రకారం మహనీయ ముహమ్మద్ (స) ఇలా ప్రవచించారు: "దైవప్రవక్తల కోసం (ప్రళయదినాన) జ్యోతిర్మయ ఆసనాలు వేయబడతాయి. వాటి మీద ప్రవక్తలు కూర్చుం టారు. నా ఆసనం మటుకు ఖాళీగా ఉంటుంది. నేను దాని మీద కూర్చుంటే (ఇతర ప్రవక్తలతో పాటు) నన్ను కూడా స్వర్గానికి పంపడం జరుగుతుందేమో, తరువాత నా అనుచర సముదాయం (నా సిఫారసుకు నోచుకోకుండా) ఉండిపోతుందేమో అన్న భయంతో నేను దాని మీద కూర్చోలేకపోతాను. అప్పుడు నేను 'ప్రభూ! నా అనుచర సముదాయం! నా అనుచరసముదాయం!!'అంటాను. దానికి విశ్వప్రభువు 'ముహమ్మద్! నీవు నీ అనుచర సముదాయం విషయంలో ఏం కోరుతున్నావు?' అని అడుగుతాడు. నేను 'వీళ్ళ కర్మవిచారణ తొందరగా ముగిస్తే బాగుంటుంది' అంటాను.

ఆ తర్వాత నా అనుచర సముదాయాన్ని సమావేశపరచి కర్మవిచారణ ప్రారంభిం చడం జరుగుతుంది. తత్ఫలితంగా వారిలో కొందరు దేవుని కారుణ్యానుగ్రహాలతో, మరికొందరు నా సిఫారసుతో స్వర్గానికి వెళ్తారు. నేను సిఫారసు చేస్తూ ఉంటాను. చివరికి నరకంలో వేయబడినవారి పేర్ల జాబితాకు సంబంధించిన రిజిష్టర్ కూడా నాకివ్వబడుతుంది. (ఈవిధంగా నరకంలో వేయబడినవారిని కూడా అక్కడ్నుంచి తీసి స్వర్గానికి పంపడం జరుగుతుంది.) నరకపాలకుడు ఇదంతా చూస్తూ 'మీరు మీ



అనుచర సముదాయంలో దైవాగ్రహంలో చిక్కుకొని నరకంలోనే పడివుండేందుకు ఒక్కడ్ని కూడా వదలి పెట్టలేదు' అనంటాడు." (తర్గీబ్ వ తర్హీబ్)

**ఓ హెచ్చరిక :** అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ప్రళయదినాన తన అనుచర సముదాయం కోసం సిఫారసు చేస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. కాని ఆయన చేసే సిఫారసును మాత్రమే నమ్ముకొని సత్కర్మలు ఆచరించకుండా పాపకూపంలోనే పడివుంటే మటుకు ముస్లింలకు నరకయాతనలు తప్పవు. కొన్ని హదీసు లలో ముహమ్మద్ అనుచర సముదాయానికి చెందినవారు అత్యధిక సంఖ్యలో నరకంలో వేయబడతారని కూడా ఉంది. ఇలా నరకంలో వేయబడిన ముస్లింలు ఆ నరక యాతనలు ఎంత కాలం అనుభవించవలసి ఉంటుందో కూడా ఊహించలేం. ఇది వందల సంవత్సరాలైన కావచ్చు, వేల సంవత్సరాలైనా కావచ్చు.

పునరుత్థాన సమయం నుంచి కర్మవిచారణ పూర్తిగా ముగిసే సమయం వరకుండే ప్రళయదిన కాలపరిమితే యాభై వేల సంవత్సరాలు ఉంటుంది మరి! ఒక నిమిషం పాటు అనుభవించే నరకయాతన ఇహలోకంలో అనుభవించిన వందేళ్ళ భోగభాగ్యాలను కూడా ఇట్టే మరిపింపజేస్తుంది. దాన్ని బట్టి నరకయాతనలు ఎంత తీవ్రంగా ఉంటాయో ఊహించవచ్చు.

**విశ్వాసులకు విశ్వాసుల సిఫారసు :** ప్రళయదినాన పాపాత్ములైన విశ్వాసుల కోసం పుణ్యాత్ములైన విశ్వాసులు కూడా సిఫారసు చేస్తారని తెలుస్తోంది. దీన్ని గురించి దైవప్రవక్త(స) ఇలా తెలిపారు: "నా అనుచర సముదాయానికి చెందిన కొందరు యావత్తు సంఘం కోసం సిఫారసు చేస్తారు. కొందరు ఒక తెగ కోసం మరికొందరు పది నుంచి నలభై మంది కోసం, ఇంకొందరు ఒకనికోసం సిఫారసు చేస్తారు. ఈవిధంగా చివరికి మొత్తం ముస్లింసముదాయం స్వర్గానికి పోతుంది." మరొక హదీసులో "నా అనుచర సముదాయంలోని ఒక వ్యక్తి చేసే సిఫారసుతో బనూతమీమ్ తెగ ప్రజలకంటే కూడా ఎక్కువమంది విశ్వాసులు స్వర్గంలో ప్రవేశిస్తార"ని దైవప్రవక్త (స) అన్నారు. (మిష్కాత్)

దైవప్రవక్త (సల్లం) మహితోక్తి: "నరకానికి పోయేవారు వరుసలుగా నిలబడి ఉంటారు. అప్పుడు ఒక స్వర్గవాసి వారి ముందునుంచి పోవడం జరుగుతుంది. నరకానికి పోయేవారిలో ఒకతను ఆ స్వర్గవాసిని ఉద్దేశించి 'అయ్యా! మీరు నన్ను గుర్తుపట్టలేదా? నేను ఒకసారి మీకు తాగడానికి మంచినీళ్ళిచ్చాను. (మరి మీరు నా విముక్తి కోసం సిఫారసు చేయరూ?' అంటాడు. అలాగే మరొకతను తన ముందునుంచి పోయే స్వర్గవాసిని సంబోధిస్తూ 'నేను ఒకసారి మీకు ఉజూ చేసుకోవడానికి నీళ్ళు సరాఫరా చేశాను. (దయచేసి నా విముక్తి కోసం సిఫారసు చేయండి.)' అనంటాడు. కనుక స్వర్గవాసి సిఫారసు చేసి ఆ నరకవాసిని స్వర్గానికి పంపుతాడు." (ఇబ్నెమాజ)

**సమరయోధుడి సిఫారసు :** తిర్మిజిలో హజ్రత్ మిఖ్దామ్ (రజి) ఉల్లేఖించిన ఓ సుదీర్ఘ హదీసులో దైవప్రవక్త (సల్లం) సమరయోధుల (ముజాహిద్‌ల) ఔన్నత్యాన్ని

గురించి తెలియజేస్తూ, డెబ్బయి మంది బంధువుల విషయంలో ఒక సమరయోధుని సిఫారసు అంగీకరించబడుతుందని చెప్పారు. (మిష్కాత్)

**తల్లిదండ్రుల్ని గురించి చిన్నపిల్లల సిఫారసు :** హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్వూద్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "తనకు ముందుగా ముగ్గురు చిన్న పిల్లల్ని (పరలోకానికి) పంపుకున్న తల్లితండ్రుల పాలిట ఆ పిల్లలు నరకం నుంచి కాపాడే కంచుకోట అవుతారు."

హజ్రత్ అబూజర్ (రజి) ఈమాట విని "నేను ఇద్దరు పిల్లల్ని మాత్రమే పంపుకున్నాను. (మరి నా సంగతేమిటీ?) అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "ఇద్దరు పిల్లల్ని పంపుకున్నా ఈమాటే వర్తిస్తుంది" అన్నారు. హజ్రత్ ఉబయి బిన్ కాబ్ (రజి) మాట్లాడుతూ "నేనయితే ఒకేఒక పిల్లవాడ్ని పంపుకున్నాను" అన్నారు. దానికీ దైవప్రవక్త (సల్లం) "ఒక పిల్లవాడయినా సరే ఈమాటే వర్తిస్తుంది" అని చెప్పారు. (మిష్కాత్)

**హాఫిజె ఖుర్ఆన్ సిఫారసు :** హజ్రత్ అలి(రజి) ఉల్లేఖనంలో దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఖుర్ఆన్ పఠించి, కంఠస్థం చేసి, ఖుర్ఆన్ ఏవిషయాల్ని నిషేధించిందో వాటిని మానేసి, ఏవిషయాల్ని ధర్మసమ్మతం చేసిందో వాటిని ఆచరించిన మనిషిని దేవుడు స్వర్గానికి పంపిస్తాడు. అదీగాక ఆ మనిషి కుటుంబంలో (పాపాల కారణంగా) నరకానికి పంపేందుకు నిర్ణయం జరిగిపోయిన పదిమంది వ్యక్తుల విషయంలో అతని సిఫారసును కూడా దేవుడు అంగీకరిస్తాడు." (తిర్మిజి)

హాఫిజె ఖుర్ఆన్ అంటే దివ్యఖుర్ఆన్ని బాగా అధ్యయనం చేసి, దాన్ని కంఠస్థం చేసి, అందులోని ప్రతి విషయాన్నీ గుర్తుంచకునే వాడని అర్థం. ఖుర్ఆన్ని అధ్యయనం చేసి, కంఠస్థం చేసి, అందులోని ప్రతి విషయాన్నీ గుర్తుంచుకునేవాడు సహజంగానే ఖుర్ఆన్ వారించిన దుష్కార్యాలకు దూరంగా మసలుకుంటూ, అది ఆదేశించిన సత్కార్యాలు జీవితాంతం చేస్తూ ఉంటాడు.

దీన్నిబట్టి అరబీభాష కూడా హాఫిజ్కు బాగా తెలిసిఉండాలని తెలుస్తోంది. అరబీభాష తెలియడంతో పాటు ఖుర్ఆన్ని కంఠస్థం చేసి, దాని ప్రకారం జీవితాంతం ఆచరించే వ్యక్తి మాత్రమే దేవుని దృష్టిలో నిజమైన హాఫిజెఖుర్ఆన్ అన్పించుకుంటాడు. అలాంటి హాఫిజె ఖుర్ఆన్ చేసే సిఫారసుని మాత్రమే ఆయన అంగీకరిస్తాడు. అరబీ భాషరాని ఈనాటి హాఫిజె ఖుర్ఆన్లు చేసే సిఫారసుని దేవుడు స్వీకరిస్తాడని ఆశించ లేము. కనీసం తమకు తెలిసిన భాషలోనైనా వారు ఖుర్ఆన్ని ఎల్లప్పుడూ పఠిస్తూ దాని ఆజ్ఞలను పూర్తిగా పాటించడానికి ప్రయత్నించాలి.

**ఖుర్ఆన్, ఉపవాసాల సిఫారసు :** హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త (సల్లం) ఈవిధంగా తెలియజేశారు: "దైవదాసుని విముక్తి కోసం ఖుర్ఆన్, ఉపవాసాలు (కూడా) సిఫారసు చేస్తాయి. ఉపవాసం దైవాన్ని ప్రార్థిస్తూ 'ప్రభూ! నేనితడ్ని పగటి వేళ ఆహారానికి (ఇతర వాంఛలకు) దూరంగా



ఉంచాను. కనుక ఇతని (విముక్తి) విషయంలో నా సిఫారసు అంగీకరించు' అని అంటుంది. అలాగే ఖుర్ఆన్ కూడా దైవాన్ని వేడుతూ 'ప్రభూ! నేనితడ్ని రాత్రివేళ నిద్ర పోకుండా చేశాను. (ఇతడు నన్ను చదువుతూ లేదా వింటూ జాగారం చేశాడు.) కనుక ఇతని విషయంలో నా సిఫారసు అంగీకరించు' అని అంటుంది. ఈవిధంగా చివరికి వారిద్దరి సిఫారసు ఆమోదించ బడుతుంది." (మిష్కాత్ షరీఫ్)

దైవప్రవక్త (సల్లం) వేరొక హదీసులో ఇలా ప్రవచించారు: "ఖుర్ఆన్ పఠించండి. ఇది ప్రళయదినాన తనను పఠించినవారి విముక్తి కోసం సిఫారసు చేస్తుంది." మరో సందర్భంలో "(ముఖ్యంగా) బఖరా, అలిఇమ్రాన్ సూరాలు పఠిస్తూ ఉండండి. ఇవి ఎంతో ప్రకాశవంతమైన సూరాలు. ప్రళయదినాన ఇవి రెండు మేఘాలుగా లేదా రెండు పందిళ్ళుగా లేదా రెండు పక్షుల గుంపులుగా వచ్చి తమను పఠించినవారి కోసం ఎంతగానో సిఫారసు చేస్తాయి" అని చెప్పారు ఆయన. (ముస్లిం)

## నరకం మీదుగానే స్వర్గానికి దారి-46

దేవుడు పరలోకంలో మానవుని సృజించడానికి ముందే స్వర్గనరకాలు తయారు చేశాడు. ప్రళయదినాన కర్మవిచారణ ముగిసిన తరువాత సత్యతిరస్కారులు, కపట విశ్వాసులు నరకంలోకి త్రోయబడతారు. పాపాలు చేసిన విశ్వాసులు కొంతకాలం పాటు నరకంలో శిక్ష అనుభవించిన తర్వాత దైవానుగ్రహంతో, దైవప్రవక్తలు, ఇతర పుణ్యాత్ముల సిఫారసుతో వారికి నరకం నుండి విముక్తి లభిస్తుంది.

"(వినండి!) మీలో ఎవరూ నరకం మీదుగా పోనివారంటూ ఉండరు. ఇదొక నిర్ణీత విషయం. ఈ పని నెరవేర్చవలసిన బాధ్యత నీ ప్రభువు మీద ఉంది. ఆ సందర్భంలో మేము దైవభీతిపరాయణులను (నరకంలో పడకుండా) రక్షిస్తాము. దుర్మార్గుల్ని మాత్రం అందులో పడిపోవడానికి వదిలేస్తాము." (ఖుర్ఆన్-19:71,72)

"నరకం మీద (పుల్సిరాత్) వంతెన ఏర్పాటు చేయబడుతుంది. దైవప్రవక్తలలో అందరికన్నా ముందు నేను నా అనుచర సమాజాన్ని తీసుకొని దానిని దాటుతాను. ఆ రోజు దైవప్రవక్తలు మాత్రమే మాట్లాడుతారు. వారయినా 'దేవా! (మమ్మల్ని) క్షేమంగా ఉంచు' అని మాత్రమే అంటారు. నరకంలో సాదాన్ (అనే ఒక విధమైన ముండ్ల చెట్టు) ముండ్లులా వంకర్లు తిరిగిన పొడవాటి మేకులుంటాయి. వాటి పొడవు దేవునికి మాత్రమే తెలుసు. ఆ మేకులు వంతెన మీద నడిచే వారిలో కొందర్ని (అవిశ్వాసుల్ని) వారి దుష్కర్మల కారణంగా పట్టి నరకంలోకి లాగి పడవేసేందుకు ప్రయత్నిస్తాయి. దాంతో కొందరు హతమయి నరకంలో పడిపోతారు. (ఇక ఎన్నటికీ అందులో నుంచి బయటపడలేరు.) మరికొందరు (విశ్వాసులు) తెగి నరకంలో పడిపోతారు. తరువాత కొంతకాలానికి అందులో నుంచి విముక్తి పొందుతారు." (బుఖారి, ముస్లిం)

ఏమైనప్పటికీ సత్యాన్ని విశ్వసించి సత్కర్మలు ఆచరించిన పుణ్యాత్ములు సైతం స్వర్గానికి పోవాలంటే నరకం మీదుగానే పోవలసి ఉంటుంది. దాని కోసం దేవుడు

నరకం మీద ఒక వారధి (వంతెన) నిర్మించాడు. ఈ వారధినే "పుల్‌సిరాత్" అనంటారు. హదీసులో దీన్ని సిరాత్ అని మాత్రమే చెప్పబడింది.

ఈ వారధి దాటాలంటే దైవభీతిపరులయిన విశ్వాసులకు చాలా సులభమే. వారి పాలిట ఇది పాలరాయిరోడ్డే. కాదు, అంతకంటే ఎన్నోరెట్లు మెరుగైన రోడ్డు. కాని పాపాత్ము లైన విశ్వాసులకు మాత్రం ఈ వారధి దాటడం చాలా కష్టం. కాదు, అసాధ్యం. ఇది వారి పాలిట భయంకరమైన కొండచిలువలు, విషపురుగులు, క్రూరజంతువులతో, అడుగడుగునా ముండ్లచెట్లతో నిండి కటికచీకటి ఉండే అడవిదారి. కాదు, అంతకంటే ఎన్నోరెట్లు భయంకరమైన, అతి నికృష్టమైన, ఎంతో ప్రమాదభరితమైన దారి.

ఆ వారధి కాలుతీసి పెట్టలేనంత జారుడుగా ఉంటుంది. నరకంలోని పెద్దపెద్ద పటకార్లు, పొడవైన ముళ్ళుండే పెద్దపెద్ద చెట్లు ఆ వారధి అంచుల పైదాకా వచ్చి ఉంటాయి. పైగా నరకంలోని మరికొన్ని భయానక వస్తువులు కూడా వారధి అంచులకు పైదాకా వచ్చి వారధి మీద నడిచేవారిని నరకంలోకి లాగేయడానికి కాచుకొనిఉంటాయి.

పాపాత్ములైన విశ్వాసులలో కొందరు అడుగడుగునా ఉండే ఈ ప్రమాదాలను ఎదుర్కొంటూ, గాయాలతో పడుతూ లేస్తూ చివరికి ఎలాగో ఆ వారధి దాటి స్వర్గానికి చేరుకుంటారు. నరకం నొసట రాయబడిన మరికొందరు ఆ ప్రమాదాలను ఎదుర్కోలేక నరకంలో పడిపోతారు. అలా నరకంలో పడిపోయినవారు కొంత కాలానికి తమతమ కర్మలను బట్టి దైవప్రవక్తలు, దైవదూతలు, దైవభీతి పరాయణులైన విశ్వాసుల సిఫార సుతో, దైవానుగ్రహంతో నరకం నుంచి బయటపడి స్వర్గానికి చేరుకుంటారు.

పోతే దుష్కర్మలకు దూరంగా ఉంటూ సదా సత్కర్మలు ఆచరించిన దైవభీతి పరాయణులు ఆ వారధి మీద ఎలాంటి ప్రమాదానికి గురికాకుండా క్షేమంగా స్వర్గానికి చేరుకుంటారు. అయితే సుగుణ సంపత్తి, పుణ్యకర్మల రీత్యా వారు వివిధ రకాలవారు ఉంటారు కాబట్టి నరకం మీదుండే ఈ వారధి దాటే పరిస్థితులు కూడా విభిన్నంగా ఉంటాయి. వారిలో కొందరు రెప్పపాటులో, కొందరు మెరుపు వేగంతో, కొందరు వాయు వేగంతో, కొందరు పక్షి వేగంతో, మరికొందరు అశ్వ వేగంతో, ఇంకొందరు ఒంటె వేగంతో ఆ వారధి దాటి స్వర్గానికి చేరుకుంటారు.

**జ్యోతి పంపిణీ :** విశ్వాసులు పుల్‌సిరాత్ (వారధి) దాటడానికి ముందు వారికి జ్యోతులు ఇవ్వబడతాయి. ఈ జ్యోతుల వెలుగు వారివారి కర్మలను బట్టి రకరకాలుగా ఉంటుంది. ఇది వారధి మీదుండే చీకటిని పారదోలుతూ స్వర్గానికి దారిచూపే కరదీపిక వంటిది. విశ్వాసులలో కొందరి జ్యోతి కొండంత వెలుగునిస్తుంది. మరికొందరి జ్యోతి ఖర్జూరపు చెట్టంత వెలుగు నిస్తుంది. అన్నిటికంటే తక్కువ వెలుగునిచ్చే జ్యోతి బలహీన విశ్వాసికి ఇవ్వబడుతుంది. దాని వెలుగు మిణుకు మిణుకుమంటూ బొటన వ్రేలంత ఉంటుందని, అది ఒక్కోసారి ఆరిపోతూ వెలుగుతూ ఉంటుందని హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) అన్నారు. (దుర్రెమన్సూర్)



"ఆరోజు దేవుడు తన ప్రవక్తకు, అతనితోపాటు విశ్వసించినవారికి ఎలాంటి అవమానాలకు గురిచేయడు. వారి జ్యోతి వారిముందు కుడివైపు పరుగెత్తుతూ ఉంటుంది. అప్పుడు వారు 'ప్రభూ! మా జ్యోతిని మా కోసం పరిపూర్ణం(గా కాంతి నిచ్చేలా) చెయ్యి. మమ్మల్ని క్షమించు. నిస్సందేహంగా నీవు ప్రతిదానిపై అదుపు కలిగివున్నావు' అని ప్రార్థిస్తారు." (ఖుర్ఆన్-66:8)

"ఆరోజు విశ్వసించిన స్త్రీపురుషుల ముందు, వారి కుడివైపు వారి జ్యోతి పరు గిడుతూఉండటం నీకు కన్పిస్తుంది. 'ఈరోజు మీకో గొప్పశుభవార్త!' అని వారికి చెప్ప బడుతుంది. (అదే) సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలు. ఆ స్వర్గవనాలలో వారు శాశ్వతంగా ఉంటారు. ఇదే గొప్పవిజయం, అపూర్వ సాఫల్యం." (ఖుర్ఆన్-57:12)

**కారుచీకటిలో కపటవిశ్వాసులు :** వారధి దాటేవారిలో విశ్వాసులతో పాటు కపటులు కూడా ఉంటారు. కాని వారా కారుచీకటిలో తచ్చాడుతూ వారధి దాటలేక వారధి మీదుండే ప్రమాదాలకు గురై నరకంలో పడిపోతారు. ఇక అక్కడే వారు నానా యాతనలు అనుభవిస్తూ శాశ్వతంగా పడిఉంటారు. కపటులు ఆ కారుచీకటిలో ముందుకు పోలేక విశ్వాసుల సహాయం అడుగుతారు. కాని విశ్వాసుల నుండి వారికి ఎలాంటి సహాయం లభించదు. వారుభయుల మధ్య జరిగే సంభాషణ ఇలా ఉంది:

"ఆరోజు కపటవిశ్వాసులైన స్త్రీ పురుషుల పరిస్థితి (చాలా దయనీయంగా ఉంటుంది). వారు (చీకటిలో తచ్చాడుతూ) "కాస్త మావైపు చూడండి. మీజ్యోతి వల్ల మాకూ కొంచెం ప్రయోజనం కలుగుతుంది" అంటారు (నిజమైన) విశ్వాసులతో. కాని "వెనక్కి వెళ్ళి మీజ్యోతి ఎక్కడుందో వెతుక్కోండి" అని సమాధానం లభిస్తుంది వారికి. తర్వాత వారుభయుల మధ్య ఒక అడ్డుగోడ ఏర్పడుతుంది. దానికి ఒక తలుపు ఉంటుంది. ఆ తలుపు వెనుక లోపలి వైపున (దైవ)కారుణ్యం ఉంటుంది. దాని వెలుపల (నరక) యాతనలు ఉంటాయి." (ఖుర్ఆన్-57:13)

"వారు విశ్వాసుల్ని కేకలుపెట్టి పిలుస్తూ "మేము (ప్రపంచంలో) మీతోపాటు లేమా?" అంటారు. దానికి విశ్వాసులు ఇలా అంటారు:

"ఉన్నారు, కాని మిమ్మల్నిమీరు పరీక్షకు గురిచేసుకొని ప్రమాదం కొనితెచ్చుకున్నారు. గోడమీది పిల్లివాటంగా వ్యవహరించారు. అనుమానంలో పడిపోయారు. లేనిపోని ఆశలు పెంచుకొని ఆత్మవంచనకు పాల్పడ్డారు. దేవుని ఆజ్ఞ వచ్చేదాకా మీరు అదే స్థితిలో ఉన్నారు. పరమ మోసగాడు (షైతాన్) మిమ్మల్ని దేవుని విషయంలో చివరి క్షణం వరకూ మోసగిస్తూనే ఉన్నాడు. (వాడి వలలో నుంచి బయటపడలేక పోయారు.) అందువల్లనే ఈరోజు (మీకీ దుర్గతి పట్టింది. ఇక) మీ నుండి ఎలాంటి పరిహారం స్వీకరించబడదు. బహిరంగంగా (సత్య)తిరస్కారానికి పాల్పడినవారి నుండి కూడా (పరిహారం స్వీకరించ బడదు). కనుక మీకిక నరకమే నివాసస్థలం. అక్కడే మీకు తగిన శాస్తి జరుగుతుంది. అది చాలా ఘోరమైన దుష్పర్యవసానం." (ఖుర్ఆన్-57:14,15)

ఈవిధంగా కపటవిశ్వాసులు కటికచీకటిలో ముందుకు నడవలేక అడుగడుగునా అనేక ప్రమాదాలకు గురయి నరకంలో పడిపోతారు. సత్యతిరస్కారుల మాదిరిగా వారు కూడా నరకంలో శాశ్వత యాతనలు అనుభవిస్తూ ఉంటారు.

## దైవజ్యోతి-దివ్యదర్శనం-47

మానవుడు తనను సృష్టించిన దేవుడ్ని చూడగల్గుతాడా? అది ఇహలోకంలో మాత్రం ఎన్నటికీ సాధ్యంకాదు. ఎవరైనా దేవుడ్ని చూశానని చెబితే అతను పచ్చి అబద్ధం చెబుతున్నాడన్న మాట. దైవదర్శనం మరణానంతరం పరలోకంలోనే సాధ్యమవుతుంది. అదైనా విశ్వాసులకు మాత్రమే స్వర్గప్రవేశం తరువాత ఆ దర్శనభాగ్యం సాధ్యమవుతుంది. స్వర్గప్రవేశానికి పూర్వం ప్రళయదినాన హషర్ మైదానంలో విశ్వాసులకు దైవజ్యోతిని దర్శించే భాగ్యం కూడా లభిస్తుంది.

హజ్రత్ అబూ హురైరా, అబూ సయీద్‌ల (రజి) ఉల్లేఖనం: మేము దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ "దైవప్రవక్తా! మేము ప్రళయదినాన మా ప్రభువును చూడగల్గుతామా?" అని అడిగాము. ఆయన "తప్పకుండా చూడగల్గుతారు. ఆకాశం మేఘావృతం కాకుండా నిర్మలంగా ఉన్నప్పుడు సూర్యచంద్రుల్ని చూడటంలో మీకేమైనా ఇబ్బంది కల్గుతుందా?" అన్నారు. దానికి మేము "ఎలాంటి ఇబ్బంది కలగదు" అన్నాం.

"అదేవిధంగా ప్రళయదినాన మీరు మీ ప్రభువును దర్శించుకోవడంలో కూడా ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఇబ్బంది ఏదైనా ఉంటే ఈనాడు సూర్యచంద్రుల్ని చూడటంలో ఎంత ఇబ్బంది ఉంటుందో ఆరోజు అంతే ఇబ్బంది ఉంటుంది" అన్నారు దైవప్రవక్త (సల్లం). ఆ తరువాత ఆయన ఇలా తెలియజేశారు:

"ప్రళయదినాన ఒక ప్రకటనకర్త వచ్చి "ఏ వర్గంవారు ఏ శక్తిని ఆరాధిస్తుండేవారో వారంతా తమతమ ఆరాధ్యదైవాల వెనుక వెళ్ళి నిలబడాలి" అని ప్రకటిస్తాడు. అప్పుడు కొందరు సూర్యుని వెనుక, కొందరు చంద్రుని వెనుక, మరికొందరు విగ్రహాల వెనుక, ఇంకొందరు శిలువ వెనుక వెళ్ళి నిలబడతారు. ఇలా మిథ్యాదైవాల్ని పూజించినవారంతా మిథ్యాదైవాల దగ్గరికి వెళ్ళి నిల్చుంటారు. (విగ్రహారాధకులంతా విగ్రహాలతో పాటు నరకంలో పడిపోతారు.) చివర్లో ఏకదైవారాధకులైన ముస్లింలు ఉండిపోతారు. వారిలో పుణ్యాత్ములు, పాపాత్ములు, కపటులు ఉంటారు. అలాగే గ్రంథప్రజల (యూదులు, క్రైస్తవుల)లో (ఏకదైవారాధకులైనవారు) కూడా కొందరు ఉండిపోతారు.

**యూదులు, క్రైస్తవుల పరిస్థితి :** ఆ తరువాత మానవుల ముందుకు నరకం తీసుకు రాబడుతుంది. అది వారికి (దూరం నుంచి) ఎండమావిలా కన్పిస్తుంది.

అప్పుడు యూదుల్ని పిలిచి "మీరు ఎవరిని ఆరాధించేవారు" అని అడుగుతారు. దానికి వారు "మేము దేవుని కుమారుడైన ఉజైర్‌ని పూజించేవాళ్ళం" అని చెబుతారు. "మీరు అబద్ధమాడుతున్నారు. దేవుడు ఎవరినీ భార్యగాగాని, సంతానంగాగాని చేసుకోలేదు... సరే, ఇప్పుడు మీకేం కావాలి?" (అని అడుగుతారు దైవదూతలు.)



"మాకు దాహమేస్తోంది. మంచినీళ్ళు ఇప్పించండి" అంటారు యూదులు.

అప్పుడు వారికి నరకం వైపు చూపిస్తూ 'అక్కడకెళ్ళి తాగండ'ని చెప్పబడుతుంది. ఆ వెనువెంటనే వారు నరకం వైపుకెళ్ళి అందులో పడిపోతారు.

ఆ తరువాత క్రైస్తవుల్ని నిలదీసి "మీరెవరిని ఆరాధించేవారు?" అని ప్రశ్నిస్తారు. వారు "మేము దేవుని కుమారుడు మసీహ్ (ఈసా)ని ఆరాధించేవాళ్ళం" అనంటారు.

"మీరు అబద్ధమాడుతున్నారు. దేవుడు ఎవరినీ భార్యగాగాని, సంతానంగాగాని చేసుకోలేదు... సరే, ఇప్పుడు మీకేం కావాలి?"

"మాకు దాహమేస్తోంది. మంచినీళ్ళు ఇప్పించండి" అంటారు క్రైస్తవులు.

అప్పుడు వారికి నరకం వైపు చూపిస్తూ 'అక్కడకెళ్ళి తాగండ'ని చెప్పబడుతుంది. ఆ వెనువెంటనే వారు నరకం వైపుకెళ్ళి అందులో పడిపోతారు.

యూదులు, క్రైస్తవులు కూడా నరకంలో పడిపోయిన తర్వాత హషర్ మైదానంలో ఏకేశ్వరోపాసకులు (ముస్లింలు) మాత్రమే ఉండిపోతారు. వారిలో పుణ్యాత్ములు, పాపాత్ములు, కపటులు ఉంటారు. వారి ముందు దైవజ్యోతి ప్రదర్శించ బడుతుంది.

**ముస్లింల పరిస్థితి :** అప్పుడు (జ్యోతి నుండి దైవవాణి) ఇలా విన్పిస్తుంది: "అందరూ వెళ్ళిపోయారు కదా! ఇక మిమ్మల్ని ఏ విషయం ఇక్కడ నిలిపి ఉంచింది?"

దానికి వారిలా అంటారు: "మాకు వారి అవసరం ఎంతో ఉన్నప్పటికీ మేము (సత్యం కోసం ఇహలోకంలోనే) వారి నుండి ఆనాడే వేరయిపోయాము. అదీగాక ప్రతి వర్గమూ తాను ఆరాధించిన దైవం దగ్గరికి వెళ్ళి నిలబడాలని ప్రకటకర్త చేసిన ప్రకటన విన్నాము. అందువల్ల మేము ఇక్కడే ఉండిపోయి మా ప్రభువు రాక కోసం ఎదురు చూస్తున్నాము."

"సరే వినండి. నేనే మీ ప్రభువును" జ్యోతి నుండి దైవవాణి ధ్వనిస్తుంది.

ముస్లింలు ఆ జ్యోతిని చూసి అదేదో దైవేతరశక్తి అని భావిస్తున్నందున ఈమాట వినగానే "మేము దేవుని శరణుగోరుతున్నాం. మేము దేవుని దైవత్వంలో మరెవరినీ చేర్చి ఆయనకు సాటికల్పించలేము" అంటారు.

"మీరు మీ ప్రభువుని గుర్తించడానికి ఆయన తరఫున మీ దగ్గర ఏదైనా ఆధారం ఉందా?" అని అడుగుతాడు దేవుడు.

దానికి ముస్లింలు ఉందని చెబుతారు. ఆ తరువాత తెర తొలగించబడిన ఓ విశిష్ఠ జ్యోతి వారి ముందు ప్రత్యక్షమవుతుంది. ఇహలోకంలో ఉన్నప్పుడు మనస్ఫూర్తిగా దేవుని సన్నిధిలో సాష్టాంగప్రణామం చేస్తుండే ముస్లింలు ఆ విశిష్ఠ జ్యోతిని చూడగానే అప్రయత్నంగా సాష్టాంగపడతారు.

ఆతర్వాత వారు సాష్టాంగప్రణామం నుండి లేచి తలలు పైకెత్తి చూస్తారు. అప్పుడు వారికి మొదట చూపబడిన సాధారణ జ్యోతి మాత్రమే కన్పిస్తుంది. అందులో నుంచి దైవవాణి తిరిగి ధ్వనిస్తుంది: "నేను మీ ప్రభువును." ఈమాట వినగానే ముస్లింలు "ఔను, మీరే మా ప్రభువు" అంటారు.

అయితే పేరుప్రతిష్ఠల కోసం దేవుడ్ని ప్రార్థిస్తూ ఆయన ముందు సాష్టాంగ ప్రణామం చేస్తుండే కపటముస్లింలు మాత్రం ఆరోజు సాష్టాంగపడలేరు. దేవుడు వారి నడుముల్ని బల్లపరుపుగా చేసేస్తాడు. దాంతో వారు సాష్టాంగపడటానికి ప్రయత్నించగానే వంగలేక బొక్కబోర్లా పడిపోతారు.

ఆ తర్వాత నరకం మీద వారధి (పుల్‌సిరాత్) ఏర్పాటు జరుగుతుంది. ఆ వారధి పైనుంచి అందరూ నడవాల్సిందిగా (దైవదూతలు) చెబుతారు. దైవప్రవక్తలందరిలో కెల్లా నేనే మొట్టమొదట నా అనుచరసముదాయాన్ని వెంటబెట్టుకొని ఆ వారధి దాటుతాను. ఆరోజు దైవప్రవక్తలు తప్ప మరెవరూ మాట్లాడలేరు. వారయినా "దేవా! రక్షించు. (మమ్మల్ని నరకాగ్ని నుండి) రక్షించు" అని మాత్రమే అంటారు.

ప్రవక్త అనుచరులు వారధి ప్రస్తావన వినగానే "దైవప్రవక్తా! ఈ వారధి సంగతి ఏమిటీ?" అని అడిగారు. దైవప్రవక్త (స) తిరిగి ఇలా చెప్పడం ప్రారంభించారు:

"అదొక జారుడు చోటు. దాని మీదనుంచి దాటిపోయేవారు (కొందరు) జారి పడతారు. (మరికొందరు) నిలదొక్కుకుంటారు. వారధి దాటేవారిని లాగి (నరకంలో) పడేయడానికి మొనదేలిన కొండీలు వంటి పెద్ద పెద్ద ముళ్ళు దాని పైకొచ్చి ఉంటాయి. ఇవి నజద్‌లో ఉండే సాదాన్ చెట్ల ముళ్ళులా చాలా పొడవుగా, లావుగా ఉంటాయి. విశ్వాసులలో ఆ వారధిని కొందరు రెప్పపాటులో, కొందరు మెరుపు వేగంతో, కొందరు వాయువేగంతో, మరికొందరు అశ్వవేగంతో, ఇంకొందరు (ఇతర) వాహనాల వేగంతో దాటిపోతారు. అలా దాటేవారిలో కొందరు ఎలాంటి ప్రమాదానికి గురికాకుండా క్షేమంగా బయటపడతారు. మరికొందరు గాయపడి నరకాగ్నిలో పడిపోతారు.

**నరకంలో పడిపోయే ముస్లింలు :** (కర్మవిచారణ, వారధి దాటివేత ముగిసిన) తరువాత దేవుడు తన దూతలను పిలిచి, (ఏక)దేవుడ్ని ఆరాధించిన వారందర్నీ నరకం నుండి బయటికి తీయండని ఆదేశిస్తాడు. అప్పుడు దైవదూతలు నరకంలో పడ్డవారిలో సజ్దా చిహ్నాలు ఉన్నవారిని గుర్తిస్తారు. సజ్దా చిహ్నాం ఉండే శరీర భాగాల్ని కాల్చకూడదని దేవుడు నరకాగ్నిని వారిస్తాడు. అది తప్ప మానవుని మిగిలిన దేహమంతటినీ నరకాగ్ని దహించి వేస్తుంది. ఈ కారణంగానే దైవదూతలు ఏకదైవారాధకులైన వారిని ఆ చిహ్నాలను బట్టి గుర్తించి నరకాగ్ని నుండి బయటికి తీస్తారు.

ఆరోజు (దైవభీతిపరాయణులైన) విశ్వాసులు తాము వారధి దాటగలిగినప్పటికీ తమ సోదర విశ్వాసుల్ని కాపాడేందుకు దేవుడ్ని పరిపరి విధాలా ప్రార్థిస్తారు. ఈరోజు మీరు స్పష్టమైన ఒక హక్కు గురించి నన్ను ఎంత గట్టిగా అడుగుతారో, ఆరోజు వారు



తమ సోదరుల్ని కాపాడుకోవడానికి అంతకంటే గట్టిగా దేవుడ్ని అడుగుతారు.

వారు దైవసన్నిధిలో తమ కోరికను వెలిబుచ్చుతూ "ప్రభూ! మా ఈ సోదరులు మాతోపాటు నమాజ్ చేస్తుండేవారు. ఉపవాసాలు పాటిస్తుండేవారు. ఇతర సత్కార్యాలు కూడా చేస్తుండేవారు. అలాంటి వీరు నరకంలో ఎలా పడ్డారో మాకు అర్థం కావడంలేదు. (ప్రభూ!) వీరిని క్షమించు" అని ప్రార్థిస్తారు.

దేవుడు వారి మొరాలకించి "సరే వెళ్ళండి. హృదయంలో ఒక్కదీనారు విలువంత విశ్వాసం ఉన్నవారిని సైతం నరకం నుండి బయటికి తీసుకోండి" అని అంటాడు.

అప్పుడు వారు తమ సోదర విశ్వాసుల దగ్గరకు వెళ్తారు. (వారిపై నరక ప్రభావం ఉండదు.) నరకంలోని విశ్వాసులలో కొందరు పాదాల వరకు, మరికొందరు మోకాళ్ళ వరకు అగ్నిలో చిక్కుకొని ఉంటారు. అయితే అగ్ని వారి ముఖాలను మాడ్చి వికృతంగా చేయకుండా దేవుడు దాన్ని నిషేధిస్తాడు. దాంతో ఈ విశ్వాసులు తాము గుర్తించిన వారందర్నీ నరకం నుండి బయటికి తీస్తారు.

ఆ తరువాత వారు దేవుని సన్నిధికి వచ్చి మళ్ళీ విన్నవించుకుంటారు. అప్పుడు దేవుడు "సరే వెళ్ళండి. హృదయంలో అర్ధ దీనారంత విలువగల విశ్వాసమున్న వారిని కూడా నరకం నుండి తీసేసుకోండి" అని అంటాడు.

ఈ అనుమతితో వారు నరకానికి వెళ్ళి తాము గుర్తించగలిగిన వారందర్నీ నరకం నుండి బయటికి తీస్తారు. అలా తీసిన తరువాత దేవుని సన్నిధికి వచ్చి మళ్ళీ విన్నవించుకుంటారు. దానికి దేవుడు "సరే వెళ్ళండి హృదయంలో అణుమాత్రం విశ్వాసం (ఈమాన్) ఉన్నవారిని కూడా నరకం నుండి తీసేసుకోండి" అనంటాడు. వారు మూడవ సారి వెళ్ళి తాము గుర్తించగలిగిన వారందర్నీ నరకం నుండి తీసి రక్షిస్తారు.

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఈ సందర్భంగా మాట్లాడుతూ "మీకు నా మాటల మీద నమ్మకం లేకపోతే 'దేవుడు ఎవరికీ అణుమాత్రం అన్యాయం కూడా చేయడు. ఎవరైనా ఒక సత్కార్యం చేస్తే దేవుడు దానికి రెట్టింపు పుణ్యఫలం ప్రసాదిస్తాడు' అనే ఖుర్‌ఆన్ సూక్తి చదువుకోండి" అని అన్నారు.

ఈవిధంగా (నరకంలోని ముస్లింలను రక్షించడానికి) దైవప్రవక్తలు, దైవదూతలు, విశ్వాసులు అంతా సిఫారసు చేసిన తరువాత చివర్లో దేవుడు "ఇక నా సిఫారసు మిగిలివుంది" అంటాడు. ఆతర్వాత ఆయన నరకం నుండి కొంతమందిని బయటికి తీస్తాడు. వారు అప్పటికే బాగా కాలిపోయి బొగ్గుగా మారివుంటారు.

(దైవదూతలు) వారిని తీసి స్వర్గం సరిహద్దులో ఉండే ఒక సెలయేరులో పడవేస్తారు. లేక ఆందులోని అమృతాన్ని వారిపై చిలికిస్తారు. ఆ సెలయేరునీటి ప్రభావంతో నదిఒడ్డు మీది విత్తనాలు మొలకెత్తి సస్యశ్యామలమైనట్లు వారు నూతన శక్తిసౌందర్యాలతో నవనవలాడుతూ లేస్తారు.

మీరు అనేకసార్లు చెట్ల పక్కనో, రాళ్ళ పక్కనో విత్తనాలు మొలకెత్తడాన్ని చూసే ఉంటారు. అలా మొలకెత్తే మొక్కల్లో ఎండ తగిలే మొక్కలు పచ్చగా ఉంటాయి. ఎండ తగలకుండా నీడ పడే మొక్కలు పాలిపోతాయి. అదేవిధంగా వారు సెలయేరు నుండి ముత్యాల్లా మెరిసిపోతూ బయటికి వస్తారు. కాకపోతే వారి మెడల మీద ఒక మచ్చ ఉండిపోతుంది. ఆ తరువాత వారు స్వర్గంలో ప్రవేశిస్తారు.

అప్పుడు స్వర్గవాసులు వారిని చూసి "వీరు ఎలాంటి పుణ్యకార్యాలు చేయక పోయినా దేవుడు వీరికి (నరకం నుండి) విముక్తి కలిగించాడు" అని అంటారు.

దేవుడు అలా స్వర్గంలో ప్రవేశించినవారితో "మీరిక్కడ చూస్తున్న (స్వర్గసంప)దంతా మీదే. అంతేకాదు, ఇంకా అంత (సంపద) అదనంగా మీకు లభిస్తుంది" అని అంటాడు.

(సహీబుఖారి: 10-(అజాన్), 97-(తౌహీద్) ప్రకరణల ఆధారంగా)

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "చేసుకున్న పాపాలకు శిక్షగా అనేకమందిని నరకాగ్ని దహిస్తుంది. తరువాత దేవుడు తన కారుణ్యానుగ్రహాలతో వారిని స్వర్గానికి పంపుతాడు. వారు నరకవాసులని పిలవబడతారు." (బుఖారి షరీఫ్)

వారు నరకవాసులని పిలువబడటానికి కారణం వారిని కించపరచాలన్న ఉద్దేశ్యం కాదు. నరకయాతనలు గుర్తుచేసి స్వర్గసౌఖ్యాన్ని పెంపొందింపజేయడానికి మాత్రమే వారిని నరకవాసులని పిలవడం జరుగుతుంది.

**శిక్షకు ముందే గగ్గోలు పెట్టేవారు :** హజ్రత్ అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలియజేశారు: "నరకానికి పోయేవారిలో ఇద్దరు (ముస్లింలు) పెద్దగా అరుస్తూ గగ్గోలు పెడ్తారు. వారిద్దరిని తీసుకురండని (దైవదూతల్ని) ఆదేశిస్తాడు దేవుడు. వారొచ్చిన తరువాత 'మీరిద్దరు అంత పెద్దగా అరుస్తారెందుకు?' అని ప్రశ్నిస్తాడు. దానికి వారిద్దరు 'మీరు మమ్మల్ని కరుణిస్తారని ఇలా అరుస్తున్నాం' అంటారు. దేవుడు ఈమాటలు విని 'నిస్సందేహంగా నా కారుణ్యం మీ ఇద్దరిపై ఉంది. సరే, మీరిద్దరు మళ్ళీ అక్కడికే వెళ్ళి (నరకంలో) పడండి' అని అంటాడు.

వెంటనే వారిద్దరిలో ఒకతను వెళ్ళి తనను తాను నరకంలో పడవేసుకుంటాడు. కాని దేవుని ఆదేశంతో నరకం అతని కోసం చల్లబడుతుంది. (అతడ్ని కాల్చదు.) రెండోవాడు అక్కడే నిలబడి ఉంటాడు. తననుతాను నరకంలో పడవేసుకోడు. దేవుడు అతడ్ని ఉద్దేశించి 'నువ్వెందుకు నరకంలోకి పోయి పడలేదు? ఏ విషయం నిన్ను నిరోధించింది?" అని అడుగుతాడు. దానికతను సమాధానమిస్తూ 'ప్రభూ! మీరు నన్ను నరకం నుండి తప్పించిన తరువాత ఇక అందులోకి పంపరని నేను ఆశిస్తున్నాను. (అందుకే నేను ఇక్కడే నిలబడిపోయాను.)' అని అంటాడు. దేవుడు ఈమాట విని 'సరే, నీవు ఆశిస్తున్నట్లే జరుగుతుంది, వెళ్ళు' అనంటాడు. తరువాత దేవుని అనుగ్రహంతో వారిద్దరిని స్వర్గానికి పంపడం జరుగుతుంది." (తిర్మిజి)



# షైతాన్, వాడి అనుచరగణం-48

మంచి, చెడులకు సంబంధించిన స్పృహ మానవుని ప్రవృత్తిలోనే వేరుగొని ఉంది. మంచికి ప్రతిరూపం దేవుడు. చెడుకు ప్రతిరూపం షైతాన్. దేవుడు ప్రసాదించిన స్వేచ్ఛను మానవుడు దుర్వినియోగం చేయకుండా ఆయన చూపిన రుజుమార్గం అనుసరిస్తే అతను పరలోకంలో మోక్షానికి అర్హుడవుతాడు. అలాకాకుండా అతను విశృంఖుల స్వేచ్ఛతో మనోవాంఛలకు బానిసయి, చెడుకు ప్రతిరూపమైన షైతాన్ ఆడించినట్లు ఆడుతూ, సృష్టితాలను పూజిస్తూ అవినీతి, అధర్మకార్యకలాపాలలో మునిగిపోతే పరలోకంలో దైవాగ్రహానికి గురయి నరకకూపంలో పడిపోతాడు.

"పాపాత్ములారా! ఈరోజు మీరు (మా నుంచి) తొలగి దూరంగా ఉండండి... ఆదం సంతానమా! షైతాన్‌ని ఆరాధించవద్దని, వాడు మీకు బహిరంగ శత్రువని నేను మిమ్మల్ని హెచ్చరించలేదా? నన్నే ఆరాధించాలని, అదే రుజుమార్గమని ఉపదేశించ లేదా? అయినా వాడు మీలో అత్యధికమందిని దారితప్పించాడు. మీకా (మాత్రం) జ్ఞానం లేదా? నరకమంటే ఇదే. దీన్ని గురించే మిమ్మల్ని లోగడ హెచ్చరించడం జరిగింది. ఇహలోకంలో అవలంబించిన తిరస్కార వైఖరికి పర్యవసానంగా ఈరోజు మీరు దీనికి సమిధలయి పోండి". (ఖుర్ఆన్–36:59–64)

పై సూక్తిలో 'ఆరాధన' అనే పదాన్ని విధేయతా భావంలో ప్రయోగించబడింది. సాధరణంగా షైతాన్‌ని ఎవరూ పూజించరు. వాడి ఆజ్ఞల్ని మాత్రం పాటిస్తారు. మానవ జీవితంలోని సమస్తరంగాల్లో దేవుడు ప్రవక్తల ద్వారా తన ఆజ్ఞలు జారీచేశాడు. కాని అనేకమంది షైతాన్ ప్రేరణతో దేవుని ఆజ్ఞలు త్రోసిపుచ్చి, ఇతరుల ఆజ్ఞలు పాటిస్తారు.

ఉదాహరణకు, వడ్డీ వ్యవస్థను అంతమొందించాలని దేవుడు ఆజ్ఞాపిస్తున్నాడు. షైతాన్ దానికి వ్యతిరేకంగా ప్రచారంచేస్తూ, వడ్డీ వల్ల బోలెడు లాభాలున్నాయని; అసలీ వడ్డీ వలనే పేదవాడి నడ్డి విరగొట్టయినా సరే నువ్వు మేడలు కట్టగలవు, స్వర్గ భోగాలు అనుభవించగలవు అని ధనికుడ్ని ఉసిగొల్పుతాడు; వడ్డీయే దేశప్రగతికి రాచబాట నిర్మిస్తుందని పాలకులను ప్రేరేపిస్తాడు.

ఈ విధంగా మానవుడు షైతాన్‌కు భక్తుడయిపోతాడు. ఒక ఉద్యోగి తన పైఅధికారిని ప్రసన్నం చేసుకొని ప్రయోజనాలు పొందడానికి అతను చెప్పిన పనల్లా, చివరికి అతని సొంతపనులు కూడా చేస్తాడనుకుందాం. అప్పుడు మనం "అతనా... అతను మేనేజర్‌గారి భక్తుడండీ!" అంటాం. అలాగే ఈ సూక్తిలో కూడా దేవుడు, షైతాన్ పట్ల విధేయతా భావాన్ని షైతాన్ ఆరాధనతో పోల్చుతున్నాడు. అంటే దేవుని ఆజ్ఞలకు, ఆయన ప్రవక్త హితవులకు వ్యతిరేకంగా దైవేతరులు ఇచ్చే ఆజ్ఞలు, వారు చేసే హితవులు పాటిస్తే, అది షైతాన్ ఆరాధన క్రిందికి వస్తుందన్నమాట.

"సత్యాన్ని ధిక్కరించిన ప్రతికృతఘ్నుడ్నీ నరకంలో పడేయండి. వాడు సత్కార్యాలు స్వయంగా చేయకపోవడమే గాకుండా ఇతరుల్ని కూడా నిరోధించేవాడు. హద్దుమీరి

పోయేవాడు. తాను అనుమానంలో పడిపోవడమేగాకుండా ఇతరులలో కూడా అనుమానాలు రేకెత్తించేవాడు. దేవునితో పాటు దైవేతరశక్తుల్ని ఆరాధించేవాడు. పడేయండి వాడ్ని భీకర (నరక)యాతనలో" అని ఆజ్ఞవుతుంది.

"(ఆవ్యక్తి దేవుని ముందు షైతాన్‌ని ఆడిపోసుకుంటూ, ఈ దుర్మార్గుడు తన వెంట బడి తనను సర్వనాశనం చేశాడని ఆరోపించినప్పుడు) అతని (ఈ)సహచరుడు (అతని ఆరోపణను ఖండిస్తూ) "మహాప్రభో! నేనితడ్ని తిరుగుబాటుకు ప్రేరేపించలేదు. ఇతను తనంతటతానే మార్గభ్రష్టత్వంలో పడి చాలా దూరం కొట్టుకుపోయాడు" అని అంటాడు. "నా ముందు వాదించకండి. నేను ముందే దుష్పర్యవసానం గురించి మిమ్మల్ని హెచ్చరించాను. నా దగ్గర మాట మారదు. నేను నా దాసులకు అన్యాయం చేసేవాడ్ని కాను" అని సమాధానం లభిస్తుంది. (ఖుర్ఆన్-50:24-29)

"వారక్కడ (అక్కసు వెళ్ళబుచ్చుకుంటూ) 'ప్రభూ! మమ్మల్ని పెడదారి పట్టించిన మానవుల్ని, జిన్నుల్ని మాకు చూపించు. వారిని మేము కాళ్ళక్రింద పడేసి (కసితీరా) తొక్కి అవమానపరుస్తాం' అనంటారు." (ఖుర్ఆన్-41:29)

"తీర్పు ముగిసిన తరువాత షైతాన్ వారితో ఇలా అంటాడు: 'మీకు దేవుడు చేసిన వాగ్దానాలన్నీ నిజమయ్యాయి. కాని నేను చేసిన వాగ్దానాలలో ఒక్కటీ నిజం కాలేదు. అసలు మీచేత బలవంతంగా ఏదైనా చేయించడానికి మీమీద నాకేదయినా శక్తి ఉంటే కదా! నేను మిమ్మల్ని నామార్గం వైపు పిలిచాను. అంతే, మరేమీ చేయలేదు. మీరే నా పిలుపునకు స్పందించి వచ్చారు. కనుక మీరిప్పుడు అనవసరంగా నన్ను నిందించకండి. మిమ్మల్ని మీరే నిందించుకోండి. ఇక్కడ మీగోడు నేను ఆలకించలేను; నాగోడు మీరు ఆలకించలేరు. ఇంతకు ముందు (ఇహలోకంలో) మీరు నన్ను దేవునికి సాటి కల్పించారు. (నాక్కూడా దైవత్వం ఆపాదించారు. అది మీ పనేగాని, నాపని కాదు.) నేను దీన్ని ఖండిస్తున్నాను. అలాంటి దుర్మార్గులకు తప్పకుండా ఘోరమైన శిక్ష పడుతుంది." (ఖుర్ఆన్-14:22)

**గర్విష్టినాయకులు, అంధానుచరులు :** ఇహలోకంలో దేవుడ్ని, ఆయన ప్రవక్త (స)ను విధేయించడానికి తిరస్కరించి, అధర్మపరుల్ని విధేయించిన అవిశ్వాసులు పరలోకంలో ఒకర్నొకరు దూషించుకుంటారు. మా మార్గభ్రష్టత్వానికి మీరంటే మీరేనని పరస్పరం ఆరోపించుకుంటారు. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు గమనించండి:

"ప్రభూ! మేము మా నాయకులు, పెద్దలు చెప్పిన మాటలు విని, వారిని అనుసరించాం. వారు మమ్మల్ని అపమార్గం పట్టించారు. ప్రభూ! వారికి రెట్టింపు శిక్ష విధించు. వారిని తీవ్రంగా శపించు" అనంటారు. (ఖుర్ఆన్-33:68)

"మీకు పూర్వం మానవుల, జిన్నుల వర్గం (ఒకటి) ఎలా నరకంలోకి పోయి పడిందో మీరు కూడా నరకంలోకి పోయిపడండి" అంటాడు దేవుడు. ప్రతి గుంపూ నరకంలో ప్రవేశించేటప్పుడు తనకు ముందు ప్రవేశించిన గుంపును దూషిస్తుంది.



ఇలా అందరూ నరకంలో గుమిగూడిన తర్వాత ముందుచేరిన వర్గాన్ని తరువాత చేరినవర్గం నిందిస్తూ "ప్రభూ! వీరే మమ్మల్ని దారి తప్పించినవారు, కనుక వీరికి రెట్టింపు శిక్ష విధించు" అంటుంది. దానికి "ప్రతి ఒక్కరికీ రెట్టింపు శిక్షే విధించబడింది. ఆ సంగతి మీరు గ్రహించలేకపోతున్నారు" అని సమాధానం లభిస్తుంది.

ఆ తరువాత మొదటి వర్గం రెండో వర్గంతో "(మమ్మల్నెందుకు అనవసరంగా నిందిస్తారు?) మా కంటే మీరేం తక్కువ తిన్నారా? ఇక (మాటలు చాలించి) మీరు చేజేతులా సంపాదించుకున్నదానికి ఫలితంగా నరకయాతనలు చవిచూడండి" అంటుంది. (ఖుర్ఆన్-7:38-39)

"(వారు నరకంలోకి వస్తున్న) తమ అనుచరమూకను చూసి 'ఈ గుంపు మన దగ్గరికి చొరబడి వస్తోంది. వారికి ఎలాంటి స్వాగతం లేదు. వారు కూడా అగ్నిలో పడి మాడవలసిన వారే' (అంటారు). కొత్తగా వచ్చినవారు వీరి మాటలు విని 'కాదు, మీరే (మాకన్న ముందు) కాలి మాడిపోతున్నారు. మీక్కూడా ఎలాంటి స్వాగతం లేదు. మీరే కదా మాకీ దుర్గతి తెచ్చి పెట్టింది! ఎంత చెడ్డ నివాస స్థలమిది!!" అంటారు.

ఆ తరువాత 'ప్రభూ! మాకీ దుర్గతి పట్టించినవాడికి రెట్టింపు నరకయాతనలు పెట్టు' అంటారు వారు. తిరిగి పరస్పరం మాట్లాడుకుంటూ 'మనం ప్రపంచంలో దుర్జనులుగా భావించినవారు ఇక్కడెక్కడా కన్పించడం లేదేమిటీ? మనం వాళ్ళను ఊరికే హేళనచేశామా? లేక మనకు కనపడకుండా ఎక్కడైనా ఉన్నారా?' అంటారు. ఇది యదార్థం. నరకవాసుల మధ్య ఇలాగే పోట్లాటలు జరుగుతాయి." (ఖుర్ఆన్-38:59-64)

"వారిని ఆపండి ప్రశ్నించాలి. ఏమయింది మీకు? ఇప్పుడు మీరు ఒకరికొకరు సహాయం చేసుకోరెందుకు?" ఈరోజు వీరు (మాకు)పూర్తిగా లొంగిపోయారు. ఆ తర్వాత వారు ఒకరివైపొకరు తిరిగి పరస్పరం వాదించుకోవడం మొదలెడతారు. (అనుచరులు తమ నాయకులతో) 'మీరు మాదగ్గరికి అరచేతి వైకుంఠం చూపుతూ, మాయోపాయాలతో వస్తుండేవారు' అంటారు.

వారి నాయకులు దాన్ని ఖండిస్తూ 'అసలు మీరే (సత్యాన్ని) విశ్వసించేవారు కాదు. మేము మీపై ఎలాంటి వత్తిడి తీసుకురాలేదు. మీరు స్వతహాగానే దుర్మార్గులు, తల పొగరు మనుషులు. చివరికి మనమంతా 'మేము శిక్ష చవిచూపిస్తాం' అన్న దైవాజ్ఞకు అర్హులైపోయాము. అందుకే మేము స్వయంగా దారి తప్పడమేగాక మిమ్మల్ని కూడా మాయమాటలతో దారి తప్పించాం' అని చెబుతారు. ఈవిధంగా ఆరోజు వీరంతా (నరక) శిక్ష అనుభవిస్తారు." (ఖుర్ఆన్-37:19-33)

"ఈ ఖుర్ఆన్‌ని, దీనికి పూర్వం అవతరించిన మరే గ్రంథాన్నీ మేము ఎన్నటికీ విశ్వసించం" అంటున్నారు అవిశ్వాసులు (మొండిగా). ఈ దుర్మార్గులు తమ ప్రభువు సన్నిధిలో నిలబడినప్పుడు వారి పరిస్థితి నీవు చూస్తే బాగుంటుంది! అప్పుడు వీరు ఒకరిపైనొకరు నిందారోపణలు చేసుకుంటారు.

ఇహలోకంలో అణచివేయబడినవారు, నాయకులుగా చెలామణయినవారితో “మీరు లేకపోతే మేము విశ్వాసులై ఉండేవాళ్ళం” అంటారు.

అప్పుడు నాయకులుగా చెలామణయినవారు, అణగిమణగి ఉన్నవారితో “మీ దగ్గరికి వచ్చిన సన్మార్గం అవలంబించకుండా మిమ్మల్ని మేము నిరోధించామా? అసలు మీరు స్వతహాగానే పాపాత్ములు” అంటారు.

అణగిమణగి ఉన్నవారు, నాయకులుగా చెలామణయిన వారితో “కాదు, ఇవన్నీ రేయింబవళ్ళు మీరు పన్నిన కుట్రలు, మీరు మమ్మల్ని (నిజ)దేవుణ్ని తిరస్కరించి, ఆయనకు ఇతరుల్ని సాటికల్పించమని చెబుతుండేవారు” అనంటారు.

చివరికి వారు (నరక)యాతనలు ప్రత్యక్షంగా చూడగానే (బెంబేలెత్తిపోయి) లోలోన పశ్చాత్తాపపడతారు. మేము ఇలాంటి తిరస్కారుల మెడలకు గుదిబండ కడ్తాము. వారికి వారి కర్మలకు తగ్గ ప్రతిఫలమే లభిస్తుంది.” (ఖుర్ఆన్-34:31-33)

“వారంతా(ఆరోజు) దేవుని ముందు (దోషులుగా) నిలబడతారు. అప్పుడు వారిలో (శక్తిసామర్థ్యాలు అంతగాలేని) బలహీనులు తమపై పెత్తందారులై కూర్చున్న నాయకులతో “ప్రపంచంలో మేము మీకు విధేయులయి మీ వెనుక నడిచాం కదా; ఇప్పుడు మమ్మల్ని దైవశిక్ష నుండి కాపాడేందుకు ఏమైనా చేయగలరా?” అని అడుగుతారు.

దానికి వారు సమాధానమిస్తూ “దేవుడు గనక మా విముక్తి కోసం ఏదయినా దారి చూపిస్తే మీక్కూడా (ఆ దారి) తప్పకుండా చూపిస్తాం. కాని ఇప్పుడు మనం ఎంత ఏడ్చి మొత్తుకున్నా, ఓర్పు వహించినా ప్రయోజనం లేదు. మనమిక (ఈ నరకకూపం నుంచి) బయటపడే ప్రసక్తే లేదు” అని అంటారు.” (ఖుర్ఆన్-14:21)

## మరణానికి మరణం-49

మరణానికి మరణం వస్తుంది. అంటే కర్మవిచారణ ముగిసిన తరువాత మరణం చచ్చిపోయి శాశ్వతంగా తెరమరుగయి పోతుందన్న మాట. దాంతో స్వర్గవాసులు, నరకవాసులు స్వర్గనరకాలలో శాశ్వతంగా ఉండిపోతారు. వారికిక మరణం అన్నదే రాదు. ఈ విషయాన్ని గురించి ఖుర్ఆన్ ఇలా పేర్కొంటున్నది:

“మా సూక్తులు తిరస్కరించి అవిశ్వాసులయి పోయినవారు నరకవాసులవుతారు. నరకంలోనే వారు (నానాయాతనలు అనుభవిస్తూ) ఎల్లకాలం పడివుంటారు.” (64:10)
“(సత్యాన్ని విశ్వసించి, సత్కర్మలు ఆచరించిన)వారు ఆ స్వర్గవనాలలో శాశ్వతంగా ఉంటారు.” (2:25)

అవిశ్వాసులు ఓసారి నరకంలో పడిపోతే ఇక అందులో నుంచి బయటపడే ప్రసక్తే లేదు. విశ్వాసుల్లో మాత్రం పాపాత్ములైనవారు కొంతకాలం నరకంలో శిక్షలు అనుభవించిన తరువాత స్వర్గానికి పంపబడతారు. మొత్తంమీద ఎవరికీ మరణం ఉండదు.



హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) (మర్యం అధ్యాయంలోని) “తుదితీర్పు జరిగి పశ్చాత్తాపం తప్ప మరేమీ మిగలని రోజు గురించి వారిని భయపెట్టు” అనే సూక్తి పఠించిన తరువాత ఇలా ప్రవచించారు:

“(స్వర్గానికి పోవలసినవారు స్వర్గానికి, నరకానికి పోవలసినవారు నరకానికి చేరుకున్న తర్వాత దైవదూతలు) నల్లమచ్చలు ఉండే తెల్లపొటేలు రూపంలో మృత్యువుని తీసుకొచ్చి స్వర్గనరకాల మధ్య ఉండే గోడ మీద నిలబెడ్తారు.

అప్పుడు ఒక ప్రకటనకర్త ముందుకొచ్చి ‘స్వర్గవాసులారా!’ అని కేకవేస్తాడు. ఈ కేక విని వారు తలెత్తి చూస్తారు. అలాగే అతను ‘నరకవాసులారా!’ అని కేక పెడ్తాడు. ఈ కేక విని నరకవాసులు కూడా తల పైకెత్తి చూస్తారు. అప్పుడు దైవదూతలు స్వర్గనరకవాసుల్ని ఎలుగెత్తి పిలుస్తూ “దీన్ని మీరు గుర్తించారా?” అని అడుగుతారు. దానికి వారు “ఆ... ఇది మృత్యువు” అంటారు.

అప్పుడు దైవదూతలు ఆ పొటేలును పండబెట్టి నరికి చంపుతారు. ఆ తర్వాత వారు స్వర్గవాసులతో “స్వర్గవాసులారా! మీరిక స్వర్గంలోనే శాశ్వత జీవితం గడుపుతారు. మీకు మరణం అనేదే రాదు” అంటారు. అలాగే వారు నరకవాసుల వైపు తిరిగి “నరకవాసులారా! మీరిక నుంచి నరకంలోనే ఎల్లకాలం పడివుండి దుర్భర యాతనలు అనుభవిస్తూ ఉంటారు. మీకు చావు అనేదే రాదు” అంటారు.

ఈ ప్రకటన వినగానే స్వర్గవాసులు ఎంతో సంతోషిస్తారు; నరకవాసులు మరింత రోదిస్తారు.” (బుఖారి, ముస్లిం, తిర్మిజి)

స్వర్గజీవితం శాశ్వతమని, మరణం ఇక ఎన్నటికీ రాదని తెలిసిన తరువాత స్వర్గవాసి మనసు కుదుటపడుతుంది. అతని ఆనందం ద్విగుణీకృత మవుతుంది.

“ఇప్పుడు మనం ఎన్నటికీ చనిపోము కదూ! మనకు రావలసిన మృత్యువేదో ఇదివరకే వచ్చింది. ఇక మనకు ఎలాంటి శిక్షా ఉండదు కదూ!’ అనంటాడు.” (37:59)

అలాగే నరకజీవితం శాశ్వతమని, మరణం ఇక ఉండదని తెలిసిన తరువాత నరకవాసి తీవ్ర ఆందోళన చెందుతాడు. అతని దు:ఖం ద్విగుణీకృతం అవుతుంది. ఎంత కఠినమైన యాతనకు గురయినాసరే అతనికి చావు రాదు. చావు శాశ్వతంగా చచ్చిపోతుంది.

“నలువైపుల నుంచి మృత్యువు అతడ్ని చుట్టుముడ్తుంది. కాని అతను చావడు. దానికి ముందు అతడ్ని చంపుకుతినే మరో యాతన పొంచి ఉంటుంది.” (14:17)

## నరక కూపం-50

నరకం అవిశ్వాసుల్ని, అహంకారుల్ని శిక్షించడానికి తయారుచేయబడిన ఓ భయంకరమైన యాతనా స్థలం. చీకటిమయంగా ఉండే పెద్ద గొయ్యి. అక్కడ అగ్నియాతన

లతో పాటు నానారకాల యాతనలు ఉంటాయి. ఒక నిమిషం గనక మనిషి అందులో పడిపోతే ఐహికజీవితంలో అతను అనుభవించిన సుఖసంతోషాలు, భోగభాగ్యాలన్నీ ఒక్కసారిగా మరచిపోతాడు.

దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: "ప్రళయదినాన నరకాన్ని తీసుకురావడం జరుగుతుంది. దానికి డెబ్భయి వేల పగ్గాలు ఉంటాయి. ప్రతి పగ్గాను డెబ్భయి వేల మంది దైవదూతలు లాగుతుంటారు." (మిష్కాత్)

**స్వర్గనరకాల వాదనలు :** బుఖారి, ముస్లిం హదీసుల్లో అబూహురైరా (రజి) ప్రకారం దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: స్వర్గనరకాల మధ్య వాదోపవాదాలు జరిగాయి-

నరకం మాట్లాడుతూ "నాలో గర్విష్ఠులు, బలవంతులు ప్రవేశిస్తారు. కనుక నీ కంటే నేనే గొప్ప దానిని" అని అన్నది.

స్వర్గం మాట్లాడుతూ "(పోనీలే.) నాలో బలహీనులు, నిస్సహాయులు, ప్రజల దృష్టిలో విలువలేని వాళ్ళు మాత్రమే ప్రవేశిస్తారు" అని అన్నది.

అప్పుడు దేవుడు జోక్యం చేసుకుంటూ స్వర్గంతో "నీవు నా కారుణ్యానివి. నీ ద్వారా నా దాసులలో నేను తలచుకున్నవారిని కరుణిస్తాను" అని అన్నాడు. ఆ తర్వాత నరకంతో "నీవు నా 'యాతన'వు మాత్రమే. నీ ద్వారా నా దాసులలో నేను తలచుకున్న వారిని శిక్షిస్తాను" అని అన్నాడు.

**నరకం లోతు :** దైవప్రవక్త (సల్లం) నరకం లోతును వివరిస్తూ ఇలా తెలిపారు: "నరకంలోకి గనక ఒక రాయి విసిరితే అది దొర్లుకుంటూ నరకం అడుగుకు చేరుకోవ డానికి డెబ్భయి ఏళ్ళు పడ్తుంది." (తర్గీబ్)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం: మేము దైవప్రవక్త (సల్లం) సన్నిధిలో కూర్చొని ఉన్నప్పుడు ఓసారి ధబేలున ఏదో వస్తువు పడిపోయినట్లు శబ్దం విన్పించింది. దైవప్రవక్త (సల్లం) "ఈశబ్దం ఏమిటో మీకు తెలుసా?" అని అడిగారు. "దేవునికి, ఆయన ప్రవక్తకు మాత్రమే బాగా తెలుసు" అన్నాము మేము. అప్పుడాయన "ఇది రాయి పడిన శబ్దం. దేవుడు దీన్ని పడిపోవడానికి నరకంలో వదిలేశాడు. అది డెబ్భయి ఏళ్ళ దాకా దొర్లుతూపోయి ఇప్పుడు నరకం అడుగుకు చేరుకున్నది. ఇది ఆ రాయి పడిపోయిన శబ్దమే" అని అన్నారు. (ముస్లిం)

దైవప్రవక్త (సల్లం) నరకం గోడల్ని గురించి తెలియజేస్తూ ఇలా అన్నారు: "నరకం చుట్టూ నాలుగు ప్రహరీ గోడలు ఉన్నాయి. ఆ గోడలు నలభై ఏళ్ళు ప్రయాణం చేసేటంత మందంగా ఉంటాయి." (తిర్మిజి)

**నరకాగ్ని, కటికచీకటి :** దైవప్రవక్త (స) ఈవిధంగా ప్రవచించారు: "నరకాన్ని వేయి సంవత్సరాలు మండిస్తే దాని అగ్ని ఎర్రగా మారింది. తరువాత మరో వేయి



సంవత్సరాలు మండించడం జరిగింది. అప్పుడది తెల్లగా మారింది. ఆ తరువాత మరో వేయి సంవత్సారాలు మండించగా ఆ అగ్ని నల్లగా మారిపోయింది. కనుక నరకం ఇప్పుడు చీకటిగా ఉంది." (తిర్మిజి)

వేరొక ఉల్లేఖనం ప్రకారం నరకంలో అగ్నిజ్వాలలు ఉన్నా వెలుగు ఉండదు. ఎల్లప్పుడూ చీకటిగానే ఉంటుంది. (తర్గీబ్)

యజుర్వేదం (40-2)లో ఉంది: "ఆ లోకాలు సూర్యుడు లేని లోకాలు. ఎల్లెడలా అంధకారం వ్యాపించి ఉంటుంది. అందులో ఆత్మహత్యలకు పాల్పడేవారు ప్రవేశిస్తారు."

"ఈశావాసోపనిషత్తు" నరకం అంధకారబంధురమైనదిగా చెబుతూ, అజ్ఞాన పిపాస కులు చీకటిలోకాల్లో ప్రవేశిస్తారని చెప్పింది.

**నరకాగ్ని తీవ్రత :** దైవప్రవక్త (స) "మీరు (ప్రపంచంలో) వాడే అగ్ని నరకాగ్ని (తీవ్రత)లో డెబ్భయ్యో వంతు మాత్రమే ఉంటుంది" అని అన్నారు. ప్రవక్త అనుచరులు ఈమాట విని "(కాల్చి మసి చేయడానికి) ఈ నిప్పే ఎంతో ఎక్కువ కదా?" అన్నారు. దానికి దైవప్రవక్త (సల్లం) "నిజమే. అయినప్పటికీ ఇహలోకంలోని నిప్పు కంటే నరకాగ్ని 69 రెట్లు ఎక్కువ వేడిగా ఉంటుంది" అన్నారు. (బుఖారి, ముస్లిం)

ఒక ఉల్లేఖనంలో "నరకవాసి గనక ఇహలోకంలోని నిప్పులోకి వస్తే అతనికి నిద్ర వస్తుంది" అని ఉంది. అంటే నరకవాసికి ఇహలోకపు నిప్పు చల్లగా, హాయిగా అన్పిస్తుందన్న మాట. దాంతో సహజంగానే నిద్ర వస్తుంది.

"నరకం అంటే ఏమిటో నీకేం తెలుసు? అది (మనిషిని) మిగల్చదూ, వదలిపెట్టదు. చర్మాన్ని నిలువునా మాడ్చివేస్తుంది. (ఖుర్ఆన్–74:27,28)

"నిస్సందేహంగా నరకం మాటులాంటిది. తలబిరుసు ధిక్కారులకు నివాసమది. అందులోనే వారు యుగాలతరబడి పడివుంటారు." (ఖుర్ఆన్–78:21,22)

"నరకం వారిని దూరం నుంచి చూడగానే, వారు దాని ఆగ్రహోద్రేకపూరితమైన భీకరగర్జనలు వింటారు. వారిని కాళ్ళు, చేతులు కట్టివేసి ఇరుకైన స్థలంలో కుక్కినప్పుడు వారు (విలవిల్లాడుతూ) మృత్యువుని పిలుస్తారు. (దానికి) "ఈరోజు మీరు ఒక్క చావు కాదు, అనేక చావుల్ని పిలుచుకోండి" (అని జవాబివ్వబడుతుంది)." (25:12–14)

"దౌర్భాగ్యులు నరకానికి పోతారు. (అక్కడ తీవ్రమైన వేడి, దాహం వల్ల) వారు రొప్పుతూ, రోజుతూ ఏడ్పులు, పెడబొబ్బలు పెడతారు. నీ ప్రభువు మరేదైనా తలిస్తే తప్ప వారు ఆ స్థితిలోనే భూమ్యాకాశాలున్నంత వరకు పడివుంటారు." (11:107)

రుగ్వేదంలో ఈ విధంగా ఉంది: "ఓ ఇంద్రా! ఓ సోమా! అగ్నిమంటలకు పాత్ర లోని నీళ్ళు ఎలా మసులుతాయో అలా పాపాత్ముల చుట్టూ వారి పాపాలు మసలు తుంటాయి." (7-104-2)

"దుష్కార్యాలకు పాల్పడేవారిని లోతైన గోతిలోని అంధకారంలో పడవేయండి, అక్కడి నుండి వారు బయటికి రాని విధంగా. వారిలో ఏ ఒక్కడూ ఏనాటికీ తిరిగి బయటికి రాడు." (మంత్రం-3)

**నరక శ్వాస :** మహాప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రంగా ఉంటే జుహర్ నమాజ్ కాస్త ఆలస్యంగా చేసుకోండి. నరకాగ్ని తీవ్రత వల్లనే ఈ ఎండ తీవ్రంగా ఉంటుంది..."

నరకం తన ప్రభువును వేడుకుంటూ '(నా ఉష్ణతీవ్రత ఎక్కువైపోయి) నాలోని ఒక భాగం మరొక భాగాన్ని తినేస్తోంది. నేనెలా ఈ తీవ్రతను తగ్గించుకునేది?' అని అన్నది. అప్పుడు దేవుడు నరకానికి రెండు సార్లు ఊపిరి పీల్చి వదిలే అనుమతి ఇచ్చాడు. ఒకసారి శీతాకాలంలో, మరొకసారి ఎండాకాలంలో. ఎండా కాలంలో అది వదిలే శ్వాస వల్లనే మీకు తీవ్రఉష్ణోగ్రత కలుగుతుంది. అలాగే చలికాలంలో అది పీల్చే శ్వాస వల్ల మీకు తీవ్రమైన చలి కలుగుతుంది." (బుఖారి)

కొందరు ధర్మవేత్తలు నరకం శీతాకాలంలో శ్వాస పీల్చే విషయం గురించి వ్యాఖ్యానిస్తూ, నరకంలో వేడి యాతనలే గాకుండా చలి యాతనలు కూడా ఉంటాయి అని అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయాన్ని సమర్థించే హదీసులు కూడా ఉన్నాయి.

**నరకాగ్ని సమిధలు :** నరకాగ్ని ఎల్లప్పుడూ మండాలంటే ఇంధనమో, వంట చెరుకో కావాలి కదా! దేవుడు ఆ ఏర్పాటు కూడా చేశాడు. దాన్ని గురించి ఖుర్ఆన్‌లో సూచనప్రాయంగా ఇలా ఉంది:

"మనుషులు, రాళ్ళు ఇంధనం కాగల నరకాగ్నికి భయపడండి. సత్యతిరస్కారుల కోసం అది సిద్ధపరచబడి ఉంది." (2:24)

"విశ్వాసులారా! మీరు మిమ్మల్ని, మీ భార్యాపిల్లల్ని నరకాగ్ని నుండి రక్షించుకోండి. ఆ నరకాగ్నికి మానవులు, రాళ్ళు సమిధలవుతారు." (66:6)

పైరెండు సూక్తులలో ప్రస్తావించబడిన రాళ్ళు అంటే ఏమిటీ? దీన్ని గురించి హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి) వ్యాఖ్యానిస్తూ "నరక సమిధలని దేవుడు చెప్పిన ఈ రాళ్ళు గంధకపు రాళ్ళు. భూమ్యాకాశాలు సృష్టించినప్పుడే దేవుడు సమీపాకాశాంలో ఈ గంధకపు రాళ్ళను సృష్టించి సిద్ధంగా ఉంచాడు... ఈ రాళ్ళు సత్యతిరస్కారు కోసం తయారు చేయబడ్డాయి." (హాకిమ్)

ఈ గంధకపు రాళ్ళే కాకుండా, అవిశ్వాసులు దైవాలుగా కొలిచిన విగ్రహాలు కూడా నరకాగ్నికి సమిధలవుతాయి. ఖుర్ఆన్‌లోని ఈ సూక్తి చూడండి:

"మీరు, మీ మిథ్యాదైవాలు నరకానికి పోవడం ఖాయం. నరకానికే మీరంతా పోవలసి ఉంటుంది. అవి నిజంగా దైవాలయితే నరకానికి పోవు." (21:98,99)



**నరక ద్వారాలు :** దైవప్రవక్త (స) నరక ద్వారాలను గురించి చెబుతూ ఇలా అన్నారు: "నరకానికి ఏడు ద్వారాలు ఉన్నాయి. అందులో ఒక ద్వారం నా అనుచర సముదాయంపై ఖడ్గం ఎత్తేవారి కోసం కేటాయించబడింది." (మిష్కాత్)

నరక ద్వారాలను గురించి ఖుర్ఆన్ ఇలా తెలిపింది: "ఆ నరకానికి ఏడు ద్వారాలు ఉంటాయి. వారిలో ప్రతి వర్గానికీ ఒక్కొక్క ద్వారం కేటాయించబడింది." (15:44)

**విభిన్న వర్గాలకు విభిన్న అంతస్తులు :** నరకానికి ఉండే ఏడు ద్వారాలు ఏడు భాగాలు లేక ఏడు అంతస్తులకు సంబంధించినవని ధర్మవేత్తలు వ్యాఖ్యానించారు.

ఇబ్నెకసీర్ (రహ్మలై) హజ్రత్ అలి (రజి) మాటల్ని ఉల్లేఖిస్తూ, నరకంలో ఏడు అంతస్తులు ఉంటాయని, ప్రతి అంతస్తుకు ఒక ద్వారం ఉంటుందని అన్నారు.

కపటవిశ్వాసుల్ని ఉంచే నరకం గురించి ఖుర్ఆన్ ఇలా చెబుతోంది: "కపటులు నరకంలో అందరికంటే అట్టడుగు భాగాన (క్రింది అంతస్తులో) ఉంటారు." (4:145)

ఈ సూక్తిని బట్టి కూడా నరకంలో అనేక అంతస్తులు ఉంటాయని తెలుస్తోంది. ధర్మవేత్తలు ఈ అంతస్తుల వివరాలు ఇలా తెలియజేశారు:

నరకంలో అన్నిటికంటే అట్టడుగున ఉండే మొదటి అంతస్తులో ఫిరౌన్ చక్రవర్తి, అతని అనుచరులు, కపటవిశ్వాసులు ఉంటారు. ఈ నరకాన్ని "హావియా" అంటారు.

దానిపై ఉండే రెండవ అంతస్తులో బహుదైవారాధకులు ఉంటారు. ఈ నరకాన్ని "జహీమ్" అంటారు.

దానిపై ఉండే మూడవ అంతస్తులో నాస్తికులు, చార్వాకులు ఉంటారు. ఈ నరకాన్ని "సఖర్" అంటారు.

దానిపై ఉండే నాల్గవ అంతస్తులో ఇబ్లీస్ (షైతాన్), అతని అనుచరులు ఉంటారు. ఈ నరకాన్ని "లజా" అంటారు.

దానిపై ఉండే అయిదవ అంతస్తులో యూదులు ఉంటారు. ఈ నరకాన్ని "హుతమా" అంటారు.

దానిపై ఉండే ఆరవ అంతస్తులో క్రైస్తవులు ఉంటారు. ఈ నరకాన్ని "సయీర్" అంటారు.

దానిపై ఉండే ఏడవ అంతస్తులో పాపాత్ములైన ముస్లింలు ఉంటారు.

దీని మీదనే వారధి (పుల్‌సిరాత్) ఉంటుంది. ముస్లిములైనా, ముస్లిమేతరులైనా ఈ వారధి మీదనే నడచి ముందుకు పోవలసి ఉంటుంది.

**రాకాసి మెడ (మాట్లాడే క్రేన్) :** నరకంలో పొడవైన మెడ కలిగిన ఓ రాకాసి జంతువు పుట్టుకొస్తుంది. ఇది మూడు విధాల మనుషుల్ని పట్టుకొని బాధిస్తుంది.

దీన్ని గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: “ప్రళయదినాన నరకంలో ఒక మెడ బయల్పడుతుంది. దానికి చూడటానికి రెండు కళ్ళు, వినడానికి రెండు చెవులు, మాట్లాడటానికి ఒక నోరు ఉంటాయి. అది నరకవాసులతో మాట్లాడుతూ ‘నేను మూడు రకాల మనుషుల కోసం నియమించబడ్డాను. (1) తలబిరుసు ధిక్కారి, (2) అల్లాహ్‌తో పాటు మరో దైవాన్ని కొలిచేవాడు, (3) బొమ్మలు తయారుచేసేవాడు. (తిర్మిజి)

**నరకంలో పాములు, తేళ్ళు :** నరకశిక్ష అంటే దహనయాతనలు మాత్రమే కాదు, ఇతర రకాల శిక్షలు కూడా అనేకం ఉంటాయి. అక్కడ పాములు, తేళ్ళు కూడా ఉంటాయి.

వీటిని గురించి దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: “నరకంలో పొడవైన మెడలు ఉండే ఒంటెలు అంతటి పెద్ద పెద్ద పాములుంటాయి. వాటిలో ఒక పాము గనక నరక వాసికి కాటేస్తే అతను నలభై ఏళ్ళదాకా దాని విషబాధ అనుభవిస్తుంటాడు.”

“అలాగే నరకంలో బురద పూసుకున్న కంచరగాడిదల్లాంటి పెద్దపెద్ద తేళ్ళు కూడా ఉంటాయి. వాటిలో ఒక తేలు గనక నరకవాసికి కాటేస్తే అతను నలభై ఏళ్ళ దాకా దాని విషబాధ అనుభవిస్తుంటాడు.” (అహ్మద్)

**నరకపాలకుల సంభాషణ :** “(తీర్పు ముగిశాక) దైవదూతలు అవిశ్వాసుల్ని గుంపులు గుంపులుగా నరకం వైపు తోలుకెళ్తారు. నరకం దగ్గరికి చేరుకున్న తరువాత నరకద్వారాలు తెరుస్తారు. అప్పుడు ద్వారపాలకులు వారిని ఇలా అడుగుతారు:

‘మీ దగ్గరికి మీ (జాతి) ప్రజల నుండి దైవప్రవక్తలు రాలేదా? వారు మీకు మీ ప్రభువు సూక్తులు విన్పించలేదా? ఈనాడు (ఎదురయ్యే పరిణామాల్ని) గురించి (ఆనాడే) వారు మిమ్మల్ని హెచ్చరించలేదా?’

దానికి వారు ‘వచ్చారు. (హెచ్చరించారు కూడా.) కాని సత్యతిరస్కారులకు నరకశిక్ష (ఎప్పుడో) నిర్ణయమైపోయింది’ అని సమాధానమిస్తారు.

అప్పుడు ద్వారపాలకులు ‘అయితే నరకంలోకి పోయిపడండి. ఇక మీరిక్కడే ఎల్లకాలం పడిఉంటారు. గర్విష్ఠులకు నిర్ణయించిన ఈ నరకం పరమ చెడ్డస్థలం’ అని అంటారు.” (ఖుర్ఆన్-39:71,72)

“నరకంలో (దుష్ట)మూకల్ని విసరివేసినప్పుడల్లా దాని నిర్వాహకులు “మీ దగ్గరకు హెచ్చరించేవారు రాలేదా?” అని అడుగుతారు. దానికి వారు “ఎందుకు రాలేదు, వచ్చా డొకతను. కాని మేమతడ్ని తిరస్కరించాం. పైగా అతనితో ‘దేవుడు ఏదీ పంపలేదు. నీవు చాలా అపమార్గంలో పడిపోయావు అన్నాం” అనంటారు. (ఖుర్ఆన్-11:106)

**నరకం మాట్లాడుతుంది :** “ఆరోజు మేము నరకాన్ని ‘నీవు నిండిపోయావా?’ అని అడుగుతాం. దానికి నరకం ‘ఇంకేమైనా ఉందా?’ అంటుంది.” (ఖురాన్-50:30)



దేవుడు ఖుర్ఆన్‌లో“నేను మానవులు, జిన్నులతో నరకాన్ని నింపుతాను” (32:13) అన్నాడు. దానిప్రకారం కర్మవిచారణ ముగిసిన తర్వాత సత్యతిరస్కారులైన మానవుల్ని, జిన్నుల్ని నరకంలో పడవేసి “ఇక నీవు నిండిపోయావా?” అని అడుగుతాడు దేవుడు. నరకం “ఇంకా ఏమైనా ఉందా?” అంటుంది. అంటే ‘ఇంకా నాదగ్గర చాలా చోటుంది, ఏదైనా ఉంటే తెచ్చిపడెయ్యి’ అంటుంది. అప్పుడు దేవుడు నరకంలో తన పాదం ఉంచుతాడు. దాంతో నరకం “చాలుచాలు, ఇకచాలు” అంటుంది. (బుఖారి)

**పాపాత్ముల పశ్చాత్తాపం :** “ఆరోజు వారిముఖాలు వెనక్కితిప్పి అగ్నిలో వేయడం జరుగుతుంది. అప్పుడు వారు (పశ్చాత్తాపపడుతూ) “అయ్యయ్యో! మనం దేవునికి, దైవప్రవక్తకు విధేయులయివుంటే ఎంత బాగుండేది!” అనంటారు. (ఆ తర్వాత వారు దేవుడ్ని వేడుకుంటూ) “ప్రభూ! మేము మా నాయకులు, పెద్దలు చెప్పిన మాటలు విని, వారిని అనుసరించాం. వారు మమ్మల్ని అపమార్గం పట్టించారు. ప్రభూ! వారికి రెట్టింపు శిక్ష విధించు. వారిని తీవ్రంగా శపించు” అనంటారు. (ఖుర్ఆన్-33:66-68)

“నా సూక్తులు విన్పించబడుతున్నప్పుడు వాటిని మీరు నిరాకరిస్తుండేవారు కదూ?” అప్పుడు వారు ఇలా అంటారు: “ప్రభూ! మా దౌర్భాగ్యమే మాకొంప ముంచింది. మేము నిజంగా మార్గభ్రష్టులై పోయాము. ప్రభూ! మమ్మల్ని ఇక్కడ్నుంచి తీసెయ్యి. ఆ తరువాత మేము మళ్ళీ తప్పుచేస్తే దుర్మార్గులై పోయినట్లే”. (ఖుర్ఆన్-23:105-107)

ఆ తరువాత (దైవదూతలు) ఆ మిథ్యాదైవాలను, ఈ భ్రష్టుల్ని, షైతాన్ అనుచర మూకను అందర్నీ ఒకరిమీద ఒకర్ని పడవేసి నరకంలోకి త్రోసివేస్తారు. అక్కడ వారంతా పరస్పరం పోట్లాడుకుంటారు. వారు (తమ మిథ్యాదైవాలతో) ఇలా అంటారు:

“దైవసాక్షి! మేము మీకు సర్వలోకప్రభువంతటి స్థానమిచ్చి పూర్తిగా మార్గభ్రష్టులై పోయాం. అసలు మమ్మల్నీ పాపాత్ములే పెడదారి పట్టించారు. ఇక మాకెవరు సిఫారసు చేసేవారు! ఏ ప్రాణస్నేహితుడు కూడా అడ్డుపడలేదే!! అయ్యయ్యో! మాకోసారి ప్రపంచానికి తిరిగివెళ్ళే అవకాశం లభిస్తే మేము విశ్వాసులైపోతాము.”(ఖుర్ఆన్-26:95-102)

“అయ్యో! మా పాడుగాను!! మేము (ప్రవక్తమాటలు) విని అర్థం చేసుకొని ఉంటే ఈరోజు మేము అగ్నిశిక్షకు గురైనవారిలో చేరి వుండేవారం కాము” అని కూడా అంటారు వారు. ఈవిధంగా వారు తమ తప్పు ఒప్పుకుంటారు. ఈ నరకవాసులు నాశనంగాను! (ఇప్పుడా వీరు తప్పు ఒప్పుకునేది?)” (ఖుర్ఆన్-67:5-11)

**నరక పాలకుల వివరాలు :** “మేము నరక పాలకులుగా దైవదూతల్ని నియమించాము. వారి సంఖ్యను అవిశ్వాసులకు పరీక్షగా చేశాం. గ్రంథప్రజలకు నమ్మకం కుదరడానికి, విశ్వాసుల విశ్వాసం మరింత దృఢం కావడానికి ఇలా చేశాం. కనుక గ్రంథప్రజలు, విశ్వాసులు ఎలాంటి అనుమానంలో పడిపోకూడదు. హృదయంలో (కాపట్య) రోగమున్నవారు, అవిశ్వాసులు (దీన్ని విమర్శిస్తూ) ‘దేవుడు చెప్పిన ఈ వింతమాటలోని అంతరార్థం ఏమిటో!’ అంటారు.” (ఖుర్ఆన్-74:31)

"అక్కడ దృఢకాయులయిన, కఠిన (హృదయులైన) దైవదూతలు (నరక నిర్వాహకులుగా) నియమితులయి ఉంటారు. వారు దేవుని ఆజ్ఞలను ఏమాత్రం జవదాటరు. ఏఆజ్ఞ వచ్చినా తక్షణమే శిరసావహిస్తారు. (వారు నరకవాసులతో) 'అవిశ్వాసులారా! ఈరోజు మీరు సాకులు చెప్పకండి. మీరెలాంటి కర్మలు చేసుకున్నారో అలాంటి ప్రతిఫలమే మీకివ్వబడుతోంది' అనంటారు." (ఖుర్ఆన్-66:6,7)

"ఆరోజు (దైవదూతలు) వీరిని కొడ్తూ, నెడ్తూ నరకం వైపు తీసికెళ్తూ ఇలా అంటారు: 'మీరు (నిన్నటిదాకా) నిరాకరిస్తుండిన నరకాగ్ని ఇదే. ఇప్పుడు చెప్పండి, ఇది మంత్రజాలమా లేక మీకేమీ అర్థంకావడం లేదా? ఇక వెళ్ళండి. అందులో పడి మాడిపోండి. మీరు ఓర్పు వహించినా, వహించకపోయినా ఒక్కటే. (నరకయాతన ఏమాత్రం తగ్గించబడదు.) మీరు ఎలాంటి కర్మలు ఆచరించారో అలాంటి ప్రతిఫలమే మీకు ఇవ్వబడుతోంది". (ఖుర్ఆన్-52:14-16)

"ఆ తర్వాత నరకంలో పడినవారు నరకపాలకులతో "మా శిక్షను ఒక్క రోజైనా తగ్గించమని మీ ప్రభువును ప్రార్థించండి" అంటారు. దానికి నరకపాలకులు "మీ దగ్గరకు మీ ప్రవక్తలు నిదర్శనాలు తీసుకొని రాలేదా?" అని అడుగుతారు. వారు "వచ్చార"ంటారు. "అయితే మీరే మొరపెట్టుకోండి. అవిశ్వాసుల మొరలు నిరుపయోగమే అవుతాయి" అని చెబుతారు నరకపాలకులు. (ఖుర్ఆన్-40:49,50)

"వారు (నరకయాతనలు భరించలేక) 'నరకపాలకుడా! నీ ప్రభువు మా కథను ముగించివేస్తే బాగుండు' అని అరుస్తారు. దానికి దైవదూత 'మీరు అలాగే పడివుండండి. మేము మీ దగ్గరకు సత్యాన్ని తెస్తే, మీలో చాలామందికి అసలు సత్యమే గిట్టలేదు' అని సమాధానమిస్తాడు." (ఖుర్ఆన్-43:77,78)

## నరకయాతనలు-51

"వారిని ఓరోజు బోర్లాపడేసి బరబరఈడుస్తూ నరకాగ్నిలో పడవేయడం జరుగుతుంది. అప్పుడు వారితో 'ఇక నరకాగ్నిని చవిచూడండి" అంటారు. (ఖుర్ఆన్-54:48)

"నరకం వారిని దూరం నుంచి చూడగానే, వారు దాని ఆగ్రహోద్రేకపూరితమైన భీకరగర్జనలు వింటారు. వారిని కాళ్ళు, చేతులు కట్టివేసి ఇరుకైన స్థలంలో కుక్కినప్పుడు వారు (విలవిల్లాడుతూ) మృత్యువుని పిలుస్తారు. 'ఈరోజు మీరు ఒక్కచావు కాదు, అనేక చావుల్ని పిలుచుకోండి' (అని జవాబివ్వబడుతుంది)." (ఖుర్ఆన్-25:12-14)

**దహనయాతనలు :** "వారిని పైనుండీ, క్రిందినుండీ అగ్నిగొడుగులు (జ్వాలలు) ఆవరిస్తాయి. ఇలాంటి దుష్పర్యవసానం నుండి (కాపాడుకోమని) దేవుడు తన దాసుల్ని హెచ్చరిస్తున్నాడు. కనుక నా దాసులారా! నా ఆగ్రహం నుండి తప్పించుకోండి." (39:16)

"దుష్కార్యాలలో కూరుకుపోయినవారికి నరక నివాసమే గతవుతుంది. ఆ నరకం నుండి బయట పడేందుకు ప్రయత్నించినప్పుడల్లా వారిని మళ్ళీ అందులోకే నెట్టి వేయడం



జరుగుతుంది. అప్పుడు (దైవదూతలు) వారితో 'మీరు నరకాన్ని తిరస్కరిస్తుండే వారుకదూ! ఆ నరక శిక్షనే ఇప్పుడు చవిచూడండి' అంటారు." (ఖుర్ఆన్-32:20)

"పోతే ఎడమపక్షంవారు- ఎడమపక్షంవారి దౌర్భాగ్యం గురించి ఏమని చెప్పాలి? వారు (నరకంలో శరీరాన్ని మలమల మాడ్చివేసే వడగాల్పుల మధ్య సలసల మరిగే నీటిని తాగుతూ, ఎలాంటి సుఖంగాని, చల్లదనంగాని ఇవ్వని నల్లటి కారుపొగల్లో (నానా యాతనలు అనుభవిస్తూ) ఉంటారు." (ఖుర్ఆన్-56:41-44)

"అతను కసకస నలిపి తొక్కివేసే చోట విసిరి వేయబడతాడు. కసకస నలిపి తొక్కివేసే చోటంటే ఏమిటో నీకు తెలుసా? దేవుని (నరకా) అగ్ని. అది భగభగ మండుతూ గుండెలదాకా చేరుతుంది. వారిని ఆ అగ్నిగుండాలలో పడవేసి మూసివేయడం జరుగుతుంది. ఈ విధంగా వారు (నానాయాతనలు అనుభవిస్తూ) పొడవయిన (అగ్ని)కీలల మధ్య చిక్కుకొని ఉంటారు." (ఖుర్ఆన్-104:6-9)

"వారి పడక కూడా నరకాగ్ని పడకే, దుప్పటికూడా నరకాగ్ని దుప్పటే అవుతాయి. ఇదే దుర్మార్గులకు మేమిచ్చే ప్రతిఫలం." (7:41) "నరకాగ్ని వారి ముఖచర్మాన్ని మాడ్చి వేస్తుంది. దాంతో వారి పళ్ళు, దవడలు బయటికి వస్తాయి." (ఖుర్ఆన్-23:104)

"అక్కడ వారి చర్మాలు కాలిపోయినప్పుడల్లా (నిరంతరం) నరకయాతనల్ని చవిచూసేందుకు మళ్ళీమళ్ళీ కొత్తచర్మాలు సృజిస్తాము." (ఖుర్ఆన్-4:56)

హజ్రత్ హసన్ బస్రి (రహ్మలై) బహుశా పై సూక్తిని గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు: "నరకవాసుల్ని నరకాగ్ని రోజుకు డెబ్బయి సార్లు కాల్చుతుంది. కాల్చిన ప్రతిసారీ వారితో 'పూర్వం ఎలా ఉండేవారో అలా మారండి' అని చెప్పబడుతుంది. దాంతో వారు కాలిన ప్రతిసారీ తిరిగి పూర్వ స్థితికి మారుతారు." (తర్గీబ్ వ తర్హీబ్)

"వారిలో సత్యాన్ని తిరస్కరించినవారి కోసం అగ్నివస్త్రాలు తయారుచేయబడ్డాయి. వారి తలలపై సలసలకాగే నీటిని కుమ్మరిస్తారు. దానివల్ల వారి చర్మాలేకాదు, వారి పొట్టలోని పేగులు సైతం కాలి కరిగిపోతాయి." (ఖుర్ఆన్- 22:19,20)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈవిధంగా తెలియజేశారు : "నరకంలో అందరికంటే తేలికపాటి శిక్ష అనుభవించే వాడి పరిస్థితి ఎలా ఉంటుందంటే, అతని కాళ్ళకు రెండు అగ్ని చెప్పులు ఉంటాయి. వాటి వేడికి అతని మెదడు కుండలోని పదార్థం ఉడుకుతున్నట్లు కుతకుత ఉడికి పోతుంటుంది. ఇది అందరికంటే తేలిక యాతన అయినప్పటికీ ఆ నరకవాసి ఇంతకంటే కఠినమైన యాతన మరెవరికీ లేదనుకుంటాడు." (బుఖారి)

**సంకెళ్ళు, గదలు, గుదిబండలు :** "సత్యతిరస్కారుల కోసం మేము సంకెళ్ళు, గుదిబండలు, భగభగమండే అగ్ని సిద్ధపరచి ఉంచాము." (ఖుర్ఆన్-76:4)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం: "ఈ సంకెళ్ళు నరకవాసి గుదంలో దోపి అతని శరీరంలో గుచ్చి కట్టివేయడం జరుగుతుంది. ఆ తరువాత పెనం మీద మాంసం ముక్కలు వేయించినట్లు, నూనెలో మిడతలను వేయించినట్లు అతడ్ని అగ్నిలో పడేసి కాల్చడం జరుగుతుంది." (ఇబ్నెకసీర్)

"వారిని చితకబాదడానికి ఇనుపగదలు కూడా ఉంటాయి. వారా బాధ భరించలేక నరకం నుండి పారిపోవడానికి ప్రయత్నించినప్పుడల్లా 'దహనయాతనలు చవిచూడండి' అంటూ దైవదూతలు వారిని తిరిగి నరకంలోకి త్రోసివేస్తారు." (ఖుర్ఆన్–22:21,22)

"త్వరలోనే వారికి (నిజం) తెలిసొస్తుంది. అప్పుడు వారి మెడలకు గుదిబండలు కట్టి, సంకెళ్ళతో బంధించి సలసల మరిగే నీటి దగ్గరకు ఈడ్చుకెళ్ళడం జరుగుతుంది. ఆ తరువాత నరకాగ్నిలో విసరివేయబడతారు." (ఖుర్ఆన్–40:70–72)

"వారి ముంగురుల్ని, వారి కాళ్ళను పట్టి బరబర ఈడ్చుకుపోవడం జరుగుతుంది. అప్పుడు మీ ప్రభువుకున్న ఏ శక్తిసామర్థ్యాలు మీరు నిరాకరించగలరు? (55:41,42)

**తీవ్రమైన ఆకలిదప్పులు :** "అతనికక్కడ త్రాగడానికి చీము, నెత్తురు కలిసిన (పరమ జుగుప్సాకరమైన) నీరివ్వబడుతుంది. దాన్ని అతడు బలవంతంగా గొంతులోకి దించడానికి ప్రయత్నిస్తాడు. (అది ఓ పట్టాన అతని గొంతులోకి దిగదు.) చివరికి ఎలాగో అతికష్టం మీద దించుతాడు. నలువైపుల నుండి మృత్యువు అతడ్ని చుట్టుముడ్తుంది. కాని అతను చావడు. దానికి ముందు అతడ్ని చంపుకుతినే మరో ఘోరయాతన పొంచి ఉంటుంది." (ఖుర్ఆన్–14:16,17)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "నరకవాసులకు తీవ్రమైన ఆకలి అవుతుంది. ఈ ఆకలియాతన కూడా ఇతర యాతనలంత తీవ్రంగా ఉంటుంది. ఈ ఆకలితో వారు తినడానికి ఏదైనా ఇవ్వమని అడుగుతారు. అప్పుడు వారికి ముళ్ళతో కూడిన ఎండు గడ్డిపరకల ఆహారం ఇవ్వబడుతుంది. అది వారికి బలమివ్వదు, ఆకలి తీర్చదు. వారు ఆకలి తీరక మళ్ళీ అడుగుతారు. అప్పుడు వారికి గొంతులో ఇరుక్కుపోయే ఆహారం ఇవ్వబడుతుంది. అది వారి గొంతులో ఇరుక్కోపోతుంది.

ఈ బాధ దూరమయ్యే మార్గం ఏమిటని వారు ఆలోచిస్తారు. ప్రపంచంలో నీళ్ళు తాగడం వల్ల గొంతులో ఇరుక్కుపోయిన పదార్థం లోపలికి పోతుందన్న విషయం గుర్తుకొచ్చి వారు నీళ్ళు అడుగుతారు. అప్పుడు సలసల మరిగే నీటి పాత్రను పటకారుతో పట్టి వారి ముందుంచబడుతుంది. పటకారుతో సహా మరుగుతున్న నీటి పాత్ర దగ్గరకు రాగానే వారి ముఖాలు మాడిపోతాయి. తరువాత ఆ నీళ్ళు తాగగానే వారి కడుపులోని పేగులు వగైరా కాలి ముక్కలు ముక్కలు అవుతాయి." (మిష్కాత్)

దైవప్రవక్త (స) మరో సందర్భంలో ఇలా అన్నారు: "నరకవాసుల నోటి దగ్గరికి 'చీము' తీసుకురాబడుతుంది. నరకవాసులు దాని (వేడి, దుర్వాసన భరించలేక)



అసహ్యించుకుంటారు. ఆ పదార్థం వారికి మరింత దగ్గరకు తీసుకురాబడుతుంది. దాంతో వారి ముఖాలు మాడిపోతాయి. తల మీది చర్మం కాలి పడిపోతుంది. చివరికి వారా చీమును బలవంతంగా తాగుతారు. అది వారి కడుపులోకి పోయి పేగుల్ని కాల్చి ముక్కలు ముక్కలు చేస్తుంది. కాలిన ఆ పేగుముక్కలు వారి గుదం నుంచి బయటికి వచ్చేస్తాయి."

"నేరస్థులు అసత్యవిషయంగా పరిగణించి త్రోసిపుచ్చిన నరకం ఇదే. ఈ నరకం లోనే వారు (నానా యాతనలు అనుభవిస్తూ, తీవ్రమైన దప్పికతో) యాతన స్థలానికి, సలసల కాగుతున్న నీటి చలమలకూ మధ్య తిరుగుతూ ఉంటారు. కనుక మీరు మీ ప్రభువులో ఉన్న ఏ ప్రతిభాశక్తులు తిరస్కరించగలరు?" (ఖుర్ఆన్–55:43–45)

**ఆహారపానీయాలు :** నరకంలోని ప్రతి ఆహారవస్తువు ఎంతో చేదుగా, వగరుగా, వేడిగా, కంపుకొడ్తూ ఉంటుంది. నరకవాసులు తీవ్రమైన ఆకలి దప్పులు భరించలేక పరమ జుగుప్సాకరమైన ఈ వస్తువులు తింటారు, తాగుతారు.

"త్రాగేందుకు వారికి సలసల కాగే నీరు ఇవ్వబడుతుంది. ముండ్లతో కూడిన ఎండుగడ్డి పరకలు తప్ప వారికి ఎలాంటి తిండి దొరకదు. అది వారికి బలమివ్వదూ, ఆకలీ తీర్చదు." (ఖుర్ఆన్–88:6,7)

"పాపాత్ములు జఖ్ఖూమ్ (అనే నాగజెముడు) చెట్టు తప్పక తినవలసి ఉంటుంది. చమురు తెట్టులాంటి ఆ పదార్థం వారి పొట్టలోకి పోయి మరగకాచిన నీటిలా కుతకుత ఉడికిపోతుంది. 'పట్టుకోండి వాడ్ని. బరబర ఈడుస్తూ తీసికెళ్ళి నరకం మధ్యలో విసరి పడేయండి. సలసలకాగే నీటిని వాడి నెత్తిమీద కుమ్మరించండి'... 'ఇక చూడు దీనిరుచి. నువ్వు మహా గౌరవనీయుడవైన పెద్దమనిషివి కదూ!'.. మీరు ఇంత కాలంగా సంభ విస్తుందో లేదో అని సందేహిస్తుండిన విషయం ఇదే." (ఖుర్ఆన్–44:43–50)

జఖ్ఖూమ్ చెట్టుకు సంబంధించిన ప్రతీదీ తీవ్రమైనదే. దానికి చెందిన ఓ బొట్టు రసం మనం ఇప్పుడుండే ఈ భూమండలంపై కార్చితే ఇక్కడి ఆహారపానీయాలన్నీ చెడిపోతాయని తిర్మిజిలోని ఒక హదీసుని బట్టి తెలుస్తోంది. అంటే ఇక ఆ ఆహార పానీయాలేవీ తినడానికి, తాగడానికి ఏమాత్రం పనికిరావన్నమాట!

"మేమీ (జఖ్ఖూం) వృక్షాన్ని దుర్మార్గులకు పరీక్షగా చేశాం. అది నరకంలో అట్టడుగున మొలుస్తుంది. దాని పండ్లగుత్తులు రాకాసి తలల్లా (భయంకరంగా) ఉంటాయి. నరక వాసులు వాటిని (ఆవురావురుమంటూ) తిని కడుపు నింపుకుంటారు. తరువాత త్రాగడానికి వారికి సలసల కాగే నీళ్ళు లభిస్తాయి. ఆ తర్వాత వారిని తిరిగి నరకాగ్ని వైపు తోలుకెళ్ళడం జరుగుతుంది." (ఖుర్ఆన్–37:64–68)

"కనుక సత్యాన్ని నిరాకరించిన భ్రష్టులారా! మీరు జఖ్ఖూమ్ (అనే ఒక విధమైన నాగజెముడు) వృక్షాన్ని తప్పకుండా తినవలసి ఉంటుంది. దాంతోనే మీరు (భరించలేని ఆకలితో) ఆవురావురుమంటూ కడుపు నింపుకుంటారు. ఆపై దప్పికగొన్న ఒంటెల్లా సలసల

కాగే నీటిని (గటగట) త్రాగుతారు. ఇదే తీర్పుదినాన ఎడమపక్షం వారికి లభించే ఆతిథ్యం!" (ఖుర్‌ఆన్-56:51-56)

"కనుక (అక్కడ) సలసల కాగే నీరు, చీము, నెత్తురు, వగైరా అనేక జుగుప్సాకరమైన పదార్థాలను రుచిచూడమను వారిని." (ఖుర్‌ఆన్-38:57-58)

చీము, నెత్తురులతో కూడిన ఈ పదార్థాన్ని ఖుర్‌ఆన్ "గస్సాఖ్" అనే పేరుతో ప్రస్తావించింది. దైవప్రవక్త (స) దీని తీవ్రతను గురించి చెబుతూ "ఒక బకెట్ గస్సాఖ్ గనక ఇహలోకంలో వదలితే ఇహలోకంలోని జీవరాసులన్నీ చచ్చి కుళ్ళిపోతాయి" అని తెలియజేశారు. (తిర్మిజి, హాకిమ్)

**భాగవతంలో నరకశిక్షలు :** దేవీభాగవతంలో నరకశిక్షల్ని గురించి ఇలాఉంది:

"ఎవరైతే ఒక వ్యక్తిని మోసగించి అతని భార్యను వలలో వేసుకుంటాడో అతడ్ని యతదూతలు అంధకార నిలయమైన నరకంలో పడవేస్తారు. అందులో పడిన మనిషి బాధతో మూల్గుతాడు. అతనక్కడ వెంటనే గుడ్డివాడిగా, పిచ్చివాడిగా మారిపోతాడు. ఇంకా అతను మొదలు నరికిన మ్రానులా పడిపోతాడు." (దేవీ భాగవతం-8:5,6)

"నాది, నేను అనే అహంకారంతో ఇతరుల యెడల ఎవరైతే అసూయ అవలం బించి, మోసం దగాలతో తన కుటుంబాన్ని పోషించుకుంటాడో అతను చనిపోయిన తరువాత తన దుష్కర్మలకు ఫలితంగా నరకంలో పడిపోతాడు." దేవీభాగవతం-8:8,9)

"హద్దులను అతిక్రమించేవారు 'వైతరణి' నదిలో పడిపోతాడు. ఓ నారదా! ఈ నది నరక ప్రాకారానికి చెందిన ఓ అగడ్త." (దేవీ భాగవతం-8:39,40)

## నరకవాసుల రూపురేఖలు-52

నరకవాసులు ఎంతో నల్లగా, వికృతంగా, భయానకంగా ఉంటారు. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు వారి రూపురేఖలకు కొంతవరకు అద్దం పడ్తాయి:

"దుష్కార్యాలుచేసేవారికి వారి దుష్కార్యాలకు తగినట్లే దుష్ఫలం ఉంది. వారిని అవమానం, అప్రతిష్ఠలు చుట్టుముద్తాయి. దేవుని పట్టు నుండి వారిని కాపాడే నాథుడే ఉండడు. వారి ముఖాలు (నిరాశా నిస్పృహలతో) కారు చీకటిలా నల్లగా మాడిపోయి ఉంటాయి. వారే నరకానికిపోయేవారు. నరకంలోనే ఎల్లకాలం పడిఉంటారు." (దివ్య ఖుర్‌ఆన్-10:27); "నరకాగ్ని వారి ముఖచర్మాన్ని మాడ్చివేస్తుంది. దాంతో వారి పళ్ళు, దవడలు బయటికి వస్తాయి." (ఖుర్‌ఆన్-23:104)

హదీసుల్లో కూడా నరకవాసుల వికృత రూపాలను గురించి ప్రస్తావన ఉంది. దైవప్రవక్త (సల్లం) ఈ విషయాన్ని గురించి ఇలా తెలియజేశారు:

"నరకవాసి నిప్పులో కాలడం వల్ల అతని పైపెదవి కురుచైపోయి తలలో అర్థ భాగందాకా పోతుంది. క్రిందిపెదవి బొడ్డుదాకా జారి వ్రేలాడుతూ ఉంటుంది." (తిర్మిజి)



హజ్రత్ అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి) నరకవాసులు వికృత రూపాలను గురించి మాట్లాడుతూ ఇలా అన్నారు: "నరకవాసుల్లో ఎవరినైనా ఒకడ్ని భూలోకంలోకి పంపిస్తే ఎంతో వికృతమైన అతని భయంకర స్వరూపం, అతని శరీరం నుండి వెలువడే దుర్వాసనల కారణంగా భూలోకవాసులు తప్పకుండా చచ్చిపోతారు." హజ్రత్ అబ్దుల్లా (రజి) ఈమాట చెప్పి ఎంతగానో దుఃఖించారు. (తర్గీబ్)

**రక్తకన్నీరు :** హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఓసారి అనుచరులతో మాట్లాడుతూ ఇలా అన్నారు: "సోదరులారా! (నరకయాతనలను తలచుకొని) ఏడ్వండి. ఏడ్వడం చాతకాకపోతే కనీసం ఏడ్పుముఖమైనా పెట్టుకోండి. నరకంలో నరకవాసి అత్యంత ఘోరంగా ఏడుస్తాడు. అతని కళ్ళలో నుంచి నీటిధారలు వరదలయి పారుతాయి. అలా ఏడుస్తూ నీటిధారలు ఆగిపోయి రక్తకన్నీరు పారుతుంది. (రక్తకన్నీరు కూడా వరదలయి పారుతుంది.) దాంతో అతని కళ్ళు పచ్చి పుండ్లయి పోతాయి. నరకవాసి కళ్ళలో నుంచి పారే ఈ నీటి, రక్తపు కాలువల్లో గనక పడవలు వదిలితే అవి నిక్షేపంగా నడుస్తాయి." (షరాసున్న)

**నరకవాసుల శరీరాలు :** మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) నరక వాసులు నాలుకలను గురించి ప్రస్తావిస్తూ ఇలా తెలియజేశారు: "సత్యతిరస్కారి (నరకంలో) తన నాలుకను మూడు మైళ్ళ నుంచి ఆరు మైళ్ళ పొడవుదాకా బయటికి తీస్తాడు. దాని మీద జనం నడచి వెళ్తారు." (తర్గీబ్)

దైవప్రవక్త (సల్లం) నరకవాసులు శరీర పరిమాణాలను గురించి ఇలా అన్నారు:

"నరకంలో అవిశ్వాసి రెండు భుజాల మధ్య దూరం వేగవంతమైన వాహనం మూడురోజులు ప్రయాణం చేసినంత దూరం ఉంటుంది..." (ముస్లిం)

"ప్రళయదినాన సత్యతిరస్కారి దవడ ఉహద్‌కొండంత ఉంటుంది. అతని తొడ బైజా పర్వతమంత ఉంటుంది. నరకంలో కూర్చోవడానికి అతనికి మక్కా, మదీనాల మధ్యఉండే దూరమంత పొడవు వెడల్పు గల చోటు కావలసి ఉంటుంది." (మిష్కాత్)

## నరకశిక్షలకు కారణాలు-53

దేవుడు మానవుని ఇహపర సాఫల్యాల కోసం తన ప్రవక్తల ద్వారా పంపిన ఇస్లాం జీవన విధానాన్ని మానవుడు విశ్వసించడానికి నిరాకరించడమే నరకశిక్షకు ప్రధాన కారణమవుతుంది. ఆ తరువాత ఇస్లామీయ విశ్వాసాలకు వ్యతిరేకమైన ఇతర చెడులు నరకశిక్షకు ఉపకారణాలు అవుతాయి. ఖుర్‌ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

"(మానవ జీవితానికి) మార్గం నిర్దేశించవలసిన బాధ్యత మాపైనే ఉంది. ఇహలోకం మాదే; పరలోకమూ మాదే. కనుక నేను మిమ్మల్ని ప్రజ్వరిల్లే అగ్ని గురించి హెచ్చరిస్తున్నాను. సత్యాన్ని నిరాకరించి ముఖం తిప్పుకునే దౌర్భాగ్యుడు తప్ప మరెవరూ అందులో పడరు." (ఖుర్‌ఆన్-92:17-19)

**సత్యనిరాకరణ :** "గ్రంథప్రజలలో, బహుదైవారాధకుల్లో సత్యాన్ని తిరస్కరించిన వారు తప్పకుండా నరకాగ్నిలో పడి, అందులోనే ఎల్లాకాలం (నానాయాతనలు అనుభవిస్తూ) ఉంటారు. వారు యావత్తుసృష్టిలో అత్యంత నికృష్టజీవులు." (98:6)

"(అప్పుడు వారికి) "మీకు మేము దీర్ఘాయుష్షు ఇవ్వలేదా? అంత దీర్ఘాయుష్షులో మీరు తలచుకుంటే గుణపాఠం నేర్చుకుని ఉండేవారు. మీ దగ్గరికి హెచ్చరించేవాడు కూడా వచ్చాడు కదా! ఇప్పుడిక (నరక యాతనలు) చవి చూడండి. దుర్మార్గులకు ఇక్కడ ఎవరూ సహాయం చేయరు" అని సమాధానం ఇవ్వబడుతుంది." (35:36,37)

"వారసలు (నిన్ను కాదు,) ప్రళయాన్ని తిరస్కరిస్తున్నారు. ప్రళయాన్ని తిరస్కరించే వారికోసం మేము తీవ్రంగా ప్రజ్వరిల్లే నరకాగ్ని సిద్ధపరచి ఉంచాము." (25:11)

"పరలోక తీర్పును ధిక్కరించే వాడ్ని నీవు గమనించావా? అతనే అనాథలను కసరి కొట్టేవాడు. పేదల అన్నదానం కోసం (ఇతరుల్ని) ప్రోత్సహించనివాడు. ప్రార్థన పట్ల అశ్రద్ధ, ఏమరుపాటులు వహించేవారికి వినాశం ఉంది. వారు ప్రతిపనీ లోకులమెప్పు కోసం చేస్తుంటారు. (మితిమీరిన పిసినారితనంతో) వాడుకునే సాధారణవస్తువుల్ని సైతం ఇతరులకు ఇవ్వడానికి నిరాకరిస్తారు." (ఖుర్ఆన్-107:1-7)

**ధనవ్యామోహం, అక్రమాలు :** "సత్యానికి విముఖుడయి పోవడమేగాక ధనాన్ని కూడబెట్టి దాన్ని మాటి మాటికి సర్దిపెట్టుకుంటూ భద్రపరచుకున్న ప్రతివాడ్నీ అది ఎలుగెత్తి పిలుస్తుంది." (ఖుర్ఆన్-70:18)

"ప్రాపంచిక వ్యామోహంలో పరస్పరం పోటీపడి వీలైనంత ఎక్కువ సంపాదించాలన్న తపనే మిమ్మల్ని ఏమరుపాటులో పడవేసింది. చివరికి (అదే రందిలో) మీరు సమాధికి చేరుకుంటారు. (మీరసలు ప్రాపంచికసంపదే ప్రగతికి చిహ్నమని భావిస్తున్నారు కాబోలు.) ఎంతమాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది (వాస్తవం ఏమిటో). ఎంత మాత్రం కాదు. త్వరలోనే మీకు తెలుస్తుంది. ఎంతమాత్రం కాదు.

విశ్వసనీయ జ్ఞానంతో మీరు విషయాన్ని గ్రహిస్తే (మీ వైఖరి ఇలా ఉండదు). మీరు తప్పకుండా నరకాన్ని చూస్తారు. ఔను, మీరు నమ్మకంగా మీకళ్ళారా చూస్తారు. ఆరోజు ఈ సౌఖ్యాలు, సిరి సంపదలను గురించి మిమ్మల్ని తప్పకుండా నిలదీయడం జరుగుతుంది." (ఖుర్ఆన్-102:1-8)

"నిందించే, హేళనచేసే, చాడీలుచెప్పే ప్రతివాడికీ వినాశం ఉంది. అతను (మితి మీరిన ధనవ్యామోహంతో) డబ్బు కూడబెడ్తున్నాడు. (పరమలోభి అయి) దాన్ని మాటి మాటికి లెక్కపెట్టి దాచిపెడ్తున్నాడు. అతనీ సంపద శాశ్వతంగా తన దగ్గర ఉంటుందని భావిస్తున్నాడు. ఎంతమాత్రం ఉండదు. అతను కసకస నలిపి తొక్కివేసే చోట విసిరి వేయబడతాడు. కసకస నలిపి తొక్కివేసే చోటంటే ఏమిటో నీకు తెలుసా? దేవుని (నరకా)అగ్ని. అది భగభగ మండుతూ గుండెలదాకా చేరుతుంది. వారిని ఆ అగ్నిగుండా



లలో పడవేసి మూసివేయడం జరుగుతుంది. ఈ విధంగా వారు (నానాయాతనలు అనుభవిస్తూ) పొడవైన (అగ్ని)కీలల మధ్య చిక్కుకొని ఉంటారు. (ఖుర్ఆన్-104:1-9)

"అవిశ్వాసుల్ని నరకాగ్ని ముందు నిలబెట్టి వారితో (దైవదూతలు) ఇలా అంటారు: 'మీరు ప్రపంచజీవితంలో మీవాటాకు వచ్చిన సిరిసంపదలన్నీ తనివితీరా అనుభవించి కాజేశారు. అదీగాక అక్కడ ఎలాంటి నీతి న్యాయం లేకుండా అహంకారంతో విర్రవీగే వారు. ఎన్నో అక్రమాలకు, అధర్మాలకు పాల్పడ్డారు. తత్పర్యవసానంగా ఈరోజు మీరు అత్యంతవమానకరమైన శిక్షగా యాతనలకు గురికాబోతున్నారు." (ఖుర్ఆన్-46:20)

"మేము అనేకమంది మానవులను, జిన్నులను నరకం కోసమే పుట్టించాం. వారికి హృదయాలున్నాయిగాని, వాటితో అర్థం చేసుకోరు; కళ్ళున్నాయిగాని, వాటితో చూడరు; చెవులున్నాయిగాని, వాటితో వినరు. వారు పశువుల్లాంటివారు. వారసలు అంతకంటే కూడా దిగజారిపోయారు. వారు పూర్తిగా ఏమరుపాటుకు లోనయ్యారు." (7:179)

**నమాజు చేయకపోవడం :** "వారు (నరకంలోని) పాపాత్ముల్ని చూసి 'మిమ్మల్ని ఏ విషయం నరకంలో పడవేసింది?' అని అడుగుతారు. దానికి పాపాత్ములు ఇలా సమాధానమిస్తారు: 'మేము ప్రార్థన (నమాజు) చేసేవారిలో చేరలేదు. పేదలకు అన్నదానం చేసేవారంకాము. సత్యతిరస్కారులతో కలసి మేమూ (సత్యాన్ని) తిరస్కరిస్తుండే వాళ్ళము. తీర్పుదినాన్ని అసత్య విషయమని ఖండిస్తూ ఉండేవాళ్ళము. ఈ స్థితిలోనే చివరికి అనివార్య విషయం (మృత్యువు) మా ముందుకు వచ్చింది." (74:40-47)

**ధర్మజ్ఞానం దాచడం :** దేవుడు నేర్పిన ధర్మజ్ఞానం ప్రజలకు తెలియజేయకుండా దాచేవారికి విధించే శిక్ష గురించి ప్రస్తావిస్తూ దైవప్రవక్త ఇలా చెప్పారు: "ఎవరినైనా ధర్మ జ్ఞానానికి సంబంధించిన ఏదైనా విషయం అడిగినప్పుడు అతను తెలిసి కూడా దాన్ని బహిర్గతం చేయకుండా దాచేస్తే (నరకంలో) అతని నోటికి అగ్ని కళ్ళెం తగిలించబడుతుంది." (మిష్కాత్)

**మద్యం, మత్తుపదార్థాల సేవనం :** దైవప్రవక్త (స) హితోక్తి : "నా ప్రభువు ప్రమాణం చేసి ఇలా అన్నాడు- 'నా దాసులలో ఎవరైనా సారా తాగితే, ఎంత సారా తాగివుంటే అంతచీము (నరకంలో) నేనతనికి తాగిస్తాను. అలాగే నా దాసులలో ఎవరైనా నాకు భయపడి మద్యపానం మానుకుంటే, నేనతనికి (స్వర్గంలో) పరిశుద్ధ కోనేరులలోని (మద్యం, మకరందం, పాలు వగైరా) పానీయాలు తాగిస్తాను." (అహ్మద్)

హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (స) మద్యం గురించి ప్రస్తావిస్తూ "మద్యసేవనానికి అలవాటు పడి అదే స్థితిలో చనిపోయిన మనిషికి దేవుడు (నరకంలో) గౌతా సెలయేటి పానీయం తాగిస్తాడు" అని అన్నారు. అనుచరులు ఈమాట విని "గౌతా సెలయేరు అంటే ఏమిటీ దైవప్రవక్తా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) గౌతా సెలయేరు అంటే వ్యభిచార స్త్రీపురుషుల మర్మావయవాల నుండి వెలువడే ద్రవాలు కలిగిన సెలయేరు అన్నమాట" అని చెప్పారు. (అహ్మద్)

**సదాచరణలేని ఉపన్యాసకులు :** "నన్ను ఆకాశపర్యటన (మేరాజ్) చేయించిన రాత్రి నేనొక చోట కొందరు మనుషుల పెదవుల్ని అగ్నికత్తెరలతో కోస్తుండటం చూశాను. నేను వీరెవరని అడిగాను. దానికి హజ్రత్ జిబ్రీల్ (రహ్మాలై) సమాధానమిస్తూ 'వీరు ఇహలోకంలో నీతి విషయాలు స్వయంగా ఆచరించకుండా వాటిని ప్రజలకు బోధిస్తూ ఉండే ఉపన్యాసకులు. వారు దైవగ్రంథం పఠిస్తున్నప్పటికీ దాని ప్రకారం ఆచరించేవారు కాదు'' అని తెలియజేశారు." (మిష్కాత్)

దైవప్రవక్త (సల్లం) మరో సందర్భంలో ఇలా తెలియజేశారు: "ప్రళయదినాన ఒక మనిషిని తెచ్చి నరకంలో విసిరి పడేయటం జరుగుతుంది. అప్పుడతని పొట్టలోని పేగులు కాలి బయటికి వస్తాయి. ఆ పరిస్థితిలో ఆ వ్యక్తి తిరగలి తీసుకొని తిరిగే గాడిదలా అటూఇటూ తిరుగుతుంటాడు. అది చూసి ఇతర నరకవాసులు అతని చుట్టూ గుమికూడి 'ఏమయింది నీకు? నీవు మాకు నీతి విషయాలు బోధిస్తూ చెడు విషయాలు చేయవద్దని వారిస్తుండేవాడివి కదూ?' అని అడుగుతారు. అతను 'ఔను. నేను మీకు నీతివిషయలు బోధిస్తుండేవాడ్ని. కాని నేను స్వయంగా వాటిని ఆచరించే వాడ్ని కాను. మీకు చెడు విషయాలను నుండి వారిస్తుండేవాడ్ని. కాని నేను స్వయంగా వాటిని చేస్తుండేవాడ్ని' అని అంటాడు." (బుఖారి, ముస్లిం)

**వెండిబంగారు పాత్రల వాడకం :** దైవప్రవక్త (సల్లం) స్త్రీలకు మాత్రమే వెండి బంగారాలను ఆభరణాలుగా మాత్రమే వాడటానికి అనుమతి ఇచ్చారు. అయితే స్త్రీలు తమ భర్తల కోసం మాత్రమే బంగారు ఆభరణాలు ధరించాలి. ప్రదర్శనాబుద్ధితో ఇతరుల మెప్పు కోసం ధరించకూడదు. దైవప్రవక్త (సల్లం) ఈ విషయాన్ని చెబుతూ "ఏ స్త్రీ అయినా జనానికి చూపే ఉద్దేశ్యంతో బంగారు నగలు ధరిస్తే ఆమె (పరలోకంలో) యాతనలకు గురవుతుంది" అని అన్నారు. (మిష్కాత్)

పోతే పురుషులు బంగారు గొలుసులు, ఉంగరాలు, చెవిపోగులు మొదలైన నగలు వాడటాన్ని దైవప్రవక్త (సల్లం) నిషేధించారు. అలాగే స్త్రీలయినా, పురుషులైనా పాత్రలు, గ్లాసులు, ఇతరత్రా సామగ్రి కోసం వెండి బంగారాలు వాడటాన్ని కూడా ఆయన నిషేధించారు.

దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "వెండి బంగారాలతో చేసిన పాత్రలలో గాని, లేదా వెండి బంగారాలు కలిపి ఇతర లోహాలతో చేసిన పాత్రలలోగాని ఎవరైనా తింటే, తాగితే అలాంటివాడు తన పొట్టను నరకాగ్నితో నింపుకున్నాడన్న మాట." (దార్‌ఖుత్ని)

**చిత్ర లేఖనం :** "దేవుని దృష్టిలో అందరికంటే కఠినమైన (నరక) యాతన బొమ్మలువేసే లేక తయారుచేసేవాడు అనుభవిస్తాడు" అన్నారు దైవప్రవక్త (స). మరో సందర్భంలో "బొమ్మలువేసే లేక తయారుచేసే ప్రతిమనిషీ నరకానికి పోతాడు. అతను వేసిన లేక తయారుచేసిన ప్రతి బొమ్మకు బదులు నరకంలో ఒక జీవిని సృజించడం జరుగుతుంది. ఆ జీవి అతనికి యాతనలు పెడ్తుంది" అన్నారు ఆయన. (బుఖారి)



పై హదీసుని ఒక చిత్రలేఖకుని ముందు ఉల్లేఖించిన హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఆ తరువాత అతనితో "బొమ్మలు గీయడం నీకు తప్పనిసరి అయితే చెట్లు చామలు లాంటి ప్రాణంలేని బొమ్మలు గీసుకో" అన్నారు. (మిష్కాత్)

**ఆత్మహత్య :** ఆత్మహత్య మహాపాతకం. పరిస్థితుల్ని ఎదిరించలేని పిరికిచర్య. ఆత్మహత్యను ఇస్లాం నిషేధించింది. దీన్ని గురించి దైవప్రవక్త (స) ఇలా తెలిపారు:

"కొండ మీద నుంచి పడిపోయి ఆత్మహత్య చేసుకున్నవాడు నరకానికి పోతాడు. (నరకంలో కొండ మీద నుంచి పడుతూ లేస్తూ) అక్కడే శాశ్వతంగా ఉంటాడు. విషం తిని ఆత్మహత్య చేసుకున్నవాడు నరకాగ్నిలో పడి చేతిలో విషం పట్టుకొని ఎల్లప్పుడూ తింటూ ఉంటాడు. ఏదైనా లోహపు వస్తువుతో ఆత్మహత్య చేసుకున్నవాడు చేతిలో ఆ లోహపు వస్తువు పట్టుకొని మాటిమాటికి కడుపులో పొడుచుకుంటూ శాశ్వతంగా నరకాగ్నిలో మాడిపోతూ ఉంటాడు." (బుఖారి)

**అహంకారం :** గర్వం మనిషిని పరలోకంలోనే కాదు, ఇహలోకంలో కూడా నష్ట పరుస్తుంది. ఈ గర్వం అనేక రకాలు ఉండవచ్చు. ధనగర్వం, బలగర్వం, సౌందర్య గర్వం, కులగర్వం, వర్ణగర్వం, జాతి గర్వం, జ్ఞానగర్వం వగైరా. మానవుల బద్ధశత్రువు ఇబ్లీస్ జాత్యహంకారం వల్లనే శాపగ్రస్తుడయ్యాడు.

తొలిమానవుడు హజ్రత్ ఆదం (అలైహి) ముందు మోకరిల్లమని దేవుడు ఆదేశించి నప్పుడు అగ్నితో సృజించబడిన ఇబ్లీస్ జాత్యహంకారంతో "నీవు మట్టితో సృజించిన వాడి ముందు నేను మోకరిల్లనా?" అంటూ దైవాజ్ఞను పాటించడానికి తిరస్కరించాడు. అంచేత దేవునికి, ఆయన ప్రవక్త (సల్లం)కు విధేయులయి వారి ఆజ్ఞల్ని పాటిస్తున్న విశ్వాసులు ఎలాంటి అహంకారానికి లోనుకాకుండా జాగ్రత్తగా ఉండాలి.

దైవప్రవక్త (సల్లం) అహంకారుల పర్యవసానాన్ని గురించి చెబుతూ ఇలా సెల విచ్చారు: "గర్వపోతులు (ప్రళయదినాన) చీమల్లాంటి చిన్న దేహాలతో లేపబడతారు. వారి ముఖాలు మాత్రం మానవుల ముఖాల మాదిరిగానే ఉంటాయి. వారిని నలు వైపుల నుంచి నైచ్యం, అవమానాలు చుట్టుముడ్తాయి. అదే పరిస్థితిలో వారిని నరక కారాగారంలోకి తోలేయడం జరుగుతుంది. ఆ కారాగారం పేరు బూలస్. దాన్ని భగభగ మండే అగ్నిజ్వాలలు ఆవరించి ఉంటాయి. అక్కడ ఆ గర్విష్ఠికి నరకవాసుల శరీరాల నుండి వెలువడే (కంపుకొట్టే) ద్రవాలను తాగించడం జరుగుతుంది." (మిష్కాత్)

దైవప్రవక్త (స) ఈవిధంగా ప్రవచించారు: "నరకంలో 'హబ్‌హబ్' అనే లోయ ఉంటుంది. ఆ లోయలో అన్ని విధాల అహంకారులు ఉంటారు." (తిర్మిజి)

**పేరుప్రతిష్ఠల కోసం ప్రాకులాడటం :** ముస్లింలు ఏ సత్కార్యం చేసినా దైవ ప్రసన్నతను ఆశిస్తూ చిత్తశుద్ధితో చేయాలి. లోకులు మెప్పు కోసం చేయకూడదు. లోకులమెప్పు కోసం చేసే సత్కార్యాలన్నీ పరలోకంలో నిష్ప్రయోజనం అవుతాయి.

దైవప్రవక్త (సల్లం) ఓసారి అనుచరులతో ముచ్చటిస్తూ "దుఃఖపు నుయ్యి కీడు నుండి దేవుని శరణు వేడుకోండి" అన్నారు. అనుచరులు ఈమాట విని "దుఃఖపు నుయ్యి అంటే ఏమిటీ దైవప్రవక్తా!" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధాన మిస్తూ "నరకంలో అదొక పెద్ద గుంట. దాని కీడు నుండి స్వయంగా నరకం రోజుకు నాలుగొందల సార్లు దేవుని శరణు కోరుతుంది" అని చెప్పారు.

అనుచరులు "ఆ గుంటలోకి ఎవరు పోతారు?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) "లోకులమెప్పు కోసం సత్కర్మలు ఆచరించే దైవభక్తులు పోతారు"అన్నారు. (తిర్మిజి)

## 99.9 శాతం నరకానికి పోయేవారే-54

మానవుల్లో దుర్జనులే అత్యధికమంది ఉంటారు. సజ్జనులు బహు తక్కువమంది ఉంటారు. ఈ కారణంగానే నరకానికి అత్యధికమంది, స్వర్గానికి బహు తక్కువమంది పోతారు. అంతిమ దైవప్రవక్త (సల్లం) ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ఇలా తెలిపారు:

"దేవుడు (ఆదిమానవుడు) హజ్రత్ ఆదం (అలైహి)ని ఉద్దేశించి "ఓ ఆదం! అని పిలుస్తాడు. దానికి హజ్రత్ ఆదం (అలైహి) "ప్రభూ! నేను మీ సన్నిధిలోనే ఉన్నాను. ఆజ్ఞాపించండి, మీ ఆజ్ఞలకు బద్ధుణ్ణయి ఉన్నాను. మేలు, శ్రేష్ఠతలన్నీ మీ చేతిలోనే ఉన్నాయి" అని అంటారు. అప్పుడు విశ్వప్రభువైన దేవుడు "(నీ సంతానం నుంచి) నరకవాసుల్ని తీసెయ్యి" అని ఆజ్ఞాపిస్తాడు. హజ్రత్ ఆదం (అలైహి) "నరకవాసులు ఎంతమంది ఉన్నారు?" అని అడుగుతారు. దేవుడు "1000 మందికి 999 మంది నరకవాసులు ఉన్నారు" అంటాడు.

ఆదంసంతానం (మానవులు) ఈమాట వినగానే తీవ్రంగా ఆందోళన చెందుతారు. (అమితమైన దిగులు, భయాందోళనలతో) పిల్లలు సైతం వృద్ధులైపోతారు. గర్భిణీ స్త్రీలకు గర్భస్రావం అవుతుంది. జనం స్పృహలో ఉన్నప్పటికీ తీవ్రమైన నిస్పృహకు గురవుతారు. ఏమైనప్పటికీ దైవశిక్ష కఠినంగా ఉంటుంది."

ప్రవక్త అనుచరులు దైవప్రవక్త (సల్లం) నోట ఈ మాటలు విని "అయితే దైవ ప్రవక్తా! ఆ ఒక్క స్వర్గవాసి మాలో ఎవరెవరయి ఉంటారు?" అని ప్రశ్నించారు. దైవప్రవక్త (సల్లం) జవాబిస్తూ "(కంగారు పడకండి.) సంతోషించండి. ఒక్కరు మీలోని వారుంటారు. వేయిమంది యాజూజ్, మాజూజ్‌లలోని వారుంటారు" అని చెప్పారు. (మిష్కాత్)

అంటే మానవులందరిలో 0.1 శాతం మంది ముస్లింలు స్వర్గానికి పోతే, 99.9 శాతం మంది ఇతరులు నరకానికి పోతారన్నమాట. మరోమాటలో చెప్పాలంటే మొత్తం వేయిమందిలో ఒకరు మాత్రమే స్వర్గానికి పోతారు. మిగిలిన 999 మంది మానవులు నరకానికి పోతారు. దీనికి కారణం ఏమిటో దివ్యఖుర్‌ఆన్ ఇలా చెబుతోంది:

"మేము అనేకమంది మానవుల్ని, జిన్నుల్ని నరకం కోసమే పుట్టించాము. వారికి హృదయాలున్నాయిగాని, వాటితో అర్థం చేసుకోరు; కళ్ళున్నాయిగాని, వాటితో చూడరు; చెవులున్నాయిగాని, వాటితో వినరు. వారు పశువుల్లాంటివారు. వారసలు అంతకంటే కూడా దిగజారిపోయారు. వారు పూర్తిగా ఏమరుపాటుకు లోనయ్యారు." (7:179)



హృదయముండి ఆలోచించనివారు, కళ్ళుండి చూడనివారు, చెవులుండి వినని వారు ఎవరూ ఉండరు. కాని ఖుర్‌ఆన్ ఇలా ఆరోపిస్తుందంటే కారణం, వారు పరలోక విషయంలో మాత్రమే ఇలా ప్రవర్తిస్తారు. విశ్వవ్యవస్థ వెనుక ఉన్న సృష్టికర్త హస్తాన్ని గురించి ప్రశాంతంగా ఆలోచించరు. సృష్టి వ్యవస్థలో ఆయన ఏకత్వాన్ని, ఔన్నత్యాన్ని చాటుతున్న అసంఖ్యాక నిదర్శనాలను గమనించరు. దైవం, పరలోకం గురించిన సత్య వాక్కులు వీరి చెవులకెక్కవు.

ఈవైఖరి కారణంగానే వారు మానవస్థాయి నుంచి దిగజారి పశువులకన్నా నికృష్టు లయ్యారని ఖుర్‌ఆన్ అంటోంది. ఇలాంటివారికి ప్రపంచమే సర్వస్వం. ఏవిధంగానైనా వీలైనన్ని ప్రాపంచిక సుఖాలు జుర్రుకోవాలన్నదే వీరి ధ్యేయం. మంచి చెడులతో, ధర్మాధర్మాలతో వీరికి నిమిత్తం లేదు. వీరి దృష్టిలో దగా, మోసం, అవినీతి, అన్యాయం, అన్నీ ధర్మసమ్మతమే. నీటిబుడగ లాంటి ఇహికజీవితం కోసం శాశ్వత పరలోకజీవితాన్ని విస్మరించడంకంటే మించిన ఆత్మవంచన మరేదైనా ఉందా?

**నరకంలో ఎక్కువమంది ధనికులు, స్త్రీలే :-** దైవప్రవక్త(సల్లం) ఇలా తెలిపారు: "నేను స్వర్గంలో చూస్తే ఎక్కువమంది పేదవాళ్ళే కన్పించారు; నరకంలో చూస్తే ఎక్కువ మంది స్త్రీలే కన్పించారు." (మిష్కాత్)

హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖనం: దైవప్రవక్త (సల్లం) ఒకసారి పండుగ లేక బక్రీద్ పండుగ నమాజు కోసం ఈద్గాహ్ వెళ్తున్నారు. దారిలో కొందరు స్త్రీలు తటస్థపడ్డారు. అప్పుడాయన వారితో "మహిళల్లారా! దానధర్మాలు చేస్తూఉండండి. నేను నరకంలో అత్యధికమంది స్త్రీలనే చూశాను" అన్నారు. స్త్రీలు ఈమాట విని "ఎందువల్ల?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ "స్త్రీలు ఎక్కువగా (ఇతరులకు) శాపనార్థాలు పెడ్తుంటారు; భర్తల పట్ల కృతఘ్నులవుతారు" అని చెప్పారు. (బుఖారి, ముస్లిం)

### ధన వికేంద్రీకరణతో పుణ్య సేకరణ

మనిషి తన జీవితంలోని అత్యధిక భాగాన్ని 'ఉపాధి, తదితర ఆర్థిక వ్యవహారాల' కోసమే వినియోగిస్తాడు. అయితే ఈ రంగంలో మన ఇష్టానుసారం వ్యవహరించడమేనా లేక మన సృష్టికర్త పంపిన మార్గదర్శక సూత్రాల ప్రకారం నడచుకోవలసి ఉందా? అనుదిన జీవితంలో నమాజ్‌కు ఎంతో ప్రాముఖ్యమిచ్చే ముస్లింలు కూడా ఈ విషయం గురించి పెద్దగా పట్టించుకోకపోవడం విచారకరం, మన ఐహిక జీవితం ఇలాగే సాగితే మన పరలోకజీవితం అత్యంత విచారకరంగా మారుతుంది. వివరాల కోసం 'ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్' నుండి వెలువడిన "ధన వికేంద్రీకరణ" పుస్తకం చదవండి.

**రెంటికి చెడ్డ రేవడు :** ఈ సృష్టిలో అందరికన్నా పెద్ద దురదృష్టవంతుడు ఎవరైనా ఉన్నాడంటే అతను ఇహలోకంలో కటిక దారిద్ర్యం అనుభవిస్తున్నా దేవుని స్మరణ పట్ల, ఆయన పంపిన ధర్మంపట్ల ఏమరుపాటుకు గురై పాపపంకిలంలో కూరుకు పోయినవాడే. రెంటికిచెడ్డ రేవడిలా అతను ఇహలోకంలోనూ కష్టాలు అనుభవిస్తాడు; పరలోకంలోనూ యాతనలు అనుభవిస్తాడు. ఇదే ఉభయభ్రష్టత్వమంటే.

దైవప్రవక్త(స) హితోక్తి: "ఇటు ఇహలోకంలో దారిద్ర్యం అనుభవించి, అటు పరలోకం లోనూ యాతనలు అనుభవించేవాడు అందరికంటే దురదృష్టవంతుడు." (తర్గీబ్)

## ఆరాఫ్ వాసులకు అటూ ఇటూ-55

నరకం మీదుండే వారధి (పుల్‌సిరాత్) దాటగానే నరకానికి, స్వర్గానికి మధ్య ఒక అడ్డుగోడ లాంటిది ఉంటుంది. దానిని ఆరాఫ్ అంటారు. ముస్లింలలో పాపపుణ్యాలు సమానంగా చేసినవారు వారధి దాటి స్వర్గానికి పోలేక ఇక్కడికి వచ్చి ఆగిపోతారు. ధర్మకాటాలో వారి పాపపుణ్యాల బరువు సమానంగా ఉంటుంది. అందువల్ల వారు నరక గండం నుంచి తప్పించుకోగలిగినా స్వర్గాన్ని అందుకోలేక ఆరాఫ్ మీద కొంతకాలం పడివుంటారు. ఆ తరువాత దేవుని అనుగ్రహంతో స్వర్గానికి చేరుకుంటారు.

స్వర్గానికి చేరుకోక ముందు వారు ఒకవైపు నరకవాసుల్ని, మరోవైపు స్వర్గవాసుల్ని చూస్తూ వారుభయులతో సంభాషిస్తారు.

"ఆ రెండు వర్గాల మధ్య ఒక అడ్డుగోడ ఉంటుంది. దాని శిఖరాలపై మరి కొందరు ఉంటారు. వారు అందర్నీ వారి ముఖచిహ్నాలనుబట్టి గుర్తిస్తారు. అప్పుడు వారు స్వర్గవాసుల్ని ఉద్దేశించి 'మీకు శాంతి కలుగుగాక!' అంటారు. వారింకా స్వర్గంలో ప్రవేశించలేదు. కాని ప్రవేశించగలమని ఆశిస్తున్నారు." తరువాత వారి దృష్టి నరకవాసులపై పడగానే "ప్రభూ! మమ్మల్ని ఈ దుర్మార్గుల్లో చేర్చకు" అని ప్రార్థిస్తారు." (ఖుర్ఆన్-7:46,47)

"ఆ తరువాత శిఖరాలపై ఉన్నవారు నరకంలోని కొందరు వ్యక్తుల్ని వారి ముఖ చిహ్నాల్ని బట్టి గుర్తించి పిలిచి ఇలా అంటారు: 'చూసుకున్నారుగా, ఈరోజు మీ ముఠాలు గాని, మీరు ఘనమైనవని భావించిన మీ వస్తుసామగ్రిగాని మీకు ఏమాత్రం ఉపయోగ పడలేదు. స్వర్గంలో ఉన్న వీరిని చూడండి. మీరు ఎన్నో ప్రమాణాలుచేసి, వీరిపై దేవుడు దయచూపడని అన్నారే!' అని అంటారు. అప్పుడు వారికి 'స్వర్గంలో ప్రవేశించండి. మీకిక ఎలాంటి భయంగాని, దుఃఖం గాని ఉండదు' అని చెప్పబడుతుంది." (ఖుర్ఆన్-7:48,49)

ఇలా ఆరాఫ్‌వాసులు చివరికి స్వర్గంలో ప్రవేశిస్తారు. కర్మఫలాల స్థానాలు రెండే రెండున్నాయి. అవే స్వర్గ నరకాలు. స్వర్గనరకాలే సాఫల్య వైఫల్యాలకు ప్రతిరూపాలు. స్వర్గంలో ప్రవేశించడమే అసలైన సాఫల్యం, పరమమోక్షం. నరక కూపంలో పడటం వైఫల్యానికి, దౌర్భాగ్యానికి పరాకాష్ఠ. పరలోక సాఫల్యవైఫల్యాలే అసలైన సాఫల్య వైఫల్యాలు. ఇహలోక సాఫల్యవైఫల్యాలు క్షణికమైనవి.



**స్వర్గ నరకవాసుల మధ్య సంభాషణ :** "ఆతర్వాత స్వర్గవాసులు నరకవాసుల్ని పిలిచి 'మా ప్రభువు మాకు చేసిన వాగ్దానాలన్నీ నెరవేరాయి. మరి మీరు కూడా మీ ప్రభువు చేసిన వాగ్దానాలు నెరవేరాయని తెలుసుకున్నారా?' అని అడుగుతారు."

"దానికి వారు 'ఆ...తెలుసుకున్నాం' అని సమాధానమిస్తారు."

"అప్పుడు ఒక ప్రకటనకర్త వారి మధ్యకు వచ్చి 'దేవుని మార్గంలోకి రాకుండా ప్రజల్ని నిరోధించిన దుర్మార్గులపై దైవశాపం విరుచుకుపడుగాక! వారు దైవమార్గాన్ని వక్రీకరించదలిచారు, పరలోకాన్ని తిరస్కరించారు' అనంటాడు." (ఖుర్ఆన్-7:44-45)

"నరకవాసులు స్వర్గవాసుల్ని కేకవేసి పిలిచి '(మేమిక్కడ మాడి చస్తున్నాం.) మామీద కొంచెం నీళ్ళు చల్లండి. లేదా మీకు దేవుడు ప్రసాదించిన దాన్నయినా కాస్త మావైపు విసరేయండి' అనంటారు."

"దానికి స్వర్గవాసులు 'దేవుడు ఈ రెండిటినీ సత్యతిరస్కారులకు నిషేధించాడు. వారు తమ ధర్మాన్ని ఆటగా, వినోదంగా చేసుకున్నారు. ప్రాపంచిక జీవితం వారిని మోసగించింది' అని సమాధానమిస్తారు."

"(అప్పుడు) దేవుడు ఇలా అంటాడు: 'వీరు మా సూక్తులు తిరస్కరిస్తూ ఈ దినాన్ని గురించి పట్టించుకోకుండా ఎలా వదిలేశారో మేము కూడా ఈరోజు వీరిని పట్టించు కోకుండా వదిలేస్తున్నాం". (ఖుర్ఆన్-7:50-51)

మనిషి జానెడు పొట్ట నింపడానికి ఎంతగానో ఆలోచిస్తాడు. ఎన్నో పథకాలు రూపొందిస్తాడు. ఎక్కడెక్కడో తిరిగి అన్వేషిస్తాడు. ఎంతో మందిని సంప్రదిస్తాడు. చెమటలు కారేలా శ్రమిస్తాడు. ఇలా జీవితాంతం అవిశ్రాంత పోరాటం జరుపుతాడు. ఎందుకూ? ఈ మూన్నాళ్ళ ప్రపంచంలో మురిసిపోతూ బతుకుబండి లాగడానికి.

మరి ఆత్మ కోసం ఆలోచించవలసిన అవసరం లేదా? దాని ఆహారం కోసం అన్వేషించవలసిన పనిలేదా? అది లభిస్తే మంచిచెడులు పరికించి అవలంబించటం తప్పనిసరి కాదా? పొట్ట కోసం జంతువులు, పక్షులు కూడా అన్వేషిస్తాయి, శ్రమిస్తాయి. కాని బుద్ధిజీవి అయిన మానవుడు పొట్టసంరక్షణతో పాటు, తనకు దేవుడిచ్చిన బుద్ధిని ఉపయోగించి ఆత్మవికాసం కోసం కూడా ఆలోచించి, అన్వేషించి, పని చేయవలసిన అవసరం ఎంతో ఉంది. అలా చేయకపోతే శాశ్వతమైన పరలోక జీవితంలో రక్తకన్నీటితో కుమిలి కుమిలి ఏడ్వవలసి వస్తుంది.

"అప్పుడు దుర్మార్గులు (ప్రాపంచిక మత్తు వదలిపోయి) 'ప్రభూ! మాకు మరో అవకాశమివ్వు. మేము నీ పిలుపునకు (వెంటనే) స్పందించి, నీ ప్రవక్తల అడుగుజాడల్లో నడుస్తాము' అని మొరపెట్టుకుంటారు."(దానికిలా సమాధానం లభిస్తుంది:)

"దీనికి పూర్వం మీరు ప్రమాణాలు చేసిమరీ మీకసలు వినాశకాలమే రాదని చెబుతుండేవారు కదూ? నిజానికి మీరు (ఆనాడు) ఆత్మవినాశానికి పాల్పడినవారి

నివాసప్రాంతాల్లోనే జీవితం గడిపారు. మేము వారిపట్ల ఎలా వ్యవహరించామో మీరు చూశారు. వారిగాధలు ఉదాహరిస్తూ మీకు హితోపదేశం కూడా చేశాం. (అయినా మీకు బుద్ధి రాలేదు.) ఇప్పుడు సమయం మించిపోయింది". (ఖుర్ఆన్-14:44,45)

"మీకు ఇవ్వబడినదంతా కేవలం ప్రాపంచిక జీవన సంపద, క్షణికమైన దాని తళుకు బెళుకులు మాత్రమే. దేవుని దగ్గర (పరలోకంలో) ఉన్నది ఇంతకంటే ఎంతో శ్రేష్ఠమైనది, శాశ్వతమైనది. మీరు బుద్ధినుపయోగించి ఆలోచించరా?" (ఖుర్ఆన్-28:60)

## స్వర్గ సీమ-56

స్వర్గం అంటే సుఖసంతోషాలకు, భోగభాగ్యాలకు శాశ్వత స్థావరం. శ్రమ, అలసట, బాధ, దుఃఖం, ఆందోళనలు మచ్చుకైనా లేని శాంతినిలయం. అసూయ, అసంతృప్తి, విరోధం, విద్వేషాలకు ఏమాత్రం తావివ్వని ఏక హృదయకోశం. కోరిన వరం తక్షణం లభించే ఆనందనిలయం. అనుక్షణం ఆనంద డోలికల్లో ఉర్రూతలూగించే నిత్య హరితవనం. ఆత్మ, అంతరంగం, దేహం, చైతన్యాలలోని అణువణువును పులకింపజేస్తూ దైవదర్శనభాగ్యం కలిగించే ముక్తిప్రదాయని.

"సత్యాన్ని విశ్వసించి సదాచార సంపన్నులైనవారికి ఆతిథ్యంగా అత్యున్నత స్వర్గ వనాలున్నాయి. వారక్కడ కలకాలం (హాయిగా) ఉంటారు. ఇక ఎన్నటికీ అక్కడ్నుంచి వేరే చోటికి పోవడానికి వారికి మనస్కరించదు." (ఖుర్ఆన్-18:107,108)

**స్వర్గం విలువ :** ఇహలోకంలోని యావత్తు సంపదతో పోల్చితే స్వర్గంలోని ఏ ఒక్క వస్తువుకు కూడా మనం విలువ కట్టలేము. ఖుర్ఆన్, హదీసుల్లో వచ్చిన పోలికలు మానవుల మేధాశక్తికి తగినవిధంగా నచ్చజెప్పడానికి మాత్రమే పేర్కొనబడ్డాయి.

స్వర్గం విలువను గురించి ఒక హదీసులో మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈవిధంగా తెలియజేశారు: "స్వర్గంలో ఒక కమ్చీ (చంద్రకోల) ఆక్రమించు కునేటంతటి (చాలా కొద్దిపాటి) స్థలం యావత్తు ప్రపంచం, ప్రపంచంలోని సమస్త వస్తువుల కంటే ఎంతో శ్రేష్ఠమైనది." (ముస్లిం)

వేరొక హదీసులో ఆయన ఇలా తెలిపారు: "ప్రపంచంలో సూర్యోదయం, సూర్యాస్త మయాలు ఆవరించే యావత్తు వస్తువుల కంటే స్వర్గంలో ఒక ధనస్సులో అర్ధభాగం ఆక్రమించే స్థలమే ఎంతో శ్రేష్ఠమైనది." (బుఖారి)

రౌతు గుర్రం మీదనుంచి దిగిన తర్వాత స్థలం ఆక్రమించుకోవడానికి ముందుగా తన చంద్రకోలను నేల మీద పడవేస్తాడు. కాలినడకన నడిచేవాడు కూర్చునేటప్పుడు మొదట తన ధనస్సును క్రింద పెడ్తాడు. దైవప్రవక్త (సల్లం) స్వర్గం విలువను, దాని ఔన్నత్యాన్ని వివరించడానికి చంద్రకోలను, ధనస్సును ఉదాహరణలుగా ఇస్తూ స్వర్గంలో ఒక చంద్రకోల, సగం ధనస్సు ఆక్రమించేటంతటి స్థలం యావత్తు ప్రపంచంలోని సువిశాలమైన స్థలం కంటే ఎంతో శ్రేష్ఠమైనదని చెప్పారు.



స్వర్గం ఇంతకంటే కూడా ఎంతో విలువైనది, శ్రేష్ఠమైనది. దాని విలువ, శ్రేష్ఠతలు మానవుని ఊహకే అతీతమైనవి. ఖుర్ఆన్, హదీసుల్లో పేర్కొనబడిన వస్తువులే గాకుండా ఇంకా ఎన్నో అసంఖ్యాకమైన వస్తువులు స్వర్గంలో ఉన్నాయి.

"వారు చేసుకున్న సత్కర్మలకు ప్రతిఫలంగా వారి కళ్లను చల్లబరిచే అపూర్వ సామగ్రి వారికోసం దాచబడిఉంది. దాన్ని గురించి ఏ మనిషికీ తెలియదు. (అది ఊహాతీతమైన అద్భుత మహాభాగ్యం.)" (దివ్యఖుర్ఆన్-32:17)

ఈసూక్తి గురించి దైవప్రవక్త(సల్లం) ఒక హదీసులో దేవుని మాటలుగా ఇలా తెలిపారు: "నేను నా భక్తుల కోసం స్వర్గంలో ఎంతో అపురూపమైన వస్తుసంపద దాచి పెట్టాను. వాటిని ఇంతవరకు ఎవరి కళ్ళూ చూడలేదు; ఎవరి చెవులూ వినలేదు. చివరికి మానవుని మనస్సు సైతం వాటిని గురించి ఊహించలేదు". (బుఖారి, ముస్లిం)

**స్వర్గ నిర్మాణం :** హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం: "దైవప్రవక్తా! స్వర్గం దేనితో నిర్మించబడింది?" అని అడిగాను నేను. దానికాయాన ఇలా సమాధానమిచ్చారు:

"స్వర్గం ఒక వెండిఇటుక, ఒక బంగారుఇటుక చొప్పున వెండిబంగారాల ఇటుక లతో, ఘాటైన సువాసనగల కస్తూరి గచ్చుతో, మణిమాణిక్యాల కంకరతో, మందార పువ్వు వాసనగల ఒక విధమైన మట్టితో నిర్మించబడింది. ఒకసారి స్వర్గంలో ప్రవేశించిన మనిషి ఇక ఎల్లప్పుడూ భోగభాగ్యాలు అనుభవిస్తూ ఉంటాడు. అతనికి ఎలాంటి కొరత ఉండదు. శాశ్వతంగా జీవించి ఉంటాడు. మరణం దరిదాపులక్కూడా రాదు. అతని బట్టలు మాసిపోవడంగాని, చీకిపోవడంగాని జరగదు. అతని యౌవనం కూడా ఏమాత్రం తగ్గదు." (అహ్మద్, తిర్మిజి)

**విస్తీర్ణం:** ఈ ప్రపంచంలో ఎంతపెద్ద ధనికుడికైనా తానుండే ఇండ్లు, తిరిగే పరిసరాలు ఎక్కడో ఓచోట కొద్దోగొప్పో ఇరుకుగా ఉంటాయి. ఇక ఇతరుల సంగతయితే చెప్పనవసరం లేదు. ప్రతిచోటా ఇరుకే. కోరుకున్నచోట స్వేచ్ఛగా, సులభంగా మసలుకో లేడు. స్వర్గంలో మాత్రం ఎక్కడా ఎలాంటి ఇరుకు ఉండదు. స్వర్గం ఎంతో విశాలంగా ఉంటుంది. కోరుకున్న చోట స్వేచ్ఛగా, సులభంగా విహరించవచ్చు.

"భూమ్యాకాశాలంత విశాలమైన స్వర్గసీమ వైపుకు పరుగెత్తండి. అది భయభక్తులు కలవారి కోసం సిద్ధం చేయబడి ఉంది." (ఖుర్ఆన్-3:133)

"ప్రపంచజీవితం మాయ, భ్రాంతి తప్ప మరేమీ లేదు. దేవుడ్ని, ఆయన ప్రవక్తల్ని విశ్వసించినవారి కోసం స్వర్గసీమ ఉంది. (కనుక) దేవుని మన్నింపు వైపు, భూమ్యాకాశాలంత విశాలమైన ఆ స్వర్గసీమ వైపు పోటీపడి పరుగెత్తండి." (ఖుర్ఆన్- 57:20,21)

**అంతస్తులు :** స్వర్గంలో ఒక దాని మీద ఒకటి చొప్పున తరగతుల వారిగా వందకు పైగా అంతస్తులు ఉంటాయి. పుణ్యకర్మల స్థాయిని బట్టి ఈ అంతస్తులు కేటా యించబడతాయి.

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "ఎవరు సత్యాన్ని విశ్వసించి, నమాజ్ ఆచరించి, ఉపవాసాలు పాటిస్తాడో అతడ్ని దేవుడు స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు. అతను దైవమార్గంలో ఉన్నచోటు నుండి వేరే చోటికి వలసపోయినా, లేక జన్మస్థానంలోనే ఉండిపోయినా సరే." ప్రవక్త అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! మరి ఈ శుభవార్త ప్రజలకు చెప్పమంటారా?" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"తప్పకుండా స్వర్గంలో వంద అంతస్తులు ఉన్నాయి. దేవుడు వీటిని దైవమార్గంలో పోరాటం జరిపేవారి కోసం తయారుచేశాడు. ఒక అంతస్తుకు మరొక అంతస్తుకు మధ్య దూరం భూమ్యాకాశాల మధ్య ఉన్నంత దూరం ఉంటుంది. కనుక మీరు దేవుడ్ని వేడు కునేటప్పుడు ఫిర్దౌస్ స్వర్గం ప్రసాదించమని వేడుకోండి. ఇది అన్నిటికంటే ఎంతో శ్రేష్ఠమైన, అత్యున్నతమైన అంతస్తు. దాని మీదే కరుణామయుని సింహాసనం ఉంది. ఇక్కడ్నుంచే స్వర్గ నదులు (నాలుగు) బయలుదేరుతాయి." (బుఖారి)

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "స్వర్గంలో వంద అంతస్తులు ఉంటాయి. అందులోని ఒక అంతస్తులో గనక (ఇప్పుడున్న) యావత్తు విశ్వవ్యవస్థను తెచ్చిపెడ్తే అదంతా అందులో సులభంగా ఇమిడిపోతుంది." (తిర్మిజి)

ఫతహుల్‌బారి వ్యాఖ్యానకర్త ఈ అంతస్తుల్ని గురించి వ్యాఖ్యానిస్తూ, వంద అంతస్తు లంటే వంద అంతస్తులు మాత్రమే కాదని, వందకంటే ఎక్కువ అంతస్తులు కూడా ఉంటాయని అభిప్రాయపడ్డారు. అరబీభాషలో వంద అనేది ఆధిక్యతను తెలిపే సంఖ్య గనక ఆయన ఈ అభిప్రాయానికి వచ్చివుంటారు.

**ఆకాశహర్మ్యాలు :** "వీరే తమ సహనానికి ప్రతిఫలంగా అత్యున్నత స్థానాలు పొందేవారు. వారిని (దైవదూతలు) ఎంతో గౌరవిస్తూ శాంతివచనాలతో స్వాగతమిస్తారు. వారక్కడ కలకాలం ఉంటారు. ఎంతమంచి నివాసస్థలం అది!" (25:75,76)

"విశ్వప్రభువుకు భయపడి తదనుగుణంగా జీవితం మలచుకునేవారి కోసం (స్వర్గంలో) అంతస్తులవారిగా నిర్మించబడిన ఆకాశహర్మ్యాలు ఉన్నాయి. వాటి క్రింద (చల్లటి) సెలయేరులు ప్రవహిస్తూ ఉంటాయి. ఇది దేవుని వాగ్దానం. దేవుడు తన వాగ్దానాన్ని ఎన్నటికీ భంగపరచడు." (ఖుర్ఆన్-39:19,20)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "మీరు సంధ్యాసమయంలో తూర్పు లేక పడమటి దిక్కున ఆకాశంలోని తేజోవంతమైన తారను చూసినట్లు స్వర్గవాసులు తమ పైనున్న ఆకాశహర్మ్యాలవారిని చూస్తారు." అనుచరులు ఈమాట విని "ఈ ఆకాశహర్మ్యాలు దైవప్రవక్తలకు చెందినవై ఉంటాయి కాబోలు" అన్నారు. దానికి దైవప్రవక్త (స) జవాబిస్తూ "ఔను. నాప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షి! దైవప్రవక్తలే గాకుండా ఆ ఆకాశహర్మ్యాలలో దేవుడ్ని విశ్వసించి ఆయన ప్రవక్తలకు మద్దతిచ్చిన ఇతరులు కూడా అనేకమంది ఉంటారు" అని అన్నారు. (బుఖారి, ముస్లిం)



మరో సందర్భంలో దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: "స్వర్గంలో ఆకాశ హర్మ్యాలు ఉన్నాయి. వాటి బయటిభాగం లోపలికి, లోపలిభాగం బయటికి కన్పిస్తుంది. దేవుడు ఈ ఆకాశహర్మ్యాలను మృదువుగా మాట్లాడే, అతిథులకు అతిథ్యం ఇచ్చే, ఎక్కువగా ఉపవాసాలు పాటించే, రాత్రివేళ జనం నిద్రిస్తున్నప్పుడు లేచి తహజ్జుద్ నమాజ్ చేసేవారి కోసం నిర్మించాడు." (బైహఖి)

**స్వర్గవాసుల కుటీరాలు :** స్వర్గంలో స్వర్గవాసుల హోదా అంతస్తులను బట్టి అనేక రకాల ఇండ్లు ఉంటాయి. ఆ ఇండ్లలో అధమశ్రేణి స్వర్గవాసికి లభించే గృహమే భూలోకంలో ఏ చక్రవర్తికి కూడా లభించనంతటి ఎంతో విశాలమైన, అందమైన, విలువైన గృహం అయి ఉంటుంది.

హజ్రత్ అబూమూసా అష్అరీ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) స్వర్గ వాసుల కుటీరాలను గురించి ఇలా తెలియజేశారు: "స్వర్గవాసి కుటీరం మొత్తం ఒక ముత్యమయి ఉంటుంది. (అంటే ఒకే ముత్యంతో నిర్మించబడిన ఏకముత్య కుటీరం అన్నమాట.) దాని లోపలి భాగం మెరుగు దిద్దబడి ఉంటుంది. దాని ఎత్తు ముప్ఫయి మైళ్ళు (నలభై ఎనిమిది కిలోమీటర్లు) ఉంటుంది. అందులోని ప్రతి గదిలో విశ్వాసి కోసం భార్యలు ఉంటారు. వారిని ఇతరులెవరూ చూడలేరు." (బుఖారి)

**స్వర్గద్వారాలు :** అలాగే స్వర్గంలో అనేక ముఖద్వారాలు ఉంటాయి. విశ్వాసులు తమతమ పుణ్యకర్మలను బట్టి ఈ ద్వారాల గుండా స్వర్గంలో ప్రవేశిస్తారు.

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: "మీలో ఏ ముస్లిం అయినా ఉజూచేసి, అవయవాలన్నీ నీటితో శుభ్రంగా కడిగి (చివర్లో) 'అష్హదుఅల్లాయిలాహ ఇల్లల్లాహు వహ్దహూలాషరీక లహూ వ అష్హదుఅన్న ముహమ్మదన్ అబ్దుహూ వరసూలుహూ' (సాటిలేని ఏకేశ్వరుడయిన అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆయన దాసుడు, సందేశహరుడని నేను సాక్ష్యమిస్తున్నాను.) అని పఠిస్తారో అతనికోసం స్వర్గంలోని ఎనిమిది ముఖద్వారాలు కూడా తెరవబడతాయి. అతను తాను కోరుకున్న ద్వారం గుండా స్వర్గంలో స్వేచ్ఛగా ప్రవేశించవచ్చు." (ముస్లిం)

ఈ ముఖద్వారాలు కూడా ఎంతో పెద్దగా, వెడల్పుగా ఉంటాయి. ఈ ద్వారాల గుండా ఒకేసారి లక్షమంది విశ్వాసులు స్వర్గంలో ప్రవేశిస్తారు. బుఖారి, ముస్లిం గ్రంథాల ప్రకారం స్వర్గంలోని ఒక ద్వారం (లోపలి భాగం) వెడల్పు నలభై సంవత్సరాలు ప్రయాణం చేసిన దూరమంత ఉంటుందని తెలుస్తోంది. ఆ ద్వారాల గుండా స్వర్గంలో ప్రవేశించే వారిని గురించి దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా తెలియజేశారు:

"నా అనుచర సముదాయంలోని డెబ్బయివేల మంది లేక ఏడు లక్షల మంది (బహుశా ఉల్లేఖకుడికి సంఖ్య సరిగా గుర్తులేదు.) ప్రజలు పరస్పరం చేతులు పట్టుకొని స్వర్గద్వారం గుండా లోపలికి తప్పకుండా ప్రవేశిస్తారు. వారిలో చివరి మనిషి ప్రవేశించ

నంతవరకు మొదటి వ్యక్తి ప్రవేశించడు. (అంటే అందరూ ఒకేసారి ప్రవేశిస్తారన్న మాట.) వారి ముఖాలు పూర్ణచంద్రునిలా ప్రకాశిస్తాయి.'' (బుఖారి, ముస్లిం)

ఈవిధంగా స్వర్గంలో ఎన్ని బ్యాచీలు ప్రవేశిస్తాయో, వారంతా ఎన్ని కోట్ల మంది ఉంటారో విశ్వప్రభువుకే తెలుసు.

**వాతావరణం :** స్వర్గంలో మన ఊహక్కూడా తట్టని ఎంతో మంచి వాతావరణం ఉంటుంది. ఆ వాతావరణంలో ఏ విధమైన బాధ, విసుగు, అసంతృప్తి కలిగించే చలిగాని, వేడిగాని ఉండదు. రకరకాల సువాసనలతో, హృదయాలను ఉల్లాసపరిచే పిల్ల తెమ్మెరలతో ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది.

"సహనం వహించినందుకు ప్రతిఫలంగా దేవుడు వారికి స్వర్గవనాలు, పట్టువస్త్రాలు ప్రసాదిస్తాడు. వారక్కడ అద్భుతమైన ఆసనాలపై మెత్తటి దిండ్లకు ఆనుకొని కూర్చొని ఉంటారు. వారికి ఎండబాధగాని, చలిబెడదగాని ఏమాత్రం ఉండదు." (ఖు-76:12,13)

ముజ్హరీ వ్యాఖ్యాన గ్రంథకర్త ఈ సూక్తిపై వ్యాఖ్యానిస్తూ స్వర్గంలో చలి, వేడిమిలేని మధ్యరకం వాతావరణం ఉంటుందని అన్నారు. స్వర్గం స్వయం ప్రకాశవంతమైనదని, అది తనప్రభువు జ్యోతితో కాంతిమంతంగా ఉంటుందని కూడా అన్నారు ఆయన. ఆ తరువాత ఆయన హజ్రత్ అబుల్ఆలియా (రహ్మాలై) అభిప్రాయాన్ని ఉదాహరిస్తూ ఇహలోకంలోని ఉషోదయ కాంతులతో కూడిన వాతావరణం ఉంటుందని, అయితే స్వర్గం అంతకంటే ఎక్కువ కాంతిమంతంగా ఉంటుందని రాశారు.

ఒక హదీసు ప్రకారం స్వర్గసువాసన వంద సంవత్సరాల ప్రయాణమంత దూరం నుంచి గుబాళిస్తుంది. వేరొక హదీసు ప్రకారం స్వర్గసువాసన ఐదొందల సంవత్సరాల ప్రయాణమంత దూరం నుంచి గుబాళిస్తుంది. (తర్గీబ్ వ తర్హీబ్)

**ఆనంద నిలయం :** "ఇక మా నుండి ఎవరికి మేలు జరుగుతుందని ముందే నిర్ణయమైపోయిందో వారు తప్పకుండా నరకానికి దూరంగా ఉంటారు. దాని (భీకర) ధ్వని కాస్తయినా వారికి విన్పించదు. వారు కలకాలం తమకిష్టమైన (స్వర్గ)భాగ్యాలలో ఓలలాడుతుంటారు. తీవ్రమైన (ప్రళయ) బీభత్స సమయంలోనూ వారు ఏమాత్రం ఆందోళనచెందరు. దైవదూతలు వారిని స్వాగతిస్తూ "మీకు వాగ్దానం చేయబడిన (శుభ) దినం ఇదే" అనంటారు." (ఖుర్ఆన్-21:101-103)

"వారిని ఆయన వారు పరమానంద భరితులయ్యే నిలయానికి చేరుస్తాడు." (ఖుర్ఆన్-22:59); "వారికక్కడ ఎలాంటి శ్రమ ఉండదు. అక్కడ్నుంచి వారిని తీసివేయడం కూడా జరగదు." (ఖుర్ఆన్-15:48)

"అక్కడ వారు కోరే ప్రతి కోరికా నెరవేరుతుంది. వారక్కడ శాశ్వతంగా ఉంటారు. దాన్ని (భక్తిపరాయణులకు) ప్రసాదించే బాధ్యత నీ ప్రభువుపై ఉంది. ఇది ఆయన తప్పనిసరిగా నెరవేర్చవలసిన వాగ్దానం." (ఖుర్ఆన్-25:16)



"వారు తమ ప్రభువు ప్రసాదించే మాధుర్యాలను ఆస్వాదిస్తూ సుఖసంతోషాలలో తేలియాడుతుంటారు." (ఖుర్ఆన్-52:18)

"నీ ప్రభువు మరేదైనా తలిస్తే తప్ప వారు స్వర్గంలోనే భూమ్యాకాశాలున్నంత వరకుంటారు. వారికక్కడ ఎన్నటికీ ఎడతెగని బహుమానాలు లభిస్తాయి." (11:108)

## స్వర్గప్రవేశం-57

సృష్టికర్తను, ఆయన ప్రవక్తల్ని మనస్ఫూర్తిగా విశ్వసించి, తదనుగుణమైన సత్కర్మలు ఆచరించిన పుణ్యాత్ములు పరమానంద భరితులవుతూ స్వర్గానికి వెళ్తారు.

"మా సూక్తుల్ని విశ్వసించి మంచి పనులు చేసేవారు (ఎంతో అదృష్టవంతులు.)- మేము ఏ మనిషిపైనా అతని శక్తికి మించిన బాధ్యత మోపము- (వారు) స్వర్గవాసులవుతారు. అక్కడే వారిక శాశ్వతంగా ఉంటారు." (దివ్యఖుర్ఆన్-7:42)

**హృదయ పరిశుద్ధత :** ప్రపంచంలో ఉన్నప్పుడు కొన్ని అపోహలు, అపార్థాల వల్ల దైవభీతిపరాయణులైన విశ్వాసుల్లో కూడా పరస్పరం రాగద్వేషాలు చోటు చేసుకుంటాయి. ఒకరి పట్ల ఒకరికి పగ, కోపం, ద్వేషాలు ఉంటాయి. అయితే స్వర్గానికి వెళ్ళిన తరువాత దేవుడు వీటిని వారి హృదయాల నుండి తీసివేస్తాడు. దాంతో వారు సొంత అన్నదమ్ముల కంటే కూడా ఎక్కువ ప్రేమాభిమానాలు కలిగి ఉంటారు.

హజ్రత్ అబూఉమామా (రజి) ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ ''దాడిచేసే క్రూర జంతువుని పారదోలినట్లు దేవుడు హృదయాల నుండి అసూయాద్వేషాలు తీసివేయనంతవరకు ఏవిశ్వాసి కూడా స్వర్గంలో ప్రవేశించడు'' అని అన్నారు. (ఇబ్నెకసీర్)

దైవప్రవక్త (స) హితోక్తి: ''స్వర్గవాసుల హృదయాలు ఒకే మనిషి హృదయంలా ఉంటాయి. వారిలో ఎలాంటి భేదాభిప్రాయాలు, అసూయాద్వేషాలుండవు.'' (బుఖారి)

ఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు కూడా చూడండి:

"వారి హృదయాల్లో రాగద్వేషాలు ఏవైనా వుంటే వాటిని మేము తీసేస్తాం. వారు పరస్పరం అన్నదమ్ముల్లా మారి ఆసనాల మీద ఎదురెదురుగా కూర్చుంటారు." (15:47) "వారి హృదయాల్లో ఒకరికి వ్యతిరేకంగా మరొకరి విషయంలో ఏదైనా ద్వేషభావముంటే దాన్ని మేము తీసేస్తాం. వారి (మేడల)మధ్య సెలయేరులు ప్రవహిస్తుంటాయి." (7:43)

"వారు(ఈ వైభవాలు చూసి) 'సకల స్తోత్రాలు దేవునికే శోభిస్తాయి. ఆయనే మాకీ మార్గం చూపించాడు. ఆయన మాకు సన్మార్గం చూపకపోయిఉంటే మాఅంతట మేమీ మార్గం పొందగలిగేవారం కాము. మాప్రభువు పంపిన ప్రవక్తలు నిజంగా సత్యాన్నే తెచ్చారు' అనంటారు. ఆ సమయంలో 'మీరీ స్వర్గానికి వారసులయ్యారు. మీరు చేసుకున్న కర్మలకు ప్రతిఫలంగా ఈస్వర్గం మీకు లభించింది' అని అశరీరవాణి విన్పిస్తుంది వారికి." (దివ్య ఖుర్ఆన్-7:43)

**ప్రతీకారం :** స్వర్గప్రవేశానికి ముందు జరిగే తతంగం గురించి దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: "విశ్వాసులు నరకప్రమాదం నుండి బయటపడిన తర్వాత స్వర్గనరకాల మధ్య ఉండే ఒక వంతెన మీద వారిని ఆపివేయడం జరుగుతుంది. వారు లోగడ పరస్పరం ఏదైనా అన్యాయానికి, దౌర్జన్యానికి పాల్పడివుంటే దాని బదులు తీర్చుకునే అవకాశం ఇవ్వబడుతుంది. ఈవిధంగా అన్యాయం, దౌర్జన్యాల మచ్చ తొలగిపోయి పరిశుద్ధులయిన తరువాత వారికి స్వర్గంలో ప్రవేశించేందుకు అనుమతి లభిస్తుంది. ఎవరి అధీనంలో ముహమ్మద్ ప్రాణముందో ఆ శక్తిస్వరూపుని సాక్ష్యం! వారిలో ప్రతి మనిషీ ఇహలోకంలోని తన ఇంటికి పోయే దారిని ఎలా గుర్తుపట్టి వెళ్తాడో, స్వర్గంలో తన ఇంటికి పోయే దారిని అంతకంటే బాగా గుర్తుపట్టి వెళ్తాడు." (బుఖారి)

ఇక మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) స్వర్గప్రవేశం గురించి ప్రస్తావిస్తూ ఇలా తెలియజేశారు: "ప్రళయదినాన యావత్తు దైవప్రవక్తల కంటే నా విధానం ప్రకారం నడుచు కున్నవారు ఎక్కువమంది ఉంటారు. అందరికన్నా ముందు నేను స్వర్గద్వారం (తెరిపించడానికి దాన్ని) తట్టుతాను." (ముస్లిం)

"ప్రళయదినాన నేను స్వర్గం దగ్గరికెళ్ళి తలుపు తట్టుతాను. లోపల నుంచి ద్వారపాలకుడు "ఎవరు మీరు?" అంటాడు. నేను "ముహమ్మద్‌ని" అంటాను. ద్వారపాలకుడు ఈమాట విని 'మొట్టమొదట మీ కోసం మాత్రమే తలుపు తెరవమని, మీకు ముందు మరెవరు వచ్చినా తెరవకూడదని నాకు ఉత్తర్వు లభించింది' అని అంటాడు." (ముస్లిం)

"నేను అందరికంటే ముందు స్వర్గద్వారం తట్టుతాను. దేవుడు నా కోసం ద్వారం తెరిపించి నన్ను స్వర్గంలోకి ప్రవేశింపజేస్తాడు. నాతో పాటు నిరుపేదలైన విశ్వాసులు ఉంటారు. నేనీ మాటలు గర్వంగా చెప్పడం లేదు. నేను దేవుని దృష్టిలో యావత్తు మానవులలో ఎక్కువ గౌరవనీయుడ్ని." (తిర్మిజి)

పుణ్యాత్ముల స్వర్గప్రవేశం గురించి ఖుర్ఆన్ ఈవిధంగా పేర్కొంటున్నది:

**స్వాగతోత్సవం :** "విశ్వప్రభువుకు భయపడుతూ తదనుగుణంగా జీవితం గడిపిన వారిని తండోప తండలుగా స్వర్గం వైపు తీసుకుపోవడం జరుగుతుంది. అలా వారు స్వర్గం దగ్గరకు చేరుకుంటారు. అక్కడ స్వర్గద్వారాలు ముందే తెరవబడి ఉంటాయి.

అప్పుడు స్వర్గపాలకులు వారిని సాదరంగా ఆహ్వానిస్తూ "మీకు శాంతీసౌభాగ్యాలు కలుగుగాక! మీరు ఎంతో మంచివారు. ఇక శాశ్వతంగా ఇందులో ప్రవేశించి ఉండండి" అని అంటారు. (ఖుర్ఆన్-39:73)

దానికి వారు సమాధానమిస్తూ "సకల ప్రశంసలు దేవునికే శోభిస్తాయి. ఆయన మాకు చేసిన వాగ్దానం నెరవేర్చిచూపాడు. మమ్మల్ని ధరణికి వారసులుగా చేశాడు. ఇప్పుడు మేము కోరిన చోట నివాసం ఏర్పరచుకోగలం" అనంటారు. కనుక సదాచార సంపన్నులకు (ఈవిధంగా) అత్యంత శ్రేష్ఠమైన ప్రతిఫలం లభిస్తుంది. (ఖుర్ఆన్-39:74)



"దైవభీతిపరులు స్వర్గవనాలలో (చల్లటి) సెలయేరుల మధ్య ఉంటారు. ఎలాంటి భయం లేకుండా ప్రశాంతంగా, సురక్షితంగా (స్వర్గంలో) ప్రవేశించండని వారితో చెబుతాము." (ఖుర్ఆన్-15:45)

"వారు తమ ప్రభువు ప్రసన్నతను ఆశిస్తూ సహనంతో వ్యవహరిస్తారు. అదీగాక, వారు (ప్రార్థనా(నమాజు) వ్యవస్థను స్థాపిస్తారు. మేము ప్రసాదించిన ఉపాధి నుండి (సత్కార్యాల కోసం) రహస్యం గాను, బహిరంగం గాను ఖర్చుపెడతారు. చెడుని మంచి ద్వారా నిర్మూలిస్తారు. అలాంటి వారికే పరలోక (స్వర్గ) సీమ ఉంది. (అంటే) శాశ్వత నిలయాలుగా లభించే స్వర్గవనాలలో వారు ప్రవేశిస్తారు. వారి తాతముత్తాతలు, తల్లి దండ్రులు, భార్యాపిల్లల్లో సజ్జనులైనవారు కూడా స్వర్గప్రవేశం చేస్తారు. అప్పుడు నలు వైపులనుండి ఎందరో దైవదూతలు వారిని స్వాగతించడానికి వస్తారు. ఆ దూతలు వారికి స్వాగతం చెబుతూ "మీకు శాంతి కలుగుగాక! మీరు ఇహలోకంలో సహనంతో వ్యవహరిస్తూ (సాత్విక) జీవితం గడిపినందుకు ఈరోజు దీనికి అర్హులైపోయారు" అనంటారు. ఆహా! ఎంత శ్రేష్ఠమైనది ఆ పరలోకసీమ!! (ఖుర్ఆన్-13:20-24)

**కృతజ్ఞతలు :** "వారు దేవునికి కృతజ్ఞతలు తెలుపుతూ 'మా దుఃఖం దూరంచేసిన దేవుడు ఎంతో ప్రశంసనీయుడు. నిస్సందేహంగా మా ప్రభువు క్షమించేవాడు, ఆదరించే వాడు. ఆయన తన అనుగ్రహంతో మనకు శాశ్వతనివాసం కల్పించాడు. ఇప్పుడిక్కడ మనకు ఎలాంటి బాధ, అలుపు ఉండవు' అని అంటారు." (ఖుర్ఆన్-35:34,35)

అక్కడ నీవు (మహా అద్భుతం) చూస్తావు. దైవదూతలు దివ్యసింహాసనం చుట్టూ వలయంగా ఏర్పడి తమ ప్రభువు ఔన్నత్యం ప్రశంసిస్తూ, ఆయన పవిత్రతను కొనియాడు తుంటారు. మానవులకు పూర్తిన్యాయం చేకూర్చబడుతుంది. (ఆ సందర్భంలో) "సర్వలోక ప్రభువుకే సకలస్తోత్రాలు!" అనే పలుకులు మార్మోగుతాయి. (ఖుర్ఆన్-39:75)

దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా తెలిపారు: "స్వర్గంలో నిరుపేదలు ధనికుల కంటే అయిదువందల సంవత్సరాలు ముందుగా ప్రవేశిస్తారు." (మిష్కాత్)

**అందరికన్నా మనమే ఫస్ట్ :** దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు- "మనం ప్రపంచంలోకి అందరికంటే చివర్లో వచ్చాము. ప్రళయదినాన ఇతరుల తీర్పు కంటే ముందు మనల్ని గురించిన తీర్పు జరుగుతుంది"..... "మనం ఇక్కడికి అందరికన్నా చివర్లో వచ్చాము. ప్రళయదినాన మనం అందరికన్నా ముందుంటాము. అందరికంటే ముందు మనమే స్వర్గంలో ప్రవేశిస్తాము." (మిష్కాత్)

"స్వర్గానికి పోయేవారంతా (ప్రళయదినాన) 120 పంక్తులలో ఉంటారు. వాటిలో 80 పంక్తులు ఈ అనుచర సముదాయానికి సంబంధించినవయి ఉంటాయి. మిగిలిన 40 పంక్తులు ఇతర (ప్రవక్తల అనుచర) సముదాయాలకు సంబంధించినవయి ఉంటాయి." (మిష్కాత్)

## మూడువర్గాల్లో రెండిటికే స్వర్గం-58

ప్రళయదినాన మానవులంతా మూడు ప్రధాన వర్గాలుగా విడగొట్టబడతారు. ఈ మూడువర్గాల్ని ఓ కవి అన్నట్లు మనం కాస్సేపు ఉత్తములు, మధ్యములు, అధములు అని చెప్పుకుందాం. వాటిలో మొదటి రెండువర్గాలు ఉత్తములు, మధ్యములు స్వర్గానికి వెళ్తారు. మూడోవర్గం అధములు నరకానికి పోతారు. ఆ మూడు వర్గాలవారు ఎవరు, వారి గుణగణాలేమిటి అనే విషయాలు ఖుర్ఆన్‌లో ఇలా వివరంగా పేర్కొనబడ్డాయి:

"అప్పుడు మీరు మూడు వర్గాలుగా చీలిపోతారు: కుడిపక్షంవారు, ఆహా కుడిపక్షం వారి (అదృష్టాన్ని) గురించి ఏమని వర్ణించాలి!

**లెఫ్టిస్టులు :** ఎడమ పక్షంవారు, ఎడమ పక్షంవారి (దౌర్భాగ్యం) గురించి ఇక చెప్పేదేముంది!

ముందుండేవారు, (ప్రతి సత్కార్యంలోనూ) వారు ముందుండేవారే! వారే (దైవ) సన్నిహితులు. వారు అపార సౌఖ్యాలతోకూడిన స్వర్గవనాలలో ఉంటారు." (56:7-12)

ఖుర్ఆన్‌లో మధ్యముల్ని ముందుగా పేర్కొనడం జరిగింది. తర్వాత ఉత్తములు, చివర్లో అధములు పేర్కొనబడ్డారు. సత్కార్యాల్లో ఒకర్నొకరు మించిపోతూ అత్యధిక దైవప్రసన్నత పొందిన దైవసన్నిహితులు ప్రథమ శ్రేణికి చెందిన ఉత్తములు. మిగిలిన రెండు వర్గాల్లో ఒకటి, దైవసింహాసనం కుడివైపున ఉంటుంది. వీరు సత్యాన్ని విశ్వసించి సత్కర్మలు ఆచరించిన సజ్జనులు (మధ్యములు). మూడోవర్గం దైవసింహాసనానికి ఎడమ వైపున ఉంటుంది. వీరు సత్యాన్ని తిరస్కరించిన దౌర్భాగ్యులు (అధములు).

"ముందు తరాలవారిలో (ఇలాంటి దైవసన్నిహితులు) అత్యధికంగా ఉంటారు. తర్వాతి తరాలవారిలో (తక్కువమంది ఉంటారు. వారు రత్నఖచిత ఆసనాల మీద మెత్తటి దిండ్లకానుకొని పరస్పరం ఎదురెదురుగా కూర్చుంటారు." (ఖుర్ఆన్-56:13-16)

ఇబ్నెకసీర్ (రహ్మ) వ్యాఖ్యానం ప్రకారం ముందు తరాలవారు అంటే, ఆయా దైవప్రవక్తల కాలాలకు, వారి సమీప కాలాలకు చెందిన వారన్నమాట. వీరిలో 'దైవసన్నిహితులు' ఎక్కువమంది ఉంటారు. తరువాతి తరాలవారు అంటే, వారి తర్వాత కాలాలకు చెందినవారని అర్థం. వీరిలో 'దైవసన్నిహితులు' తక్కువమంది ఉంటారు.

"వారి (అంటే దైవసన్నిహితుల) సమావేశాలలో నిత్యబాలకులు వారుణీ వాహిని నుండి స్వచ్ఛమైన మధువుతో నిండిన గిన్నెలు, గ్లాసులు, కూజాలు తీసుకొని అటూ ఇటూ తిరుగుతుంటారు. ఆ మధువు సేవిస్తే వారికి ఏమాత్రం మైకం కమ్మడంగాని, బుద్ధి మందగించడంగాని జరగదు." (ఖుర్ఆన్-56:17-19)

"వారు కోరిన పండ్లు తినడానికి ఆ బాలకులు వారి ముందు రకరకాల రుచి కరమైన పండ్లుంచుతారు. అలాగే వారికిష్టమైన పక్షుల మాంసం కూడా ఉంచుతారు."



"వారికోసం అక్కడ అందమైన కళ్ళుగల సుందరాంగులు ఉంటారు. ప్రత్యేకంగా వారి కోసమే దాచిపెట్టిన ముత్యాలవంటి ముగ్ధమనోహర సౌందర్యరాసులు వారు."

"ఇవన్నీ వారు ఐహిక జీవితంలో చేసుకున్న సత్కార్యాలకు ప్రతిఫలంగా ప్రసాదించ బడతాయి. వారక్కడ ఎలాంటి వ్యర్థవిషయాలుగాని, దూషణలుగాని వినరు. ప్రతి మాటా సమంజసంగా, సుహితంగానే ఉంటుంది." (ఖుర్ఆన్-56:20-26)

**రైటిస్టులు :** "ఇక కుడిపక్షంవారు, కుడిపక్షంవారి అదృష్టమే అదృష్టం! ముళ్ళులేని రేగుచెట్ల పండ్లు, అరటిగెలలు, సుదూరంగా విస్తరించిన చల్లటినీడలు, ఎడతెగకుండా ప్రవహించే మంచినీరు, ఎన్నటికీ అంతంగాని సులభంగా అందుబాటులో ఉండే అసంఖ్యాకమైన సుమధుర ఫలాలు, ఎత్తయిన పరుపులు (వగైరా) భోగభాగ్యాలలో వారు ఓలలాడుతుంటారు." (ఖుర్ఆన్-56:27-34)

"వారి భార్యల్ని మేము ప్రత్యేక పంథాలో సరికొత్తగా సృజిస్తాము. వారిని మేము నిత్యనూతన కన్యలుగా రూపొందిస్తాము. వారు తమ భర్తలను అమితంగా ప్రేమిస్తారు. సమవయస్కులైన సతులు వారు." (ఖుర్ఆన్-56:35-38)

"ఇవన్నీ కుడిపక్షం వారికి లభించే మహాభాగ్యాలు. ఇలాంటివారు ముందు తరాలలో, తరువాతి తరాలలోనూ చాలామంది ఉంటారు." (ఖుర్ఆన్-56:39,40)

ఇహలోకంలో ఇస్లాం స్వీకరించి సాత్వికజీవితం గడిపిన స్త్రీలను దేవుడు పరలోకంలో నూతనకన్యలుగా చేసి స్వర్గానికి పంపుతాడు. ప్రపంచంలో భార్యాభర్తలు ఇద్దరూ సత్యాన్ని విశ్వసించి సాత్వికజీవితం గడిపిఉంటే స్వర్గంలో వారిద్దరు భార్యాభర్తలుగానే కొనసాగుతారు. ఒకవేళ వారిద్దరిలో ఒకరు మాత్రమే సన్మార్గగామి అయివుంటే, ఆ స్త్రీ లేక పురుషుని వివాహం ఇతర సన్మార్గగాములైన పురుషుడు లేక స్త్రీతో జరుగుతుంది.

"(కఠినమైన కనుమంటే) బానిసను బంధవిముక్తి చేయడం, లేదా (కరువుదినాల్లో) ఆకలిగొన్న రోజు సమీప అనాథకుగాని, దారిద్ర్యంలో మగ్గే నిరుపేదకుగాని పట్టెడన్నం పెట్టడం, ఆపై ఓర్పు, దయాదాక్షిణ్యాల్ని గురించి పరస్పరం ఉపదేశించుకునే విశ్వాసుల్లో చేరిపోవడం. ఇలాంటివారే కుడిపక్షం వాళ్ళు." (ఖుర్ఆన్-90:13-18)

"పోతే మా సూక్తుల్ని తిరస్కరించినవారు ఎడమపక్షం వారవుతారు. వారిని (నరకా)అగ్ని (నలువైపులా) చుట్టుముట్టి ఉంటుంది." (ఖుర్ఆన్-90:19,20)

"ఎడమపక్షంవారి దౌర్భాగ్యం గురించి ఏమని చెప్పాలి? వారు (నరకంలో శరీరాన్ని మలమల మాడ్చివేసే వడగాల్పుల మధ్య సలసల మరిగే నీటిని తాగుతూ, ఎలాంటి సుఖాన్నిగాని, చల్లదనాన్నిగాని ఇవ్వని నల్లటి కారుపొగల్లో ఉంటారు."

"ఈపర్యవసానానికి ముందు వీరు (ఇహలోకంలో) భోగభాగ్యాలు అనుభవిస్తూ, ఘోరమైన పాపకార్యాల్లో కూరుకుపోయి వాటి విషయంలో మొండిగా వ్యవహరిస్తూ

ఉండేవారు. పైపెచ్చు 'మేము చచ్చి మట్టిలో కలసిపోయి అస్తిపంజరాల్లా మారిపోయాక మళ్ళీ బ్రతికి లేపబడతామా? గతంలో చనిపోయిన మా తాతముత్తాతలను కూడా బ్రతికించి లేపడం జరుగుతుందా?' అని అనేవారు." (ఖుర్ఆన్-56:41-48)

## అధమశ్రేణి స్వర్గనివాసి-59

క్షణభంగురం లాంటి ఈ ప్రాపంచిక జీవితంలోని కష్ట సుఖాలు పరలోకంలోని ఊహాతీతమైన శిక్షలు-సౌఖ్యాల ముందు ఏపాటివీ కావు. ఈ వాస్తవాన్ని మహాప్రవక్త (సల్లం) ఒక హదీసులో ఇలా తెలిపారు:

**స్వర్గనరకాల తీవ్రతాపరీక్ష :** "ఇహలోకంలో అత్యధిక సుఖభోగాలు అనుభవించిన నరకార్హుడయిన ఒక మనిషిని ప్రళయదినాన తెచ్చి నరకంలో పడవేయడం జరుగుతుంది. నరకజ్వాల్లో అతని దేహం దహించుకుపోయి ఆ రంగును పరిగ్రహించినప్పుడు దేవుడు అతనితో "ఆదం పుత్రుడా! నీవు ఎప్పుడైనా మంచిరోజులు చూశావా? సుఖాన్ని, భోగభాగ్యాలను ఒక్క సారయినా అనుభవించావా?" అని అడుగుతాడు. దానికి ఆ నరకవాసి "లేదు ప్రభో! నీ సాక్షిగా, ఎన్నడూ లేదు" అనంటాడు.

అలాగే ఇహలోకంలో దుర్భర దారిద్ర్యం అనుభవించిన స్వర్గార్హుడయిన ఒక మనిషిని తెచ్చి స్వర్గంలో ప్రవేశింపజేస్తారు. అతనికి స్వర్గసుఖాల రంగు బాగా ఎక్కి అతను వాటిలో తేలియాడుతున్నప్పుడు దేవుడు అతనితో "ఆదం పుత్రుడా! నీవు ఎప్పుడైనా పేదరికాన్ని చవిచూశావా? కష్టాల్ని, ఇబ్బందుల్ని ఎప్పుడైనా ఎదుర్కొన్నావా?" అని అడుగుతాడు. దానికి ఆ స్వర్గవాసి "లేదు ప్రభూ! నేను ఏనాడూ లేమిని ఎరగను. ఏ కష్టాన్నీ అనుభవించలేదు" అనంటాడు. (ముస్లిం)

అంటే నరకవాసి ఇహలోకంలో ఎలాంటి భోగభాగ్యాలలో తులతూగినా, నరకంలో దాపురించే ఒక నిమిషం బాధకే ప్రాపంచిక సుఖాలన్నిటినీ మరచిపోతాడు. అలాగే స్వర్గవాసి ఇహలోకంలో ఎన్ని కష్టనష్టాలకు గురైనా స్వర్గంలో ఓ లిప్తకాలంపాటు పొందే ఆహ్లాదకరమైన మారుతానికే ప్రాపంచిక కష్టాలన్నీ మరచిపోతాడన్న మాట.

స్వర్గలోకానికి, ఇహలోకానికి మధ్య ఎంత వ్యత్యాస ఉందో అది కూడా చూడండి. "స్వర్గంలో ఒక కమ్చీ పెట్టుకునేంత చోటయినా సరే, అది ఇహలోకం కంటే, ఇహలోకంలోని సమస్త వస్తుసామగ్రి కంటే ఎన్నో రెట్లు శ్రేష్ఠమైనది" అని మహాప్రవక్త (సల్లం) తెలియజేశారు. (బుఖారి, ముస్లిం)

స్వర్గంలో అనేక హోదాలు ఉంటాయి. విశ్వాసులు ఐహికజీవితంలో చేసుకున్న కర్మల్ని బట్టి వారికి ఆయా హోదాలు లభిస్తాయి. అయితే సత్కర్మలతోపాటు జీవితాంతం దుష్కర్మలు ఆచరించిన ముస్లింలు ముందుగా ప్రళయదినాన తమ దుష్కర్మల ఫలం అనుభవిస్తారు. ఆ తరువాత దేవుడు దయతో వారికి స్వర్గప్రవేశం చేయిస్తాడు. సృష్టికర్త విశ్వాసుల పట్ల ఎంత దయామయుడో మహాప్రవక్త ఇలా (స) తెలియజేస్తున్నారు:



"అందరికంటే చివర్లో నరకం నుండి బయటపడి, అందరికంటే చివర్లో స్వర్గంలో ప్రవేశించే మనిషి నాకు నిస్సందేహంగా తెలుసు. ఆ మనిషిని ప్రళయదినాన దేవుని ముందు ప్రవేశపెడ్తారు. అతను చేసిన ఘోరపాపాలను కప్పిపుచ్చి చిన్న పాపాలను మాత్రమే అతని ముందుంచండి అని చెప్పడం జరుగుతుంది.

**ప్రతిపాపానికి ఒకపుణ్యం :** అలా అతనిముందు చిన్నపాపాలు వెలిబుచ్చుతూ "నీవు ఫలానారోజు ఫలానా (దుష్)కర్మ చేశావు, ఫలానారోజు ఫలానా (దుష్)కర్మ చేశావు, ఔనా?" అని ప్రశ్నిస్తారు. అతను ఔనని ఒప్పుకుంటాడు. తిరస్కరించలేడు. అయితే తాను చేసిన పెద్ద పాపాలను కూడా బయటపెడ్తారేమోనని భయపడతాడు.

అ తరువాత అతనితో "నీవు చేసిన ఈ పాపాలలోని ప్రతి పాపానికి బదులు ఒక పుణ్యం ప్రసాదిస్తున్నాము, వెళ్ళు" అని చెప్పబడుతుంది.

(అసాధారణమైన ఈ దయాదాక్షిణ్యాలను చూసిన) ఆ మనిషి "అయితే నేను ఇంకా చాలా పాపాలు చేశాను ప్రభూ! అవి ఇక్కడ (నా పాపాల జాబితాలో) కన్పించడం లేదే! (వాటికి బదులు కూడా నాకు ఒక్కొక్క పుణ్యం లభించాలి)" అని అంటాడు.

దైవప్రవక్త (సల్లం) ఈ విషయం చెబుతూ పకాలున నవ్వుతారు. అప్పుడాయన నోట్లో చివరి దవడలు కూడా కన్పిస్తాయి. (ముస్లిం)

అందరికంటే చివర్లో నరకం నుండి బయటపడి, చివర్లో స్వర్గానికి పోయే ఈ వ్యక్తిని మరికొన్ని హదీసుల్లో "అధమశ్రేణి స్వర్గవాసి" అని పేర్కొన్నారు. కాని అతనికి లభించే స్వర్గసౌఖ్యాల్ని గురించి వింటే మనం ఆశ్చర్యపడక తప్పదు. బుఖారి, ముస్లిం గ్రంథాలలోని వివిధ హదీసుల్ని బట్టి ఆ స్వర్గవాసి వివరాలు ఇలా ఉన్నాయి:

**స్వర్గానికి సాహసయాత్ర :** అందరికంటే చివర్లో స్వర్గంలో ప్రవేశించే మనిషి నరకం నుండి బయటపడేందుకు సాహసిస్తాడు. (అలా కొంతదూరం నడిచిన తరువాత శక్తి ఉడిగిపోయి) క్రింద పడిపోతాడు. మరొకసారి అతను (పైకి లేవలేక) పొట్టతో ప్రాకులాడుతాడు. ఒక్కొక్క సారి నరకాగ్నిజ్వాల (ఎగిసిపడి) అతడ్ని దహించి వేస్తుంది. ఈవిధంగా అతను పడుతూ లేస్తూ ప్రాకులాడుతూ చివరికి ఎలాగో నరకం నుండి బ్రతుకుజీవుడా అంటూ బయటపడతాడు.

ఫుర్ఖాన్ భావామృతం



**శ్రమ నాది, ప్రతిఫలం మీది**

ఎవరైనా ఫుర్ఖాన్ భావామృతంతో పాటు ఖుర్ఆన్ భావామృతం కూడా దగ్గర పెట్టుకుంటే వారు ఖుర్ఆన్ జ్ఞానార్జన కోసం తోటకు వెళ్ళి, చెట్టెక్కి, పండు కోసి, తోలుతీసి తినవలసినంత శ్రమ పడవలసిన అవసరముండదు; తోలువలచిన పండు చేతిలో ఉన్నట్లే భావిస్తారు. ఆ శ్రమంతా రచయితే నెత్తిమీద వేసుకొని పాఠకులకు 'రెడీమేడ్' జ్ఞానం అందజేయడానికి శాయాశక్తులా కృషిచేశాడు. (కూర్పు: అబుల్ ఇర్ఫాన్, పేజీలు: 552)

**ఇస్లామిక్‌రిసోర్స్‌సెంటర్, సహారాకాంప్లెక్స్, పత్తర్‌గట్టి, హైదరాబాద్-2, ✆ 9441515414**

నరకం నుండి బయటపడిన తర్వాత (అతనికి ఎంతో హాయి అన్పిస్తుంది.) అతను ఓసారి వెనక్కి తిరిగి నరకం వైపు చూస్తూ "నీ బారి నుండి నన్ను విముక్తి కలిగించిన దేవుడు ఎంతో శుభకరుడు. ఆయన నాకు ప్రథముల్లో, అంతిముల్లో ఎవరికీ లభించని మహాభాగ్యం ప్రసాదించాడు" అని అంటాడు.

ఆ తరువాత కొద్ది దూరంలో అతని కళ్ళ ముందు (మనోహరమైన) ఒక వృక్షం ప్రత్యక్షమవుతుంది. దాన్ని చూసి అతను "ప్రభూ! నన్నా చెట్టు దగ్గరకు చేర్చు. అక్కడ (ప్రవహిస్తున్న సెలయేటిలోని) నీళ్ళు తాగుతాను" అనంటాడు.

దేవుడు ఈమాట విని "నేను నీకీ వరం ప్రసాదిస్తే ఆ తరువాత నీవు మరో కోరిక కోరవచ్చు. అందులో వింతేమీ లేదు" అంటాడు.

"లేదు ప్రభూ! అలా చేయను. ఈ వరం పొందిన తరువాత నేను మరొక కోరిక కోరను" అంటూ వాగ్దానం చేస్తాడు ఆ మనిషి.

(ఆ సమయంలో అతని ఉద్దేశ్యం అదే. కాని ఆ మాటపై స్థిరంగా ఉండలేక పోతాడు. కారణం) అతనికి ఎదురుగా కొంచెం దూరంలో ఎంతో మనోహరమైన మరో వస్తువు కన్పిస్తుంది. అంచేత దాన్ని పొందకుండా అతను సహనం వహించలేడు.

కనుక అతడ్ని ఆ దివ్యవృక్షం దగ్గరికి చేర్చడం జరుగుతుంది. అతను ఆహ్లాదకర మైన ఆ చెట్టు నీడలో కూర్చుంటాడు. (దాని పక్కన పారే సెలయేటి) నీటిని హాయిగా తాగుతాడు. ఆ తరువాత కొద్ది దూరంలో అతనికి మరో దివ్యవృక్షం కన్పిస్తుంది. ఇది మొదటి వృక్షం కంటే ఎంతో శ్రేష్ఠమయినది.

దాన్ని చూడగానే అతను ఉండబట్టలేక "ప్రభూ! నన్నా చెట్టు దగ్గరికి చేర్చు. నేనా చెట్టునీడలో హాయిగా కూర్చొని (అక్కడి సెలయేటి) నీళ్ళు తాగుతాను" అని అంటాడు.

దేవుడు ఈమాట విని "ఆదం కుమారా! ఇక ఏమీ అడగనని నీవు నాకు మాటివ్వ లేదా? నేను నీకీ వరాన్ని కూడా ప్రసాదిస్తే ఆ తరువాత నీవు మరొక కోరిక కోరవచ్చు. అందులో వింతేమీ లేదు" అనంటాడు.

"లేదు ప్రభూ! ఈ వరం పొందిన తరువాత నేనిక మరే వరం కోరను" అంటూ ఆ మనిషి మళ్ళీ వాగ్దానం చేస్తాడు.

అతనికి ఎదురుగా అతి మనోహరమైన మరో వస్తువు కన్పిస్తుంది. దాన్ని పొందకుండా అతను సహనం వహించలేడు. అంచేత దేవుడు అతడ్ని బలహీనుడిగా పరిగణిస్తాడు.

కనుక దేవుడు అతడ్ని ఆ (రెండవ) వృక్షం దగ్గరకు చేర్చుతాడు. అతను ఆ చెట్టు నీడలో కూర్చుంటాడు. (దాని హాయిని, సౌఖ్యాన్ని ఆస్వాదిస్తాడు.) అక్కడున్న సెలయేటి నీటిని (తనివితీరా) తాగుతాడు. ఆ తరువాత మరికొద్ది దూరంలో



స్వర్గద్వారం దగ్గర్లో మరో (మనోహరమైన) వృక్షం ప్రత్యక్షమవుతుంది. ఇది మొదటి రెండు వృక్షాల కంటే ఎంతో అందమయినది, అద్భుతమయినది.

ఆ మనిషి దృష్టి దాని మీద పడుతుంది. ఇంకేముంది, అతను వెంటనే లేచి "ప్రభూ! నన్నా చెట్టు దగ్గరికి చేర్చు. నేనా చెట్టునీడ పొంది, (అక్కడి సెలయేటి) నీటిని తాగుతాను. ఇదొక్కటి తప్ప ఇక ఏదీ నిన్నడగను" అని వేడుకుంటాడు.

సృష్టికర్త అతని మాటలు విని "ఆదంకుమారా! ఇక ఏమీ అడగనని నీవు నాకు గట్టి మాటివ్వలేదా?" అని ప్రశ్నిస్తాడు.

"నిజమే ప్రభూ! నేను మరేమీ కోరనని మాటిచ్చాను. కాని (ఈసారికి మన్నించి నాయీ కోరిక కూడా తీర్చు)" అని ఆ మనిషి మళ్ళీ వేడుకుంటాడు.

అతనికి ఎదురుగా అతి మనోహరమైన వేరొక వస్తువు కన్పిస్తుంది. దాన్ని పొంద కుండా పాపం అతను సహనం వహించలేడు. అందువల్ల దేవుడు అతడ్ని బలహీనుడిగా పరిగణించి ఆ వృక్షం దగ్గరికి చేర్చుతాడు.

అయితే అతనా వృక్షం దగ్గరకు చేరుకోగానే అతనికి (స్వర్గం నుండి) స్వర్గవాసుల మాటలు విన్పిస్తాయి. (స్వర్గ సువాసనలు గుబాళిస్తాయి. మనసును గిలిగింతలు పెట్టే ఆహ్లాదకరమైన వాతావరణం ఆస్వాదిస్తాడు.) దాంతో అతను ఉండబట్టలేక "ప్రభూ! నన్నందులోకి చేర్చు. (ఇక నేను ఏ కోరికా కోరను.)" అని అంటాడు.

"ఆదంకుమారా! ఇలా ఎన్ని కోరికలు కోరుతావు? నీ కోరికలకు హద్దులేదా? సరే, నీకిప్పుడు ఇహలోకమంత (స్వర్గభాగ్యం) ప్రసాదిస్తున్నాను. దాంతోపాటు దానికి పదింతలు ఇంకా ప్రసాదిస్తున్నాను. ఇప్పుడైనా తృప్తిపడతావా?" అంటాడు సృష్టికర్త.

(ఈ మాట విని ఆ మనిషి ఓ పట్టాన నమ్మలేక) "ఏమిటీ, మీరు సకల లోకాల ప్రభువైఉండి (అత్యల్ప జీవిఅయిన) నాతో పరిహాసమాడుతున్నారా?" అనంటాడు.

**సృష్టికర్త నవ్వు :** సృష్టికర్త అతని మాటలు విని నవ్వుతూ "నేను ఏది తలచు కుంటే అది చేయగల్గుతాను. (నేను నిజంగానే నీకంత మహాభాగ్యం ప్రసాదిస్తున్నాను.) వెళ్ళు, స్వర్గంలో ప్రవేశించు" అంటాడు.

ఈమాట విని ఆ మనిషి పరమ సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతూ స్వర్గంలో ప్రవేశించడానికి ముందుకు సాగుతాడు. కాని స్వర్గం దగ్గరికెళ్ళి చూస్తే అది పూర్తిగా నిండిఉన్నట్లు కన్పిస్తుంది. పాపం అతను ముఖం చిట్లించుకొని "స్వర్గం నిండిపోయి కిటకిటలాడుతుంటే అందులో నేనెలా ప్రవేశించాలి. అసలు నా కోసం మీరేదైనా మిగిల్చితేగా!" అనంటాడు.

దానికి విశ్వప్రభువు "నేను నీ కోసం (ఎంతో చోటు కేటాయించాను.) సూర్యుడు ఉదయించే చోటు నుండి అస్తమించే చోటు వరకు ఎంత స్థలం ఉంటుందో అంత

విశాలమైన స్థలం కేటాయించాను, వెళ్ళు" అని అంటాడు.

అప్పుడా మనిషి తృప్తిగా స్వర్గంలో ప్రవేశిస్తాడు. స్వర్గంలో ప్రవేశించిన తరువాత దేవుడు అతనితో "ఇంకా నీ కోరికలేమిటో చెప్పు, వాటన్నిటినీ తీర్చుతాను" అంటాడు.

ఆ మనిషి తన కోరికలన్నీ వ్యక్తపరుస్తాడు. "ఇంకా కోరుకో. ఫలానా ఫలానా విషయాలు ఉండిపోయాయి. వాటిని కూడా కోరుకో" అంటూ దేవుడు గుర్తుచేస్తాడు. ఆవిధంగా దేవుడు ఎన్నో విషయాలు గుర్తుచేస్తుంటే వాటన్నిటిని అతను కోరుకుంటాడు.

అతను కోరిన కోరికలన్నీ నెరవేరిన తరువాత "నీవు కోరినవన్నీ నీకు ప్రసాదించా. ఇంకా అన్ని వస్తువులు కూడా నీకు ప్రసాదించాను" అంటాడు విశ్వప్రభువు.

**అధమశ్రేణి స్వర్గవాసి సామ్రాజ్యం :** అధమశ్రేణి స్వర్గవాసికి లభించే ఈ స్వర్గ సామ్రాజ్యం రెండువేల సంవత్సరాలు ప్రయాణం సాగించినా తరగనంత విశాలంగా ఉంటుంది. అతనికి 80,000 మంది సేవకులు, 72 మంది భార్యలు లభిస్తారు. అతనికోసం మణిమాణిక్యాలతో నిర్మించబడిన ఎంతో అందమైన రాజసౌధం ఉంటుంది. అది వేలాది మైళ్ళ విస్తీర్ణం కలిగి ఉంటుంది.

భార్యలుగా ఇవ్వబడే సుందరాంగుల్లో ఇద్దరు అతని దగ్గరికొచ్చి "సకల స్తోత్రాలు అల్లాహ్‌కే శోభిస్తాయి. ఆయన మా కోసం నీకు శాశ్వత స్వర్గజీవితం ప్రసాదించాడు. నీ కోసం మాకు (సుఖమయ) జీవితం అనుగ్రహించాడు" అనంటారు.

అధమశ్రేణి స్వర్గవాసికే ఇంత గొప్ప సామ్రాజ్యం, ఇన్ని అసాధారణ సౌఖ్యాలతో కూడిన స్వర్గం లభిస్తే, ఇక ఉన్నతశ్రేణి స్వర్గవాసులకు మరెంతటి గొప్ప స్వర్గం లభిస్తుందో ఊహిస్తేనే హృదయం పులకరిస్తుంది.

అయితే పాపకార్యాలకు పాల్పడుతున్న కొందరు ముస్లింలు "పరలోకంలో కొంత కాలం నరక శిక్షలు అనుభవించినా మొత్తంమీద దేవుడు తమను తప్పకుండా స్వర్గానికి పంపిస్తాడని ధీమా వ్యక్తపరుస్తారు. కాని ఒక సారి నరకంలో పడిపోయాక ఎన్ని వందల, వేల సంవత్సరాల తరువాత దాన్నుండి విముక్తి కలుగుతుందో చెప్పలేము. అందువల్ల వీలైనంతవరకు ధర్మవ్యతిరేక విషయాల జోలికి పోకుండా పూర్తిగా ఇస్లామీయ జీవితం గడిపేవారే దేవుని దృష్టిలో విజ్ఞులు, వివేచనాపరులు.

## స్వర్గవాసుల రూపురేఖలు-60

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "స్వర్గంలో ప్రవేశించే మొదటి సమూహంవారి ముఖాలు పున్నమిచంద్రునిలా ప్రకాశిస్తూ ఉంటాయి. వారి తరువాత ప్రవేశించేవారి ముఖాలు ధగధగ మెరిసే నక్షత్రంలా ప్రకాశిస్తూ ఉంటాయి. వారందరి హృదయాలు ఒకే విధంగా ఉంటాయి. వారిలో పరస్పరం ఏ విధమైన ద్వేషం, దురభిమానం, భేదాభిప్రాయాలు ఉండవు. ప్రతి ఒక్కరికి (స్వర్గ



కన్యలలో కనీసం) ఇద్దరు భార్యలు ఉంటారు. వారిద్దరు అపురూప సుందరాంగులు. స్వర్గవాసులు ఉదయం, సాయంత్రం దైవనామ స్మరణ చేస్తుంటారు. వారెప్పుడూ జబ్బు పడరు. వారు ముక్కు చీదడంగాని, ఉమ్మడంగాని చేయరు. వారు వాడే పాత్రలు వెండి బంగారాలతో చేసినవయి ఉంటాయి. వారి దువ్వెనలు కూడా బంగారంతో చేసినవయి ఉంటాయి. వారి ఉంగరాల నుండి సాంబ్రాణి సువాసన వెలువడుతుంది. వారి చెమట కస్తూరీవాసన గుబాళిస్తుంది." (బుఖారి)

ఈ హదీసు మనకు స్వర్గవాసుల శుచీశుభ్రతలను గురించి తెలుపుతోంది. వారికి చీదే, ఉమ్మే అవసరం రాదు. మరికొన్ని హదీసుల్లో వారు మలమూత్రాలు విసర్జించరని ఉంది. పోతే స్వర్గవాసుల శరీరం నుండి వెలువడే చెమట శ్రమ పడటం వల్లగాని, ఉక్కపోయడం వల్లగాని వచ్చే చెమట కాదు. ఇది తిన్న తిండి జీర్ణం అయిన కారణంగా వెలువడే తేలికపాటి చెమట. పైగా ఈ చెమట నుంచి సువాసన కూడా వస్తుంది.




**మహనీయ ముహమ్మద్(స) ఆదర్శ జీవితం**

★ మొదలుపెడితే ముగించేదాకా వదలిపెట్టలేని

**ధారావాహిక నవలా స్రవంతి**

★ విషయాలు ప్రామాణిక గ్రంథాలనుండి సేకరణ

★ సందర్భోచితంగా ఖుర్‌ఆన్ సూక్తులతో వివరణ

రచన: అబుల్‌ఇర్ఫాన్, పేజీలు: 512, వెల: రూ. 175/-లు

**అరాచక వ్యవస్థను మార్చివేసిన ముహమ్మద్ ప్రవక్త**

**"వార్త" సమీక్ష :** తెగల మధ్య పోరాటాలతో, యుద్ధాలతో బహుదేవతారాధన, జంతుబలులు, మూఢనమ్మకాలతో అరాచకంగా తయారైన అరబ్ ప్రపంచాన్ని ఉద్ధరించ దానికి అవతరించిన దైవదూత ముహమ్మద్ ప్రవక్త. విశృంఖల జీవితానికి అలవాటుపడ్డ అరబ్‌ప్రజలలో చిన్ననాటినుండే సత్యసంధత, పరోపకారం, దయాగుణం వంటి సత్ప్రవర్తనలతో తనకంటూ ఒక ప్రత్యేకతతో ముహమ్మద్ ప్రవక్త అందరినీ ఆకర్షించ గలిగాడు.

ముహమ్మద్ ప్రవక్త మతబోధకుడే కాక సంఘసంస్కర్త కూడా. సద్వర్తనుడిగా, వర్తకుడిగా, యోధుడిగా, ప్రవక్తగా పైగంబర్ ముహమ్మద్ జీవితాన్ని గొప్పదనాన్ని తెలియజేసే గ్రంథమిది. ఏడవ శతాబ్దానికి పూర్వం అరబ్ ప్రపంచపు ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక చరిత్రను ఈ పుస్తకం తెలియజేస్తుంది. ముస్లింలే కాకుండా ముస్లిమేతరులు కూడా ముహమ్మద్ ప్రవక్త గురించి తెలుసుకోవడానికి ఈ పుస్తకం ప్రామాణిక గ్రంథంగా ఉపయోగపడుతుంది. ఈ పుస్తకాన్ని కావ్యరీతిలో, సులభసుందర శైలిలో తీర్చిదిద్దిన తీరు ప్రశంసనీయం. చరిత్ర, సంస్కృతి, మతాల గురించి ఆసక్తి ఉన్నవారు అధ్యయనం చేయాల్సిన పుస్తకం.

**– కె.పి. అశోక్ కుమార్ ('వార్త' దినపత్రిక–10.7.2005)**

**ఎత్తు (పొడవు) :** దైవప్రవక్త (సల్లం) స్వర్గవాసి ఎత్తు గురించి ప్రస్తావిస్తూ ఇలా చెప్పారు: "దేవుడు (ఆదిమానవుడు) హజ్రత్ ఆదం (అలైహి)ను సృష్టించినప్పుడు ఆయన ఎత్తు అరవై బారలు (నూటఎనభై అడుగులు) ఉండేది. కనుక స్వర్గంలో ప్రవేశించేవారు ఆదం (అలైహి) మాదిరిగా అరవైబారల ఎత్తుంటారు." (బుఖారి)

దీన్ని బట్టి స్వర్గవాసులంతా నూట ఎనభై అడుగుల ఎత్తుంటారని తెలుస్తోంది. ఎత్తుకు తగ్గ లావు, శరీరసౌష్ఠవాలు కూడా ఉంటాయి. వాటి ప్రకారమే స్వర్గంలోని ఇతర వస్తువులు కూడా ఉంటాయి.

**గడ్డం, మీసాలులేని ముఖాలే అందం :** దైవప్రవక్త (సల్లం) ప్రవచనం ప్రకారం "స్వర్గవాసుల దేహాలపై వెంట్రుకలు ఉండవు. వారి కళ్ళు సుర్మా పెట్టుకోక పోయినా పెట్టుకున్నట్లు అందంగా ఉంటాయి. వారి యౌవనం ఎన్నటికీ తరగదు. వారి దుస్తులు కూడా మాసిపోవు." (తిర్మిజి)

ఇక్కడ దేహం మీద వెంట్రుకలు ఉండవు అంటే తల, కనుబొమలు, కనురెప్పలపై తప్ప శరీరం మీది ఇతర భాగాలపై వెంట్రుకలు ఉండవని అర్థం కావచ్చు. తల మీది వెంట్రుకల్ని గురించి ఏ హదీసులో ప్రస్తావించకపోయినా "స్వర్గవాసుల దువ్వెనలు బంగారపు దువ్వెనలయి ఉంటాయి" అనే హదీసును బట్టి తల మీద వెంట్రుకలు తప్పనిసరిగా ఉంటాయని స్పష్టంగా తెలుస్తోంది. అదేవిధంగా మనం ఇక్కడ అనవసరమైనవని భావించి గొరిగివేసే వెంట్రుకలు అక్కడ స్వర్గవాసులకు ఉండవని కూడా ఊహించవచ్చు.

**స్వర్గవాసుల ఆరోగ్యం, వయస్సు :** "స్వర్గంలో ఒక ప్రకటనకర్త స్వర్గవాసుల్ని పిలుస్తూ ఇలా ప్రకటిస్తాడు: 'స్వర్గవాసులారా! మీరు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంటారు, ఎన్నటికీ జబ్బుపడరు. మీరు శాశ్వతంగా జీవించి ఉంటారు. ఎన్నటికీ మీకు మరణం రాదు. మీరు ఎల్లప్పుడూ యౌవనులుగా ఉంటారు. ఎన్నటికీ ముసలివారు కారు. మీరు ఎల్లప్పుడూ భోగభాగ్యాలు అనుభవిస్తూఉంటారు. ఏనాడూ మీరు లేమికి గురికారు. ఇవన్నీ మీ కోసం (దైవ) నిర్ణీత విషయాలు." (ముస్లిం)

దైవప్రవక్త (స) స్వర్గవాసికుండే వయస్సు గురించి ప్రస్తావిస్తూ ఇలా చెప్పారు: "ఇహలోకం నుండి వెళ్ళిపోయే మనిషి చిన్నవాడయినా, పెద్దవాడయినా (స్వర్గంలో ప్రవేశించే సమయానికి) అతని వయస్సు ముప్ఫయి సంవత్సరాలు ఉంటాయి. అంతకు మించిన వయస్సు ఉండదు." (తిర్మిజి)

ఇక్కడ చిన్నవాడయినా అంటే పిల్లవాడయినా అని అర్థం కాదు. యౌవనంలో అడుగిడిన నాటి నుంచి వయస్సు పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది. అలాగే పెద్దవాడయినా అంటే ఎంత వృద్ధుడయినా అని అర్థం. సాధారణంగా ముప్ఫయి ఏళ్ళ వయస్సులో మనిషి పరిపూర్ణ యౌవనంతో, పూర్తి అవగాహనా శక్తితో, చక్కని



దేహదారుఢ్యంతో, అన్నివిధాల పూర్తి స్పృహతో ఉంటాడు. ఈ కారణంగానే స్వర్గవాసులకు ఈ వయస్సు నిర్ణయించబడింది.

హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం ఒకతను "దైవప్రవక్తా! స్వర్గవాసులు నిద్రపోతారా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ "నిద్ర మరణానికి సోదరి. స్వర్గవాసులకు మరణం రాదు. (కనుక వారికి నిద్ర కూడా రాదు.)" అని చెప్పారు. (మిష్కాత్ షరీఫ్)

సాధారణంగా శ్రమ, వ్యాధి, అలసటల వల్ల నిద్ర వస్తుంది. స్వర్గంలో శ్రమ, వ్యాధి, అలసట మొదలైన బాధలు ఉండవు గనక నిద్ర ప్రసక్తి కూడా ఉండదు.

## స్వర్గ వనాలు-61

స్వర్గాన్ని ఖుర్‌ఆన్ పరిభాషలో జన్నత్ అంటారు. జన్నత్ అంటే వనం అని శాబ్దిక భావం. సాధారణంగా మనం చెట్లు చేమలు ఉండే అందమైన ప్రదేశాన్ని వనంతో పోల్చుతాము. అంచేత వివిధ రకాల వృక్షాలతో కనులపండుగగా శోభిస్తూ అన్ని విధాల వసతులు, సౌకర్యాలు ఉండే స్వర్గానికి జన్నత్ అని పేరివ్వబడింది. ఈవిధంగా స్వర్గానికి వనం (తోట), వనానికి స్వర్గం పర్యాయపదాలయి పోయాయి.

"దైవభీతిపరులకు వారి కోర్కెలునెరవేరే అద్భుతస్థానం ఉంది. మనోహరమైన ఉద్యానవనాలు, సుమధుర ద్రాక్షఫలాలు ఉన్నాయి. సమవయస్కులయిన సుకన్యలు ఉన్నారు. మద్యంతో నిండిన, మెరిసిపోయే మధుపాత్రలున్నాయి." (ఖురాన్-78:31-34)

"ఆరోజు దైవభీతిపరులు స్వర్గవనాలలో చెలమల మధ్య (హాయిగా) ఉంటారు. వారు తమ ప్రభువు ప్రసాదించినదాన్ని అమిత సంతోషంతో స్వీకరిస్తూ ఉంటారు. వారు ఈరోజు రాకపూర్వం నీతిమంతులుగా ఉండేవారు." (ఖుర్‌ఆన్-51:15,16)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు:

"స్వర్గంలో ఒక మహావృక్షం ఉంది. దాని నీడలో ఒక రౌతు వందేళ్ళ ప్రయాణం చేసినా ఆ నీడ చివరిదాకా చేరుకోలేడు." (బుఖారి, ముస్లిం)

"స్వర్గంలోని చెట్ల బోదెలన్నీ బంగారు బోదెలయి ఉంటాయి." (తిర్మిజి)

హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లా (రజి) ఉల్లేఖనం: నేను హజ్రత్ సల్మాన్ ఫార్సి (రజి) దగ్గరకు పోయాను. ఆయన నాతో మాట్లాడుతూ చేతిలోకి ఒక చిన్న కర్రముక్క తీసుకున్నారు. అది ఆయన చేతిలో సరిగా కన్పించడం కూడా లేదు. ఆయన దాన్ని చూపిస్తూ "జరీర్! స్వర్గంలో నీవు ఈమాత్రం కర్రముక్క వెతికినా నీకు కన్పించదు" అని అన్నారు. నేనీ మాట విని "మరి (ఖుర్‌ఆన్‌లో ప్రస్తావించబడిన) ఖర్జూరపు చెట్లు, ఇతర చెట్లు ఏమైపోతాయి?" అని ప్రశ్నించాను. దానికాయన సమాధానమిస్తూ " అవన్నీ ఉంటాయి.

అయితే వాటి బోదెలన్నీ బంగారం, ముత్యాలతో సృజించబడినవయి ఉంటాయి. వాటికి ఖర్జూరపండ్లు కాసి ఉంటాయి" అని చెప్పారు. (బైహఖీ)

ఖుర్‌ఆన్‌లో దైవసన్నిహితులైన భక్తుల కోసం రెండు వనాల ప్రస్తావన ఉంది. ఆ తరువాత సాధారణ భక్తుల కోసం మరో రెండు వనాల ప్రస్తావన ఉంది.

"విశ్వప్రభువు ముందు నిలబడి తన కర్మలకు సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుం దని భావించి భయభక్తులతో జీవితం గడిపిన ప్రతి వ్యక్తికీ రెండు (స్వర్గ)వనాలు లభిస్తాయి. కనుక (మానవులారా! జిన్నులారా!) మీ ప్రభువు ప్రసాదించే ఏ వరాలు మీరు నిరాకరిస్తారు? పచ్చటి రెమ్మలతో శాఖోపశాఖలుగా విస్తరించిన ఉద్యానవనాలవి. మరి మీరు మీప్రభువు అనుగ్రహించే ఏ కానుకలు తిరస్కరించగలరు?" (ఖుర్‌ఆన్- 55:46-49)

"ఆ రెండు వనాలలో రెండు సెలయేరులున్నాయి. కనుక మీ ప్రభువు ప్రసాదించే ఈభాగ్యాలను ఎలా నిరాకరిస్తారు? రెండువనాలలోనూ ప్రతిజాతిఫలానికి చెందిన రెండు రకాలున్నాయి. మీప్రభువు ప్రదానంచేసే ఈబహుమానాలు నిరాకరించగలరా? స్వర్గ వాసులు బంగారు జలతారు అంచులుండే పట్టుపరుపులపై మెత్తటిదిండ్లకు ఆనుకొని కూర్చుంటారు. (వారి ముందు) పండ్లతో నిండిన చెట్లరెమ్మలు వంగి ఉంటాయి. కనుక మీరు మీప్రభువు ప్రసాదించే ఏ మహాభాగ్యాలు నిరాకరిస్తారు?" (ఖుర్‌ఆన్-55:50-55)

"ఆ మహాభాగ్యాల మధ్య (వారి కోసం) సిగ్గులొలికించే స్వర్గ కన్యలుంటారు. వారిని ఈ స్వర్గవాసులకు పూర్వం ఏ మానవుడుగాని, జిన్‌గాని తాకనైనా తాకిఉండడు. కనుక మీరు మీ ప్రభువు ప్రదానం చేసే ఏ బహుమానాలు తిరస్కరించగలరు? వారు మణి మాణిక్యాల్లా అసామాన్య సౌందర్యరాసులు. మరి మీరు మీ ప్రభువు ప్రసాదించే ఈ బహుమానాలు కాదనగలరా?" (ఖుర్‌ఆన్-55:56-59)

"సత్కార్యానికి ప్రతిఫలం సత్కార్యం తప్ప మరేమవుతుంది? కనుక మీ ప్రభువు సద్గుణ సంపత్తిని మీరేవిధంగా త్రోసిపుచ్చగలరు?" (ఖుర్‌ఆన్-55:60,61)

"ఆ రెండువనాలేగాక మరో రెండువనాలు కూడా ఉన్నాయి. కనుక మీ ప్రభువు ఇచ్చే ఏ వరాలు మీరు తిరస్కరించగలరు? అవి దట్టమైన నిత్యహరిత వనాలు. మరి మీరు మీప్రభువు అనుగ్రహాలలో ఏ అనుగ్రహాన్ని నిరాకరించగలరు?" (55:62-65)

"ఆ రెండు వనాలలో రెండు సెలయేరులు పరవళ్ళు తొక్కుతుంటాయి. కనుక మీరు మీ ప్రభువు ప్రసాదించే ఏ కానుకలను తిరస్కరిస్తారు?" (ఖుర్‌ఆన్-55:66,67)

"ఆ ఉద్యానవనాలలో ఖర్జూరం, దానిమ్మ (వగైరా) పండ్లు, ఫలాలు పుష్కలంగా ఉంటాయి. మరి మీరు మీ ప్రభువు ఇచ్చే ఏ భాగ్యాలు కాదనగలరు?" (55:68,69)

"ఆ వనాలలో శీలవతులు, సౌందర్యరాసులైన సతులుంటారు. కనుక మీరు మీ ప్రభువిచ్చే ఏ వరాలు నిరాకరిస్తారు? ఇంకా ఎల్లప్పుడూ పర్ణశాలల్లోనే ఉండే సుందరాం



గులు కూడా. కనుక మీప్రభువు ప్రసాదించే ఈ కానుకల్ని మీరెలా తిరస్కరిస్తారు? వారిని ఈ స్వర్గవాసులకు పూర్వం ఏ మానవుడుగాని, జిన్‌గాని తాకిఉండడు. మరి మీ ప్రభువు ప్రదానంచేసే ఏ బహుమానాలు మీరు త్రోసిపుచ్చుతారు?" (ఖుర్‌ఆన్- 55:70-75)

"అక్కడ స్వర్గవాసులు అత్యంత విలువైన, ఎంతో అపురూపమైన పచ్చటి తివాచీల మీద మెత్తటి దిండ్లకు ఆనుకొని కూర్చుంటారు. కనుక మీరు మీ ప్రభువు అనుగ్రహించే ఏ మహాభాగ్యాలు నిరాకరించగలరు?" (ఖుర్‌ఆన్-55:76,77)

## ఆహార పదార్థాలు-62

స్వర్గంలో ప్రవేశించిన తరువాత స్వర్గవాసులకు మొట్టమొదట ఒక వింతయిన ప్రత్యేక ఆహారం లభిస్తుంది. ఆ పదార్థం ఆ తరువాత మరెప్పుడూ లభించదు.

**విచిత్రాహారం :** మహాప్రవక్త (స) ఈ విచిత్రాహారం గురించి ఇలా చెప్పారు: "ప్రళయదినాన భూమి రొట్టెగా చేయబడుతుంది. మీరు ప్రయాణంలో ఉన్నప్పుడు చేతులతో అటూఇటూ తిప్పి వత్తుతూ చేసినట్లు దాన్ని ప్రళయ రౌద్రుడు తన చేతులతో అటూఇటూ తిప్పి వత్తుతూ తయారుచేస్తాడు. (ఈవిధంగా తయారయిన) ఆ రొట్టెను దేవుడు స్వర్గవాసులకు లభించే మొట్టమొదటి ఆతిథ్యంగా పరిగణిస్తాడు."

దైవప్రవక్త (సల్లం) తన దగ్గరకు ఒక యూదుడు వచ్చి "అబుల్‌ఖాసిం! ప్రళయ దినాన స్వర్గవాసులకు లభించే మొట్టమొదటి ఆతిథ్యం దేనితో చేయబడుతుందో నేను చెప్పనా?" అని ప్రశ్నించాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "ఆ... చెప్పండి" అన్నారు. అప్పుడు యూదుడు 'భూమిని రొట్టెగా చేయడం జరుగుతుంద'ని (పై హదీసులో) దైవప్రవక్త (సల్లం) చెప్పినట్లు చెప్పాడు.

ఆ తర్వాత ఆ యూదుడు మాట్లాడుతూ "స్వర్గవాసులకు లభించే మొట్టమొదటి కూర ఏమిటో కూడా చెప్పనా?" అని అడిగాడు. దైవప్రవక్త (సల్లం) "సరే అది కూడా చెప్పండి" అన్నారు. దానికా యూదుడు విషయం చెబుతూ "అది ఎద్దు మాంసం. చేప కూర కూడా. చేప గుండెకాయకు చెందిన అదనపు భాగాన్ని డెబ్భయివేల మంది స్వర్గవాసులు తింటారు" అని అన్నాడు. (బుఖారి, ముస్లిం)

ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో అనేక రకాల ఆహార పదార్థాలు ఉంటాయి. కొన్ని రకాల ధాన్యాలు, అపరాలు, పండ్లు, కూరగాయలు మొదలైనవి ఒక ప్రాంతంలో లభిస్తే మరొక ప్రాంతంలో లభించవు. అదీగాక కొందరు కొన్ని రకాల ఆహారపదార్థాలకు అలవాటుపడి మరికొన్ని రకాల ఆహార పదార్థాలు రుచికరంగా ఉన్నప్పటికీ తినడానికి ఇష్టపడరు. ఈవిధంగా ప్రపంచంలోని ప్రజలందరూ ధరణిపై లభించే అన్నిరకాల ఆహార పదార్థాలు తిని ఉండరు. అందువల్ల సృష్టికర్త స్వర్గవాసికి ప్రపంచంలోని అన్ని రకాల ఆహారపదార్థాలు ఒకేసారి రుచిచూపడానికి బహుశా ఈ "నేలరొట్టె"ను తయారు చేస్తాడని కొందరు ధర్మవేత్తలు అభిప్రాయపడ్డారు.

"వారికోసం (గతంలో) తెలియజేయబడిన మంచి ఆహారం సిద్ధంగా ఉంటుంది. సకలవిధాల రుచికరమైన పదార్థాలు ఉంటాయి." (ఖుర్ఆన్-37:40,41)

"వారికి అక్కడ తినడానికి, త్రాగడానికి కోరినవన్నీ లభిస్తాయి. వారు కోరిందల్లా మరుక్షణం సిద్ధం." (36:57) "వారు తమ ప్రభువు ప్రసాదించే మాధుర్యాలు ఆస్వాదిస్తూ సుఖసంతోషాలలో తేలియాడుతుంటారు." (ఖుర్ఆన్:52:19)

"వారి ముందు బంగారంతో చేసిన కంచాలు, గిన్నెలు కదులాడుతుంటాయి. వారి హృదయాలకు, కళ్ళకు ఆనందాన్నిచ్చే ప్రతి వస్తువూ అక్కడ లభిస్తుంది. 'ఇప్పుడు మీరిక్కడ కలకాలం (సుఖంగా) ఉంటారు. మీరు ప్రపంచంలో చేసుకున్న సత్కార్యాల కారణంగానే ఈ స్వర్గసీమకు వారసులయ్యారు. ఇక్కడ మీరు తినడానికి కావలసినన్ని పండ్లు ఫలాలు ఉన్నాయి" అని వారికి చెబుతారు (దైవదూతలు). (43:71-73)

**స్వర్గఫలాలు :** స్వర్గంలో రకరకాల పండ్లుంటాయి. ఇహలోకంలోని పండ్లులాంటి పండ్లు కూడా ఉంటాయి. అయితే రుచిలో ఎంతో తేడా ఉంటుంది.

"వారా ఉద్యానవనాలలో మెత్తటి దిండ్లకు ఆనుకొని కూర్చొని, హాయిగా తినడానికి, త్రాగడానికి రకరకాల పండ్లు, పానీయాలు తెప్పించుకుంటారు." (38:51)

"మేము వారికి రకరకాల పండ్లు, ఫలాలు, మాంసాహారాలు ప్రసాదిస్తాము. వారికి ఇష్టమైన ప్రతి వస్తువూ ఇస్తుంటాము." (ఖుర్ఆన్-52:22)

"ముళ్ళులేని రేగుచెట్ల పండ్లు, అరటిగెలలు, సుదూరంగా విస్తరించిన చల్లటినీడలు, ఎడతెగకుండా ప్రవహించే మంచినీరు, ఎన్నటికీ అంతంకాని సులభంగా అందుబాటులో ఉండే అసంఖ్యాకమైన సుమధుర ఫలాలు." (ఖుర్ఆన్-56:28-32)

"స్వర్గవృక్షాలు వారికి నీడనిస్తాయి. వాటి పండ్లు వారికి అనుక్షణం అందుబాటులో ఉంటాయి." (ఖుర్ఆన్-76:14)

ఈ సూక్తిలో "అందుబాటులో ఉంటాయి" అనే విషయం గురించి ఇబ్నెకసీర్ (రహ్మలై) ఈవిధంగా రాస్తున్నారు: "స్వర్గవాసి ఏదైనా పండు తీసుకో దలచినప్పుడు స్వయంగా ఆ పండ్లరెమ్మ పరమ విధేయురాలిగా అతని దగ్గరికి వచ్చేస్తుంది. స్వర్గవాసి నిలబడి ఉంటే ఆ పండ్లరెమ్మ పైకి లేచి అతనికి దగ్గరగా వస్తుంది. ఒకవేళ స్వర్గవాసి కూర్చొని ఉంటే లేదా పడుకొని ఉంటే అది అతని దగ్గరకు వంగి వస్తుంది." (తఫ్సీర్ ఇబ్నెకసీర్)

"అక్కడ అన్ని రకాల పండ్లు లభిస్తాయి. వారి ప్రభువు తరఫున వారికి మన్నింపు భాగ్యం కూడా ఉంటుంది." (ఖుర్ఆన్-47:15)

"సత్యాన్ని విశ్వసించి సత్కర్మలు చేసేవారికి సెలయేళ్ళు ప్రవహించే స్వర్గవనాలు ఉన్నాయని శుభవార్త విన్పించు. ఆ స్వర్గవనాల్లోని పండ్లు చూడటానికి ఇహలోకంలోని



పండ్లు మాదిరిగా ఉంటాయి. వారికి ఏవైనా పండ్లు తినడానికి ఇచ్చినప్పుడు, ఇలాంటి పండ్లే తమకు ప్రపంచంలో కూడా ఇవ్వబడేవని అంటారు వారు." (ఖుర్ఆన్-2:25)

"ఒకసారి దైవప్రవక్త (సల్లం) సూర్యగ్రహణం పడ్తే గ్రహణ ప్రార్థన చేయించారు. అది చాలా సుదీర్ఘప్రార్థన. ప్రార్థన ముగిసేటప్పటికి గ్రహణం కూడా వదిలింది. ప్రార్థన అయిపోగానే ఆయన అనుచరులతో మాట్లాడుతూ ఇలా అన్నారు:

'సూర్యచంద్రులు దేవుని సూచనలు. ఎవరైనా చనిపోవడం వల్లగాని, పుట్టడం వల్లగాని వాటికి గ్రహణాలు పట్టవు. కనుక మీరు సూర్యగ్రహణంగాని, చంద్రగ్రహణం గాని పట్టినప్పుడు దేవుడ్ని స్మరించండి.' అనుచరులు ఈ మాట విన్న తరువాత 'దైవప్రవక్తా! ప్రార్థన చేస్తున్నప్పుడు మీరు నిల్చున్న చోటులోనే ఉండి ఏదో వస్తువు (ముందుకు వంగి) తీసుకోబోయారు. కాని ఆ తరువాత ఎందుకో వెనక్కి జరిగారు. (ఏమిటీ విశేషం)?' అని అడిగారు.

దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ ఈవిధంగా చెప్పారు: 'నేనప్పుడు స్వర్గం చూశాను. స్వర్గంలోని ఓ పండ్లగుత్తిని తీసుకుందామనుకున్నాను. (కాని తీసుకోలేక పోయాను.) ఒకవేళ నేనా పండ్లగుత్తి తీసుకొనివుంటే, అపండ్లను మీరు ప్రపంచం ఉన్నంత వరకూ తింటూఉండేవారు." (మిష్కాత్- బుఖారి, ముస్లిం)

ఒక్క పండ్లగుత్తిలోని కొన్ని పండ్లు జనం ప్రపంచం ఉన్నంతవరకు తింటారంటే ఇక ఆ స్వర్గఫలం ఎంత పెద్దగా ఉంటుందో ఊహించండి.

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: "నా ముందు స్వర్గం ఉంచబడింది. నేనప్పుడు మీకు చూపించడానికి స్వర్గంలోని ఓ ద్రాక్షగుత్తి తీసుకుందామని భావించాను. కాని (హఠాత్తుగా) నాకు ఆ పండ్లగుత్తికి మధ్య ఓ అడ్డుగోడ ఏర్పడింది. దాంతో నేనా పండ్లగుత్తి తీసుకోలేక పోయాను." (కజా ఫిత్తర్గీబ్)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్(రజి) ఉల్లేఖనం: "స్వర్గంలో ఖర్జూరపండ్లు పన్నెండు బారల (ముప్ఫయి అడుగుల) పొడవు ఉంటాయి." (తర్గీబ్-ఇబ్నె అబిదున్యా)

ఒకసారి మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) దగ్గరికి పల్లెవాసి అయిన అనుచరుడొకాయన వచ్చి "దైవప్రవక్తా! (ఖుర్ఆన్‌లో) దేవుడు స్వర్గంలో మాకు బాధ కల్గించే పండుంటుందని తెలియజేశాడేమిటీ?" అని అన్నాడు. దైవప్రవక్త (సల్లం) "అదేం పండు?" అని అడిగారు. దానికా పల్లెవాసి "రేగుపండు" అని చెప్పాడు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని ఇలా అన్నారు: "దేవుడు ముళ్ళులేని రేగుపండ్లు అని చెప్పలేదా? ఆ రేగుపండ్లలో ఒక పండు వలచి చూస్తే అందులో నుంచి డెబ్బయి రెండు రంగుల (రకాల) తినుబండారాలు కన్పిస్తాయి. అందులో ఏ ఒక్క రంగు కూడా మరో రంగుతో పోలి ఉండదు." (తర్గీబ్)

"స్వర్గంలో పండ్లు, ఇతర ఆహారపదార్థాలు శాశ్వతంగా ఉంటాయి. ఎన్నటికీ అయిపోవు, తరగవు... స్వర్గవాసి స్వర్గవృక్షం నుండి ఒక పండు కోసుకోగానే దాని స్థానంలో వెంటనే మరో పండు కాస్తుంది." (తఫ్సీర్ ఇబ్నెకసీర్, తబ్రానీ)

"వారక్కడ ఎలాంటి పనికిమాలినమాటలు వినరు. అన్నీ సమంజసమైన మాటలే వింటారు. వారికక్కడ ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఆహారం లభిస్తుంది." (19:62)

**మాంసాహారం :** స్వర్గంలో మాంసాహారం కూడా దొరుకుతుంది. ఖుర్‌ఆన్‌లో పక్షి మాంసం ప్రస్తావన మాత్రమే ఉంది. ఇతరజీవాల మాంసం ప్రస్తావన లేదు.

"వారు కోరిన పండ్లు తినడానికి ఆ బాలకులు వారి ముందు రకరకాల రుచికర మైన పండ్లు ఉంచుతారు. అలాగే వారికిష్టమైన పక్షుల మాంసం కూడా ఉంచుతారు." (దివ్యఖుర్‌ఆన్-56:20,21)

పక్షిమాంసమైనా, పశుమాంసమైనా, చేపమాంసమైనా మనిషికి కావలసింది రుచి కరమైన మాంసం, రకరకాల రుచులు మాత్రమే. పోతే పక్షుల్ని వేటాడి పట్టుకోవాల్సిన అవసరంలేదు. మనిషి తినాలనుకుంటే చాలు, అవి తమంతటతామే అతని దగ్గరకు వచ్చేస్తాయి. వాటిని కోసి, ముక్కలు చేసి, వండాల్సిన పని కూడా లేదు. అంతా వాటంతటవే తయారయి ఇన్‌స్టంట్ ఆహారంగా స్వర్గవాసి ముందుకు వచ్చేస్తుంది. దాన్ని స్వర్గవాసి కడుపునిండా తినగానే ఆ పక్షి అవశేషాలు మళ్ళీ పక్షిగా మారి ఎగిరిపోతుంది.

దైవప్రవక్త (స) ఒకసారి తమ అనుచరుల ముందు ఈ పక్షుల్ని గురించి ప్రస్తావిస్తూ "స్వర్గంలో పొడవైన మెడలతో ఒంటెల్లాంటి పెద్దపెద్ద పక్షులు ఉంటాయి. అవి స్వర్గ వృక్షాల మధ్య తిరుగుతూ, మేస్తూ ఉంటాయి" అని తెలియజేశారు. అప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) "అయితే దైవప్రవక్తా! అవి ఎంతో మంచి జీవితం గడుపుతున్నాయన్న మాట" అన్నారు. దానికి దైవప్రవక్త (స) "వాటిని తినేవారు అంతకంటే మంచి జీవితం గడుపుతారు" అన్నారు. ఈమాట ఆయన మూడుసార్లు చెప్పారు. ఆ తరువాత "నీవా పక్షుల్ని తినేవారిలో ఒకడయి ఉంటావని నేను ఆశిస్తున్నాను" అన్నారు. (అహ్మద్)

హజ్రత్ అబూఉమామా (రజి) ఇలా చెబుతున్నారు: "స్వర్గవాసికి ఎప్పుడైనా పక్షి మాంసం తినాలని కోరిక కలిగితే పక్షి అతని దగ్గరికి వచ్చి పడిపోతుంది. వెంటనే అది వండి ముక్కలు చేసిన మాంసంలా మారుతుంది." ఒక హదీసులో "పక్షి దానంతటది స్వర్గవాసి దగ్గరకు వచ్చి పడిపోతుంది. అది నిప్పు, పొగ లేకుండా వండిన మాంసంలా ఉంటుంది. స్వర్గవాసి దాన్ని తీసుకొని కడుపునిండా తింటాడు. తరువాత ఆ పక్షి ఎగిరిపోతుంది" అని ఉంది. (తర్గీబ్- అనిబ్నె అబిద్దున్యా)

హజ్రత్ జాబిర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) స్వర్గవాసుల పరిస్థితి గురించి చెబుతూ "స్వర్గంలో స్వర్గవాసులు తింటారు, తాగుతారు. కాని మలమూత్రాలు



విసర్జించరు. అలాగే వారు ఉమ్మరు, ముక్కు చీదరు" అని అన్నారు. అనుచరులు ఈమాట విని "మరి తిన్న ఆహారం ఏమవుతుంది?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) సమాధానమిస్తూ "త్రేన్పు వస్తుంది. కస్తూరి సువాసనతో కూడిన చెమట వెలువడుతుంది. (దాంతో కడుపు ఖాళీ అవుతుంది.) ఇక్కడ మీరు అప్రయత్నంగా శ్వాస వదులుతున్నట్లు స్వర్గవాసి నోట అనుక్షణం అప్రయత్నంగా దైవస్తోత్రం వెలువడు తుంటుంది" అని అన్నారు. (ముస్లిం)

**స్వర్గంలో సేద్యం :** దైవప్రవక్త (సల్లం) తన అనుచరుల మధ్య కూర్చొని స్వర్గ సౌఖ్యాల్ని గురించి చెబుతున్నారు. అప్పుడక్కడ ఓ గ్రామీణవాసి కూడా ఉన్నాడు. దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పసాగారు: "స్వర్గవాసులలో ఒకతను తన ప్రభువును వ్యవసాయం చేయడానికి అనుమతించమని అడుగుతాడు. దేవుడు ఈ కోరిక విని 'మానవుడా! ఇక్కడ నీవు కోరుకున్న స్వర్గభాగ్యాలన్నీ లేవా?' అని అడుగుతాడు. దానికి అతను '(ఉన్నాయి) కాని నాకు సేద్యం చేయాలనిపిస్తోంది' అంటాడు. అప్పుడు దేవుడతనికి సేద్యం చేసుకునే అనుమతి ఇస్తాడు.

అప్పుడతను నేలలో విత్తనాలు నాటుతాడు. రెప్పపాటులో అవి మొలకెత్తుతాయి. పైరు పెరిగి పంట కోయబడి కొండల్లాంటి పెద్దపెద్ద మోపులు కూడా తయారవుతాయి. ఇలా పంట తయారయిన తరువాత దేవుడు అ స్వర్గవాసితో 'ఆదం కుమారా! ఇదిగో తీసుకో. నీ అత్యాస కడుపును ఏ వస్తువు కూడా నింపలేదు' అనంటాడు."

దైవప్రవక్త (సల్లం) చెప్పిన ఈ ప్రవచనం విని ఆ గ్రామీణవాసి "దైవసాక్షి! ఆ స్వర్గవాసి తప్పకుండా ఖురైషియో, అన్సారియో అయివుంటాడు. వారే వ్యవసాయం చేసేవారు. మా వృత్తి వ్యవసాయం కాదు. మేమిలాంటి కోరిక ఎందుకు కోరుకుంటాం?" అని అన్నాడు. దైవప్రవక్త (సల్లం) ఈమాట విని ఫక్కున నవ్వారు. (బుఖారి)

## స్వర్గంలో సెలయేరులు-63

స్వర్గంలో నాలుగు రకాల సెలయేరులు ఉంటాయి. తిరిగి వాటికి ఉప సెల యేరులు కూడా ఉంటాయి.

"భయభక్తులుకలవారికి వాగ్దానం చేయబడిన స్వర్గం మహావైభవంగా ఉంటుంది. అక్కడ అణుమాత్రం కూడా కలుషితంకాని పరిశుభ్రమైన నీరుగల (చల్లటి) సెలయేరులు, ఏమాత్రం రుచి కోల్పోని స్వచ్ఛమైన పాల నదులు, పానప్రియులకు అమిత రుచికరంగా ఉండే వారుణీ వాహినీలు, ఎంతో నిర్మలమైన తేనె ఝరులు (నిరంతరం) ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ అన్ని రకాల పండ్లు లభిస్తాయి. వారి ప్రభువు తరఫున వారికి మన్నింపు భాగ్యం కూడా ఉంటుంది." (ఖుర్‌ఆన్-47:15)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఈ సెలయేరుల పుట్టుక గురించి ఇలా ప్రవ చించారు: "స్వర్గంలో వంద అంతస్తులున్నాయి. ప్రతి రెండు అంతస్తుల మధ్య భూమ్యా

కాశాల మధ్య ఉన్నంత దూరం ఉంటుంది. అన్నిటికంటే అత్యున్నతమైన స్వర్గాన్ని 'ఫిర్దౌస్' అంటారు. ఫిర్దౌస్ స్వర్గం నుండే ఈ నాలుగు సెలయేరులు పుట్టి ప్రవహిస్తాయి. ఫిర్దౌస్ స్వర్గం పైన దైవసింహాసనం (అర్ష్) ఉంటుంది. కనుక మీరు దేవుణ్ణి స్వర్గం గురించి వేడుకుంటే ఫిర్దౌస్ స్వర్గం ప్రసాదించమని వేడుకోండి." (తిర్మిజి)

మహాప్రవక్త (సల్లం) వేరొక సందర్భంలో ఇలా అన్నారు: "స్వర్గంలో మంచినీరు, తేనె, పాలు, మద్యంలకు చెందిన నాలుగు నదులు ఉన్నాయి. తిరిగి వాటికి ఉప నదులు కూడా ఉన్నాయి. (మిష్కాత్-తిర్మిజి)

**గురుశిష్యుల సంభాషణ :** "స్వర్గంలోని సెలయేరులు కస్తూరీ పర్వతాల నుండి వెలువడుతాయి" అని కూడా దైవప్రవక్త (సల్లం) తెలియజేశారు. (తర్గీబ్)

ప్రముఖ సహాబీ (ప్రవక్త ప్రత్యక్ష అనుచరుడు) హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి)కు, ఆయన శిష్యుడు హజ్రత్ సమాక్ (రజి)కు మధ్య జరిగిన ఓ ఆసక్తికరమైన సంభాషణ ఈవిధంగా ఉంది :-

సమాక్ (రజి): స్వర్గంలో నేల ఎలా ఉంటుంది?

ఇబ్నెఅబ్బాస్ (రజి): అది అద్దంలా ఎంతో తెల్లగా ఉండే వెండి నేల.

సమాక్ (రజి): అక్కడ వెలుగు ఎలా ఉంటుంది?

ఇబ్నెఅబ్బాస్ (రజి): సూర్యోదయం వేళ వెలుగు ఎలా ఉంటుందో చూడలేదా? అదే విధంగా ఉంటుంది స్వర్గంలో వెలుగు. అందులో ఎండగాని, చలిగాని ఉండవు.

సమాక్ (రజి): స్వర్గంలో సెలయేరులు ఎలా ఉంటాయి? నీళ్ళు పల్లానికే పారుతాయా?

ఇబ్నెఅబ్బాస్ (రజి): అక్కడ మిట్టపల్లాలు ఉండవు. ఆ సెలయేరు చదునైన మైదానంలో పారుతుంది. పల్లం లేకపోయినా అది అటూఇటూ పోకుండా నిర్దేశించిన మార్గంలోనే పారుతుంది. దేవుడు వాటిని, ఉనికిలోకి రండని ఆదేశించాడు. అవి ఉనికిలోకి వచ్చి పారుతున్నాయి.

సమాక్ (రజి): స్వర్గంలో దుస్తులు ఎలా ఉంటాయి?

ఇబ్నెఅబ్బాస్ (రజి): స్వర్గంలో ఓ ప్రత్యేకమైన వృక్షం ఉంది. దానికి దానిమ్మలాంటి పండ్లు కాస్తాయి. స్వర్గవాసి ఏవైనా దుస్తులు ధరించ దలచుకుంటే, ఆ చెట్టు రెమ్మ అతనికి దగ్గరగా వస్తుంది. తరువాత దానికి కాసిన పండ్లలో ఒక పండు విచ్చు కుంటుంది. అందులో డెబ్బయి రకాల దుస్తులు ఉంటాయి. స్వర్గవాసి వాటిని తీసుకోగానే ఆ రెమ్మ యధాతథంగా మారి తిరిగి తన స్థానంలోకి వెళ్ళిపోతుంది.

(తర్గీబ్-ఇబ్నె అబిద్దున్యా)



**పానీయాలు :** "(సత్యాన్ని విశ్వసించిన) సజ్జనులు (స్వర్గంలో) కర్పూరజలం కలిపిన మద్యం సేవిస్తారు. ఇదొక సెలయేరు. దైవభక్తులు దీని నీటితోపాటు మద్యపానం సేవిస్తారు. వారు తాము కోరినచోట (కూర్చొని) సులభంగా దాని శాఖను తీసుకుంటారు." (ఖుర్ఆన్–76:5,6)

"వారిముందు వెండిపాత్రలు, గాజుగ్లాసులు తెచ్చిపెడ్తారు. గాజుగ్లాసులు కూడా వెండిలా మెరిసిపోతుంటాయి. అవన్నీ సరైనలెక్క ప్రకారం నింపబడి ఉంటాయి. వారికక్కడ సొంటి కలిపిన మధుపాత్రలు అందించబడతాయి. ఇదికూడా స్వర్గంలో ప్రవహించే ఒక సెలయేరు. దీన్ని సల్‌సబీల్ (సుమధుర మద్యపానం) అంటారు." (76:15–18)

"నిస్సందేహంగా పుణ్యాత్ములు (స్వర్గంలోని) భోగభాగ్యాలలో ఓలలాడుతూ ఉంటారు. వారు ఉన్నతాసనాలపై (హాయిగా) కూర్చొని (స్వర్గ వైభవాలు) తిలకిస్తుంటారు. వారి ముఖాలలో సుఖసంతోషాల కళాకాంతులు గోచరిస్తాయి. వారు స్వచ్ఛమైన విశేష మధుపానం సేవిస్తారు. ఆ మధుపాత్రలకు కస్తూరి సీళ్ళుంటాయి. సౌఖ్యాల కోసం పోటీపడేవారు దీన్ని సాధించడానికి పోటీపడాలి. ఆ మధువులో తస్నీం (అనే విశేష పానీయం) కలసి ఉంటుంది. ఇదొక సెలయేరు. సన్నిహితభక్తులు దీని పానీయంతో పాటు సారా సేవిస్తారు." (ఖుర్ఆన్–83:25–28)

"వారక్కడ కుర్చీలపై ఎదురెదురుగా కూర్చుంటారు. వారుణీ వాహిని నుండి నింపిన మధుపాత్రలు వారి ముందుంచుతారు. అది కాంతిమంతమైన (విశేష) మధువు; సేవించేవారికి ఎంతో మధురంగా ఉంటుంది. దానివల్ల వారి దేహారోగ్యానికి ఎలాంటి నష్టం ఉండదు. వారి బుద్ధివివేచనలు కూడా మందగించవు." (ఖుర్ఆన్–37:43–47)

## అలంకరణలు-64

ఇహలోకంలో మానవులు అందం కోసం, విలువ కోసం ఖరీదైన దుస్తులు, ఆభరణాలు ధరిస్తారు. అలాగే స్వర్గంలో కూడా స్వర్గవాసులు అంతకన్నా ఎంతో అంద మైన, ఖరీదైన బట్టలు, ఆభరణాలు ధరిస్తారు.

**ఆభరణాలు :** "ఇక సత్యాన్ని విశ్వసించి (తదనుగుణంగా) సత్కార్యాలు చేసేవారి విషయానికి వస్తే, అలాంటి సదాచారసంపన్నులకు లభించవలసిన ప్రతిఫలాన్ని మేము ఎన్నటికీ వృధాచేయము. వారి కోసం సెలయేరులు ప్రవహించే నిత్యహరిత స్వర్గవనా లున్నాయి. వారికక్కడ బంగారపు మురుగులతో ముస్తాబు చేస్తారు. వారు బంగారు జరీతో కూడిన పచ్చటి పట్టువస్త్రాలు ధరిస్తారు. అద్భుతమయిన ఉన్నతాసనాలపై మెత్తటి దిండ్లకు ఆనుకొని కూర్చుంటారు. ఎంత మంచి ప్రతిఫలం అది! అత్యున్నత శ్రేణికి చెందిన నివాసస్థలమది!!" (ఖుర్ఆన్–18:30,31)

"(పోతే రెండోవర్గం) విశ్వసించి సత్కార్యాలు చేసినవారిని దేవుడు సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. వారక్కడ స్వర్ణ కంకణాలు, మణిమాణిక్యాలతో

అలంకరించబడతారు. పట్టువస్త్రాలు ధరిస్తారు. వారికి ఇహలోకంలో శిష్టవచనం స్వీకరించే సద్బుద్ధి ప్రసాదించబడింది. వారికి (దేవుని) వెలుగుబాట చూపబడింది." (22:23,24)

హజ్రత్ సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా తెలిపారు: "స్వర్గంలోని వస్తువులలో ఏదైనా గోరంత వస్తువుని గనక ఇహలోకంలో ప్రదర్శిస్తే భూమ్యాకాశాల మధ్య ఉన్నదంతా ప్రకాశవంతం అవుతుంది. అలాగే స్వర్గ వాసుల్లో ఒక పురుషుడు గనక ఇహలోకంలోకి తొంగిచూస్తే, అప్పుడతని చేతి కంకణం ఇహలోకం వైపుకు వచ్చి ఉంటే సూర్యుడు నక్షత్రాల కాంతిని మందగింపజేసినట్లు ఆ కంకణం సూర్యకాంతిని సైతం మందగింపజేస్తుంది." (తిర్మిజి)

మరొక హదీసులో దైవప్రవక్త (సల్లం) ఇలా తెలియజేశారు: "స్వర్గవాసులు కిరీటాలు ధరిస్తారు. ఆ కిరీటంలో పొదిగిన ఓ చిన్న రత్నం తూర్పు నుండి పడమరదాకా ఉండే దూరాన్ని ప్రకాశవంతం చేస్తుంది." (తిర్మిజి)

ఈ హదీసుల్ని బట్టి స్వర్గంలోని ఒక్కొక్క వస్తువు ఎంత విలువయినదో, ఎంత మనోహరంగా ఉంటుందో అర్థమవుతోంది. ముఖ్యంగా అక్కడి రత్నాలు, మణులు, మాణిక్యాలు, వజ్రాలు, వైఢూర్యాలు ఎంత అందంగా, ప్రకాశవంతంగా ఉంటాయో ఊహించవచ్చు.

**వస్త్రాలు :** అదే విధంగా స్వర్గవాసుల వస్త్రాలు కూడా అసాధారణమైన అందం, విలువ కలిగి ఉంటాయి. దివ్యఖుర్ఆన్‌లోని ఈ సూక్తులు చూడండి:

"స్వర్గవాసులు బంగారు జలతారు అంచులుండే పట్టు పరుపులపై మెత్తటి దిండ్లకు ఆనుకొని కూర్చుంటారు. (వారి ముందు) పండ్లతో నిండిన చెట్లరెమ్మలు వంగి ఉంటాయి. కనుక మీరు మీ ప్రభువు ప్రసాదించే ఏ మహాభాగ్యాలు నిరాకరిస్తారు?" (55:54,55)

"అక్కడ స్వర్గవాసులు అత్యంత విలువైన, ఎంతో అపురూపమైన పచ్చటి తివాచీల మీద మెత్తటి దిండ్లకు ఆనుకొని కూర్చుంటారు. కనుక మీరు మీ ప్రభువు అనుగ్రహించే ఏ మహాభాగ్యాలు నిరాకరించగలరు?" (ఖుర్ఆన్-55:76,77)

"ఆ స్వర్గంలో (చల్లటి) సెలయేరులు ఉంటాయి. ఎత్తయిన ఆసనాలుంటాయి. (త్రాగడానికి) మధుపాత్రలు కూడా పెట్టబడి ఉంటాయి. ఇంకా వరుసలు వరుసలుగా దిండ్లు పేర్చిఉంటాయి. పట్టుతివాచీలు పరచిఉంటాయి." (ఖుర్ఆన్-88:12-16)

"వారు రత్నఖచిత ఆసనాల మీద మెత్తటి దిండ్లకానుకొని పరస్పరం ఎదురెదురుగా కూర్చుంటారు." (56:15,16); "ఈరోజు స్వర్గవాసులు సుఖసంతోషాలలో తేలియాడు తుంటారు. వారూ, వారిభార్యలు దట్టమైననీడల క్రింద మెత్తటి ఆసనాలపై దిండ్లకానుకొని కూర్చొని ఉంటారు." (ఖుర్ఆన్-36:55,56)

**బాల సేవకులు:-** ఈనాటి వైజ్ఞానిక యుగంలో మనిషికి సేవచేయడానికి తోటి మనుషుల అవసరం క్రమంగా తగ్గిపోతోంది. మానవసేవకులకు బదులు యంత్ర



సేవకులు వచ్చారు. వీటికి తోడు ఇప్పుడు మనిషికి కట్టుబానిసలుగా సేవచేసే రోబోలు కూడా వస్తున్నాయి. ఈ ప్రపంచంలోనే మనిషికి దేవుడు సుఖవంతమైన జీవితం గడప డానికి ఇలాంటి మంచి సౌకర్యాలు ప్రసాదిస్తే ఇక పరలోకంలో తన పుణ్యదాసులకు మరెలాంటి మంచి సౌకర్యాలు కల్పించి ఉంటాడో ఊహించండి.

స్వర్గంలో దేవుని పుణ్యదాసులు మనసులో తలచుకోవడమే తడవు తక్షణమే ఆ వస్తువులు వారిముందు ప్రత్యక్షమవుతాయి. అంతా అక్కడ ఆటోమ్యాటిక్‌గా జరిగి పోతుంది. అయినప్పటికీ విశ్వప్రభువు తన పుణ్యదాసుల సేవకోసం ప్రత్యేకంగా బాల సేవకులను నియమించాడు. వారు కళ్ళు చెదర గొట్టేటంతటి అందమైన బాలలు. వారి అందాన్ని గురించి ఖుర్ఆన్‌లో అనేక చోట్ల ప్రస్తావన వచ్చింది.

"వారి సేవకోసం అక్కడ దాచినరత్నాల్లాంటి అందమైన బాలసేవకులుఉంటారు. ఈ బాలసేవకులు అటూఇటూ తిరుగుతూ వారిని సేవిస్తూఉంటారు." (52:24)

"వారి సమావేశాలలో నిత్య బాలకులు వారుణీవాహిని నుండి స్వచ్ఛమైన మధువుతో నిండిన గిన్నెలు, గ్లాసులు, కూజాలు తీసుకొని అటూఇటూ తిరుగుతుంటారు." (ఖుర్ఆన్-56:17,18)

"వారిసేవ కోసం నిత్యబాలలు అటూఇటూ పరుగిడుతుంటారు. నీవా పిల్లల్ని చూస్తే చెదరిన ఆణిముత్యాల్లా కనిపిస్తారు. నీకక్కడ ఎటుచూసినా రంగ రంగ భోగ భాగ్యాలు, మహోన్నత సామ్రాజ్య వైభవాలు కన్పిస్తాయి." (ఖుర్ఆన్-76:19,20)

ఈ బాలసేవకుల్ని గురించి భాష్యకారులు భిన్నాభిప్రాయాలు వ్యక్తపరిచారు. కొందరు ఈ బాలసేవకుల్ని దేవుడు స్వర్గవాసుల సేవ కోసమే ప్రత్యేకంగా సృజించాడని అభిప్రాయపడ్డారు. అంటే వీరు స్వర్గకన్యలు మాదిరిగా నూతనసృష్టి అన్నమాట. మరి కొందరు భాష్యకారులు అవిశ్వాసుల పిల్లలు చిరుప్రాయంలో చనిపోయిన తరువాత దేవుడు వారిని స్వర్గంలో ఇలా బాలసేవకులుగా చేస్తాడని అభిప్రాయపడ్డారు. అయితే అనేకమంది భాష్యకారులు ఈ రెండవ అభిప్రాయంతో ఏకీభవించలేదు. హదీసుల్లో ఈ బాలసేవకుల సృజన గురించి ఎలాంటి ప్రస్తావన లేదు.

దివ్యఖుర్ఆన్‌లో ఈ బాలసేవకుల అందాన్ని గురించి విన్న ప్రవక్త అనుచరులు దైవప్రవక్త (సల్లం)తో మాట్లాడుతూ "సేవకులే ఇంత అందంగా ఉంటే ఇక వారిచేత సేవ చేయించుకునేవారు ఇంకెంత అందంగా ఉంటారో!" అని అన్నారు. దైవప్రవక్త (సల్లం) దానికి సమాధానమిస్తూ "నక్షత్రాలపై పూర్ణచంద్రునికి ఎంత ఔన్నత్యం ఉంటుందో ఈ బాలసేవకులపై వారిచేత సేవ చేయించుకునేవారికి అంత ఔన్నత్యం ఉంటుంది" అని చెప్పారు. (తఫ్సీర్ మజ్హరీ)

దీన్నిబట్టి ఆ సేవకుల సౌందర్యం కంటే వారిచేత సేవ చేయించుకునే వారి సౌందర్యం ఎన్నో రెట్లు ఎక్కువ ఉంటుందని తెలుస్తోంది.

# స్వర్గ మహిళలు-65

ఈ ప్రపంచంలో పురుషుడు సాధారణంగా మంచి తిండి, బట్టలు, ఇండ్ల తర్వాత అత్యున్నత సుఖభోగాల కోసం మద్యం, మగువలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాడు. కాని దేవుడు ఇక్కడ మద్యసేవనాన్ని నిషేధించాడు. అలాగే ఇక్కడ వ్యభిచారాన్ని కూడా నిషేధించి, భార్యలను నలుగురికి పరిమితం చేశాడు. అయితే పరలోకంలో మత్తు కలిగించని మద్యం ప్రసాదిస్తాడు. లైంగికానందం కోసం పుణ్యాత్ములయిన భార్యలనే గాకుండా, ఓ ప్రత్యేక సృష్టి అయిన సుందరాంగుల్ని (అప్సరసలను) కూడా భార్యలుగా ప్రసాదిస్తాడు. వీరిని ఖుర్‌ఆన్ పరిభాషలో "హూర్" అంటారు.

"వారికి ఈడు-జోడు, తోడు-నీడగా అక్కడ పవిత్ర సహచరులు కూడా ఉంటారు. ఆ స్వర్గవనాలలో వారు శాశ్వతంగా ఉంటారు." (ఖుర్‌ఆన్-2:25)

"అంతేకాదు, వారికక్కడ ఈడు-జోడు, తోడు-నీడగా పవిత్ర సహచరులు కూడా ఉంటారు." (ఖుర్‌ఆన్-3:15)

ఇక్కడ మూలభాషలో "అజ్వాజుమ్ముతహ్హారా" అనే పదం వాడబడింది. ఇందులో అజ్వాజ్ బహువచనంలో ఉంది. దాని ఏకవచనం 'జౌజ్' లేక 'జౌజా' అవుతుంది. అంటే జత, జోడు, జంట, తోడునీడ అని అర్థం. పురుషునికి స్త్రీ జోడు, జతది (భార్య) అయితే, స్త్రీకి పురుషుడు తోడు, జత (భర్త) అవుతాడు. అజ్వాజుమ్ముతహ్హారా అంటే పవిత్రమయిన జంట లేక తోడు అని అర్థం. ఈ సూక్తులలో పవిత్రమైన లేక పరిశుద్ధమైన అంటే భౌతికంగానూ, నైతికంగానూ, అన్ని విధాల అంతర్‌బాహ్యాల పరంగానూ వారు పవిత్రులు, పరిశుద్ధులు అని భావం.

**స్వర్గ పత్నులు :** ఇహలోకంలో ఇస్లాం ధర్మం స్వీకరించి సదాచార సంపన్నురాలయిన స్త్రీలను దేవుడు పరలోకంలో నూతనకన్యలుగా చేసి స్వర్గంలో ప్రవేశపెడ్తాడు. ప్రపంచంలో భార్యాభర్తలు ఇద్దరూ సత్యాన్ని విశ్వసించి సాత్విక జీవితం గడిపి ఉంటే స్వర్గంలో కూడా వారిద్దరు భార్యాభర్తలుగానే కొనసాగుతారు. ఒకవేళ వారిద్దరిలో ఒకరు మాత్రమే సన్మార్గగామి అయివుంటే, ఆ స్త్రీ లేక పురుషుని వివాహం ఇతర సన్మార్గగాములైన పురుషుడు లేక స్త్రీతో జరుగుతుంది.

"వారి భార్యలను మేము ప్రత్యేక పంథాలో సరికొత్తగా సృజిస్తాము. వారిని మేము నిత్యనూతన కన్యలుగా రూపొందిస్తాము. వారు తమ భర్తలను అమితంగా ప్రేమిస్తారు. సమవయస్కులైన సతులు వారు." (56:35-38); "వారి దగ్గర పరపురుషుడ్ని కన్నెత్తి కూడా చూడని, విశాలాక్షులుంటారు." (ఖుర్‌ఆన్-37:48)

ఈ సూక్తిని బట్టి స్వర్గస్త్రీలు ఎల్లప్పుడూ యువతులుగానే ఉంటారని తెలుస్తోంది. ఇక్కడ వృద్ధులయి చనిపోయిన స్త్రీలు కూడా స్వర్గంలో యువతులుగానే ఉంటారు. ఈ సందర్భంలో ఒక ఆసక్తికరమైన సంఘటన వినండి:



ఒక వృద్ధురాలు దైవప్రవక్త (సల్లం) సన్నిధికి వచ్చి "దైవప్రవక్తా! దేవుడు నాకు స్వర్గం ప్రసాదించమని ప్రార్థన చేయండి" అని విన్నవించుకుంది. అప్పుడు దైవప్రవక్త (సల్లం) "స్వర్గంలో వృద్ధులు ప్రవేశించలేరు" అని అన్నారు. వృద్ధురాలు ఈమాట విని లబోదిబో అంటూ అక్కడ్నుంచి కదలి ఇంటిదారి పట్టింది. వెంటనే దైవప్రవక్త (సల్లం) అనుచరుల్ని ఉద్దేశించి "వెళ్ళి ఆ ముసలమ్మకు చెప్పండి నామాటకు అర్థం ఆమె స్వర్గానికి పోదని కాదు. వృద్ధులు కూడా యువతీయువకులుగా మారి స్వర్గానికి పోతారని చెప్పండి" అని అన్నారు. (తిర్మిజి)

మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఇలా ప్రవచించారు: "ఒక ఉదయం లేదా సాయంత్రం దైవమార్గంలో (అంటే ధర్మసంస్థాపన కోసం) బయలుదేరి వెళ్ళడం యావత్తు ప్రపంచం, ప్రపంచంలోని సమస్తం కంటే ఎంతో శ్రేష్ఠమయినది. స్వర్గంలోని స్త్రీలలో ఒక స్త్రీ గనక భూలోకంలోకి తొంగిచూస్తే భూమ్యాకాశాల మధ్య ఉన్నదంతా కాంతిమంతమవుతుంది; సువాసనతో గుబాళిస్తుంది... ఆమె తల మీది వస్త్రం యావత్తు ప్రపంచం, ప్రపంచంలోని సమస్తం కంటే ఎంతో శ్రేష్ఠమయినది." (బుఖారి)

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) స్వర్గ పత్నుల సౌందర్యం గురించి వివరిస్తూ ఈవిధంగా తెలిపారు: "స్వర్గ పురుషుడు (తన భార్య అయిన) స్వర్గస్త్రీ ముఖాన్ని చూస్తే ఆమె చెంపలు అతనికి అద్దం కంటె కూడా ఎంతో నున్నగా కన్పిస్తాయి. స్వర్గస్త్రీ ధరించిన ముత్యాలలో ఓ చిన్న ముత్యమే తూర్పు, పడమరల మధ్య ఉండే యావత్తు ప్రాంతాన్ని కాంతిమంతం చేసేస్తుంది. ఆమె శరీరంపై డెబ్బయి జతల బట్టలు ఉంటాయి. అయినప్పటికీ (భర్త) దృష్టి (కాంతిమంతమైన) ఆమె దేహంలోకి చొచ్చుకుపోతుంది. స్వర్గంలోని ఆమెభర్త ఆమె దుస్తులలోని ఆమె పిక్కను సైతం చూడగలుగుతాడు." (అహ్మద్)

**స్వర్గకన్యల సౌందర్యం :** సత్యాన్ని విశ్వసించి సత్కర్మలు ఆచరిస్తూ చనిపోయిన స్త్రీలనే గాకుండా స్వర్గంలో కొత్తగా సృజించబడిన సుందరాంగు (హూర్)లను కూడా స్వర్గంలో పురుషులకు భార్యలుగా ఇవ్వడం జరుగుతుంది. దివ్యఖుర్‌ఆన్‌లోని ఈ దిగువ సూక్తులు చూడండి:

"ఆ స్త్రీలు కోడిగుడ్డు పెంకు క్రింద ఉండే సున్నితమైన పొరలాంటి కోమలాంగులు." (ఖుర్‌ఆన్-37:49,50)

"వారికి మేము ఎర్రటి దేహచ్ఛాయతో విశాలనేత్రాలుగల సుందరాంగుల్ని ఇచ్చి వివాహం చేస్తాము." (ఖుర్‌ఆన్-44:54)

"వారికోసం అక్కడ అందమైన కళ్ళుగల సుందరాంగులు ఉంటారు. ప్రత్యేకంగా వారి కోసమే దాచిపెట్టిన ముత్యాలవంటి ముగ్ధమనోహర సౌందర్యరాసులు వారు." (ఖుర్‌ఆన్-56:22,23)

"ఆ మహాభాగ్యాల మధ్య (వారి కోసం) సిగ్గులొలికించే స్వర్గ కన్యలుంటారు. వారిని ఈ స్వర్గవాసులకు పూర్వం ఏ మానవుడుగాని, జిన్‌గాని తాకనైనా తాకిఉండడు. కనుక మీరు మీ ప్రభువు ప్రదానం చేసే ఏ బహుమానాలు తిరస్కరించగలరు? వారు మణి మాణిక్యాల్లా అసామాన్య సౌందర్యరాసులు. మరి మీరు మీ ప్రభువు ప్రసాదించే ఈ బహుమానాలు కాదనగలరా?" (ఖుర్‌ఆన్-55:56-58)

"ఆ వనాలలో శీలవతులు, సౌందర్యరాసులైన సతులుంటారు. కనుక మీరు మీ ప్రభువిచ్చే ఏవరాలు నిరాకరిస్తారు? ఇంకా ఎల్లప్పుడూ పర్ణశాలల్లోనే ఉండే సుందరాంగులు కూడా. కనుక మీప్రభువు ప్రసాదించే ఈ కానుకల్ని మీరెలా తిరస్కరిస్తారు? వారిని ఈ స్వర్గవాసులకు పూర్వం ఏ మానవుడుగాని, జిన్‌గాని తాకిఉండడు. మరి మీప్రభువు ప్రదానంచేసే ఏ బహుమానాలు మీరు త్రోసిపుచ్చుతారు?" (ఖుర్‌ఆన్-55:70-75)

**స్వర్గకన్యల ప్రార్థన, పాటలు :** హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం మహాప్రవక్త (స) స్వర్గకన్యలు చేసే ప్రార్థన గురించి ఈవిధంగా తెలిపారు:

"రమజాన్ నెల కోసం సంవత్సరారంభం నుండి సంవత్సరాంతం వరకు స్వర్గం మరింత అందంగా అలంకరించబడుతుంది. రమజాన్ నెల మొదటి తేదీ రాగానే స్వర్గవనాల నుండి దైవసింహాసనం క్రింద ఉండే సుందరాంగు (హూర్)ల వైపు (హృదయాల్ని గిలిగింతలు పెట్టే చల్లటి పిల్ల)గాలులు వీస్తాయి. దాంతో ఆ సుందరాంగులు ప్రభావితులయి ఇలా దేవుణ్ణి ప్రార్థిస్తారు: 'ఓ మాప్రభువా! నీ దాసులలో నుంచి మా కోసం మంచి భర్తలను నిర్ణయించు. వారి ద్వారా మా కళ్ళు చల్లబడేలా, మాద్వారా వారి కళ్ళు చల్లబడేలా చెయ్యి." (బైహఖి)

హజ్రత్ ముఆజ్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు:

"భూలోకంలో ఏ భార్య అయినా తన భర్తను వేధిస్తుంటే, స్వర్గకన్యలలోని ఆ పురుషునిభార్య ఇహలోకంలోని ఆ భార్యతో ఇలా అంటుంది- 'నీ పాడుగాను! ఎందుకు ఆయన్నలా వేధిస్తావు, వేధించకు. ఆయన నీదగ్గర కొన్నాళ్ళుమాత్రమే ఉండే అతిథి లాంటివాడు. ఆతర్వాత ఆయన నిన్ను వదిలేసి మా దగ్గరకు వచ్చేస్తాడు." (తిర్మిజి)

హజ్రత్ అలి ముర్తజా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) స్వర్గకన్యల గానాలాపన గురించి ఈవిధంగా తెలిపారు:

'స్వర్గంలో సుందరాంగులు (హూర్) సమావేశమయ్యే ఒక చోటుంది. వారక్కడకు చేరుకొని ఇలా ఓ పాట పాడుతారు- 'మేము శాశ్వతంగా జీవించి ఉండే వాళ్ళము. మా కెన్నడూ మరణం రాదు. మేము ఎల్లప్పుడూ, ఎల్లవేళలా సుఖసంతోషాలలో తేలియాడుతుంటాము. లేమి మా దరిదాపులకు రానేరాదు. మేము మా భర్తలతో సంతోషంగా ఉంటాము. వాళ్ళను ఎన్నడూ విసిగించము. ఆయన మా కోసం, మేమాయన కోసం!'



వారి పాట ఎంతో రాగయుక్తంగా, లయబద్ధంగా, (ప్రపంచంలో) ఇంతవరకు ఎవరూ పాడనటువంటి సుమధుర కంఠంతో పాడుతారు." (తిర్మిజి)

**భూలోకస్త్రీలకు, స్వర్గకన్యలకు తేడా :** విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఉమ్మె సల్మా (రజి) చెప్పిన ఓ సుదీర్ఘ ఉల్లేఖనంలో ఆమె తనకు, దైవప్రవక్త (సల్లం)కు మధ్య జరిగిన ఒక సంభాషణను ఈవిధంగా పేర్కొన్నారు:-

ఉమ్మెసల్మా (రజి): దైవప్రవక్తా! స్వర్గంలో భూలోక స్త్రీలు ఎక్కువ శ్రేష్ఠులా లేక స్వర్గ కన్యలు (హూర్) ఎక్కువ శ్రేష్ఠులా?

దైవప్రవక్త (సల్లం): (తలగడకు) పైనుండే వస్త్రం కంటే లోపలుండే వస్త్రం ఎక్కువ శ్రేష్ఠమైనదయినట్లు స్వర్గకన్యల కంటే భూలోక స్త్రీలే ఎక్కువ శ్రేష్ఠులవుతారు.

ఉమ్మెసల్మా (రజి): ఎందువల్ల దైవప్రవక్తా!

దైవప్రవక్త (సల్లం): ఎందువల్ల అంటే భూలోక స్త్రీలు నమాజ్ చేస్తారు; ఉపవాసాలు పాటిస్తారు; దైవారాధనలో జీవితం గడుపుతారు.

ఉమ్మెసల్మా (రజి): ఇహలోకంలో కొంతమంది స్త్రీలు ఒకరితర్వాత మరొకరు ఇద్దరు ముగ్గురు లేక నల్గురు పురుషుల్ని వివాహమాడుతారు కదా! అలాంటప్పుడు ఆ స్త్రీ, ఆమె భర్తలు చనిపోయి స్వర్గానికి వెళ్తే వారిలో ఆమెకు ఎవరు భర్త అవుతారు?

దైవప్రవక్త (సల్లం): అప్పుడు ఆమె కోరుకున్న పురుషుణ్ణి చేసుకునే స్వేచ్ఛ లభిస్తుంది. అలాంటి పరిస్థితిలో ఆ స్త్రీ నైతికంగా వారిలో ఎవరెక్కువ శ్రేష్ఠులో అతణ్ణి కోరు కుంటుంది. ఆ సందర్భంలో ఆమె దేవునితో 'ప్రభూ! ఇహలోకంలో ఇతను నా పట్ల వీరందరికంటే ఎక్కువ సద్వర్తనంతో మెలిగాడు. అంచేత ఇతణ్నే నాకు భర్తగా చెయ్యి' అని మనవిచేసుకుంటుంది. ఉమ్మెసల్మా! సద్గుణసంపత్తి ఇహపరలోకాల మేళ్ళనిటినీ తీసుకొని (స్వర్గానికి) ఎగిరిపోతుంది. (తర్గీబ్ వ తర్హీబ్)

## బహుభార్యత్వం-65

స్వర్గంలో ఒక పురుషునికి ఎంతమంది భార్యలు లభిస్తారనే విషయంలో విభిన్న ఉల్లేఖనాలు ఉన్నాయి. దీన్నిగురించి హాఫిజ్ ఇబ్నెహజర్ (రహ్మాలై) ఫత్‌హుల్‌బారీ గ్రంథంలో అనేక హదీసుల్ని ఉదాహరిస్తూ విపులంగా చర్చించారు.

బుఖారీషరీఫ్‌లోని ఒక ఉల్లేఖనంలో ఒక పురుషునికి (స్వర్గకన్యల నుంచి) ఇద్దరు భార్యలు ఉంటారని ఉంది. ముస్నద్ అహ్మద్‌లోని ఒక ఉల్లేఖనంలో తక్కువ హోదా కలిగిన స్వర్గవాసికి (ఇద్దరు) భూలోకభార్యలతోపాటు మరో డెబ్భయిఇద్దరు (స్వర్గకన్యలు) భార్యలు ఉంటారని ఉంది. అబూయాలా ఉల్లేఖించిన హదీసు ప్రకారం ఒక స్వర్గవాసికి మానవులలో ఇద్దరు భార్యలు, దేవుడు ప్రత్యేకంగా సృష్టించిన స్వర్గకన్యలలో డెబ్భయి ఇద్దరు భార్యలు ఉంటారని తెలుస్తోంది.

ఇబ్నెమాజా గ్రంథంలో ఒక స్వర్గవాసికి స్వర్గకన్యల నుండి డెబ్బయి ఇద్దరు, భూలోక స్త్రీల నుండి డెబ్బయి ఇద్దరు లభిస్తారని ఉంది. ఫత్‌హుల్‌బారి వ్యాఖ్యానకర్త హాఫిజ్ ఇబ్నెహజర్ (రహ్మలై) ఇవే కాకుండా ఇంకా అనేక ఉల్లేఖనాలు ఉదాహరించారు. మొత్తంమీద పై ఉల్లేఖనాలను బట్టి స్వర్గవాసికి స్వర్గంలోని ఇతర అనేక మహాభాగ్యాలతో పాటు బహుభార్యలను కూడా ప్రసాదించడం జరుగుతుందని, ప్రతి స్వర్గవాసికి కనీసం ఇద్దరు భార్యలైనా లభిస్తారని తెలుస్తోంది. కాకపోతే స్వర్గవాసుల పుణ్యకర్మలు, వారి హోదా అంతస్తుల్ని బట్టి వారి భార్యల సంఖ్య ఉంటుంది.

**నేటి నినాదాలు :** అభ్యుదయవాదులమని చెప్పుకునేవారు కొందరు స్వర్గంలో కూడా పురుషుడికి అనేకమంది భార్యలా! మరి ఒక స్త్రీకి ఎంతమంది భర్తలు లభిస్తారు? అని ప్రశ్నిస్తారు తెగ ఆశ్చర్యపోతూ. పురుషునిలో ఉండే అధిక లైంగికశక్తి కారణంగా అతను ఎక్కువ మంది భార్యలను కోరుకోవడం సహజం. కాని స్త్రీ ఒకరికంటే ఎక్కువ మంది భర్తలను కోరడం అసహజం. ఆమె స్వభావం అందుకు ఏమాత్రం అంగీకరించదు.

స్త్రీలకు వ్యభిచారంచేసే హక్కు కావాలని నినాదాలు మార్మోగుతున్న నేటి నవ సమాజంలో బహుభర్తృత్వ హక్కు కావాలని డిమాండు చేయడంలో ఆశ్చర్యమేమీ లేదు. కాని అలా డిమాండుచేసే స్త్రీలలో కనీసం ఇద్దరు భర్తలున్న వారెవరైనా ఉన్నారా అని ప్రశ్నిస్తే, లేదనే సమాధానం వస్తుంది.

దానికి భిన్నంగా మీరు ఎనభై ఏళ్ళ వృద్ధుడి దగ్గరికెళ్ళి "తాతయ్యా! రెండో పెళ్ళి చేసుకుంటావా?" అని అడగండి, ఏం సమాధానం వస్తుందో. ఆ పండుముదుసలి "నాకెవరు ఇస్తారు బాబూ!" అంటాడు. అంతేగాని కనీసం "నాకెందుకు నాయనా ఈ వయసులో?" అని కూడా అనడు. అదే పెళ్ళయిన ఓ యువతి దగ్గరికెళ్ళి "నీకు ఎంతమంది భర్తలమ్మా?" అని అడగండి. వెంటనే మీ చెంప ఛెళ్ళుమంటుంది.

ఇది ఇహలోకం సంగతి. ఇక స్వర్గ విషయానికొస్తే ఆ పుణ్యలోకంలో ఏ స్త్రీ కూడా బహుభర్తృత్వం సంగతి మనసులోనికే రానివ్వదు. ఖుర్‌ఆన్ స్వర్గస్త్రీల లజ్జా స్వభావాన్ని ఎలా వర్ణించిందో చూడండి:

"వారు తమ భర్తలను అమితంగా ప్రేమిస్తారు." (56:38) "వారి దగ్గర పరపురుషుడ్ని కన్నెత్తి కూడా చూడని, విశాలాక్షులు ఉంటారు." (37:48)

**పురుషుని లైంగికశక్తి :** స్వర్గంలో పురుషులకు అనేకమంది భార్యలు ఉంటారు గనక, వారి లైంగికశక్తిని కూడా పెంచడం జరుగుతుంది.

హజ్రత్ జైద్ బిన్ అర్ఖం (రజి) కథనం: గ్రంథప్రజలలో (యూదులలో) ఒకతను దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి "అబుల్‌ఖాసిం! స్వర్గవాసులు తినడం, తాగడం చేస్తారని చెబుతున్నారా మీరు?" అని ప్రశ్నించాడు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "నా ప్రాణం ఎవరి అధీనంలో ఉందో ఆ శక్తిస్వరూపుని సాక్షిగా చెబుతున్నాను. ఒక



స్వర్గవాసికి తినడం, తాగడం, సంభోగించే వ్యవహారాల్లో వందమంది (ఇహలోక) పురుషులకుండే శక్తిసామర్థ్యాలు ప్రసాదించబడతాయి" అని అన్నారు.

ఆ యూదుడు ఈమాట విని "తినడం, తాగడం చేస్తే మలమూత్రాలు విసర్జించ వలసివస్తుంది కదా! కాని స్వర్గం ఎలాంటి బాధలుండే స్థలం కాదు మరి?" అని అన్నాడు. దానికి దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: "(తిన్నా, తాగినా) వారికి మలమూత్ర విసర్జన అవసరమే రాదు. (ఆహారపానీయాల వల్ల) నిండిపోయిన కడుపు ఖాళీ అవడానికి వారి దేహాల నుండి కస్తూరీ సువాసనతో కూడిన చెమట వెలువడుతుంది. దాంతో వారి కడుపులు తేలికవుతాయి." (అహ్మద్, నిసాయి)

ఈ హదీసుని బట్టి స్వర్గవాసికి వందమంది పురుషుల శక్తి ప్రసాదించబడుతుందని తెలుస్తోంది. అదీగాక స్వర్గంలో అలుపు, మలమూత్రాలు, దుర్వాసనతో కూడిన చెమట కూడా ఉండదని, తిన్న ఆహారం జీర్ణం కావడానికి సువాసనతో కూడిన తేలికపాటి చెమట మాత్రమే పడ్తుందని తెలుస్తోంది. అలాగే వారి శరీరాల నుండి వీర్యం వెలువ డటంగాని, సంభోగం తర్వాత మర్మావయవాలు బలహీన పడటంగాని జరగదు.

మొజ్జముల్ కబీర్ ఉల్లేఖనం ప్రకారం "స్వర్గవాసి (తన భార్యతో) సంభోగిస్తాడు. అయితే అతని మర్మావయవం బలహీనమవడంగాని, లైంగికేచ్ఛ ఉద్రేకాలు తగ్గిపోవడం గాని జరగదు. అలాగే పురుషుడికి, స్త్రీకి వీర్యం వెలువడదు." (తబ్రాని)

ఇహలోకంలో పురుషుడు కొన్ని నిమిషాలు మాత్రమే లైంగికానందం పొందగలడు. ఆ తరువాత చల్లబడిపోతాడు. వీర్యస్ఖలనంతో శరీరం, బట్టలు ఖరాబవుతాయి. కాని స్వర్గవాసి తాను కోరుకున్నంత సేపు లైంగికానందం పొందగలడు. వీర్యం వెలువడదు గనక శరీరం, బట్టలు ఖరాబయ్యే ప్రసక్తి ఉండదు.

**శిశుజన్మలు ఉండవు :** స్వర్గంలో సాధారణంగా ఎవరూ తమకు పిల్లలు పుట్టాలని కోరుకోరు. ఒకవేళ ఎవరైనా పిల్లలు పుట్టాలని కోరుకుంటే వెంటనే గర్భధారణ, శిశుజన్మ, శిశువు పెరిగి యుక్తవయస్సుకు చేరుకోవడం అన్నీ క్షణాల్లో జరిగిపోతాయని తిర్మిజీలోని ఒక హదీసు ద్వారా తెలుస్తోంది. అయితే తిర్మిజీ గ్రంథంలోనే మరొక హదీసులో "స్వర్గంలో స్వర్గవాసులకు పిల్లలు పుట్టర"ని దైవప్రవక్త (స) అన్నారు.

స్వర్గం కోరికలీడేరే లోకం గనక, చట్టప్రకారం ఆ కోరిక నెరవేరుతుంది. అంతేగాని అక్కడ శిశుజన్మల పరంపర ఉండదు. స్వర్గవాసుల హృదయాల్లో ఆ కోరికే పుట్టదు.

## దైవదర్శనం-67

భూలోకంలో ఉన్నట్లే స్వర్గలోకంలో కూడా రోడ్లు, షాపులు ఉంటాయి. అయితే ఆ రోడ్లు వేరు. ఆ షాపుల్లో అమ్మకం కొనుగోళ్ళు ఉండవు. స్వర్గవాసి తనకిష్టమైన వస్తువుని ఆ దుకాణాల నుండి నిస్సంకోచంగా తీసుకుంటాడు.

హజ్రత్ అలి ముర్తజా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈవిధంగా తెలియజేశారు: "స్వర్గంలో ఒక బజారు (మార్కెట్) ఉంది. అక్కడ అమ్మకం, కొనుగోళ్ళు ఉండవు. ఆ బజారులో స్త్రీ పురుషుల చిత్రాలు ఉంటాయి. ఎవరైనా స్వర్గవాసి వాటిని చూసి "ఫలానా చిత్రంలోని మనిషిముఖం మాదిరిగా నాముఖం ఉంటే బాగుంటుంది" అని మనసులో అనుకుంటాడు. అలా అనుకోవడమే తడవు, అతని ముఖం ఆ చిత్రంలోని ముఖంలా మారిపోతుంది." (తిర్మిజి)

**ద్విగుణీకృత సౌందర్యం :** దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "స్వర్గంలో ఒక బజారు ఉంది. స్వర్గవాసులు ప్రతి శుక్రవారం అక్కడికి వెళ్తారు. అక్కడ (ఒక విధమైన) ఉత్తరగాలి వీస్తూ స్వర్గవాసుల ముఖాలపై, దుస్తులపై సువాసన వెదజల్లుతుంది. దాంతో వారి అందం ద్విగుణీకృత మవుతుంది. ఈవిధంగా వారు ఎంతో అందంగా మారి తమతమ ఇండ్లకు తిరిగెళ్ళి పోతారు. వారి భార్యలు వాళ్ళను చూసి 'దైవసాక్షి! మీరు మా నుండి వేరయిపోయిన తరువాత మీ అందం రెట్టింపు అయింది' అనంటారు. వారీ మాట విని 'దైవసాక్షి! మేము మీ దగ్గర్నుంచి వెళ్ళిపోయిన తర్వాత మీ అందం కూడా రెట్టింపయింది' అనంటారు." (ముస్లిం)

హజ్రత్ అబూహురైరా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) స్వర్గంలో దైవదర్శనం గురించి ఇలా తెలియజేశారు: "స్వర్గవాసులు స్వర్గంలో ప్రవేశించిన తర్వాత తమతమ కర్మల్ని బట్టి హోదా అంతస్తులు పొందుతారు. ఆ తరువాత ఇహలోకపు రోజులలో శుక్రవారం రోజంతటి వ్యవధిలో వారికి తమ ప్రభువును దర్శించుకునే అనుమతి లభిస్తుంది. కనుక వారు తమ ప్రభువుని దర్శించుకుంటారు. అప్పుడు దేవుడు తన సింహాసనాన్ని బహిర్గతం చేస్తాడు. తన దర్శనభాగ్యం కలిగించడానికి ఆయన ఒక పెద్ద వనంలో ప్రత్యక్షమవుతాడు.

(దైవదర్శనం కోసం వచ్చిన) వారి కోసం జ్యోతిర్మయ కుర్చీలు, వజ్ర పీఠాలు, ముత్యపు ఆసనాలు, బంగారు కుర్చీలు, వెండి పీఠాలు వేయబడతాయి. (స్వర్గవాసులు తమతమ హోదాలను బట్టి ఆయా పీఠాలపై ఆసీనులవుతారు.) గౌరవప్రపత్తుల దృష్ట్యా (అందరూ సమానులే.) వారిలో ఎవరూ అల్పులు కారు. హోదాల దృష్ట్యా అందరికంటే తక్కువ హోదా కలిగినవారు కస్తూరీ గుట్టలపై కూర్చుంటారు. గుట్టలపై కూర్చున్నవారు తమకంటే కుర్చీలపై కూర్చున్నవారు శ్రేష్ఠులని ఎంతమాత్రం భావించరు.

హజ్రత్ అబూహురైరా (రజి) మాట్లాడుతూ "దైవప్రవక్తా! మేము మా ప్రభువును చూడగల్గుతామా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "సూర్యుడ్ని, పూర్ణచంద్రుడ్ని చూడటంలో మీకేమైనా అనుమానం కల్గుతుందా?" అన్నారు. కల్గదన్నారు అనుచరులు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు:

"అదేవిధంగా మీరు మీ ప్రభువును చూడటంలో కూడా ఎలాంటి అనుమానం ఉండదు. ఆ సమావేశంలో దేవుడు ప్రతి ఒక్కరి ముందుండి సంభాషిస్తాడు. చివరికి



వారిలో కొందరిని సంబోధిస్తూ 'ఫలానా మనిషి కొడుకు ఫలానా మనిషీ! నీవు ఫలానా రోజు ఇలా ఇలా అన్నావు, గుర్తుందా?' అని ప్రశ్నిస్తాడు.

ఆవిధంగా దేవుడు అతను ఇహలోకంలో చేసిన ప్రమాణభంగాలు కొన్నిటిని గుర్తుచేస్తాడు. ఆ మనిషి ఈమాట విని 'ప్రభూ! మీరు నన్ను క్షమించలేదా?' అంటాడు. దానిపై దేవుడు మాట్లాడుతూ 'ఆ... క్షమించాను. నేను విశాల హృదయంతో క్షమించడం వల్లనే నువ్వీనాడు ఈ స్థాయికి చేరుకున్నావు' అనంటాడు."

స్వర్గవాసులంతా ఇలా దేవుడ్ని దర్శిస్తుండగానే ఒక మేఘమాలిక వచ్చి ఓ ఘాటైన సువాసన వారిపై వదలుతుంది. అంతటి మంచి సువాసన వారంతకు ముందు ఎన్నడూ ఆఘ్రాణించి ఉండరు.

ఆ తరువాత దేవుడు వారితో 'ఇక లేవండి. నేను మీ గౌరవ ప్రతిష్ఠల కోసం తయారుచేసిన దాని దగ్గరకు పదండి. అందులో మీకు నచ్చిన వస్తువు తీసుకోండి' అని అంటాడు.

**సూపర్ మార్కెట్ :** ఆ తరువాత మనమంతా ఒక బజారులోకి అడుగుపెడ్తాము. దాన్ని దైవదూతలు పర్యవేక్షిస్తుంటారు. ఆ బజారులో ఎవరి కళ్ళూ చూడని, ఎవరి చెవులూ వినని, ఎవరి హృదయంలో జనించని అత్యంత మనోహరమైన వస్తువులు ఉంటాయి. మనం ఆ వస్తువులలో మనకు నచ్చినవాటిని తీసుకుంటాము. అక్కడ ఏవిధమైన అమ్మకం, కొనుగోళ్ళు ఉండవు.

ఆ బజారులో స్వర్గవాసులు పరస్పరం కలుసుకుంటారు. ఒకరికంటే ఒకరు అధికులు, అల్పులు అనే భావన లేనప్పటికీ పెద్ద హోదా కలిగిన ఒకతను చిన్న హోదా కలిగిన ఒకతడ్ని కలుసుకుంటాడు. అప్పుడు చిన్నహోదా స్వర్గవాసికి పెద్దహోదా స్వర్గవాసి ధరించిన దుస్తులు ఎంతగానో నచ్చుతాయి. చిన్నహోదా స్వర్గవాసిలో ఈ ఆలోచన కలగగానే పెద్దహోదా స్వర్గవాసి దుస్తుల కంటే తన దుస్తులే బాగున్నట్లు అన్పిస్తుంది. దానిక్కారణం స్వర్గంలో ఎవరికీ ఎలాంటి బాధ, వేదన కలిగే అవకాశ మివ్వడం జరగదు.

ఆ తరువాత మనం ఎవరి ఇండ్లకు వారు వెళ్ళిపోతాము. మనం మన ఇండ్లకు చేరుకోగానే మన భార్యలు మనకు స్వాగతం చెబుతారు. తరువాత వారు మాట్లాడుతూ 'మీరు మా దగ్గర్నుండి వెళ్ళిపోయిన తరువాత ఇప్పుడు ఎంతటి సౌందర్యంతో తిరిగి వచ్చారు!' అనంటారు (ఆశ్చర్యంతో). దానికి మనం 'మాకీ రోజు మా ప్రభువు దర్శన భాగ్యం లభించింది. అంతటి మహాభాగ్యం పొందిన మేము అదే దర్పంతో తిరిగొచ్చాం మరి'' అని అంటాము." (తిర్మిజి)

**అన్నిటి కంటే పెద్దభాగ్యం :** హజ్రత్ సుహైబ్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"స్వర్గవాసులు స్వర్గంలో ప్రవేశించిన తరువాత విశ్వప్రభువు వారిని ఉద్దేశించి 'మీకు ఇంకేమైనా కావాలా? అడగండి, ఇస్తాను' అంటాడు.

దానికి వారు '(మాకన్నీ ఇచ్చేశారుకదా! ఇంకేం కావాలి?) మీరు మా ముఖాలను తేజోవంతం చేయలేదా? మమ్మల్ని నరకం నుండి తప్పించి స్వర్గప్రవేశం కూడా చేయించారు కదా!' అని అంటారు.

ఆ తరువాత దైవదర్శనం కోసం తెర ఎత్తేయబడుతుంది. అప్పుడు స్వర్గవాసులంతా (సృష్టికర్త, విశ్వప్రభువయిన) దేవుడ్ని కళ్ళారా చూసుకుంటారు. స్వర్గంలో ప్రసాదించబడిన భాగ్యాలన్నిటికంటే వారికి దైవదర్శనమే ఎంతో ప్రియమైన భాగ్యం అన్పిస్తుంది." (ముస్లిం)

హజ్రత్ జాబిర్ (రజి) ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "స్వర్గవాసులు తమతమ మహాభాగ్యాలు అనుభవించడంలో నిమగ్నులయి ఉన్నప్పుడు హఠాత్తుగా వారి మీద ఒక దివ్యతేజస్సు ప్రసరిస్తుంది. దాంతో అందరూ తలలు పెకెత్తి చూస్తారు. ఆశ్చర్యం! వారి ముందు పరాత్పరుడు ప్రత్యక్షమై ఉంటాడు. (అపూర్వమైన ఈ దివ్యదర్శనంతో స్వర్గవాసుల శరీరాలు అణువణువూ పులకరిస్తాయి.) ఆ సందర్భంలో దేవుడు వారిని సంబోధిస్తూ 'స్వర్గవాసులారా! మీకు సలాం (శాంతిశ్రేయాలు కలుగుగాక!)' అని ఆశీర్వదిస్తాడు. ఈ వాక్యంలో ఆయన పేరొకటి (సలాం) ఉంది.

ఆ తర్వాత సృష్టికర్త స్వర్గవాసుల్ని, స్వర్గవాసులు సృష్టికర్తను చూస్తూవుంటారు. చివరికి సృష్టికర్త అంతర్ధానమవుతాడు. తెర పడిపోతుంది. ఆయన నుండి వెలువడిన జ్యోతి మాత్రం మిగిలివుంటుంది... స్వర్గవాసులు తమ ప్రభువును చూస్తున్నంత సేపూ మరే మహాభాగ్యం వైపు దృష్టి సారించరు. (వారు సృష్టికర్త సౌందర్యాన్ని జుర్రుకోవడంలో నిమగ్నులై ఉంటారు.)" (ఇబ్నెమాజ)

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా తెలియజేశారు: "స్వర్గంలో హోదాఅంతస్తుల రీత్యా అధమశ్రేణి స్వర్గవాసికి లభించే సామ్రాజ్యంలోని తోటలు, ఆసనాలు (కుర్చీలు), భార్యలు, సేవకులు, ఇతర మహాభాగ్యాలు రెండువేల సంవత్సరాల ప్రయాణమంత పరిధిలో విస్తరించి ఉంటాయి. (అంటే భూలోకవాసి ఈ వస్తువులన్నిటినీ చూస్తూ ఒక చివరి నుండి మరొక చివరికి నడవడానికి రెండువేల సంవత్స రాలు పడ్తుందన్న మాట.) పోతే అందరికంటే అత్యున్నత శ్రేణికి చెందిన స్వర్గవాసికి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం దైవదర్శన మహాభాగ్యం లభిస్తుంది."

ఆ తరువాత దైవప్రవక్త (సల్లం) ఖుర్ఆన్‌లోని ఈ (75:22) సూక్తి పఠించారు: "ఆరోజు కొందరి ముఖాలు కళకళలాడుతూ దేదీప్యమానంగా వెలిగిపోతుంటాయి. వారు తమ ప్రభువుని ప్రత్యక్షంగా చూస్తుంటారు." (తిర్మిజి)



**దైవప్రసన్నత :** యజమాని తన బానిసకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించినా అతని పట్ల ఎప్పుడూ ధుమధుమలాడుతుంటే ఆ బానిసకు మనశ్శాంతి ఉండదు. అతని పరిస్థితి చేతిలో ముద్ద, తలమీద మొట్టికాయలా ఉంటుంది. యజమాని తన బానిసకు అవసరాలన్నీ తీర్చి అతని పట్ల సంతోషంగా ఉన్నప్పుడే ఆ బానిస కూడా సంతోషంగా ఉండగలుగుతాడు. అలాగే దేవుడు తన పుణ్యదాసులకు సుఖసంతోషాల భాగ్యాలన్నీ ప్రసాదించిన తరువాత తాను వారి పట్ల శాశ్వతంగా ప్రసన్నుడయ్యానని ప్రకటిస్తాడు.

హజ్రత్ అబూసయీద్ ఖుద్రీ (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) దేవుడు, స్వర్గవాసుల మధ్య జరిగే సంభాషణను ఇలా తెలియజేశారు:

దేవుడు స్వర్గవాసుల్ని సంబోధిస్తూ "స్వర్గవాసులారా! అని పిలుస్తాడు. దానికి స్వర్గవాసులు "మేము మీ సన్నిధిలోనే ఉన్నాం ప్రభూ! మీ ఆదేశం శిరసావహించడానికి సిద్ధంగా ఉన్నాం, సెలవియ్యండి" అనంటారు.

అప్పుడు దేవుడు "మీరు (నా పట్ల) సంతుష్టులయ్యారా?" అని అడుగుతాడు.

"ప్రభూ! మీరు మాకు మీ దాసులలో ఎవరికీ ప్రసాదించని మహాభాగ్యాలు ప్రసాదించారు. అలాంటప్పుడు మేము ఎందుకు సంతుష్టులంకాము?" అంటారు స్వర్గవాసులు.

"సరే, ఇప్పుడు నేను మీకు ఇంతకంటే శ్రేష్ఠమైన మహాభాగ్యం ప్రసాదించనా?" అంటాడు విశ్వప్రభువు.

"ఇంతకంటే శ్రేష్ఠమైన మహాభాగ్యం ఇంకేముంటుంది!" అంటారు స్వర్గవాసులు.

"వినండి. బాగా వినండి. నేను మీకు శాశ్వతంగా నా ప్రసన్నతాభాగ్యం ప్రసాదిస్తున్నాను. ఇక ఎప్పుడూ నేను మిమ్మల్ని ఆగ్రహించను." (బుఖారి, ముస్లిం)


**సంక్షిప్తంలో సమగ్ర స్వరూపం**

**హదీస్ హితోక్తులు**




వివిధ ఉర్దూగ్రంథాల నుండి ఎంపికచేసి అత్యాధునిక విషయ సూచికతో వెలువడిన గ్రంథం ఇది. లోగడ తెలుగులో వెలువడిన గ్రంథాలలోని దాదాపు హదీసులన్నీ ఇందులో చూడవచ్చు. అంటే విషయ పరిజ్ఞానం రీత్యా సంక్షిప్తంలో సమగ్రం అన్నట్లు వేలాదిపేజీలలోని సమాచారమంతా దాదాపు 2125 హదీసులతో కేవలం 624 పేజీలలో కాంప్యాక్ట్‌డిస్క్‌లా ఈగ్రంథంలో ఇమిడిపోయిందన్న మాట.

రచన : అబుల్ ఇర్ఫాన్, పేజీలు : 624, వెల : రూ. 240/-

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, సహారాకాంప్లెక్స్, ఫ్లాట్‌నెం.106, పత్తర్‌గట్టి, హైదరాబాద్-2, ✆ 66710795, 9441515414**

## ఇహలోకంలో దైవదర్శనం సాధ్యమా?-68

ఇహలోకంలో దైవదర్శనం సాధ్యం కాదంటోంది ఇస్లాం. కొందరు బూటకపు బాబాలు, స్వాములు దేవుడ్ని చూపిస్తామని జనాన్ని మభ్యపెడ్తారు. మరికొందరు తాము కలలో దేవుడ్ని చూశామని చెప్పుకుంటారు. అవన్నీ ప్రజలను పెడదారి పట్టించే మాటలు తప్ప మరేమీ కావు. ముస్లింలలో కొందరు పరస్పర విరుద్ధ భావాలతో కూడిన కొన్ని హదీసు ఉల్లేఖనాలను అర్థం చేసుకోలేక, మహాప్రవక్త ముహమ్మద్ (స) తన గగన పర్యటన (మేరాజ్) సందర్భంలో దేవుడ్ని చూశారని భావిస్తున్నారు. కనుక ముస్లింలలో చోటుచేసుకున్న ఈ అపార్థాలకు కారణమైన ఉల్లేఖనాలలోని నిజానిజాలేమిటో మనం ఇక్కడ ముందుగా తెలుసుకుందాం.

మహనీయ ముహమ్మద్ (స) జిబ్రీల్‌దూత (అలై)ను రెండవసారి ఆయన అసలు రూపంలో మేరాజ్ సంఘటన సందర్భంగా చూశారు. దేవుడు దైవప్రవక్త (స)ను సప్తాకాశాల పర్యటన చేయించి అక్కడి అద్భుతాలను చూపించాడు. దీన్నే "మేరాజ్" సంఘటన అంటారు. మేరాజ్ సందర్భాన్ని పురస్కరించుకొని దేవుడు ఖుర్‌ఆన్‌లో "ఇతను మరోసారి కూడా అతడ్ని (సప్తమాకాశంలో) 'సిద్రతుల్ మున్తహా' అనే దివ్య వృక్షరాజం దగ్గర చూశాడు" (53:13) అనే సూక్తి అవతరింపజేశాడు.

కొందరు ఈ సూక్తులు విని దైవప్రవక్త (స) దేవుడ్ని ప్రత్యక్షంగా చూశారని అపార్థం చేసుకున్నారు. ప్రవక్త సతీమణి హజ్రత్ ఆయిషా (రజి) దీన్ని ఖండిస్తూ "మీలో ఎవరైనా ముహమ్మద్ (స) తమ ప్రభువుని చూశారని అంటే అతను అబద్ధ మాడుతున్నాడన్న మాట" అన్నారు. మరొక సందర్భంలో "ముహమ్మద్ (స) తమ ప్రభువుని చూశారని ఎవరైనా అన్నాడంటే అతను దేవునిపై ఘోరమైన నింద మోపు తున్నాడన్నమాట" అన్నారు. హజ్రత్ ఆయిషా (రజి) దీన్ని గురించి దైవప్రవక్త (స)ను అడిగినప్పుడు, తాను దేవుడ్ని చూడలేదని, జిబ్రీల్‌ను మాత్రమే ఆకాశం నుండి దిగు తున్నప్పుడు చూశానని అన్నారు ఆయన. (వివరాలకు సహీ బుఖారి చూడండి.)

ముస్లిం, నసాయి, ముస్నద్ అహ్మద్, తబ్రానీ గ్రంథాలలో హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) నుండి గ్రహించి పేర్కొనబడిన ఉల్లేఖనాలు ఈవిధంగా ఉన్నాయి:

(1)"దైవప్రవక్త (స) తమ ప్రభువును హృదయంతో రెండుసార్లు చూశారు." (2) "దైవప్రవక్త (స) తమ ప్రభువును కళ్ళతో కాకుండా హృదయంతో చూశారు." (3) "దేవుడు ఇబ్రాహీం (అలైహి)ని తన మిత్రుడిగా చేసుకున్నాడు; మూసా (అలైహి)తో ప్రత్యక్షంగా సంభాషించాడు; ముహమ్మద్ (స)కు తన దర్శనభాగ్యం కలిగించాడు; ఈమాట విని మీరు ఆశ్చర్యపోతున్నారా?" (4) "నేను నాప్రభువుని చూశాను" అని స్వయంగా దైవప్రవక్త (స) చెప్పారు. (5) "ఈరోజు రాత్రి నాప్రభువు అత్యంత శ్రేష్ఠ మైన రూపంతో నా దగ్గరకు వచ్చాడు" అని దైవప్రవక్త (స) చెప్పారు. ఆయన దేవుడ్ని స్వప్నంలో చూశారని ఆయన మాటలకు అర్థం కావచ్చని నేను భావిస్తున్నాను."



(6) "దైవప్రవక్త (స) తమ ప్రభువుని రెండుసార్లు చూశారు. ఒకసారి కళ్ళతో, మరొకసారి హృదయంతో చూశారు."

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) నుండి గ్రహించిన పై ఉల్లేఖనాలన్నీ ఒక దాంతో మరొకటి పొంతన లేకుండా అసంబద్ధంగా ఉన్నాయని కొందరు భాష్యకారులు అభిప్రాయపడ్డారు. అదీగాక ఇవిక్కడ పేర్కొనబడిన ఖుర్‌ఆన్ సూక్తికి అనుగుణంగా లేకపోవడం కూడా గమనార్హం.

తిర్మిజి ప్రకారం అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఒక సమావేశంలో మాట్లాడుతూ "దేవుడు తన దర్శనభాగ్యాన్ని, ప్రత్యక్ష సంభాషణను ముహమ్మద్ (స), మూసా (అలై)ల మధ్య విభజించాడు. ఆయన మూసా (అలై)తో రెండుసార్లు ప్రత్యక్షంగా మాట్లాడాడు. ముహమ్మద్ (స)కు ఆయన రెండుసార్లు తన దర్శనభాగ్యం కలిగించాడు" అని అన్నారు. మస్రూఖ్ ఈమాట విని హజ్రత్ ఆయిషా (రజి) దగ్గరికెళ్ళి "అమ్మా! ముహమ్మద్ (స) తమ ప్రభువుని చూశారా?" అని అడిగారు. హజ్రత్ ఆయిషా (రజి) "నీ మాటలు విని నారోమాలు నిక్కబొడుచుకున్నాయి" అన్నారు. ఆ తరువాత ఆమె రెండవ పేరాలో పేర్కొన్నట్లు అలా అనడం అబద్ధ మాడటంతో సమానమని, దైవప్రవక్త (స) దేవుడ్ని కాదు, దైవదూత జిబ్రీల్ (అలై)ని మాత్రమే చూశారని తెలియజేశారు.

మరొక ఉల్లేఖనం ప్రకారం, హజ్రత్ ఆయిషా (రజి) ఇలా అన్నారు: "ఈ విషయంలో అందరికంటే ముందు నేనే దైవప్రవక్త (స)ను, మీరు మీ ప్రభువును చూశారా అని అడిగాను. దానికాయన "లేదు, నేను జిబ్రీల్‌ని మాత్రమే ఆకాశం నుండి దిగుతుంటే చూశాను" అన్నారు.

ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో అబూజర్ గిఫ్ఫారి (రజి) ఇలా అన్నారు: నేను దైవప్రవక్త (సల్లం)ను "మీరు మీ ప్రభువును చూశారా?" అని అడిగాను. దానికాయన "నాకు, దైవదర్శనానికి మధ్య జ్యోతి అడ్డుతెరగా నిలిచింది" అన్నారు. మరో ఉల్లేఖనం ప్రకారం "నేను నా ప్రభువును చూడలేదు, జ్యోతిని చూశాను" అన్నారు. వేరొక ఉల్లేఖనం ప్రకారం "దేవుని సృష్టితాలలో ఏఒక్కరి దృష్టీ ఆయన్ని చేరుకోజాలదు" అన్నారు దైవప్రవక్త (సల్లం).

దీన్నిబట్టి దేవుడ్ని ప్రత్యక్షంగా ఇంతవరకు ఎవరూ చూడలేదని తెలుస్తోంది. దైవ దర్శనం లభించడమంటే మోక్షం సిద్ధించడమే. ఈ మోక్షం మరణానంతర జీవితం లోనే పుణ్యాత్ములకు ప్రాప్తమవుతుంది. అప్పుడు స్వర్గసౌఖ్యాలతో పాటు దైవదర్శన భాగ్యం కూడా లభిస్తుంది.

దేవుడు మూసా ప్రవక్త (అలై)ను తౌరాత్ పలకలు ప్రసాదించడానికి తూర్ కొండ దగ్గరకు పిలిపించినప్పటి సందర్భం గురించి ఈ క్రింది సూక్తులు అవతరించాయి:

మూసా మా నిర్ణీతసమయానికి (కొండ దగ్గరకు) చేరుకున్నప్పుడు అతని ప్రభువు అతనితో ప్రత్యక్షసంభాషణ జరిపాడు. (అప్పుడు) మూసా తన ప్రభువును వేడుకుంటూ "ప్రభూ! నాకళ్ళకు శక్తి ప్రసాదించి నీ దర్శనభాగ్యం కలిగించు" అన్నాడు. దానికి దేవుడు "నీవు నన్ను (ఇహలోకంలో) చూడలేవు. సరే, ఈ కొండ వైపు కాస్త దృష్టిసారించు. అది తన స్థానంలో యథాతథంగా ఉంటే నీవు నన్ను చూడగలవు" అన్నాడు.

ఆ తర్వాత అతని ప్రభువు తన దివ్యతేజస్సును ఆ కొండపై ప్రసరింపజేయగానే అది మరుక్షణం తునాతునకలై పోయింది. దాంతో మూసా స్పృహతప్పి పడిపోయాడు. కాస్సేపటికి స్పృహరాగా "ప్రభూ! నీవు ఎంతో పరిశుద్ధుడవు. జరిగిన పొరపాటుకు పశ్చాత్తాపపడుతూ నిన్ను క్షమాపణ వేడుకుంటున్నాను. (నన్ను క్షమించు.) అందరికంటే ముందు నేనే నిన్ను విశ్వసిస్తున్నాను" అని ప్రార్థించాడు మూసా. (ఖుర్ఆన్-7:143)

ఊహకే అందని విశ్వవ్యాప్త శక్తి స్వరూపుడైన దేవుణ్ణి మానవుడు చర్మచక్షువులతో చూడటం అంటే మోక్షం పొందడమే. కాని మరణానంతరం స్వర్గంలో మాత్రమే 'విశ్వాసులకు' ఈ మోక్షం సిద్ధిస్తుంది. అక్కడే దైవదర్శనభాగ్యం ప్రాప్తమవుతుంది. ఇది ఇహలోకంలో సాధ్యంకాదు.

అందువల్లనే మూసా ప్రవక్త (అలైహి) దేవుణ్ణి చూడ గోరినప్పుడు, నీవు నన్ను చూడలేవు అన్నాడు దేవుడు. పర్వతం లాంటి మహా బలిష్ఠమైన ఓ పెద్ద ఆకారం సైతం దేవుని అస్తిత్వం నుండి వెలువడిన ఓ చిన్న కిరణానికే తృటిలో భస్మీపటలం అయినప్పుడు ఈ బలహీన మానవుడు దైవదర్శన ప్రభావానికి తట్టుకోగలడా? ఎంతమాత్రం తట్టుకోలేడని మూసా ప్రవక్త (అలైహి) స్పృహ కోల్పోయిన సంఘటన రుజువు చేస్తోంది.

భగవద్గీతలో కూడా అర్జునుడు "యతో వాచో నివర్తంతే అప్రాప్యమనసాసహ" అని వాక్కునకు, మనస్సునకు సైతం అందదని అభివర్ణించబడిన దేవుణ్ణి చూడగోరితే "నతుమాం శక్యసే ద్రష్టుమ నేనైవ స్వచక్షుషా" (11:8)- (ఈ నీ మాంసమయ నేత్రములతో నీవు నా విశ్వ రూపమును గాంచజాలవు" అన్నాడు శ్రీకృష్ణుడు. (గీతామకరందం- పేజి.758)

అయితే ప్రత్యక్ష దైవాన్నే చూసి సంతృప్తపడగోరిన పౌరాణిక మనస్తత్వాన్ని తృప్తి పరిచేందుకు "దివ్యందదామితే చక్షుః పశ్యమే యోగమైశ్వరమ్"(11:8)- (కావున నీకు దివ్యదృష్టిని ప్రసాదించుచున్నాను. దానిచే ఈశ్వర సంబంధమైన నా యోగమహిమను జూడుము)" అన్నది భగవద్గీత.

ఖుర్ఆన్ మరోచోట "ఎవరి చూపులూ ఆయన్ని అందుకోజాలవు; ఆయన మాత్రం అందరి చూపులనూ అందుకోగలడు" (6:103) అని స్పష్టంగా చెబుతోంది. కనుక ప్రపంచంలో ఏ జీవి కూడా సృష్టికర్తను చూడలేదు. చివరికి మానవోత్తములైన దైవప్రవక్తలకు కూడా ప్రపంచంలో దేవుని దర్శనం లభించలేదు.



## ఇష్టాగోష్ఠులు-69

స్వర్గవాసులు పరస్పరం ఇష్టాగోష్ఠులు జరుపుకుంటారు. వారి సమావేశాల్లో ప్రాపంచిక విషయాలను గురించి కూడా ప్రస్తావనలు ఉంటాయి. స్వర్గవాసుల ఇష్టాగోష్ఠులను గురించి దివ్యఖుర్ఆన్ ఇలా పేర్కొంటున్నది:

**స్వర్గవాసుల మాటలు :** "వారు(ఈ వైభవాలు చూసి) 'సకల స్తోత్రాలు దేవునికే శోభిస్తాయి. ఆయనే మాకీ మార్గం చూపించాడు. ఆయన గనక మాకు సన్మార్గం చూపక పోయిఉంటే మాఅంతట మేమీ మార్గం పొందగలిగేవారం కాము. మా ప్రభువు పంపిన ప్రవక్తలు నిజంగా సత్యాన్నే తెచ్చారు' అనంటారు."

ఆ సమయంలో 'మీరీ స్వర్గానికి వారసులయ్యారు. మీరు చేసుకున్న కర్మలకు ప్రతిఫలంగా ఈస్వర్గం మీకు లభించింది' అని అశరీరవాణి విన్పిస్తుంది." (ఖు. 7:43)

"ఆ దాసులు ఒకరివైపు మరొకరు తిరిగి కబుర్లు చెప్పుకుంటారు. వారిలో ఒకడు ఇలా అంటాడు: "ప్రపంచంలో నాకో స్నేహితుడుండేవాడు. అతను నాతో 'నువ్వు కూడా సమర్థించే వారిలో చేరిపోయావా? మనం చనిపోయి మట్టిలో కలిసి అస్తిపంజరాల్లా మారిన తరువాత నిజంగా మనకు (మన) కర్మలఫలం ఇవ్వడం జరుగుతుందంటావా?' అని అంటుండేవాడు. అతనిప్పుడు ఎలా ఉన్నాడో మీరు చూడాలనుకుంటున్నారా?"

ఈమాట చెప్పి అతను నరకంలోకి తొంగిచూస్తాడు. ఆ వ్యక్తి నరకంలో అట్టడుగు భాగాన కన్పిస్తాడు. అతడ్ని పిలిచి "దైవసాక్షి! నీవు నన్ను సర్వనాశనం చేసి ఉండేవాడివి. నా ప్రభువు నన్ను కటాక్షించి ఉండకపోతే, ఈరోజు నేను కూడా (నీలాగే) పట్టుబడి వచ్చినవారిలో ఒకణ్ణయి ఉండేవాణ్ని.

సరే, (స్వగతంలో) ఇప్పుడు మనం ఎన్నటికీ చనిపోము కదూ! మనకు రావలసిన మృత్యువేదో ఇదివరకే వచ్చింది. ఇక మనకు ఎలాంటి శిక్షా ఉండదు కదూ!" అని అంటాడు. నిస్సందేహంగా ఇదే గొప్ప విజయం. ఇలాంటి విజయం కోసమే క్రియాశీలురు పని చేయాలి." (ఖుర్ఆన్-37:51-60)

హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) కథనం ప్రకారం స్వర్గంలో నరకవాసుల్ని చూడటానికి కిటికీల్లాంటి కన్నాలు ఉంటాయి. వాటిలో నుంచి స్వర్గవాసులు నరకవాసుల్ని చూస్తారు.

"వారు (ప్రపంచంలో గడచిపోయిన విశేషాల్ని గురించి) పరస్పరం మాట్లాడుకుంటారు. 'మనం ఇంతకు పూర్వం మన ఇండ్లలో బిక్కుబిక్కుమంటూ జీవితం గడుపుతుండేవాళ్ళం. చివరికి దేవుడు మనల్ని కరుణించి (ముఖాలను) మాడ్చివేసే వడగాల్పుల యాతనల నుండి రక్షించాడు. మనం గతజీవితంలో (ఏ కష్టమొచ్చినా) ఆయన్నే వేడుకునేవాళ్ళము. నిజంగా ఆయన మహోపకారి, అపార దయామయుడు' అని చెప్పుకుంటారు." (ఖుర్ఆన్-52:25-28)

**స్వర్గ నరకవాసుల సంభాషణ :** “ఆ తరువాత స్వర్గవాసులు నరకవాసుల్ని పిలిచి ‘మా ప్రభువు మాకు చేసిన వాగ్దానాలన్నీ నెరవేరాయి. మరి మీరు కూడా మీ ప్రభువు చేసిన వాగ్దానాలు నెరవేరాయని తెలుసుకున్నారా?’ అని అడుగుతారు. దానికి వారు ‘ఆ...తెలుసుకున్నాం’ అని సమాధానమిస్తారు.

అప్పుడు ఓ ప్రకటనకర్త వారి మధ్యకు వచ్చి ‘దేవుని మార్గంలోకి రాకుండా ప్రజల్ని నిరోధించిన దుర్మార్గులపై దైవశాపం విరుచుకుపడుగాక! వారు దైవమార్గాన్ని వక్రీకరించ దలిచారు, పరలోకాన్ని తిరస్కరించారు’ అని అంటాడు.” (ఖుర్ఆన్-7:44,45)

“నరకవాసులు స్వర్గవాసుల్ని కేకవేసి పిలిచి ‘(మేమిక్కడ మాడి చస్తున్నాం) మా మీద కొంచెం నీళ్ళు చల్లండి. లేదా మీకు దేవుడు ప్రసాదించిన దాన్నయినా కాస్త మావైపు విసిరేయండి’ అనంటారు.

దానికి స్వర్గవాసులు ‘దేవుడు ఈ రెండిటినీ సత్యతిరస్కారులకు నిషేధించాడు. వారు తమ ధర్మాన్ని ఆటగా, వినోదంగా చేసుకున్నారు. ప్రాపంచిక జీవితం వారిని మోసగించింది’ అని సమాధానమిస్తారు.” (ఖుర్ఆన్-7:50,51)

“ఇక సత్యాన్ని విశ్వసించి సత్కార్యాలు చేస్తున్నవారిని వారిప్రభువు వారి విశ్వాసం కారణంగా సన్మార్గాన నడిపిస్తాడు. వారికోసం సెలయేరులు ప్రవహించే స్వర్గవనాలు ఉన్నాయి. వారక్కడ ‘దేవా! నీవు పరిశుద్ధుడవు’ అని స్తుతిస్తూ ఉంటారు. అదీగాక వారు శాంతి చేకూరుగాక! అని ప్రార్థిస్తారు. వారు మాట్లాడే ప్రతి మాట చివర్లో ‘సకల స్తోత్రాలు సర్వలోక ప్రభువుకే శోభిస్తాయి’ అని కూడా ఉంటుంది.” (ఖుర్ఆన్-10:9,10)

## బైబిల్ బోధ-70

ప్రస్తుత బైబిల్ ఎన్ని మార్పులకు, చేర్పులకు గురయి ఉన్నా ఇప్పటికీ అందులో పరలోకం గురించి అనేక విషయాలు ఉన్నాయి. మచ్చుకు ఇక్కడ కొన్ని విషయాలు పేర్కొంటున్నాను:

“ఆ దినముల శ్రమ ముగిసిన వెంటనే చీకటి సూర్యుని కమ్మును, చంద్రుడు కాంతిని ఇయ్యడు, ఆకాశము నుండి నక్షత్రములు రాలును, ఆకాశమందలి శక్తులు కదలింపబడును.” (మత్తయి-24:29)

“మరియు ఆయన గొప్ప బూరతో తన దూతలను పంపును. వారు ఆకాశము యొక్క ఈ చివర నుండి ఆ చివర వరకు నలుదిక్కుల నుండి ఆయన ఏర్పరచుకొనిన వారిని పోగుచేయును.” (మత్తయి-24:31)

“దీనికి ఆశ్చర్యపడకుడి; ఆ కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్నవారందరు ఆయనశబ్దము విని మేలుచేసినవారు జీవ పునరుత్థానమునకును కీడు చేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు.” (యోహాను-5:28,29)



“సర్పములారా, సర్పసంతానమా, నరకశిక్షను మీ రేలాగు తప్పించుకుందురు?” (మత్తయి-23:33)

“మనలో ప్రతివాడును తన్ను గురించి దేవునికి లెక్క యొప్పగింపవలెను.” (రోమా-14:12)

“మరియు సమాధులలో నిద్రించు అనేకులు మేలుకొనెదరు; కొందరు నిత్య జీవము అనుభవించుటకును, కొందరు నిందపాలగుటకును నిత్యముగా హేయులకు టకును మేలుకొందురు. బుద్ధిమంతులైతే ఆకాశమండలములోని జ్యోతులను పోలిన వారై ప్రకాశించెదరు. నీతిమార్గము ననుసరించి నడుచుకొనునట్లు ఎవరు అనేకులను త్రిప్పుదురో వారు నక్షత్రమువలె నిరంతరమును ప్రకాశించెదరు.” (దానియేలు-12:2,3)

“దుష్టుని దోషములు వానిని చిక్కుల బెట్టును. వాడు తన పాపపాశముల వలన బంధింపబడును. శిక్ష లేకయే అట్టివాడు నాశనమగును. అతి మూర్ఖుడై వాడు త్రోవ తప్పి పోవును.” (సామెతలు-5:21,22,23)

“అనేకులు తూర్పునుండియు, పడమటనుండియు వచ్చి అబ్రాహాముతో కూడను ఇస్సాకుతో కూడను, యాకోబుతో కూడను, పరలోకరాజ్యమందు కూర్చుందురు గాని రాజ్య సంబంధులు వెలుపటి చీకటిలోనికి త్రోయబడుదురు; అక్కడ ఏడ్పును పండ్లు కొరుకుటయు నుండునని మీతో చెప్పుచున్నానెను.” (మత్తయి-8:11,12)

“యౌవనుడా, నీ యౌవనమందు సంతోషపడుము, నీ యౌవనకాలమందు నీ హృదయము సంతుష్టిగా ఉండనిమ్ము, నీ కోరిక చొప్పునను నీ దృష్టియొక్క ఇష్టము చొప్పునను ప్రవర్తింపుము; అయితే వీటన్నిటిని బట్టి దేవుడు నిన్ను తీర్పులోనికి తెచ్చునని జ్ఞాపక ముంచుకొనుము.” (ప్రసంగి-11:9)

## వేదఘోష-71

మానవులు సహజంగా కోరుకునే లోకం స్వర్గలోకం. ఇది మనిషి కోరికకు అనుగుణ మైనది. అతని శాశ్వత నివాసం కూడా. రుగ్వేదంలో ఇలా ఉంది:

“ఇంద్రా! మరణరహితమైన, వెలుగులతో నిండిన, శాశ్వత తేజస్సునిచ్చేది, పతన రహితమైన ఆ లోకానికి నన్ను చేర్చు.” (మండలం-9, సూక్తం-113, మంత్రం-7)

**స్వర్గం అంటే :** “నన్ను ఉత్తమకోరికల లోకంలో అనంతునిగా చెయ్యి. ఆ లోకం పూర్తిగా తేజోమయమైన లోకం. అది బ్రహ్మసామ్రాజ్యం. అక్కడ సకల తిను బండారాలు, సంపూర్ణ సుఖభోగాలు లభిస్తాయి.” (మండలం9, సూక్తం113, మంత్రం10)

“ఎక్కడైతే ఆనందం, సౌఖ్యాలు, ఉత్తమమైన అనుభూతులు ఉన్నాయో, ఎక్కడైతే కోరుకున్న కోరికలన్నీ మొదటి నుండే లభ్యమయి ఉన్నాయో ఆ లోకంలో నాకు ముక్తినొసగు.’ (మండలం-9, సూక్తం-113, మంత్రం-11)

"ఎక్కడైతే 'మోదం', 'ముదావహం', 'ప్రమోదం' అనే మూడురకాల సుఖానుభూతులు ఉంటాయో, ఎక్కడైతే చిరకాల కోరికలు ఈడేరుతాయో ఆ లోకంలో నన్ను శాశ్వతునిగా చెయ్యి." (మంత్రం-11)

ఈ మంత్రంలో చెప్పబడ్డ సుఖానుభూతులు, మోదం, ముదావహం, ప్రమోదాలు సంభోగానికి సంబంధించిన సుఖానుభూతులు. ప్రమోదం అనే పదం వేదాల్లో ప్రత్యేకంగా సంభోగసుఖం కోసమే వాడబడింది. దీన్నిబట్టి స్వర్గంలో స్వర్గవాసులకు భార్యలు లభిస్తారని స్పష్టమవుతోంది. దీనికి రుజువు వేదాల్లోని ఇతర వివరణల్లో కూడా లభిస్తుంది.

"దానధర్మాలు చేసేవాడు (దాత) మొదట సురభం (అందమైన స్వర్గం) అనే ప్రదేశాన్ని పొందుతాడు. ఆ తరువాత అతడు మంచి వస్త్రాలను, అందమైన స్త్రీని, ఘాటైన సారాయిని పొందుతాడు." (అధర్వణ వేదం: 10-107-9)

"స్వర్గంలో మనిషి ముసలివాడుకాడు. అక్కడ ఎవ్వరికీ మరణం అనేది రాదు."

"స్వర్గంలో ఎలాంటి భయంలేదు. అక్కడ ఎవ్వరికీ మరణంరాదు. అక్కడ ముసలితనం వచ్చే భయమూ లేదు. మనిషి ఆకలిదప్పుల నుండి విముక్తి పొంది స్వర్గంలో సౌఖ్యాలు అనుభవిస్తాడు." (మంత్రం-13)

"ఓ మనిషీ! 'ఋత్' అనే పదం ఈ మార్గాన్ని చూడు. దేనిపై పుణ్యాత్ములు, అంగ్రసులు, భయభీతి కలవారు నడుస్తారో, ఆ మార్గాల ద్వారా నీవూ స్వర్గం వైపునకు నడు- ఎక్కడైతే 'ఆదిత్య' దేవతలు తేనె త్రాగుతుంటారో." (అధర్వణ వేదం:18-4-3)

"అమరుడవు. నీవక్కడ మరణించవుగాక మరణించవు, భయపడకు. అక్కడివారు మరణించరు, ఏ గాఢాంధకారంలోనూ పడవేయబడరు." (అధర్వణ వేదం: 8-2-24)

"ఆ ముక్తిలోకంలో అంతం కానటువంటి తేజస్సు ఉంది. అన్ని విధాల వెలుగు, సుఖం ఉన్నాయి. ఆ స్వర్గంలో 'అనూకామం' ఉంది. అక్కడి లోకాలు వెలుగొందుతూ ఉంటాయి. అక్కడ 'కామం', 'నికామం', 'సుధ', 'తృప్తి', 'ఆనందం', 'మోదం', 'ప్రమోదం' ఉన్నాయి. అక్కడ మనోవాంఛలన్నీ తీర్చబడతాయి." (ఋగ్వేదం: 9-113-7-9)

స్వర్గం ఆత్మ సంబంధమైనది మాత్రమే కాదు, అక్కడ మనిషి శరీరాన్ని కూడా కలిగివుంటాడు. వేదాల్లో ఇలా ఉంది:

"ఓ దేవా! వీరికి పితృలోకాన్ని ప్రసాదించు. వారికి వారి శరీరాన్ని నీ ఇష్టప్రకారం ప్రసాదించు." (ఋగ్వేదం: 10-15-4)

"ఓ పితృలారా! శరీరాన్ని పొంది స్వర్గంలో ప్రవేశించి ఆనందించండి." (అధర్వణ వేదం: 18-4-64); "నా ఆత్మ మంచి తేజస్సుతో కూడిన శరీరాన్ని పొందాలి." (అధర్వణ వేదం: 18-2-10)



శత్పథబ్రాహ్మణం (6-6)లో ఇలా ఉంది:

"స్వర్గంలో మేము భార్యా పిల్లలతో ఉండేటట్లు అక్కడ మాకు మార్గం చూపు..... అంగవైకల్యరహితులమై మేము స్వర్గంలో మా తల్లిదండ్రుల్ని, కుమారుల్ని చూడాలి."

"స్వర్గలోకంలో ఎలాంటి భయం లేదు..... అక్కడ ఎవ్వరూ ముసలితనం కల్గుతుందని భయపడరు. స్వర్గలోకంలో ఆకలిదప్పులను అధిగమించి మనిషి దుఃఖ రహితుడై ఆనందిస్తాడు." (కఠోపనిషత్తు 1:12)

**స్వర్గ దృశ్యాలు :** స్వర్గదృశ్యాలు, వాటి ప్రత్యేకతలు కొన్ని వేదాల్లో ఇలా ఉన్నాయి:

"తేనె రుచిగల వేలాది సెలయేరులు మూడో ఆకాశంలో (స్వర్గంలో) ప్రవహిస్తున్నాయి." (అధర్వణ వేదం: 9-74-6)

"నెయ్యితో నిండిన కోనేరులు, తేనె తటాకాలు, సారాయి, పాలు, పెరుగు మరియు నీటితో పుష్కలంగా పారే తీయటి సెలయేళ్లు స్వర్గంలో నీకు లభిస్తాయి. కమలాలతో నిండిన సరస్సులూ నీకు లభిస్తాయి." (అధర్వణ వేదం: 4-34-6)

"ఆ ఈశ్వరుడు నెయ్యి, తేనె, సారాయి సెలయేళ్ళతో నా వద్దకు వచ్చాడు." (అధర్వణ వేదం : 10-6-25)

"దానం ఇచ్చేవాడు మొదట సుఖభోగాల ప్రదేశాన్ని (అంటే స్వర్గాన్ని) పొందాడు. ఆ తరువాత మంచి వస్త్రాలు ధరించిన స్త్రీలను, ఘాటైన మధుపాత్రను పొందాడు." (అధర్వణ వేదం : 10-107-9)

"అమితంగా సుఖానుభూతుల్ని అందించే ఆ స్వర్గం కోసం నేను ప్రార్థిస్తున్నాను." (అధర్వణ వేదం : 2-2-2)

"అతని వద్దకు అయిదు వందల అప్సరసలు వస్తారు. వందమంది పూమాలలతోను, వందమంది పరిమళాలు వెదజల్లే దంతమంజనాలతోను, వందమంది కచ్చూరం మరియు కేసర పొడితోను, వందమంది విలువైన అందమైన వస్త్రాభరణాలతోను మరో వందమంది తమ దోసిళ్ళలో పువ్వులు తీసుకొని వస్తారు. ఆ స్వర్గవాసుడ్ని ఆభరణాలతో అలంకరిస్తారు." (కౌశితకీయ బ్రాహ్మణం: 1-4)

"మహాభారతం ప్రకారం, స్వర్గం సత్కర్మలకు ఫలితంగా లభించే లోకం. ఇంద్రపురి వాటిలో అన్నిటికంటే ఘనమైనది. ఇంద్రపురిలో నందనవనం ఉంది. అక్కడ మనిషి తనకిష్టమైన రూపం ధరించి అప్సరసలతో కలసి నివసిస్తాడు (ఆదిపర్వం: 89-16-19)

"అక్కడ వృద్ధాప్యంగాని, దుఃఖంగాని, అలుపుసొలుపుగాని, భయభీతులుగాని ఉండవు. అక్కడ గంధర్వులు, అప్సరసలు నాట్యమాడుతూ సంగీతం, పాటలతో స్వర్గవాసులను అలరిస్తారు." (సభా పర్వం:7)

స్వర్గానికి చేరిన మానవాత్మలు తిరిగిరావని ఉపనిషత్తులు కూడా ధృవపరుస్తు న్నాయి. అక్కడ పాపంగాని, అంధకారంగాని నామమాత్రంగా కూడా ఉండదు. అక్కడ ఎటువంటి వ్యాధి లేదు. ఆ లోకం సత్కర్మలకు ఫలితంగా లభించే లోకం. సతతం తేజోమయంగా ఉండే లోకం అని చెప్పబడింది వాటిలో.

"ఆ వృక్షాలపై కూర్చుని అందమైన పక్షులు మధురమైన ఫలాలు తింటాయి. వాటిపైన్నే అవి నివసిస్తాయి..... వాటి చిటారి కొమ్మలపై కూర్చొని, 'పీలం' అనే ఫలం అతిమధురమైన ఫలం, అయితే, తండ్రిని (పరమాత్మను) తెలుసుకోలేనివారు ఆ ఫలాన్ని పొందలేరు అని పలుకుతాయి." (రుగ్వేదం: మండలం-1, సూక్తం-164, మంత్రం-20-22)

"మన పైనున్న మూడో ఆకాశంలో రావివృక్షం నిలబడిఉంది. అది దేవతల నివాసం. అక్కడ వారు 'కష్ఠ' అనే మొక్కను పొందుతారు. ఆ మొక్క శాశ్వత జీవితానికి మూలం లేక శాశ్వత జీవితపు మూలం నుండి ఉద్భవించింది." (అధర్వణ వేదం)

"స్వర్గంలో సంగీతం, గానాలాపనల మాధుర్యం కూడా ఉంది." (రుగ్వేదం: 10-135-7), (అధర్వణ వేదం: 4-37-4)

"ఈ పాటల్ని మధ్యాకాశంలో ఉండే స్వర్గ గంధర్వుడు గానంచేసి మనకు ఆల పిస్తాడు." (రుగ్వేదం: మండలం-10, సూక్తం-39, మంత్రం-7)

"ఒకవేళ అతడు పాట, సంగీతం గురించి తలుచుకుంటే వెంటనే అతని అభిరుచికి తగిన సంగీతం, పాటలు అతని ముందు ప్రత్యక్షమవుతాయి. వాటిని పొంది అతడు ఆనందిస్తాడు." (ఛావందగ్య ఉపనిషత్తు: 8-2-8)

"యుద్ధంలో హతులైన శూరుల గురించి దుఃఖించకు. చంపబడ్డ శూరులు దుః ఖించతగిన వారు కారు. అతడు స్వర్గంలో ఔన్నత్యాన్ని పొందుతాడు. యుద్ధంలో చంపబడ్డ వానికి పిండ ప్రదానం, స్నానం, అశుద్ధతల గురించిన నియమాలు పాటించరు. యుద్ధంలో చనిపోయిన వీరుని కోసం వేలాది అప్సరసలు పరుగెత్తుకొస్తారు. ప్రతి అప్సరస అతడు తన భర్త కావాలని కోరుకుంటుంది." (మహాభారతం: శాంతి పర్వం-98-44-47)

"పరిశుద్ధ నందనవనం వగైరాలు పుణ్యాత్ముల విలాస ప్రదేశాలు. అక్కడ ఆకలి దప్పులుగాని, అలుపుసొలుపుగాని, చలి వేసవితాపాలుగాని, మరెలాంటి ప్రమాదాలుగాని ఉండవు. అక్కడ అశుద్ధమైన నీచమైన వస్తువు ఏదీ లేదు. అన్నివిధాలుగా సుఖమైనది. అక్కడ సువాసనతో కూడిన గాలులు వీస్తుంటాయి. అక్కడి పాటలు వీనులకు విందుగా, హృదయాలను రంజింపజేసేవిగా ఉంటాయి. అక్కడ దుఃఖంగాని, వృద్ధాప్యంగాని, శ్రమగాని, బాధగాని ఉండవు. ఈ లోకం సత్కర్మలకు ఫలితంగా లభించేది. తమ కర్మలకు ప్రతిగా మనుషులు ఇక్కడ జన్మిస్తారు. ఇక్కడ పుట్టే ప్రతి మనిషి శరీరం అతని కర్మలకు అనుగుణంగా తేజోమయంగా ఉంటుంది. తల్లిదండ్రుల వల్ల వారక్కడ పుట్టరు. వారికి చెమట, దుర్వాసన, మలమూత్రాలు ఉండవు. వారి వస్త్రాలు దుమ్ముధూళితో మాసిపోవు. వారి సువాసనలు వెదజల్లే అందమైన పూమాలలు ఎప్పుడూ వాడవు..... ఈర్ష్యా ద్వేషాలు, బాధలు, అలుపు వారి దగ్గరికే రావు." (మహాభారతం: అరణ్యపర్వం-261:9-16)



"అక్కడ దుఃఖంగాని, ఈర్ష్యగాని, దురాశగాని, క్రోధంగాని లేవు. అక్కడ యువకు లంతా తమ భార్యలతో ఉంటారు. సహస్ర సూర్యుల్లా ధగధగ వెలుగుతూ ఉంటారు." (దేవీ భాగవతం: 12-12-50)

**స్వర్గానికి అర్హులు :** "సత్కార్యాలు ఆచరించేవారు, ఎల్లప్పుడూ మంచిని గురించి ఆలోచించేవారు దేవుని దృష్టిలో ప్రియమైనవారు." (రుగ్వేదం: 10-31-2)

"మనిషి సత్యంపై ఎంతో నమ్రతగా నడవాలి." (రుగ్వేదం: 10-31-2)

"సత్కర్మలకు సత్ఫలితం పొందే ప్రదేశాన్ని నీవు పొందావు." (అధర్వణ వేదం: 2-10-7)

"భవిష్యత్ లోకాన్ని పొందేందుకు తెల్ల పాదాల గొర్రెను దానమిచ్చేవాడు స్వర్గారోహణ చేస్తాడు. అక్కడ బలహీనుడు బలవంతునికి పన్ను కట్టడు." (అధర్వణ వేదం : 3-29-3)

"దానమిచ్చేవానికి ఆకాశ స్వర్గం ప్రాప్తమవుతుంది." (రుగ్వేదం: 10-125)

"భక్తితో దానం ఇచ్చేవారు స్వర్గాన్ని పొందుతారు." (అధర్వణ వేదం: 9-5-18)

"ఈ ధనాన్ని నేను బ్రాహ్మణులకు ఇస్తాను. పితృలోకం నుండే స్వర్గానికి పోయే మార్గాన్ని చూపుతాను." (అధర్వణ వేదం: 11-1-28)

"బలులు నిర్వహించేవారికి స్వర్గలోకంలో అమృతంతో నిండిన ఆహారం మరియు శక్తి ఒసగబడింది." (అధర్వణ వేదం: 18-4-25)

స్వర్గం పొందడానికి ఆచరణే ముఖ్యం కాదు, చిత్తశుద్ధి కూడా ఉండాలంటాయి వేదాలు. "చిత్తశుద్ధి గలవారు ఈ స్వర్గాన్ని పొందగలరు." (అధర్వణ వేదం: కాండం-6, సూక్తం-122, మంత్రం-3)

"ఓ కుంతీకుమారా! నీవు గనక యుద్ధంలో హతుడవైతే స్వర్గం పొందుతావు, జయిస్తే భూమిని ఏలుతావు." (భగవద్గీత: 2:37)

భగవద్గీతలోని చివరి అధ్యాయంలో కృష్ణుడు, తమ తమ కర్మలకు అనుగుణంగా మనుషులు పరమేశ్వరుణ్ణి పొందుతారు, అదే వారి చివరి ఆశయం అని అంటాడు.

"బలులిచ్చేవాడు, దాని ప్రతిఫలం, బహుమానాల వల్ల స్వర్గంలో నెయ్యితో నిండిన సెలయేళ్ళను, తన కోరికలను పొందుతాడు." (అధర్వణ వేదం: 18-4-5)

“గ్రుడ్డి ఆవు గోశాలలో ఉండిపోయినట్లు (స్నేహితునిగా మార్చడానికి ఇచ్చే దానం) ఈ లోకంలోనే ఉండిపోతుంది.” (మనుశాస్త్రం: అధ్యాయం-3, శ్లోకం-141 )

“మాతృసేవ వల్ల ఈ లోకాన్ని, పితృసేవ వల్ల మధ్యలోకాన్ని, గురుసేవ వల్ల స్వర్గాన్ని పొందుతాడు.” (మనుశాస్త్రం: 2-212)

“పరోపకారం చేసేవాడు స్వర్గానికి వెడతాడు; పరులను పీడించేవాడు నరకానికి వెడతాడు.” (వ్యాస మహాముని ఉవాచ)

**నరకం :** నాస్తికులు, సత్యవ్యతిరేకులు, దుష్కర్ములు, దుర్మార్గులు మాత్రమే నరకానికి పోతారు. వేదాల ప్రకారం, నరకం అంధకారబంధురమైన ప్రదేశం. అందులో అధర్ములు, పాపులు ప్రవేశింపజేయబడతారు. నరకాలు అనేక రకాలు. అవన్నీ అంధకారంతో కూడినవే.

“ఆ లోకాలు సూర్యుడులేని లోకాలు. ఎల్లెడలా అంధకారం వ్యాపించి ఉంటుంది. అందులో ఆత్మహత్యలకు పాల్పడేవారు ప్రవేశిస్తారు.” (యజుర్వేదం: 40-2)

“ఎవరైతే తన హృదయాన్ని మలినపర్చుకుంటాడో అతడు ఆ అధోలోకంలో పడిపోతాడు.” (అధర్వణ వేదం: 20-128-2)

పురాణాల్లో, ముఖ్యంగా విష్ణు పురాణం (2-6-1 నుండి 29), శ్రీమద్ భాగవతం (5-6-1 నుండి 37)లో నరకం గురించిన ప్రస్తావన వివరంగా లభిస్తుంది.

నరకాల సంఖ్య వందలాదిగా వేలాదిగా చెప్పబడింది. నరకాల సంఖ్య అధమంగా ఏడని, విష్ణుపురాణం, యోగ సూత్రాల వ్యాస భాష్యం (3-26), శంకరాచార్యుని వేదాంత భాష్యం 3-1-15లో ఉంది. ఆ తరువాత వాటి సంఖ్య ఇరవైఒక్కటి వరకు పెరిగింది. వీటి పేర్లు మనుస్మృతి (4-88-90), శ్రీమద్భాగవతం (5-26-7)లో చూడవచ్చు. విష్ణుపురాణం (2-6-2 నుండి 5 వరకు) ఇంకా శ్రీమద్భాగవతం (7-26-6)లో ఇరవై ఎనిమిది నరకాల ప్రస్తావన ఉంది. సుఖ్‌సాగర్‌లో వివరంగా ఏ దుష్కర్మకు ఫలితంగా ఏ నరకం ప్రాప్తమవుతుందో విడమర్చి చెప్పడం జరిగింది. ఉదాహరణకు, సుఖ్‌సాగర్ పేజి 293 నుండి 296, శ్రీమద్భాగవతం 5:26లో కొన్ని శ్లోకాలు ఇక్కడ గమనించదగ్గవి.

“నేను, నాది అనే అహంకారంతో ఇతరులతో వైరం పెంచుకొని తన కుటుంబాన్ని మాత్రమే పోషించుకునేవాడు ‘రైరవ’ అనే నరకంలో పడిపోతాడు.”

“అగమ్య’ స్త్రీ లేక పురుషునితో సంభోగించేవారిని కొరడాలతో కొడుతూ ‘తప్తసర్మి’ అనే నరకంలోకి తీసికెళ్ళి పడవేస్తారు. ఆ తరువాత ఎర్రగా కాలుతున్న ఇనుప విగ్రహాలకు వారిని కట్టిపడేస్తారు. అక్కడ వారు కాలుతూ ఉంటారు...”

“‘ఏ రాజులు లేక రాజప్రతినిధులైతే ధర్మాన్ని, ఆరాధనాలయాలను, ఇతర



ప్రదేశాలను నాశనం చేస్తారో వారు అశుద్ధం, మలమూత్రాలు, రక్తం, వెంట్రుకలు, కొవ్వు, గోళ్ళు, ఎముకలతో నిండిన ‘వైతరణి’ నదిలో మునకలేస్తారు....”

“ఎవరైతే తప్పుడు సాక్ష్యం ఇస్తారో వారు ‘అవీచి’ అనే నరకంలో నూరు యోజనాల ఎత్తు గల కొండపై నుండి పడవేయబడతారు.”

“‘ఏ బ్రాహ్మణ, క్షత్రియులు, వైశ్యులు లేక వారి స్త్రీలు అయినా ఎలాంటి జంకులేకుండా మద్యాన్ని సేవిస్తారో వారిని ‘అయఃపానం’ అనే నరకంలో పడవేసి వారి నోటిలో కరిగిన ఇనుప రసం పోస్తారు యమదూతలు....”

“ఎవరయితే ధనగర్వంతో ధనం అయిపోతుందన్న బెంగతో దురాశాపరుడయి దయ్యంలా కూడబెడతాడో, ఖర్చుపెట్టకుండా, దానం చేయకుండా ఉంటాడో అతడు ‘సూచీముఖ’ అనే నరకంలో పడతాడు. అక్కడ యమదూతలు అతణ్ణి సూదులతో పొడుస్తుంటారు.”

ఇరవైఒక్క నరకాలను కుదిస్తే పైన చెప్పిన ఏడు నరకాలుగా తేలుతాయి. వేదాల్లో నరకాల వివరణ స్పష్టంగా చెప్పబడింది. ఉదాహరణకు రుగ్వేదంలో ఇలా ఉంది:

“వారు పాపాల పుట్ట, అసత్యవాదులు, కృతఘ్నులు. వారే ఈ అధోలోకాన్ని (నరకాన్ని) సృష్టించుకున్నారు. (అంటే వారి దుష్కర్మల కారణంగా ఈ నరకాన్ని ఉనికిలోనికి తీసుకురావడం జరిగిందన్న మాట.)” (రుగ్వేదం: 4-5-5)

“ఓ ఇంద్రా! ఓ సోమా! అగ్ని మంటలకు పాత్రలోని నీళ్ళు ఎలా మసలుతాయో అలా పాపాత్ముల చుట్టూ వారి పాపాలు మసలుతుంటాయి.” (రుగ్వేదం: 7-104-2)

“దుష్కార్యాలకు పాల్పడేవారిని లోతైన గోతిలోని అంధకారంలో పడవేయండి- అక్కడి నుండి వారు బయటికిరాని విధంగా. వారిలో ఏఒక్కడు ఏనాటికీ తిరిగి బయటకు రాడు.” (మంత్రం-3)

పై శ్లోకాలను బట్టి నరకయాతన శాశ్వతమైనదని, తాత్కాలికం కాదని తెలుస్తోంది. ఇది ఇస్లామ్ భావనకు పూర్తిగా సరిపోయే భావన.

“కాంతితో ధగధగలాడే యమరాజపురం, అప్సరసలతో, గాయకులతో నిండిఉంది. అక్కడ ఎనభైనాల్గు లక్షల నరకాలున్నాయి.” (గరుడ పురాణం: ప్రేతకల్పం: 4:19)

హిందువుల్లో, ఎనభైనాల్గు లక్షల దేహాలు ఉన్నాయని, పునర్జన్మ కారణంగా ఆత్మ ఆ ఎనభైనాల్గు లక్షల దేహాల్లోను ప్రవేశిస్తుందనే భావన ఉంది. కాని పై మంత్రంలో వాటిని ఎనభైనాలుగు లక్షల నరకాలుగా చెప్పబడింది. గరుడ పురాణం- ప్రేతకల్పం- 5:20లో ఈ ఎనభై నాల్గు లక్షల నరకాల ప్రస్తావన వచ్చింది. వాటిలో ఇరవై ఒక్క నరకాలు మాత్రం అత్యంత భయంకరమైన నరకాలుగా చెప్పబడ్డాయి.

**నరకానికి అర్హులు:-** నరకం అనేది దుష్కర్మలకు పాల్పడేవారికి, చెడ్డవారికి నివాస స్థలం. ఎవరైతే స్వర్గానికి అర్హులుకారో వారి నివాసం నరకం.

“ఎవరైతే, బ్రాహ్మణుడికి యాచించినా దానం చెయ్యరో వారి కోసం నరకం ఉంది అని అంటారు.” (అధర్వణ వేదం: 12-4-36)

“ఎవరైతే ఒక వ్యక్తిని మోసగించి అతని భార్యను వలలో వేసుకుంటాడో అతణ్ణి యమదూతలు అంధకార నిలయమైన నరకంలో పడవేస్తారు. అందులో పడిన మనిషి ఎంతో బాధతో మూలుగుతాడు. మనిషి అక్కడ వెంటనే గ్రుడ్డివానిగా, పిచ్చివానిగా మారిపోతాడు. ఇంకా అతడు మొదలు నరికిన మ్రానులా పడిపోతాడు.” (దేవీ భాగవతం: 8:5-6)

“నాది, నేను అనే అహంకారంతో ఇతరుల ఎడల ఎవరయితే అసూయ అవలంబించి, మోసం దగాలతో తన కుటుంబాన్ని పోషించుకుంటూ ఉంటాడో, అతడు చనిపోయిన తరువాత తన దుష్కర్మలకు ఫలితంగా నరకంలో పడిపోతాడు.” (దేవీ భాగవతం: 8:8-9)

మరణానంతర జీవితం గురించి హిందూమత గ్రంథాల దృక్పథం పరలోక వాదమేనని ఈ వివరాలను బట్టి స్పష్టమవుతోంది. సత్యవాదులు సతతం పరలోకం వైపునకే పిలుపునిచ్చారన్న ఖుర్ఆన్ వాదనతో ఇది పూర్తిగా ఏకీభవిస్తోంది. ఖుర్ఆన్ ప్రకారం ఈ ప్రపంచం ఏదో ఓరోజు అంతమయిపోయేదే. పరలోకం మాత్రమే శాశ్వతంగా ఉంటుంది. పరలోకంలో మానవులు రెండు వర్గాలుగా విడిపోతారు.

ఆ రెండు వర్గాలలో ఒక వర్గం స్వర్గంలో ప్రవేశిస్తే రెండో వర్గం అగ్నికీలల్లో పడి పోతుంది. మనిషి ఏ వర్గంలో చేరదలిచాడో స్వయంగా ఆలోచించి నిర్ణయించుకోవలసిన సమయమిది.

( సమాప్తం )


**ముస్లిం మహిళ**




**కొడ్తే ఏడుస్తుంది! కొట్టకపోతే ఎగబడ్తుంది!**

*మరేం చేయాలి? ఈ సమస్యకు పరిష్కారం కావా లంటే ఈ పుస్తకం చదివి తీరాల్సిందే.*

*ఇందులో వివాహం, భార్యాభర్తల బాధ్యతలు, అత్తా కోడళ్ళ గొడవలు, పరదా, వస్త్రధారణ, విడాకులు, మనోవర్తి, ఆర్థికహక్కులు, లింగవివక్ష, సంతానశిక్షణ, ముస్లిం పర్సనల్ లా, ముస్లిం మహిళ గుణగణాలు, కాంతామణులే కింగ్‌మేకర్స్, స్త్రీల ఆంతరంగిక విషయాలు వగైరా శీర్షికలు ఉన్నాయి.*

*రచన: తాహిరా తస్నీర్, (పే:256, వెల:రూ120/-)*

**ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, సహారాకాంప్లెక్స్, పత్తర్‌గట్టి, హైదరాబాద్-2, © 9441515414**




## మానవాళికి వెలుగుబాట

**ఖు**రాన్ ఇస్లాం మత ప్రామాణిక గ్రంథం. దివ్యఖురాన్ ముహమ్మద్ ప్రవక్త ద్వారా వెలువడిన భగవంతుని వాణి అని ఇస్లాం మతస్తుల విశ్వాసం. ఖలీఫా అబూబకర్ కాలంలో ముహమ్మద్ ప్రవక్త ప్రవచనాలన్నీ గ్రంథస్తమయ్యాయి. ఖురాన్ మతగ్రంథమే కాదు, న్యాయశాస్త్రగ్రంథం కూడా. ఇందులో జీవనపద్ధతి, ఆచారవ్యవహారాలను క్రమబద్ధీకరించారు. జూదాన్ని, మద్యాన్ని నిషేధించారు. శిశు హత్యను నిరసించారు. బానిసలపట్ల మరింతదయతో ప్రవర్తించవలెనని చెప్పారు.

ఖురాన్ బహుభార్యాత్వాన్ని అనుమతించడమే కాకుండా సమర్థించడం వెనుక ఆనాటి ఆర్థిక, సామాజిక పరిణామాల విశ్లేషణ కనబడుతుంది. ఆనాటి అరబ్ తెగలలో స్త్రీలస్థాయిని పెంచడానికి ఇస్లాం ప్రయత్నించిన వైనం ఇందులో గుర్తించ వచ్చు. పాశ్చాత్యుల దృష్టితో ఖురాన్‌ను విశ్లేషించడంగాని, ఒక అంచనాకు రావడం గాని కష్టమే. ఖురాన్‌ను బాగా అర్థం చేసుకోవాలంటే శ్రద్ధగా, పూర్తిగా చదవాలి.



**ఖుర్ఆన్ భావామృతం**
భావానువాదం: **అబుల్ ఇర్ఫాన్**
ప్రతులకు
ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్
పత్తర్‌గట్టి, హైదరాబాద్-2
వెల: రూ. 300/-లు

ఖురాన్ అందరికీ అందుబాటులోలేని కాలంలో కొంతమంది స్వార్థపరులు ఖురాన్ బోధనలను వక్రీకరించిన సంఘటనలు చరిత్రలో ఎన్నో కనబడతాయి. ప్రపంచంలోని మారుమూల ప్రాంతాలకు కూడా బైబిల్ అనువాదాలు చొరబడి నంత సులభంగా, వేగంగా ఖురాన్ చేరకపోవడం వల్ల చాలానష్టమే జరిగింది. ప్రాంతీయ భాషలలో ఖురాన్ అనువాదాలు వెలువడకపోవడం వెనుక కొంతమంది స్వార్థపరుల ఆంక్షలు, అనవసర భయాలుకూడా ఒక కారణమనే చెప్పాలి. ఈ ప్రయత్నాల్లో భాగంగా వచ్చిన ప్రాంతీయ అనువాదాల్లో ముఖ్యంగా తెలుగులో గతంలో వచ్చిన అనువాదాలు కూడా సమగ్రంగా లేకపోవడం, గ్రాంథికంలో ఉండడంవల్ల ఎవరూ అంతగా పట్టించుకోలేదు.

ఇన్నాళ్ళకి తెలుగులో సులభ సుందరశైలిలో, అందరికీ అర్థమయ్యే విధంగా అనువదించడంలో అత్యంత ప్రతిభ కనబరచిన అబుల్‌ఇర్ఫాన్ అభినందనీయుడు. ఖురాన్ అనువాదంలో ఎదురయ్యే ఇబ్బందులను, క్లిష్టతలను వివరించిన “ముందు మాట”ల ద్వారా అనువాదకర్త నిజాయితీని, నిబద్ధతను గుర్తించగలం. ఈ పుస్తకాన్ని అరబిక్ లిపితో, దాని అనువాదంతో పాటు ఇచ్చిన పాదపీఠికలు విషయాన్ని సులభంగా వివరిస్తాయి. ఈ కృషి విజ్ఞానదాయకమైనది.

**-కె.పి. అశోక్ కుమార్ (‘వార్త’ దినపత్రిక-22.5.2005)**